# మిలింద ప్రశ్నలు



బోధచైతన్య

# మిలింద ప్రశ్నలు

## (Revised and enlarged)

*అనువాదం:*

**బోధచైతన్య**

*ప్రచురణ:*

**ధర్మదీపం ఫౌండేషన్**

హైదరాబాద్ స్టడీ సర్కిల్

1-2-365/2/సి, ఇందిరాపార్క్ క్రాస్ రోడ్,

దోమలగూడ, హైదరాబాద్-500 029

ఫోన్:040-27638527

**Milinda Prashnalu**

Translated by : Bodhachaitanya

**మిలింద ప్రశ్నలు**

అనువాదం : ***బోధచైతన్య***

© **ధర్మదీపం ఫౌండేషన్**

| | | |
|---|---|---|
| ముద్రణ | : | నవంబర్, 2011 |
| ప్రచురణ సంఖ్య | : | 12 |
| ప్రతులు | : | 1000 |
| వెల | : | ₹ 150.00 |

*ప్రతుల కొరకు:*

**ఆర్ట్స్ & లెటర్స్**

ఫోన్ : 040-27635654

*ముద్రణ:*

**కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్**

1-1-60/5, ఆర్టీసీ క్రాస్ రోడ్స్

ముషీరాబాద్, హైదరాబాద్-500 020

ఫోన్ : 040-27645536

నమో తస్స భగవతో అరహతో సమ్మాసంబుద్ధస్స

# అనువాదకుని మాట

మిలిందప్రశ్నలు సంక్షిప్తఅనువాదం తొలిముద్రణ 2001లో వెలువడింది. 2008లో అదే పుస్తకం ఉచిత పంపిణీ కోసంగా తైవాన్‌లో మళ్ళీ ముద్రణ పొందినది. తొలిముద్రణలోని లోటుపాట్లు తైవాన్ ముద్రణలోనూ అట్లనే ఉన్నాయి. కనుక తొలిముద్రణ ప్రతిలో అవసరమైన చోట్ల సవరించి మార్పులు కూర్పులు చేసి మెరుగైన కొత్తప్రతిని పాఠకులకు అందజేయాలనే ప్రయత్నఫలమే ఈ రెండవ ముద్రణ. మొదటి ముద్రణకన్నా ఇది వందపేజీలు ఎక్కువ. వివరణల రూపంగా ఇందులో పాదపీఠికలు విరివిగా జోడించడం కూడా జరిగింది. మొదటి ముద్రణలో పాఠకులకు అర్థం కాని విధంగా కఠినంగా ఉన్న శీర్షికల పేర్లను తీసివేసి తేలికపేర్లను పెట్టడం జరిగింది. ఇక తీసివేత విషయం. మొదటి ముద్రణలోని మూడు శీర్షికలను (శ్రేష్ఠధర్మప్రశ్న, ధర్మనగరవాసులు, ధుతాంగప్రశ్న) పూర్తిగానూ ఒక శీర్షికను (ధర్మనగరం) పాక్షికంగానూ తీసివేయడం జరిగింది. ఈ నాలుగు శీర్షికల్లో ఇబ్బంది ఏమనగా పారిభాషికపదాల వెల్లువ. ఆ పదాలనన్నిటిని వివరించాలంటే ప్రత్యేకంగా “బౌద్ధపారిభాషికపదకోశం” అనే పేరుతో విడిగా ఒక పుస్తకాన్ని కూర్చవలసియుంటుంది!

ఇది కూడా సంక్షిప్త అనువాదమే కానీ మొదటి మూడు అధ్యాయాలు, మరియూ చివరి అధ్యాయం దాదాపుగా సంపూర్ణంగానే ఇందులో లభిస్తుంది. విస్తారంగా ఉన్న “మేండకప్రశ్నలు” భాగంలోనే సంక్షిప్తీకరణం జరిగింది. జాతకకథలకు సంబంధించినవి కొన్ని, అద్భుతాలకు సంబంధించినవి కొన్ని, ఆనాటి భూగోళ ఖగోళ పరిజ్ఞానాలకు సంబంధించినవి కొన్ని, పునరుక్తములు అనిపించేటివి కొన్ని వదలివేసిన పట్టికలో చేరుతాయి.

సంస్కరింపబడిన విస్తరింపబడిన ఈ పుస్తకాన్ని తెలుగు పాఠకులకోసం ముద్రించి వెలువరించిన శ్రీ చెన్నూరి ఆంజనేయరెడ్డిగారికి ధన్యవాదములు.

# అనువాదకుని గురించి

ప్రఖ్యాత బౌద్ధ సాహితీవేత్త శ్రీ బోధచైతన్య (మునుపు ఈశ్వరవాక రామలింగం) తమిళనాడులోని పొన్నేరి సమీపగ్రామం వేళూరులో 1946లో ఒక వ్యవసాయకుటుంబంలో జన్మించారు. వీరు చెన్నై విశ్వవిద్యాలయంలో యమ్.ఏ. తెలుగు ఉత్తీర్ణులయ్యాక ఐదు సంవత్సరాలు చెన్నై రామకృష్ణ మఠంలో ఆశ్రమవాసిగా ఉంటూ వారి తెలుగు పత్రిక "రామకృష్ణప్రభ"కు సంపాదకులుగా వ్యవహరించారు. కొంతకాలం ప్రఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి గారు స్థాపించిన 'Rishi Valley' స్కూల్లో తెలుగు సాహిత్యాన్ని బోధిస్తూ అక్కడి గ్రంథాలయ నిర్వాహణా బాధ్యతలను కూడా నిర్వర్తించారు. ఆ తరువాత ఎనిమిది సంవత్సరాలు చిత్తూరు జిల్లాలోని వ్యాసాశ్రమంలోనూ, శుకబోధాశ్రమం లోనూ వేదాంతాచార్యులుగా పనిచేశారు. ప్రస్తుతము బౌద్ధ ధర్మానుయాయియై బౌద్ధ సాహిత్యాన్ని తెలుగులోకి విస్తృతంగా అనువదిస్తున్నారు. వీరి ఇతర రచనలు : *ధర్మపదం కథలు, జాతకమాల, మహాపరిత్తం, జయమంగళం, మిళిందపన్హ ఉపమలు, బోధిచర్యావతారం, వజ్రచ్ఛేదిక, శీలం, ధ్యానం* మొ॥నవి. వీరు ప్రస్తుతం "The Word of Buddha" అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదిస్తున్నారు.

# గ్రంథ పరిచయం

పాలిబౌద్ధసాహిత్యంలో మిలిందపఞ్హది ప్రత్యేకస్థానం. జనరంజకత (popularity), ప్రామాణికత (authoritative) రెండూ కలిగిన గ్రంథంగా ఇది కీర్తింపబడింది. ఆచార్య బుద్ధఘోషుడు (క్రీ.శ. 5వ శతాబ్ది) తాను రచించిన త్రిపిటక వ్యాఖ్యానాల్లోనూ, విసుద్ధిమగ్గ లోనూ తరుచుగా మిలిందపఞ్హా వాక్యాలను ప్రమాణంగా చూపించారు. బర్మాబౌద్ధులకు ఈ గ్రంథం అంటే అమిత గౌరవం. వాళ్ళు దీన్ని ఏకంగా సుత్తపిటకంలోని ఖుద్దకనికాయంలో ఒక భాగంగా కలిపేసుకొన్నారు!

ఈ గ్రంథరచనా కాలాన్ని పరిశోధకులు క్రీ.శ. మొదటి శతాబ్దంగా ఊహిస్తున్నారు. కాశ్మీరంలో లేదా పంజాబు ప్రాంతంలో రచింపబడియుండవచ్చని కూడా ఊహిస్తున్నారు.

ఆరు కాండములు (parts) కలిగిన ఈ గ్రంథం తొలుత చిన్నదిగా కేవలం ఇప్పటి మొదటి మూడు కాండల* పరిమితిలోనే ఉండినదని కూడా పరిశోధకుల ఊహ. చైనాభాషలో ఈ చిన్న మౌలికగ్రంథమే నాగసేనభిక్షుసూత్రం అనే పేరుతో అనువదింపబడింది. చైనాభాషలోకి అనువాదం పొందిన గ్రంథాలు సాధారణంగా సంస్కృత బౌద్ధగ్రంథాలే కనుక మిలిందపఞ్హా మూలగ్రంథం సంస్కృతం లేదా ప్రాకృతంగా ఉండవచ్చు అని కూడా ఒక ఊహ. ఏది ఏమైనప్పటికీ ఒకప్పుడు మిలిందపఞ్హా సంస్కృతంలోనూ ఉండినది అని చెప్పవచ్చు. ద్వితీయ బుద్ధుడుగా ఘనకీర్తి గడించిన ఆచార్య వసుబంధు (క్రీ.శ. 5 వ శతాబ్ది) తాను రచించిన అభిధర్మకోశం అనెడి అసమాన బౌద్ధసంస్కృత శాస్త్రగ్రంథంలో అష్టమకోశస్థానంలో ఒక చోట నాగసేనసంవాదాన్ని ఉటంకించారు. ప్రమాణంగా చూపబడిన ఆ భాగం** సంస్కృతంలోనే ఉంది. మొదట్లో చిన్నదిగానే ఉన్న మిలిందపఞ్హా గ్రంథం కాలక్రమంలో పెంపు పొందిందని పరిశోధకులంటారు.

ఇద్దరి మధ్య జరిగిన సంభాషణే ఈ గ్రంథం. మిలిందుడు అనే రాజు, నాగసేనుడనే భిక్షువు మధ్య జరిగిన సంవాదరూపం. ఇద్దరూ చారిత్రక పురుషులనడంలో

---

** 1. పూర్వయోగం, 2. లక్షణప్రశ్న, 3. విమతిచ్ఛేదనప్రశ్న*

*** ఈ భాగం అనువాదం చూడుడు అనుబంధం-1*

సంశయం ఎవరికీ లేదు. మౌర్యసామ్రాజ్య పతనం ప్రారంభం కాగానే (చక్రవర్తి అశోకుని మరణం క్రీ.పూ. 227 తరువాత) భారత ఉపఖండం వాయువ్య భాగాలు (north-west) గ్రీకురాజుల ఏలుబడిలోకి చేరిపోయాయి. ఆ రాజుల్లో ఒకడు మినందర్. ఈ మినందర్ రాజ్యం ఇప్పటి పంజాబు, ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతాలుగా చారిత్రికులు నిర్ణయించారు. మినందరే ఈ గ్రంథంలోని మిలిందుడు. నాగసేనుణ్ణి గురించి చారిత్రకంగా మనకేమీ తెలియదు. ఈ ఇద్దరి సంభాషణను కాలాంతరంలో గ్రంథరూపంగా కూర్చినది ఎవరో కూడ మనకు తెలియదు.

బౌద్ధగ్రంథాల్లో (తర్కగ్రంథాలు మినహాయించి) ఒక విశేషం ఏమిటంటే అన్నీ కూడా స్వయూథ్యులను (తమ వర్గంవాళ్ళను = one's own folk) ఉద్దేశించినట్టివే. ఇతరుల గొడవ ఏది పట్టించుకోకుండా తమలో తాము బుద్ధవచనాన్ని వివరించుకొనే రీతిగానే ఉంటాయి. పైకి ఏదో పెద్ద వాదగ్రంథంగా కనిపించినా మిలిందపఞ్హా కూడా స్వయూథ్యగ్రంథమే. ఇందులోని హేతువులు, ఉపమలు, కారణాలు చాలావరకు ఏవీ కూడా బాహ్యులను ఒప్పించగలిగే విధంగా లేవు. కేవలం స్వయూథ్యులు మాత్రమే అంగీకారసూచకంగా తల ఊపగలరు. కనుక ఇది వాదగ్రంథం కాదు. స్వయూథ్యులను ఉద్దేశించిన బోధనాగ్రంథంగా, ప్రేరణాత్మకగ్రంథంగా, ఉత్తేజాత్మకగ్రంథంగా భావించవచ్చు.

రిస్ డేవిడ్స్ అనే ప్రఖ్యాత బౌద్ధపండితుడు ఈ గ్రంథాన్ని యథాతథంగా ఇంగ్లీషులోకి అనువదించి Questions of king Milinda అనే పేరుతో 1890లో ప్రచురించారు. ఆ తరువాత I.B. Horner అనే గొప్ప బౌద్ధపండితురాలు మళ్ళీ ఈ గ్రంథాన్ని యథాతథంగా ఆంగ్లానువాదం చేసి 1969లో ప్రచురించారు. ఇవి రెండూ చాలా పెద్దవి కనుక ఇంగ్లీషులో సంక్షిప్తీకరణములు కూడా వెలువడినాయి. కానీ తెలుగులో ఇంతవరకు ఎవరూ దీన్ని అనువదించే ప్రయత్నం చేయలేదు. తెలుగు పాఠకులకు ఈ గ్రంథాన్ని పరిచయం చేసి రుచి కలిగించాలనే ఉద్దేశంతో ఒక సంక్షిప్తీకరణ ఆంగ్లగ్రంథాన్ని* నమూనాగా తీసుకొన్నాను కాని అనువాదం మాత్రం మూల పాలిగ్రంథంనుండి చేయడం జరిగింది.

మూలంలో ప్రతివాక్యంలోనూ సంబోధనా పదాలున్నాయి. (భంతే నాగసేనా!, మహారాజా!). అనువాదంలో ఈ సంబోధనా పదాలు బాగా తగ్గించుకొన్నాను. పాఠకుల సౌకర్యం కోసం మిలింద నాగసేనుల వాక్యాలను విడివిడిగా చూపించాను. అవసరం అనిపించిన చోటల్లా కుండలీకరణంలో ఆంగ్లభాషాపదాలు ఇచ్చాను. అనువాదం

---

* *Questions of king Milinda, Edited by N.K.G. Mendis, Published by Buddhist publication Society, Kandy, Srilanka*

యథాతథమే. ఎక్కడో ఒకటి రెండు చోట్ల ఓపిక నశించి మూలాన్ని కుదించి యుండవచ్చు. తెలుగుభాషలోని మర్యాద ప్రయోగాలను (మీరు, గారు వగైరా) అనువాదంలో ఉపయోగించలేదు. భంతే (venerable Sir), మహారాజా (great king!) అనే సంబోధనా పదాల్లోనే మర్యాద కనిపిస్తున్నది కనుక ఇరువురి మధ్య సంభాషణను ఏకవచనంలోనే (నీవు) నడిపించాను. ఈ పరిచయవాక్యాలకు ముగింపుగా మూలగ్రంథం ప్రారంభంలో ఉన్న "గ్రంథకథావస్తువు" శీర్షికనుండి కొంతభాగాన్ని జోడిస్తున్నాను.

*గంగానది సాగరాన్ని చేరే విధంగా సాగలనగరంలో రాజా మిలిందుడు నాగసేనుణ్ణి కలుసుకొంటాడు. వాక్చాతుర్యం మెండుగా కలిగినవాడు నాగసేనుడు. అవిద్యాంధకారాన్ని పటాపంచలు చేసే జ్ఞానదివిటీని ఎత్తిపట్టుకొన్నవాడు నాగసేనుడు. అటువంటి నాగసేనుని వద్దకు మిలిందుడు వచ్చి జటిలమైన విషయముల మీద నిపుణములైన ప్రశ్నలను చాలా వేసినాడు. ఆ ప్రశ్నలకు నాగసేనుడు చెప్పిన సమాధానాలు అర్థగాంభీర్యమును కలిగియుంటాయి. హృదయాన్ని పరవశింపజేస్తాయి. శ్రవణానందంగా ఉంటాయి. గగుర్పాటును కలిగించేవిధంగా అద్భుతంగా ఉంటాయి. సుత్తపిటకం, వినయపిటకం, అభిధమ్మ పిటకం లోతులను స్పృశించేవిధంగా ఉంటాయి. ఉపమలతోనూ, చెప్పే విధానంలోనూ వైవిధ్యం కలిగియుంటాయి. అధ్యాత్మికజ్ఞానాన్ని గడించే ఉద్దేశంతో మనస్సును ఉల్లాసపరచుకొని ఈ ప్రశ్నలు- సమాధానాలు వినండి. సంశయస్థానాలనన్నిటిని ఈ ప్రశ్న - జవాబులు మటుమాయం చేస్తాయి.*

# విషయసూచిక


**పూర్వయోగం** **1–17**

**లక్షణప్రశ్నలు** **18–54**

1. పుద్గలమీమాంస 18
2. ఎన్నేండ్లు నీకు? 21
3. చర్చాపద్ధతులు 22
4. అనంతకాయుడు 23
5. ప్రవ్రజ్య ఎందుకు? 24
6. పునర్భవం 25
7. యోనిశ మనసికారం 25
8. మనసికారలక్షణం 26
9. శీలం 26
10. శ్రద్ధ –1 28
11. శ్రద్ధ – 2 29
12. వీరియం 30
13. స్మృతి 31
14. సమాధి 33
15. ప్రజ్ఞ 34
16. ఏకకార్యం 34
17. అతడు అతడేనా? 35
18. జన్మరాహిత్యం 36
19. జ్ఞానం – ప్రజ్ఞ 37
20. అర్హతులకు దుఃఖం కలుగదా? 38
21. ఏకత్వం నానాత్వం 40
22. నామరూపములు 43
23. కాలం 44
24. ఆరంభం ఎక్కడ? 44
25. మార్పునుండి మార్పు 46
26. భోక్త 47
27. జ్ఞానేంద్రియాలు 49
28. స్పర్శ 51
29. వేదన 51
30. సంజ్ఞ 52
31. చేతన 52
32. విజ్ఞానం 52
33. వితర్కం 53
34. విచారం 53
35. విభజన సాధ్యమా? 53
36. నాగసేనప్రశ్న 54

**విమతిచ్ఛేదనప్రశ్నలు** **55–80**

1. పంచాయతనములు 55
2. అసమానతలు 55
3. ప్రయత్నం 56
4. నరకంలో 57
5. పృథివికి ఆధారం 57
6. నిరోధమే నిర్వాణం 58
7. నిర్వాణలాభం 58
8. నిర్వాణసుఖజ్ఞానం 59
9. లేదనవచ్చా? 59
10. అనుత్తరుడు 60
11. అనుత్తరుడని ఎలా తెలియడం? 60
12. ధర్మదర్శనం 61
13. జ్ఞాత, కర్త, భోక్త 61
14. సంక్రమణం ఉండదు 61
15. అవశ్యమనుభోక్తవ్యం 62
16. కర్మఫలం ఉందా? 62
17. మరణం తరువాత ఏమిటి? 63
18. బుద్ధుడున్నాడా? 63
19. దేహం ప్రియమా? 64
20. సర్వజ్ఞభావం 65
21. మహాపురుషలక్షణములు 65

22. బ్రహ్మచారి 66
23. ఉపసంపద 67
24. కన్నీళ్ళు 67
25. రాగవిరాగములు 68
26. సంసారం 68
27. జ్ఞాపకాలు 69
28. స్మృతులు 69
29. జ్ఞాపకాలు ఎలా వస్తాయి? 69
30. బుద్ధగుణములు 71
31. దుఃఖం ఎలా తొలగిస్తావు? 71
32. బ్రహ్మలోకం ఎంతదూరం? 73
33. ఎంతదూరమైనా క్షణంలోనే 73
34. బోధ్యంగములు 74
35. పుణ్యపాపములు 74
36. తెలియకచేస్తే? 75
37. ఉత్తరకురుగమనం 75
38. దీర్ఘాష్టి 76
39. ఆశ్వాస ప్రశ్వాసలు 76
40. సముద్రం 77
41. సముద్రరసం 77
42. విజ్ఞాననానాత్వం 77
43. ఎవరికీ సాధ్యం కానిది 78
44. ముగింపు 79

**మేండకప్రశ్నలు 81-167**

1. పూజలను స్వీకరిస్తాడా? 82
2. చిత్తంలో హెచ్చుతగ్గులు 85
3. 500 ఏండ్ల తరువాత 89
4. దేవదత్తుని ద్వేషం 92
5. ప్రతిసంలయనం 95
6. ఇద్ధిబలం 96
7. రద్దు చేసుకోవచ్చు 97
8. మౌనం 99
9. మరణభయం 100
10. పరిత్తములు 102
11. నాయకత్వం 104
12. సంఘభేదం 105
13. పరుషభాషణం 107
14. చివరి భిక్ష 110
15. పూజలు ఎవరు చేయాలి? 111
16. పులకరింతలు 112
17. శబ్దకాలుష్యం 113
18. ఆత్మహత్య 114
19. మార్గం 116
20. బ్రాహ్మణుడు మరియూ రాజు 117
21. నిరుత్సాహం 120
22. ఒక బుద్ధుడు 121
23. గృహస్థుడు, పరివ్రాజకుడు 122
24. వెనక్కి పోయేవాళ్ళు 124
25. అర్థాంత వేదనలు 128
26. ఇల్లు వదలక తప్పదు 130
27. తప్పులు రెండు రకాలు 131
28. లోకంలో లేనివి ఏవి? 133
29. నిర్వాణం ఉన్నదా? 134
30. విశ్వంతరప్రశ్న 136
31. శ్రాద్ధకర్మలు 147
32. స్వప్నములు 150
33. ఏకాంతసుఖం 154
34. నిర్వాణం నిర్వాణం 156
35. నిర్వాణసాక్షాత్కారం 159
36. నిర్వాణం ఎక్కడుంది? 161
37. ధర్మనగరం 162

**ఉపమలు 168-238**

1. గాడిద 168
2. కోడిపుంజు 168
3. ఉడత 171
4. ఆడచిరుత 172

5. మగచిరుత 172
6. తాబేలు 174
7. వెదురు 176
8. విల్లు 177
9. కాకి 177
10. కోతి 178
11. సొరతీగె 179
12. పద్మం 180
13. విత్తనం 181
14. సాలవృక్షం 182
15. నావ 183
16. లంగరు 184
17. కూపము 185
18. కర్ణధారుడు 186
19. కర్మకారుడు 187
20. సముద్రం 188
21. పృథివి 189
22. జలం 191
23. తేజస్సు 192
24. వాయువు 193
25. పర్వతం 194
26. ఆకాశం 197
27. చంద్రుడు 198
28. సూర్యుడు 199
29. ఇంద్రుడు 201
30. చక్రవర్తి 202
31. తెల్లచీమ 203
32. పిల్లి 203
33. ఎలుక 205
34. తేలు 205
35. ముంగిస 205
36. నక్క 206
37. జింక 207
38. ఎద్దు 208
39. వరాహం 209
40. ఏనుగు 211
41. సింహం 212
42. చక్రవాకం 214
43. పేణాహిక 215
44. పావురం 216
45. గుడ్లగూబ 217
46. శతపత్రపక్షి 218
47. గబ్బిలం 218
48. జలగ 219
49. సర్పం 220
50. కొండచిలువ 221
51. సాలెపురుగు 221
52. పసిబిడ్డ 222
53. కూర్మం 223
54. అడవి 223
55. వృక్షం 224
56. మేఘం 225
57. మణిరత్నం 226
58. వేటగాడు 227
59. బెస్తవాడు 228
60. వడ్రంగి 229
61. కుండ 230
62. గొడుగు 231
63. పొలాలు 232
64. ఔషధం 233
65. భోజనం 233
66. విలుకాడు 234
67 నిగమనం 236

**అనుబంధం -1** **239-241**

**అనుబంధం -2** **242-252**

## పూర్వయోగం (వెనుకటి కథ)*

పూర్వయోగం అంటే పూర్వజన్మల్లో నాగసేన మిలిందుల కర్మవిషయం. భగవానుడైన కాశ్యపబుద్ధుని శాసనకాలంలో గంగానదీతీరంలోని ఒక ఆవాసంలో మహాభిక్షుసంఘం ఉండినది. వ్రతులు, శీలసంపన్నులైన ఆ భిక్షువులు ప్రాతఃకాలంలోనే లేచి చీపురులను చేతబూని బుద్ధగణాలను స్మరించుకొంటూ అంకణాన్ని ఊడ్చి చెత్తాచెదారాన్ని ఒకచోట పోగుచేసేవారు. ఒకనాడు ఒక భిక్షువు ఒక శ్రామణేరునితో "శ్రామణేరా, ఈ కుప్పను తొలగించు" అన్నాడు. శ్రామణేరుడు ఆ ఆజ్ఞను విన్నప్పటికీ వినబడనివానివలె నటిస్తూ వెళ్లిపోతున్నాడు. ఆ భిక్షువు రెండవసారి, మూడవసారి కూడా "శ్రామణేరా ఈ కుప్పను తొలగించు" అన్నాడు. అప్పటికి కూడా శ్రామణేరుడు వినబడనివానివలెనే వెళ్లిపోతుండగా ఆ భిక్షువుకు కోపం వచ్చింది. "ఎంత అవిధేయుడు ఈ శ్రామణేరుడు!" అనుకొని చీపురుకొయ్యతో అతణ్ణి ఒక దెబ్బ వేశాడు. ఆ దెబ్బకు అతను ఏడుస్తూ ఇంకా దెబ్బలు పడ్తాయేమో అనే భయంతో వెంటనే ఆ కుప్పను తొలగించే పనిలోకి దిగి ఆ పనిని చేస్తూ ఇలా ప్రణిధిని (సంకల్పం) పలికాడు: "కుప్పను తొలగించడం అనే ఈ పుణ్యకర్మ వల్ల ఇక నాకు కలుగబోయే ప్రతిజన్మలోనూ నేను మధ్యాహ్నసూర్యునివలె మహాశక్తునిగానూ మహాతేజస్విగానూ అగుదునుగాక". ఆ తరువాత అతడు స్నానానికి గంగానది ఒడ్డుకు వెళ్లాడు. గంగానది అలల వేగాన్ని చూస్తూ "విహార అంకణంలో కుప్పను తొలగించిన పుణ్యకర్మ వల్ల ఇక నాకు కలుగబోయే ప్రతిజన్మలోనూ నేను ఈ గంగానది అలల వేగంలాంటి వేగవంతమైన మనస్సు కలిగినవాడనై సమయస్ఫూర్తితో చక్కగా తిరుగులేనివిధంగా మాట్లాడగల ప్రతిభానవంతుడనగుదునుగాక" అని ద్వితీయ ప్రణిధిని పలికాడు.

చీపురుకట్టను ఉంచవలసిన స్థానంలో ఉంచి ఆ భిక్షువు కూడా స్నానానికి గంగానది తీరానికి వెళ్ళాడు. అక్కడ శ్రామణేరుడు పలుకుచున్న ద్వితీయ ప్రణిధిని విని "ఇతడు నాచేత పురమాయింపబడి ఆ కుప్పను తొలగించి ఆ గడించిన పుణ్యాన్ని పరిణామనం (transfer) చేస్తూ ప్రణిధిని పలుకుచున్నాడు. ఇతనికి దీటుగా ప్రణిధిని నేను పలుకలేనా?" అనుకొని "నిర్వాణపర్యంతం ఇక నాకు కలుగబోయే ప్రతిజన్మలోనూ

---

* *జాగ్రత్తునుండి స్వప్నానికి స్వప్నంనుండి జాగ్రత్తుకు యథేచ్ఛగా సంచరించే అద్భుత వృత్తాంతం ఇది.*

నేను ఈ గంగానది తరంగాల వేగంలాంటి వేగవంతమైన బుద్ధికలవాడనై ఇతడు అడగబోయే ప్రశ్నలకన్నిటికీ తగిన సమాధానాలు ఇవ్వగలవాడనగుదునుగాక" అని ప్రణిధి చెప్పాడు.

ఆ తరువాత వారిద్దరూ ఒక బుద్ధాంతరం వరకు (ఒక బుద్ధుని ఆవిర్భావానికి మరో బుద్ధుని ఆవిర్భావానికి మధ్య ఉన్న సుదీర్ఘకాలం) దేవలోకాల్లో మనుష్యలోకాల్లో జన్మలెత్తుతూ వచ్చారు. ఈ భద్రకల్పంలో* ఆవిర్భవించిన మన గౌతమబుద్ధుని భవిష్యదృష్టికి వాళ్ళిద్దరూ గోచరమైనారు. మొగ్గలిపుత్రుని గురించి భవిష్యవాణి పలికిన విధంగానే భగవానుడు వీళ్ళిద్దరి గురించీ భవిష్యవాణి పలికినాడు. "నా పరినిర్వాణం తరువాత ఐదువందల ఏండ్లకు వీళ్ళిద్దరూ జంబూద్వీపంలో ఉద్భవిస్తారు. నేను సుసూక్ష్మంగా బోధించిన ధర్మాన్ని, వినయాన్ని వీళ్ళిద్దరూ ప్రశ్నోత్తరరూపంలో విశదీకరిస్తారు. సందిగ్ధతను తొలగిస్తారు."

బుద్ధుని భవిష్యవాణి (prediction) ప్రకారమే మహాపరినిర్వాణం తరువాత ఐదువందల ఏండ్లకు శ్రామణేరుడు జంబూద్వీపంలోని సాగలనగరానికి రాజయ్యాడు. అతడు పండితుడు, వక్త, మేధావి మరియూ శక్తుడు. భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు సంబంధించి చేయవలసిన మంత్ర యోగ విధానాలను సావధానంగా చేసేవాడు. అనేక శాస్త్రాలు తెలిసినవాడు. అవి ఏవనగా శ్రుతి (scriptures), స్మృతి (secular lore), సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం, గణితం, చికిత్స (medicine), వేదాలు, పురాణాలు, ఇతిహాసం, జ్యోతిషం (astronomy) మాయ (magic), మంత్రతంత్రం (spells), యుద్ధం, ఛందస్సు- మొత్తం పందొమ్మిది విద్యలు నేర్చినవాడు. వితండవాదంలో అద్వితీయుడు, అజేయుడు. నానా శాఖలకు చెందిన తీర్థికాచార్యులందరినీ మించినవాడు. బలంలోనూ, వేగంలోనూ, శూరతలోనూ, సంపదలోనూ, భోగంలోనూ మిలిందుణ్ణి మించిన రాజు జంబూద్వీపంలో కనిపించడు.

ఒకనాడు మిలిందుడు నగరం వెలుపల ఉన్న తన చతురంగ బలవ్యూహాన్ని సమీక్షించదలచి నగరం వెలుపలికి వచ్చాడు. సేనాంగదర్శనం అయ్యాక తలెత్తి ఆకాశంలో సూర్యుణ్ణి చూశాడు. ఇంకా చాలా ప్రొద్దున్నది. అతడు వాదప్రియుడు. లోకాయత వితండవాదులతో వాదం చేయడానికి ఉత్సాహం చూపేవాడు. తన

---

** లెక్కలేనన్ని కల్పాలు సమ్యాసంబుద్ధుడు ఒక్కడు కూడా అవతరించని అంధకార కల్పాలుగా దొర్లిపోయాయి. ఇప్పుడు మనం ఉన్న ఈ కల్పం భద్రకల్పం. ఒకరు కాదు, ఐదుగురు సమ్యాసంబుద్ధులను కలిగిన కల్పం కనుక భద్రకల్పం. 1. క్రకుచ్ఛందుడు, 2. కోణాగమనుడు, 3. కాశ్యపుడు, 4. శాక్యముని, 5. మైత్రేయుడు.*

మంత్రులతో "అమాత్యులారా, ఇంకా చాలా ప్రొద్దున్నది. నగరంలోకి ఇప్పుడే ఎందుకు? చేయవలసిన అవసరమైన పనులేమున్నాయి అక్కడ? కనుక ఎవరైనా పండితుడుగానీ, బ్రాహ్మణుడుగానీ, గణాచార్యుడుగానీ, భిక్షుసంఘనాయకుడుగానీ నాతో మాట్లాడగలిగేవారున్నారా? చెప్పండి. వెళ్ళి మాట్లాడుదాము" అన్నాడు. "ఉన్నారు మహారాజా, ఆరుగురు శాస్త్రారులు* (teachers). పూరణకాశ్యపుడు, గోశాలీపుత్రుడు మస్కరి, వైరటీపుత్రుడు సంజయుడు, అజితకేశకంబళుడు, కకుదకాత్యాయనుడు, నిర్గ్రంథ జ్ఞాతిపుత్రుడు. వారందరూ అనేక శిష్యులను అనుచరులను కలిగినట్టివారు, పేరు ప్రఖ్యాతులున్నట్టి తీర్థంకరులు (founders of schools). మహారాజా, వారివద్దకు వెళ్ళి ప్రశ్నించండి. సంశయాలను తొలగించుకోండి" అన్నారు అమాత్యులు.

మిలిందుడు వాళ్ళను కలిసి ప్రశ్నలు వేశాడు. మిలిందుని ప్రశ్నలకు వాళ్ళెవరూ సమాధానం చెప్పలేక తలలు వాల్చుకొని మౌనంగా ఉండిపోయారు. ఆ తరువాత మిలిందుడు మనస్సులో "ఈ జంబూద్వీపం తుచ్ఛం (empty). జంబూద్వీపం అని పేరు మాత్రం బహు ఆడంబరంగా ఉన్నది. నాతో మాట్లాడగలిగేవారు ఒక్కరూ లేరు" అనుకొన్నాడు.

ఆ కాలంలో సాగలనగరంలో పన్నెండేండ్లుగా ఒక శ్రమణుడుగానీ బ్రాహ్మణుడుగానీ గృహస్థపండితుడుగానీ నివసించలేదు. ఎక్కడైనా ఒకడున్నాడని తెలిస్తే వెంటనే మిలిందుడు అతనివద్దకు వెళ్లి ప్రశ్నలు వేసేవాడు. ఆ ప్రశ్నలకు తట్టుకోలేక వాళ్లు ఆ చోటు వదలి ఎక్కడికో వెళ్ళిపోయేవారు.

## *అశ్వగుప్తుని ప్రశ్న*

జంబూద్వీపాన్ని కించపరుస్తూ మిలిందుడు పలికిన నిందావాక్యాలను హిమాలయ నివాసి అయిన అశ్వగుప్తుడనే అర్హతుడు తన దివ్యశ్రవణశక్తితో విన్నాడు. వెంటనే శతకోటి అర్హతులను యుగంధరపర్వతం మీద సమావేశపరచి "ఆయుష్మంతులారా, మిలిందునితో సంభాషణ చేయగలిగి అతని ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగే భిక్షువు మీలో ఎవరైనా ఉన్నారా?" అని ప్రశ్నించాడు. శతకోటి అర్హతులలో ఒక్కడూ బదులు పలుకలేదు. అశ్వగుప్తుడు అదే ప్రశ్నను రెండవసారి, మూడవసారి కూడా అడిగాడు. శతకోటి భిక్షుసంఘం బదులు పలక్కుండా మౌనంగా ఉండిపోయింది.

దివ్యచక్షువు కలిగిన అశ్వగుప్తుడు ఆ భిక్షుసంఘాన్నుద్దేశించి "ఆయుష్మంతు లారా, త్రయత్రింశత్ దేవలోకంలో వైజయంతికి తూర్పుగా కేతుమతి అనే విమానం

---

** ఈ ఆరుగురు శాస్త్రారులు బుద్ధభగవానుని సమకాలికులు. వీరి శిష్యపరంపర మిలిందుని కాలంలోనూ కొనసాగియుండవచ్చు.*

(mansion) ఉన్నది. ఆ విమానంలో మహాసేనుడనే దేవపుత్రుడుంటు న్నాడు. మిలిందునితో మాట్లాడగల సమర్థుడతడొకడే" అన్నాడు.

## మహాసేనుణ్ణి ప్రార్థించడం

వెంటనే శతకోటి అర్హతులు యుగంధరపర్వతంనుండి అంతర్హితులై త్రయత్రింశత్ దేవలోకంలో ప్రత్యక్షమయ్యారు. వారి రాకను గమనించిన దేవరాజు శక్రుడు అశ్వగుప్తుణ్ణి సమీపించి అభివాదనం చేసి "మహాభిక్షుసంఘం ఇక్కడికి ఏతెంచింది. నేను భిక్షుసంఘానికి సేవలందించడానికి సన్నద్ధుడుగా ఉన్నాను. నేను మీకు చేయదగినది ఏమైనా ఉంటే ఆజ్ఞ ఇవ్వండి" అన్నాడు వినయంగా.

"దేవరాజా, జంబూద్వీపంలో సాగలనగరంలో మిలిందుడనే రాజున్నాడు. అతడొక వితండవాది. వాదంలో అసమానుడు, అజేయుడు. తీర్థకరుల్లో అందరికన్నా అధికుడు. అతడు భిక్షువుల వద్దకు వచ్చి దృష్టివాద (speculative) సంబంధమైన ప్రశ్నలు వేసి వేధిస్తుంటాడు" అన్నాడు అశ్వగుప్తుడు.

"భదంతా, ఆ మిలిందుడు ఈ దేవలోకవాసిగా ఉంటూ కర్మ విపాకాన్ననుసరించి మళ్లీ మనుష్యలోకంలో ఉద్భవించాడు. అతనితో మాట్లాడగల నేర్పు ఇక్కడ కేతుమతి విమానంలో ఉంటున్న మహాసేనుడొక్కడికే ఉన్నది. అతణ్ణి మనుష్యలోకంలో జన్మించమని ప్రార్థిస్తాము" అన్నాడు శక్రుడు

భిక్షుసంఘాన్ని ముందుంచుకొని శక్రుడు కేతుమతి విమానం ప్రవేశించి మహాసేనుణ్ణి ఆలింగనం చేసి "మార్షా,* ఈ భిక్షుసంఘం నిన్ను అర్థిస్తున్నది– మనుష్యలోకంలో జన్మించమని" అన్నాడు శక్రుడు

"దేవరాజా, నాకు మనుష్యలోకంతో పనిలేదు. అది ఒక కర్మబహుళలోకం. ఒక అంధకారలోకం. ఆ మనుష్యలోక ఆయాసం నాకెందుకు? ఈ దేవ లోకాల్లోనే ఉంటూ ఉపరి ఉపరి లోకాలు చేరుకొంటూ చివరికి నిర్వాణం చెందుతాను" అన్నాడు దృఢంగా మహాసేనుడు.

అశ్వగుప్తుడు మహాసేనుని ఎదుటికి వచ్చి "మార్షా, ఈ దేవలోక సహిత సకలలోకాలు గాలించినా మిలిందుని నోరు మూయించి బుద్ధశాసనాన్ని కాపాడగల సమర్థుడు నీవు తప్ప ఇంకెవ్వరూ కనిపించడం లేదు. మనుష్యలోకానికి వచ్చి దశబలుని (బుద్ధుని) శాసనాన్ని కాపాడవలసినదిగా నిన్ను ఈ భిక్షుసంఘం యాచిస్తున్నది" అన్నాడు.

---

* *దేవలోకవాసులు ఒకర్నొకరు సంబోధించేటప్పుడు పలికే పదం. ప్రియాన్ని గౌరవాన్ని వ్యక్తం చేసే సంబోధనపదం. పాళీభాషలో "మారిస" అవుతుంది.*

బుద్ధశాసనాన్ని కాపాడే పని అనగానే మహాసేనుడికి మహదానందం కలిగింది. అశ్వగుప్తునితో "భదంతా, నేను నిశ్చయంగా మనుష్యలోకంలో జన్మిస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు.

## *రోహణుని దండకర్మ* (atonement)

త్రయత్రింశత్ దేవలోకం వెళ్ళి పని సాధించుకొన్న భిక్షుసంఘం అక్కడ అంతర్హితులై హిమవంతంలోని రక్షితతలంలో ప్రత్యక్షమయ్యారు. ఆ తరువాత అశ్వగుప్తుడు భిక్షువులతో "ఆయుష్మంతులారా, మన ఈ సమావేశానికి రాని భిక్షువు ఎవరైనా మన సంఘంలో ఉన్నారా?" అని ప్రశ్నించాడు. సమాధానంగా ఒక భిక్షువు "రోహణుడు సమావేశానికి రాలేదు. అతడు ఏడుదినాల క్రితం నిరోధసమాపత్తిలో కూర్చుండి పోయాడు. అతనివద్దకు మీరు దూతను పంపించండి" అన్నాడు. ఆ సమయంలోనే రోహణుడు నిరోధసమాపత్తి* నుండి ఉత్థితుడై "భిక్షుసంఘం నన్ను ఎదురు చూస్తున్నది" అనుకొని తక్షణమే అక్కడ అంతర్హితుడై రక్షితతలంలో భిక్షుసంఘం ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

అశ్వగుప్తుడు అతణ్ణి మందలిస్తూ "ఏమిటిది రోహణా? బుద్ధశాసనం సంకటస్థితిలో పడియున్న విషయం నీకు తెలియదా? సంఘకార్యానికి ఎందుకు దూరంగా ఉన్నావు?" అన్నాడు. "భదంతా, అన్యమనస్కం వల్ల ఇలా అయ్యింది" అన్నాడు రోహణుడు. "దండకర్మ (ప్రాయశ్చితం=atonement) చేసుకో" అన్నాడు అశ్వగుప్తుడు. "దండకర్మగా నేను చేయవలసినది ఏమిటో ఆజ్ఞాపించండి. శిరసావహిస్తాను" అన్నాడు రోహణుడు. "ఆయుష్మాన్ రోహణా, ఈ హిమాలయ పర్వత సమీపంలో కజంగల అనే బ్రాహ్మణపల్లె ఉన్నది. ఆ పల్లెలో సోణుత్తరుడనే బ్రాహ్మణుడు నివసిస్తున్నాడు. అతనికి త్వరలో నాగసేనుడనే పుత్రుడు జన్మించబోతున్నాడు. ఇక ఏడు సంవత్సరాలు ఆపై పదిమాసాలు నీవు ఆ ఇంటికి భిక్షుకు వెళ్తూ ఉండు. గడువు ముగిశాక నీవు ఆ నాగసేనుడికి ప్రవ్రజ్య ఇప్పించగలిగినప్పుడే నీ దండకర్మ పరిసమాప్తమవుతుంది" అన్నాడు అశ్వగుప్తుడు.

## మనుష్యలోకంలో మహాసేనుని ప్రాదుర్భావం

మహాసేనుడు, సోణుత్తరుని భార్యగర్భంలో ప్రవేశించగానే మూడు అద్భుతాలు పొడసూపాయి. 1.ఆయుధాలు ప్రజ్వలించాయి. 2. అగ్రసస్యములు పంటకు వచ్చాయి. 3. మహామేఘుడు వర్షించాడు.

---

* *శరీరాన్ని జాగ్రదవస్థలోనే ఉంచి మనస్సును మాత్రం సుషుప్తిలాంటి స్థితిలోకి నెట్టివేయడం.*

రోహణుడు ప్రతి దినమూ ఆ ఇంటికి భిక్షకు వెళ్ళడం మొదలుపెట్టాడు. ఒక్కనాడు కూడా అతనికి అక్కడ గరిటెడు అన్నంగానీ కూరగానీ గంజిగానీ లభించలేదు. స్వాగతవచనాలుగానీ నమస్కారవచనాలుగానీ అతను పొందలేదు. పైగా ఛీత్కారవచనాలనే విన్నాడు. భిక్ష ఇవ్వకపోతే పోనీ ఒక్కనాడైనా "అతిగచ్ఛథ భంతే"* (pass on to the next house= భదంతా, ప్రక్క ఇంటికి వెళ్ళండి) అనే మర్యాదమాటకు కూడా నోచుకోలేదు. ఇలా ఏడు సంవత్సరాల పదిమాసాలు గడిచాయి. ఒకనాడు ఆశ్చర్యంగా ఆ ఇంటి ఇల్లాలినుండి "అతిగచ్ఛథ భంతే" అనే మర్యాదవాక్యం రోహణుడు విన్నాడు. ఆ దినమే ఏదో పని మీద బైటకు వెళ్ళి ఇంటికి తిరిగివస్తున్న సోణుత్తరునికి దారిలో రోహణుడు ఎదురుపడ్డాడు. "ఏమోయీ పరివ్రాజకా, భిక్షకై మా ఇంటికీ వెళ్ళావా?" అని అడిగాడు. "అవును బ్రాహ్మణా, వెళ్ళాను" అన్నాడు రోహణుడు. "ఏమైనా లభించిందా?" అడిగాడు సోణుత్తరుడు. "లభించింది" అన్నాడు రోహణుడు. సోణుత్తరుడు ఆ మాట విని అసంతుష్టచిత్తంతో ఇంటికి వెళ్ళి భార్యను "ఆ పరివ్రాజకుడికి ఏమి ఇచ్చావు?" అని కోపంగా ప్రశ్నించాడు. "ఏమీ ఇవ్వలేదు" అని బదులు పలికింది ఆమె. మరునాడు ఇంటి గడపవద్దే సోణుత్తరుడు కూర్చొని "ఆ పరివ్రాజకుడు రానీ. అబద్ధం చెప్పడం అనే దోషాన్ని అతనికి ఆరోపిస్తాను" అనుకొన్నాడు. కొంతసేపటికి రోహణుడు అక్కడికి రానే వచ్చాడు. "నిన్న మా ఇంటిలో నీకేమీ లభించకపోయినా లభించిందని అబద్ధం చెప్పావు, నీవొక మృషావాదివి" అన్నాడు సోణుత్తరుడు. "బ్రాహ్మణా, ఈ ఏడు సంవత్సరాల పదినెలలు మీ ఇంట 'అతిగచ్ఛథ' అనే మర్యాదవాక్యం ఒకనాడు కూడా నేను వినింది లేదు. నిన్న ఆశ్చర్యంగా ఆ వాక్యం మీ గృహిణి నోట విన్నాను. ఆ వచనలాభాన్ని దృష్టిలో పెట్టుకొని 'లభించింది' అన్నాను" అన్నాడు రోహణుడు. ఆ బ్రాహ్మణుడు విచారంలో పడ్డాడు. "అతిగచ్ఛథ అనే కేవల ఆచారవాక్యం నా ఇంట విన్నమాత్రానికే ఇతడు 'మీ ఇంట భిక్ష లభించింది' అని జనమధ్యంలో నన్ను ప్రశంసించాడు. ఇక ఖాదనీయ భోజనీయ పదార్థాలు పొందితే ఇంకెంత ప్రశంసిస్తాడో!" అనుకొని ప్రసన్నచిత్తుడై తమకోసం చేసి పెట్టుకొన్న భోజన పదార్థాలను భిక్షగా భిక్షువుకు ఇచ్చి "ఇక ప్రతిదినమూ మా ఇంట నీకు భిక్ష లభిస్తుంది" అన్నాడు. ఆ దినంనుండి ప్రతిదినమూ రోహణుడు భిక్షను తీసుకొని తిరిగి వెళ్తున్నప్పుడు కొంచం కొంచం బుద్ధవచనాలను వారికి వినిపిస్తూ వచ్చాడు.

---

* *భిక్షువులుగానీ భిక్షువుగానీ వాకిలి వద్దకు వచ్చి భిక్షకై వేచియున్నపుడు ఏదో కారణం వల్ల ఆ పూట ఆ వేళకు భిక్ష ఇవ్వలేని నిస్సహాయస్థితిలో ఉన్న గృహస్థులు చాలా వినయంగా విచారంగా పలికే వాక్యం.*

## నాగసేనుని స్వాధ్యాయకాలం

సోణుత్తరుని కుమారుడు నాగసేనుడు ఎదిగి ఏడేండ్ల పిల్లవాడయ్యాడు. ఒకనాడు అతని తండ్రి "నాగసేనా, బ్రాహ్మణకులంలో పుట్టినవాడు నేర్చుకొనవలసినవి నీవు నేర్చుకోవాలి" అన్నాడు. "ఏమిటవి నాన్నగారూ" అడిగాడు నాగసేనుడు. "మూడు వేదాలు ఇంకా శిల్పం (rituals) వగైరా" అన్నాడు తండ్రి.

ఆ తరువాత సోణుత్తరుడు ఒక బ్రాహ్మణ ఆచార్యునికి వేయి నాణాలిచ్చి "నా కుమారుణ్ణి విద్యావంతుణ్ణి చేయండి" అని ప్రార్థించాడు.

ఆచార్యుని వద్ద విద్యార్థిగా చేరిన నాగసేనుడికి ఒక్కసారి ఆవృత్తి (recite) చేయగానే మూడు వేదాలు కంఠాపాఠం అయిపోయాయి. శబ్దజ్ఞానం, ఛందోజ్ఞానం, వ్యాకరణం, లోకాయతం, మహాపురుషలక్షణశాస్త్రం ఇవన్నీ కూడా ఒక్కసారి వినగానే నాగసేనుడికి వీటిల్లో పాండిత్యం వచ్చేసింది.

చదువు పూర్తయ్యాక తండ్రిని "నాన్నగారూ, బ్రాహ్మణకులంలో పుట్టినవాళ్ళు నేర్వవలసినది ఇంతకుమించి ఇంకేమైనా ఉన్నదా?" అని ప్రశ్నించాడు. "ఇంకేమీ లేదు" అని తండ్రి బదులు పలికాడు.

ఆ తరువాత ఏకాంతాన్ని కోరుకొని నాగసేనుడు మేడ పైభాగానికి వెళ్ళి ఒకచోట కూర్చొని ధ్యానమగ్నచిత్తుడయ్యాడు. తను నేర్చిన విద్యను సమీక్షించి చూసుకొన్నాడు. ఆది, మధ్య, అవసానాల్లో అల్పమాత్రమైన ప్రయోజనం కూడా ఆ విద్యల్లో అతనికి కనిపించలేదు. చాలా అసంతుష్టచిత్తంతో ఇలా వాపోయాడు: "నేను చదివిన చదువు తుచ్ఛం (empty), పలాపం (chaff=పొట్టు), అసారం, నిస్సారం!"

## రోహణునితో నాగసేనుని సమాగమం

ఆ సమయంలో వర్తనీయవిహారంలో ఒక కుటీరంలో ఉంటున్న రోహణునికి నాగసేనుడు మనస్సులో అనుకొంటున్న మాటలు తెలిశాయి. వెంటనే లేచి చీవరం ధరించి పాత్రను చేతబూని అక్కడ అంతర్హితుడై కజంగల గ్రామంలో ప్రత్యక్షమయ్యాడు. ఇంటిగుమ్మం వద్ద నిలబడియున్న నాగసేనునికి దూరంనుండి వస్తున్న రోహణుడు కనిపించాడు. అతణ్ణి చూడగానే నాగసేనుడు ఆత్తమనస్కుడయ్యాడు (pleased), ఉదగ్రుడయ్యాడు (uplifted), ప్రముదితు డయ్యాడు(joyous), ప్రీతిసౌమనస్య జాతుడయ్యాడు (rapturous and happy). "ఈ పరివ్రాజకుడినుండైనా నేను సారం ఉన్నదాన్ని నేర్చుకోగలనా?" అనే ఆకాంక్షతో రోహణుణ్ణి సమీపించి "మార్షా, ముండనం చేసుకొని కాషాయవస్త్రాలు ధరించియున్న మీరు ఎవరు?" అని ప్రశ్నించాడు. "బాలుడా, నేను ప్రవ్రజితుడను (ఇల్లూ వాకిలి వదలివేసినవాడను)" అన్నాడు రోహణుడు.

"ప్రవ్రజితుడు అనే పేరు మీకు ఎలా కలిగింది?" ప్రశ్నించాడు నాగసేనుడు. "పాపరూపములైన మలములను నానుండి తొలగించుకొనేందుకు ఇల్లూ వాకిలి వదలివేశాను, కనుక నాకు ప్రవ్రజితుడనే పేరు కలిగింది" అన్నాడు రోహణుడు. "లోకరీతికి భిన్నంగా మీరెందుకు ముండనం చేసుకొన్నారు?" ప్రశ్నించాడు నాగసేనుడు. కేశశ్మశ్రువులను (తలవెంట్రుకలకు కేశములని పేరు. ముఖం మీది వెంట్రుకలకు శ్మశ్రువులని పేరు) ఆశ్రయించుకొని పదహారు పలిబోధలు (impediments = ఆటంకములు) ఉంటాయని తెలిసి వాటిని తీసివేశాను" అన్నాడు రోహణుడు. "ఆ పదహారు పలిబోధలు ఏమిటి?" అని నాగసేనుడు ప్రశ్నించగా రోహణుడు ఇలా పట్టిక ఇచ్చాడు: 1. అలంకారపలిబోధ(of ornamenting), 2. మండన పలిబోధ (of decking), 3. తైలమర్దనపలిబోధ(of smearing with oil), 4.ధోవనపలిబోధ (shampooing), 5. మాలాపలిబోధ (of placing garlands round it), 6. గంధపలిబోధ (of using scents), 7. వాసనపలిబోధ (of using unguents), 8. హరీతకపలిబోధ (of using yellow myrobalan), 9.ఆమలకపలిబోధ (of using emblic myrobalan), 10. రంగపలిబోధ (of using dyes), 11. బంధనపలిబోధ (of using ribbons), 12. కోచ్ఛపలిబోధ (of using combs), 13. కప్పకపలిబోధ(of depending on barbers), 14. విజటన పలిబోధ (of disentangling), 15. ఊకాపలిబోధ (of vermin), 16. కేశములు రాలిపోతుంటే నెరసిపోతుంటే శోకించడం అనే పలిబోధ".

"మారిషా, మీ వస్త్రాలెందుకు లోకుల వస్త్రాలకు భిన్నంగా ఉన్నాయి?" అడిగాడు నాగసేనుడు. "గృహస్థుల కమనీయ వస్త్రాలు కామనిశ్రితములు (connected with sense pleasures). కమనీయ వస్త్రధారణవల్ల కలిగే భయాలేవీ కాషాయవస్త్రధారికి ఉండవు. కనుక మా వస్త్రాలు లోకుల వస్త్రాలకు భిన్నంగా ఉంటాయి" అన్నాడు రోహణుడు.

"మీకు శిల్పం (crafts) తెలుసా?"అడిగాడు నాగసేనుడు. "తెలుసు. అంతేకాదు లోకంలో ఉత్తమమైన మంత్రం కూడా నాకు తెలుసు" అన్నాడు రోహణుడు. "నాకు దానిని నేర్పగలరా?" అడిగాడు నాగసేనుడు. "నేర్పగలను. కానీ ఇది సమయం కాదు. నేనిప్పుడు భిక్షాటనలో ఉన్నాను" అన్నాడు రోహణుడు.

నాగసేనుడు రోహణుని పాత్రను చేతికి తీసుకొని ఇంటిలోకి వెళ్ళి ఉత్తమరకమైన ఖాదనీయ భోజనీయ పదార్థాలతో ఆ పాత్రను నింపి రోహణునికి ఇచ్చాడు. రోహణుడు భోజనంచేశాక "భదంతా, నాకు ఆ మంత్రాన్ని నేర్పండి" అని నాగసేనుడు ప్రార్థించాడు.

"నాగసేనా, నీవు మొదట పలిబోధలనుండి విముక్తుడవు కావాలి. నీ తలిదండ్రుల అనుమతి తీసుకొని నావెంట వచ్చి ప్రవ్రజితవేషం ధరిస్తేనే నీకు ఆ మంత్రం చెప్పగలను" అన్నాడు రోహణుడు.

నాగసేనుడు తలిదండ్రుల వద్దకు వెళ్లి "జననీజనకులారా, ఈ పరివ్రాజకుని వద్ద ఉత్తమ మంత్రం ఉన్నది. కానీ దాన్ని ప్రవ్రజ్య లేనివారికి చెప్పరాదట. ఆ మంత్రాన్ని నేను తెలుసుకోదలచాను. అనుమతి ఇవ్వండి" అన్నాడు. "నీవు ప్రవ్రజ్య తీసుకొని ఆ మంత్రాన్ని నేర్చుకొని మళ్ళీ ఇంటికి వచ్చేయాలి" అని తలిదండ్రులు అనుమతి ఇచ్చారు.

## నాగసేనుని ప్రవ్రజ్య

నాగసేనుణ్ణి వెంటబెట్టుకొని రోహణుడు శతకోటి భిక్షువులున్న రక్షితతలానికి చేరి ఆ భిక్షుసంఘం ఎదుట నాగసేనుడికి ప్రవ్రజ్య* ఇచ్చాడు.

---

** "నాగసేనుడని పిలువబడు నేను భగవంతుడైన అర్హతుడైన సమ్యాసంబుద్ధుడైన శాక్యమునిని శాక్యాధిరాజును ప్రవ్రజితాగ్రేసరుణ్ణి అనుసరించి ప్రవ్రజించుచున్నాను. గృహస్థలింగములను త్యజిస్తున్నాను. ప్రవ్రజ్యాలింగములను గైకొంటున్నాను. నన్ను అనుగ్రహించుడు" అని భిక్షువుల ఎదుట ముమ్మారు పలికి వారు తరచి తరచి అడిగే ప్రశ్నలకు సంతృప్తికరంగా జవాబులిచ్చి వారినుండి దీక్షగైకొనడం ప్రవ్రజ్య అవుతుంది. ఉపసంపదదీక్ష (భిక్షుదీక్ష) కూడా ఇంచుమించుగా ఇలానే ఉంటుంది. ఈ పద్ధతులన్నీ తరువాత తరువాత ఏర్పడినవి. భగవానుడు ఎవర్నైనా ఉద్దేశించి "ఏహి భిక్షో చర బ్రహ్మచర్యం" రావోయీ భిక్షూ.... అని పలుకగానే ఆ వ్యక్తి భిక్షువు అయిపోయేవాడు. ఇలా భిక్షువులైన వారిలో ప్రప్రథములు పంచవర్గీయ భిక్షువులు (ధర్మచక్రప్రవర్తనశ్రోతలు). అంతఃపురం వదలి బయటకు రాలేని ధర్మదిన్న భగవానుని వద్దకు అనుమతి కోసం దూతికను పంపించి అనుమతి పొందగానే భిక్షుణి అయిపోయింది. యశుని స్నేహితులు అరవైమంది ''బుద్ధం శరణం గచ్ఛామి'' అని ముమ్మారు పలికి భిక్షువులయిపోయారు. భగవానుడు అడిగిన ప్రశ్నలకు సరిగ్గా సమాధానాలు చెప్పి సోదాయి, భిక్షువు అయిపోయాడు. మహదేవభూపతి తానే స్వయంగా ముని అయిపోయాడు. చూడుడు 82వ పుట.*

*ప్రవ్రజ్య అంటే గృహవాసంనుండి బయటపడడం. ఏ వయస్సులో బయట పడాలి అంటే ఏడేండ్లు వయస్సు దాటాక ఎప్పుడైనా సరే. ఏడెనిమిది ఏండ్ల వయస్సు వరకు పిల్లలు తలిదండ్రుల వద్దనే అవశ్యం పెరగాలని శిశుమానసిక శాస్త్రవేత్తలు చెబుతారు. ప్రవ్రజ్య తీసుకొన్నవానికి బౌద్ధంలో వెంటనే తలవెంట్రుకలు తీసివేసి కాషాయవస్త్రాలు కట్టబెడతారు. కానీ భిక్షువు అనబడడు. శ్రామణేరుడు అనబడుతాడు. కొన్నేండ్ల శిక్షణ తరువాత యోగ్యుడని తోచితే ఉపసంపద (higher ordination) ఇచ్చి భిక్షువును చేస్తారు. ఎంతో శిక్షణ పొందినవాడైనప్పటికీ ఇరవై సంవత్సరాల వయస్సు రానిదే ఉపసంపద ఇవ్వరు. శ్రామణేరుడు భిక్షువు కావడాన్ని పదోన్నతిగా (promotion) భావించరాదు. 250 ప్రాతిమోక్షనియమాలను పాటించే బాధ్యతను నెత్తికెత్తుకొన్నవాడుగా భావించవచ్చు.*

ప్రవ్రజ్య తీసుకొన్నాక నాగసేనుడు రోహణునితో "భదంతా, మీ వేషాన్ని నేను స్వీకరించానుకదా! ఇక నాకు ఆ ఉత్తమ మంత్రాన్ని బోధించండి" అన్నాడు. రోహణుడు ఆలోచించాడు. "ఇతణ్ణి ప్రథమంగా ఎందులో ప్రవేశపెట్టాలి? వినయంలోనా? సూత్రంలోనా? అభిధర్మంలోనా? ఇతడు పండితుడు. సునాయాసంగానే అభిధర్మాన్ని గ్రహించగల సమర్థుడు" అనుకొని ధమ్మసంగణి, విభంగ, ధాతుకథా, పుగ్గలపఞ్ఞత్తి, కథావత్థు, యమక, పట్ఠాన అని ఏడు గ్రంథాల రూపంగా ఉన్న అభిధమ్మపిటకాన్ని మొత్తం నాగసేనుడికి వినిపించాడు. ఒక్కసారి విన్నంతలోనే మొత్తం అభిధర్మం* నాగసేనుడికి కంఠాపాఠం అయిపోయింది.

ఆ తరువాత నాగసేనుడు మొత్తం అభిధర్మపిటకాన్ని రక్షితతలంలో ఉన్న శతకోటి అర్హతుల ముందు పఠించాడు. ఆ అద్భుత పఠనానికి పృథివి గర్జించింది. దేవతలు సాధు సాధు అన్నారు. (well spoken అని మెచ్చుకొన్నారు). బ్రహ్మసహంపతి కరతాళధ్వనులు చేశాడు. దివినుండి దేవతలు దివ్యచందన చూర్ణాలు, మందార పుష్పాలు నాగసేనుడి మీద వెదజల్లినారు.

## నాగసేనుని దండకర్మ (atonement)

రక్షితతలంలో సమావేశమైన శతకోటి అర్హతులు నాగసేనుణ్ణి ప్రశంసించి అతనికి ఉపసంపద ఇచ్చి భిక్షువును చేశారు. అప్పటికి నాగసేనుని వయస్సు సరిగ్గా ఇరవై సంవత్సరాలు. ఒక దినం తన ఉపాధ్యాయుడు రోహణునితో భిక్షాటనకు బయలుదేరి ఒక గ్రామాన్ని ప్రవేశిస్తూ నాగసేనుడు మనస్సులో ఇలా అనుకున్నాడు: "నా ఉపాధ్యాయుడైన ఈ రోహణుడు ఒక తుచ్ఛుడు (empty headed fellow), బాలుడు (idiot). బుద్ధభగవానుని వచనం అంతా వదలివేసి కేవలం అభిధర్మమే నాకు చెప్పాడు."

---

** అభిధర్మం అంటే అసలైన అర్థం అమలమైన ప్రజ్ఞ. ప్రజ్ఞాప్రాప్తిని కలిగించే గ్రంథసమూహానికి కూడా అభిధర్మం అని పేరు. ఇక్కడ ఈ రెండవ అర్థమే చెప్పుకోవాలి. నిర్వాణాభిముఖంగా సాగే విచారం అభిధర్మం అవుతుంది. అభిధర్మానికి మూలపురుషుడు భగవానుడే. ఆయన బోధనల ఆధారంతో అభిధర్మాన్ని మహాశ్రావకులు విస్తరించి విపులం చేసి చెప్పినారు. పైన తెలిపిన గ్రంథాలు తామ్రపర్ణీయుల సంప్రదాయానివి. సర్వాస్తివాదుల అభిధర్మంలోనూ ఏడు గ్రంథాలున్నాయి. 1. కాత్యాయనీపుత్రుని **జ్ఞానప్రస్థానం,** 2. వసుమిత్రుని **ప్రకరణపాదం,** 3. దేవశర్మని **విజ్ఞానకాయం,** 4. శారద్వతీపుత్రుని **ధర్మస్కంధం,** 5. మౌద్గల్యాయనుని **ప్రజ్ఞప్తిశాస్త్రం,** 6. పూర్ణుడు కూర్చిన **ధాతుకాయం,** 7. మహాకౌష్ఠిలుడు కూర్చిన **సంగీతిపర్యాయం.** తరువాతి కాలంలో ఈ గ్రంథాల్లోని విషయాలను ఆచార్య వసుబంధు సంగ్రహించి అభిధర్మకోశం అనబడే అసమాన గ్రంథరాజాన్ని రచించినారు. అభిధర్మం అనేది సూత్రార్థాన్ని వివరించేదిగా వ్యాఖ్యానించేదిగా నిగ్గుదేల్చేదిగా ఉంటుంది.*

రోహణుడు పరచిత్తజ్ఞానం కలిగినవాడు. నాగసేనుడు స్వగతంలో అనుకొన్నది రోహణునికి తెలిసిపోయింది. "నాగసేనా, అనుచితమైన ఆలోచనకు పాల్పడ్డావు" అని మందలించాడు.

నాగసేనుడు అదిరిపోయాడు. "ఆశ్చర్యం, పరమాశ్చర్యం! నా మనస్సులో కదిలే ఆలోచనను కూడా నా ఉపాధ్యాయుడు తెలుసుకోగలిగాడు. నిశ్చయంగా ఈయన జ్ఞాని. క్షమాభిక్ష కోరుతాను" అనుకొని "భదంతా, నన్ను క్షమించు. మళ్ళీ ఇలాంటి ఆలోచనలు చేయను" అని ప్రాథేయపడినాడు.

"క్షమించుము అని నీవు పలికినంతమాత్రాన నేను నిన్ను క్షమించి వేయను. సాగలనగరం అని ఒకటున్నది. దానికి రాజు మిలిందుడు. అతడు దృష్టివాదాలకు (speculative views) సంబంధించిన ప్రశ్నలు వేస్తూ భిక్షు సంఘానికి పెద్ద తలనొప్పిగా దాపురించాడు. నీవు అతణ్ణి వాదంలో లొంగదీసుకొని బుద్ధశాసనంలో ప్రవేశపెట్టగలిగితేనే నిన్ను నేను క్షమిస్తాను" అన్నాడు రోహణుడు. "సరే అలాగే, సాగలానికి వెళ్ళి ఆ మిలిందుణ్ణి నోరుమూయించి దారికి తెస్తాను. ఈ మూడు మాసాలు (వర్షావాసం) ఎక్కడుండమంటారు నన్ను?" అని ప్రశ్నించాడు నాగసేనుడు.

"వర్తనీయవిహారంలో అశ్వగుప్తులవారుంటున్నారు. ఆయన వద్దకు వెళ్ళి పంచప్రతిష్ఠిత నమస్కారం* చేసి 'నా ఉపాధ్యాయుడు మీ సేవకై నన్ను ఇక్కడికి పంపించాడు' అని చెప్పుము. 'నీ ఉపాధ్యాయుడు ఎవరు?' అని ఆయన అడిగితే 'స్థవిర రోహణుడు' అని బదులు పలుకుము. 'నా పేరేమిటి?' అని ఆయన నిన్ను ప్రశ్నిస్తే 'మీ నామధేయం నా ఉపాధ్యాయుడికి తెలుసు' అని బదులు పలుకుము" అని రోహణుడు నాగసేనుణ్ణి ఆదేశించాడు.

నాగసేనుడు అశ్వగుప్తుని వద్దకు వెళ్ళి నమస్కరించాక జరిగిన సంభాషణ: "నీ పేరేమిటి?" "భదంతా, నా పేరు నాగసేనుడు." "నీ ఉపాధ్యాయుని పేరేమి?" "భదంతా, నా ఉపాధ్యాయుని పేరు స్థవిర రోహణుడు." "నాపేరేమిటి?" "భదంతా, మీ పేరు నా ఉపాధ్యాయులవారికి తెలుసు." "మంచిది నాగసేనా, నీ చీవరం, పాత్రను లోపల ఉంచుము."

మరుసటిదినం నాగసేనుడు ప్రాతఃకాలమున లేచి అశ్వగుప్తుని పరివేణమును (గదిని) శుభ్రం చేసి పల్లుపుల్ల, నీళ్లచెంబును అశ్వగుప్తుని కోసం సిద్ధం చేశాడు. కానీ అశ్వగుప్తుడు మళ్ళీ తన పరివేణమును తానే శుభ్రం చేసుకొని నాగసేనుడు ఉంచిన

* *చూడుడు 97 వ పుట.*

పల్లుపుల్లను మరియూ నీళ్ళచెంబులోని నీళ్ళను పారవేసి వేరే పుల్లను, నీళ్ళను తానే తెచ్చుకొన్నాడు. నాగసేనుడితో ఒక్కమాట కూడా పలుకలేదు. వరుసగా ఏడు దినాలు ఇదే తంతు నడిపాడు. కానీ నాగసేనుడి ఓరిమి నశించలేదు. ఎనిమిదవ దినం అశ్వగుప్తుడు అతణ్ణి పలకరించి వర్షావాసాన్ని అక్కడ గడపడానికి అనుమతి ఇచ్చాడు.

## నాగసేనుని ధర్మదేశనం

ముప్పైఏండ్లుగా అశ్వగుప్తునికి సేవలందిస్తూ వచ్చిన ఒక మహాఉపాసిక వర్షావాసం ముగిసిన దినం అశ్వగుప్తుని వద్దకు వచ్చి భిక్షకు ఆహ్వానించింది.

మరునాడు అశ్వగుప్తుడు చీవరం ధరించి భిక్షాపాత్రను తీసుకొని నాగసేనుణ్ణి వెంటబెట్టుకొని ఆ మహాఉపాసిక ఇంటికి వెళ్ళాడు. ఆమె వారిరువురికి ఉత్తమరకమైన ఖాదనీయ భోజనీయ పదార్థాలను వడ్డించింది. భోజనం అయ్యాక అశ్వగుప్తుడు "నాగసేనా, నేను వెళ్తున్నాను. నీవు మహాఉపాసికకు అనుమోదనం (thanks giving) చెప్పిరా" అని బైటకు నడిచాడు.

ఆ తరువాత మహాఉపాసిక "నాయనా నాగసేనా, నేను మహల్లికను (వృద్ధురాలను). గంభీరమైన ధర్మాలను నాకు చెప్పడం ద్వారా అనుమోదనాన్ని ప్రకటించుము" అనింది. నాగసేనుడు లోకోత్తరమైనట్టి (super-mundane), నిర్వాణసంబంధమైనట్టి గంభీరమైనట్టి శూన్యతా ధర్మాలను బోధించడం ద్వారా అనుమోదన ప్రసంగం చేశాడు. ఆ ప్రసంగాన్ని విన్నంతలోనే ఆ మహాఉపాసికకు విరజం (dustless), విమలం (stainless) అయిన ధర్మచక్షువు* ఉత్పన్న మయ్యింది. సర్వం అనిత్యం అనే జ్ఞానం కలిగింది. నాగసేనుడు ప్రసంగం ముగించి తన ప్రసంగం గురించి ప్రత్యవేక్షణ (review) చేసుకోగానే అతను కూడా విపశ్యన (insight) కలిగినవాడై స్రోతాపత్తిఫలాన్ని** పొందాడు.

---

** మాంసచక్షువు, దివ్యచక్షువు, ధర్మచక్షువు, ఆర్యచక్షువు, బుద్ధచక్షవు అని ఐదు చక్షువులు.*

*** స్రోతస్సు (ప్రవాహం) అంటే అష్టాంగమార్గం. మార్గంలో ప్రవేశించినవాడు స్రోతాపన్నుడు. ఇతనికి ఇక ఎన్నటికీ తిరోగమనం అనేది ఉండదు. మందంగానో వేగంగానో పురోగమనం ఉంటుంది. అవస్తుకములు (అవాస్తవాలను ఆలంబనంగా చేసుకొని తలెత్తే క్లేశములు), సవస్తుకములు (వాస్తవాలను ఆలంబనంగా చేసుకొని తలెత్తే క్లేశములు) అని క్లేశములు రెండు విధాలు. మార్గంలో ప్రవేశించగానే అవస్తుకక్లేశాలు ఎగిరిపోతాయి. సత్కాయదృష్టి, శీలవ్రతపరామర్శ, విచికిత్స అనేవి అవస్తుకక్లేశములు. ఇవి వదలిపోయిన తొలి అధ్యాత్మికస్థాయియే స్రోతాపత్తి.*

బైట ఒక మండపంలో కూర్చొనియున్న అశ్వగుప్తుని దివ్యదృష్టికి వారిరువురు ధర్మచక్షువును పొందడం గోచరించింది. "సాధు సాధు (well done, well done) నాగసేనా! ఒకే బాణంతో రెండు మహాకాయాలను (సత్కాయ దృష్టులను*) కూల్చివేశావు!"అని ప్రశంసించాడు. అనేక సహస్రదేవతలు కూడా నాగసేనుణ్ణి ఉద్దేశించి సాధుకారం చేశారు.

## నాగసేనుని పాటలీపుత్ర ప్రయాణం

ఆ తరువాత నాగసేనుడు అశ్వగుప్తుడున్న చోటుకు వచ్చి నమస్కరించి ఒక ప్రక్కగా కూర్చొన్నాడు. "నాగసేనా, నీవు పాటలీపుత్రానికి పొమ్ము. అక్కడ అశోకారామంలో ధర్మరక్షితుడున్నాడు. అతని వద్ద ఉంటూ బుద్ధవచనం పూర్తిగా తెలుసుకో" అని ఆదేశించాడు. నాగసేనుడు అశ్వగుప్తునికి ప్రదక్షిణం చేసి చీవరం, పాత్ర తీసుకొని పాటలీపుత్రానికి ప్రయాణమయ్యాడు.

## శ్రేష్ఠికి అభిధర్మదేశనం

ఆ సమయంలోనే పాటలీపుత్రానికి చెందిన ఒక శ్రేష్ఠి ఐదువందల శకటాలతో ప్రయాణిస్తున్నాడు. దారిలో కనిపించిన నాగసేనుడికి అభివాదనం చేసి "తమరు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగాడు. "పాటలికి" అన్నాడు నాగసేనుడు. మేమూ పాటలికే వెళ్తున్నాము. మాతో కలిసి ప్రయాణిస్తే మీకు సుఖంగా ఉంటుంది" అన్నాడు శ్రేష్ఠి. నాగసేనుడు సమ్మతించాడు.

ప్రయాణంలో శ్రేష్ఠి, నాగసేనుని ప్రవర్తన పట్ల ప్రీతి చెంది "బుద్ధవచనం తెలిసినవారేనా మీరు?" అని ప్రశ్నించాడు. "అభిధర్మం తెలిసినవాణ్ణి" అన్నాడు నాగసేనుడు. "ఆహా! ఎంత భాగ్యం! నేను కూడా ఆభిధర్మికుడనే (అభిధర్మ విద్యార్థిని). ఇప్పుడు మీనుండి అభిధర్మం వినాలనుంది. చెబుతారా?" అని ప్రాథేయపడినాడు శ్రేష్ఠి. నాగసేనుడు అభిధర్మం చెప్పాడు. శ్రేష్ఠికి విన్నంతలోనే విరజం, విమలం అయిన ధర్మచక్షువు ఉత్పన్నమయింది. సర్వం అనిత్యం అనే జ్ఞానం కలిగింది.

పాటలీపుత్రం సమీపించాక రెండు మార్గాల కూడలి వద్ద శ్రేష్ఠి ఆగి ఒక మార్గాన్ని నాగసేనుడికి చూపుతూ "మీరు చేరవలసిన అశోకారామానికి దారి ఇది"

---

** ఇరవై శిఖరాల మహాపర్వతంగా సత్కాయదృష్టిని వర్ణిస్తారు. మార్గంలో ప్రవేశించగానే (స్రోతాపన్నుడు కాగానే) ఈ మహాకాయం కుప్పకూలుతుంది. చూడుడు అనుబంధం-2 లోని శ్రామణ్యఫలాలు.*

అని పలికి 16 మూరల పొడవు, 8 మూరల వెడల్పు ఉన్న ఒక రత్నకంబళిని నాగసేనుడికి బహూకరించి ప్రదక్షిణం చేసి నమస్కరించి సెలవు తీసుకొన్నాడు.

## నాగసేనునికి అర్హత్వపదం

నాగసేనుడు అశోకారామంలో ఉన్న ధర్మరక్షితుణ్ణి దర్శించి అభివాదనం చేసి తన రాక యొక్క ఉద్దేశాన్ని చెప్పాడు. ధర్మరక్షితుడు అతనికి ఆశ్రయం ఇచ్చి త్రిపిటకములను మూడు నెలల్లో బోధించాడు.

ఒకనాడు ధర్మరక్షితుడు నాగసేనుడితో "పశులకాపరి పశువులను మేపే పని చేస్తాడు. కానీ గోరసాన్ని (పాలు) అనుభవించేది మరొకడు. అలాగే నీవున్నూ బుద్ధవచనం మొత్తం ధారణ చేసి కాపాడుకొంటున్నావు కానీ ఇంకా నీవు శ్రామణ్యఫలం* (fruit of religious life) పొందలేదు" అని ప్రేరణ ఇచ్చాడు. ఆ రాత్రియే నాగసేనుడు అర్హత్వాన్ని పొందాడు. నాగసేనుడు సత్యంలో ప్రతిష్ఠితుడు కాగానే దేవతలందరూ సాధుకారం చేశారు (applauded). పృథివి ఆనందంతో కంపించింది. బ్రహ్మలోక దేవతలు కరతాళధ్వనులు చేశారు. దివినుండి దివ్యచందనచూర్ణములు మందారపుష్పములు నాగసేనుని మీద వెదజల్లబడినాయి.

## నాగసేనుని వద్దకు దూత వచ్చుట

రక్షితతలంలోని శతకోటి అర్హతులు దూత ద్వారా నాగసేనుడికి ఆహ్వానం పంపారు. "నాగసేనా, నిన్ను చూడాలని మేమందరమూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాము" అని. ఆ దూత వచనం వినగానే నాగసేనుడు అశోకారామంలో అంతర్హితుడై రక్షితతలంలో మహాభిక్షుసంఘం ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

"నాగసేనా, సాగలనగరం రాజు మిలిందుడు చిక్కుప్రశ్నలు వేసి భిక్షుసంఘాన్ని చీకాకు పరుస్తున్నాడు. నీవు అక్కడికి వెళ్ళి అతణ్ణి దారికి తీసుకురావాలి" అన్నారు అర్హతులు. "ఒక్క మిలిందుడేమిటి? జంబూద్వీపంలోని రాజులందరూ ఒక్కటై వచ్చి ప్రశ్నలు వేసినా సరే వాళ్ళందరికీ సమాధానాలు చెప్పగలను. ఇక మీరందరూ సాగలనగరానికి ప్రయాణం కావచ్చు" అన్నాడు నాగసేనుడు. ఆ తరువాత భిక్షువులు తమ కాషాయ వస్త్రకాంతులతో సాగలనగర వీధులను జిగేలుమనిపిస్తూ నిశ్శంకగా నగరప్రవేశం చేశారు.

---

** ఆర్యసత్యాల సాక్షాత్కారంవల్ల కలిగే అధ్యాత్మ అనుభూతులు. ఇక్కడ అర్హత్వం అని అర్థం.*

## ఆయుష్మాన్ ఆయుపాలునితో మిలిందుని సమాగమం

ఆ సమయంలో ఆయుష్మాన్ ఆయుపాలుడు సంఖ్యేయపరివేణంలో (విద్యాలయం) నివసిస్తున్నాడు. ఒకనాడు మిలిందుడు అమాత్యులతో "ఈ వెన్నెలరాత్రి బహురమణీయంగా ఉంది. శ్రమణుడుగానీ బ్రాహ్మణుడుగానీ నాతో సంభాషించగలవాడు, నా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలవాడు ఉంటే చెప్పండి. పోయి మాట్లాడుదాము" అన్నాడు. "ఉన్నాడు మహారాజా, సంఖ్యేయపరివేణంలో ఆయుపాలుడనే స్థవిరుడు (senior monk). అతడు బహుశ్రుతుడు (very learned), త్రిపిటకాచార్యుడు" అన్నారు అమాత్యులు. "మంచిది. మనం వస్తున్నామని ఆ భదంతునికి వార్త పంపండి" అన్నాడు మిలిందుడు.

ఐదువందలమంది యోనకులు వెంటరాగా మిలిందుడు రథారూఢుడై సంఖ్యేయపరివేణానికి వెళ్ళి ఆయుపాలుణ్ణి కలిసి కుశల ప్రశ్నలు వేసి ఒక ఆసనంలో కూర్చొన్నాడు. ఆ తరువాత జరిగిన సంభాషణ.

**మి:** మీ ప్రవ్రజ్య ఎందుకు? మీ పరమార్థం (ultimate goal) ఏమిటి?

**ఆ:** ధర్మచర్యం కొరకు సమచర్యం కొరకు.

**మి:** గృహస్థులెవరైనా ధర్మచారిగా, సమచారిగా ఉన్నారా?

**ఆ:** ఉన్నారు మహారాజా! భగవానుడు మృగదావంలో (సారనాథ్‌లో) ధర్మచక్ర ప్రవర్తనం చేసినపుడు 18 కోట్ల బ్రహ్మదేవతలకు ఇంకా అసంఖ్యాక ఇతర దేవతలకు ధర్మఅభిసమయం (ఆర్యసత్యాల సాక్షాత్కారం) కలిగినది. వారెవ్వరూ ప్రవ్రజితులు కారు. గృహస్థులే. భగవానుడు మహాసమయసూత్రాన్ని, మహామంగళ సూత్రాన్ని, సమచిత్తపర్యాయసూత్రాన్ని, రాహులఅవవాదసూత్రాన్ని, పరాభవ సూత్రాన్ని ఉపదేశించిన సమయాల్లో కూడా అసంఖ్యాక దేవతాగణాలకు మహాభిసమయం కలిగింది. వాళ్ళెవరూ ప్రవ్రజితులు కారు. గృహస్థులే.

**మి:** అలా అయితే మీ ప్రవ్రజ్య నిరర్థకం. పూర్వం చేసుకొన్న పాపకర్మ నిష్యందం (outflow) వల్లనే శ్రమణులు, శాక్యపుత్రీయులు ప్రవ్రజిస్తున్నారు, ధుతాంగములను (ascetic practices) పాటిస్తున్నారనవలసివస్తుంది. ఒక పూట మాత్రమే భోజనం తీసుకొనడం అనే ఏకాశనిక నియమం పూర్వజన్మ పాపఫలమే. ఇందులో శీలము లేదు, తపస్సు లేదు, బ్రహ్మచర్యం లేదు. పూర్వజన్మలో చోరుడుగా ఉండి, ఇతరుల భోగ్యాన్ని హరించిన పాపఫలమే వేళవేళకు భోజనం చేయలేని దుఃస్థితి. అభ్యవకాశిక (sleeping in the open) నియమబాధ అనుభవిస్తున్నవాళ్ళు పూర్వజన్మలో గ్రామాల్లోని ఇండ్లను తగులబెట్టిన పాపాత్ములే అనుకోవాలి. ఇందులో శీలం లేదు, తపస్సు లేదు, బ్రహ్మచర్యం లేదు. పూర్వజన్మ పాపఫలం వల్లనే నివాసుఖానికి దూరం అయ్యారనవలసిఉంటుంది.

నైషద్యక నియమబాధ (always in sitting posture, never lying down) అనుభవిస్తునవాళ్ళు పూర్వజన్మలో దారిదోపిడిగాళ్ళుగా ఉంటూ బాటసారులను బంధించి అలానే వదలివేసిపోయిన పాపాత్ములనియే భావించవలెను. ఇందులో శీలం లేదు, తపస్సు లేదు, బ్రహ్మచర్యం లేదు.

మిలిందుని వితండవాదానికి ఆయుపాలుడు మౌనం వహించాడు. బదులు పలుకలేదు. ఐదువందలమంది యోనకులు మిలిందునితో "మహారాజా, ఈ స్థవిరుడు పండితుడేగానీ మీ ప్రశ్నకు చప్పున సమాధానం చెప్పగల ప్రతిభానం* లేనివాడని తోస్తున్నది" అన్నారు.

ఆ తరువాత మిలిందుడు యోనకులను చూసి చప్పట్లు చరుస్తూ ఇలా అన్నాడు: "ఈ జంబూద్వీపం తుచ్ఛం (empty), పలాపం (పొట్టు= chaff). ఒక్క బ్రాహ్మణుడుగానీ శ్రమణుడుగానీ నా ప్రశ్నలకు సమాధానం చెప్పేవాడు లేడు." ఈ మాటలకు యోనకుల ప్రతిస్పందన ఏమిటో తెలుసుకోదలచి మిలిందుడు వాళ్ళ ముఖాలను పరిశీలనగా చూశాడు. వాళ్ళు నిర్భయంగా, నిశ్శంకగా ఉండడం గమనించి "వీళ్ళ ముఖకవళికలు చూస్తుంటే నాతో సంభాషించగలవాడు ఎవడో ఎక్కడో ఉన్నట్లే అనిపిస్తుంది" అనుకొన్నాడు.

## నాగసేనుని సాగలనగర ఆగమనం

ధర్మమార్గాన్ని ఉపదేశిస్తూ, ధర్మజ్యోతిని చూపిస్తూ, ధర్మయూపాన్ని (sacrificial post of Dharma) నిలుపుతూ, ధర్మధ్వజాన్ని ప్రతిష్ఠిస్తూ, ధర్మకేతువును (జెండా) ఎగురవేస్తూ, ధర్మశంఖాన్ని పూరిస్తూ, ధర్మభేరిని మ్రోగిస్తూ, శూన్యతా సింహనాదం చేస్తూ నాగసేనుడు సాగలనగరం ప్రవేశించాడు. ఎనభైవేలమంది భిక్షువులతో సంఖ్యేయపరివేణంలో బసచేశాడు.

## నాగసేనునితో మిలిందుని ప్రథమ సమాగమం

మిలిందుని మంత్రులలో ముఖ్యుడైన దేవమంత్రి "మహారాజా, సంఖ్యేయ పరివేణంలో నాగసేనుడనే సంఘనాయకుడు ఎనభైవేల భిక్షువులతో విడిది చేసియున్నాడు. మీ ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇవ్వగల సమర్థుడు. వెళ్ళి ప్రశ్నించండి" అన్నాడు. నాగసేనుడు అనే పేరు వినగానే మిలిందునికి భయం వేసింది, వణుకు పుట్టింది, గగుర్పాటు కలిగింది. కానీ పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ "నాతో సంభాషించడానికి,

---

* *వాక్చాతుర్యం. ప్రశ్నకు తడుముకోకుండానూ అదే సమయంలో సరిగ్గానూ బదులు చెప్పగల కౌశలం. సంభాషణలో సమయస్ఫూర్తి.*

నా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి అతడు సన్నద్ధుడేనా?" అని ప్రశ్నించాడు. "మహారాజా, అతడు సన్నద్ధుడే. ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, ప్రజాపతి, సుయాముడు, సంతోషితుడు మొదలగు లోకపాలకులతోనూ ఇంకా చెప్పబోతే మహా బ్రహ్మతోనూ అయినాసరే సంభాషించి సంశయాలు పోగొట్టగల సమర్థుడు" అన్నాడు దేవమంత్రి.

ఐదువందల యోనకులు వెంటరాగా మిలిందుడు రథారూఢుడై సంఖ్యేయ పరివేణానికి బయలుదేరాడు. ఆ సమయంలో నాగసేనుడు ఎనభైవేల భిక్షువులచే పరివేష్టితుడై మహామండపంలో కూర్చొనియున్నాడు. ఆ మహాపరిషత్తును (great assembly of monks) దూరంనుండి చూడగానే మిలిందునికి భయం వేసింది, వణుకు పుట్టింది, గగుర్పాటు కలిగింది. ఖడ్గమృగాలచే అడ్డగింపబడిన ఏనుగువలె, గరుడపక్షులు చుట్టుముట్టిన నాగుపామువలె, అజగరములు (rock-snakes) చుట్టుముట్టిన జంబుకమువలె, మహిషములు చుట్టుముట్టిన భల్లూకమువలె, నాగుపాము వెన్నంటిన మండూకమువలె, పులిని చూసిన జింకవలె, అహితుండికుని (snake charmer) చేతికి చిక్కిన పామువలె, చెలగాటమాడుచున్న పిల్లి ముందరి ఎలుకవలె, భూతవైద్యుణ్ణి (ex-orcist) చూసిన పిశాచంవలె, రాహుగ్రస్తుడైన చంద్రునివలె, బుట్టలో బంధితమైన పామువలె, పంజరంలోని పక్షివలె, వలలో పడిన చేపవలె, భయంకరమైన అడవిలో దారితప్పిన బాటసారివలె, వైశ్రవణుని కోపానికి గురియైన యక్షునివలె, క్షీణాయుష్కుడైన దేవపుత్రునివలె భీతుడైనాడు. ఉద్విగ్నుడైనాడు, త్రస్తుడైనాడు, సంవిగ్నుడైనాడు, విమనస్కుడైనాడు, భ్రాంతచిత్తుడైనాడు. "నా పరిజనుల ఎదుట నేను బేలగా కనిపించరాదు" అనుకొని ధైర్యం తెచ్చుకొని "దేవమంత్రీ, ఆ పర్షదంలో (సభలో) నాగసేనుడెవరో నాకు చూపవద్దు. నేనే కనిపెట్తాను" అన్నాడు.

ఆ పర్షదంలో నాగసేనుడికన్నా పెద్దవాళ్ళు నలభైవేలమంది నాగసేనుడి ముందు ఆసీనులైయున్నారు. చిన్నవాళ్లు నలభైవేలమంది వెనుక అసీనులై యున్నారు. ఆ పర్షదం ముందుభాగాన్ని మధ్యభాగాన్ని వెనుక భాగాన్ని పరిశీలించి చూసి మిలిందుడు నాగసేనుడెవరో కనుక్కొన్నాడు. సింహంలా నిర్భయంగా ఠీవిగా కూర్చొనియున్న వ్యక్తియే నాగసేనుడని గుర్తించి "అదిగో నాగసేనుడు" అని దేవమంత్రికి చూపాడు. "అవును మహారాజా, అతడే నాగసేనుడు. మీరు సరిగ్గా గుర్తించారు" అన్నాడు దేవమంత్రి. ఎవరూ చెప్పకపోయినా అంతమందిలో నాగసేనుడెవరో కనిపెట్టినందులకు రాజు సంతోషించాడు. "ఎందరో వక్తలను చూసియున్నాను. ఎన్నో వాదాలు చేసియున్నాను. కానీ మునుపెన్నడూ ఇలా భయం నాలో కలుగలేదు. నాకు ఇతని చేతిలో పరాజయం తప్పదనిపిస్తున్నది" అనుకొన్నాడు.

# లక్షణ ప్రశ్నలు *

## పుద్గలమీమాంస

మిలిందుడు నాగసేనుణ్ణి సమీపించి అభివాదనం చేసి ఒక ప్రక్కగా కూర్చున్నాడు. నాగసేనుడు కూడా రాజును తగినవిధంగా గౌరవించి పలకరించాడు.

**మి**** : భదంతా, నీవు ఎలా తెలియబడుచున్నావు? నీపేరేమిటి?

**నా:** మహారాజా, నాగసేనుడుగా నేను తెలియబడుచున్నాను. మా భిక్షుసంఘ సహచరులందరూ నన్ను "నాగసేనా" అని పిలుస్తారు. నాగసేనుడనో, శూరసేనుడనో, వీరసేనుడనో, సింహసేనుడనో తలిదండ్రులు పేర్లు పెడతారు. కానీ మహారాజా, ఈ నాగసేనుడనే పేరు కేవలం సంజ్ఞ (designation), సమజ్ఞ (label), ప్రజ్ఞప్తి (concept), వ్యవహారం (expression), నామమాత్రమే (mere name). ఈ పేరుకు అర్థంగా పుద్గలుడు (person) లేడు.

**మి:** ఐదువందల యోనకులారా వినండి, ఎనభైవేల భిక్షువులారా వినండి. పుద్గలుడు లేడని నాగసేనుడంటున్నాడు. ఇది అంగీకారయోగ్యమేనా? (మళ్ళీ నాగసేనుని వైపు తిరిగి) భదంతా, పుద్గలుడు లేడంటున్నావు! మరి అలా అయితే మీకు చీవరములు (వస్త్రాలు), పిండపాతం (ఆహారం), శయన ఆసనాలు (beds and seats), ఔషధాలు ఎవరు ఇస్తున్నారు? ఎవరు వీటిని అనుభవిస్తున్నారు? శీలాన్ని పాటిస్తున్నదెవరు? ధ్యానం చేస్తున్నదెవరు? నిర్వాణం పొందేదెవరు? ప్రాణాతిపాతం (killing) చేస్తున్నదెవరు? అదత్తాదానం (stealing) చేస్తున్న దెవరు? కామమిథ్యాచారానికి పాల్పడేదెవరు? మృషావాదం (lying) చేసేదెవరు? మద్యపానం చేస్తున్నదెవరు? ఆనంతర్యకర్మలను***

---

* *ఈ అధ్యాయంలో ఎక్కువ శీర్షికలు చైతసిక ధమ్మాలకు (mental states) చెందినట్టివి. చైతసికముల సంఖ్య యాభైకి పైనే ఉంటుంది. ఈ చైతసిక ధమ్మాల లక్షణం (స్వరూపం, స్వభావం) ఏమిటో స్వానుభవం ద్వారా చాలామందికి తెలిసియే యుంటుంది. ఆ లక్షణాలను గుర్తింపజేయడంకోసం జ్ఞాపకం చేయడం కోసం ఉద్దేశించిన వాక్యాలు లక్షణవాక్యాలవుతాయి.*

** *మి: మిలిందుడు ; నా: నాగసేనుడు*

*** *మాతృవధ, పితృవధ, అర్హంతవధ, తథాగతరుధిరఉత్పాదనం, సంఘభేదం అనేవి ఐదు ఆనంతర్యకర్మలు. చివరి రెండు దేవదత్తుణ్ణి నరకంలో పడద్రోయడానికోసమే చేర్చినట్లుగా కనిపిస్తుంది! మాతాపితలు ఉపకారిక్షేత్రములు. అర్హంతుడు గుణక్షేత్రం.*

(five evil acts that bear fruit without delay) చేస్తున్నదెవరు? కనుక కుశలకర్మలు లేవు, అకుశలకర్మలులేవు. కర్త (చేసేవాడు) లేడు, కారయిత (చేయించేవాడు) లేడు. మంచి చెడ్డలు లేవు. వాటి ఫలములైన పుణ్యపాపములు లేవు. నాగసేనా, నిన్నెవరైనా చంపితే హంతకుడు లేడు. నీకు ఆచార్యుడు లేడు. ఉపాధ్యాయుడు లేడు. ఉపసంపద (ordination) లేదు. "భిక్షుసంఘ సహచరులందరూ నన్ను నాగసేనా అని పిలుస్తారు" అని చెప్పావు. ఎవరు ఆ నాగసేనుడు? కేశములా* (hairs of the head)? లోమములా (hairs of the body)? నఖములా (nails)? దంతములా? చర్మమా? మాంసమా? స్నాయువులా (sinews)? ఎముకలా? అస్థిమజ్జయా (marrow)? వృకమా (kidney)? హృదయమా? యకృత్తా (liver)? క్లోమకమా(midriff)? ప్లీహయా (spleen)? శ్వాసకోశమా (lungs)? పెద్దప్రేగులా? చిన్నప్రేగులా? ఉదరమా? పురీషమా? పిత్తమా? కఫమా? శ్లేష్మమా? చీము రక్తమా? స్వేదమా? మేదయా (brain)? అశ్రువులా? వసయా (grease)? గళ్ళయా? చీమిడియా? లసికయా (oil of the joints)? మూత్రమా?

**నా:** కాదు.

**మి:** భదంతా, నాగసేనుడెవరు? రూపమా (material form)?

**నా:** కాదు.

**మి:** వేదనయా (feelings)? సంజ్ఞయా (perceptions)? సంఖారములా (mental formations)? విజ్ఞానమా(consiousness)?

---

* *ఈ ముప్పైరెండు భాగాలను ఊహాలో దేహంనుండి తీసివేసి చూస్తే మిగిలేది దేహంస్థానంలో ఖాళీస్థలం. ముప్పైరెండు భాగాల కూర్పు వల్ల ఏర్పడిన అవయవి (whole = దేహం) ఒకటి ఉందికదా అంటే అవయవికి ప్రత్యేక అస్తిత్వం లేదు. అవయవాలనుండి అరువు తెచ్చుకొన్న అస్తిత్వమే దీనిది. అవయవికి ప్రత్యేక అస్తిత్వం ఉంటే పైన తెలిపిన ఖాళీస్థలం ఏర్పడకూడదు. ఈ ముప్పైరెండు భాగాల చింతన దేహం పట్ల వ్యామోహాన్ని రాగాన్ని వదలగొట్టేందుకు చెప్పబడింది. స్తుతులు, స్తోత్రాలు, కీర్తనల కన్నా ఈ పట్టిక పఠనం ఎంతో మేలు చేస్తుంది. కనుక పాళీభాషా పట్టికను రాగచరితులు కంఠతా పెట్టి మాటిమాటికి జ్ఞప్తి చేసుకోవడం కోసం ఇక్కడ ఇవ్వడం జరిగింది.*

***కేసా లోమా నఖా దంతా తచో***
***మంసం న్హారు అట్ఠి అట్ఠిమింజం వక్కం***
***హదయం యకనం కిలోమకం పిహకం పప్ఫాసం***
***అంతం అంతగుణం ఉదరియం కరీసం మత్థలుంగం***
***పిత్తం సేమ్హం పుబ్బో లోహితం సేదో మేదో***
***అస్సు వసా ఖేళో సింఘాణికా లసికా ముత్తం***

**నా:** కాదు.

**మి:** రూపం, వేదన, సంజ్ఞ, సంఖారం, విజ్ఞానం మొత్తం కలిపి నాగసేనుడా?

**నా:** కాదు.

**మి:** ఈ అన్నింటికీ భిన్నంగా ఉన్నదే నాగసేనుడా?

**నా:** కాదు.

**మి:** భదంతా, ప్రశ్నమీద ప్రశ్నలు ఎన్ని వేసినా నాగసేనుడు ఎవరో నాకు తెలియడం లేదు. నాగసేనుడంటే ఒట్టి శబ్దమేనా?

**నా:** కాదు.

**మి:** మరి నాగసేనుడెవరు?

**నా:** మహారాజా, నీవు క్షత్రియకుమారుడవు, అత్యంత సుకుమారుడవు, మధ్యాహ్నసమయంలో వేడెక్కిన ఇసుకభూమి మీద కర్కశమైన గులకరాళ్ల మీద నడిచి వస్తే నీ పాదాలు నొప్పి పెడతాయి. శరీరానికి బాధగా ఉంటుంది. మనస్సు చీకాకుగా ఉంటుంది. దుఃఖవేదనతో కూడిన కాయవిజ్ఞానం (స్పర్శజ్ఞానం) నీకు కలుగుతుంది. ఇప్పుడు నీవు ఇక్కడికి నడిచి వచ్చావా? వాహనం మీద వచ్చావా?

**మి:** భదంతా, నేను కాలినడకన రాలేదు. రథంలో వచ్చాను.

**నా:** రథంలో వచ్చానంటున్నావు. ఆ రథం ఏమిటో నాకు తెలియజెప్పాలి. ఈష (pole) రథమా? అక్షం (ఇరుసు=axle) రథమా? చక్రాలు రథమా? కూబరం (పంజరం) రథమా? రథదండకం (flag-staff) రథమా? యుగం (కాడి = yoke) రథమా? ఆకులు (spokes) రథమా?

**మి:** కాదు.

**నా:** ఇవన్నీ కలిపి రథమా?

**మి:** కాదు.

**నా:** వీటన్నిటికీ భిన్నమైనది రథమా?

**మి:** కాదు.

**నా:** మహారాజా, ప్రశ్నమీద ప్రశ్నలు ఎన్ని వేసినా రథం ఏమిటో నీనుండి జవాబు రావడం లేదు. రథం అంటే ఒట్టి శబ్దమేనా?

**మి:** కాదు.

**నా:** మహారాజా, జంబూద్వీపంలో అగ్రరాజువు నీవు. ఎవరికి భయపడి అబద్ధం చెబుతున్నావు? (సభికుల వైపు తిరిగి) ఐదువందల యోనకులారా వినండి. ఎనభైవేల భిక్షువులారా వినండి. "రథంలో వచ్చాను" అన్నాడు ఈ మిలిందుడు. రథం ఏమిటో

తెలియజేయమని అడిగితే తెలియజేయడం లేదు. “రథంలో వచ్చాను” అనే ఇతని మాట ఒప్పుకొనదగిన మాటేనా?

ఐదువందలమంది యోనకులు సాధు సాధు (well spoken, well spoken) అని నాగసేనుణ్ణి మెచ్చుకొని మిలిందునితో “మీరేమి చెప్పగలరో చెప్పండి” అన్నారు.

**మి:** భదంతా, నేను అబద్ధం చెప్పలేదు. ఈషను అపేక్షించి (ప్రతీత్య = depending), చక్రాలను అపేక్షించి, రథపంజరాన్ని అపేక్షించి, రథదండకాన్ని అపేక్షించి ఇంకా ఇతర భాగాలను అపేక్షించి రథము అనే వ్యవహారం ఉన్నది.

**నా:** మహారాజా, రథం అంటే ఏమిటో నీవు బాగుగా తెలిసియున్నావు. అలాగే నా విషయంలోనూ. రూప (material form) వేదనా సంజ్ఞా సంఖార విజ్ఞానాలను అపేక్షించి నాగసేనుడు అనే వ్యవహారం ఉన్నది. పరమార్థతః(in the ultimate sense) పుద్గలుడు కానరాడు. ఈ విషయాన్నే భగవానుని సమ్ముఖంలో భిక్షుణి వజిర ఇలా పలికింది:

**యథా హి అంగసంభారా హోతి సద్దో రథో ఇతి***
**ఏవం ఖంధేసు సంతేసు హోతి సత్తో తి సమ్ముతి**

భాగాల కూర్పు కారణంగా ఆ కూర్పుకు “రథం” అనే పేరు లోకంలో ఎలా కలిగిందో అదేవిధంగానే స్కంధాల కూర్పు కారణంగా “సత్త్వుడు” అనే పదం లోకవ్యవహారంలోకి (common usage) వచ్చింది.

**మి:** ఆశ్చర్యం, నాగసేనా! అద్భుతం నాగసేనా! నా ప్రశ్నకు అతిచిత్రంగా చక్కగా సమాధానం చెప్పావు. బుద్ధుడు ఇప్పుడు ఇక్కడ ఉండియుంటే నీ సమాధానానికి సాధుకారం (applaude) చేసేవాడు. సాధు సాధు (good, good) నాగసేనా!

## ఎన్నేండ్లు నీకు?

**మి:** భదంతా, ఎన్ని సంవత్సరాల వయస్సు నీకు?

**నా:** ఏడేండ్లు మహారాజా. (భిక్షువు వయస్సు పుట్టినప్పటినుండి లెక్కకు రాదు. భిక్షుసంఘంలో చేరినప్పటినుండి).

**మి:** ఆ ఏడు ఏమిటి? నీవా? లేక గణనయా(counting)?

**నా:** మహారాజా, నీ నీడ భూమి మీద పడి అదిగో కనిపిస్తున్నది. సాగలనగర రాజు నీవా? నీ నీడయా?

* *Just as when the parts are rightly set*
*The word 'chariot' is spoken*
*So when there are the skandhas*
*It is the convention to say 'being'*

**మి:** రాజును నేనే, నా నీడ కాదు, నన్ను ఆశ్రయించుకొని (depending) నీడ పడింది.

**నా:** అలానే మహారాజా, ఏడు అనేది నేను కాదు. అది కేవలం గణన. నన్ను ఆశ్రయించుకొని పడే నీడలాంటిది.

**మి:** ఆశ్చర్యం నాగసేనా! అద్భుతం నాగసేనా! అతిచిత్రంగా సమాధానాలు చెబుతున్నావు.

## చర్చాపద్ధతులు

**మి:** భంతే నాగసేనా, నాతో వాదంలోకి దిగుతావా?

**నా:** మహారాజా, నీవు పండితవాదం చేసేట్లయితే నేను సిద్ధమే. నీవు రాజవాదం చేసేట్లయితే నేను వాదంలోకి దిగను.

**మి:** పండితులు ఎలా వాదం చేస్తారు?

**నా:** పండితులు వాదం చేస్తే విషయాన్ని ఇటు పొర్లించి అటు పొర్లించి క్షుణ్ణంగా వివిధ కోణాల్లో పరిశీలించడం ఉంటుంది. వాదంలోని తప్పులను సహేతుకంగా చూపడం ఉంటుంది. దానిని ఎదుటివారు అంగీకరించి ఓటమిని ఒప్పు కోవడమూ ఉంటుంది. కోపతాపాలకు తావివ్వడం ఉండదు.

**మి:** రాజులు వాదం ఎలా చేస్తారు?

**నా:** రాజులు వాదం చేసేటప్పుడు తన పక్షంగా విషయాన్ని ప్రతిపాదిస్తారు. దాన్ని ఎదుటివాడు ఖండిస్తే కోపం వెంటనే పెల్లుబుకుతుంది. "వీణ్ణి దండించండి" అని భటులను ఆజ్ఞాపిస్తారు.

**మి:** భదంతా, నన్ను విశ్వసించు. నేను రాజవాదం చేయను. ఒక భిక్షువుతో లేదా శ్రామణేరుడితో లేదా ఉపాసకుడితో లేదా ఆరామికునితో (monastery attendent) సంభాషించిన విధంగా నీవు నాతో నిస్సంకోచంగా సంభాషించ వచ్చు. భయపడవలసిన పని లేదు.

**నా:** మంచిది.

**మి:** భదంతా, ప్రశ్న వేయనా?

**నా:** వేయుము.

**మి:** వేశానుగదా!

**నా:** సమాధానం చెప్పానుగదా!

**మి:** ఏమి సమాధానం చెప్పావు?

**నా:** నీవు ఏమి ప్రశ్న వేశావు?

మిలిందుడు స్వగతంలో ఈ భిక్షువు పండితుడు. నాతో చర్చించడానికి సమర్థుడు. అడగవలసినవి చాలా ఉన్నాయి. కానీ సూర్యుడస్తమిస్తున్నాడు" అనుకొని తన ముఖ్యఅమాత్యునితో "దేవమంత్రీ, చర్చను రేపు రాజమందిరంలో కొనసాగిస్తామని భదంతునికి విన్నవించుము" అని ఆసనంనుండి లేచి నాగసేనుని వద్ద సెలవు తీసుకొని రథం అధిరోహించి "నాగసేనుడు నాగసేనుడు" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

## అనంతకాయుడు

మరునటి దినం ప్రొద్దున మిలిందుని అమాత్యులైన దేవమంత్రి, అనంతకాయుడు, మంకురుడు మరియూ సబ్బదిన్నుడు మిలిందుణ్ణి సమీపించి "భదంత నాగసేనుడు ఈ దినం మీ వద్దకు విచ్చేస్తున్నాడా?" అని ప్రశ్నించారు. "అవును, ఆయన ఇక్కడికి వస్తున్నాడు" అన్నాడు మిలిందుడు. "భిక్షువులెంత మందిని వెంటబెట్టుకొని వస్తారు?" ప్రశ్నించారు అమాత్యులు. "ఎంతమందిని వెంటబెట్టుకొని రాదలచారో అంతమందితో వస్తారు" అన్నాడు మిలిందుడు. "పదిమంది భిక్షువులను వెంటబెట్టుకొని రమ్మని వర్తమానం పంపిస్తే బాగుంటుంది" అని సబ్బదిన్నుడు సలహా ఇచ్చినాడు. "అక్కర్లేదు. భిక్షువులెందర్ని తీసుకవస్తారో ఆయన ఇష్టానికి వదలిపెట్టాము" అన్నాడు మిలిందుడు. సబ్బదిన్నుడు మళ్ళీమళ్ళీ అదే సలహా ఇస్తుంటే మిలిందుడు కాస్త చిరాకుతో "ఎక్కువ సంఖ్యలో భిక్షువులు వస్తే వారికి ఆతిథ్యం ఇవ్వడానికి మనకు స్తోమత లేదా ఏమిటి? సబ్బదిన్నుడు ఎందుకిలా మాట్లాడుచున్నాడు. భిక్షువులెంతమంది వచ్చినా తగువిధంగా సన్మానసత్కారాలు చేయడానికి అన్నీ సిద్ధం చేయబడియే ఉన్నాయి" అన్నాడు. ఇది విని సబ్బదిన్నుడు సిగ్గుపడి మౌనంగా ఉండిపోయాడు.

ఆ తరువాత దేవమంత్రి, అనంతకాయుడు, మంకురుడు నాగసేనుని వద్దకు వెళ్ళి "భంతే, రాజా మిలిందుడు మిమ్మల్ని రమ్మని ఆహ్వానిస్తున్నాడు. మీకు ఇష్టమైన సంఖ్యలో భిక్షువులను వెంటబెట్టుకొని రావలసినదిగా ఆహ్వానిస్తున్నాడు" అన్నారు.

ఆ తరువాత నాగసేనుడు పూర్వాహ్ణ* సమయంలో చీవరం కప్పుకొని భిక్షాపాత్ర చేతబట్టుకొని ఎనభైవేల భిక్షువులు వెన్నంటిరాగా సాగలనగరం ప్రవేశించినాడు. దేవమంత్రి, అనంతకాయుడు, మంకురుడు నాగసేనునితో బాటుగా నడిచివెళ్ళినారు. నాగసేనుని ప్రక్కగా నడుస్తున్న అనంతకాయుడు ఇలా ప్రశ్నించినాడు: "భంతే నాగసేనా,

---

* *ప్రొద్దున 6 గంటల నుండి 10 గంటల వరకు పూర్వాహ్ణం, 10 నుండి 2 వరకు మధ్యాహ్నం, 2 నుండి 6 వరకు అపరాహ్ణం. సాయంత్రం 6 నుండి రాత్రి 10 వరకు మొదటి జాము, 10 నుండి 2 వరకు రెండవ జాము, 2 నుండి ప్రొద్దున 6 వరకు మూడవ జాము.*

నాగసేన అని నేను అంటున్నది ఎవరు ఆ నాగసేనుడు?" "నాగసేనుడని ఇక్కడ ఎవరిని నీవు తలచి అడిగినావు?" అని నాగసేనుడు బదులు ప్రశ్న వేసినాడు. "భంతే, మీ దేహం లోపల సంచరించే వాయువునే జీవుడుగా నేను తలచుచున్నాను. అది లోనికి ప్రవేశిస్తుంటుంది. బయటకు నిష్క్రమిస్తుంటుంది. అదియే నాగసేనుడని నేను తలచుచున్నాను" అన్నాడు అనంతకాయుడు. "జీవుడని నీవు చెప్పిన వాయువు బయటకు వెళ్ళి మళ్ళీ లోనికి ప్రవేశించకపోతే లోనికి ప్రవేశించినది బయటకు వెళ్లకపోతే ఆ పురుషుడు జీవించగలడా?" అని నాగసేనుడు ప్రశ్నించినాడు. "లేదు భంతే" అన్నాడు అనంతకాయుడు. "శంఖం ఊదేవాళ్ళు శంఖాన్ని ఊదినపుడు వాళ్ళనుండి బయటకు పోయిన వాయువు అదియే మళ్ళీ లోనికి ప్రవేస్తుందా?" అడిగినాడు నాగసేనుడు. "లేదు భంతే" అన్నాడు అనంతకాయుడు. "వేణువును ఊదేవాళ్ళు వేణువును ఊదేటప్పుడు బయటకు పోయిన వాయువు అదియే మళ్ళీ లోనికి ప్రవేశిస్తుందా? "లేదు భంతే". "సింగమును (కొమ్ము = horn) ఊదేవాళ్ళు సింగమును ఊదేటప్పుడు బయటకు పోయిన వాయువు అదియే మళ్ళీ లోనికి ప్రవేశిస్తుందా?" " లేదు భంతే". అలా అయితే మరి వారెందుకు మరణించడం లేదు?" అడిగాడు నాగసేనుడు. "ఈ వివాదవిషయంలో మీతో నేను వాదించలేనని వినయంగా ఒప్పుకొంటున్నాను. నిర్ణయం ఏమిటో మీరు చెబితే బాగుంటుంది" అన్నాడు అనంతకాయుడు. "ఇది జీవుడు కాదు. ఆశ్వాస ప్రశ్వాసలు అనబడే దేహసంబంధమైన క్రియాకలాపం" అని నాగసేనుడు పలికి ఆ పిమ్మట అభిధర్మం మీద ప్రసంగించినాడు. ఆ ప్రసంగం వినిన అనంత కాయుడు ఉపాసకుడుగా తనను ప్రకటించుకొన్నాడు.

## ప్రవ్రజ్య ఎందుకు?

భిక్షుసంఘాన్ని వెంటబెట్టుకొని నాగసేనుడు మిలిందుని నివేశనానికి (palace) వెళ్ళాడు. మిలిందుడు భిక్షుసంఘాన్ని సాదరంగా ఆహ్వానించి ఉత్తమరకమైన ఖాదనీయ, భోజనీయ పదార్థాలతో సంతృప్తిపరచి ఒక్కొక్క భిక్షువుకు ఒక జత వస్త్రాలు బహూకరించి నాగసేనుడికి మాత్రం మూడు వస్త్రాలను బహూకరించి ఉన్నతాసనంలో కూర్చోమని చెప్పి తాను చిన్న ఆసనంలో కూర్చున్నాడు.

**మి:** భంతే నాగసేనా, ఇప్పుడు మనం ఏ విషయం మీద మాట్లాడుకొందాము?

**నా:** ప్రయోజనకరమైన సంభాషణం చేద్దాము.

**మి:** మీ ప్రవ్రజ్య ప్రయోజనం ఏమిటి? మీ పరమోద్దేశం ఏమిటి?

**నా:** మా ప్రవజ్య ప్రయోజనం వేరే ఏముంటుంది? దుఃఖవిముక్తి కోసమే మా ప్రవ్రజ్య.

మా పరమోద్దేశం మళ్ళీ గర్భవాసం పొందకూడదనే (అపునర్భవం = నిరుపధిశేషనిర్వాణం).

**మి:** ప్రవ్రజ్య తీసుకొన్నవాళ్ళందరూ ఈ ప్రయోజనం కోసమేనా?

**నా:** కాదు. కొందరు రాజభీతివల్ల, కొందరు అప్పులవాళ్ళ భయం చేత ప్రవ్రజిస్తారు. కొందరు జీవిక (livelihood) కోసం ప్రవ్రజిస్తారు. ప్రవ్రజ్య అసలు లక్ష్యాన్ని ఉద్దేశంలో పెట్టుకొని ప్రవ్రజితులైనవాళ్ళే సరియైన ప్రవ్రజ్య కలిగినవాళ్ళు.

**మి:** పరమార్థాన్ని లక్ష్యంగా పెట్టుకొని నీవు ప్రవ్రజించావా?

**నా:** నేను చిన్నవాడుగా ఉన్నప్పుడు ప్రవ్రజ్య తీసుకొన్నాను. దీని పరమ ప్రయోజనం గురించి నాకప్పుడేమీ తెలియదు. "శాక్యపుత్రీయులైన ఈ శ్రమణులు పండితులు. వీళ్ళలో కలిస్తే నాకు మంచి శిక్షణ (training) లభిస్తుంది" అని అప్పుడు ప్రవ్రజ్య తీసుకొన్నాను. వాళ్ళ శిక్షణ వల్ల ఇప్పుడు నేను ప్రవ్రజ్య ప్రయోజనాన్ని, పరమ ప్రయోజనాన్ని తెలుసుకొన్నాను.

**మి:** చక్కగా చెప్పావు.

## పునర్భవం

**మి:** భదంత నాగసేనా, మరణానంతరం పునర్భవం (పునర్జన్మ) పొందని వారెవరైనా ఉంటారా?

**నా:** మహారాజా, కొందరు పునర్జన్మ పొందుతారు. కొందరు పొందరు.

**మి:** ఎవరు పొందరు? ఎవరు పొందుతారు?

**నా:** క్లేశములు (రాగద్వేషాదులు) ఉన్నవాళ్ళు మళ్ళీ జన్మిస్తారు. క్లేశములు లేనివాళ్ళు పునర్భవం తప్పించుకొంటారు.

**మి:** నీకు పునర్జన్మ ఉంటుందా?

**నా:** ఉపాదానం (clinging, attachment = భవనికంతి = love of existence) ఉన్నవాడినైతే మళ్ళీ జన్మ ఉంటుంది. ఉపాదానం లేనివాడినైతే మళ్ళీ జన్మ ఉండదు.

**మి:** చక్కగా సమాధానం చెప్పావు నాగసేనా.

## యోనిశమనసికారం

**మి:** భంతే నాగసేనా, పునర్భవంనుండి తప్పించుకొనేవాడు యోనిశ మనసికారం* (proper attention) వల్ల తప్పించుకొంటాడా?

---

** చూడుడు 203 వ పుట మరియూ 255 వ పుట*

నా. యోనిశ మనసికారం వల్ల, ప్రజ్ఞ వల్ల, ఇతర కుశలధర్మాల (wholesome mental states) వల్ల తప్పించుకొంటాడు.

**మి:** యోనిశమనసికారమూ ప్రజ్ఞా ఒకటే కదా!

నా. కాదు మహారాజా, యోనిశమనసికారం వేరు, ప్రజ్ఞ వేరు. గొర్రెలు, మేకలు, గోవులు, దున్నలు, ఒంటెలు, గాడిదలకు కూడా మనసికారం ఉంటుంది కానీ వాటికి ప్రజ్ఞ ఉండదు.

## మనసికారలక్షణం

**మి:** భంతే నాగసేనా, మనసికారలక్షణం ఏమిటి? ప్రజ్ఞాలక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, ఊహనం (examination) లక్షణంగా కలిగినది మనసికారం. ఛేదనం (cutting off) లక్షణంగా కలిగినది ప్రజ్ఞ.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** యవపైరును కోసేవాళ్ళను ఎరుగుదువా?

**మి:** ఎరుగుదును.

**నా:** వాళ్లు ఎలా కోస్తారు?

**మి:** ఎడమచేత్తో గుత్తుగా కంకులను పట్టుకొని కుడిచేతితో పట్టుకొన్న కొడవలితో కోస్తారు.

**నా:** అలాగే యోగావచరుడు (one who is devoted to mental training) ముందుగా మనసికారం ద్వారా మనస్సును చేర్చిపట్టుకొని ఆ పైన ప్రజ్ఞ ద్వారా చిత్తంలోని క్లేశములను ఛేదిస్తాడు.

## శీలం

**మి:** భంతే నాగసేనా, కుశలధర్మములు కుశలధర్మములు అని అంటుంటావు. ఆ కుశలధర్మములు ఏవి?

నా. మహారాజా, శీలం,* శ్రద్ధ, వీరియం, స్మృతి, సమాధి – ఇవి కుశల ధర్మములు.

**మి:** శీలం లక్షణం ఏమిటి?

---

** మనస్సును శీతలంగా ఉంచేది శీలం. శీలం అనేది చేతనా విశేషం. ఇది కాయిక వాచిక క్రియల ద్వారా ప్రకటమవుతూ ఉంటుంది. ప్రకృతిశీలం (natural morality), ప్రజ్ఞప్తిశీలం (prescribed morality) అని రెండు రకాల విభజన కూడా ఉన్నది. సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ ఆజీవం (right livelihood) ప్రకృతిశీలం క్రిందకు వస్తాయి. భిక్షువులకు ఉపాసకులకు మొదలైనవారికి విధించిన కొన్ని బాహ్యనియమాలు ప్రజ్ఞప్తిశీలం క్రిందకు వస్తాయి.*

**నా:** ప్రతిష్ఠాన (basis) లక్షణం శీలం. అన్ని కుశలధర్మములకు శీలమే ప్రతిష్ఠ, ఐదు ఇంద్రియములకు, ఐదు బలములకు, ఏడు బోధ్యంగములకు, నాలుగు సతిపట్ఠానములకు, అష్టాంగమార్గానికి, నాలుగు ప్రధానములకు, నాలుగు ఇద్ధిపాదములకు, నాలుగు ధ్యానములకు, ఎనిమిది విమోక్షములకు, సమాధి, సమాపత్తులకు శీలమే ప్రతిష్ఠగా ఉన్నది. శీలమునందు ప్రతిష్ఠితుడయిన యోగావచరునిలో పైన చెప్పబడిన కుశలధర్మములు వృద్ధి చెందుతాయి. క్షీణించవు*.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** వృక్షసముదాయంగానీ జీవసముదాయంగానీ పృథివిని ఆశ్రయించుకొనియే వృద్ధిచెందుతాయి. మహారాజా, అలాగే యోగావచరుడు కూడా శీలాన్ని ఆశ్రయించుకొని శీలప్రతిష్ఠితుడై శ్రద్ధ, వీరియం, స్మృతి, సమాధి, ప్రజ్ఞలను వృద్ధిగావించుకొంటాడు. పెంపుచేసుకొంటాడు.

**మి:** మరొక ఉపమ చెప్పుము

**నా:** మహారాజా, శరీరబలంచే చేయవలసిన వివిధమైన పనులను చేయువారలు పృథివిని ఆశ్రయించుకొనియే, పృథివియందు ప్రతిష్ఠితులుగా ఉంటూ ఆయా పనులను చేయగలుగుచున్నారు. అలాగే మహారాజా, శీలమును ఆశ్రయించుకొని శీలమునందు ప్రతిష్ఠితుడై యోగావచరుడు శ్రద్ధ, వీరియం, స్మృతి, సమాధి ప్రజ్ఞలను సాధించగలుగుతాడు.

**మి:** మరొక ఉపమ చెప్పుము.

**నా:** మహారాజా, నగరవడ్డకి (city architect) కొత్తగా ఒక నగరాన్ని నిర్మించే పని ఎత్తుకొన్నప్పుడు నగరస్థలాన్ని తొలుత సరి చేస్తాడు. మొక్కలు ముళ్ళు రాళ్ళురప్పలు తొలగించి స్థలాన్ని సమతలంగా మార్చుతాడు. ఆ తరువాత వీధులు, వీధికూడళ్ళు మొదలగు విభాగాలను నమూనాలోకి ఎక్కించి ఆ నమూనా ప్రకారంగా నగరాన్ని నిర్మిస్తాడు. మహారాజా, అలాగే యోగావచరుడు కూడా శీలాన్ని ఆశ్రయించుకొని శీలంలో నిలదొక్కుకొని శ్రద్ధ వీరియం స్మృతి సమాధి ప్రజ్ఞలను సాధిస్తాడు.

**మి:** మరొక ఉపమ చెప్పుము.

**నా:** మహారాజా, దొమ్మరివాడు (లంఘకుడు) ప్రజలకు తన కౌశలాన్ని ప్రదర్శించే ముందుగా కటికనేలను త్రవ్వి మృదువు చేస్తాడు. పెంకులు మేకులు రాళ్ళురప్పలు తొలగించివేసి మృదువు చేస్తాడు. ఆ తరువాతనే తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు.

---

* *ఈ పేరాలోని కొన్ని పారిభాషికపదాలకు వివరణం చూడుడు అనుబంధం-2*

మహారాజా, అలాగే యోగావచరుడు కూడా శీలాన్ని ఆశ్రయించుకొని శీలంలో నిలద్రొక్కుకొని ఆపైన శ్రద్ధ, వీరియం, స్మృతి, సమాధి, ప్రజ్ఞలను సాధిస్తాడు. ఈ విషయాన్ని భగవానుడు కూడా ఇలా చెప్పియున్నాడు

**సీలే పతిట్ఠాయ నరో సపఞ్ఞో చిత్తం పఞ్ఞం చ భావయం**
**ఆతాపీ నిపకో భిక్ఖు సో ఇమం విజటయే జటం**

**(సంయుత్తనికాయం**–1–14

శీలంలో నిలద్రొక్కుకొని శమథమును విపశ్యనను వృద్ధిచేసుకొనిన ఉత్సాహవంతుడైన యత్నపరుడైన సాధకుడే ఈ జంజాటాన్ని వదిలించుకొని బయటపడగలడు.

**అయం పతిట్ఠా ధరణీవ పాణినం ఇదం చ మూలం కుసలాభివుడ్డియా**
**ముఖంచిదం సబ్బజినానుసాసనే యో సీలక్ఖంధో వరపాతిమోక్ఖియో**

(untraced = ఆకరం ఏదియో తెలియనిది)

సకల ప్రాణులకు ఆధారంగా ఉన్నట్టి పృథివివంటిది శీలం. సకల సుగుణాలకు ఇది మూలం. సకల జినుల ఉపదేశాలకు ఇది ముఖం వంటిది. విముక్తికి శీలమే మార్గము.

## శ్రద్ధ– I

**మి:** భంతే నాగసేనా, శ్రద్ధ* లక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, శ్రద్ధ యొక్క లక్షణం సంప్రసాదనం మరియూ ప్రస్కందనం (leaping forward).

**మి:** సంప్రసాదనం, శ్రద్ధ యొక్క లక్షణం ఎట్లు?

---

** శ్రద్ధ అనేది మూడు కోణాల అతివిలువైన వజ్రం. ఒక కోణం నమ్మకం (faith). బుద్ధుని వాక్యాలు నమ్మదగినవియే. ఎంత తర్కించి చూచినా అబద్ధములు అనిపించడం లేదు. ఇది మొదటి కోణం. బుద్ధుడు దేన్ని లక్ష్యంగా గమ్యంగా చెబుతున్నాడో దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం అసాధ్యంగా తోచడం లేదు. నాకున్నూ సాధ్యమే. కనుక ప్రయత్నిస్తాను – ఇది రెండవ కోణం. ఇంగ్లీషులో confidence. మూడవ కోణం ప్రసాదం (clarity or purity or serenity of mind) ఇతరులతో ఘర్షణ పడి పొందగలిగే లక్ష్యాన్ని బుద్ధుడు చెప్పలేదు. కనుక ఆ లక్ష్యసాధనలో మనస్సు కల్లోలం కావలసిన అవసరం లేదు.*

**నా:** శ్రద్ధ ఉత్పన్నం కాగానే నీవరణములను* (hindrances) అణచివేస్తుంది. నీవరణములనుండి విముక్తమయిన చిత్తం అచ్ఛంగా (clear), ప్రసన్నంగా (serene), అనావిలంగా (pure) ఉంటుంది.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** ఒక చక్రవర్తి చతురంగబలంతో ప్రయాణిస్తూ ఒక వాగును దాటాడు. రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతులు ఆ వాగును దాటడంతో ఆ వాగులో ప్రవహిస్తున్న నీళ్ళు బాగా కలచివేయబడి మడ్డినీళ్ళయిపోయాయి. చక్రవర్తికి దప్పిక వేసి ఆ వాగునీటిని త్రాగదలచి నీళ్ళను తీసుకురమ్మని తన మనుష్యులను ఆజ్ఞాపిస్తాడు. ఆ చక్రవర్తి వద్ద ఉదకసంప్రసాదకమణి ఉన్నది. ఆ మనుష్యులు ఆ మణిని మడ్డినీటిలో వేశారు. ఆ మణిప్రభావం వల్ల ఆ మడ్డినీటిలోని పాచి, నాచు, బురద అంతా అణిగిపోయింది. నీళ్ళు స్వచ్ఛమైనాయి. మనుష్యులు ఆ స్వచ్ఛజలాన్ని తెచ్చి "దేవరా, ఇదిగో పానీయం" అని చక్రవర్తి ముందుంచారు. ఆ ఉదకంతో చిత్తాన్ని పోల్చుకోవాలి. ఆ మనుష్యులతో యోగావచరుణ్ణి పోల్చుకోవాలి. పాచి, నాచు, బురద మొదలైనవాటితో నీవరణములను పోల్చుకోవాలి. ఉదకసంప్రసాదకమణితో శ్రద్ధను పోల్చుకోవాలి. కలుషితజలం స్వచ్ఛజలం అయినట్లుగా శ్రద్ధ వల్ల చిత్తంలోని కాలుష్యం తొలగి నిర్మలమవుతుంది.

## శ్రద్ధ-2

**మి:** భంతే నాగసేనా, శ్రద్ధ యొక్క లక్షణం ప్రస్కందనం (leaping forward) ఎట్లు?

**నా:** ఇతరులు కొందరు విముక్తచిత్తులు కావడం చూసిన యోగావచరుడు తాను కూడా ఆధ్యాత్మమార్గంలో ముందుకు దూసుకుపోదలచిన సాహసిగా మారుతాడు. స్రోతాపత్తిఫలాన్ని** లేదా సకృదాగామిఫలాన్ని లేదా అనాగామిఫలాన్ని లేదా అర్హత్వఫలాన్ని అందుకోదలచి అధ్యాత్మమార్గంలో ముందుకు ఉరుకుతాడు. పొందనిదాన్ని పొందడం కోసం తెలియనిదాన్ని తెలుసుకోవడం కోసం అనుభవానికి రాని దాన్ని అనుభవానికి తెచ్చుకోవడం కోసం యోగాన్ని అభ్యసిస్తాడు.

**మి:** ఉపమను చెప్పుము.

---

* *కామచ్ఛంద (sense desires), వ్యాపాద (ill-will), స్త్యానమిద్ధ (sloth and torpor), ఔద్ధత్యకౌకృత్య (restlessness and regrets), విచికిత్స (doubt).*

** *చూడుడు అనుబంధం – 2*

**నా:** పర్వతం మీద మహామేఘుడు వర్షించినపుడు ఆ వర్షపు నీరు కొండచరియల నుండి క్రిందకు దొర్లుకొంటూ వచ్చి క్రింద సమతలంలోని నదిలో చేరి రెండు ఒడ్డులను ఒరుసుకొంటూ ప్రవహిస్తుంది. నది ఇవతలి ఒడ్డునుంచి ఆవలి ఒడ్డు పోదలచి అక్కడికి వచ్చిన జనసమూహం ఆ నది లోతుపాతులు ఏమిటో తెలియక దాటే సాహసం చేయలేక భయంతో నిలబడిపోతారు. ఒకానొక పురుషుడు కూడా ఆవలితీరం పోదలచి అక్కడికి వచ్చి నదిని చూస్తాడు. తన శక్తి, బలం పట్ల నమ్మకం ఉన్నవాడు కనుక దోవతిని నడుముకు బిగించికట్టుకొని సాహసంతో ఆ జలప్రవాహంలో చొచ్చుకొనిపోయి ఆవలితీరం చేరుతాడు. అతడు అలా సాహసించి ఆవలితీరం చేరడం చూసిన జనుల్లో కొందరికి ఆత్మవిశ్వాసం కలిగి అతడు నదిని దాటిన మార్గంలోనే అడుగులు వేస్తూ ఆవలితీరం చేరుతారు.

మహారాజా, అలాగే యోగావచరుడు కూడా ఇతరులు విముక్తి పొందడం చూసి తను కూడా ఉత్సాహం తెచ్చుకొని స్రోతాపత్తిఫలమో సకృదాగామిఫలమో అనాగామిఫలమో అర్హత్వఫలమో పొందదలచి అధ్యాత్మమార్గంలో ముందుకు ఉరుకుతాడు. పొందనిదాన్ని పొందడానికోసం తెలియనిదాన్ని తెలుసుకోవడం కోసం అనుభవానికి రానిదాన్ని అనుభవానికి తెచ్చుకోవడం కోసం ప్రయత్నిస్తాడు. మహారాజా, శ్రద్ధాలక్షణం ప్రస్కందనం అని ఈ ప్రకారముగా తెలుసుకొనుము. భగవానుడు కూడా ఈ విషయాన్ని సంయుక్తనికాయంలో ఇలా చెప్పియున్నాడు:

**సద్ధాయ తరతీ ఓఘం అప్పమాదేన అణ్ణవం**
**వీరియేన దుక్ఖమచ్చేతి పఞ్ఞాయ పరిసుజ్ఝతి** *(సంయుత్తనికాయం 1-10-4)*

శ్రద్ధ వల్ల ఓఘాన్ని (ప్రవాహాన్ని) దాటుతాడు. అప్రమాదం* వల్ల అర్ణవాన్ని (సముద్రాన్ని) దాటుతాడు. వీరియం (vigour / energy / effort) వల్ల దుఃఖాన్ని అధిగమిస్తాడు. ప్రజ్ఞ వల్ల పరిశుద్ధుడవుతాడు.

## వీరియం

**మి:** భంతే నాగసేనా, వీరియం** (mental energy) లక్షణం ఏమిటి?

**నా:** ఉపస్తంభనం (rendering of support) మహారాజా, వీరియం లక్షణం.

**మి:** ఉపమను చెప్పుము.

---

* *చూడుడు 233 వ పుట*

** *అష్టాంగమార్గంలోని సమ్యక్ వ్యాయామం (right effort) వీరియం ఒకటే. బౌద్ధంలో వీరియానికి చాలా ప్రాధాన్యం ఉన్నది. వీరియానికి ప్రతిపక్షం కౌసీద్యం (సోమరితనం).*

**నా:** ఇల్లు కుప్పకూలిపోయే అపాయం ఉందని తెలుసుకొన్న ఇంటియజమాని అది కూలిపోకుండా ఉండడానికోసం కొయ్యలు, స్తంభాలు ఊతంగా నిలిపి ఉంచుతాడుకదా! అలాగే వీరియం కూడా కుశలధర్మములకు హాని జరుగకుండా నిలిపి ఉంచుతుంది. ఈ విషయమై అంగుత్తరనికాయంలో భగవానుని వాక్కులు: "భిక్షువులారా, వీరియవంతుడైన ఆర్యశ్రావకుడు (noble disciple) అకుశల ధర్మములను వదిలించుకొంటాడు. కుశలధర్మములను వృద్ధిచేసుకొంటాడు. సావద్యములను (నిందనీయములను) వదిలించుకొంటాడు. అనవద్యములను (ప్రశంసనీయములను) వృద్ధిచేసుకొంటాడు. తనను తాను పరిశుద్ధుడుగా ఉంచుకొంటాడు."

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** ఇద్దరు రాజులు కయ్యానికి దిగినారు. ఒకరాజు సైన్యం చాలినంతగా లేకపోవుటచే పరాజయం అంచులకు నెట్టబడింది. అప్పుడు ఆ రాజు బలగాల వెంబడి బలగాలను ఇబ్బడి ముబ్బడిగా పంపించి పరాజయం అంచుల్లోని చిన్నసేనకు బలాన్ని పెంపుజేసినాడు. ఆ బలంతో శత్రుసైన్యం మీదికి ఎదురుదాడికి దిగి ఓడించడం కూడా జరిగింది. మహారాజా, అలాగే వీరియం అనే చిత్తవిశేషం కూడా కుశలధర్మాలకు బలం చేకూర్చి అవి పైచేయిగా ఉండేలా చేస్తుంటుంది.

## స్మృతి

**మి:** భంతే నాగసేనా, స్మృతి లక్షణం ఏమిటి?

**నా:** స్మృతి* లక్షణం మరవకుండా ఉండడం మరియూ ఉపగ్రహణం.

**మి:** మరవకుండా ఉండడం (అభిలపనం) ఎట్లు స్మృతి లక్షణం?

---

** స్మృతి అంటే మనకు వెంటనే తోచే అర్థం జ్ఞప్తి (remembrance) అని. ఈ అర్థాన్ని కాదనకుండా మరికొంత అర్థం స్మృతి అనే ఈ బౌద్ధపారిభాషిక పదానికి ఇచ్చుకోవాలి. బౌద్ధభిక్షువులు గొప్ప భాషాపండితులుగదా! భావవ్యక్తీకరణకు అనువైన కొత్తపదాలను ఎందుకు సృజించుకోలేదు? అని ప్రశ్న వేసుకొంటే భగవానుని పట్ల వారి నమ్రత, వినయం అని జవాబు. భగవానుని ముఖతః వెలువడిన ప్రత్యేక పదాలు కొన్నింటిని అలానే నిలుపుకొనేందుకే ఇష్టపడినారు. అలాంటి పదాల్లో ఒకటి స్మృతి (సతి). పాశ్చాత్య బౌద్ధపండితులు ఈ పదాన్ని తలోకరీతిగా అనువదించారు. (contemplation, reflexion, meditation, recollection, fixation, memory, recognition, wakefulness, alertness, attention, awareness ఇంకా అనేక విధాలుగా). ఇప్పుడు అందరూ mindfulness అని చక్కని పదాన్ని వాడుతున్నారు. ఇది ధ్యానప్రక్రియకు చెందిన పదం. కాయానుపశ్యన, వేదనానుపశ్యన, చిత్తానుపశ్యన, ధర్మానుపశ్యన అని స్మృతి నాలుగు విధాలుగా చెప్పబడింది.*

**నా:** నాలుగు సతిపట్ఠానములు, నాలుగు ప్రధానములు నాలుగు ఇద్ధిపాదములు, ఐదు ఇంద్రియములు, ఐదు బలములు, ఏడు బోధ్యంగములు, ఆర్యఅష్టాంగిక మార్గము అని బోధిపక్షీయధర్మములు* ముప్పైఏడింటిని యోగావచరుడు జ్ఞప్తిలో ఉంచుకోవడం స్మృతి అవుతుంది. ఈ స్మృతి వలన కుశలధర్మములు ఏవి? అకుశలధర్మములు ఏవి? సావద్యములు(నిందనీయములు) ఏవి? అనవద్యములు (ప్రశంసనీయములు) ఏవి? హీనములు ఏవి? ప్రణీతములు (lofty) ఏవి? కృష్ణ (dark) శుక్ల (bright) ధర్మములు** ఏవి? రెండింటి సమ్మిశ్రితములు ఏవి? అనే విషయంలో గందరగోళం చెందడు. దీనివలన యోగావచరుడు సేవించదగిన ధర్మములను సేవిస్తూ (అభ్యసిస్తూ) సేవించదగని ధర్మములను నిర్జిస్తూ ఉంటాడు.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** రాజభాండాగారికుడు ప్రొద్దున సాయంత్రం రాజును దర్శించి "దేవా, మీ సేనాబలంలో ఇన్ని ఏనుగులు, ఇన్ని గుర్రములు, ఇన్ని రథాలు, ఇందరు పదాతులు ఉన్నారు. మీ కోశాగారంలో ఇంత హిరణ్యం (unrought gold), ఇంత సువర్ణం (wrought gold), ఇంత సంపద ఉన్నది. తమరు ఈ విషయాన్ని జ్ఞప్తిలో ఉంచుకొనవలసినదిగా మనవి" అంటుంటాడు కదా! మహారాజా, అలాగే స్మృతి కూడా రాజభాండాగారికునివలె యోగావచరుడికి జ్ఞప్తిలో ఉంచుకొనవలసిన బోధిపక్షీయధర్మములను జ్ఞప్తికి తెస్తూ ఉంటుంది. భగవానుడు కూడా ఈ విషయమై ఇలా పలికియున్నాడు: "భిక్షువులారా, అన్నిటిని సిద్ధింపజేసే ప్రభావం కలిగినట్టిది సతి (mindfulness) అని గుర్తుంచుకొనండి."

**మి:** ఉపగ్రహణం (taking up / examining) ఎట్లు స్మృతిలక్షణం?

**నా:** మహారాజా, స్మృతి ఉత్పన్నం అవుతుండగానే "ఇవి హితవైన ధర్మములు, ఇవి అహితములు, ఇవి ఉపకార ధర్మములు, ఇవి అనుపకార ధర్మములు" అని యోగావచరుడు తెలుసుకొని హితములను, ఉపకారములను సేవిస్తూ అహితములను అనుపకారములను వర్జిస్తూ ఉంటాడు.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** రాజుగారి పరిణాయకుడు (adviser) రాజుకు ఏది హితము ఏది హితము కాదు, ఏది ఉపకారము, ఏది అనుపకారము కనిపెట్టూ హితమును ఉపకారమును గ్రహిస్తూ

---

* *చూడుడు అనుబంధం – 2*

** *చూడుడు 222 వ పుట*

అహితమును అనుపకారమును వర్జిస్తూ ఉంటాడు. అలాగే స్మృతి కూడా యోగావచరునికి పరిణాయకునివలె మంచి చేస్తుంటుంది.

## సమాధి

**మి:** భంతే నాగసేనా, సమాధి* (చిత్తైకాగ్రత) లక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, ప్రముఖత (being the chief) అనేది సమాధిలక్షణం. కుశలధర్మములు ఏవేవి ఉన్నాయో వాటన్నిటికీ సమాధియే ప్రముఖము(chief). కుశలధర్మములు అన్నిటికి సమాధియే పట్టుగొమ్మగా ఉంటుంది.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** ఇంటి యొక్క వాసాలన్నీ దూలాన్ని ముఖంగా కలిగియుంటాయి. అవన్నీ దూలం వైపునకు వాలియుంటాయి. ఆ విధంగానే కుశల ధర్మాలయందు సమాధి ప్రముఖత కలిగియున్నది.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, ఒకానొక రాజు చతురంగబలముతో యుద్ధభూమికి ఏతెంచినాడు. ఆ సైన్యంలోని ఏనుగుల విభాగానికి అశ్వికదళానికి రథికదళానికి కాల్బంటుదళానికి వీటన్నిటికీ ముఖ్యుడుగా రాజే ఉంటాడు. రాజునే అవి పరివేష్టించియుంటాయి. రాజు ఎటు కదిలితే అటువైపునకే అవి కదులుతాయి. రాజు ఎటుమళ్ళితే అటువైపునకే అవి మళ్ళుతాయి. మహారాజా, అలాగే కుశలధర్మాలు ఏవేవి ఉన్నాయో అవన్నీ కూడా సమాధిని (చిత్తైకాగ్రత) అగ్రగామిగా చేసుకొని వెన్నంటివస్తాయి. సమాధిని పరివేష్టించియుంటాయి. సమాధిదిశగా కదులుతాయి, మళ్ళుతాయి. మహారాజా, ఈ విధంగా సమాధికి ప్రముఖత్వం అనేది లక్షణంగా చెప్పవచ్చు. ఈ విషయంగా భగవానుడు కూడా ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, సమాధిని అభ్యసిస్తూ వృద్ధిగావించు కొనుడు. సమాహితచిత్తుడుగా ఉన్నట్టివాడే ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొనగలడు (సంయుత్తనికాయం 21-5).

---

* *చిత్తాన్ని (consiousness) ఏ క్షణంలోనూ ఎడబాయకుండా ఉండే చైతసిక ధర్మాలు ఏడింటిలో సమాధి ఒకటి. చిత్తంలో సహజంగా ఉన్న ఈ ధర్మమును అభ్యాసం ద్వారా వృద్ధి చేసుకొని సద్వినియోగంలోని తెచ్చుకోడం సమాధి అనబడుతుంది. ఆర్యసత్యాల చింతనలో ఏకాగ్రత కలిగితే అది లోకోత్తర (supra mundane) సమాధి అనబడుతుంది. ఇతరమైన సమాధులు లౌకికములు. దుష్టమైన పనులు చేసేవాళ్ళు కూడా ఆ పనులు చేసేటప్పుడు చిత్తాన్ని సమాధిలో ఉంచ గలుగుతారు. కానీ అది సమ్యక్ సమాధి కాదు. మిథ్యాసమాధి (wrong concentration) అవుతుంది.*

## ప్రజ్ఞ

**మి:** భంతే నాగసేనా, ప్రజ్ఞ* లక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, ఛేదనం (cutting off) అని ముందే చెప్పియున్నాను. మరియూ అవభాసనం (illuminating) అనియూ చెప్పవచ్చు.

**మి:** అవభాసనలక్షణం ఎట్లు?

**నా:** ప్రజ్ఞ ఉదయించగానే అవిద్యాంధకారం** పటాపంచలవుతుంది. విద్యాకాంతిని విరజిమ్ముతుంది. ఆర్యసత్యాలను ప్రకటపరుస్తుంది. యోగావచరుడు ప్రజ్ఞ వల్ల అనిత్యతను దుఃఖతను అనాత్మతను తెలుసుకొంటాడు.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** గాఢాంధకారంగా ఉన్న గృహంలో దీపం వెలిగించగానే అక్కడ అప్పటివరకు ఉన్న అంధకారం పటాపంచలవుతుంది. వెలుగు వ్యాపిస్తుంది. అక్కడున్న వస్తువులన్నీ ఉన్నవి ఉన్నట్లుగా కనిపిస్తాయి. మహారాజా, అలాగే ప్రజ్ఞ ఉదయించగానే అవిద్యాంధకారం పటాపంచలవుతుంది. విద్యాకాంతిని విరజిమ్ము తుంది. ఆర్యసత్యాలను ప్రకటపరుస్తుంది. యోగావచరుడు ప్రజ్ఞ వల్ల అనిత్యతను దుఃఖతను అనాత్మతను తెలుసుకొంటాడు.

## ఏకకార్యం

**మి:** భంతే నాగసేనా, అనేక ధర్మములు కలిసి ఏకకార్యాన్ని సాధిస్తాయా?

**నా:** సాధిస్తాయి. కుశలచిత్తధర్మములు అనేకం కలిసి క్లేశనిర్మూలనం అనే ఏకకార్యాన్ని సాధిస్తాయికదా!

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, సైన్యంలో రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతులు అని నాలుగు విభాగాలుండినప్పటికీ అన్నీ కలిసియే సంగ్రామంలో విజయాన్ని సాధిస్తాయి. అలాగే కుశలచిత్తధర్మములన్నీ కలిసి క్లేశాలను నిర్మూలిస్తాయి.

---

* *తెలియడం అనేది అందరికీ అనుభవంలో ఉన్నదే. విశేషంగా తెలియం ప్రజ్ఞ. ఒక చిన్న పిల్లవాడికి దారిలో ఒక నాణెం కనిపించింది. గుండ్రంగానూ తెల్లగానూ కాస్త మందంగానూ అడ్డదిడ్డంగా గీతలున్నదిగానూ కనిపించింది. తొక్కుడుబిళ్ల ఆటకు బాగా ఉంటుందని జేబులో వేసుకొన్నాడు. అది ఏ దేశం నాణెం? దాని విలువ ఎంత? అనే విశేషజ్ఞానం అతనికి లేదు. అలాగే తెలియడం అనేది అందరికీ సామాన్యమే. ఏదేది తెలుస్తున్నదో అది అంతయూ అనిత్యం, దుఃఖం, అనాత్మ అని విశేషంగా తెలుసుకొనేవాళ్ళు ప్రజ్ఞావంతులు.*

** *గులాబి, చేమంతి, మల్లె, సంపంగి–ఇలా అనేక రకాల ఆకారవిశేషాలకు "పువ్వు" అని సామాన్యనామధేయం ఉన్నట్లే చిత్తంలోని నానా రకాల క్లేశాలకు సామాన్య నామధేయం అవిద్య.*

## అతడు అతడేనా?

**మి:** భంతే నాగసేనా, ఎవడు మరణానంతరం జనించాడో అతడు అతడేనా? అన్యుడా?

**నా:** అతడు అతడూ కాదు. అన్యుడూ కాదు. మహారాజా, నీవు ఒకప్పుడు వెల్లికిల పరుండిన పసిపిల్లవాడుగా ఉంటివి. ఇప్పటి నీవు ఆ నీవేనా?

**మి:** కాదు భంతే. వెల్లికిల పరుండిన ఆ పసివాడు వేరు. పెద్దవాడిగా ఎదిగియున్న ఇప్పటి నేను వేరు.

**నా:** అలా అయితే మహారాజా, నీవు తల్లిలేనివాడవు, తండ్రిలేనివాడవు, ఆచార్యుడు లేనివాడవు అనవలసివస్తుంది. శిల్పివి, శీలవంతుడివి, ప్రజ్ఞావంతుడివి కాదనవలసివస్తుంది. మహారాజా, కలలం (first stage of the embryo) యొక్క తల్లి, అర్బుదం (second stage) యొక్క తల్లి, పేశి (third stage) యొక్క తల్లి, ఘనం (fourth stage) యొక్క తల్లి వేరు వేరా? పసిబిడ్డనాటి తల్లి, పెద్దతనంనాటి తల్లి వేరు వేరా? శిల్పం నేర్చింది ఒకడు శిల్పి అయింది మరొకడా? పాపకర్మ చేసింది ఒకడు దానికి దండనగా హస్తపాదఛేదనం మరొకడికా?

**మి:** కాదు భంతే. ఇదే ప్రశ్న నీకు తగిలితే ఏమంటావు?

**నా:** మహారాజా, వెల్లికిల పరుండిన పసిపిల్లవాడుగా నేనే అయియుంటిని. ఇప్పుడు పెద్దవాడుగా ఉంటున్నదీ నేనే. ఈ దేహాన్ని ఆశ్రయించుకొని యున్నందువల్ల భిన్నభిన్న అవస్థల మధ్య ఏకత (unity) ఏర్పడింది.

**మి:** ఉపమద్వారా వివరింపుము.

**నా:** ఒకానొక పురుషుడు చీకటిపడే వేళ దీపం వెలిగించాడనుకొందాము. అది ఆ రాత్రంతా వెలుగుతూ ఉంటుందా?

**మి:** వెలుగుతూ ఉంటుంది.

**నా:** మహారాజా, మొదటి జాములో వెలిగిన దీపజ్వాలయేనా నడిజాములోనూ వెలిగింది?

**మి:** కాదు భంతే.

**నా:** నడిజాములోని జ్వాలయేనా కడపటి జాములో వెలిగిన జ్వాల?

**మి:** కాదు భంతే.

**నా:** మహారాజా, మరి మొదటి జాములోని దీపం నడిజాములోని దీపం, కడపటి జాములోని దీపం వేరు వేరా?

**మి:** కాదు భంతే. ఆ ఒక దీపాన్ని ఆశ్రయించుకొనియే రాత్రంతా వెలుగు వెలిగింది.

**నా:** మహారాజా, అలాగే ధమ్మసంతతి విషయమూ. చిత్తక్షణములు వేరువేరైనప్పటికీ పూర్వచిత్తక్షణం నిరుద్ధం కావడం ఉత్తరచిత్తక్షణం ఉత్పన్నం కావడం ఏకకాలంలో జరిగి సంతతి (continuity) కొనసాగుతుంది. ఈ రెండింటినీ ఏకమనరాదు, భిన్నమనీ చెప్పరాదు. రెండూ ఏకసంతతికి చెందినవిగా మాత్రం చెప్పవచ్చు.

**మి:** ఉపమద్వారా తెలియజేయుము.

**నా:** మహారాజా, గోవునుండి పిండుకొన్న పాలు కొంత సమయం తరువాత పెరుగుగా మారుతుంది. పెరుగునుండి వెన్న, వెన్ననుండి నెయ్యి వస్తుంది. ఎవడైననూ ఇలా పలికినాడనుకొనుము: "ఏది పాలో అది పెరుగు. ఏది పెరుగో అది వెన్న. ఏది వెన్నయో అది నెయ్యి." ఇది సరియైన మాటయా?

**మి:** సరియైన మాట కాదు. ఎందుకంటే పాలను ఆశ్రయించుకొని పెరుగు ఉత్పన్నమయ్యింది.

**నా:** అలాగే పూర్వజన్మలోని చివరి చిత్తక్షణాన్ని అపేక్షించి (depending) తరువాతి జన్మలోని ప్రథమచిత్తక్షణం (ప్రతిసంధిచిత్తం) ఉత్పన్నమవుతుంది. ఈ రెండు ఒకటియే అని చెప్పకూడదు. భిన్నమనీ చెప్పకూడదు.

**మి:** బాగా చెప్పావు.

## జన్మరాహిత్యం

**మి:** భంతే నాగసేనా, జన్మరాహిత్యస్థితిని పొందినవాడు "ఇక నాకు జన్మ లేదు" అని ముందుగానే తెలుసుకొనునా? ఎట్లు తెలుసుకొనును?

**నా:** పునర్జన్మకు ఏవి హేతువులో ఏవి ప్రత్యయములో అవి తనలో లేకపోవడం గమనించి "ఇక నాకు జన్మ లేదు" అని తెలుసుకొనును.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** కర్షకుడుగా ఉంటున్న గృహపతి పొలం దున్నుతాడు, విత్తనాలు చల్లుతాడు. పండిన పంటను ధాన్యాగారంలో నింపుతాడు. కాలాంతరంలో అతడు పొలం దున్నడం, విత్తనాలు చల్లడం చేయలేదు. ధాన్యాగారంలో మిగిలియున్న ధాన్యాన్ని తను ఉపయోగించడమో ఇతరులకు ఇచ్చివేయడమో చేస్తాడు. ధాన్యాగారం మళ్ళీ భర్తీ కావడం జరుగదు అని అతనికి తెలిసిన విషయమేకదా! అలాగే పునర్జన్మను ఇచ్చే హేతువులు ప్రత్యయములు తనలో అంతరించాయని తెలిసిన వ్యక్తి "ఇక తనకు జన్మ ఉండదు" అని కూడా తెలిసినవాడుగా ఉంటాడు.

## జ్ఞానం-ప్రజ్ఞ

**మి:** భంతే నాగసేనా, ఎవనికి జ్ఞానం ఉత్పన్నమయిందో అతనికి ప్రజ్ఞ కూడా ఉత్పన్నమవుతుందా?

**నా:** ఔను మహారాజా, జ్ఞానం ఉత్పన్నమయినవానికి ప్రజ్ఞ కూడా ఉత్పన్నమవుతుంది.

**మి:** జ్ఞానమూ, ప్రజ్ఞ ఒకటేనా!

**నా:** అవును ఒకటే.

**మి:** జ్ఞానమూ, ప్రజ్ఞా ఒకటే అయిన పక్షంలో జ్ఞానం ఉత్పన్నమయినవానికి సమ్మోహం ఉంటుందా? ఉండదా?

**నా:** కొన్ని విషయాల్లో సమ్మోహం ఉంటుంది. కొన్ని విషయాల్లో ఉండదు.

**మి:** సమ్మోహం ఎక్కడ ఉండదు? ఎక్కడ ఉంటుంది?

**నా:** ఇంతకు పూర్వం నేర్వని శిల్పస్థానములలో, ఇంతకు పూర్వం వెళ్ళని ప్రదేశాల్లో దిక్కులు గుర్తించడంలో, ఇంతకు పూర్వం వినని పేర్లు, పదాల విషయంలో సమ్మోహం ఉంటుంది.

**మి:** సమ్మోహం ఎక్కడ ఉండదు?

**నా:** ప్రజ్ఞ వల్ల అవగతమైన అనిత్యత, దుఃఖత, అనాత్మత విషయంగా సమ్మోహం ఉండదు.

**మి:** మోహం ఎక్కడికి వెళ్తుంది?

**నా:** మోహం ఎక్కడికీ వెళ్ళదు. జ్ఞానం ఉత్పన్నమయిన క్షణమే నష్టమవుతుంది.

**మి:** ఉపమ చెప్పుము.

**నా:** ఒకానొక పురుషుడు చీకటిగదిలోకి దీపం తీసుకెళ్ళగానే ఆ గదిలోని చీకటి అంతరించి వెలుతురు వ్యాపిస్తుంది. అలాగే మహారాజా, జ్ఞానం ఉత్పన్నం కాగానే మోహం అంతరించిపోతుంది.

**మి:** ప్రజ్ఞ ఎక్కడికి వెళ్తుంది?

**నా:** ప్రజ్ఞ కూడా తనపనిని చేసిన తరువాత అంతరించిపోతుంది కానీ ఆ ప్రజ్ఞ వల్ల కలిగిన అనిత్యత, దుఃఖత, అనాత్మత అనే అవగాహనమాత్రం ఎప్పుడూ ఉండిపోతుంది.

**మి:** ఉపమ చెప్పుము.

**నా:** ఒకానొక పురుషుడు ఒక రాత్రి లేఖ వ్రాసి పంపదలచినవాడై లేఖకుణ్ణి రప్పించి దీపం వెలిగించి ఆ వెలుగులో లేఖను వ్రాయించి ఆపైన దీపాన్ని అర్పివేస్తాడు. దీపం

ఆరిపోయినా దీపం వెలుగులో వ్రాయబడిన లేఖకు నష్టం జరిగిపోదు. అలాగే ప్రజ్ఞ తన పని చేసి అంతరించిపోయినా ప్రజ్ఞ వల్ల కలిగిన అవగాహన నష్టం అయిపోదు.

**మి:** భంతే, మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, తూర్పుదేశీయులు జలం నింపియున్న ఐదు కుండలను ఒక్కొక్క ఇంటివద్ద ఉంచుకొంటారు. ఎప్పుడైనా ఇంటికి నిప్పంటుకొని తగలబడుతుంటే వెంటనే ఆ ఇంటివాళ్ళు ఆ ఐదు కుండలను మంటల మీదికి విసిరివేస్తారు. కుండలు పగులుతాయి కానీ ఆ నీటివల్ల మంటలు ఆరిపోతాయి. మహారాజా, ఆ ఇంటివాళ్ళకు ఆ పగిలిన కుండలవల్ల మళ్ళీ ఘటకృత్యములను చేసుకొనే తలంపు ఉంటుందా?

**మి:** ఉండదు భంతే. నీటి కుండలు పగిలాయి. ఉద్దేశించిన పనిని నెరవేర్చాయి. ఇక ఆ పెంకులతో పనిలేదుకదా!

**నా:** మహారాజా, శ్రద్ధ, వీరియం, సతి, సమాధి, ప్రజ్ఞ అనబడే ఐదు అధ్యాత్మిక శక్తులను ఆ ఐదు కుండలతో పోల్చుము. తూర్పుదేశీయులతో యోగావచరుణ్ణి పోల్చుము. అగ్నిని క్లేశములతో పోల్చుకొనుము. పంచఘటముల ద్వారా మంటలు ఆర్పివేయడం జరిగినట్లుగా ఐదు అధ్యాత్మికశక్తులద్వారా క్లేశజ్వాలలు ఆర్పివేయడం జరుగుతుంది. ఆరిన జ్వాలలు మళ్ళీ చెలరేగవు. మహారాజా, ప్రజ్ఞ కూడా ఈ విధంగానే స్వీయకృత్యాన్ని నిర్వహించి అక్కడికక్కడే అంతరిస్తుంది. కానీ ప్రజ్ఞాకృత్యం ద్వారా అవగతమైన "అనిత్యత, దుఃఖత, అనాత్మత" అనే అవగాహన అంతరించిపోకుండా కొనసాగుతుంది.

## అర్హతులకు దుఃఖం కలుగదా?

**మి:** భంతే నాగసేనా, అర్హతునికి (జీవన్ముక్తునికి) దుఃఖవేదన ఏమైనా ఉంటుందా?

**నా:** మహారాజా, కొన్ని దుఃఖవేదనలుండవు. కొన్ని ఉంటాయి.

**మి:** ఏవి ఉంటాయి? ఏవి ఉండవు?

**నా:** కాయికమైన వేదనలుంటాయి. చైతసిక వేదనలుండవు.

**మి:** ఎందువల్ల?

**నా:** ఏ హేతువులు (causes), ఏ ప్రత్యయములు (conditions) శరీర దుఃఖానికి కారణంగా ఉంటున్నాయో అవి జీవన్ముక్తుడైనప్పటికీ పనిచేస్తుంటాయి. కనుక జీవన్ముక్తునికి కూడా శరీరసంబంధమైన బాధలుంటాయి. కానీ జీవన్ముక్తునిలో మానసికదుఃఖాన్ని కలిగించే హేతుప్రత్యయములు పని చేయవు కనుక అతనికి

మానసికదుఃఖం తలెత్తదు. భగవానుడు కూడా ఇదే విషయాన్ని ఇలా చెప్పినాడు: "అర్హతునికి ఒక వేదన కాయికవేదన ఉంటుంది, చైతసికం ఉండదు."

**మి:** కాయికమైన దుఃఖవేదనలు అనుభవించే అర్హతుడు దేహాన్ని వదలివేయవచ్చు గదా (ఆత్మహత్య చేసుకోవచ్చుగదా? ఎందుకు చేసుకోడు?).

**నా:** మహారాజా, అర్హతులకు అనునయం (attraction) ఉండదు. ప్రతిఘ (repugnance) ఉండదు. అపక్వాన్ని పడద్రోయరు. పరిపాకం (maturation) కోసం వేచియుంటారు. ఈ విషయాన్నే ధర్మసేనాపతియైన సారిపుత్రుడు కూడా ఇలా చెప్పినాడు:

**నాభినందామి మరణం నాభినందామి జీవితం**
**కాలం చ పటికంఖామి నిబ్బిసం భతకో యథా**
**నాభినందామి మరణం నాభినందామి జీవితం**
**కాలం చ పటికంఖామి సంపజానో పతిస్సతో**

మరణం త్వరగా రావాలనీ అపేక్షించను. జీవితం ఇంకా కొనసాగాలనీ అపేక్షించను. పని ముగించిన భృత్యుడు కూలిడబ్బులకోసం వేచియున్నట్లుగా నేను కూడా ఆ సమయం కోసం స్మృతిసంప్రజన్యములతో (mindfulness and awareness) వేచియుంటాను.

***గమనిక :–*** *మొదటి ముద్రణలోని వేదనా ప్రశ్నను ఈ చోట తీసివేయడం జరిగింది. కారణం ఉపమ అర్థం కానందువల్ల. "ఒక చేతిలో కాలిన ఇనుపగోళాన్ని మరో చేతిలో మంచుముద్దను..." అని ఉపమ మొదలయి విషయాన్ని జటిలం చేస్తుంది.*

*వేదన అంటే ఏమిటి? కాలికి ముల్లు గుచ్చుకొన్నప్పుడు ఏమయ్యింది? ముల్లు, స్పర్శేంద్రియం ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. వెంటనే ఆ సమాచారం మెదడుకు చేరింది. సమాచారం అందగానే మెదడులోని ఒక భాగంలో ఒక వికారం తలెత్తింది. ఆ వికారంనుండి (ఈ వికారానికే బౌద్ధంలో స్పర్శ అని నామకరణం. ఇది ఒక చైతసిక ధర్మం = mental state) బాధ అనబడే వేదన ఉత్పన్నమయ్యింది. వేదనతో బాటు "ఇది బాధ" అనే జ్ఞానమూ కలిగింది. జ్ఞానం అనేది తెలుసుకొనే పనిని చేసేటువంటి ఒక చిత్తవిశేషం. జ్ఞానం, జ్ఞేయం – ఈ రెండింటి మధ్య సాధారణంగా భిన్నత్వం ఉంటుంది. కానీ ఆత్మజ్ఞానంలో (self-consciousness) జ్ఞాన జ్ఞేయములు ఏకరూపంగా భాసిస్తాయి. "ఇది ఒక అద్భుతం. వివరించడానికి సాధ్యం కాని మహాద్భుతం" అని ఒక పాశ్చాత్య దార్శనికుడు ఆశ్చర్యం వ్యక్తం చేసినాడు. ఈ అద్భుతాన్ని వివరించేందుకు*

*బౌద్ధం చిత్తచైతసికములు సంప్రయుక్తములు* అంటుంది. తెలుసుకొనే జ్ఞానమూ తెలియబడే వేదన సంప్రయుక్తములు అంటే ఇవి విడివిడిగా ఉద్భవించవు, విడివిడిగా కొనసాగవు, విడివిడిగా అంతరించవు. రెండూ ఏకకాలంలో ఉద్భవిస్తాయి. రెండూ ఏకకాలంలో కొనసాగుతాయి, రెండూ ఏకకాలంలో అంతరిస్తాయి.*

*వేదనలు ఐదు రకాలు: సుఖం, దుఃఖం, సౌమమస్యం, దౌర్మనస్యం, ఉపేక్ష. సుఖదుఃఖాలు శరీరానికి సంబంధించిన వేదనలు. సౌమనస్య దౌర్మనస్యాలు మనస్సుకు సంబంధించిన వేదనలు. ఇవి జ్ఞేయములు అంటే తెలియబడేటివి. ఇక తెలుసుకొనే జ్ఞానం ఒక రకం కాదు. 89 రకాలు! కొన్ని కుశలములు (good), కొన్ని అకుశలములు (bad), కొన్ని అవ్యాకృతములు (neutral). వేదనలు చిత్తసంప్రయుక్తములు కనుక ఏ రకమైన చిత్తంతో సంప్రయుక్తమో ఆ అంటు వేదనకూ తగులుతుంది. కుశలచిత్తసంప్రయుక్తమైతే కుశలములు, అకుశలచిత్త సంప్రయుక్తంగా ఉంటే అకుశలములు, అవ్యాకృత చిత్త సంప్రయుక్తంగా ఉంటే, అవ్యాకృతములు అని వేదనలకూ ఆయా విశేషణాలు తగులుతాయి. వేదనల మీద ఇంత మీమాంస చేయకుండా నందునిలా వేదనల తీరుతెన్నులను అప్పటికప్పుడే గమనించడం చేస్తుంటే చాలు. అది వేదనానుపశ్యన అనబడే ధ్యానం అవుతుంది. నందుణ్ణి మెచ్చుకొంటూ భగవానుడు పలికిన వాక్యం:* ***విదితా ఇవ నందస్య కులపుత్రస్య వేదనా ఉత్పద్యతే, విదితా ఇవ తిష్ఠంతి, విదితా ఇవ అస్తం పరిక్షయం పర్యాదానం గచ్ఛంతి.***

*కులపుత్రుడు నందునిలో వేదనలు ఉత్పన్నమయినపుడు అవి అప్పటికప్పుడే తెలియబడుతూ ఉత్పన్నం అవుతాయి. అవి కొనసాగడం కూడా తెలియబడుతూ కొనసాగుతాయి. అవి అంతరించినపుడు తెలియబడుతూ అంతరిస్తాయి.*

## ఏకత్వం నానాత్వం

**మి:** భంతే నాగసేనా, జన్మను గ్రహించేది ఎవరు?

**నా:** నామరూపం (mind and matter) మహారాజా.

**మి:** ఈ నామరూపమే మళ్ళీ జన్మను పొందుతుందా?

**నా:** లేదు మహారాజా, ఈ నామరూపం ద్వారా కర్మలు** శోభనకర్మలు లేదా పాపకర్మలు చేయడం జరుగుతుంది. ఆ కర్మలవల్ల అన్యమైన నామరూపం ఏర్పడుతుంది.

---

* *ఆశ్రయసమత, ఆలంబనసమత, ఆకారసమత, కాలసమత, ద్రవ్యసమత కలిగియున్న చిత్తచైతసికములు సంప్రయుక్తములు అనబడుతాయి.*

** *మనోవాక్కాయకర్మలకు ప్రేరకమైయున్నట్టి చేతనకే (will) బౌద్ధంలో కర్మ అని పేరు.*

**మి:** ఈ నామరూపానికి భిన్నంగా అన్యనామరూపం జన్మను గ్రహించే పక్షంలో కర్మఫలం ఈ నామరూపానికి చెందనట్లేకదా!

**నా:** ఈ నామరూపానికి పునర్జన్మ లేని పక్షంలో కర్మఫలంనుండి నీవన్నట్లే విముక్తమయిపోతుంది కానీ ఇది పునర్జన్మ పొందుతుంది కనుక కర్మఫల అనుభవంనుండి తప్పించుకోజాలదు.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** ఒకడు వేరొకడికి చెందిన మామిడిచెట్టునుండి పండ్లను అపహరించాడు. ఆ చెట్టు యజమాని అతణ్ణి పట్టుకొని రాజు వద్దకు లాక్కొచ్చి "ఇతడు నా మామిడిపండ్లను దొంగిలించాడు. శిక్షించండి" అని విన్నవించాడు. ఆ పండ్లదొంగ రాజుతో "దేవా, నేనితని మామిడిపండ్లను అపహరించలేదు. ఇతను ఏ మామిడిచెట్టు విత్తును నాటినాడో ఆ మామిడిపండును నేను తాకలేదు. దానికి అన్యమైన పండ్లనే నేను తీసుకొన్నాను. కనుక నాకు శిక్ష వేయమని ఇతను మిమ్మల్ని కోరడం సరి కాదు" అన్నాడు. నీవేమంటావు? ఆ పురుషుడు దండనీయుడేనా?

**మి:** తప్పక దండనీయుడే అవుతాడు.

**నా:** దేనివల్ల?

**మి:** అతను ఎంతైనా చెప్పనీ. అతను దొంగిలించిన పండ్లకు కారణం ఆ చెట్టు యజమాని నాటిన మామిడివిత్తేకదా! కనుక అతను నిశ్చయంగా దండనీయుడే.

**నా:** అలాగే ఈ నామరూపం చేత కర్మలు – అవి శోభనకర్మలు కావచ్చు, పాపకములు కావచ్చు– జరుగుతాయి. ఆ కర్మలచే మరణానంతరం మరో నామరూపం రూపుదిద్దుకొంటుంది. కనుక కర్మలకు కర్త అయినవాడు వాటి పర్యవసానములనుండి తప్పుకోలేడు.

**మి:** భంతే, మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, ఒకానొకడు హేమంతరుతువు చలిని తట్టుకోలేక వెచ్చదనం కోసం పుల్లలు, పిడకలు, ఆకులు పోగుచేసి మండించి ఆ మంటతో చలి కాచుకొని తరువాత మంటను ఆర్పివేయకుండానే లేచి తనదారిన వెళ్ళిపోయాడు. ఆ మంట కాస్త విస్తరించి ప్రక్కపొలంలో కోతకు సిద్ధంగా ఉన్న మెట్టపైరును దగ్ధం చేసి వేసింది. ఆ పొలం యజమాని అక్కడ చలికాచుకొని వెళ్ళిపోయిన వాణ్ణి వెదకి పట్టుకొని రాజు వద్దకు లాక్కెళ్ళి "వీడు నా పొలంలోని పంటను దగ్ధం చేసివేశాడు" అని పిర్యాదు చేశాడు. "రాజా, నేను ఇతని పొలానికి నిప్పు పెట్టలేదు. చలికాచుకొనేందుకు నేను రాజేసిన

అగ్ని వేరు. ఇతని చేనును భస్మం చేసిన అగ్ని వేరు. కనుక ఇందులో నా తప్పిదం లేదు'' అన్నాడు ఆ చలికాచుకొన్నవాడు. మహారాజా, నీవేమంటావు? అతడు దండనీయుడైనా?

**మి:** దండనీయుడే భంతే.

**నా:** ఏ కారణం చేత?

**మి:** అగ్నిని రగిలించింది అతడు. ఆ అగ్నివల్ల తరువాత కలిగిన నష్టానికి అతడే బాధ్యుడు. కనుక దండనీయుడే.

**నా:** మహారాజా, అలాగే నామరూపం వల్ల కర్మలు- శోభనములు కావచ్చు, పాపకములు కావచ్చు- జరుగుతాయి. ఆ నామరూప మరణానంతరం ఆ కర్మల ఫలంగా మరొక నామరూపం ఉద్భవిస్తుంది. ఈ కొత్త నామరూపం "నేనేమీ పాపం చేయలేదు. నాకెందుకు ఈ బాధలు దాపురించాయి?" అని వాపోవడానికి ఆస్కారం లేదు. మునుపటి నామరూపం చేసుకొన్న కర్మఫలితంగా ఇది ఉద్భవించినది కనుక కర్మఫలం అనుభవించకతప్పదు!

**మి:** మరొక ఉపమద్వారా ఈ విషయాన్ని తేటతెల్లం చేయుము.

**నా:** మహారాజా, ఒకానొకడు ఒక బాలిక తండ్రికి కన్యాశుల్కం ఇచ్చి తన భార్యగా చేసుకొని "యుక్తవయస్సుకు వచ్చినపుడు తీసుకెళ్తాను. అంతవరకు మీవద్దనే ఉండనివ్వండి" అని ఒప్పందం చేసుకొని వెళ్ళిపోయాడు. కొన్నేండ్లకు ఆ బాలిక యుక్తవయస్కురాలయ్యింది. అప్పుడు మరొకడు ఆ బాలిక తండ్రికి కన్యాశుల్కం అడిగినంత ఇచ్చి తన ఊరికి తీసుకెళ్తుండగా ఆ విషయం తెలిసి మొదటివాడు పరుగుపరుగున వచ్చి రెండవవాణ్ని "ఓయీ పెద్దమనిషీ, నా భార్యను ఎందుకు తీసుకెళ్తున్నావు?" అని నిలదీశాడు. "నీ భార్యను నేను తీసుకెళ్ళడం లేదు. నీవు కన్యాశుల్కం ఇచ్చింది ఒక పసిపిల్లకు. ఆ పసిపిల్లను నేను తీసుకపోవడం లేదు. ఈ యువతికోసం కన్యాశుల్కం నేను చెల్లించాను. నీవు కాదు. నా దారికి అడ్డురాకు" అన్నాడు రెండవవాడు. "నా భార్య నా భార్య" అని వాదులాడుతూ న్యాయం చెప్పమని ఆ ఇరువురూ నీవద్దకు వస్తే ఎవరి వాదం న్యాయం అని తీర్పు చెబుతావు?

**మి:** మొదటివానిదే న్యాయం అని తీర్పు చెబుతాను.

**నా:** ఏ కారణం చేత?

**మి:** రెండవవాడు ఎన్నైనా చెప్పనీ అవన్నీ చెల్లని మాటలే అవుతాయి. ఆ బాలికయే యువతిగా పరిణమించింది.

**నా:** మహారాజా, అలాగే మరణించిన నామరూపం వేరు. ఉద్భవించిన నామరూపం వేరు. అయినప్పటికీ పూర్వనామరూపం చేసుకొన్న కర్మల వల్లనే తరువాతి నామరూపం ఉద్భవించింది కనుక కర్మఫలవారసత్వం అనుభవించక తప్పదు.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, ఒకానొకడు గోపాలకుని ఇంటికి వెళ్ళి ఒక ముంతడు పాలు కొనుక్కొని ఆ పాలముంతను మళ్ళీ గోపాలకుని చేతిలో ఉంచి "నీ వద్దనే ఉండనీ. రేపు ప్రొద్దున వచ్చి తీసుకొంటాను" అన్నాడు. మరునాడు ప్రొద్దున అతను గోపాలకుని వద్దకు వచ్చి "నా పాలముంత ఇవ్వుము" అన్నాడు. గోపాలకుడు ఆ ముంతను ఇచ్చాడు. "నేను నిన్న నీ వద్ద ఈ పెరుగు ముంతను కొనలేదు. నేను కొన్నట్టి పాలముంతను ఇవ్వుము" అన్నాడు. "నీ ముంతనే నేనిచ్చింది. వేరేది కాదు" అన్నాడు గోపాలకుడు. వీరిరువురు వాదులాటకు దిగి న్యాయం చెప్పమని నీవద్దకు వస్తే ఎవరి పక్షాన తీర్పు ఇస్తావు?

**మి:** గోపాలకుని పక్షంలోనే న్యాయం ఉందని చెబుతాను.

**నా:** ఏ కారణం చేత?

**మి:** పాలముంతను కొన్నవాడు ఎన్నైనా చెప్పనీ. అతని ముంతలోని పాలే తరువాత పెరుగయ్యింది.

**నా:** మహారాజా, అలాగే మారణాంతిక నామరూపం వేరు, ప్రతిసంధి* నామరూపం వేరు. అయినప్పటికీ మారణాంతిక నామరూప కారణంగానే ప్రతిసంధినామరూపం ఏర్పడడం జరిగింది.

## నామరూపములు

**మి:** భంతే నాగసేనా, నామరూపం అంటున్నావు. ఏది నామం? ఏది రూపం?

**నా:** ఏది ఔదారికమో (gross) అది రూపం.(దేహంలోని భౌతిక సముదాయం). ఏవి సూక్ష్మమైన చిత్తచైతసికములో (mind and mental states) అవి నామం.

**మి:** ఏ కారణం వల్ల కేవలం రూపం మాత్రమే, కేవలం నామం మాత్రమే పునర్జన్మ పొందవు?

**నా:** నామరూపములు పరస్పర ఆశ్రితములు కనుక అవి ఒకటిగానే ఉద్భవించడం జరుగుతుంది.

---

* *గతాన్ని వర్తమానంతో ముడివేసినందువల్ల దీనికి ప్రతిసంధిచిత్తం అని పేరు.*

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, కోడి గ్రుడ్డు పెట్టినపుడు కలలం (egg-shell) విడిగా, అండం (yalk) విడిగా ఉత్పన్నం కావు. ఈ రెండూ పరస్పర ఆశ్రితములుగానే ఉత్పన్నమవుతాయి. అలాగే నామరూపములున్నూ. అనాదికాలంగా జరుగుతున్న సృష్టిక్రమం ఇది.

## కాలం

**మి:** భంతే నాగసేనా, "దీర్ఘకాలం" అంటుంటావు. ఏమిటి "కాలం" అనేది?

**నా:** అతీతకాలం (past), అనాగతకాలం (future), ప్రత్యుత్పన్నకాలం(prasent).

**మి:** ఈ మూడు కాలాలు ఉన్నాయా(exist)?

**నా:** కొన్ని ఉన్నాయి. కొన్ని లేవు.

**మి:** ఏవి ఉన్నాయి? ఏవి లేవు?

**మి:** ఏవి అతీతములో, విగతములో (departed), నిరుద్ధములో (stopped), విపరిణతములో (changed) అవి లేవు. ఏవి ప్రత్యుత్పన్నములో (present) అవి ఉన్నాయి. అనాగతంలో (future) ఎప్పుడో ఒకప్పుడు ఫలాలను ఇవ్వబోయే కర్మలు ఏవియో అవి ఉన్నాయి. ఏవి పునర్జన్మకారకములో అవి ఉన్నాయి. ఏ సత్త్వులు (beings) మరణం చెంది మళ్లీ ఉద్భవిస్తారో వాళ్ళకు కాలం* ఉన్నది. ఏ సత్త్వులు పరినిర్వాణం చెందారో వారికి కాలం లేదు.

## ఆరంభం ఎక్కడ?

**మి:** భంతే నాగసేనా, "మొదలు తెలియబడడం లేదు" అన్నావు. ఉపమ ద్వారా తెలియజేయము.

---

** కాలసంబంధమైన పదాలు బౌద్ధంలో సంస్కృతములకే (products) చెల్లుబాటు అవుతాయి. ఏది ఉత్పన్నమై (having been produced) నిరుద్ధం అయినదో అది **అతీతం** (past). ఉదా॥ పేలిపోయిన టపాకాయ. ఏది ఉత్పన్నమై ఇంకా నిరుద్ధం కాకుండా ఉన్నదో అది **ప్రత్యుత్పన్నం** (present). ఉదా॥ పేలుతున్న టపాకాయ. అవశ్యం ఉత్పన్నం కాబోయేది **అనాగతం** (future). ఉదా॥ పేలబోయే టపాకాయ. ఉత్పత్తిమత్తుల (products) విషయంగానే గతం, వర్తమానం భవిష్యత్తు అనే వ్యవహారం. అనుత్పన్నములకు (non-products) గతం లేదు, వర్తమానం లేదు, భవిష్యత్తు లేదు. వైజ్ఞానికులు కొండల వయస్సు సూర్యచంద్రుల నక్షత్రాల వయస్సు కూడా ఏవో లెక్కలు వేసి చెబుతారు. కానీ ఎవరూ ఇంతవరకు ఆకాశం (space) వయస్సును లెక్కగట్టి చెప్పినట్లు లేదు. అది అసంస్కృతం (non-product) కనుక కుదరదు.*

**నా:** మహారాజా, ఒకానొకడు చిన్నవిత్తనాన్ని మట్టిలో చొప్పిస్తాడు. అది అంకురంగా తలెత్తి ఆపైన క్రమక్రమంగా వృద్ధి చెంది ఫలాన్ని ఇస్తుంది. ఆ ఫలంనుండి తీసిన గింజను మళ్ళీ భూమిలో పాతిపెడ్తాడు. అది మొలకెత్తి క్రమంగా వృద్ధి చెంది ఫలాన్ని ఇస్తుంది. విత్తనం ఫలం విత్తనం ఫలం–ఈ సంతతికి (series) అంతం (end) అనేది తెలియబడుతుందా?

**మి:** తెలియబడదు భంతే.

**నా:** మహారాజా, అలాగే ఆది (beginning) కూడా సంతతికి తెలియబడుటలేదు.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, కోడినుండి కోడిగ్రుడ్డు కలుగుతుంది. కోడిగ్రుడ్డునుండి కోడిపిల్ల జనిస్తుంది. కోడి→కోడిగ్రుడ్డు– ఈ సంతతికి (series) మొదలు తెలుస్తున్నదా? తుది తెలుస్తున్నదా? అలాగే ఈ సంసారప్రవాహానికి మొదలు తెలియడం లేదు.

**మి:** మరొక ఉపమ ద్వారా వివరించుము.

**నా:** (నాగసేనుడు భూమి మీద ఒక వృత్తాన్ని గీచి) మహారాజా, ఈ చక్రానికి తుది (end point) యున్నదా?

**మి:** లేదు.

**నా:** అలాగే మహారాజా, భగవానుడు ఈ చక్రములను చెప్పాడు. చక్షువును అపేక్షించి, రూపాన్ని అపేక్షించి చక్షుర్విజ్ఞానం ఉత్పన్నమవుతుంది. ఈ మూడింటి మిళనం వలన స్పర్శ ఉత్పన్నమవుతుంది. స్పర్శనుండి వేదన, వేదన వలన తృష్ణ, తృష్ణ వల్ల ఉపాదానం, ఉపాదానం వల్ల కర్మ, కర్మ వల్ల మళ్ళీ చక్షువు–ఈ సంతతికి తుది (end point) యున్నదా?

**మి:** లేదు భంతే.

**నా:** అలాగే తక్కిన ఇంద్రియములు, ఇంద్రియ విషయములు, ఇంద్రియ జ్ఞానముల విషయమూ.

శ్రోత్రమును అపేక్షించి శబ్దములను అపేక్షించి.....జిహ్వాను అపేక్షించి రసములను అపేక్షించి... ఘ్రాణమును అపేక్షించి గంధములను అపేక్షించి.... కాయేంద్రియాన్ని అపేక్షించి స్ప్రష్టవ్యములను అపేక్షించి.... మనస్సును అపేక్షించి ధమ్మములను* అపేక్షించి మనోవిజ్ఞానం, ఈ మూడింటి (ఇంద్రియ– విషయ– జ్ఞాన) సమ్మేళనం వల్ల

* *చూడుడు 57 వ పుట*

స్పర్శ, స్పర్శవల్ల వేదన, వేదనవల్ల తృష్ణ, తృష్ణవల్ల ఉపాదానం, ఉపాదానం వల్ల పునర్భవకారక కర్మలు, కర్మలవల్ల ప్రతిసంధిచిత్తం* (పునర్భవబీజం) – ఈ విధమైన సంతతికి అంతం ఉన్నదా?

**మి:** లేదు భంతే.

**నా:** మహారాజా, అలాగే కాలప్రవాహమునకు మొదలు అనేది తెలియబడుట లేదు.

## మార్పునుండి మార్పు

**మి:** భంతే నాగసేనా, భవమునకు (becoming) లోను కాకుండా జనించిన సంఖారములు (formations) ఏమైనా ఉన్నాయా?

**నా:** లేవు మహారాజా, భవమునకు లోనయే సంఖారములు ఉత్పన్నమవుతాయి.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** మహారాజా, ఇప్పుడు మనం ఉన్న ఈ భవనం భవమునకు లోను కాకుండా ఏర్పడినదా?

**మి:** లేదు భంతే, ఈ భవననిర్మాణానికి ఉపయోగించిన దారువులు అడవుల్లో చెట్లుగా ఉండినాయి. ఈ భవననిర్మాణానికి ఉపయోగించిన మృత్తిక భూమిలో ఉండినది. భవన నిర్మాణానికి పనిచేసిన స్త్రీపురుషుల ప్రయత్నం వల్ల ఆయా వస్తుసముదాయం ఈ భవనంగా ఏర్పడింది.

**నా:** అలాగే ఈ సంఖారములున్నూ. ఏది కూడా అభవంనుండి (static) ఉత్పన్నం కావు. భవంనుండియే (change) ఉత్పన్నం అవుతాయి.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, విత్తనాలను మొక్కలను భూమిలో పాతినపుడు అవి క్రమంగా ఆయా వృక్షాలుగా వృద్ధిచెంది పుష్పాలను ఫలాలను ఇస్తాయి. ఈ వృక్షములు ఏవి కూడా అభవంనుండి (static state) ఏర్పడినవి కావు. బీజావస్థనుండి అనుక్షణం జరిగే మార్పుల వల్లనే వృక్షం ఏర్పడుతుంది. అలాగే ఏ ఒక సంఖారమూ (formation) అభవంనుండి తటాలున ఊడిపడదు. భవం నుండియే (change / becoming) క్రమక్రమంగా ఉత్పన్నం అవుతాయి.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

---

* *చూడుడు 52 వ పుట*

**నా:** మహారాజా, మట్టినుండి కుమ్మరి నానా రకములైన మట్టిపాత్రలు- ప్రమిదలు, ముంతలు, మూకుళ్లు, కుండలు, బానలు వగైరా చేస్తాడు. ఇవేవీ అభవంనుండి తటాలున ఊడిపడవు. భవంనుండియే ఉత్పన్నం అవుతాయి. మహారాజా, అలాగే ఏ ఒక సంఖారమూ (product) అభవంనుండి తటాలున ఊడిపడదు. భవంనుండియే ఏర్పడుతాయి.

**మి:** మరొక ఉపమును చెప్పుము.

**నా:** మహారాజా, ఒక వీణకు పత్రం లేదు, తంత్రులు లేవు, చర్మఖండం లేదు, దోణి లేదు, పురుషప్రయత్నం లేదు. ఆ బోడివీణనుండి శబ్దం వెలువడుతుందా?

**మి:** వెలువడదు భంతే.

**నా:** పత్రం, తంత్రులు, చర్మఖండం, దోణి కలిగియున్న వీణకు పురుష ప్రయత్నం కూడా జతకూడితే వీణానాదం వెలువడుతుందికదా!

**మి:** అవును భంతే, వెలువడుతుంది.

**నా:** మహారాజా, అలాగే ఏ ఒక సంఖారమూ అభవంనుండి వెలువడదు. భవం నుండియే వెలువడుతుంది. (మరో రెండు ఉపమలు అరణి- నిప్పు, అద్దము- ప్రతిబింబము ఇవ్వబడినాయి).

## భోక్త

**మి:** భంతే నాగసేనా, అనుభవించే ఆత్మ ఉన్నదా? లేదా?

**నా:** అనుభవించే ఆత్మ అంటే ఏమిటి మహారాజా?

**మి:** లోపల ఉన్న జీవుడు కన్నుల ద్వారా రూపాలను చూస్తాడు. చెవుల ద్వారా శబ్దాలను వింటాడు. ముక్కు ద్వారా వాసనలను తెలుసుకొంటాడు. నాలుక ద్వారా రుచులను ఆస్వాదిస్తాడు. కాయం ద్వారా స్ప్రష్టవ్యములను స్పర్శిస్తాడు. మనస్సు ద్వారా ధమ్మములను* (mind objects) తెలుసుకొంటాడు. నేనిప్పుడు ఈ ప్రాసాదంలో ఉంటున్నాను. బైటకు చూడదలస్తే నా ఇష్టప్రకారం ఏ కిటికీ ద్వారా నైనా చూస్తాను. దక్షిణకిటికీ ద్వారా, ఉత్తరకిటికీ ద్వారా పడమటికిటికీ ద్వారా తూర్పుకిటికీ ద్వారా. అలాగే లోపల ఉన్న జీవుడు ఆయా ఇంద్రియాలు అనే కిటికీల ద్వారా బాహ్యంలోకి చూస్తాడు. ఇతడే వేదగు (experiencer) అని నేనంటాను.

---

* *'ధమ్మ' పదానికి అర్థాలు చాలానే ఉన్నాయి. సందర్భాన్నిబట్టి ఆయా అర్థాన్ని తెలుసుకోవడం ఏమంత కష్టంకాదు. ఇక్కడ ఆరవ ఇంద్రియమైన మనస్సుకు తెలిసేటివి అని అర్థం.*

**నా:** మహారాజా, ఐదు ద్వారాల గురించి చెబుతాను. మనస్సు పెట్టి జాగ్రత్తగా వినుము. ఈ భవనం కిటికీలు దేనినుండి చూసినా రూపాలే కనిపిస్తాయి. జీవునికి ఇంద్రియద్వారాలు కిటికీల వంటివి అయినచో శ్రోత్రేంద్రియం ద్వారా ఘ్రాణేంద్రియం ద్వారా, జిహ్వేంద్రియం ద్వారా, కాయేంద్రియం ద్వారానూ మనోఇంద్రియం ద్వారానూ రూపాలను జీవుడు గ్రహించగలగాలి. అలాగే శబ్దములను, స్పృష్టవ్యములను, వాసనలను, రుచులను, ధమ్మములను కూడా ఏ ఇంద్రియ కిటికీ ద్వారా అయినా జీవుడు గ్రహించగలగాలి.

**మి:** వీలు కాదు భంతే.

**నా:** మరియూ మహారాజా, ఈ ప్రాసాదంలోని కిటికీలను తొలగించివేసి చూస్తే బాహ్యంలోని రూపాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయికదా! అలాగే ఇంద్రియ ద్వారాలను తొలగించివేస్తే జీవుడికి ఆయా విషయాలు మరింత స్పష్టంగా తెలియాలికదా!

**మి:** అసలే తెలియవు భంతే!

**నా:** మహారాజా, ఈ దిన్నుడు ఈ ప్రాసాదంనుండి బైటకు వెళ్ళి ఆ బయలు ప్రదేశంలో నిలబడినాడనుకొనుము. అతని చర్య నీకు తెలుస్తుందా?

**మి:** తెలుస్తుంది.

**నా:** దిన్నుడు మళ్లీ ప్రసాదం లోపలికివచ్చి నీ ఎదుట నిలబడినాడనుకొనుము. నీకు తెలుస్తుందా?

**మి:** తెలుస్తుంది.

**నా:** అలాగే తినే పదార్థం నాలుకకు తగిలినపుడు జీవుడు దాని రుచిని– పులుపో, ఉప్పో, చేదో, కారమో, ఒగరో, తీపో తెలుసుకొంటాడుకదా!

**మి:** అవును తెలుసుకొంటాడు.

**నా:** అది లోపలికి వెళ్ళిపోయాక దాని రుచిని జీవుడు గ్రహిస్తాడా?

**మి:** గ్రహించలేడు. కానీ ఈ విషయం మీద నేను నీతో వాదించలేను కనుక వివరించి చెప్పుము.

**నా:** మహారాజా, చక్షువును అపేక్షించి, రూపమును అపేక్షించి చక్షుర్విజ్ఞానం (eye-consciousness) ఉత్పన్నమవుతుంది. చక్షుర్విజ్ఞానంతో బాటు స్పర్శ, వేదన, సంజ్ఞ, చేతన, ఏకాగ్రత, జీవితేంద్రియం (psychic life), మనసికారం కూడా సహజాతములుగా (co-nascent) ఉత్పన్నమవుతాయి. కనుక ఈ ధమ్మములు ఆయా హేతు ప్రత్యయముల వల్ల ఉత్పన్నమవుతాయి. ఇక్కడ వేదగు (experiencer) అయిన ఆత్మ తెలియబడుట లేదు.

## జ్ఞానేంద్రియాలు

**మి:** భంతే నాగసేనా, ఎక్కడ చక్షుర్విజ్ఞానం ఉత్పన్నమవుతుందో అక్కడ మనోవిజ్ఞానం కూడా ఉత్పన్నమవుతుందా?

**నా:** అవును మహారాజా, ఉత్పన్నమవుతుంది.

**మి:** మొదట చక్షుర్విజ్ఞానం ఆ పిమ్మట మనోవిజ్ఞానం ఉత్పన్నమవుతుందా? లేక ప్రథమం మనోవిజ్ఞానం ఆ తరువాత చక్షుర్వివిజ్ఞానమా?

**నా:** ప్రథమం చక్షుర్విజ్ఞానం, ఆ తరువాతనే మనోవిజ్ఞానం ఉత్పన్నమవుతుంది.

**మి:** చక్షుర్విజ్ఞానం మనోవిజ్ఞానాన్ని "నేను ఉత్పన్నమయిన సందర్భాల్లో నీవున్నూ నన్ను వెన్నంటి ఉత్పన్నమవుతూ ఉండు'' అని ఆజ్ఞాపిస్తుందా? లేక మనోవిజ్ఞానం చక్షుర్విజ్ఞానాన్ని "నీవు మొదట ఉత్పన్నం కమ్ము, పిమ్మట నేను ఉత్పన్న మవుతాను" అని ఆజ్ఞాపిస్తుందా?

**నా:** మహారాజా, ఆ రెంటి మధ్య మాటేలేమీ ఉండవు.

**మి:** మరి ఎట్లు నియతంగా చక్షుర్విజ్ఞానం వెన్నంటి మనోవిజ్ఞానం ఉత్పన్న మవుతుంది?

**నా:** నిమ్నత (slope, tendency) వల్ల, ద్వారత (door) వల్ల, క్షుణ్ణత (habit) వల్ల, సముదాచరితము (practice) వల్ల అలా జరుగుతుంది.

**మి:** ఉపమద్వారా నిమ్నతను వివరించుము.

**నా:** మహారాజా, వర్షం కురిసినపుడు ఆ నీళ్ళు ఎటు వెళ్తాయి?

**మి:** పల్లం వైపునకు వెళ్ళిపోతాయి.

**నా:** మళ్లీ వర్షం కురిసినపుడు ఆ నీళ్ళు ఎటు వెళ్తాయి?

**మి:** పూర్వపు వర్షం నీరు ఎలా పల్లం వైపునకు వెళ్లిందో అలానే తరువాతి వర్షం నీళ్ళూ వెళ్తాయి.

**నా:** మహారాజా, పూర్వపు వర్షం నీళ్ళు తరువాతి వర్షం నీళ్ళను "నేను ఎలా వెళ్ళానో నీవూ అలా వెళ్ళాలి" అని ఆజ్ఞాపిస్తుందా? లేదా తరువాతి వర్షపు నీరు పూర్వపు వర్షం నీటిని "నీవు ఎలా వెళ్తావో అలానే నేనూ వస్తాను" అంటుందా?

**మి:** వాటి మధ్య మాటలుండవు. పల్లం వైపునకు వెళ్ళడం మాత్రం చేస్తాయి.

**నా:** అలాగే మహారాజా, చక్షుర్విజ్ఞానం ఏ రూపాన్ని ఆశ్రయించి ఉత్పన్న మయ్యిందో దాన్ననుసరించి మనోవిజ్ఞానమూ ఉత్పన్నమవుతుంది.

**మి:** ద్వారతను ఉపమద్వారా వివరించుము.

**నా:** మహారాజా, ఒక రాజ్యం పొలిమేరలోని నగరం చుట్టూ ఉన్నట్టి ఎత్తైన ప్రాకారానికి ఒకే ద్వారం ఉన్నదనుకొనుము. ఆ నగరపౌరుడొకడు వెలుపలికి రాదలిస్తే ఎలా వస్తాడు?

**మి:** ఆ ఏకద్వారంనుండియే వెలుపలికి వస్తాడు.

**నా:** మరొక పురుషుడు వెలుపలికి రాదలిస్తే ఎలా వస్తాడు?

**మి:** ఆ ద్వారంనుండియే వెలుపలికి వస్తాడు.

**నా:** మహారాజా, మొదటి పురుషుడు రెండవ పురుషుణ్ణి "నేను ఎలా వెలుపలికి వెళ్తానో నీవు అలా వెళ్ళాలి" అని ఆజ్ఞాపిస్తాడా? లేదా రెండవ పురుషుడు మొదటివానితో "నీవు ఎలా వెలుపలికి వెళ్తావో నేనూ అలానే వెలుపలికి వస్తాను" అని చెబుతాడా?

**మి:** లేదు. వారి మధ్య ఆ విషయంగా ఎలాంటి మాటలూ ఉండవు. ద్వారం ఉంది కనుక ఆ ద్వారంనుండియే వెళ్ళడం చేస్తారు.

**నా:** అలాగే మహారాజా, చక్షుర్విజ్ఞానం ఏ ద్వారం ద్వారా ఉత్పన్నమయిందో ఆ ద్వారం ద్వారానే మనోవిజ్ఞానమూ ఉత్పన్నమవుతుంది.

**మి:** క్షుణ్ణతను (habit) ఉపమద్వారా తెలియజేయుము.

**నా:** మహారాజా, బండ్లు ఒకదాని వెనుక ఒకటి పోవడం చూశావుకదా! మొదటిబండి ఏ దారిలో పోతుందో అదే దారిలో రెండవబండీ పోతుందికదా! కానీ ఈ విషయంలో వాటి మధ్య పరస్పరం ఆజ్ఞలుగానీ మాటలుగానీ ఉండవు. అలాగే మనోవిజ్ఞానమూ క్షుణ్ణతను అనుసరిస్తుంది.

**మి:** సముదాచారమును (practice) ఉపమ ద్వారా తెలుపుము.

**నా:** మహారాజా, లెక్కించడం, లిఖించడం మొదలగు శిల్పస్థానములలో ఆదికర్మికుడు (beginner) తబ్బిబ్బవుతాడు కానీ వాటిని బాగా అభ్యసించాక చకచకా చేయగలుగుతాడు.

అలానే అభ్యాసవశం వల్ల చక్షుర్విజ్ఞానం ఎక్కడ ఉత్పన్నమయిందో అక్కడ మనోవిజ్ఞానమూ ఉత్పన్నమవుతుంది. ఆ రెండింటి మధ్య పరస్పరం మాటలు, ఆజ్ఞలు ఉండవు. ఇలాగే శ్రోత్రవిజ్ఞానం, ఘ్రాణ విజ్ఞానం, జిహ్వావిజ్ఞానం, కాయ(స్పర్శ) విజ్ఞానం విషయంలోనూ జరుగుతుంది.

## స్పర్శ

**మి:** భంతే నాగసేనా, మనోవిజ్ఞానం ఉత్పన్నం అయినపుడు స్పర్శ, వేదన కూడా ఉత్పన్నమవుతాయా?

**నా:** అవును మహారాజా, ఉత్పన్నమవుతాయి. స్పర్శ, వేదన, సంజ్ఞ (perception), చేతన(volition), వితర్కం (applied thought), విచారం(sustained thought) – ఈ ధర్మాలు కూడా ఉత్పన్నమవుతాయి. స్పర్శ ఉత్పన్నం కాగానే ఇవన్నీ ఉత్పన్నమవుతాయి.

**మి:** స్పర్శలక్షణం ఏమిటి?

**నా:** స్పర్శన (touch) లక్షణం మహారాజా స్పర్శ.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము,

**నా:** పొట్టేళ్ళయుద్ధం చూశావుకదా! ఒక పొట్టేలు చక్షువు. రెండవ పొట్టేలు రూపం. రెండు పొట్టేళ్ళు ఢీకొనడం స్పర్శ.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, అరచేతులను రెంటిని నమస్కార భంగిమలో జోడించడం జరుగుతుందికదా. ఒక అరచేయివలె చక్షువు, మరొక అరచేయివలె రూపము. రెండింటి సన్నికర్షను స్పర్శగా తెలియుము.

**మి:** మరొక ఉపమను చెప్పుము.

**నా:** భజన చేసేవాళ్ళు తాళాలు మ్రోగించడం చూశావుకదా. ఒక తాళం వలె చక్షువు, మరో తాళంవలె రూపము. రెండింటి సంఘట్టనవలె స్పర్శను తెలియుము.

## వేదన

**మి:** భంతే నాగసేనా, వేదనాలక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, అనుభవ (experiencing) లక్షణం కలిగినది వేదన.

**మి:** ఉపమ ద్వారా వివరించుము.

**నా:** ఒకానొక పురుషుడు రాచకార్యాన్ని చక్కగా నిర్వహించినాడు. రాజు అతని ఎడల తుష్టి చెంది అతనికి పెద్ద పదవి ఇచ్చినాడు. ఆ పదవి వల్ల అతడు కామగుణాలను (sense pleasures) అనుభవిస్తూ ఇలా అనుకొన్నాడు: "పూర్వం నేను రాచకార్యాన్ని చక్కగా చేసినందువల్ల ఇప్పుడు ఈ సుఖాలను అనుభవించ గలుగుచున్నాను". అలాగే వేదన కూడా అనుభవం లక్షణంగా కలిగినది.

## సంజ్ఞ*

**మి:** సంజ్ఞ (perception) లక్షణం ఏమిటి?

**నా:** సంజ్ఞానన (perceiving) లక్షణం సంజ్ఞ. ఇది నీలం, ఇది పసుపు, ఇది ఎరుపు– ఇలా గుర్తించడమే సంజ్ఞానన లక్షణం.

**మి:** ఉపమద్వారా తెలియజేయుము.

**నా:** రాజభాండాగారికుడు భాండాగారం ప్రవేశించి అక్కడి మణులు మాణిక్యాలను చూస్తూ ఇది నీలం, ఇది పసుపు, ఇది ఎరుపు, ఇది తెలుపు, ఇది ఊదా అని తెలుసుకొంటాడుకదా! అలానే సంజ్ఞ కూడా సంజ్ఞాననలక్షణం కలిగినట్టిది.

## చేతన

**మి:** భంతే నాగసేనా, చేతనా లక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, చేతయిత (willing) లక్షణం మరియూ అభిసంస్కరణ (రాశికరణం = పోగుచేయడం) లక్షణం చేతన.

**మి:** ఉపమ చెప్పుము.

**నా:** ఒకానొక పురుషుడు విషమును సిద్ధం చేసి తాను త్రాగడమో ఇతరులచేత త్రాగించడమో చేసినాడనుకొనుము. దాని వలన తానుగానీ ఇతరులుగానీ బాధకు లోను కావడం జరుగుతుందికదా! అలాగే పుద్గలుడు(person) చేతనద్వారా అకుశలకర్మలను మూటగట్టుకొని దుర్గతి పాలవుతాడు. అతణ్ణి అనుసరించిన ఇతరులు కూడా వారి వారి కర్మల వల్ల దుర్గతి పాలవుతారు.

## విజ్ఞానం

**మి:** భంతే నాగసేనా, విజ్ఞానలక్షణం ఏమిటి?

**నా:** తెలుసుకొనడం (cognition) అనేది విజ్ఞానలక్షణము.

**మి:** ఉపమద్వారా చెప్పుము.

**నా:** మహారాజా, నగర రక్షకభటుడు నగరం మధ్యలోని కూడలిలో ఆసీనుడై తూర్పునుండి వస్తున్న జనులను పడమటినుండి వస్తున్న జనులను ఉత్తరం, దక్షిణం దిశలనుండి వస్తున్న జనాన్ని గమనిస్తూ ఉంటాడు. అలాగే కన్నుల ద్వారా రూపాలను, చెవుల ద్వారా శబ్దాలను, ముక్కు ద్వారా గంధాలను, జిహ్వా ద్వారా రుచులను,

---

* *ఆయా ఇంద్రియాల ద్వారా ఆయా విషయాల ఆకారవిశేషాలు తెలియబడడం సంజ్ఞ అవుతుంది.*

కాయేంద్రియం ద్వారా స్పర్శలను మనస్సు ద్వారా ధర్మాలను (mind objects) విజ్ఞానం తెలుసుకొంటూ ఉంటుంది.

## వితర్కం*

**మి:** భంతే నాగసేనా, వితర్క (applied thought) లక్షణం ఏమిటి?

**నా:** అర్పణ (fixing) లక్షణం మహారాజా వితర్కం.

**మి:** ఉపమద్వారా చెప్పుము.

**నా:** మహారాజా వడ్రంగి, చెక్కను నునుపు చేసి ఎలా సంధిస్థానంలో ఉంచుతాడో అలాగే వితర్కం కూడా అర్పణా లక్షణం కలిగినట్టిది.

## విచారం

**మి:** భంతే నాగసేనా, విచారలక్షణం ఏమిటి?

**నా:** మహారాజా, అనుమజ్జన (constantly pondering) లక్షణం విచారం.

**మి:** ఉపమ కావాలి.

**నా:** గంటను కొట్టినప్పుడు ఆ ధ్వని కొంతసేపు కొనసాగుతుంది. మారుమ్రోగు తుంటుంది. వితర్కం అనేది కొట్టడం అయితే విచారం మారుమ్రోగడం అవుతుంది.

## విభజన సాధ్యమా?

**మి:** భంతే నాగసేనా, ఒక్కుమ్మడిగా ఉద్భవించే ఈ ధర్మాలను (mental states) విభజించి "ఇది స్పర్శ, ఇది వేదన, ఇది చేతన, ఇది విజ్ఞానం, ఇది వితర్కం, ఇది విచారం" అని తెలుసుకోవడం సాధ్యమా?

**నా:** సాధ్యం కాదు.

**మి:** ఉపమ చెప్పుము.

**నా:** మహారాజా, రాజుగారి వంటవాడు రసంగానీ పులుసుగానీ చేస్తూ అందులో కొంచెం పెరుగు, కొంచెం ఉప్పు, కొంత అల్లం, కొంచెం జీలకర్రపొడి, కొంత

---

* **"వితర్క్య విచార్య వాచం భాషతే నావితర్క్య నావిచార్య"** అని భగవానుని వాక్యం. మాటలు నోటినుండి పలికినా మనోజల్పంగా (మౌనభాషణం) లోపల కదలాడినా తత్పూర్వం తెర వెనుక చాలా తతంగం జరిగిందనే చెప్పాలి. వాగుత్పత్తి కోసం సూక్ష్మస్థాయిలో మనస్సులోతుల్లో జరిగే తతంగాన్ని విచారంగానూ స్థూలస్థాయిలో పైపొరల్లో జరిగే తతంగాన్ని వితర్కంగానూ చెప్పుకోవచ్చు. వితర్కవిచారములనబడేవి వాగుత్పత్తిని సాధ్యం చేసే చైతసిక ధర్మాలు. ఛప్పన్న (56) విషయాల గురించి కాకుండా ఈ కార్యకలాపం కేవలం ఆరమ్మణం (ధ్యానవిషయం = meditation subject) విషయంగానే కేంద్రీకృతం అయితే అది మొదటి ధ్యానం అవుతుంది. మొదటి ధ్యానం అంగములైన (factors) వితర్కవిచారముల లక్షణమే ఇక్కడ చెప్పబడింది.

మిరియాలపొడి ఇంకా ఇతర మసాలాలు కూడా వేసి వంట చేసి రాజు ముందు ఉంచుతాడు. రాజు ఇలా అంటాడనుకొనుము: "ఈ రసంలో కలిపిన పెరుగు వేరు చేసి నాకివ్వు, ఉప్పును వేరు చేసి నాకివ్వు, అల్లం వేరు చేసి ఇవ్వు, జీలకర్రపొడిని వేరు చేసి ఇవ్వు, మిరియాలపొడిని వేరు చేసి ఇవ్వు....." షడ్రసాలు ఒకటిగా కలిసిపోయిన ఆ మిశ్రమంనుండి రాజు కోరినట్లుగా వంటవాడు పులుపును, ఉప్పును, చేదును, కారమును, ఒగరును, తీపిని వేరు చేసి ఇవ్వగలడా?

**మి:** అది సాధ్యం కాదు భంతే.

**నా:** అలాగే మహారాజా, వివిధ ధర్మాలు ఆయా లక్షణాలతో విడిగా ఉన్నప్పటికీ కలిసి ఉద్భవించేవాటిని వేరు చేసి చూపడం సాధ్యం కాదు.

## నాగసేనప్రశ్న

**నా:** మహారాజా, లవణం (ఉప్పు) చక్షుర్విజ్ఞేయమేనా?

**మి:** అవును భంతే, లవణం చక్షుర్విజ్ఞేయమే.

**నా:** మహారాజా, బాగా తెలిసినవాడివిగా కనిపిస్తున్నావు.

**మి:** మరి అది జిహ్వావిజ్ఞేయమా?

**నా:** అవును మహారాజా, అది జిహ్వావిజ్ఞేయమే.

**మి:** మరి అన్ని రకాల లవణాలు జిహ్వావిజ్ఞేయములేనా?

**నా:** అవును అన్ని రకాల లవణాలు జిహ్వావిజ్ఞేయమే.

**మి:** జిహ్వచే అన్ని రకాల లవణాలు తెలియబడితే బండ్లలో ఆ తెల్లనివాటిని ఎద్దులు ఎందుకు లాక్కొని రావడం? జిహ్వావిజ్ఞేయమైన లవణాన్ని మాత్రమే లాక్కొని రావలెను.

**నా:** లవణం మాత్రమే తీసుకొని రావడం వీలు కాదు మహారాజా. లవణం అనబడే దానిలో జిహ్వావిజ్ఞేయమైన లవణరసమూ ఉంటుంది. చక్షుర్విజ్ఞేయమైన ధవళవర్ణమూ ఉంటుంది. స్పర్శవిజ్ఞేయమైన గురుత్వమూ (weight) ఉంటుంది. ఈ ధర్మాలు భిన్నభిన్నములైనప్పటికీ ఏకభావాన్ని కూడా పొందియుంటాయి. మహారాజా, లవణరసాన్ని (taste) తక్కెడలో తూచడం సాధ్యమా?

**మి:** సాధ్యమే.

**నా:** సాధ్యం కాదు మహారాజా. లవణరసాన్ని తూచలేము. లవణగురుత్వాన్నే (weight) తూచగలము.

**మి:** బాగా చెబితివి నాగసేనా.

## విమతిచ్ఛేదన ప్రశ్నలు

## (Questions for the cutting off of perplexity)

### పంచాయతనములు

**మి:** భంతే నాగసేనా, ఈ పంచాయతనములు (ఇంద్రియములు) ఏకకర్మ వల్ల ఉత్పన్నమయ్యాయా? లేక భిన్నభిన్న కర్మల వల్లనా?

**నా:** భిన్నభిన్న కర్మల వల్ల మహారాజా, ఏకకర్మ వల్ల కాదు.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** ఒక చేనిలో నానా రకాల విత్తనాలు చల్లినామనుకొనుము. ఆ విత్తనాలు మొలకెత్తి చెట్లయ్యాక అవి ఒకేరకమైన ఫలాలను ఇస్తాయా? లేక భిన్నభిన్నమైన ఫలాలనా?

**మి:** భిన్నభిన్నమైన ఫలాలనే ఇస్తాయి.

**నా:** అలాగే ఈ షడాయతనములు కూడా భిన్నభిన్న కర్మల వల్ల ఏర్పడినట్టివి. ఏకకర్మ వల్ల కాదు.

### అసమానతలు

**మి:** భంతే నాగసేనా, ఏ కారణం వల్ల మనుష్యుల్లో సమానత్వం లేదు? కొందరు అల్పాయుష్కులు, కొందరు దీర్ఘాయుష్కులు; కొందరు రోగులు, కొందరు ఆరోగ్యవంతులు; కొందరు కురూపులు, కొందరు సుందరులు; కొందరు అల్పేచ్ఛులు (చిన్నకోరికలున్నవారు); కొందరు మహేచ్ఛులు (పెద్ద పెద్ద కోరికలున్నవారు); కొందరు అల్పభోగులు, కొందరు మహాభోగులు; కొందరు కిందికులాలవారు, కొందరు పెద్దకులాలవారు; కొందరు మూర్ఖులు, కొందరు ప్రజ్ఞావంతులు. ఈ అసమానత దేనివల్ల?

**నా:** మహారాజా, వృక్షములు అన్నీ సమంగా ఎందుకు ఉండడం లేదు? కొన్ని పులుపు ఫలాలు ఇచ్చేవి, కొన్ని చేదు ఫలాలు ఇచ్చేవి, కొన్ని కారమైన ఫలాలు ఇచ్చేవి, కొన్ని వగరు ఫలాలను, కొన్ని మధుర ఫలాలను ఇచ్చేవిగా ఎందుకున్నాయి?

**మి:** విత్తనాలను బట్టి అవి వేరువేరుగా ఉన్నాయి.

**నా:** అలాగే మనుష్యులున్నూ. వారు చేసుకొన్న కర్మలు* భిన్నభిన్నంగా ఉండడం వల్ల వాళ్ళలో భిన్నత్వం వచ్చింది. కనుకనే మహారాజా, భగవానుడు ఇలా అన్నాడు: "మాణవకా(young man), సత్త్వులు (beings)కర్మను ఆస్తిగా కలిగియున్నారు, కర్మను వారసత్వంగా కలిగియున్నారు. కర్మ వల్ల ఉద్భవించిన వారుగా ఉన్నారు. కర్మను బంధువుగా కలిగియున్నారు. కర్మను శరణంగా కలిగియున్నారు. కర్మ వల్లనే సత్త్వులలో హెచ్చుతగ్గులు కలిగినాయి."

## ప్రయత్నం

**మి:** భంతే నాగసేనా, "ఈ దుఃఖాన్ని నిరోధించడానికి మళ్ళీ దుఃఖం ఉత్పన్నం కానీయకుండా చేయడానికి ప్రవ్రజ్య తీసుకొన్నాను" అని ఇంతకు ముందు నీవు చెప్పియున్నావు.

**నా:** అవును చెప్పాను.

**మి:** గతంలో జరిగిన కృషి చాలునా? లేక వర్తమానంలోనూ చేయాలా?

**నా:** గతంలో చేసిన కృషి వల్ల జరుగవలసినది జరిగిపోయింది. ఇక జరుగవలసిన దానికి వర్తమానంలో ప్రయత్నం అవసరం.

**మి:** ఉపమ చెప్పుము.

**నా:** మహారాజా, నీకు దప్పిక వేసినదనుకొనుము. నీళ్ళు త్రాగడం కోసం అప్పుడు బావి త్రవ్వుతావా? తటాకాన్ని త్రవ్వుతావా?

**మి:** లేదు.

**నా:** కనుక రాబోయే విపత్తును ఎదుర్కొనేందుకు ముందుచూపుతో ప్రయత్నం అవసరం. భగవానుడు కూడా ఈ విషయమై ఇలా పలికినాడు: "ముందుచూపు లేని ఒక శాకటికుడు(carter) చక్కని మహాపథాన్ని (highway) వదలి అడ్డదారిలో బండిని పోనిచ్చి ఆ గతుకుల దారిలో ఒకచోట ఇరుసు విరిగి బండి కూలిపోగా 'ఎందుకు ఈ దిక్కుమాలిన దారిలో వచ్చాను?' అని చాలా చింతించినాడు. సరియైన మార్గంలో జీవితరథాన్ని నడపనివాడు మరణసమయం దాపురించినపుడు శాకటికునిలా పశ్చాత్తాపంతో కుమిలిపోక తప్పదు."

* *కర్మ అనే పదం కనబడినప్పుడల్లా చేతన (will) అని అర్థం చేసుకొనవలెను.*

## నరకంలో

**మి:** భంతే నాగసేనా, మీరు ఇలా చెప్పియున్నారు: "స్వాభావికఅగ్ని కన్నా నైరయికాగ్ని మహా అభితాపతరంగా ఉంటుంది. స్వాభావికఅగ్నిలో చిన్న పాషాణతునకను వేసి ఒక దినమంతా కాల్చినా అది కరిగిపోదు. నైరయికాగ్నిలో గోపురం అంత పెద్దశిలను వేసిన క్షణంలోనే కరిగిపోతుంది" అని. దీనిని నేను నమ్మలేకున్నాను. మీరు మరొక మాట చెప్పియున్నారు. 'నరకాన్ని పొందిన జీవులు అనేక వేల సంవత్సరాలు నిరయంలో దహింపబడుచున్నప్పటికీ కరిగిపోరు. చెక్కుచెదరని శరీరాలతో బాధలు అనుభవిస్తూనే ఉంటారు". దీనిని కూడా నేను నమ్మలేకున్నాను.

**నా:** మహారాజా, ఆడమొసళ్ళు సింసుమారములు తాబేళ్ళు నెమళ్ళు పావురములు కర్కశమైన పాషాణములను గులకను మ్రింగుతుంటాయా?

**మి:** అవును భంతే. వాటిని అవి మ్రింగడం చేస్తుంటాయి.

**నా:** ఆ పాషాణతునకలు, గులక వాటి కడుపుల్లో కరిగిపోతాయా?

**మి:** అవును భంతే, అవి అక్కడ కరిగిపోతాయి.

**నా:** వాటి కడుపుల్లోని గర్భాలు కూడా కరిగిపోతాయా?

**మి:** లేదు భంతే.

**నా:** ఏ కారణం వల్ల?

**మి:** కర్మప్రభావం వల్ల వాటి గర్భములు కరిగిపోవని తలచుచున్నాను.

**నా:** మహారాజా, అలాగే నైరయికజీవుల యాతనాశరీరాలు కూడా కర్మప్రభావం వల్ల కరిగిపోవడం జరుగదు. ఈ విషయమై భగవానుడు కూడా ఇలా పలికియున్నాడు: "పాపకర్మలు క్షయం అయ్యేవరకు నరకజీవుల శరీరాలు నిలిచియేయుంటాయి".

**మి:** భంతే నాగసేనా, చాలా చక్కగా చెప్పావు.*

## పృథివికి ఆధారం

***మి:*** *భంతే నాగసేనా, మీరు ఇలా చెబుతుంటారు: 'ఈ మహాపృథివి ఉదకం ఆధారంగా నిలిచియున్నది. ఉదకం వాయువునందు ప్రతిష్ఠితమైయున్నది. వాయువు ఆకాశంలో ప్రతిష్ఠితము' అని. ఈ వాక్యాన్ని నేను నమ్మడం లేదు.*

---

* *ఈ చివరి వాక్యం ముందు మరికొన్ని ఉపమలు కూడా ఒకే తీరున చెప్పబడినాయి. మిలిందుడు "మళ్ళీ మరొక ఉపమ చెప్పుము. మళ్ళీ ఇంకొక ఉపమ చెప్పుము" అని రెట్టిస్తూ ఉపములు అడిగితే నాగసేనుడు ఉపమల మీద ఉపమలు చెప్పడం జరిగింది.*

*నాగసేనుడు ధమ్మకరణిలో* నీటిని నింపి రాజుకు చూపించి అతనికి నమ్మకం పుట్టించి ఇలా పలికినాడు: మహారాజా, ఈ ఉదకం ఎలా వాయువు చేత పట్టియుంచబడినదో అలానే పృథివికి ఆధారంగా ఉన్న ఉదకమూ వాయువును ఆధారంగా కలిగియున్నది.*

## నిరోధమే - నిర్వాణము

**మి:** భంతే నాగసేనా, నిర్వాణమనేది నిరోధమా(cessation)?

**నా:** అవును మహారాజా, నిరోధమే నిర్వాణము.

**మి:** ఎట్లు?

**నా:** బాలపృథక్జనులు ** బాహ్యాఆయతనాలను *** (outer sense bases), అధ్యాత్మికఆయతనాలను (inner sense bases) అభినందిస్తూ (rejoice), అభివదిస్తూ (approve) ఆసక్తి కలిగించుకొంటూ సంసారప్రవాహంలో కొట్టుకపోతుంటారు. వాళ్ళు జాతి, జరా, మరణ, శోక, పరిదేవ, దుఃఖ, దౌర్మనస్య, ఉపాయాసములనుండి విముక్తులు కాలేరని చెబుతాను. బుద్ధవచనాలు ఆలకించిన ఆర్యశ్రావకుడు బాహ్యాఆయతనాలను, అధ్యాత్మికఆయతనాలను అభినందించడు, అభివదించడు, తగులము చెందదు. దీనివల్ల అతనిలో తృష్ణ నిరోధింపబడుతుంది. తృష్ణానిరోధం వల్ల ఉపాదానం (clinging) నిరోధం చెందుతుంది. ఉపాదాననిరోధం వల్ల భవం (becoming) నిరోధం అవుతుంది. భవం శమించడం వల్ల పుట్టుక నిరోధం అవుతుంది. జన్మనిరోధం వల్ల జరా మరణ శోక పరిదేవ దుఃఖ దౌర్మనస్య ఉపాయాసములనెడు దుఃఖస్కంధము (రాశి) ఉపశమిస్తుంది. కనుక నిరోధమే (cessation) నిర్వాణం.

## నిర్వాణలాభం

**మి:** భంతే నాగసేనా, అందరూ నిర్వాణం చెందగలరా?

---

* *థెర్మామీటర్లో పాదరసం కొంత ఎత్తులో నిలచియుండేవిధంగా ధమ్మకరణి అనే ఒక ప్రత్యేకపాత్రలో నీళ్ళు కొంత ఎత్తులో నిలిచియుంటాయి.*

** *బాలుడు* = పుట్టుకతోనో మందబుద్ధిగా పుట్టినవాడు.
పృథక్జనుడు = ఆర్యసత్యముల సాక్షాత్కారం పొందనివాడు.

*** *రూపములు, శబ్దములు, గంధములు, రసములు, స్ప్రష్టవ్యములు- ఇవి బాహ్య ఆయతనాలు. చక్షురింద్రియం, శ్రోత్రేంద్రియం, ఘ్రాణేంద్రియం, జిహ్వేంద్రియం, కాయేంద్రియం -ఇవి అధ్యాత్మిక ఆయతనాలు. ఆయతనాలంటే జ్ఞానోత్పత్తికి ద్వారములని అర్థం.*

**నా:** లేదు మహారాజా, అందరూ నిర్వాణం చెందలేరు. ఎవడైతే సమ్యక్ ప్రతిపత్తి ద్వారా (right practice) తెలుసుకొనవలసినదాన్ని తెలుసుకొన్నాడో (దుఃఖసత్యం), తొలగించుకొనవలసినదాన్ని తొలగించుకొన్నాడో (సముదయసత్యం), భావన (develop) చేయవలసినదాన్ని భావన చేశాడో (మార్గసత్యం), సాక్షాత్కరించు కొనవలసినదాన్ని సాక్షాత్కరించుకొన్నాడో (నిరోధసత్యం) అతడే నిర్వాణం చెందుతాడు.

## నిర్వాణసుఖజ్ఞానం

**మి:** భంతే నాగసేనా, నిర్వాణం పొందనివాడు అది సుఖం అని తెలుసుకొనగలడా?

**నా:** తెలుసుకొనగలడు.

**మి:** ఎట్లు?

**నా:** కాళ్ళు చేతులు తెగనివాడు కాళ్ళు చేతులు తెగడం దుఃఖం అని తెలుసుకొంటాడా?

**మి:** తెలుసుకొంటాడు.

**నా:** ఎట్లు?

**మి:** కాళ్ళు చేతులు తెగినవాడు చేసే రోదనశబ్దం విన్నందువల్ల తెగడం దుఃఖం అని తెలుసుకొంటాడు.

**నా:** అలాగే నిర్వాణాన్ని సాక్షాత్కరించుకొన్నవాని మాటలను విని నిర్వాణం పొందనివాడు కూడా అది సుఖస్వరూపం అని తెలుసుకొంటాడు.

## లేదనవచ్చా?

**మి:** భంతే నాగసేనా, నీవు బుద్ధుణ్ణి చూశావా?

**నా:** లేదు మహారాజా.

**మి:** పోనీ, నీకు శిక్షణ ఇచ్చిన మీ ఆచార్యులు బుద్ధుణ్ణి చూశారా?

**నా:** చూడలేదు.

**మి:** కనుక బుద్ధుడు లేడు.

**నా:** మహారాజా, హిమాలయంలో ప్రవహించే ఊహానదిని నీవు చూశావా?

**మి:** నేను చూడలేదు.

**నా:** నీ తండ్రి దాన్ని చూశాడా?

**మి:** చూడలేదు.

**నా:** కనుక ఊహానది లేదని చెప్పవచ్చా?

**మి:** చెప్పకూడదు. నేను, నాతండ్రి చూడనంతమాత్రాన ఊహానది లేకుండా పోతుందా?

**నా:** అలాగే మహారాజా, నేను నా ఆచార్యులు చూడకపోయినా బుద్ధుడు ఉన్నాడు.

## అనుత్తరుడు

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు అనుత్తరుడా (unsurpassed)?

**నా:** అవును మహారాజా, బుద్ధుడు అనుత్తరుడు.

**మి:** బుద్ధుణ్ణి నీవు చూడలేదుకదా! అనుత్తరుడని ఎలా చెప్పగలవు?

**నా:** మహాసముద్రాన్ని ఇప్పటివరకు చూడనివాడు అది మహాంతము (vast), గంభీరము (deep), అప్రమేయము (immeasurable), అగాధము (unfathomable) అని, గంగ యమున అచిరావతి సరయూ మహా అనే పంచమహానదులు అందులో కలుస్తుంటాయని, అయినప్పటికీ దానికి తగ్గిపోవడం, నిండిపోవడం అనేది ఉండదని తెలిసియుంటాడా?

**మి:** అవును తెలసియుంటాడు.

**నా:** అలాగే నేను కూడా పరినిర్వాణస్థాయిని అందుకొన్న మహాశ్రావకులను (great disciples) చూసినవాడనై భగవానుడు అనుత్తరుడు అని తెలుసుకొన్నాను.

## అనుత్తరుడని ఎలా తెలియడం?

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు అనుత్తరుడు (unsurpassed) అని తెలుసుకొనడం సాధ్యపడుతుందా?

**నా:** సాధ్యమే.

**మి:** ఎట్లు సాధ్యపడుతుంది?

**నా:** మహారాజా, పూర్వం ఒకప్పుడు తిస్సస్థవిరుడు అనే పేరుతో ప్రసిద్ధుడైన లేఖాచార్యుడు (teacher of writing) ఉండినాడు. ఆయన గతించి చాలా ఏండ్లు గడిచాయి. ఆయన గురించి ఇప్పుడు కూడా ఎలా తెలియబడుచున్నది?

**మి:** ఆయన వ్రాసిన వ్రాతల వల్ల భంతే.

**నా:** అలాగే మహారాజా, ధమ్మమును ఎవరు దర్శించినారో వారు భగవానుణ్ణీ దర్శించినవారే అవుతారు.

**మి:** భంతే, బాగుగా చెప్పావు.

## ధర్మదర్శనం

**మి:** భంతే నాగసేనా, ధమ్మమును* నీవు దర్శించితివా?

**నా:** భగవానుడు బోధించిన ధమ్మమును మార్గదర్శకంగా (guide) తీసుకొని భగవానుడు విధించిన నియమాలను (discipline) పాటిస్తూ శిష్యులు యావజ్జీవం ప్రయత్నపరులుగా ఉండవలెను.

**మి:** భంతే, బాగుగా చెప్పినావు.

## జ్ఞాత, కర్త, భోక్త

**మి:** భంతే, నాగసేనా, తెలుసుకొనేవాడు అనుభవించేవాడు ఉన్నాడా?

**నా:** మహారాజా, పరమార్థదృష్టిలో వేదగు (experiencer) అనేవాడు లేడు.

**మి:** భంతే బాగుగా చెప్పినావు.

## సంక్రమణం ఉండదు

**మి:** భంతే నాగసేనా, సంక్రమణం** (transmigration) ఉండదు. కానీ పునర్జన్మ ఉంటుందంటారు. నిజమేనా?

**నా:** అవును మహారాజా, నిజమే. సంక్రమణం లేదు, కానీ పునర్భవం ఉంటుంది.

**మి:** ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** మహారాజా, ఒకానొక పురుషుడు ఒక దీపం ద్వారా మరో దీపాన్ని వెలిగిస్తాడు. ఇక్కడ మొదటి దీపం రెండో దీపంలోకి ప్రవేశించిందా?

**మి:** లేదు.

**నా:** అలాగే సంక్రమణం ఉండదు కానీ పునర్జన్మ ఉంటుంది.

**మి:** మరో ఉపమ చెప్పుము.

**నా:** మహారాజా, నీవు చిన్నవాడుగా ఉన్నప్పుడు శ్లోకాచార్యుని వద్ద శ్లోకాలు నేర్చుకొన్నావా?

---

** ఈ చిన్న పేరాలో ధమ్మశబ్దం రెండుసార్లు ప్రక్కప్రక్కనే ప్రయోగింపబడినాయి. మొదటి పదానికి నిర్వాణం అని అర్థం. రెండవ పదానికి ఉపదేశరాశి అని అర్థం.*

*** కోతి ఒక కొమ్మనుండి మరో కొమ్మకు దూకుతుంది. ఒక కొమ్మను వదలివేసి మరో కొమ్మను పట్టుకొంటుంది. కొమ్మలు మారాయి కానీ కొమ్మలను మార్చినట్టి కోతి ఒకటే. సంక్రమణం అంటే ఇదియే. సంక్రమణాన్ని బౌద్ధం అంగీకరించదు.*

**మి:** నేర్చుకొన్నాను.

**నా:** ఆ శ్లోకాలు ఆచార్యునినుండి నీలోకి ప్రవేశించాయా?

**మి:** లేదు, అవి నాలో ప్రవేశించలేదు. కానీ నేను శ్లోకాలు నేర్చుకోవడం జరిగింది.

**నా:** అలాగే సంక్రమణం (transmigration) లేదు కానీ ప్రతిసంధి (re-linking) ఉన్నది.

## అవశ్యమనుభోక్తవ్యం

**మి:** భంతే నాగసేనా, ఒక దేహం వదలి మరో దేహంలోకి సంక్రమణం సత్త్వునికి (being) ఉండదా?

**నా:** ఉండదు.

**మి:** సంక్రమణం లేని పక్షంలో పూర్వం చేసిన పాపకర్మల ఫలంనుండి సత్త్వుడు విముక్తుడయినట్లేకదా అగును.

**నా:** సత్త్వుడు పునర్జన్మ లేనివాడయితే కర్మఫలంనుండి విముక్తుడనియే చెప్పవచ్చు. పునర్జన్మ ఉన్నచో కర్మఫలంనుండి అతనికి విముక్తి లేదు.

**మి:** ఉపమ ద్వారా చెప్పుము.

**నా:** ఒకానొక పురుషుడు మరొకని మామిడిచెట్టునుండి మామిడిపండ్లను దొంగిలించినాడనుకొనుము. అతడు దండనీయుడేనా?

**మి:** తప్పక దండనీయుడే.

**నా:** తోటయజమాని ఏ పండులోని విత్తనాన్ని నాటినాడో ఆ పండును అతడు దొంగిలించలేదుకదా! ఎట్లు దండనీయుడు?

**మి:** నాటిన మామిడివిత్తును అపేక్షించియే (depending) దొంగిలింపబడిన మామిడిపండ్లు ఆత్మభావాన్ని (existence) పొందాయి కనుక అతడు దండనీయుడే.

**నా:** అలాగే ఒక నామరూపం (mind-body complex) ద్వారా చేసిన మంచిపని వల్లగానీ చెడ్డపని వల్లగానీ మరో నామరూపగ్రహణం ఉంటుంది, కనుక కర్మఫలములనుండి సత్త్వునికి విముక్తి లేదు.

## కర్మఫలం ఉందా?

**మి:** భంతే నాగసేనా, ఈ నామరూపం చేత కర్మలు కుశలములుగానీ అకుశలములు గానీ చేయబడినాయి. ఆ కర్మలు ఎక్కడ నిలిచియున్నాయి?

**నా:** మహారాజా, ఆ కర్మలు నామరూపాన్ని నీడలాగా* వెన్నంటి ఉంటాయి.

**మి:** ఆ కర్మలను "ఇవిగో ఇక్కడున్నాయి, అవిగో అక్కడున్నాయి" అని చూపించడం వీలవుతుందా?

**నా:** వీలుపడదు.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** ఇంకా కాపునకు రాని ఆ చెట్లను చూసి "పండ్లు ఇక్కడున్నాయి అక్కడున్నాయి" అని చెప్పడం వీలవుతుందా?

**మి:** వీలు కాదు.

**నా:** అలాగే కర్మల విషయమూ.

## మరణం తరువాత ఏమిటి?

**మి:** భంతే నాగసేనా, జన్మించబోయేవాడు తాను జన్మించబోవుచున్నట్లుగా తెలియునా?

**నా:** అవును మహారాజా, జన్మించబోవువాడు తాను జన్మించబోవునట్లుగా** తెలియును.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, కర్షకుడు విత్తనాలను పొలంలో చల్లినాడు. ఆపైన సకాలంలో వర్షం బాగా పడినపుడు "పంటలు బాగా పండుతాయి" అని తెలియునా?

**మి:** అవును భంతే, తెలియును.

**నా:** మహారాజా, అలాగే జన్మించబోవువాడు తాను జన్మిస్తున్నానని తెలియును.

**మి:** బాగుగా చెప్పినావు.

## బుద్ధుడున్నాడా?

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు ఉన్నాడా?

**నా:** అవును మహారాజా, భగవానుడు ఉన్నాడు.

---

** మంచికర్మగానీ చెడుకర్మగానీ చిత్తం మీద ముద్ర వేసియే తీరుతుంది. కర్మల వల్ల పడే ఈ ముద్రలు కంటికి కనిపించే ముద్రలు కావు. కనుక వీటికి అవిజ్ఞప్తులు అని పేరు. కర్మవాసనలు అని కూడా చెప్పవచ్చు.*

*** "ఇంకా కావాలా? వద్దా?" అనే ప్రశ్న మరణానంతరం ప్రతిఒక్కరికీ ఎదురవుతుందని ఒక పాశ్చాత్య దార్శనికుడు గమ్మత్తుగా చెప్పినాడు. "చాలు ఇక వద్దనేవద్దు" అన్నవాడు నిరుపధిశేషనిర్వాణధాతువులో (noumenon) కలిసిపోతాడు. "ఇంకా కావాలి" అన్నవాడికి రారమ్మని ఇంద్రియగోచరజగత్తు (phenomenon) స్వాగతం పలుకుతుంది.*

**మి:** "బుద్ధుడు ఇక్కడున్నాడు అక్కడున్నాడు" అని చూపించి చెప్పడం సాధ్యమా?

**నా:** మహారాజా, బుద్ధుడు అనుపధిశేషనిర్వాణధాతువును చెందినాడు కనుక ఇక్కడున్నాడు అక్కడున్నాడు అని చూపించి చెప్పడం సాధ్యం కాదు.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** గొప్ప అగ్నిస్కంధము (great mass of fire) జ్వలిస్తూ ఇంధనం అయిపోగానే ఆరిపోతుంది. నీవేమనుకొంటున్నావు? ఆ జ్వాల ఇక్కడున్నది అక్కడున్నది అని చూపించి చెప్పడం సాధ్యమా?

**మి:** సాధ్యం కాదు భంతే. ఆ అర్చి (flame) నిరుద్ధమయ్యింది (ceased), అస్తంగతమయ్యింది (vanished).

**నా:** అలాగే మహారాజా, నిరుపధిశేషనిర్వాణధాతువును చెందిన భగవానుణ్ణి ఇక్కడ అక్కడ అని చూపి చెప్పడం సాధ్యం కాదు. కానీ ధర్మకాయం ద్వారా భగవానుణ్ణి సూచించడం వీలవుతుంది. భగవానుడు ఉపదేశించిన వాక్యసముదాయమే ధర్మకాయం.

## దేహం ప్రియమా?

**మి:** భంతే నాగసేనా, పరివ్రాజకులకు తమ దేహం ప్రియంగా ఉంటుందా?

**నా:** పరివ్రాజకులకు దేహం ప్రియంగా ఉండదు.

**మి:** అయితే మరి మీ పరివ్రాజకులు దేహానికి మంచి రక్షణ, పోషణలు ఎందుకు చేసుకొంటుంటారు?

**నా:** మహారాజా, యుద్ధభూమిలో నీకు ఎప్పుడైనా బాణం దెబ్బలు తగిలాయా?

**మి:** అవును తగిలాయి.

**నా:** మరి ఆ గాయానికి మందు పూసి తైలం మర్దించి మృదువైన వస్త్రంతో కట్టు కట్టుకోలేదా?

**మి:** అవును భంతే, అలానే చేశాను.

**నా:** ఆ వ్రణం అంటే నీకంత ఇష్టంగా ఉండినదా? లేహ్యంపూతలు, తైలమర్దనాలు, మృదువస్త్రాలకట్లు- ఇంత చేశావుకదా!

**మి:** వ్రణం అంటే నాకేమీ ఇష్టం కాదు. గాయం వల్ల నష్టపోయిన మాంసం మళ్ళీ ఆ భాగంలో ఏర్పడేందుకే ఆ చికిత్సలు చేసుకొన్నాను.

**నా:** అలాగే పరివ్రాజకులకు దేహం పట్ల ప్రియం ఉండదు. కానీ బ్రహ్మచర్య జీవితానికి (holy life) సహాయపడే సాధనంగా దేహాన్ని కాపాడుకొంటారు, పోషించుకొంటారు.

దానిపట్ల ఆసక్తి పెంచుకోరు. మహారాజా, భగవానుడు ఈ దేహాన్ని వ్రణంతో పోల్చియున్నాడు.

**అల్లచమ్మప్పటిచ్ఛన్నో నవద్వారో మహావణో***
**సమంతతో పగ్ఘరతి అసుచి పూతిగంధియో**

## సర్వజ్ఞభావం

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు సర్వజ్ఞుడు, సర్వదర్శియేనా?

**నా:** అవును మహారాజా, బుద్ధుడు సర్వజ్ఞుడు, సర్వదర్శి.

**మి:** మరి ఆయన శ్రావకులకు శిక్షాపదాలను (rules of training) అన్నీ ఒక్క సారిగా విధించకుండా అప్పుడొకటి అప్పుడొకటిగా ఎందుకు విధిస్తూ వచ్చాడు?

**నా:** మహారాజా, ఈ పృథివిలో లభిస్తున్న అన్ని ఔషధాలను తెలిసియున్న వైద్యుడు ఎవరైనా నీవద్ద ఉన్నాడా?

**మి:** ఉన్నాడు భంతే.

**నా:** రోగం ప్రాప్తించినపుడు అతడు ఔషధం త్రాగమని ఇస్తాడా? రోగం లేనప్పుడు కూడా ఇస్తాడా?

**మి:** రోగం ప్రాప్తించినపుడే దానికి సరిపడే ఔషధం త్రాగమని ఇస్తాడు.

**నా:** అలాగే సర్వజ్ఞుడు, సర్వదర్శి అయిన బుద్ధుడు కూడా ఏ సమయంలో ఏ శిక్షాపదం విధించాలో విధిస్తూ వచ్చాడు. సమయం కాని సమయంలో శిక్షాపదం చెప్పలేదు. బుద్ధుడు అలా క్రమంగా విధించిన శిక్షాపదాలన్నీ భిక్షువులకు జీవితపర్యంతం అతిక్రమించరానివి అయ్యాయి.

## మహాపురుషలక్షణములు**

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు ముప్పైరెండు మహాపురుషలక్షణాలతోనూ ఎనభై అనువ్యంజనాలతోనూ (ఉపలక్షణాలతో) శోభించియుండెనా? సువర్ణమైన దేహఛాయతో విరాజిల్లియుండెనా? ఆరు అడుగుల మేర విస్తరించిన కాంతి పుంజంతో (వ్యామప్రభ) సదా పరివృతశరీరుడైయుండెనా?

---

* *A tumour, where nine holes abide*
*Wrapped in a coat of clammy hide*
*And trickling filth on every side*
*Polluting the air with stenches far and wide*

** *చూడుడు అనుబంధం – 2*

**నా:** అవును మహారాజా, బుద్ధభగవానుడు ముప్పైరెండు మహాపురుషలక్షణాలతో ఎనభై అనువ్యంజనాలతో శోభించియుండెను. సువర్ణవర్ణమైన దేహఛాయతో విరాజిల్లుచుండెను. ఆరు అడుగుల మేర విస్తరించిన కాంతిపుంజంతో సదా పరివృతశరీరుడైయుండెను.

**మి:** అలా అయితే భగవానుని మాతాపితరులు కూడా ఈ దివ్యలక్షణాలతో శోభించియుండినారని చెబుతాను.

**నా:** భగవానుని మాతాపితరులు ఈ దివ్యలక్షణాలు కలిగియుండలేదు.

**మి:** అలా అయితే బుద్ధుడు కూడా ఈ దివ్యలక్షణాలు కలిగియుండలేదని చెప్పవలసియుంటుంది. తల్లిపోలికతోనో తల్లిపక్షీయుల పోలికతోనో లేదా తండ్రి పోలికతోనో తండ్రిపక్షీయుల పోలికతోనో పిల్లలు పుడతారుకదా!

**నా:** శతపత్రములు కలిగిన తామరపుష్పం ఉందా?

**మి:** ఉంది భంతే.

**నా:** అవి ఎక్కడ ఉద్భవిస్తాయి?

**మి:** బురదలో పుట్టాయి. నీటిలో పెరుగుతాయి.

**నా:** ఆ తామరపుష్పం ఆకారంలో రంగులో గంధంలో రసంలో బురదతో సమానమా?

**మి:** కాదు భంతే.

**నా:** ఆ తామరపుష్పం ఆకారంలో రంగులో గంధంలో రసంలో నీటితో సమానమా?

**మి:** కాదు భంతే.

**నా:** మహారాజా, అలాగే బుద్ధభగవానుడు దివ్యలక్షణశోభితుడుగా ఉండినప్పటికీ ఆయన మాతాపితరులు ఆ దివ్యలక్షణాలు కలిగియుండలేదు.

**మి:** లెస్సగా పలికితివి.

## బ్రహ్మచారి

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు బ్రహ్మచారియేనా?

**నా:** అవును బ్రహ్మచారియే.

**మి:** కనుక బుద్ధుడు బ్రహ్మదేవుని శిష్యుడు!

**నా:** మహారాజా, మీ గజశాలలో పట్టపుటేనుగు ఉన్నదా?

**మి:** ఉన్నది.

**నా:** ఆ ఏనుగు అప్పుడప్పుడు క్రౌంచనాదం (ఏనుగు చేసే ఘీంకారం) చేస్తుందా?

**మి:** అవును. అప్పుడప్పుడు క్రౌంచనాదం చేస్తూనే ఉంటుంది.

**నా:** కనుక అది క్రౌంచపక్షిశిష్యుడు

**మి:** కాదు కాదు భంతే.

**నా:** మహారాజా, బ్రహ్మదేవుడు సబుద్ధికుడా? అబుద్ధికుడా?

**మి:** సబుద్ధికుడు.

**నా:** సబుద్ధికుడు కనుక బ్రహ్మ, బుద్ధుని శిష్యుడు.

**మి:** వాదంలో గెట్టివాడవు నాగసేనా!

## ఉపసంపద

**మి:** భంతే నాగసేనా, ఉపసంపద* (భిక్షుదీక్ష) సుందరమేనా (good)?

**నా:** అవును, ఉపసంపద సుందరమే.

**మి:** బుద్ధభగవానుడు ఉపసంపద పొందియుండెనా? పొందియుండలేదా?

**నా:** భగవానుడు ఉపసంపన్నుడే. బోధివృక్షమూలంలో సర్వజ్ఞజ్ఞానంతో బాటుగా ఉపసంపదయూ భగవానునికి సంక్రమించినది. శ్రావకులలాగా అన్యులనుండి పొందినది కాదు.

## కన్నీళ్ళు

**మి:** భంతే నాగసేనా, తన తల్లి మరణించిందని ఒక వ్యక్తి రోదిస్తాడు. ఏకధారగా కన్నీరు కారుస్తాడు. ధమ్మప్రేమ ఉప్పొంగిన ఉద్వేగంతో ఒకడు జలజల కన్నీళ్ళు

---

** ఉపసంపద సుందరమే. జీవితం అనే శిక్షణాలయం బోధించే పాఠాలనుండి ఈ ఉపసంపద పొందితే ఇంకా సుందరంగా ఉంటుంది. (ఉదా॥ Raymond Lull). లల్‌గారికి కలిగిన షాక్ చాలా బలమైన షాక్. కనుక ఆయన జీవితం ట్రాక్ మారడంలో ఆశ్చర్యం లేదు. మహదేవభూపతియే ఆశ్చర్యం! ఒకే ఒక వెంట్రుక ఆయన ట్రాక్‌ని మార్చివేసింది!*

*మధ్యవయస్కుడైన మహదేవభూపతి ఒక దినం అద్దం ముందు నిలబడి ప్రతిబింబాన్ని చూసుకొంటుండగా తలవెంట్రుకల్లో ఒక వెంట్రుక నెరసియుండడం కనిపించింది. "ఈ దూత (messenger= వార్ధక్యం త్వరలో రాబోతుందని హెచ్చరించడానికి వచ్చిన దూత) ఎప్పుడు వచ్చాడు? నేనిప్పుడే గమనిస్తున్నాను" అనుకొని ఆ వెంట్రుకను ఊడబెరికి అపురూపమైన వస్తువులాగా దాన్ని భద్రంగా చేతిలో ఉంచుకొని ఏకాంతస్థలానికి వెళ్ళి ఇలా చింతన చేశాడు: "ఏమరుపాటుగా ఇన్నాళ్ళు జీవించాను. జీవితం ఒక అంధకారంగా గడిచిపోయింది. వెనక్కి తిరిగి చూసుకొంటే అంతా ఒక కలలాగా అనిపిస్తున్నది. ఇక మేల్కొనకపోతే శేషించి యున్న ఆయుష్షు కూడా ఒక కలగా ఒక అంధకారంగా ఆవిరైపోతుంది..." ఇలా చింతన చాలా చేసి సంవేగాన్ని పెంచుకొని విరక్తుడై రాజ్యాన్ని తృణప్రాయంగా త్యజించి వనవాసి అయినాడు.*

కారుస్తాడు. ఈ ఇరువురి కన్నీళ్ళలో ఎవరి కన్నీళ్ళు ఆ వ్యక్తికి ఔషధంలాంటిది. ఎవరిది ఔషధం కానట్టిది?

**నా:** నీవు తెలిపిన ఇరువురిలో ఒకని కన్నీళ్ళు రాగద్వేషమోహములతో కలుషితం మరియూ ఉష్ణం. మరొకనిది ప్రీతిసౌమనస్యములచే విమలం మరియు శీతలం. ఏది శీతలమో అది భైషజ్యం. ఏది ఉష్ణమో అది భైషజ్యం కాదు.

**మి:** బాగుగా చెప్పినావు.

## రాగవిరాగములు

**మి:** భంతే నాగసేనా, సరాగుడుకి వీతరాగుడుకి మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి?

**నా:** ఒకనికి తగులము ఉంటుంది. మరొకనికి ఉండదు.

**మి:** తగులము ఉండడం ఉండకపోవడం ఏమిటి?

**నా:** అర్థికుడుగా (desirous) ఉండడము, అనర్థికుడుగా (not desirous) ఉండడము.

**మి:** నేను చూస్తుంటాను, సరాగుడైనా సరే వీతరాగుడైనా సరే మంచి ఖాదనీయ భోజనీయ పదార్థాలను (hard and soft food) తినాలనుకొంటాడు. నాసిరకం తినాలనుకోడు. సరాగుడికి వీతరాగుడికి ఏమిటి వ్యత్యాసం?

**నా:** మహారాజా, వీతరాగుడు భుజించేటప్పుడు భోజనపదార్థముల రుచులను చక్కగా గుర్తిస్తూ భుజిస్తాడు కానీ రుచులయందు రాగమును తలెత్తనీయడు. సరాగుడు రుచులను తెలియడంతోబాటు వాటియందు రాగాన్ని కలిగించు కొంటుంటాడు.

## సంసారం

**మి:** భంతే నాగసేనా, సంసారం అనే పదం ఇంతకు ముందు పలికావు. ఆ సంసారం ఏమిటి?

**నా:** ఇక్కడ జనించింది ఇక్కడే మరణిస్తుంది. ఇక్కడ మరణించింది ఇతరత్ర మళ్ళీ జనిస్తుంది. అక్కడ మళ్లీ మరణించి అన్యత్ర జనిస్తుంది. ఈ జనన మరణ ప్రవాహమే సంసారం అనబడుతుంది.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** ఒకడు బాగా మాగిన మామిడిపండును తిని ఆ ముట్టెను భూమిలో పాతాడు. అది మొలకెత్తి క్రమంగా పెద్దదయి పండ్లు పండాయి. ఆ చెట్టు పండును మరొకడు తిని ఆ ముట్టెను మరో చోట నాటాడు. దానినుండి మళ్ళీ చెట్టు వచ్చింది. జననమరణచక్రం కూడా ఇలానే.

## జ్ఞాపకాలు

**మి:** భంతే నాగసేనా, చాలా కాలం క్రిందట చేసినదాన్ని మళ్ళీ జ్ఞప్తికి తెచ్చుకోవడం అనేది దేనివల్ల జరుగుతుంది?

**నా:** స్మృతి వల్ల మహారాజా.

**మి:** చిత్తం వల్లనే జ్ఞప్తి కలుగుతుంది స్మృతి* వల్ల కాదు అని ఎందుకు చెప్పరాదు?

**నా:** మహారాజా, గతంలో నీవు చేసిన ఏదేని పనిని తరువాత మరచిపోవడం జరిగిందా?

**మి:** అవును.

**నా:** మరి ఆ పని జరిగిన సమయంలో నీవు అచిత్తకుడుగా (without a mind) ఉంటివా?

**మి:** లేదు. కానీ ఆ సమయంలో స్మృతి కలిగియుండలేదు. కనుకనే ఆ సంఘటనను మరచిపోవడం జరిగింది.

**నా:** మరి జ్ఞప్తికి రావడం అనేది చిత్తం వల్లనే, స్మృతి వల్ల కాదని ఎందుకు చెప్పావు?

**మి:** బలే నాగసేనా.

## స్మృతులు

**మి:** భంతే నాగసేనా, స్మృతి అనబడేది సహజసిద్ధంగా ఉన్నట్టిదా లేక యత్నపూర్వకంగా సంపాయించవలసినట్టిదా?

**నా:** సహజసిద్ధంగానూ ఉన్నట్టిది. యత్నపూర్వకంగానూ సంపాయించవలసినట్టిది.

**మి:** సహజసిద్ధంగా ఉన్నట్టిదైతే యత్నపూర్వకస్మృతి లేనట్లేకదా.

**నా:** యత్నపూర్వకస్మృతి లేని పక్షంలో వివిధ కళలు, కౌశలాలు, విద్యలు, వీటిని నేర్పే ఆచార్యులు, నేర్చుకొనే అంతేవాసులు ఉండే అవకాశమే ఉండదు. కనుక యత్నపూర్వకస్మృతి కూడా ఉన్నది.

**మి:** బాగు బాగు నాగసేనా.

## జ్ఞాపకాలు ఎలా వస్తాయి?

**మి:** భంతే నాగసేనా, స్మృతి ఎన్నివిధాలుగా ఉత్పన్నం అవుతుంది?

---

** నామం, చిత్తం, మనస్సు, విజ్ఞానం – అని పదాలను ఏకవచనంలో ప్రయోగించినా ఈ పదాలు దేన్ని సూచించడానికి ప్రయోగించడం జరిగిందో అది ఏకవస్తువు కాదు. యాభై అరభై చిత్తధర్మాల గుంపు. అందులో స్మృతి అనబడేది కూడా ఒకటి.*

**నా:** పదిహేడు విధాలుగా మహారాజా.

**మి:** అవి ఏవి?

**నా:** 1. అభిజ్ఞ(higher faculty) ద్వారా. ఆయుష్మాన్ ఆనందుడు, ఉపాసిక కుబ్జుత్తర, మరికొందరు కూడా జాతిస్మరులున్నారు. వీరందరూ అభిజ్ఞ ద్వారానే గతజన్మల విషయం కూడా స్మరించగలిగారు. 2. సంకేతాల వల్ల. మతిమరుపు మనిషి వస్త్రానికి ముడివేయడం లాంటి ఉపాయాల వల్లనూ, 3. గొప్ప సంఘటన ప్రభావం వల్ల. రాజుగా ఉన్నవాడు తన రాజ్యాభిషేకదినాన్ని ఎన్నటికీ మరవడు. 4. మిక్కిలి సుఖాన్ని కలిగించిన ఘటనలూ మరపునకు రావు. 5. మిక్కిలి దుఃఖాన్ని కలిగించిన ఘటనలూ మరపునకు రావు. 6. పోలిక వల్ల. ఎవరో అపరిచితవ్యక్తిని చూసి ఆ పోలికలున్న తల్లినో, అన్ననో, అక్కనో మామనో స్మరించడం. లేదా ఎక్కడో ఒంటెనుగానీ ఎద్దునుగానీ గాడిదనుగానీ చూసి తన ఇంటిలో ఉన్న ఆ జాతి జంతువులను జ్ఞప్తికి తెచ్చుకోవడం. 7. విసభాగనిమిత్తం (dissimilar appearance) వల్ల. ఒక వస్తువును చూసినపుడు దానికి పూర్తిగా భిన్నమైన మరోదాని విషయంగా "దాని వర్ణమిది, శబ్దమిది, గంధమిది, రసమిది(taste), స్ప్రష్టవ్యమిది (touch)" అని జ్ఞాపకం వస్తుంది. 8. మాటల వల్ల. ఒక మతిమరపు మనిషికి మరచిపోయిన సంఘటనను మరో వ్యక్తి మాటల ద్వారా జ్ఞాపకం చేసినపుడు అవునవుననడం. 9. లక్షణాల వల్ల. ఎప్పుడో చిన్ననాడు చూసిన ఆబోతు కళ్ళకు కట్టినట్లు జ్ఞప్తికి వస్తుండడం దాని ప్రత్యేక లక్షణాల వల్ల. 10. ప్రేరేపణ వల్ల. మతిమరపు మనిషిని ఇతరుడు "జ్ఞాపకం తెచ్చుకో" అని పదే పదే ప్రేరేపణ చేయడం వల్ల 11. లేఖనం వల్ల. లేఖకులు తాము పొందిన శిక్షణ వల్ల ఏ అక్షరం తరువాత ఏ అక్షరం వ్రాయాలో చప్పున జ్ఞప్తికి తెచ్చుకొంటారు. 12. గణన వల్ల. గణనలో శిక్షణ వల్ల గణకులు పెద్ద పెద్ద లెక్కలు కూడా జ్ఞప్తికి తెచ్చుకొంటారు. 13. ధారణ వల్ల. కంఠాపాఠం చేయడం ద్వారా ధార్మికగ్రంథాలను పొల్లు పోకుండా ఒప్పజెప్పేవాళ్ళున్నారు. 14. భావన(mental development) వల్ల. ఎవరైనా భిక్షువు భావనాబలం ద్వారా పూర్వజన్మల వివరాలు జ్ఞప్తికి తెచ్చుకోగలగడం. 15. పుస్తకం ద్వారా. రాజులు పూర్వం చేసిన శాసనాలను జ్ఞప్తికి తెచ్చుకోవడానికి "పుస్తకం తీసుకరా" అంటారు. 16. ఉపనిక్షిప్త (తాకట్టు పెట్టిన) వస్తువులు చూసి ఆ అవసరాన్ని కలుగజేసిన సంఘటనలన్నిటినీ జ్ఞప్తికి తెచ్చుకోవడం. 17. అనుభూతి వల్ల. రూపం చూసినందువల్ల రూపం జ్ఞప్తికి రావడం అలాగే ఆయా ఇంద్రియ విషయాల అనుభవంనుండి ఆయా విషయాలు జ్ఞప్తికి రావడం.

## బుద్ధగుణములు

**మి:** భంతే నాగసేనా, మీరు ఇలా చెబుతుంటారు: "నూరేండ్లు అదే పనిగా పాపకర్మలు చేయనీగాక మరణసమయంలో ఒకే ఒక బుద్ధగుణం స్మరణకు తెచ్చుకోగలిగితే అతడు దేవలోకాల్లో ఉద్భవం పొందుతాడు" అని. దీనిని నేను నమ్మడం లేదు. "ఒకే ఒక ప్రాణాతిపాతదోషం (killing) వల్ల నిరయం పాలవుతాడు" అనే మాటను కూడా నేను నమ్మడం లేదు.

**నా:** నీవేమనుకొంటున్నావు? చిన్నరాయిని నీళ్ళలో వేస్తే చిన్నది కనుక తేలుతుందనుకొంటున్నావా?

**మి:** లేదు భంతే.

**నా:** నూరు బండ్లనిండుగా రాళ్ళను తెచ్చి నావలో పేర్చితే అవి మునిగిపోకుండా ఉంటాయా ఉండవా?

**మి:** అవి మునిగిపోవు.

**నా:** ఈ విధంగానే కుశలకర్మల ప్రభావాన్ని అర్థం చేసుకొనవలెను.

**మి:** లెస్సగా పలికితివి.

## దుఃఖం ఎలా తొలగిస్తావు?

**మి:** భంతే నాగసేనా, అతీతదుఃఖం తొలగించేందుకు ప్రయత్నిస్తున్నావా?

**నా:** లేదు మహారాజా.

**మి:** మరి అనాగతదుఃఖం తొలగించేందుకు ప్రయత్నిస్తున్నావా?

**నా:** లేదు.

**మి:** మరి ప్రత్యుత్పన్నదుఃఖాన్ని తొలగించేందుకు యత్నిస్తున్నావా?

**నా:** లేదు.

**మి:** అతీతదుఃఖం తొలగించే ప్రయత్నమూ నీలో లేదు. అనాగతదుఃఖం తొలగించే ప్రయత్నమూ లేదు. ప్రత్యుత్పన్నదుఃఖం తొలగించే ప్రయత్నమూ లేదు. మరి దేనికోసం నీ ప్రయత్నం?

**నా:** దుఃఖనిరోధం* కోసం నేను ప్రయత్నిస్తున్నాను.

**మి:** అనాగతదుఃఖం ఇప్పుడున్నదా?

**నా:** లేదు.

---

* *ఆత్యంతికదుఃఖనివృత్తి = నిర్వాణం = అపునర్భవం*

**మి:** అతిపండితుడవు నీవు! ఇప్పుడు లేనట్టి అనాగతదుఃఖం తొలగించే ప్రయత్నంలో ఉన్నావు!

**నా:** మహారాజా, ఎవరైనా శత్రురాజులు, ప్రత్యర్థులు, విరోధులు నీమీదికి దండెత్తియున్నారా?

**మి:** అవును.

**నా:** శత్రువులు దండెత్తి వచ్చినప్పుడే నీవు పరిఖను (కందకం) త్రవ్వించావా? ప్రాకారం (rampart) కట్టించావా? గోపురం (city gate-way) నిర్మించావా? ధ్యానం తెప్పించి నిలువ చేశావా?

**మి:** లేదు భంతే. అవన్నీ అప్పటికే సిద్ధం చేసి ఉండడం జరిగింది.

**నా:** శత్రువులు దండెత్తివచ్చినప్పుడే నీవు ఏనుగు మీద ఆశీనుడై యుద్ధం చేసే శిక్షణ, గుర్రం మీద స్వారీ చేస్తూ యుద్ధం చేసే శిక్షణ, రథంనుండి యుద్ధం చేసే శిక్షణ, ధనుర్విద్య, కత్తిసాము నేర్చుకోవడం మొదలుపెట్టావా?

**మి:** లేదు భంతే, ఆ వరకే ఆ శిక్షణలన్నీ గడించియున్నాను.

**నా:** దేనికోసం?

**మి:** అనాగత భయాలను (future perils) ఎదుర్కోవడం కోసం.

**నా:** కనుక మహారాజా, అనాగతభయం ఉన్నది.

**మి:** లేదు భంతే.

**నా:** మహారాజా, నీవు అతిపండితుడవు! ఇప్పుడు లేనట్టి అనాగతభయాలను ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నావు.

**మి:** మళ్లీ ఒక ఉపమను చెప్పుము.

**నా:** నీకు దప్పిక వేసిందనుకొనుము. అప్పుడు బావి త్రవ్వుతావా? కొలను త్రవ్వుతావా? చెరువు త్రవ్వుతావా?

**మి:** లేదు భంతే. అవన్నీ ఈ వరకే త్రవ్వించడం అయ్యింది.

**నా:** దేనికోసం?

**మి:** ఆ త్రవ్వించడాలన్నీ అనాగతపిపాసను (future thirst) ఎదుర్కోవడం కోసం.

**నా:** ఇప్పుడు అనాగతపిపాస ఉన్నదా?

**మి:** లేదు భంతే.

**నా:** మహారాజా, నీవు అతిపండితుడవు! ఇప్పుడు లేనట్టి అనాగతపిపాసను ఎదుర్కొనేందుకు ప్రయత్నం చేసేవాడివిగా ఉన్నావు!

**మి:** బలే నాగసేనా.

## బ్రహ్మలోకం ఎంతదూరం?

**మి:** భంతే నాగసేనా, బ్రహ్మలోకం ఎంత దూరంలో ఉన్నది?

**నా:** ఇక్కడికి చాలా దూరం. కూటాగారం అంతటి పెద్ద శిల అక్కడినుంచి దొర్లుకొంటూ ఈ భూమి మీదికి జారిపడిందనుకో. అది ఇక్కడికి వచ్చి పడడానికి నాలుగు నెలల కాలం పడుతుంది.

**మి:** భంతే నాగసేనా, నీవు ఇలా అంటుంటావు: "బలవంతుడైన పురుషుడు మడచిన చేతిని సాచడానికి ఎంత తక్కువ సమయం తీసుకొంటాడో అలాగే సాచిన చేయిని మడచడానికి ఎంత తక్కువ సమయం తీసుకొంటాడో అంతకన్నా వేగంగా ఇద్ధి కలిగినట్టి భిక్షువు, చేతోవశిత్వం (mastery over mind) కలిగినట్టి భిక్షువు ఇక్కడ జంబూద్వీపంలో అంతర్హితుడై బ్రహ్మలోకంలో ప్రత్యక్షం కాగలడు." నేనీ మాటలు నమ్మను. అంతదూరంలో ఉండే బ్రహ్మలోకానికి ఆ భిక్షువు క్షణంలో ఎలా చేరగలడు?

**నా:** మహారాజా, నీ జన్మభూమి ఏది?

**మి:** అలసంద అనే దీవి. నేనక్కడే పుట్టి పెరిగింది.

**నా:** ఇక్కడికి అది ఎంత దూరం?

**మి:** రెండు వందల యోజనాల దూరం.

**నా:** అక్కడ నీవు చేసిన పని ఏదైనా ఇప్పుడు జ్ఞాపకానికి వస్తున్నదా?

**మి:** అవును, జ్ఞాపకం చేసుకొంటున్నాను.

**నా:** రెండు వందల యోజనాల దూరం నీ మనస్సు క్షణంలో వెళ్ళి పోయిందికదా!

## ఎంత దూరమైనా క్షణంలోనే

**మి:** భంతే నాగసేనా, ఒకానొకడు ఇక్కడ మరణించి బ్రహ్మలోకంలో పునర్భవం పొందాడనుకొనుము. అదే సమయంలో మరొకడు ఇక్కడ మరణించి కాశ్మీరంలో పునర్భవం పొందాడనుకొనుము. ఈ ఇద్దరి పునర్భవాల్లో ఏది చిరతరము, ఏది శీఘ్రతరము?

**నా:** సమం మహారాజా.

**మి:** ఉపమను చెప్పుము

**నా:** మహారాజా, నీవు జన్మించిన ఊరు పేరేమి?

**మి:** కలసిగ్రామం.

**నా:** అది ఇక్కడికి ఎంత దూరం?

**మి:** రెండువందల యోజనాల దూరం.

**నా:** కాశ్మీరం ఇక్కడికి ఎంత దూరం?

**మి:** పన్నెండు యోజనాల దూరం.

**నా:** మహారాజా, ఇప్పుడు కలిసిగ్రామాన్ని చింతించు.

**మి:** చింతించాను భంతే.

**నా:** అలాగే కాశ్మీరాన్ని కూడా చింతించు.

**మి:** చింతించాను.

**నా:** ఈ రెండు చింతనల్లో ఏది చిరతరం? ఏది శీఘ్రతరం?

**మి:** సమం భంతే.

**నా:** అలాగే బ్రహ్మలోకంలో పునర్భవం అయినా కాశ్మీరంలో అయినా సమకాలమే.

## బోధ్యంగములు*

**మి:** భంతే నాగసేనా, భోధ్యంగములు ఎన్ని?

**నా:** బోధ్యంగములు ఏడు మహారాజా.

**మి:** ఎన్ని బోధ్యంగములు ద్వారా బోధి కలుగుతుంది?

**నా:** ఒక బోధ్యంగము- ధర్మప్రవిచయం(ప్రజ్ఞ) ద్వారా బోధి కలుగుతుంది.

**మి:** అలా అయితే మరి ఏడు బోధ్యంగములు ఎందుకు చెప్పడం?

**మి:** కరవాలాన్ని చేతిలోకి తీసుకోకుండా ఒరలోకి దించేస్తే అది ఛేదించే పని చేయగలదా?

**నా:** చేయలేదు.

**మి:** అలాగే ఇతర ఆరు బోధ్యంగముల అపేక్ష లేకుండా కేవలం ధర్మ ప్రవిచయం ఒకటే బోధిని కలిగింపజాలదు.

## పుణ్యపాపములు

**మి:** భంతే నాగసేనా, పుణ్యము, అపుణ్యములలో ఏది గొప్పది?

**నా:** మహారాజా, పుణ్యమే గొప్పది. అపుణ్యము అల్పమైనది.

**మి:** ఏ విధంగా?

**నా:** అపుణ్యం చేసినవాడు "అయ్యో పాపకర్మ చేసితినే" అని పశ్చాత్తాపంతో కుమిలిపోతూ దుఃఖం పాలవుతాడు. అది అతనికి వృద్ధిని ఇవ్వదు. పుణ్యకార్యం చేసినవానికి పశ్చాత్తాపం ఉండదు కనుక హృదయంలో ప్రామోద్యం కలుగుతుంది.

---

* *చూడుడు అనుబంధం - 2*

ప్రామోద్యం వల్ల ప్రీతి జనిస్తుంది. మనస్సులో ప్రీతి ఉండడంతో దేహంలో ప్రస్రబ్ధి(ప్రశాంతి) కలుగుతుంది. దేహంలో ప్రస్రబ్ధి కలుగగానే చిత్తానికి సుఖం అనుభవానికి వస్తుంది. సుఖం వల్ల చిత్తం సమాహితం (concentrated) అవుతుంది. సమాహితచిత్తుడు ఉన్నదున్నట్లు చూడగల ప్రజ్ఞావంతుడవుతాడు.

## తెలియక చేస్తే?

**మి:** భంతే నాగసేనా, ఒకడు తెలిసి పాపకర్మ చేస్తాడు. మరొకడు తెలియక చేస్తాడు. ఎవరికి ఎక్కువ అపుణ్యం?

**నా:** మహారాజా. తెలియక పాపకర్మ చేసేవాడికి ఎక్కువ అపుణ్యం.

**మి:** అలా అయితే నా కొలువులో ఉండే రాజపుత్రులు లేదా మహామాత్యులు తెలియక అపరాధం చేస్తే నేను వాళ్ళకు రెండింతల శిక్ష వేయాల్సిఉంటుందికదా!

**నా:** మహారాజా, ఇది ఆలోచించు. ఎర్రగా కాలుతున్న ఒక ఇనుపగోళాన్ని ఒకడు తెలియకుండా ముట్టుకొన్నాడు. మరొకడు తెలిసి ముట్టుకొన్నాడు. కాల్చుకోవడం ఎవరికి ఎక్కువ?

**మి:** తెలియక ముట్టుకొన్నవాడే ఎక్కువ కాల్చుకోవడం జరుగుతుంది

**నా:** అలాగే మహారాజా, తెలియక పాపకర్మ చేసినవాడికి ఎక్కువ అపుణ్యం.

## ఉత్తరకురుగమనం

***మి:*** *భంతే నాగసేనా, ఈ శరీరంతో ఉత్తరకురుద్వీపాన్నిగానీ బ్రహ్మలోకాన్నిగానీ మరొక ద్వీపాన్నిగానీ చేరగలవాడెవడైనా ఉన్నాడా?*

***నా:*** *ఉన్నారు. ఈ చతుర్మహాభూతికకాయంతో ఉత్తరకురుద్వీపం లేదా బ్రహ్మలోకం లేదా అన్యద్వీపం చేరగలవారున్నారు.*

***మి:*** *ఎలా చేరగలరు?*

***నా:*** *ఈ భూమి మీద జానెడుగానీ బారెడుగానీ లంఘించిన అనుభవం నీకున్నదా?*

***మి:*** *ఉన్నది భంతే. ఎనిమిది బారల దూరం లంఘించడం నేను చేసియున్నాను.*

***నా:*** *ఎనిమిది బారల దూరం ఎలా లంఘించగలిగావు?*

***మి:*** *"ఆ చోటికి దూకుతాను" అని చిత్తంలో సంకల్పిస్తాను. ఆ సంకల్ప ప్రభావంతో కాయం తేలిక అయి దుముకడం జరుగుతుంది.*

***నా:*** *మహారాజా, అలాగే ఇద్ధిమంతుడు (one who has psychic powers), ధ్యానాల ద్వారా చిత్తం మీద వశిత్వం (mastery) సంపాయించినవాడు కాయాన్ని చిత్తవశం చేసి తలచిన చోటికి రెప్పపాటులో గమనం చేయగలడు.*

## దీర్ఘాస్థి

***మి:*** *భంతే నాగసేనా, వందయోజనాల* దీర్ఘమైన ఎముకలు కూడా ఉన్నాయని మీరు చెబుతుంటారు. వందయోజనాల పొడవైన వృక్షమే లేదు. ఇక ఎముకలు అంత పొడవు ఎక్కడుంటాయి?*

***నా:*** *మహారాజా, సముద్రంలో ఐదువందల యోజనాల పొడవైన మత్స్యజాతు లున్నాయని నీవు వినలేదా?*

***మి:*** *అవును భంతే, వినియున్నాను.*

***నా:*** *మరి ఐదువందల యోజనాల పొడవైన మత్స్యజాతుల ఎముకలు యోజనశాతం పొడవు ఉండడంలో వింత ఏమున్నది?*

***మి:*** *భంతే, నీవు గడుసరివి.*

## ఆశ్వాస ప్రశ్వాసలు

***మి:*** *భంతే నాగసేనా, "ఆశ్వాస ప్రశ్వాసలను నిరోధించడం సాధ్యమే" అని మీరు చెబుతుంటారుకదా!*

***నా:*** *అవును సాధ్యమే.*

***మి:*** *ఎలా సాధ్యం?*

***నా:*** *గురకశబ్దం ఎప్పుడైనా వినియున్నావా?*

***మి:*** *వినియున్నాను.*

***నా:*** *గురకపెట్టున్న దేహాన్ని మరో భంగిమకు మార్చినపుడు గురక ఆగుతుందా? లేదా?*

***మి:*** *అవును ఆగిపోతుంది.*

***నా:*** *ఏ అభ్యాసమూ లేని, శీలధ్యానములు లేని ఒక మొద్దుశరీరాన్ని వంచగానే గురక ఆగిపోయినపుడు ఇక అభ్యస్తశరీరుడు, శీలసంపత్తి, ధ్యానసంపత్తి కలిగినవాడు చతుర్థధ్యానం** పొందినపుడు ఆశ్వాస ప్రశ్వాసలు అతనిలో ఆగిపోతాయనడంలో వింత ఏముంది?*

***మి:*** *బాగా చెప్పావు.*

---

* *ఎనిమిది మైళ్ళ దూరం ఒక యోజనం.*

** *చతుర్థధ్యానానికి ఆనేజ్యం అని పేరు. గాలితాకిడి లేని చోట దీపశిఖ ఎలా నిశ్చలంగా ఉంటుందో అలాగే చతుర్థధ్యానంలో చిత్తం నిశ్చలంగా ఉంటుంది. ప్రథమధ్యానం వితర్క విచారాలచేత చలిస్తూ ఉంటుంది. ద్వితీయధ్యానం ప్రీతివల్ల పులకరింతల వల్ల కంపిస్తూ ఉంటుంది. తృతీయధ్యానం సుఖం చేత కంపిస్తూ ఉంటుంది. చతుర్థధ్యానంలో వితర్కవిచారాల కంపనమూ ఉండదు. సుఖం దుఃఖం సౌమనస్యం దౌర్మనస్యముల కంపనమూ ఉండదు. చిత్తైకాగ్రత, ఉపేక్ష మాత్రమే ఉంటాయి. ఆశ్వాసప్రశ్వాసలు కూడా పరమసూక్ష్మంగా ఆగి పోయాయా అనిపించేంత సూక్ష్మం అయిపోతాయి.*

## *సముద్రం*

***మి:*** *భంతే నాగసేనా, సముద్రం సముద్రం* అంటారు. ఏ కారణం చేత ఉదకరాశి సముద్రం అనబడింది?*

***నా:*** *మహారాజా, ఎంతమేరకు నీళ్ళుందో అంతమేరకు ఉప్పు, ఎంతమేరకు ఉప్పు ఉందో అంతమేరకు నీళ్ళుండడం వల్ల ఆ ఉదకరాశి సముద్రం సముద్రం అనబడింది.*

***మి:*** *బాగుగా చెబితివి నాగసేనా.*

## *సముద్రరసం*

***మి:*** *భంతే నాగసేనా, ఏ కారణం చేత సముద్రజలం ఏకరసంగా లవణరసంగానే ఉంటున్నది?*

***నా:*** *చిరకాలంగా ఉంటున్నందువల్ల సముద్రజలం క్రమక్రమంగా లవణరసంగా మారిపోయింది.*

***మి:*** *చాలా బాగా చెప్పావు భంతే.*

## *విజ్ఞాననానాత్వం*

**మి:** భంతే నాగసేనా, విజ్ఞానం అని, ప్రజ్ఞ అని, జీవుడని వింటుంటాము. ఈ ధమ్మములు వేరు వేరు పేర్లు కలిగిన వేరు వేరు అర్థములా? లేక వీటి అర్థం ఒకటే కానీ పేర్లు నానాగా ఉన్నాయా?

**నా:** తెలుసుకొనడం అనేది విజ్ఞానలక్షణం. విశేషంగా లోతుగా ఉన్నదున్నట్లుగా తెలియడం అనేది ప్రజ్ఞలక్షణం. ఇక జీవుడనేది ఏమిటో తెలియబడనందువల్ల అది ఒక తత్త్వం (reality) కానందువల్ల దాని లక్షణం ఇది అని ఎలా చెప్పడం?

**మి:** జీవుడనేది లేని పక్షంలో కంటితో రూపములు చూసేదెవరు? చెవులతో శబ్దాలు వినేదెవరు? ముక్కుతో వాసనలు పట్టుకొనేదెవరు? నాలుకతో రుచులు గ్రహించేదెవరు? కాయంతో స్పృష్టవ్యములను స్పృశించేదెవరు? మనస్సుతో ధమ్మములను (mental objects) తెలుసుకొనేదెవరు?

**నా:** జీవుడు కంటితో రూపాలు ...... మనస్సుతో ధర్మాలు తెలుసుకొంటున్న పక్షంలో ఒక అడ్డంకిలాంటి గంతలాంటి చక్షువును పీకివేస్తే జీవుడికి విశాల ఆకాశంలో మొత్తం

---

** సగరరాజకుమారులు తవ్వినది కనుక సాగరం అనే పేరు ఏర్పడిందనీ తవ్విన తరువాత తవ్వినట్లుగా ముద్ర వేయించుకొని వెళ్ళినారు కనుక సముద్రం అయ్యింది అని తీర్థకులు చెబుతారు.*

రూపాలను ఒక్కసారిగా చూసే వీలున్నదికదా! అలాగే చెవి, ముక్కు, నాలుక, కాయం, మనస్సు అనే గంతలు కూడా తొలగించివేస్తే విశాలవిశ్వంలో అన్నీ ఒక్కసారిగా జీవుడు తెలుసుకొనే వీలున్నదికదా!

**మి:** వీలుపడదు.

**నా:** కనుక జీవుడనేది తెలియబడే ఒక తత్త్వం కాదు.

**మి:** బలే బలే నాగసేనా.

## ఎవరికీ సాధ్యం కానిది

**మి:** భంతే నాగసేనా, భగవానుడు చేసిన దుష్కరకార్యం ఏమైనా ఉన్నదా?

**నా:** మహారాజా, ఎవరూ చేయలేని పనిని భగవానుడు చేశాడు.

**మి:** ఏమిటది?

**నా:** ఒక ఆరమ్మణం(objective support)* ఆశ్రయించుకొని ఏకకాలంలో తలెత్తే అరూపిణులైన (incorporeal) చిత్తచైతసిక (mind and it's various modes) ధర్మాల వ్యవస్థను ఇలా చెప్పగలిగాడు: "ఇది స్పర్శ(contact), ఇది వేదన (feeling), ఇది సంజ్ఞ (perception), ఇది చేతన (volition), ఇది చిత్తం (consciousness)" అని.

**మి:** ఉపమను చెప్పుము

**నా:** మహారాజా, ఒకానొక పురుషుడు నావ ఎక్కి మహాసముద్రంలోకి వెళ్ళి దోసిలిలో సముద్రం నీళ్ళు తీసుకొని నాలుకతో రుచి చూస్తూ "ఇది గంగాజలం, ఇది యమునాజలం, ఇది అచిరావతిజలం, ఇది సరయూజలం, ఇది మహియాజలం" అని చెప్పగలడా?

**మి:** అలా తెలియడం దుష్కరం భంతే.

**నా:** దానికన్నా దుష్కరమైనది భగవానుడు చేశాడు. ఒక ఆరమ్మణం ఆశ్రయించు కొని ఏకకాలంలో ఉత్పన్నమయ్యే అరూపిధర్మాలయిన చిత్తచైతసికముల వ్యవస్థను ఇలా చెప్పగలిగాడు: "ఇది స్పర్శ, ఇది వేదన, ఇది సంజ్ఞ, ఇది చేతన, ఇది చిత్తం" అని.

**మి:** సాధు సాధు (well spoken, well spoken) నాగసేనా.

---

* *ముదుసలి పైకి లేవాలంటే కర్ర సహాయమో మరొక సహాయమో తీసుకొని లేస్తాడు. చిత్తవృత్తులు స్వయంగా పైకి లేవజాలవు. పైకి లేవడానికి ఏదో ఒక ఆలంబనం* (mental object) *ఊతకర్రగా అవసరం అవుతుంది.*

## ముగింపు

**నా:** మహారాజా, ఇప్పుడు ఎంత సమయమో తెలుసా?

**మి:** భంతే, ఇప్పుడు మొదటి యామం (జాము) ముగిసి మధ్యమయామం నడుస్తున్నది. ఉల్కలు (torches) వెలుగుతున్నాయి. నాలుగు పతాకాలు ఎగురవేశారు. దానధర్మాలకోసం రాజభాండాగారం నుండి దేయవస్తువులు కదలబోతున్నాయి.

**యోనకులు:** మహారాజా, ఈ స్థవిరుడు (senior monk) మహాపండితుడు.

**మి:** అవును ఇటువంటి ఆచార్యుడు, నాలాంటి అంతేవాసి (శిష్యుడు) ఉంటే ధర్మం తెలియడానికి ఎంతోసేపు పట్టదు.

తన ప్రశ్నలకు నాగసేనుడు ఇచ్చిన సమాధానాల పట్ల తుష్టి చెంది లక్ష నాణాల విలువ చేసే రత్నకంబళిని మిలిందమహారాజు నాగసేనుడికి కప్పి ఇలా అన్నాడు: "భదంతా, ఈ దినంనుండి ఇక ఎనిమిది వందల రోజులపాటు నీకు నా ప్రాసాదంలో భిక్షను ఏర్పాటు చేస్తున్నాను. ఈ ప్రాసాదంలో నీకు ఇష్టమైనది ఏదైనా సరే తీసుకొనవలసినదిగానూ కోరుచున్నాను."

''చాలు చాలు మహారాజా, నా జీవితానికి ఏమీ లోటు లేదు'' అన్నాడు నాగసేనుడు.

"నాకు తెలుసు నీ జీవితానికి లోటు లేదని. కానీ నిన్ను నీవు రక్షించుకోవాలి. నన్నూ రక్షించాలి. నిన్ను నీవు ఎలా రక్షించుకోవాలి? ''నాగసేనుడు మిలిందమహారాజును సంతోషపెట్టాడు కానీ చిల్లిగవ్వ కూడా పొందలేకపోయాడు" అనే జనాపవాదంనుండి నిన్ను నీవు రక్షించుకోవాలి. నన్ను ఎలా రక్షించాలి? "మిలింద మహారాజు సంతుష్టి చెందినా నాగసేనుడికి ఏమీ ఇవ్వలేదు" అనే జనాపవాదంనుండి నన్ను రక్షించాలి" అన్నాడు మిలిందుడు. "అలాగే మహారాజా" అని నాగసేనుడు సమ్మతి తెలిపాడు.

''భంతే నాగసేనా, మృగరాజును (సింహాన్ని) సువర్ణపంజరంలో బంధిస్తే సువర్ణపంజరం కదా అని అది సంతోషించదు. బయటకే చూస్తుంటుంది. నేను ఈ రాజప్రాసాదంలో అధికారం చెలాయిస్తూ ఉండినా అనాగార(homeless) జీవితం మీద నా మనస్సు మొగ్గు చూపిస్తున్నది. కానీ ప్రవ్రజించి బయటకు వెళ్తే నేను ఎక్కువ దినాలు బ్రతకను. నాకు బయట శత్రువులు చాలా మంది ఉన్నారు'' అన్నాడు మిలిందుడు.

ఆ తరువాత నాగసేనుడు సెలవు తీసుకొని వెళ్ళాక మిలిందుడు "నేనేమి ప్రశ్నలు వేశాను? నాగసేనుడు ఏమి సమాధానాలు ఇచ్చాడు?" అనే ఆలోచనతో మనస్సులో ఇలా అనుకొన్నాడు: "అన్ని ప్రశ్నలూ నేను చక్కగా వేశాను. నాగసేనుడూ చక్కగా సమాధానం చెప్పాడు."

సంఘారామంలో నాగసేనుడు "మిలిందుడు ఏమి అడిగాడు? నేనేమి చెప్పాను?" అనే ఆలోచనలో పడి "మిలిందుడు అడిగినవన్నీ చక్కని ప్రశ్నలు. నా సమాధానాలూ చక్కనివే" అనుకొన్నాడు.

రాత్రి గడిచి తెల్లవారాక నాగసేనుడు చీవరం పాత్ర తీసుకొని మిలిందుని ప్రాసాదానికి వెళ్ళాడు. మిలిందుడు నాగసేనునికి అభివాదనం చేసి ఆసనం మీద కూర్చోబెట్టి తానూ కొంతదూరంలో ఒక ఆసనం మీద వినయంగా కూర్చున్నాడు.

**మి:** భంతే, నీవు ఇలా అనుకోరాదు: "మిలిందుడు రాతంత్రా నిదురపోకుండా తన ప్రశ్నాచాతురిని తలచుకొని మురిసిపోతూ కాలం గడిపాడు" అని. రాత్రంతా నేను "ప్రశ్నలు సరిగా అడిగానా? నాగసేనుడు సరిగా సమాధానాలు చెప్పాడా?" అని ఆలోచిస్తూ గడిపాను.

**నా:** మహారాజా, నీవు ఇలా అనుకోరాదు: "నాగసేనుడు రాత్రంతా నిదురపోకుండా తన సమాధానచాతురిని తలచుకొని మురిసిపోతూ కాలం గడిపాడు" అని. రాత్రంతా నేను "మిలిందుడు ఏమి అడిగాడు? నేను ఏమి సమాధనాలు ఇచ్చాను?" అని ఆలోచిస్తూ గడిపాను.

ఇలా ఆ ఇద్దరు మహానాగులు* (great men of knowledge) ఒకరి సుభాషితాన్ని మరొకరు అనుమోదించారు.

---

* *పాపరహితులనీ అర్థం చెప్పవచ్చు. క్లేశాల మీద విజయం సాధించిన సమర విజయులనీ అర్థం చెప్పవచ్చు.*

# మేండక ప్రశ్నలు* (dilemmas)

నాగసేనుణ్ణి మళ్ళీ మళ్ళీ ప్రశ్నిస్తూ మిలిందుడు చివరికి త్రిపిటకాలూ నేర్చుకొన్నవాడయ్యాడు. తొమ్మిది అంగములు** కలిగి విస్తారంగా ఉన్న బుద్ధభాషితాలను అతడు రాత్రివేళల్లో ఏకాంతంలో విచారం చేస్తూ ఇలా అనుకొన్నాడు: "ధర్మరాజశాసనంలో (teachings of Buddha) పర్యాయభాషితాలు ఉన్నాయి. సంధాయభాషితాలున్నాయి, స్వభావభాషితాలున్నాయి. మేండక వాక్యాలూ ఉన్నాయి. ఈ మేండకవాక్యాల్లోని సందిగ్ధతను తొలగించి వాక్యార్థాన్ని స్పష్టీకరించడం చాలా కష్టం. ఈ కారణంగా భవిష్యత్తులో అభిప్రాయ భేదాలు తలెత్తుతాయి. కనుక ఈ మేండకవాక్యాలను నాగసేనుని వద్ద ప్రస్తావించి ఆయనద్వారా వీటికి అర్థనిర్ణయం చేయించి జనులకు మేలు కలిగిస్తాను."

మరునాడు ప్రాతఃకాలం మిలిందుడు శిరస్నానం చేసి శిరస్సుకు అంజలి ఘటించి అతీత (past) అనాగత (future) ప్రత్యుత్పన్న (present) సమ్మాసం బుద్ధులను భక్తితో స్మరించి ఇలా అనుకొన్నాడు: "ఇక ఏడు దినాల పాటు ఎనిమిది వ్రతాలను పాటిస్తూ తపోజీవితం గడుపుతాను. ఆపైన ఆచార్య నాగసేనుణ్ణి ఆరాధించి మేండకప్రశ్నలు అడుగుతాను."

ఆ తరువాత మిలిందుడు తన మేలివస్త్రాలను, ఆభరణాలను తీసివేసి కాషాయం ధరించి ఇలా ప్రతిజ్ఞ చేశాడు: "1.ఏడు దినాలపాటు నేను రాచకార్యాలకు దూరంగా ఉంటాను. 2. రాగకలుషితచిత్తాన్ని తలెత్తనీయను. 3.ద్వేషకలుషితచిత్తాన్ని తలెత్తనీయను. 4. మోహకలుషితచిత్తాన్ని తలెత్తనీయను. 5. పరిచారకులు సేవకుల పట్ల కూడా వినయం, అణకువ కలిగియుంటాను. 6.కాయిక వాచిక క్రియల్లో జాగ్రత్త

---

** పొట్టేలు కొమ్ములు రెండూ సమానమైన వాడి కలిగియుంటాయి. అలాగే ఈ ప్రశ్నలు లేవదీసే రెండు పక్షాలూ సమానబలం కలిగియున్నట్లు కనిపిస్తాయి.*

*** సూత్ర (discourses in prose), గేయ (discourses in mixed prose and verse), వ్యాకరణ (expositions), గాథ (verses), ఉదాన (inspired utterances), ఇత్యుక్తక (sayings), జాతక (birth storeis), అద్భుతధర్మ (wonders), వేదల్ల (analysis). ద్వాదశాంగ విభాగం కూడా ఉన్నది. పై విభాగాలకు అవదానం, ఉపదేశం నిదానం అనే విభాగాలు చేరుతాయి. వేదల్ల స్థానంలో వైపుల్య ఉంటుంది.*

కలిగియుంటాను. 7. ఆరు ఆయతనాలను (sense bases) కాపాడుకొంటాను.* 8. మైత్రీభావనయందే చిత్తాన్ని నిలిపి ఉంచుతాను."

స్వయంగా విధించుకొన్న ఈ ఎనిమిది నియమాలను ఏడు దినాలపాటు పాటించి ఎనిమిదవ దినం ప్రొద్దున మిలిందుడు ప్రాతరాశం (breakfast) ఆరగించి సంఘారామం వెళ్ళి నాగసేనుని శ్రీచరణాలకు పంచప్రతిష్ఠిత నమస్కారం** చేసి ఆ తరువాత కొంతదూరం జరిగి వినయంగా నిలుచుని ఇలా విన్నవించాడు: "భంతే నాగసేనా, నేను కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు అడగదలచాను. మన ఇరువురి మధ్య మూడవ వ్యక్తి ఎవరూ ఉండరాదు. నిర్జన అరణ్య ప్రదేశంలో మనం ఇరువురము కూర్చుందాము. నేనడిగే ప్రశ్నలకు దాపరికము లేకుండా సమాధానాలు చెప్పాలి. రహస్యవాక్యాలు కూడా వినదగు అర్హుడనే నేను"

ఆ తరువాత నాగసేనుడు, మిలిందుడు నిర్జానారణ్యం ప్రవేశించారు. ప్రశ్నించడానికి నాగసేనుడు అనుమతి ఇచ్చాక మిలిందుడు నాగసేనునికి మళ్ళీ నమస్కారం చేసి చేతులు జోడించి ఇలా ప్రశ్నించాడు:

## పూజలను స్వీకరిస్తాడా?

**మి:** భంతే నాగసేనా, తీర్థికులు*** ఇలా అంటారు: "బుద్ధుడు పూజలను స్వీకరించే పక్షంలో ఆయనకు పరినిర్వాణం కలుగలేదని చెప్పవలసివస్తుంది. లోకంతో బంధనం కలిగియున్నాడని, లోకపరిధిలోనే ఉన్నాడని, లోకసాధారణుడని చెప్పవలసివస్తుంది. అటువంటి వ్యక్తికి చేసే పూజ వంధ్యము (barren), అఫలము (fruitless) అవుతుంది. బుద్ధుడు పరినిర్వాణం చెందినవాడని చెబితే లోకబంధనం లేనివాడని, అన్నిరకాల భవములనుండి (all types of becomings) బయటపడినవాడని చెప్పవలసివస్తుంది.

---

** సతి (mindfulness) మరియూ సంప్రజన్యము (awareness) ద్వారా ఇంద్రియముల వద్ద రక్షణ ఏర్పాటు చేసుకొనియుండడం అని అర్థం. దీనికి ఇంద్రియసంవరం (restraint) అని పేరు.*

*** మోకాళ్ళు భూమికి ఆనించి రెండు చేతులను చేర్చి శిరస్సున అంజలి ఘటించి నుదురును భూమికి తాకించి నమస్కరించడం పంచప్రతిష్ఠిత నమస్కారం అవుతుంది. మోకాళ్ళు, మోచేతులు, పాదాలు, చేతులు, నుదురు– ఈ ఐదు భూమిని స్పృశించడం జరుగుతుంది కనుక ఈ పేరు.*

**** ఆత్మవాదులు నానా రకాలు. ఆత్మను ఏదో ఒకవిధంగా అంగీకరించేవాళ్ళకు తీర్థికులు అని పేరు. సాంఖ్యులు, వైశేషికులు, జైనులు, మీమాంసకులు ఇత్యాది బహుశాఖలవారందరూ తీర్థికులు.*

అటువంటి వ్యక్తిని ఉద్దేశించి పూజ చేయడం కుదరదు. పరినిర్వృతుడయినవాడు దేనినీ స్వీకరించడు. అటువంటి వ్యక్తిని ఉద్దేశించి చేసే పూజాదులు అన్నీ వంధ్యములు (barren), అఫలములు (fruitless) అయితీరుతాయి." ఈ ప్రశ్న ఉభయకోటిక (double-pronged) ప్రశ్న. దీని పరిష్కారం అల్పమానసులు చెప్పలేరు. మహాత్ములే చెప్పగలరు. భంతే నాగసేనా, ఈ దృష్టివాదాన్ని (speculative view) చీల్చి చెండాడు. సందిగ్ధతను తొలగించు. జినపుత్రులకు (spiritual sons of Buddha) జ్ఞాననేత్రం ప్రసాదించు.

**నా:** మహారాజా, భగవానుడు పరినిర్వాణం చెందాడు. భగవానుడు పూజను గైకొనడు. బోధివృక్షం క్రింద సోపధిశేషనిర్వాణం పొందినపుడే తథాగతునికి స్వీకరణం (acceptance) అనేది వదలిపోయింది. అనుపధిశేషనిర్వాణధాతువులో పరినిర్వృతుడైన భగవానుని విషయం ఇక చెప్పాలా? ఈ విషయాన్నే ధమ్మసేనాపతి సారిపుత్రుడు ఇలా చెప్పాడు:

**పూజయంతా అసమసమా సదేవమానుసేహి తే**
**న సాదియంతి సక్కారం బుద్ధానం ఏస ధమ్మతా**

అసమసములైన* సమ్మాసంబుద్ధులను మనుష్యులు, దేవతలు పూజిస్తారు. ఆ పూజలను, సత్కారాలను సమ్మాసంబుద్ధులు స్వీకరించడం ఉండదు. తోసివేయడమూ ఉండదు. ఇదియే సమ్మాసంబుద్ధుల ధర్మత (స్వభావము).

**మి:** భంతే నాగసేనా, తండ్రిని కుమారుడు ప్రశంసించి మాట్లాడవచ్చు, కుమారుణ్ణి ప్రశంసిస్తూ తండ్రి మాట్లాడవచ్చు. ఈ ప్రశంసలు, వాదంలో ఎదుటి పక్షం లేవదీసే ఆక్షేపణలకు సమాధానంగా ఉండజాలవు. ప్రేమ, గౌరవాలను వ్యక్తం చేసేవి మాత్రమే అవుతాయి. కనుక నీ పక్షాన్ని నిలబెట్టగలిగే కారణాలు చెబుతూ దృష్టివాదజాలాన్ని (net of speculative views) ఛిన్నాభిన్నం చేయుము.

**నా:** భగవానుడు పరినిర్వృతుడు. ఏ పూజనూ స్వీకరించడు. కానీ మనుష్యులు, దేవతలు భగవానుని భౌతికకాయఅవశేషాలను (relics) స్తూపాల్లో నిక్షిప్తం చేసి పూజిస్తారు. భగవానుడు బోధించిన సమ్యక్ ప్రతిపత్తి (right practice) ద్వారా మూడు విధాల సంపత్తిని** పొందుతారు. మహారాజా, మహా అగ్నిస్కంధం (great mass of fire)

---

* *సమ్మాసంబోధిని పొందినవారు **అసములు** (unequalled) అంటే వారికి మరెవరూ సాటిరారు. వారికివారే సాటి (equal to the unequalled).*

** *మనుష్యజన్మ, దేవలోకాల్లో జన్మ, నిర్వాణప్రాప్తి – ఇవి మూడు సంపత్తులు.*

గొప్పగా జ్వలించి ఆరిపోయాక మళ్లీ తృణకాష్ఠరూపములుగా ఉన్న ఇంధనాన్ని (fuel) స్వీకరిస్తుందా?

**మి:** స్వీకరించదు. మండుతున్నప్పుడు కూడా అగ్నిస్కంధము తృణకాష్ఠాదులను స్వీకరించలేదు. ఇక ఉపశమించాక చెప్పాలా?

**నా:** ఆ అగ్నిస్కంధం అలా ఉపరమించాక, ఉపశమించాక లోకంలో అగ్ని లేకుండా పోతుందా?

**మి:** అలా ఏమీ జరగదు. అగ్నికాముడయిన ఏ మనుష్యుడైనా సరే స్వీయ బాహుబలంతో వీరియంతో కాష్ఠమును మథిస్తే అగ్ని ప్రాదుర్భవిస్తుంది. అగ్నికాముడైనవాడు ఆపైన అగ్నితో చేసుకొనవలసిన పనులు చేసుకొన గలుగుతాడు.

**నా:** కనుక తీర్థికుల వచనం మిథ్య (false) అవుతుంది. మహారాజా, మహా అగ్ని స్కంధం జ్వలించి ఉపశమించినటులే బుద్ధుడు బుద్ధతేజస్సుతో పదివేల లోకధాతువులకు అధ్యాత్మిక వెలుగునిచ్చి ఆపైన అనుపధిశేషనిర్వాణధాతువులో నిర్వృతుడైనాడు. ఉపశమించిన అగ్నిస్కంధం ఎలా తృణకాష్ఠములను స్వీకరించదో అలానే నిరుపధిశేషనిర్వాణధాతువులో నిర్వృతుడైన భగవానుడు కూడా దేవమనుష్యుల పూజను స్వీకరించడు. అగ్నిస్కంధం ఉపశమించాక అగ్నికాముడైన వాడు స్వీయబలంతో వీరియంతో కాష్ఠమథనం చేసి అగ్నిని పుట్టించి ఆ అగ్నితో చేసుకొనవలసిన కార్యాలు చేసుకొన్నట్లుగానే దేవతలు, మనుష్యులు కూడా భగవానుని భౌతిక అవశేషాలను (relics) స్తూపాల్లో నిక్షిప్తం చేసి పూజించడం ద్వారా, భగవానుడు బోధించిన సమ్యక్ ప్రతిపత్తి (right practice) ద్వారా మూడు విధములైన సంపత్తులను పొందగలుగుతారు. కనుక భగవానుణ్ణి ఉద్దేశించి చేసే పూజ వ్యర్థం కాదు, నిష్ఫలం కాదు. మహారాజా, మరొక మాట. మనుష్యులు భూమిలో విత్తనాలు నాటేటప్పుడు మహాపృథివి "ఈ విత్తనాలు నాలో మొలవనీగాక" అనుకొని వాటిని స్వీకరిస్తుందా?

**మి:** లేదు భంతే.

**నా:** మహాపృథివి విత్తనాలను అలా స్వీకరించనప్పటికీ అవి మొలకెత్తి వేళ్ళూని శాఖప్రశాఖలతో వృద్ధి చెంది పుష్పించి ఫలించడం ఎలా జరిగింది?

**మి:** మహాపృథివి విత్తనాలను "ఇవి నాలో మొలకెత్తనీ" అని స్వీకరించనప్పటికీ ఆ విత్తనాలకు ఆధారమయ్యింది. అవి మొలకెత్తి పెరగడానికి ప్రత్యయం (condition) అయ్యింది. కనుక ఆ విత్తనాలు పృథివిని ఆశ్రయంగా, ప్రత్యయంగా పొంది అలా వృద్ధి చెంది పుష్పించి ఫలించడం జరిగింది.

**నా:** కనుక తీర్థికుల వాదం నష్టం అయ్యింది, హతమయ్యింది. మహారాజా, తథాగతుణ్ణి మహాపృథివితో పోల్చదగును. మహాపృథివి విత్తనాలను స్వీకరించకపోయినా అవి పృథివిని ఆశ్రయించుకొని మొలకెత్తి వృద్ధి చెంది పుష్పఫలాలను ఇచ్చినట్లే, తథాగతుడు పూజను స్వీకరించకపోయినా దేవతలు, మనుష్యులు ధాతుపూజ (relic worship) ద్వారా, జ్ఞానరత్నఆశ్రయం ద్వారా, సమ్యక్ ప్రతిపత్తి ద్వారా తమలో బోధివృక్షాన్ని పెంచుకొనగలుగుతారు. ఆ వృక్షానికి కుశలకర్మలే వేళ్ళు (roots), సమాధియే (concentration) బోదె (స్కంధం=trunk), ధర్మమే సారము (pith), శీలమే శాఖలు (branches), విముక్తియే (emancipation) పుష్పములు, శ్రామణ్యమే (నిర్వాణమే) ఫలములు. కనుక తథాగతుణ్ణి ఉద్దేశించి చేసే పూజాసత్కారాదులు వ్యర్థం కావు, అఫలం కావు.

**మి:** భంతే నాగసేనా, గంభీరమైన ప్రశ్నను తేటతెల్లం చేశావు. నిగూఢంగా ఉన్నదాన్ని ప్రకటం చేశావు. ముడి విడిపోయింది. కీకారణ్యంలాగా కనిపించింది ఇప్పుడు బట్టబయలులా కనిపిస్తున్నది. పరవాదములు నష్టమయ్యాయి. కుదృష్టి భగ్నమయ్యింది, తీర్థికులందరూ వెలవెలబోయారు. గణాచార్యులలో అగ్రగణ్యుడుగా నీవు నిలిచావు.

## చిత్తంలో హెచ్చుతగ్గులు

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు సర్వజ్ఞుడా?

**నా:** అవును మహారాజా, భగవానుడు సర్వజ్ఞుడు* కానీ ఆ జ్ఞానం ఆవర్జన ప్రతిబద్ధంగా ఉంటుంది (తెలియదలచిన విషయం మీదికి మనస్సును పోనివ్వడం = జ్ఞానప్రక్రియలో తొలి అంకం) ఉంటుంది. ఏదైనా తెలుసుకోదలచినపుడు చిత్తాన్ని ఆవర్జించి తెలుసుకొంటాడు.

**మి:** పర్యేషణ (searching) మీద బుద్ధుని సర్వజ్ఞత ఆధారపడిన పక్షంలో ఆయన సర్వజ్ఞుడు కాదనవలసివస్తుంది.

---

* *బుద్ధుడు సర్వజ్ఞుడు అంటే లోకంలో మొత్తం ఎన్ని దోమలు, ఎన్ని ఈగలు ఉన్నాయో చెప్పగలడు అని కాదు అని ఆచార్య ధర్మకీర్తి అభిప్రాయం. మనిషి దుఃఖాన్నుండి విముక్తి పొందడానికి అవసరమైన అధ్యాత్మజ్ఞానం మొత్తం బుద్ధునికి తెలుసు. ఇదే ఆయన సర్వజ్ఞత్వం అని ఆచార్యుల అభిప్రాయం.*

*తెలియబడేది (జ్ఞేయం) ఏదైనా సరే ప్రతిదీ రెండు రూపాలు కలిగినట్టిది. 1.సంవృతిరూపం (phenomenon), 2. పరమార్థరూపం (noumenon). ఈ రెండు రూపాలూ ఒక్కసారిగా గోచరమయ్యేది ఒక్క బుద్ధజ్ఞానానికే. కనుక బుద్ధజ్ఞానానికి సర్వాకారజ్ఞానమని పేరు.*

**నా:** మహారాజా, చిత్తం ఏడు విధాలుగా ఉన్నది. రాగం, ద్వేషం, మోహంతోనూ ఇతర క్లేశాలతోనూ కూడిన చిత్తం, శీల సమాధి ప్రజ్ఞలు లేని చిత్తం చాల బరువుగా మందంగా ఉంటుంది. వెదుళ్ళపొదను నరికిన తరువాత ఆ వెదుళ్ళపొదను లాక్కురావాలంటే చాలా బరువుగా ఉంటుంది. మందంగా కదులుతుంది. ఎందుకంటే తీగెలచే రెమ్మలచే వెదుళ్ళు ఒకదానికొకటి ముడిపడియుండడం వల్ల. అలాగే పైన చెప్పబడిన చిత్తం కూడా క్లేశాలచే ముడిపడి బరువుగా ఉంటుంది. మందంగా కదులుతుంది. ఇది ప్రథమచిత్తం.

ఇక ద్వితీయచిత్తం. అధోగతి ద్వారాన్ని మూసివేసినవారు, సమ్యక్‌దృష్టి (right view) కలిగినవారు. శాస్త (బుద్ధుడు) ఉపదేశించిన శాసనాన్ని బాగా తెలిసినవారు అయిన స్రోతాపన్నుల (stream-enterers) చిత్తం కాస్త తేలికగా చురుగ్గా పని చేస్తుంది. ఎందుకంటే మొత్తం పది బరువుల్లో మూడింటిని (సత్కాయదృష్టి, విచికిత్స, శీలవ్రతపరామర్శ) వదిలించుకొని ఆ మేరకు అది పరిశుద్ధం అయింది కనుక. వెదుళ్ళ మోపులోని వెదుళ్ళను మొదటి మూడు కణుపుల వరకు తీగెలు రెమ్మలు త్రెంచివేసి శుభ్రం చేస్తే ఆ మేరకు అది కాస్త వేగంగా లాగడానికి వీలవుతుందికదా!

ఇక మూడవ చిత్తం. సకృదాగాములయినవారు (once-returners) నాలుగవ, ఐదవ బరువులైన రాగద్వేషాలను బాగా తగ్గించుకొన్నవారు. దీనివల్ల వీరి చిత్తం ఇంకాస్త వేగమూ చురుకుదనం కలిగియుంటుంది. వెదుళ్ళ మోపులోని ఐదు కణుపుల వరకు చివ్వి శుభ్రం చేస్తే ఆ మేరకు అది తేలిక అయి లాగడానికి సులభం అవుతుందికదా!

ఇక నాలుగవ చిత్తం. అనాగాములయినవారు (non-returners) నాలుగవ ఐదవ బరువులైన రాగద్వేషాలను పూర్తిగా తగ్గించుకొన్నవారు కనుక వీరి చిత్తం దానికి తగినట్లుగా మరింత తేలికను వేగాన్ని సంతరించుకొంటుంది. (వెదుళ్ళ ఉదాహరణ ఇక్కడ మరియూ తరువాత కూడా వస్తుంది).

ఇక ఐదవ చిత్తం. క్షీణాస్రవులు*, ధౌతమలులు (whose stains are washed dway,), నిఃక్లేశులు, ఉషితవంతులు (who lieved the life,), కృతకరణీయులు

---

* *ప్రచండ వేగంతో ప్రవహిస్తున్న నదిలో పడిపోయినవానికి ఇష్టం వచ్చిన దిశగా ఈదే స్వాతంత్ర్యం ఉండదు. ప్రవాహం నెట్టుతున్న దిశగానే అస్వతంత్రుడుగా కొట్టుకపోవాలి. చేతులు కాళ్ళు కట్టివేసి బరబరా ఈడ్చుకొని పోబడుతున్నవానికీ స్వాతంత్ర్యం ఉండదు. ఈడ్చిన దిశగా వివశుడుగా పోవలసిందే. ప్రవాహంవలె బంధనంవలె పుద్గలుణ్ణి ;person) అస్వంత్రుణ్ణి వివశుణ్ణి చేసి ఆడిస్తున్న చిత్తమలినాలకు పెట్టిన అనేక పేర్లలో ఆసవం అనేది ఒక పేరు. ఇంగ్లీషులో influxes, cankers, taints, corruptions, intoxicants, biases అని రకరకాలుగా అనువాదం.*

(చేయవలసినది చేసివేసినవారు) అయిన అర్హతులు మొత్తం భారాన్ని వదిలించుకొన్నవారు, ఆత్మశ్రేయస్సును సాధించినవారు, భవ సంయోజనాలను* (fetters of becoming) త్రెంచివేసినవారు. ప్రతిసంవిత్తులను (four analytical knowledges) సాధించినవారు, శ్రావకభూములందు పరిశుద్ధులయినవారు. వారి చిత్తం చాలా లఘువుగానూ వేగంగానూ ఉంటుంది. కానీ ప్రత్యేకబుద్ధుల చిత్తంతో పోల్చితే మందమే అని చెప్పాలి.

ఇక ఆరవ చిత్తం. స్వాయంభువులు (స్వయంగా తమకు తామే విముక్తిజ్ఞానాన్ని గడించినవారు), ఖడ్గమృగం కొమ్మువలె ఒంటరిగా చరించువారు అయిన ప్రత్యేకబుద్ధుల చిత్తం పరిశుద్ధంగా విమలంగా మిక్కిలి లఘువుగా వేగంగా ఉంటుంది. కానీ వీరి చిత్తం కూడా సర్వజ్ఞబుద్ధచిత్తంతో పోల్చితే మందమే అని చెప్పాలి.

ఇక ఏడవ చిత్తం. దశబలములు, నాలుగు వైశారద్యములు, అష్టాదశ ఆవేణికధర్మములు కలిగినట్టి సర్వజ్ఞులు, సమ్యక్ సంబుద్ధులు, అనంతజినులు (conqueres of the infinite), అనావరణ జ్ఞానులు** అయినట్టివారి చిత్తం అన్ని విధముల పరిశుద్ధి కలిగినట్టిది కనుక చాలా లఘువు, వేగమూ కలిగియుంటుంది. ఉదాహరణకు బలవంతుడైన పురుషుడు దృఢమైన ధనస్సులో వాడియైన బాణాన్ని సంధించి ఒక సన్నని కార్పాసవస్త్రం తెరపైగానీ సన్ననిపట్టువస్త్రం తెరపైగానీ

---

* *1. సత్కాయదృష్టి (false view of self), 2. విచికిత్స (doubt regarding four noble truths), 3. శీలవ్రతపరామర్శ (clinging to mere rites and rituals), 4. కామరాగ (sense desires), 5. ప్రతిఘ (hatred, ill-will), 6. రూపరాగ (craving for fine material existence), 7. అరూపరాగ (craving for immaterial existence), 8. మాన (pride, conceit), 9. ఔద్ధత్య (restlessness, excitement) 10. అవిద్య (ignorance).*

*మొదటి ఐదు, అవరభాగీయ సంయోజనములు (lower fetters). మనం ఇప్పుడున్నట్టి కామధాతువు (disire realm) పట్ల ఆసక్తి కలిగించి బంధించునట్టివి కనుక అవర భాగీయములు. చివరి ఐదు, ఊర్ధ్వ భాగీయములు (higher fetters). ఇవి రూపధాతువు (fine material realm), అరూపధాతువు (immaterial realm) పట్ల ఆసక్తి కలిగించి బంధిస్తాయి. మొదటి మూడు ఛేదించినవాడు స్రోతాపన్నుడు. ఈ మూడింటిని ఛేదించడంతో బాటు 4,5 సంయోజనాల స్థూలరూపాన్ని ఛేదించినవాడు సకృదాగామి 4,5 సంయోజనాల సూక్ష్మరూపాన్ని కూడా ఛేదించిన వాడు అనాగామి. మొత్తం పదింటినీ ఛేదించినవాడు అర్హతుడు.*

** *క్లేశావరణం, జ్ఞేయావరణం లేనివారు.*

ప్రయోగించెననుకొనుము. బాణాన్ని ఆ తెర నిలువరించగలదా? వేగాన్ని తగ్గించగలదా?*

**మి:** వీలు కాదు. ఎందులకనగా తెర చాలా పలుచనిది. బాణం మిక్కిలి వాడియైనది. ధనస్సు దృఢమైనది. ప్రయోగించినవాడు బలవంతుడైన పురుషుడు.

**నా:** అలాగే సమ్యక్ సంబుద్ధుల చిత్తం సర్వత్ర లఘువుగా ప్రవర్తిస్తుంది. ఎందులకనగా సర్వత్ర పరిశుద్ధం కనుక. భగవానుని చిత్తం పరిశుద్ధం, లఘువు కనుక యమక ప్రాతిహార్యాన్ని** (twin miracle) చూపించగలిగాడు. భగవంతుని చిత్తం మిక్కిలి లఘువు పరిశుద్ధం అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకే మున్నది? భగవానుని సర్వజ్ఞజ్ఞానం ఆవర్జనప్రతిబద్ధమని పూర్వమే చెప్పియున్నాను. కానీ ఈ ఆవర్జనం భగవానునిలో చాలా వేగంగా జరుగుతుంది. ఒక చేతిలోని వస్తువును మరో చేతికి మార్చడం ఎంత సమయం తీసుకొంటుందో నోటిలోని ముద్దను మింగడానికి ఎంత సమయం పట్టుందో, కంటిరెప్పలు మూయడం తెరవడం ఎంత సమయం పట్టుందో, చేతిని మడవడానికీ, సాచడానికి ఎంత సమయం పట్టుందో అంతకన్నా వేగంగా భగవానుని ఆవర్జనచిత్తం ప్రవర్తించగలదు.

**మి:** ఆవర్జనచిత్తం అనగానే పర్యేషణ (search) ఉన్నదని తెలుస్తున్నది. కనుక దీని మీద స్పష్టీకరణం అవసరం అవుతున్నది.

**నా:** మహారాజా, ఒక ధనికుడున్నాడు. అతని ఇంట శాలి, వ్రీహి, యవ, తండుల, తిల, ముద్గ, మాష ఇంకా ఇతర ధాన్యాలు; నేయి, వెన్న, పాలు, పెరుగు, తేనె మొదలగునవి; సువర్ణం, వెండి మొదలగునవి ఆయా భాజనాల్లో దండిగా ఉన్నాయి. ఆ ఇంటికి ఒక గౌరవనీయ అతిథి వేళగాని వేళ వచ్చాడు. అప్పటికి ఆ ఇంటిలో అందరి భోజనాలయ్యాయి. గిన్నెలు, పాత్రలు కడిగి బోర్లించడం కూడా అయిపోయింది. అతిథికోసం మళ్ళీ వంట ఏర్పాట్లు జరిగింది. మహారాజా, వేళగానివేళ ఇంటికి వచ్చిన అతిథికి తక్షణమే భోజనం పెట్టలేకపోయిన ఆ యజమాని ఆ కారణంగా దరిద్రుడు, కృపణుడు అయిపోతాడా?

**మి:** అవడు. చక్రవర్తి ప్రాసాదంలో అయినా సరే వేళగాని వేళ భోజనం ఉండదు. ఇక మామూలు గృహపతుల విషయం చెప్పాలా?

---

** ఈ పేరాలోని కొన్ని పదాలకు వివరణం చూడుడు అనుబంధం-2*

*** చూడుడు అనుబంధం-2*

**నా:** అలాగే మహారాజా, ఆవర్జనప్రతిబద్ధం అయినంతమాత్రాన తథాగతుని జ్ఞానం సర్వజ్ఞతాజ్ఞానం కాకుండాపోదు.

**మి:** భంతే నాగసేనా, బుద్ధుడు సర్వజ్ఞుడు అని నిరూపించడానికి బలమైన కారణాలు చెప్పావు. బుద్ధుడు సర్వజ్ఞుడు అని నేను ఒప్పుకొంటున్నాను.

## 500 ఏండ్ల తరువాత

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా చెప్పియున్నాడు: "ఆనందా, ఐదువందల ఏండ్లు మాత్రమే సద్ధర్మం నిలిచియుంటుంది." మళ్ళీ భగవానుడు పరినిర్వాణ సమయంలో సుభద్రుడు అడిగిన ప్రశ్నకు బదులు చెబుతూ ఇలా అన్నాడు: "భిక్షువులు చక్కగా నడుచుకొన్నంతకాలం అర్హతులు లేనిదిగా లోకం దిగజారిపోదు." ఒకే విషయం మీద రెండు భిన్న కథనాల వల్ల అనిశ్చితి కలుగుతున్నది. మొదటి వాక్యమే తథాగతవాక్యంగా స్వీకరించాలి అంటే రెండవ వాక్యం మిథ్య (false) అయిపోతుంది. రెండవ వాక్యమే తథాగతుడు చెప్పినది అంటే మొదటి వాక్యం మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక (double-pronged) ప్రశ్న. గహనం కంటే గహనమైన ప్రశ్న. బలమైన ప్రశ్న కంటే బలమైన ప్రశ్న. గ్రంథులలో (knots) గ్రంథితర ప్రశ్న. (more knotty) ఈ ప్రశ్న ఇప్పుడు నీ ముందుకు వచ్చింది. సముద్రజలమధ్యంలో మకరం వలె ఈ ప్రశ్న విషయంగా నీ జ్ఞానబలాన్ని ప్రదర్శించుము.

**నా:** మహారాజా, రెండు వాక్యాలూ బుద్ధభాషితాలే. ఆనందునికి చెప్పిన వాక్యం, సుభద్రునికి చెప్పిన వాక్యం రెండూ భగవానుని వాక్యాలే. కానీ ఆ రెండు వాక్యాలు అర్థంలోనూ, శబ్దంలోనూ భిన్నభిన్నములు. ఒకటి శాసనపరిచ్ఛేద వాక్యం (time limit for the teachings), మరొకటి ప్రతిపత్తి (practice) గురించి చెప్పే వాక్యం. ఈ రెండు వాక్యాలు పరస్పరం చాలా దూరము, భిన్నము. నభస్సు (sky) పృథివి కన్నా దూరము భిన్నము అయినట్లు, స్వర్గము, నరకము పరస్పరం దూరం భిన్నం అయినట్లు, కుశలకర్మలు, అకుశలకర్మలు పరస్పరం దూరం, భిన్నం అయినట్లు, సుఖమూ దుఃఖమూ ఒకదానికొకటి భిన్నమూ, దూరమూ అయినట్లు పై రెండు వాక్యాలున్నూ అన్యోన్యం దూరమూ భిన్నమూ అయినట్టివి. అయినా మహారాజా, నీ ప్రశ్న వ్యర్థం కారాదు కనుక దీనిమీద విశేష వివరణం ఇస్తాను. "ఆనందా, ఐదువందల ఏండ్లు సద్ధర్మం నిలిచియుంటుంది" అని భగవానుడు పలికి మళ్ళీ ఇలా అంటాడు: "ఆనందా, భిక్షుణిలను చేర్చుకోకుండా ఉండినట్లయితే సద్ధర్మం వేయి సంవత్సరాలు నిలిచియుండేది." ఇక్కడ ఈ వాక్యంలో భగవానుడు సద్ధర్మం అంతరించిపోతుందని చెప్పాడా?

**మి:** లేదు భంతే.

**నా:** మహారాజా, నష్టాల పాలయిన ఒక పురుషుడు జనులకు ఇలా ప్రకటించాడు: "నా ఆస్తిలో ఇంత నష్టమయ్యింది. ఇంకా ఇంత మిగిలియున్నది." అలాగే భగవానుడు కూడా సద్ధర్మం విషయంలో ఎంత నష్టం జరిగిందో ఎంత మిగిలియున్నదో మనుష్యులకు దేవతలకు ప్రకటించాడు. కనుక ఈ వాక్యం శాసనపరిచ్ఛేదాన్ని (time-limit for the teachings) తెలిపే వాక్యం. మహారాజా, పరినిర్వాణ సమయంలో భగవానుడు సుభద్రునికి చెప్పిన వాక్యం ప్రతిపత్తికి (practice of Dhamma) సంబంధించినది. నీవు ఈ రెంటిని ఒకటి చేసి ప్రశ్నించావు. నేను ఈ రెండు భిన్నవాక్యాలకు సంబంధం చూపుతూ సమాధానం చెబుతాను. బాగా విను, మనస్సు పెట్టి విను, ఏకాగ్రచిత్తంతో విను. మహారాజా, ఒకానొక తటాకం ఉన్నది. స్వచ్ఛమైన జలంతో నిండియున్నది. ఆ తటాకం చుట్టూ దృఢమైన కరకట్ట(embankment)యున్నది. పైన మహామేఘుడు ఎడతెరపి లేకుండా వర్షిస్తున్నాడు. ఆ తటాకంలోని నీళ్ళకు ఏనాటికైనా క్షయించిపోవడం. అంతరించిపోవడం జరుగుతుందా?

**మి:** జరుగదు.

**నా:** ఎందుకు జరుగదు?

**మి:** పైన మహామేఘుడు అదే పనిగా వర్షం కురిపిస్తూ ఉండడం వల్ల.

**నా:** అలాగే బుద్ధశాసనం అనే సద్ధర్మతటాకం ఆచారము (good conduct), శీలము (morality), గుణం (special qualities), వృత్తం (right customs), ప్రతిపత్తి (practice) అనే స్వచ్ఛజలముచే నిండియున్నది. భవమును (becoming) అణగద్రొక్కియున్నది. బుద్ధపుత్రులు (spiritual sons of Buddha) ఆచార శీల గుణ వృత్త ప్రతిపత్తి వర్షాన్ని ఎడతెరపి లేకుండా కురిపిస్తూ ఉంటే సద్ధర్మ తటాకం దీర్ఘకాలం ఎండిపోకుండా ఉంటుంది. లోకం అర్హతులు లేనిదిగా దిగజారిపోదు. ఈ అర్థాన్నే భగవానుడు సుభద్రునికి చెప్పిన వాక్యంలో ఉద్దేశించాడు. మహారాజా, మహాఅగ్నిస్కంధం జ్వలిస్తూ ఉంటే మనుష్యులు దానిలో కాష్ఠములను, తృణమును, పిడకలను ఎడతెరపి లేకుండా వేస్తుంటే ఆ అగ్నిస్కంధం ఆరిపోతుందా?

**మి:** ఆరిపోదు పైగా ఇంకా ఎక్కువ జ్వలిస్తుంది. ఇంకా ఎక్కువ ప్రకాశిస్తుంది.

**నా:** అలాగే మహారాజా, ఆచార, శీల, గుణ, వృత్త, ప్రతిపత్తిరూపమైన జినశాసనం కూడా పదివేల లోకధాతువులలో ప్రకాశిస్తూ వెలుగును ఇస్తుంది. జినసుతులు ఐదు

ప్రధానాంగములు* కలిగినవారై, ఎల్లప్పుడూ జాగరూకులైన వారై, మూడు శిక్షాపదాలను (అధిశీలం, అధిచిత్తం, అధిప్రజ్ఞ) అభ్యసించువారై యున్నచో జినశాసనం చిరకాలం నిలిచియుండగలదు. అర్హతులు లేనిదిగా లోకం ఉండదు. ఈ అర్థాన్ని ఉద్దేశించినట్టిదే సుభద్రునికి చెప్పిన వాక్యం. మహారాజా, మనుష్యులు ఒక శుద్ధమైన విమలమైన, మెరుస్తున్న అద్దాన్ని మెత్తని పొడితో రుద్దుతూ శుభ్రంగా ఉంచుతుంటే ఆ అద్దం మీద దుమ్ము, దూళి చేరి మసకబారుతుందా?

**మి:** మసకబారదు భంతే, పైగా ఆ అద్దం ఇంకా విమలతరం అవుతుంది.

**నా:** అలాగే మహారాజా, జినశాసనం ప్రకృతినిర్మలమైనది (stainless by nature). క్లేశరజస్సు తొలగినట్టిది. బుద్ధపుత్రులు గనుక ఆచార, శీల, గుణ, వృత్త, ప్రతిపత్తి, వినయ, ధుత (austerity) గుణములు కలిగియుండడము ద్వారా జినశాసనాన్ని శిరసావహించారంటే శాసనం చిరకాలం ఉంటుంది. అర్హతులు లేనిదిగా లోకం ఉండదు. ఈ అర్థాన్ని ఉద్దేశించినదే సుభద్రునికి చెప్పిన వాక్యం.

**మి:** భంతే నాగసేనా, సద్ధర్మ అంతర్ధానం గురించి ప్రస్తావించావు. ఏమిటది?

**నా:** మహారాజా, సద్ధర్మ అంతర్ధానము మూడు విధాలు. అవి ఏవనగా, 1. అధిగమ అంతర్ధానం (అంటే సాక్షిజనులు లేకపోవడం. ఆర్యసత్యాలను సాక్షాత్కరించుకొన్నవారికి సాక్షిజనులు అని పేరు) 2. ప్రతిపత్తి (practice) అంతర్ధానం 3. లింగ (outward sign) అంతర్ధానం. అధిగమం అంతర్హితమైపోతే అంటే సాక్షిజనులు లేకపోతే ప్రతిపత్తి కలిగినవానికి కూడా సరియైన మార్గం ఏమిటో తెలుసుకొనే భాగ్యం ఉండదు. ప్రతిపత్తి అంతర్హితమైతే శిక్షాపదములు (rules of training) నిరుపయోగం అవుతాయి. కేవలం కాషాయధారణం, ముండనం లాంటి బాహ్యాచిహ్నాలు మాత్రం మిగులుతాయి. లింగం కూడా అంతర్హితమైపోతే ధర్మపరంపరకు (సంప్రదాయం=tradition) విచ్ఛిత్తి (break) ఏర్పడుతుంది. ఇవియే మూడు విధములైన అంతర్ధానములు.

**మి:** భంతే నాగసేనా, నా ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పావు. గంభీరంగా ఉన్నదాన్ని తేటతెల్లం చేశావు. ముడి (knot) విడిపోయింది. పరవాదములు నష్టములైనాయి, భగ్నములైనాయి, వెలవెలబోయాయి. గణాచార్యులలో నీవు వృషభం వంటివాడవు (శ్రేష్ఠుడవు).

---

* *శ్రద్ధ, ఆరోగ్యం, రుజుత్వం, వీరియం, ప్రజ్ఞ–ఇవి ఐదు ప్రధానాంగములు. (five factors of striving)*

*Note: సద్ధర్మ పతనక్రమం ఎలా ఉంటుందనే విషయమై ఆనాటి ఒక భవిష్యవాణి: మొదటి ఐదువందలఏండ్లు అర్హతులకు కొరత ఉండదు. ఆ తరువాత ఐదువందల ఏండ్లకు అర్హతులు కనిపించడం అరుదైపోతుంది కానీ ధ్యానులు కనిపిస్తారు. ఆపైన ఐదువందలఏండ్లకు ధ్యానులు కూడా అరుదైపోతారు. పండితులు (scholars) ఉంటారు. ఆ తరువాత ఐదువందలఏండ్లకు పండితులూ కనపడరు. కట్టడాలు కట్టించేవాళ్ళు కనిపిస్తారు. ఆ తరువాత ఐదువందలఏండ్లకు వాళ్ళూ కనిపించరు. కిల్లికజ్జాలు పెట్టుకొని తగవులతోనే జీవితం వెళ్ళబుచ్చే అల్పమానసులుంటారు.*

## దేవదత్తుని ద్వేషం

**మి:** భంతే నాగసేనా, తథాగతుడు అకుశలం (unwholesome mental states) మొత్తాన్ని దగ్ధం చేసి సర్వజ్ఞత్వం పొందాడా? లేక అకుశలం కొంచం మిగిలియుండగానే సర్వజ్ఞత్వం పొందాడా?

**నా:** మహారాజా, అకుశలం మొత్తాన్ని దగ్ధం చేసియే భగవానుడు సర్వజ్ఞత్వం పొందాడు. భగవానునిలో అకుశలం కొంచం కూడా మిగిలియుండలేదు.

**మి:** తథాగతుని దేహంలో దుఃఖవేదనలు ఉత్పన్నమయ్యాయా?

**నా:** అవును. ఉత్పన్నమయ్యాయి. గృధ్రకూటంలో శిలాశకలం దూసుకరావడం వల్ల పాదానికి గాయం అయ్యింది. అతిసారం వల్ల కలిగిన బాధకు జీవకుడు వైద్యం చేశాడు. వాతసంబంధమైన బాధ ఒకసారి కలిగినపుడు ఉపస్థాయక స్థవిరుడు (serving elder monk) వేన్నీళ్ళవైద్యం చేశాడు.

**మి:** తథాగతుడు మొత్తం అకుశలాన్ని దగ్ధం చేసివేసి సర్వజ్ఞత్వం పొందియుండిన పక్షంలో నీవు చెప్పిన దుఃఖవేదనవాక్యాలు మిథ్య (false) అవుతాయి. దుఃఖ వేదనానుభవ వాక్యాలు నిజమైతే "తథాగతుడు మొత్తం అకుశలాన్ని దగ్ధం చేసివేసి సర్వజ్ఞత్వం పొందాడు" అనే వాక్యం మిథ్య అవుతుంది. వేదనలన్నీ కర్మఫలములు, కర్మమూలకములు. కర్మ వల్లనే వేదనానుభవం. కనుక ఈ ప్రశ్న కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనిని నీవు ఎలా పరిష్కరిస్తావో పరిష్కరించు.

**నా:** మహారాజా, వేదనానుభవం అంతా కర్మమూలకం కాదు. ఎనిమిది కారణాలచే వేదనలు ఉత్పన్నం అవుతాయి. 1. వాతం (wind) వల్ల, 2. పిత్తం (bile) వల్ల, 3. శ్లేష్మం (phlegm) వల్ల, 4. ఈ మూడింటి సన్నిపాతం (combination) వల్ల. 5.రుతుపరిణామం (change of weather) వల్ల, 6. ప్రతికూలమైన అన్నపానాదుల

సేవనం వల్ల, 7. ఉపక్రమం* వల్ల, 8. కర్మవిపాకం (result of karma) వల్ల. ఈ ఎనిమిది కారణాల వల్ల బహుజనులు వేదనలు పొందుతారు. ఎవరైతే బాధలన్నీ కర్మవల్లనే అని చెబుతారో – తక్కిన ఏడు కారణాలను లెక్కలోకి తీసుకోరో వారి వాక్యం మిథ్యావాక్యం అవుతుంది.

**మి:** భంతే నాగసేనా, నీవు వల్లించిన ఏడు కారణాలు కూడా కర్మ వల్లనే సంభవిస్తాయి.

**నా:** మహారాజా, కర్మవల్లనే అన్ని బాధలు కలిగే పక్షంలో వాటి విభాగాలను చూపించే లక్షణాలకు (characteristics) ఆస్కారం లేకుండా పోతుంది. వాతం ప్రకోపించినపుడు పది కారణాల వల్ల ప్రకోపిస్తుంది. 1.శీతలం వల్ల, 2. ఉష్ణం వల్ల, 3. ఆకలి వల్ల, 4. దప్పిక వల్ల, 5.అతిభుక్తం (over-eating) వల్ల, 6. ఎక్కువ సేపు నిలబడడం వల్ల, 7.అధికశ్రమ వల్ల, 8. ఎక్కువ నడవడం, పరుగెత్తడం వల్ల, 9. ఉపక్రమం వల్ల, 10. కర్మవిపాకం వల్ల. మొదటి తొమ్మిది కారణాలు అతీత (past) అనాగత (future) కాలాల్లో సంభవించవు. వర్తమానంలో సంభవిస్తాయి. కనుక వేదనలన్నీ కర్మ వల్లనే సంభవిస్తాయి అని చెప్పరాదు. పిత్తం ప్రకోపించడం మూడింటి వల్ల. 1. శీతం, 2. ఉష్ణం, 3. ప్రతికూల (unsuitable) ఆహారం. అలాగే శ్లేష్మం ప్రకోపించడం కూడా మూడింటివల్లనే. ఈ వాత పిత్త శ్లేష్మాలు మూడూ కలిసి ప్రకోపించినపుడు దానికి తగ్గట్లుగా ఆయా వేదనలు ఉత్పన్నమవుతాయి. రుతుపరిణామం వల్ల, ప్రతికూల అన్నపానాల సేవనం వల్ల ఆయా వేదనలు కలుగుతాయి. ఇక ఉపక్రమం అనేది కేవలం పరచేష్టితములు. దాని వల్లనూ వేదనలు కలుగుతాయి. ఇక కర్మవిపాకం వల్ల జనించే వేదనలూ ఉన్నాయి. ఈ వేదనలు పూర్వం చేసుకొన్న కర్మఫలితాలవుతాయి. కనుక మహారాజా, కర్మవిపాకం వల్ల కలిగే వేదనలు తక్కువ. ఇతర కారణాల వల్ల కలిగే వేదనలు ఎక్కువ. "అన్నీ కర్మవల్లనే" అని బాలురు (fools) అతిప్రసంగం చేస్తారు. కర్మ–కర్మఫలవ్యవస్థానం** అనేది ఒక్క బుద్ధజ్ఞానానికి మాత్రమే వీలయ్యే విషయం.

---

* *ఎదుటి వ్యక్తికి అప్రియం ఆచరించదలచినవాడు తిట్టడం లేదా కొట్టడం చేస్తాడు. దీనికి ఉపక్రమం అని పేరు. అస్త్రశస్త్రాదులతో హతం చేయడం కూడా ఉపక్రమం అవుతుంది. తనకు తాను ఏదైనా చేసుకోవడం కూడా ఉపక్రమం క్రిందకు వస్తుంది. (తలబాదుకోవడం ఇత్యాదులు).*

** *నెమలిపించెంలో ఆ వర్ణాలు, ఆ కూర్పు, ఆ మృదుత్వం ఏఏ కారణాల వల్ల ఏర్పడిందో చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. అది సాధ్యమయ్యేది కేవలం బుద్ధభగవానుని సర్వజ్ఞ జ్ఞానబలానికే.*

***– స్థవిర రాహులుడు***

మహారాజా, శిలాశకలం వల్ల భగవానుని పాదానికి కలిగిన బాధ వాతం వల్ల, పిత్తం వల్ల, శ్లేష్మం వల్ల, సన్నిపాతం వల్ల, ఋతుపరిణామం వల్ల, విషమ ఆహారం వల్ల, కర్మవిపాకం వల్ల కలుగలేదు. ఉపక్రమం వల్ల కలిగింది. దేవదత్తుడు అనేక లక్షల జన్మలనుండి* తథాగతుని మీద ద్వేషం కలిగియున్నాడు. ఆ ద్వేషకారణంగా అతడు పెద్దబండను "ఇది తల మీద పడనీ" అనుకొని భగవానుని మీదికి దొర్లించాడు. కానీ అది మధ్యలో మరో రెండు పెద్ద శిలలు అడ్డు తగలడంతో తునాతునకలయి ఒక చిన్న తునక భగవానుని పాదాన్ని గాయపరచింది. మహారాజా, భగవానునికి కలిగిన ఆ వేదనకు కారణం కర్మవిపాకమైనా కావాలి లేదా కేవలం క్రియ (ఉపక్రమం) అయినా కావాలి. ఈ రెంటికి అతీతంగా వేరే కారణం లేదు.

మహారాజా, నాటిన విత్తనం మొలకెత్తకపోతే దానికి కారణం ఆ భూమిదోషం అయినా కావాలి. లేదా బీజదోషం అయినా కావాలి. తినిన ఆహారం జీర్ణం కాలేదంటే ఆహారదోషం అయినా కావాలి లేదా జీర్ణకోశదోషం అయినా కావాలి. అలాగే భగవానునికి కలిగిన వేదనకు కారణం కర్మవిపాకం అయ్యుండాలి లేదా కేవలం క్రియవల్లనైనా అయ్యుండాలి. ఇక వేరే కారణానికి ఆస్కారం లేదు.

మహారాజా, భగవానునికి కర్మవిపాకమైన వేదన లేదు. విషమ ఆహారం వల్ల కలిగే వేదనా లేదు. మిగిలిన ఆరు కారణాల్లో దేనివల్లనయినా భగవానునికి వేదన ఉత్పన్నం అయ్యే అవకాశం ఉన్నది. కానీ ఆ వేదన భగవానుని జీవితానికి ముప్పు కలిగించజాలదు.

మహారాజా, మనుష్యులు భూమిని గునపాలతో పొడుస్తారు, పారలతో త్రవ్వుతారు. ఇది భూమి చేసుకొన్న పూర్వకర్మ ఫలితమా?

**మి:** కాదు భంతే.

**నా:** అలాగే భగవానునికి కలిగిన వేదనలు కూడా కర్మవిపాకం వల్ల కలిగినవి కావు. తక్కిన ఆరు కారణాల్లో ఏదో ఒకదాని వల్ల కలిగినట్టివి.

**మి:** సాధు సాధు భంతే. నేను నీతో ఏకీభవిస్తున్నాను.

---

** కాలం అనాది. కనుక గణనలో మనస్సుకు ఆయాసం కలుగనంతవరకు గతాన్ని ఎంతైనా వెనక్కి నెట్టుతూ పోవచ్చు. దేవదత్తుడు లక్షల జన్మల్లో బోధిసత్త్వునికి సమకాలికుడుగా తారసపడడం వరుసగా జరిగింది కాదు. జన్మజన్మకు మధ్య యుగయుగాల అంతరం (gap) ఉన్నది. ఇది అసంభవం ఏమీకాదు. కాలం అనాది!*

## ప్రతిసంలయనం*

**మి:** భంతే నాగసేనా, "తథాగతుడు ఏదైతే సాధించవలసియున్నదో అది అంతా బోధివృక్షం క్రింద సాధించాడు. ఇక ఆపైన సాధించవలసినది ఏమీ ఆయనకు లేదు" అని మీ భిక్షువులు అంటుంటారు. మళ్ళీ మీ భిక్షువులే "ప్రతిసంలయనం కోసం భగవానుడు మూడు మాసాలపాటు పారిలేయక వనంలో ఏకాంతవాసం చేశాడు" అంటారు. సాధించవలసింది సాధించినవానికి ఆపైన ప్రతిసంలయనంతో పని లేదు. ఇంకా చేయవలసింది మిగిలియున్నవానికే ప్రతిసంలయనం అవసరం. రోగిగా ఉన్నవానికే ఔషధంతో అవసరం ఉంటుంది. రోగం లేనివాడికి అవసరం ఉండదు. ఆకలితో నకనకలాడుతున్నవానికే భోజనం అవసరం. ఆకలి లేనివానికి అవసరం లేదు. కనుక మొదటి వాక్యం సత్యమైతే రెండవ వాక్యం మిథ్య అవుతుంది. రెండవ వాక్యం సత్యమైతే మొదటి వాక్యం మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. ఈ ప్రశ్నకు ఎలా సమాధానం చెబుతావో చెప్పుము.

**నా:** రెండు వాక్యాలూ సత్యములే. ప్రతిసంలయనం వల్లనే తథాగతులందరూ సర్వజ్ఞత్వం సాధించారు కనుక కాలాంతరంలో కూడా వారు ప్రతిసంలయన గుణాలను స్మరించి అపుడపుడు ప్రతిసంలయనం కోరుకొంటారు. ఒకానొక పురుషుడు రాజునుండి వరం పొంది తద్వారా భోగభాగ్యాలు పొందినాడనుకో. ఆతడు కాలాంతరంలో ఆ శుభసందర్భాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని రాజసన్నిధికి అపుడపుడు వెళ్ళడం చేస్తాడుకదా! ఒకానొకడు వ్యాధిపీడితుడై చాలా దుఃఖం అనుభవించి ఆ తరువాత ఒక వైద్యుని వద్దకు వెళ్ళి వైద్యం చేసుకొన్నాక వ్యాధి ఉపశమించి సుఖితుడయ్యాడు. కాలాంతరం లోనూ అతడు తనకు సుఖాన్ని ఇచ్చిన ఆ వైద్యుణ్ణి మాటిమాటికి దర్శిస్తుంటాడుకదా! అలానే తథాగతులు అందరూ కూడా ప్రతిసంలయనం ద్వారానే సర్వజ్ఞత్వం పొందారు. కనుక ఆ ప్రతిసంలయన గుణాలను స్మరిస్తూ వారు కాలాంతరం లోనూ అప్పుడప్పుడూ ప్రతిసంలయనంకోసం ఏకాంతవాసం కోరుకొంటారు. మహారాజా, ప్రతిసంలయనం ఇరవైఎనిమిది గుణాలుకలిగియున్నది. 1. ప్రతిసంలయనం, ప్రతిసంలీయుడైన ధ్యాయిని కాపాడుతుంది. 2. ఆయుష్షను పెంచుతుంది, 3. బలాన్ని ఇస్తుంది. 4. వద్యములను (blame-worthy acts) తలెత్తనీయదు, 5. అకీర్తిని కలిగించదు, 6. కీర్తిని కలిగిస్తుంది,

---

* *అనేకమైన వ్యాపకాలనుండి చిత్తాన్ని మరలించి ధ్యాననిమగ్నం కావించడాన్ని ప్రతిసంలయనం అంటారు. లౌకికవ్యవహారాల్లో చిత్తం అలసిపోయినపుడు దానికి విశ్రాంతిని ఇవ్వడం కోసం ధ్యానులు ప్రతిసంలయనం పాటిస్తారు. పాళీలో పటిసల్లానం.*

7. అరతిని (boredom) పారద్రోలుతుంది, 8. ఆనందాన్ని కలిగిస్తుంది, 9. భయాన్ని పోగొట్టుంది, 10. వైశారద్యాన్ని (self-confidence) కలిగిస్తుంది, 11. కౌసీద్యాన్ని (laziness) వదలగొట్టుంది. 12. వీరియాన్ని (mental energy) కలిగిస్తుంది 13. రాగాన్ని వదిలిస్తుంది, 14. ద్వేషాన్ని వదిలిస్తుంది, 15. మోహాన్ని వదిలిస్తుంది, 16. మానాన్ని (conceit) అణచివేస్తుంది, 17. వితర్కాన్ని (సంశయాన్ని) విరిచివేస్తుంది. 18. చిత్తానికి ఏకాగ్రతను కలిగిస్తుంది, 19. మనస్సుకు మార్దవాన్ని కలిగిస్తుంది, 20. హాసం (joy) కలిగిస్తుంది. 21. గాంభీర్యాన్ని ఇస్తుంది, 22. ఆధ్యాత్మికలాభాన్ని కలిగిస్తుంది, 23. నమస్కరించదగిన వానిగా చేస్తుంది, 24. ప్రీతిని (rapture) కలిగిస్తుంది, 25. ప్రామోద్యం (delight) కలిగిస్తుంది. 26. సంఖారముల (mental formations) స్వభావాన్ని* తెలియజేస్తుంది, 27. భవాన్ని (becoming), ప్రతిసంధిని (rearising) పెకలించివేస్తుంది, 28. శ్రామణ్య ఫలాన్ని (నిర్వాణాన్ని) కలిగిస్తుంది. కనుక తథాగతులు అందరూ ప్రతిసంలయనాన్ని సేవిస్తారు.

**మి:** సాధు సాధు నాగసేనా.

## ఇద్ధిబలం

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా చెప్పియున్నాడు: "ఆనందా, నాలుగు ఇద్ధిపాదాలను** (four bases of psychic power) తథాగతుడు బాగా వృద్ధి చేసుకొనియున్నాడు. స్వాయత్తం చేసుకొనియున్నాడు. ఆనందా, తథాగతుడు ఆకాంక్షిస్తే కల్పంగానీ (aeon), కల్పావశేషంగానీ జీవించియుండగలడు." మళ్ళీ మరొకసారి "ఆనందా, ఇక మూడు నెలల తరువాత తథాగతుడు పరినిర్వాణం చెందుతాడు" అని. ఈ రెండు వాక్యాల్లో ఏది భగవానుని వాక్యం? మొదటిది సత్యమయితే రెండవది మిథ్య అవుతుంది. రెండవది సత్యమయితే మొదటిది మిథ్య అవుతుంది. తథాగతుడు వ్యర్థవచనాలు పలుకడు, యథార్థమే పలుకుతాడు. కనుక ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. గంభీరమైన (profound) ప్రశ్న. సునిపుణమైన (very abstruse) ప్రశ్న. ఈ ప్రశ్న నీముందుకు వచ్చింది. దృష్టిజాలాన్ని (net of false views) ఛేదించుము. పరవాదాన్ని పటాపంచలు చేయుము.

**నా:** మహారాజా, రెండు వాక్యాలూ తథాగతుడు భాషించినవే. "ఆకాంక్షిస్తే కల్పకాలం ఉండగలను" అనే వాక్యంలో కల్పం అంటే ఆయుకల్పం (full life span) అని అర్థం.

---

* *అనిత్యం, దుఃఖం, అనాత్మ*

** *చూడుడు అనుబంధం–2*

భగవానుడు ఆ వాక్యంలో తన బలాన్ని కీర్తించలేదు. ఇద్ధిబలాన్ని కీర్తించాడు. ఒక రాజు వద్ద వాయువేగంతో పరుగు తీసే జాతిగుర్రం ఉన్నది. మంత్రులు, సేనాపతులు, బ్రాహ్మణులు, పురప్రముఖులు ఆసీనులైయున్న రాజసభలో ఒకనాడు రాజు ఇలా అన్నాడు: "నా అశ్వాన్ని వదలిపెట్టానంటే క్షణంలో సాగరం వరకు వెళ్ళి తిరిగిరాగలదు." రాజు సభికులకు అశ్వగతిని ప్రదర్శించకపోయినా దానికి అంతటి వేగం ఉన్నది, క్షణంలో సాగరతీరం వరకు వెళ్ళి తిరిగి రాగలదు. అలాగే భగవానుడు కూడా తన అధీనంలో ఉన్న ఇద్ధిబలాన్ని గురించి చెప్పాడు, కానీ దాన్ని ప్రదర్శించలేదు. మహారాజా, అన్నివిధములైన భవముల (becomings) పట్ల భగవానునికి అర్థిత్వం (desire) లేదు. పైగా సర్వభవములను ఈ విధంగా గర్హించాడు: "భిక్షువులారా, స్వల్పమాత్రంగా ఉన్న మలం కూడా దుర్గంధమే. అలాగే భిక్షువులారా, స్వల్పమాత్రమైన భవం కూడా అవాంఛనీయమే. చిటిక వేసినంత స్వల్పకాల భవాన్ని కూడా నేను సమర్థించను." మహారాజా, భవాన్ని దుర్గంధంతో పోల్చిన భగవానుడు ఇద్ధిబలసహాయంతో భవాన్ని కొనసాగించాలనే ఆసక్తి కలిగి యుంటాడా?

**మి:** లేదు లేదు భంతే.

**నా:** కనుక మహారాజా, "కల్పంగానీ కల్పావశేషంగానీ* జీవించియుండగలను" అనే సింహనాదవాక్యం ఇద్ధిబలాన్ని కీర్తించే వాక్యం మాత్రమే.

**మి:** సాధు సాధు నాగసేనా. నేను అంగీకరిస్తున్నాను.

## రద్దు చేసుకోవచ్చు

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, అభిజ్ఞతో (direct knowlege) నేను ధర్మాన్ని ఉపదేశిస్తాను. అభిజ్ఞ లేకుండా కాదు." మళ్ళీ భగవానుడు పరినిర్వాణ సమయంలో "ఆనందా, నేను గతించాక భిక్షుసంఘం కావలనంటే క్షుద్ర (చిన్న =lessor), అనుక్షుద్ర (మరీచిన్న=minor) శిక్షాపదాలను (rules of training) రద్దు చేసుకోవచ్చు" అని వినయ నియమాల సంబంధంగా చెప్పియున్నాడు. ఇక్కడ నా సంశయం ఏమిటంటే క్షుద్ర అనుక్షుద్ర శిక్షాపదాలను ఏ అవసరమూ లేకపోయినా విధించడం జరిగిందా? అజ్ఞానంతో విధించడం జరిగిందా? అట్లు కాని పక్షంలో రద్దు చేసుకోవచ్చని అనుమతించడం దేనికి? "అభిజ్ఞతోనే నేను

---

* *కల్పం అంటే ఇక్కడ వందేండ్ల పూర్ణాయుష్షు అని అర్థం చెప్పుకోవాలి. కొందరు వందకుపైన ఐదు పది ఇరవై ఏండ్లు జీవించేవాళ్ళూ ఉన్నారు. పూర్ణాయుష్షుకు ఈ కొసరు సంవత్సరాలు కూడా చేరితే అది కల్పావశేషం అనబడుతుంది.*

ధర్మాన్ని ఉపదేశిస్తాను" అనే వాక్యం సత్యమైతే రెండవ వాక్యం మిథ్య అవుతుంది. రెండవ వాక్యం సత్యమైతే మొదటిది మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. సూక్ష్మమైన (delicate) ప్రశ్న. చాలా నిపుణము, గంభీరము, అతిగంభీరము, కఠినమైన ప్రశ్న. ఈ ప్రశ్న నీ ముందుకు వచ్చింది. ఈ ప్రశ్న విషయంగా నీ జ్ఞానబలాన్ని ప్రదర్శించుము.

**నా:** మహారాజా, నీవు చెప్పిన రెండు వాక్యాలూ బుద్ధభాషితాలే. రెండవ వాక్యం భిక్షువులను పరీక్షించడానికి చెప్పిన వాక్యం. "రద్దు చేసుకొనే అనుమతి ఇస్తే నా అనంతరం భిక్షువులు చిన్న, మరీ చిన్న శిక్షాపదాలను రద్దు చేసుకొంటారా? అట్లే ఉంచుకొంటారా?" అని పరీక్షించే ఉద్దేశంతో భగవానుడు చెప్పిన వాక్యం. ఒక చక్రవర్తి అవసానదశలో పుత్రులతో "నాయనలారా, సాగరపర్యంతం ఉన్న ఈ మహాజనపదాన్ని ఇప్పుడు మనకున్న బలంతో నిలుపుకోవడం చాలా కష్టం. కనుక నా అనంతరం మీరు సరిహద్దు భూభాగాలను వదులుకొనేందుకు అనుమతి ఇస్తున్నాను" అంటాడనుకో. తండ్రి అనుమతించాడుగదా అని పుత్రులు తండ్రి చనిపోయాక ఆ భూభాగాలకు నీళ్ళు వదులుకొంటారా?"

**మి:** లేదు, లేదు భంతే. ఎంతమాత్రం వదులుకోరు. సాధారణంగా రాజులు లుబ్ధతరులు (more greedy). రాజ్యలోభంతో ఉన్నదాన్ని రెండింతలు మూడింతలు చేయడానికే చూస్తారు. ఉన్నదాన్ని వదులుకొంటారా?

**నా:** అలాగే మహారాజా, భిక్షువులను పరీక్షించడానికి తథాగతుడు క్షుద్ర అనుక్షుద్ర శిక్షాపదాల రద్దుకు అనుమతి ఇచ్చాడు. కానీ బుద్ధపుత్రులు ధర్మలోభం (greedy of Dharma) కలిగినవారు. ఇంకో రెండువందల ఏభై కొత్త శిక్షాపదాలు విధించినా వాటిని కూడా కాపాడుకొంటారు. ఈ వరకే విధించియున్న శిక్షాపదాల విషయం చెప్పాలా?

**మి:** భంతే నాగసేనా, క్షుద్ర అనుక్షుద్ర శిక్షాపదాలు అని భగవానుడు ప్రస్తావించాడు. జనులు ఈ పదాల విషయంగా సమ్మోహం (confusion), సంశయం పాలయ్యారు. "ఏవి క్షుద్రములు? ఏవి అనుక్షుద్రములు"* అని.

---

* *ప్రథమ సంగీతిలో మొత్తం సూత్రాలను వల్లించిన ఆనందుడు రెండుసార్లు భిక్షువుల అభిశంసనకు (censure) గురి అయ్యాడు. 1. "నేను ఆకాంక్షిస్తే కల్పంగానీ కల్పావశేషంగానీ ఉండగలను" అని భగవానుడు చెప్పినప్పుడు మౌనంగా ఎందుకుండిపోయావు? ఉండమని ప్రార్థించియుండాలికదా! 2. క్షుద్ర, అనుక్షుద్ర శిక్షాపదాలు అని భగవానుడు చెప్పినపుడు అవి ఏవి? అని వివరం ఎందుకు అడగలేదు?*

**నా:** మహారాజా, దుష్కృతాన్ని (wrong doing) నిషేధించే శిక్షాపదాలకు క్షుద్రములు అని పేరు. దుర్భాషితాన్ని (wrong speech) నిషేధించే శిక్షాపదాలకు అనుక్షుద్రములు అని పేరు. మహారాజా, పూర్వం ప్రథమసంగీతిసభ్యులైన మహాస్థవిరులు కూడా ఈ విషయం సభలో ప్రస్తావనకు వచ్చినపుడు సంశయం పాలయ్యారు, ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

**మి:** భంతే నాగసేనా, ఇంత సుదీర్ఘకాలం నిగూఢంగా ఉన్న విషయాన్ని నేడు నీవు లోకానికి తేటతెల్లం చేశావు. సాధు సాధు నాగసేనా!

## మౌనం

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా భాషించినాడు: "ఆనందా, ధర్మాన్ని ఉపదేశించే విషయంలో తథాగతుడు ఆచార్యముష్టిని* (closed fist of a teacher) పాటించడు." కానీ ఒకసారి భగవానుడు, మాలుంక్యపుత్రుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయాడు. నేను ఇప్పుడు వేయబోయే ప్రశ్నకు రెండు అంచులున్నాయి. సమాధానం ఏదో ఒక అంచు మీదనే నిలబడవలసిన అవసరం ఉండే ప్రశ్న నాది. మాలుంక్యపుత్రుని ప్రశ్నకు సమాధానం తనకు తెలియనందువల్ల భగవానుడు మౌనం వహించాడా? సమాధానం తెలిసుండీ దాన్ని చెప్పకుండా ఆచార్యముష్టికి పాల్పడినాడా? ఈ ఉభయకోటిక ప్రశ్నకు ఎలా సమాధానం చెబుతావో వింటాను.

**నా:** "ఆనందా, తథాగతుడు ఆచార్యముష్టిని పాటించడు" అనే వాక్యం భగవానుని వాక్యమే. మాలుంక్యపుత్రుని ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మౌనం పాటించడమూ నిజమే. కానీ ఈ మౌనానికి కారణం తెలియనితనం కాదు, ఆచార్యముష్టీ కాదు. మహారాజా, ప్రశ్నలకు సమాధానాలు నాలుగు విధాలుగా** ఉంటుంది. 1. ఏకాంశవ్యాకరణీయం, 2. విభజ్యవ్యాకరణీయం, 3. పరిపృచ్ఛ్య వ్యాకరణీయం, 4. స్థాపనీయం. ఏకాంశవ్యాకరణీయం అంటే ఏమిటి? రూపం (material form) నిత్యమా? అనిత్యమా? అని అడిగితే అనిత్యమే అని నిస్సంశయంగా సమాధానం చెప్పడం. విభజ్యవ్యాకరణీయం అంటే ఏమిటి? రూపమే అనిత్యమా? అని అడిగితే వేదనలూ అనిత్యమే, సంజ్ఞలూ (perceptions) అనిత్యమే, సంఖారములూ (mental

---

* *పూర్వకాలంలో ఆచార్యులు తమకు తెలిసినదంతా శిష్యులకు చెప్పేవారు కాదు. కొంత చెప్పి కొంత చెప్పకుండా ఉండే నాటి ఆచార్యుల ధోరణికి ఆచార్యముష్టి అని పేరు ఏర్పడింది.*

** *చూడుడు 284 వ పుట.*

formations) అనిత్యమే, విజ్ఞానమూ (conciousness) అనిత్యమే ఇలా సమాధానం ఇవ్వడం. పరిపృచ్ఛ్యవ్యాకరణీయం అంటే ఏమిటి? కన్ను అన్నిటినీ చూస్తుందా? అని అడిగితే "అన్నిటినీ అంటే ఏమిటో ముందు నీవు చెప్పు" అని అడగడం. స్థాపనీయం* (set aside) అంటే ఏమిటి? సమాధానం ఏమీ ఇవ్వకుండా మౌనం పాటించడం. లోకం శాశ్వతమా? అశాశ్వతమా? లోకం అంతవంతమా (finite) అనంతమా (infinite), జీవుడూ శరీరం ఒకటేనా? భిన్నభిన్నమా? మరణం తరువాత తథాగతుడు ఉంటాడా? ఉండడా? ఇలాంటి వ్యర్థప్రశ్నలకు మౌనం పాటించడం.

మహారాజా, మాలుంక్యపుత్రుడు అడిగినది స్థాపనీయప్రశ్న కనుక భగవానుడు మౌనం వహించాడు. అజ్ఞానం వల్ల కాదు, ఆచార్యముష్టి వల్ల కాదు. సమాధానం చెప్పడానికి ఏ హేతువూ, ఏ ఆధారమూ లేని ప్రశ్నలకు భగవానుడు మౌనం పాటించే వాడు. అకారణం, అహేతుకం అయిన మాటలను భగవంతులైన సమ్మాసంబుద్ధులు పలుకరు.

**మి:** సాధు సాధు నాగసేనా! నేను సమ్మతిస్తున్నాను.

## మరణభయం

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా అన్నాడు: "దండనకు (punishment) అందరూ భయపడతారు. అలాగే మృత్యువుకూ అందరూ భయపడతారు." భగవానుని మరొక వాక్యం: "అన్ని భయాలను అతిక్రమించినట్టివారు అర్హతులు." భంతే నాగసేనా, అర్హతులు కూడా దండనకు వణికిపోయేవాళ్ళేనా? నారకాగ్నిజ్వాలల్లో భీకర బాధలు అనుభవిస్తున్న వాళ్ళు మృత్యువుకు భయపడతారా? ఆ బాధలనుండి విముక్తి కలిగించే మృత్యువును ఇష్టపడాలిగానీ భయం ఎందుకు? "దండనకు అందరూ భయపడతారు" అనే వాక్యం సత్యమయితే "అర్హతులు అన్ని భయాలను అతిక్రమించినవారు" అనే వాక్యం మిథ్య అవుతుంది. రెండవ వాక్యమే సత్యమంటే మొదటి వాక్యం మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనికి సమాధానం చెప్పుము.

**నా:** మహారాజా, "దండనకు అందరూ భయపడతారు" అనే వాక్యం అర్హతులను ఉద్దేశించినది కాదు. భయకారణాలన్నీ అర్హతులలో సమూలంగా పెకలించి వేయబడియుంటాయి. క్లేశాలు కలిగినట్టివారు, సత్కాయదృష్టి (individuality view) బలంగా ఉన్నట్టివారు, సుఖానికి పొంగిపోయేవారు, దుఃఖానికి క్రుంగిపోయేవారు అయిన

---

* *చూడుడు 284 వ పుట.*

పృథక్‌జనుల విషయంగా ఆ వాక్యము చెప్పబడింది. మహారాజా, ఒక రాజుకు నలుగురు అమాత్యులున్నారు. వారందరూ విశ్వాసపాత్రులు, కీర్తిమంతులు, పెద్దపదవుల్లో ఉన్నవారు. ఏదో అవసరం ఏర్పడి ఒకనాడు రాజు ప్రజలనందరిని ఉద్దేశించి “అందరూ పన్ను కట్టాలి’’ అని ఆజ్ఞాపించాడు. అందరినుండి పన్ను రాబట్టే పనిని నలుగురు అమాత్యులకు అప్పగించాడు. “ప్రజలందరూ పన్ను కట్టాలి” అనే రాజశాసనం విని అమాత్యులు భయపడినారా?

**మి:** భయపడరు. ఉత్తమస్థానాల్లో వాళ్ళను రాజు నియమించియున్నాడు కనుక పన్నులకు వాళ్లు అతీతులు అయినారు కనుక.

**నా:** అలాగే మహారాజా, భగవానుడు చెప్పిన “అందరూ దండన అంటే భయపడతారు” అనే వాక్యం అర్హతులను ఉద్దేశించినది కాదు. ఎందుకనగా వారు అన్ని భయకారణాలను అధిగమించినవారు కనుక. ఆ వాక్యం పృథక్‌జనులను ఉద్దేశించిన వాక్యం.

**మి:** భంతే నాగసేనా, నరకబాధలు అనుభవిస్తున్నవాళ్ళు మరణానికి ఎందుకు భయపడాలి? బాధలనుండి విముక్తి కలిగించే మృత్యువును వాళ్ళు ఇష్టపడాలికదా!

**నా:** మహారాజా, నరకబాధలు అనుభవించేవాళ్ళు ఆ బాధలనుండి విముక్తి కోరుకుంటారు. కానీ మరణం అంటే వారికీ భయమే. అది మరణం యొక్క ప్రభావం (power). ఆర్యసత్యాలను దర్శించనివాళ్ళకు మరణం అంటే భయమే. నాగుపాము అంటే భయపడేవాళ్ళు, ఏనుగును, సింహాన్ని, పులిని, చిరుతను, తోడేలును, అడవిదున్నను, గవయాన్ని, అగ్నిని, నీటిని ఇంకా ఏవేవి భయాన్ని కలిగిస్తాయో వీటిని చూసినపుడు కలిగే భయాలు కూడా మరణభయమే. కనుక క్లేశాలు కలిగినవాళ్ళందరికీ మరణభయం ఉంటుంది. నరకబాధలు అనుభవిస్తున్న వాళ్ళకు కూడా మరణం అంటే భయమే. మరణత్రాసం అనేది చాలా బలీయమైనది.

మహారాజా, ఒకానొకనికి దేహంలో కురుపు లేచి చీముపట్టి మిక్కిలి బాధించింది. వైద్యుని వద్దకు వెళ్ళాడు. వైద్యుడు అతని బాధను తొలగించడం కోసం శస్త్రచికిత్సకు సన్నాహాలు చేస్తూ కత్తిని నూరాడు. శలాకను నిప్పులో పెట్టి కాల్చాడు. క్షారలవణాలు నూరాడు. ఇదంతా చూసి ఆ రోగి మిక్కిలి భయపడతాడా? భయపడడా?

**మి:** అవును, భయపడతాడు.

**నా:** అలాగే మహారాజా, నరకబాధలు అనుభవిస్తున్నవాళ్ళు కూడా మరణం అంటే భయపడతారు.

**మి:** సాధు సాధు నాగసేనా! నేను నీ సమాధానంతో ఏకీభవిస్తాను.

## పరిత్తములు (protections = పరిత్రాణములు)

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా అన్నాడు:

**న అంతలిక్ఖే న సముద్దమజ్ఝే న పబ్బతానం వివరం పవిస్స**
**న విజ్జతీ సో జగతిప్పదేసో యత్థఠితో ముచ్చేయ్య మచ్చుపాసా**

అంతరిక్షంలోగానీ, సముద్రంలోగానీ, పర్వతగుహల్లోగానీ ఎక్కడ కూడా మృత్యువుకు కనబడకుండా దాక్కొనే చోటు లేదు.

ఇలా చెప్పిన భగవానుడు పరిత్తములను* (protective recitals) కూడా ఉపదేశించాడు. రతనసుత్తం, ఖందపరిత్తం, ధజగ్గపరిత్తం, ఆటానాటియపరిత్తం, అంగుళిమాలపరిత్తం మొదలగునవి ఉపదేశించాడు. భంతే నాగసేనా, అంతరిక్షంలోగానీ, సముద్రంలోగాని, పర్వతగుహల్లోగానీ ఎక్కడ కూడా మృత్యువుకు కనబడకుండా దాక్కొనే చోటు లేనప్పుడు పరిత్తపఠనం మిథ్య అవుతుందికదా! ఒకవేళ పరిత్తపఠనం వల్ల మృత్యుపాశంనుండి తప్పించుకోవడం జరిగితే మొదటి వాక్యం మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. గ్రంథుల్లో గ్రంథితరమైన ప్రశ్న. దీనికి ఎలా సమాధానం ఇస్తావో చూస్తాను.

**నా:** మహారాజా, **నాంతలిక్ఖే** అనే వాక్యము భగవద్వాక్యమే. పరిత్తములు కూడా భగవానుడు బోధించినవే కానీ ఇవి ఇంకా ఆయుష్షు ఉన్నవారికి, కర్మప్రతి బంధం** లేనివారికోసం చెప్పబడినవి. క్షీణాయుష్కులకు ఆయుష్షు పెంచే క్రియలు, ఉపాయాలు ఏమీ లేవు. మహారాజా, ఎండిపోయి మోడువారిన శుష్కవృక్షానికి వేయి బిందెల నీళ్ళు పోసినా మళ్ళీ చిగురించదు. అలాగే క్షీణాయుష్కుణ్ణి బ్రతికించి ఉంచడానికి ఔషధాలు, పరిత్తాలు, క్రియలు, ఉపాయాలు ఏవీ లేవు. కనుక పరిత్తములు వయస్సులో ఉన్నవాళ్ళను, కర్మప్రతిబంధం లేనివాళ్ళను కాపాడుతుంది కనుక వాటిని భగవానుడు బోధించాడు. మహారాజా, కర్షకుడు కోతకు వచ్చిన పంటచేనులోకి నీటిని ప్రవేశింపనీయకుండా చూసుకొంటాడు. అదే కర్షకుడు లేతపైరుకు స్వయంగా నీళ్ళు

---

* *వైశాలి నగరంలో వ్యాపించిన అంటురోగాన్ని నివారించేందుకు రతనసుత్తం, పాములనుండి రక్షణగా ఖందపరిత్తం, శత్రువులనుండి రక్షణగా మోరపరిత్తం, భయాందోళనకు విరుగుడుగా ధజగ్గపరిత్తం, హానికరప్రభావాలనుండి రక్షణగా ఆటానాటియపరిత్తం, గర్భిణిస్త్రీలకు రక్షణగా అంగుళిమాలపరిత్తం బుద్ధభగవానుడు బోధించినాడు.*

** *మహాఘోరమైన పాపములు చేసినవారికి అధ్యాత్మికంగా ఏ చికిత్సయూ వీలుపడదు.*

పెట్టాడు. అలానే క్షీణాయుష్కులకు పరిత్తముల అవసరం ఉండదు. ఇంకా ఆయుష్షు మిగిలియున్నవారికే పరిత్తములు ఔషధంలా పనిచేస్తాయి.

**మి:** భంతే నాగసేనా, క్షీణాయుష్కుడు ఎలానూ మరణిస్తాడు, ఆయుష్షు మిగిలియున్నవాడు ఎలానూ బ్రతుకుతాడు. అలాంటప్పుడు ఇక పరిత్తముల వల్ల అయ్యే పని ఏముంది? అవి వ్యర్థములేకదా!

**నా:** మహారాజా, ఔషధాల వల్ల రోగం నివర్తించడం పూర్వం చూసియున్నావా?

**మి:** అనేక వందలసార్లు చూసియున్నాను.

**నా:** మరి అలా అయితే "పరిత్త భైషజ్యక్రియ వ్యర్థము" అన్న నీ పలుకు మిథ్య అయింది.

**మి:** వైద్యులు ఔషధంగా పానీయాలు, అనులేపనాలు ఉపయోగించి రోగాన్ని నివర్తిస్తారు.

**నా:** పరిత్తములు తమ శబ్దశక్తి వల్ల ఔషధాల మాదిరే వ్యాధిని ఉపశమింప జేస్తాయి. కష్టాలు తొలగిస్తాయి. పాముకాటుకు గురియైనవానినుండి విషాన్ని మంత్రబలంచే అదే పాము వచ్చి పీల్చివేయడం నీవు ఎప్పుడైనా చూశావా?

**మి:** అవును చూసియున్నాను. అలాంటి విచిత్రాలు ఈనాటికీ నిలిచియుండడము కనిపిస్తూనే ఉంది.

**నా:** మంచిది మహారాజా, కనుక పరిత్తములు నిరర్థకములు అనడం మిథ్యా వాక్యం అవుతుంది. పరిత్తం పలికితే కాటు వేయనుంకించిన పాము, కాటు వేయకుండా తెరచిన నోటిని మూసుకొంటుంది. తలమీద మోదడానికి కఱ్ఱలు ఎత్తిపట్టుకొని మీదికి వస్తున్న చోరులు పరిత్తము పలికిన క్షణమే కఱ్ఱలు పారవైచి ప్రేమను చూపిస్తారు. కోపంతో మీదికి వస్తున్న మదించిన ఏనుగు పరిత్తం పలుకగానే శాంతిస్తుంది. ప్రజ్వలిస్తూ చుట్టూ కమ్ముకొంటున్న మహాఅగ్నిస్కంధం పరిత్తము చెప్పగానే ఉపశమించిపోతుంది. హాలాహలం లాంటి విషం కూడా పరిత్త ప్రభావంతో ఔషధంగా, ఆహారంగా మారిపోతుంది. చంపడానికి వచ్చిన హంతకులు పరిత్తమహిమచే దాసులయిపోతారు. బంధించడానికని ఏర్పరచిన ఉచ్చులు కాలు పెట్టినా బంధించకుండా విడిపోతాయి.

**మి:** భంతే నాగసేనా, పరిత్తములు అందరినీ రక్షిస్తాయా?

**నా:** కొందరిని రక్షిస్తాయి, కొందరిని రక్షించవు.

**మి:** కనుక పరిత్తములు అందరికీ పనికివచ్చేవి కావు.

**నా:** మహారాజా, భోజనం అందరి జీవితాల్ని నిలబెట్టుందా?

**మి:** కొందరి జీవితాలను నిలబెట్టుంది. కొందరి జీవితాలను నిలబెట్టదు.

**నా:** కనుక భోజనం అందరికీ పనికివచ్చేది కాదు.

**మి:** భంతే నాగసేనా, భోజనం జీవితాన్ని నిలిపి ఉంచలేనందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి అతిభుక్తం, రెండు జీర్ణకోశలోపం. మంచి పోషక భోజనం అయినా సరే జీర్ణకోశలోపం వల్ల విషతుల్యం కాగలదు.

**నా:** అలాగే మహారాజా, మూడు కారణాల వల్ల పరిత్తం పనిచేయకపోవడం జరుగుతుంది. 1. కర్మప్రతిబంధం, 2. క్లేశావరణం(రాగద్వేషాది క్లేశములు తీవ్ర స్థాయిలో బుసలు కొట్టుండం), 3. శ్రద్ధ లేకపోవడం. స్వయంకృతాపరాధం వల్ల పరిత్తములు రక్షించలేకపోవడం కూడా జరుగుతుంది. మహారాజా, తల్లి, గర్భస్థ శిశువుకోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది. ప్రసవించాక ఎన్నో సేవలు చేస్తూ పెంచుతుంది. తన బిడ్డను ఎవరైనా పీడిస్తుంటే ఊరుకోదు. పీడించినవాళ్ళ మీద తగిన చర్యలు తీసుకొంటుంది. అదే తల్లి తన బిడ్డ ఏదైనా తప్పు చేస్తే చేత్తో గానీ బెత్తంతోగానీ కొట్టుంది. అలాగే పరిత్తములు కూడా స్వయంకృతాపరాధుల్ని రక్షించదు.

**మి:** సాధు, సాధు నాగసేనా! ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పావు. గహనంగా ఉన్నదాన్ని తేటతెల్లం చేశావు. అంధకారంగా ఉన్న విషయం మీద వెలుగును నింపావు. దృష్టిజాలాన్ని ఛిన్నాభిన్నం చేశావు. గణాచార్యులలో అగ్రగణ్యుడుగా నిలిచావు.

## నాయకత్వం

**మి:** భంతే నాగసేనా, బుద్ధభగవానుడు ఇలా అన్నాడు: "ఆనందా, భిక్షుసంఘాన్ని నేను నడిపిస్తున్నాను, భిక్షుసంఘం నా మీద ఆధారపడియున్నది అనే భావన నాకు లేదు." మైత్రేయుని గుణగణాలను ప్రశంసిస్తూ భగవానుడు ఇంకా ఇలా అన్నాడు: "నేనిప్పుడు అనేక వందలమంది భిక్షువులను నడిపిస్తున్నట్లు భవిషత్తులో మైత్రేయుడు అనేక వేలమంది భిక్షువులను నడిపిస్తాడు". ఈ రెండు భిన్నభిన్న వాక్యాల్లో మొదటివాక్యం సత్యమైతే రెండవవాక్యం మిథ్య. రెండవవాక్యం సత్యమైతే మొదటివాక్యం మిథ్య. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనికి నీ సమాధానం ఏమిటి?

**నా:** రెండు వాక్యాలను మహారాజా, నీవు సరిగ్గానే ఉటంకించావు. రెండూ భగవానుని వాక్యాలే. ఈ ప్రశ్నలో ఒక అర్థం సావశేషం (interpretable =నేయార్థం), ఒక అర్థం నిరవశేషం(definitive = నీతార్థం). మహారాజా, తథాగతుడు పరిషత్తును అనుగమించడు. పరిషత్తు తథాగతుణ్ణి అనుగమిస్తుంది. తథాగతుని మాటల్లో అహం,

మమ అనే పదాలు కేవలం వ్యవహారసౌలభ్యం కోసం వాడిన పదాలు. అవి పరమార్థం (ultimate meaning) కలిగిన పదాలు కావు. తథాగతునిలో అహం, మమతలు లేవు కనుక నేను నాది అనే గ్రహణం(seizing) లేదు. మహారాజా, ఈ పృథివి సత్త్వులకు (beings) ఆధారంగా, ఆశ్రయంగా ఉంటున్నది. కానీ పృథివికి "ఈ సత్త్వులు నాకు చెందినవారు. నేను వీళ్ళకు ఆధారంగా ఉంటున్నాను" అనే భావన లేదు. అలాగే మహారాజా, తథాగతుడు సకల సత్త్వులకు ఆధారంగానూ ఆశ్రయంగానూ ఉంటున్నాడు. కానీ తథాగతునికి "ఈ సత్త్వులందరూ నాకు చెందినవారు. నేను వీళ్ళకందరికి ఆధారంగా ఆశ్రయంగా ఉంటున్నాను" అనే భావన ఉండదు. మహారాజా, మహామేఘుడు వర్షించడం వల్లనే చెట్లుచేమలు, మనుష్యులు, పశువులు వృద్ధిని పొందుచున్నాయి. మనుగడ సాగిస్తున్నాయి. కానీ మహామేఘునికి "ఇవన్నీ నా వల్లే వృద్ధి చెందుతున్నాయి. నా వల్లే మనుగడ సాగిస్తున్నాయి" అనే భావన ఉండదు. అలాగే తథాగతుడు కూడా సకల సత్త్వులలో కుశలధర్మాలను (wholesome mental states) కలిగిస్తున్నాడు. వృద్ధి చేస్తున్నాడు, కాపాడుచున్నాడు. కానీ తథాగతుడికి "వీళ్ళంతా నాకు చెందినవారు" అనే అపేక్ష ఉండదు. ఎందులకనగా, తథాగతునికి ఆత్మదృష్టి (wrong view of self) వదలిపోయింది కనుక.

**మి:** సాధు, సాధు నాగసేనా! ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పావు. నిగూఢంగా ఉన్నదాన్ని స్పష్టం చేశావు. ముడి (knot) భిన్నమయ్యింది. గహనంగా ఉన్నది తేటతెల్లమయ్యింది. అంధకారం తొలగించి వెలుగును నింపావు. పరవాదములు భగ్నములయినాయి. జినపుత్రులకు ధర్మచక్షువు కలిగించావు.

## సంఘభేదం

**మి:** భంతే నాగసేనా, మీ భిక్షువులు అంటారు: "విడదీయరాని శిష్యగణం కలిగినవాడు తథాగతుడు". మళ్ళీ మీరే ఇలా చెబుతారు: "ఒక్కసారిగా ఐదువందలమంది భిక్షువులను దేవదత్తుడు తన వెంట తీసుకెళ్ళిపోయాడు". ఈ రెండు వాక్యాల్లో ఏది నిజం? ఏది అబద్ధం? తథాగతుడు అభేద్యపరిషత్ కలిగినవాడు అనే వాక్యం నిజమైతే మీ రెండవ వాక్యం అబద్ధం అవుతుంది. ఒక్కవేటుతో దేవదత్తుడు ఐదువందలమంది భిక్షువులను చీల్చివేసి తనను అనుసరించేవాళ్ళుగా చేసుకొన్నాడు అనే మీ వాక్యం నిజమైతే మొదటిది అబద్ధం అవుతుంది. ఇది కూడా రెండు అంచులున్న* ప్రశ్న. గంభీరమైన ప్రశ్న.

* *దర్భకు రెండువైపులా వాడియైన అంచులుంటాయి. దర్భను త్రుంచదలచినవాడు జాగ్రత్త చూపకపోతే రెండు వేళ్ళనుండీ రక్తం చూడవలసియుంటుంది.*

చిక్కుప్రశ్న. దీని విషయమై ఎటూ తేల్చి చెప్పలేక జనులు గందరగోళం చెందియున్నారు. ఈ చిక్కుప్రశ్న మీద నీ జ్ఞానబలాన్ని ప్రదర్శించుము.

**నా:** మహారాజా, తథాగతుడు అభేద్యపరిషత్ కలిగినవాడు. కానీ దేవదత్తుడు ఒక్కదెబ్బతో ఐదువందలమందిని తన పక్షానికి త్రిప్పుకొన్నాడు. ఇది అతని శక్తిని నిరూపిస్తున్నది. చీల్చగలిగే శక్తిమంతుడు ఉంటే చీలిపోనిదంటూ ఏదీ లేదు. భేదకుడు ఉంటే తల్లి తన కుమారునితో వైరం పెట్టుకొని అతణ్ణి శత్రువులాగా కొరకొర చూస్తుంది; తండ్రి తనయుడితో విభేదిస్తాడు; అన్నదమ్ముడు అప్పజెల్లెలితో విరోధం పెట్టుకొంటాడు; అప్పజెల్లెలు అన్నదమ్ముడితో తగవు పెట్టుకొంటుంది; ప్రాణస్నేహితులు బద్ధశత్రువులుగా మారిపోతారు; దృఢమైన చెక్కల కూర్పుతో సుసంఘటితంగా ఉన్న నౌక కూడా అలలవేగం దెబ్బకు భగ్నం అయిపోతుంది. కానీ పండితులు, విజ్ఞులు ఎవరూ "భేద్యపరిషత్ కలిగినవాడు తథాగతుడు" అని అభిప్రాయపడరు. అభేద్యపరిషత్ కలిగినవాడనియే తలంతురు. దీనికి కారణం ఉన్నది. తథాగతుని మాత్సర్యం వలనగానీ అప్రియ వచనముల వలనగానీ హితాన్ని సుఖాన్ని ఇవ్వలేని ఉపదేశాల వలనగానీ పక్షపాతబుద్ధి వలనగానీ* పరిషత్తులో చీలిక వచ్చిందని వినింది లేదు. ఈ కారణం వల్ల తథాగతుని పరిషత్తు అభేద్యం అని చెప్పబడింది. మహారాజా, పరంపరాగతంగా వస్తున్న నవాంగబుద్ధవచనంలో** ఎక్కడైనా ప్రస్తావన ఉన్నదా - తథాగతుని వ్యవహారశైలి కారణంగా పరిషత్తులో చీలిక వచ్చిందని?

---

** పరిషత్ (పాళిలో పర్షదం) అంటే సమూహం. బ్రాహ్మణపరిషత్, క్షత్రియ పరిషత్ ఇలా కులాలవారిగా పరిషత్తులుండేవి. ఈ సమూహం అధ్యక్షుడినో నాయకుడినో కలిగియుంటుంది. ఆ సమూహాన్ని తన కనుసన్నలలో మెలిగేలా ఉంచాలంటే నాయకుడికి కొన్ని లక్షణాలు తప్పనిసరిగా ఉండాలి. ఈ లక్షణాలకు సంగ్రహవస్తువులని పేరు. ఇవి నాలుగు. 1. దానం, 2. ప్రియవాదిత్వం, 3. అర్థచర్య (సామాజిక ప్రయోజనాలకోసం పాటుబడే నైజం), 4. నిష్పక్షపాతం. ఈ నాలుగు లక్షణాలున్నవాడు పరిషత్తును ఏకత్రాటిమీద నడిపించగలడు. అసంతృప్తికి తిరుగుబాటుకు తావివ్వడు. ఈ నాలుగు సంగ్రహవస్తువులకు మించిన ఎన్నో సంగ్రహవస్తువులు తథాగతునిలో ఉన్నాయి కనుక తథాగతుని పరిషత్తు (భిక్షువులు, భిక్షుణిలు, ఉపాసకులు, ఉపాసికలు) చెక్కుచెదరకుండా ఉండినది.*

*"సంగ్రహవస్తువులు" అనేది పారిభాషికపదం. ఇందులో వస్తువుకు హేతువు అని అర్థం. పరిషత్తును చెక్కుచెదరనీయకుండా ఉంచే హేతువులే సంగ్రహవస్తువులు. ఈ హేతువులన్నీ చిత్తధర్మాలే. మాత్సర్యకాలుష్యం లేని చిత్తవిశేషానికి దానం అని పేరు. హృదయంలో ప్రేమ, వాత్సల్యం, కరుణ ఉంటేనే వాక్కుకు ప్రియవాదిత్వం సంక్రమిస్తుంది.*

*** చూడుడు 96 వ పుట.*

**మి:** లేదు భంతే.

*Note: సంఘభేదం అసాధ్యం. ఆర్యసత్యాలను దర్శించినవారు (స్వానుభవానికి తెచ్చుకొన్నవారు) ఆర్యులనబడుతారు. వీరి సమూహానికి సంఘం అని పేరు. వీరు భగవానుని పట్ల అవేత్యప్రసాదం (స్వానుభవం జతకూడిన శ్రద్ధ) కలిగినట్టివారు. ఇటువంటివారిని భగవానునినుండి విడదీయడం అసాధ్యం. ఇక్కడ విడదీయడం అంటే అర్థం వేరే శాస్తను (teacher) వేరే మార్గాన్ని పట్టుకొని విడిపోవడం. ఇది అసంభవం. శతకోటి మారులు ఒక్కటై యత్నించినా సాధ్యపడదు. దేవదత్తుడు విడదీసింది ఇంకా మార్గప్రవేశం పొందనట్టి సాధకావస్థలోనే ఉన్నట్టి భిక్షువులనే. ఇది కూడా అంత తేలిక కాదు. దేవదత్తుడు సాధించాడంటే అతను చాలా శక్తిమంతుడుగానూ ప్రభావశాలిగానూ ఒక వెలుగు వెలిగినాడనియే ఊహించవలెను.*

*తరువాతి కాలంలో బౌద్ధసంఘం 18 శాఖలుగా చీలిపోయింది. ఇది సంఘభేదం క్రిందకు వస్తుందా? రాదు. శాఖలు ఎన్నైనా అన్ని శాఖలవారు భగవానుణ్ణే తమ ఏకైక శాస్తగా స్వీకరించినందువల్ల. ఆ పద్దెనిమిది శాఖలూ శ్రావకయానశాఖలే. తరువాతి కాలంలో మహాయానం, తంత్రయానం ప్రసిద్ధిలోకి వచ్చాయి. ఇది సంఘభేదం అవుతుందా? అవదు. భగవానుని పట్ల భక్తి శ్రద్ధల్లో వీళ్ళు ఎవరికీ తీసిపోరు.*

*బోధిసత్త్వుడుగా ఉన్నప్పుడు తథాగతునికి ఐదు మహాస్వప్నములు కలిగినవి. అందులో ఒక స్వప్నం సంఘానికి సంబంధించినది. స్వప్నంలో నానా వర్ణములు కలిగిన నాలుగు పక్షులు నాలుగు దిక్కులనుండి ఎగిరివచ్చి బోధిసత్త్వుని పాదాల చెంత వాలినాయి. వాలీవాలగానే అవి ఒకే వర్ణం – శ్వేతవర్ణం పక్షులుగా మారిపోయాయి. ఆ మహాస్వప్నం సూచించినదేమిటంటే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర కులాలవారు "బుద్ధం శరణం గచ్ఛామి" అని సంఘంలో ప్రవేశించగానే కులాభిమానాలు ఇతర అభిమానాలు వదిలించుకొని సమానులవుతారని సూచించినది.*

## పరుషభాషణం

**మి:** భంతే నాగసేనా, ధమ్మసేనాపతి సారిపుత్రుడు ఇలా భాషించియున్నాడు: "ఆయుష్మంతులారా, తథాగతుడు పరిశుద్ధమైన వాక్కు కలిగినవాడు. వచీదుశ్చరితం తథాగతునిలో లేదు". కానీ తథాగతుడు మొదటి పారాజికను* విధించినపుడు

** పారాజికలు ఐదు. 1. కామమిథ్యాచారం (sexual misconduct), 2. అలౌకిక అనుభూతులు పొందకపోయినా పొందినవాడనని డాంబికాలు పలుకడం, 3. సంఘంలో చీలిక*

⟶

అపరాధియైన కలందకపుత్ర సుదిన్నుణ్ణి "మోఘపురుషా" (పనికిమాలినవాడా) అని పరుషంగా సంబోధించినాడుకదా! ఆ సంబోధనకు కలందకపుత్ర సుదిన్నుడు మిక్కిలి చలించిపోయి పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. ఆర్యసత్యాల అవగాహన కూడా కొంతకాలం అతనికి సాధ్యం కాలేదు. "తథాగతుని వాక్కు పరిశుద్ధం" అనిన సారిపుత్రుని మాట నిజమయితే కలందకపుత్ర సుదిన్నుణ్ణి "మోఘపురుషా" అని సంబోధించిన వాక్యం అబద్ధం అవుతుంది. ఇది అబద్ధవాక్యం కాదంటే ధమ్మసేనాపతి సారిపుత్రుడు పలికిన వాక్యం మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనికి సమాధానం చెప్పుము.

**నా:** మహారాజా, ధమ్మసేనాపతి సారిపుత్రుని వాక్యమూ నిజమే. భగవానుడు కలందకపుత్ర సుదిన్నుణ్ణి "మోఘపురుషా" అని సంబోధించడమూ వాస్తవమే. కానీ ఆ పదాన్ని తథాగతుడు ఒళ్ళు తెలియని ఆవేశంతో పలుకలేదు. కోపతాపం లేకుండా కలందకపుత్ర సుదిన్నుని చర్య యొక్క అనర్థాన్ని సూచించాడు. మహారాజా, మానవజన్మ సార్థకం కావాలంటే ఆర్యసత్యాల అభిసమయం (సాక్షాత్కారం) కలగాలి. అభిసమయం

◁—

*తెచ్చే పనిలోకి దిగడం, 4. చౌర్యం, 5. వధకృత్యం. ఇవిగాక ఇంకా ఎన్నో పెద్ద చిన్న తప్పిదాలున్నాయి. ఆయా తప్పిదాలకు ఆయా శిక్షలున్నాయి. కానీ ఈ ఐదింటి విషయంలో మాత్రం బహిష్కరణ తక్షణం అమలులోకి వస్తుంది. భిక్షునియమాలు అన్నిటినీ ఒక బండ మీద తీరిగ్గా కూర్చొని ఆలోచించి ఒక్కసారిగా భగవానుడు విధించలేదు. ఆయా అపరాధం జరిగినపుడు దాని నిషేధం కోసం ఆయా నియమం చెబుతూ వచ్చాడు. ఇవి క్రమంగా పెరిగి రెండువందలయాభై సంఖ్య దాటింది. కామమిథ్యాచారం అనే పారాజికను విధించడానికి కారణం అయినవాడు కలందకపుత్ర సుదిన్నుడు. ఇతడు పూర్వాశ్రమంలో సంపన్న గృహస్థుడు. భార్య అనుమతి తీసుకొని భిక్షుసంఘంలో చేరి భిక్షువయ్యాడు. ఇతని తల్లిదండ్రులు మొదట్లో ప్రతిఘటించలేదు కానీ ఏండ్లు గడిచేసరికి వారికి కులదీపకుడుగా ఒక మనవడు కావాలనిపించి అతణ్ణి ఒత్తిడి చేస్తారు. అప్పటికి పారాజికవిధి లేదు కనుక కలందకపుత్ర సుదిన్నుడు తలిదండ్రుల ఒత్తిడికి తలవంచి పూర్వాశ్రమంలోని తన ఇల్లాలితో మళ్ళీ శయనించాడు. ఆ తరువాత జరిగిన ఒకనాటి పోషధ సమావేశంలో (కుశలధర్మాలకు బలం కలిగించుకొనేందుకు ఆమావాస్య, పౌర్ణమి దినాల్లో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు విహారాల్లో జరుగుతాయి. ఆ ప్రత్యేకదినాలకు పోషధం (పోషం=* increase*) అని పేరు. పోషధదినాల్లో భిక్షువులందరూ సమావేశమై 250 సంఖ్యకు మించియున్న భిక్షునియమాల పట్టిక అయినట్టి ప్రాతిమోక్షాన్ని పఠించేవారు) భిక్షువుల ఎదుట కలందకపుత్ర సుదిన్నుడు తన తప్పిదాన్ని ఆవిష్కరించాడు (revealed / confessed). ఈ విధంగా కలందకపుత్ర సుదిన్నుడు ప్రథమ పారాజికవిధికి కారణం అయ్యాడు. కానీ అతను మాత్రం బహిష్కరణకు గురి కాలేదు. ఎందుకంటే అప్పటికి ఆ విధి అమలులోకి రానందువల్ల.*

లేని మానవజన్మ మోఘం (వృథా). కలందకపుత్ర సుదిన్నుడు తన తప్పిదం వల్ల అభిసమయానికి తానే ఆటంకం కలిగించుకొన్నాడు. కనుక ఆ యథార్థం తెలియజేయడం కోసం భగవానుడు "మోఘపురుషా" అని కలందకపుత్ర సుదిన్నుణ్ణి సంబోధించాడు.

**మి**: భంతే నాగసేనా, ఒకడు మరొకణ్ణి దూషిస్తూ మాట్లాడితే ఆ మాటలు సత్యమయినప్పటికీ దూషించినవానికి మేము కొంచెం అపరాధం వేయడం చేస్తాము– దూషణ వాక్యాల వల్ల సమాజంలో శాంతికి భంగం కలుగుతుందని.

**నా**: మహారాజా, తప్పు చేసినవానికి అభివాదనం, ప్రత్యుత్థానం, సత్కారం, పూజ మొదలగునవి చేసి సగౌరవంగా ఇంటికి సాగనంపడం నీవు ఎప్పుడైనా వినియున్నావా?

**మి**: లేదు భంతే. అతని తప్పునకు తగిన రీతిలో శిరచ్ఛేదమో, చిత్రహింసయో, బంధనమో ఏదో ఒకటి చేయడమే జరుగుతుంది.

**నా**: అలా అయితే కలందకపుత్ర సుదిన్నుణ్ణి మందలించిన తీరు సరైనదా? కాదా?

**మి**: సరైనదే భంతే. ఆ తప్పిదాన్ని వినగానే దేవతలు, మనుష్యులు అందరూ సిగ్గుతో కుంచించుకుపోతారు. పైగా తాము నమస్కరించదగు ఒక వ్యక్తి వల్ల అది జరిగింది అనేది వాళ్ళు జీర్ణించుకోలేరు.

**నా**: మహారాజా, వైద్యుడు రోగికి ఎటువంటి ఔషధం ఇస్తాడు? రోగి ఇష్టంగా తినగల రుచికర పదార్థాలా లేక రోగాన్ని నయం చేసే చేదు ఔషధాలా?

**మి**: రోగిని నయం చేయడమే వైద్యుని కర్తవ్యమూ, ధర్మమూ కనుక రుచికరం కానప్పటికీ చేదు ఔషధాలే ఇస్తాడు.

**నా**: అలాగే మహారాజా, వినేయజనుల* క్లేశరోగాలను నిర్మూలించే వైద్యంగా ఉంటాయి తథాగతుని వాక్కులు. ఒక్కోసారి పరుషం అని పైకి అనిపించినా అవి తన ఏకైకప్రియపుత్రుణ్ణి తండ్రి మందలించే రీతిగా ఉంటాయి. అవి అర్థవంతంగా (beneficial), కరుణాసహగతంగా ఉంటాయి. దూదిబంతి దేహానికి తగిలితే బాధ కలిగించనట్లే తథాగతుని మందలింపు మాటలు ఏవీ కూడా వినేవాళ్ళకు బాధ కలిగించవు.

**మి**: భంతే నాగసేనా, అనేక కారణాల ఆధారం చూపుతూ నీవు నా ప్రశ్నకు చక్కని సమాధానం చెప్పావు. సాధు సాధు (well spoken well spoken).

---

* *భవ్యులు, యోగ్యులు అని అర్థం, ఉపదేశచికిత్సకు అర్హులు అని అర్థం.*

## చివరి భిక్ష

**మి**: భంతే నాగసేనా, ధర్మసంగీతికారులైన స్థవిరులు ఇలా అన్నారు:

**చుందస్స భత్తం భుంజిత్వా కమ్మారస్సాతి మే సుతం**
**ఆబాధం సంఫుసీ బుద్ధో పబాళ్హం మారణాంతికమ్**

కంసాలి చుందుని ఆహారం తిని భగవానుడు తీవ్ర అస్వస్థతకు లోనయినాడు. ఆ బాధ పరినిర్వాణపర్యంతం కొనసాగింది.

కానీ భగవానుని వాక్యం ఇలా ఉన్నది: "ఆనందా, నేను గ్రహించిన భిక్షల్లో రెండు భిక్షలు సమానములు. అవి సమాన ఫలములు. ఇతర అన్యభిక్షలకంటే గొప్పవి. ప్రశస్తమయినవి." ఇక్కడ నా సంశయం ఏమిటంటే స్థవిరుల వాక్యం సత్యమయితే భగవానుని వాక్యం మిథ్య అవుతుంది. భగవానుని వాక్యం సత్యమయితే స్థవిరుల వాక్యం మిథ్య అవుతుంది. ఏ భిక్ష అయితే మహాఫలము కలిగినది ప్రశస్తమయినదీ అని భగవానుడన్నాడో ఆ భిక్ష వల్ల మరణానికి దారి తీసిన అస్వస్థత కలుగడానికి వీలులేదుకదా! కొందరిలో ఈ విషయమై ఒక దురభిప్రాయం కూడా ఉన్నది. "ఆ వంటకం మీద అపేక్షతో ఎక్కువ తిని అతిసారం కొనితెచ్చుకొన్నాడు" అని. ఈ ప్రశ్న కూడా ఉభయకోటిక ప్రశ్న. పరవాదాన్ని పారద్రోలుతూ దీనికి సమాధానం చెప్పుము.

**నా**: మహారాజా, ధర్మసంగీతికారులైన స్థవిరులు చెప్పిన మాట నిజమే. భగవానుడు రెండు భిక్షలను ప్రత్యేకించి ప్రశంసించిన వాక్యమూ నిజమే. ఆ రెండు భిక్షలు ఏవి? 1. ఏ భిక్ష తీసుకొన్నాక తథాగతుడు అనుత్తర సమ్యక్ సంబోధిని పొందాడో అది సుజాత ఒసగిన భిక్ష. 2. ఏ భిక్ష తీసుకొన్నాక తథాగతుడు నిరుపధిశేషనిర్వాణధాతువును చెందినాడో అది చుందుడు ఒసగిన భిక్ష. చుందుడు సూకరమద్దవమును* భగవానునికి సమర్పించినపుడు దేవతలు "ఇది భగవానుని చివరి భిక్ష, బహుగుణోపేతమైన భిక్ష, అనేక విధములుగా ప్రశంసింపదగిన భిక్ష" అనుకొని ఆ సూకరమద్దవంలో దివ్యఓజస్సును చిలకరించినారు. కనుక అట్టి సూకరమద్దవం వల్ల భగవానుని ఆరోగ్యం దెబ్బతినింది అనడం సరి కాదు. వార్ధక్యం వల్ల శరీరానికి ఏర్పడిన సహజ దుర్బలతకు తోడు ఆయుసంస్కారములు క్షీణించడంతో భగవానుడు రోగగ్రస్తుడైనాడు. మహారాజా, మామూలుగా జ్వలిస్తున్న అగ్నిలో ఇంధనాన్ని (fuel) వేస్తే అది మరింత ఎక్కువ

---

** సూకరమద్దవం అంటే ఏమిటో నిశ్చయంగా చెప్పడం కష్టం. ఈ పదం 2500 ఏండ్లకు పూర్వం వాడుకలో ఉండిన పదం. ఇప్పుడు వాడుకలో లేదు. 1. పుట్ట గొడుగులు అనవచ్చు. 2. లేతవెదురు ఆకులు అనవచ్చు. 3. పందిమాంసం అనవచ్చు.*

జ్వలించినట్లు, మామూలుగా ప్రవహిస్తున్న నదీప్రవాహం మహామేఘుని వర్షకారణంగా మరింత ఎక్కువగా ప్రవహించినట్లు, మామూలు ఆహారం తిన్నప్పుడు కాస్త ఉబ్బిన పొట్ట ఎక్కువ ఆహారం తీసుకొంటే మరింత ఉబ్బినట్లు సహజదుర్బలమైన భగవానుని శరీరం ఆయుసంస్కారములు క్షీణించగానే మరింత బలహీనమై రోగగ్రస్తమయింది. చుందుని సూకరమర్దవం కారణం కాదు. అందులో ఏ దోషమూ లేదు.

**మి:** భంతే నాగసేనా, ఏ కారణం చేత ఆ రెండు భిక్షలు ఇతర భిక్షలకన్నా శ్రేష్ఠములు?

**నా:** ధర్మానుమజ్జనసమాపత్తి కారణంగా*.

**మి:** సమాపత్తులు ఏమిటి?

**నా:** అవి తొమ్మిది సమాపత్తులు** మహారాజా. ఆ రెండు భిక్షలు తీసుకొన్న ఆ రెండు సందర్భాల్లోనూ తథాగతుడు తొమ్మిది సమాపత్తులను అనులోమ (forward order), ప్రతిలోమ (reverse order) క్రమంలో పొందినాడు. ఆ కారణంగా అవి శ్రేష్ఠమైన భిక్షలయ్యాయి.

**మి:** ఆ రెండు సందర్భాల్లోనేనా తథాగతుడు తొమ్మిది సమాపత్తులను అనులోమ ప్రతిలోమ క్రమంలో పొందినాడు?

**నా:** అవును మహారాజా.

**మి:** ఆశ్చర్యం నాగసేనా! అద్భుతం నాగసేనా!

## పూజలు ఎవరు చేయాలి?

**మి:** భంతే నాగసేనా, భగవానుడు ఇలా ఆదేశించాడు: "ఆనందా, తథాగతుని శరీరపూజలో (ధాతుపూజలో) మీరు (భిక్షువులు) నిమగ్నులు కారాదు." దీనికి భిన్నంగా భగవానుని మరో వాక్యం. "పూజనీయులైనవారి ధాతువులకు (relics) పూజ చేసేవారలు దేవలోకాలకు వెళ్తారు." మొదటి వాక్యం నిజమైతే రెండవ వాక్యం మిథ్య అవుతుంది. రెండవ వాక్యం నిజమైతే మొదటిది మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. నీముందుకు వచ్చింది. ఎలా సమాధానం చెబుతావో చెప్పుము.

---

* *ఈ రెండు సందర్భాల్లోనే తథాగతుడు భిక్ష స్వీకరించాక ఆరోహణ అవరోహణ క్రమంలో చిత్తాన్ని సమాపత్తుల్లో చరింపజేసినాడు.*

** *1. ప్రథమధ్యానం, 2. ద్వితీయధ్యానం, 3. తృతీయధ్యానం, 4. చతుర్థధ్యానం, 5. ఆకాశానంతాయతనం, 6. విజ్ఞానానంతాయతనం, 7. ఆకించన్యాయతనం, 8.నైవసంజ్ఞానాసంజ్ఞాయతనం, 9. సంజ్ఞావేదయితనిరోధసమాపత్తి.*

**నా**: మహారాజా, నీవు ఉటంకించిన రెండు వాక్యాలూ భగవానుని భాషితాలే. "ధాతుపూజలో నిమగ్నం కావద్దు" అనే వాక్యం భిక్షువులను ఉద్దేశించి చెప్పినది. వారి పని ఏమనగా సంఖారముల (mental formations) అనిత్యతను అనాత్మతను, దుఃఖతను చింతన చేయడం, యోనిశమనసికారం (proper attention) సదా కలిగియుండడం, సతిపట్ఠానం సాధనను చేస్తుండడం, కర్మస్థానం (ధ్యానవిషయం) మీదనే మనస్సును నిలిపియుంచడం, క్లేశనిర్మూలనాయుద్ధం, ఆత్మశ్రేయస్సు ఎడల తత్పరత- ఇవి భిక్షువుల అవశ్య కర్తవ్యములు. ధాతుపూజ అనేది ఇతరులైన మనుష్యులు, దేవతలు చేయవలసినట్టిది.

మహారాజా, లోకంలో రాజపుత్రులు వివిధ యుద్ధకౌశలాలు, యుద్ధవ్యూహాలు, ఆయుధములు, రాజనీతి, పరిపాలన మొదలగువాటి విషయంలో శిక్షణ ఎలా గడిస్తారో తక్కిన జనులు వ్యవసాయం, గోరక్ష, వాణిజ్యం మొదలగునవి చేస్తారో అలాగే భిక్షువుల కర్తవ్యం వేరు. తక్కినవారి కర్తవ్యం వేరు.

లోకంలో బ్రాహ్మణయువకులు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం, లక్షణశాస్త్రం, ఇతిహాసం, పురాణం, నిఘంటువు, కేటుభం (ritual), అక్షరప్రభేదం (phonology), వైయ్యాకరణం, జ్యోతిశాస్త్రం, శకునవిద్య, స్వప్నవిద్య, నిమిత్తవిద్య- ఇవన్నీ నేర్చుకొంటారు. తక్కినవాళ్ళు వ్యవసాయం, వాణిజ్యం, గోరక్ష మొదలగునవి నేర్చుకొంటారు. అలానే భిక్షువులయినవారు చేయవలసినది వేరు. తక్కినవాళ్ళు చేయవలసినది వేరు. ధాతువూజ భిక్షువుల పని కాదు. దేవతలు, మనుష్యులు ఆ పూజ చేసుకొంటారు. "భిక్షువులారా, శరీర పూజతో కాలం వెళ్ళబుచ్చకండి" అని తథాగతుడు ఆదేశించియుండకపోతే భిక్షువులు పాత్ర, చీవరాలకు పూజలు చేసుకొంటూ అదియే తథాగతుణ్ణి అర్చించే పద్ధతి అనుకోవడం జరిగియుండేది.

**మి**: సాధు సాధు నాగసేనా, నీ సమాధానం చక్కగా ఉన్నది.

## పులకరింతలు

**మి**: భంతే నాగసేనా, భగవానుడు ఇలా అన్నాడు: "భిక్షువులారా, నన్ను ఎవరైనా ప్రశంసించినపుడు లేదా ధర్మాన్ని ప్రశంసించినపుడు లేదా సంఘాన్ని ప్రశంసించినపుడు మీరు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు కారాదు." కానీ ఈ మాటకు భిన్నంగా భగవానుడే శైలుడు పలికిన ప్రశంసలు విని ఆనందాన్ని ప్రకటిస్తూ స్వీయగుణాన్ని తానే ఇలా కీర్తించుకొన్నాడు:

**రాజాహమస్మి సేల ధమ్మరాజా అనుత్తరో**
**ధమ్మేన చక్కం వత్తేమి చక్కం అప్పటివత్తియం**

శైలా, నేను రాజును. నాకు మించిన ధర్మరాజు లేడు. ధర్మం ద్వారా నేను చక్రాన్ని త్రిప్పుతాను. ఆ చక్రం ఇక వెనక్కి తిరగదు.

ఈ రెండు పరస్పరవిరుద్ధవాక్యాల్లో మొదటిదియే భగవానుని వాక్యం అంటే రెండవది మిథ్య అవుతుంది. రెండవవాక్యం నిజమయిన పక్షంలో మొదటి వాక్యం తప్పవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనికి సమాధానం చెప్పుము.

**నా**: మహారాజా, నీవు ఉదాహరించిన రెండు వాక్యాలూ భగవానుని వాక్యాలే. మొదటిది ధర్మం యొక్క స్వభావాన్ని, రసాన్ని* (flavour or essence), లక్షణాన్ని (distingushing characteristic) భగవానుడు ఉన్నదున్నట్లుగా తెలియ జేస్తున్నప్పుడు చెప్పిన వాక్యం. శైలునికి చెప్పిన వాక్యం లాభాపేక్షతోగానీ కీర్తికండూతితోగానీ స్వార్థంతోగానీ శిష్యవర్గాన్ని పెంచుకొనేందుకుగానీ చెప్పినది కాదు. శైలునికి మరియూ మూడువందల బ్రాహ్మణయువకులను ధర్మ అభిసమయం (ఆర్యసత్యాల సాక్షాత్కారం) ఆశిస్తూ అనుకంపతో కరుణతో హితకామనతో భగవానుడు పలికిన వాక్యం అది.

**మి**: సాధు సాధు నాగసేనా, నేను అంగీకరిస్తున్నాను.

## శబ్దకాలుష్యం

**మి**: భంతే నాగసేనా, భగవానుడు ఇలా అన్నాడు: "నేను క్రోధము లేనివాడను. చిత్తమునుండి ఖిలమును** (కాఠిన్యాన్ని) తొలగించుకొనినవాడను." కానీ ఒకసారి భగవానుడు సారిపుత్ర మోగ్గల్లానులను వారి శిష్యబృందంతో సహా విహారంనుండి బయటకు వెళ్ళగొట్టినాడు. వాళ్ళ మీద కోపించినందువల్ల వెళ్ళగొట్టాడా? లేదా వాళ్ళ ఎడల తుష్టి చెంది వెళ్ళగొట్టాడా? కోపించి వెళ్ళగొట్టాడన్నావంటే "నేను క్రోధము లేనివాడను" అనే వాక్యం తప్పవుతుంది. వాళ్ళ ఎడల తుష్టి చెందినవాడై వెళ్ళగొట్టిన పక్షంలో అకారణంగా వెళ్ళగొట్టడమో లేక అజ్ఞానంతో వెళ్ళగొట్టడమో చేశాడని చెప్పినట్లవుతుంది. కనుక ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనికి సమాధానం చెప్పుము.

---

* *ధర్మం యొక్క రసం విముక్తి (freedom). లక్షణం అహింస.*

** సారిపుత్ర మోగ్గల్లానుల శిష్యబృందం ఒకరితో ఒకరు గట్టిగా మాట్లాడుకోవడం, ఒకరినొకరు పిలుచుకొనేటప్పుడు గట్టిగా అరచి పిలుచుకోవడం గమనించి భగవానుడు "వలలో పడ్డ చేపలతో బరువుగా ఉన్న వలని పైకిలాగేటప్పుడు బెస్తవాళ్ళు చేసే చప్పుడు చేస్తున్నారు. ఇక్కడుండటానికి తగరు. బైటకు నడవండి" అన్నాడు.

**నా**: మహారాజా, భగవానుడు తాను అక్రోధనుడు అని చెప్పిన వాక్యమూ నిజమే. సారిపుత్ర మోగ్గల్లానుల శిష్యబృందాన్ని వెడలనడచిన సంఘటనా నిజమే. కానీ, వాళ్ళను వెళ్ళగొట్టడం కోపం వల్ల కాదు. ఒకానొక పురుషుడు నడుస్తూ చెట్టువేరుగానీ, మోడుగానీ, రాయిగానీ కాలికి తగిలి క్రింద పడతాడనుకో. భూమి అతని మీద కోపించి క్రింద పడదోసిందా?

**మి**: లేదు భంతే. పృథివికి కోపంగానీ ప్రసాదంగానీ లేదు. అనునయం (attraction), ప్రతిఘ (repulsion) అనే ద్వంద్వం మహాపృథివికి లేదు. ఆ పురుషుడు తన అజాగ్రత్త వల్ల క్రిందపడినాడు.

**నా**: మహారాజా, మహాపృథివివలె తథాగతుడు కూడా కోపం, ప్రసాదం, అనునయం, ప్రతిఘ లేనివాడు. ఆ శిష్యులు స్వయంకృతాపరాధం వల్ల నిష్కాసనానికి (గెంటివేతకు) గురియైనారు.

మహారాజా, మహాసముద్రం మృతదేహాన్ని తనలో ఉంచుకోదు. శీఘ్రంగానే దాన్ని తీరానికి నెట్టివేస్తుంది. మృతదేహం మీద కోపంతో మహాసముద్రుడు అలా నెట్టివేస్తాడా?

**మి**: లేదు భంతే. మహాసముద్రునికి మృతదేహం పట్ల కోపంగానీ ప్రసాదంగానీ అనునయంగానీ ప్రతిఘగానీ ఉండదు.

**నా**: మహారాజా, తథాగతుడు కూడా మహాసముద్రునిలాంటివాడు. శ్రేష్ఠమైన జినశాసనం విషయంలో తమ అజాగ్రత్త వల్ల స్ఖాలిత్యానికి పాల్పడిన శిష్యులు నిష్కాసనానికి గురియైనారు. ఆ శిష్యుల ప్రయోజనాన్ని, సుఖాన్ని, హితాన్ని, విశుద్ధిని తథాగతుడు ఆకాంక్షించినవాడై వాళ్ళను వెడలగొట్టినాడు. ఆ నిష్కాసనం వల్ల వాళ్ళు తెలివి తెచ్చుకొని అప్రమాదవర్తనులై జాతి జరా వ్యాధి మరణం నుండి విముక్తులగుదురుగాక అని తథాగతుని ఆశయం.

**మి**: సాధు, సాధు భంతే.

## ఆత్మహత్య

**మి**: భంతే నాగసేనా, భగవానుడు ఇలా అన్నాడు: "భిక్షువులారా, భిక్షువుగా ఉన్నవాడు ఆత్మహత్యా ప్రయత్నం చేయరాదు. ఎవరైనా అట్టి ప్రయత్నం చేసినచో వారిపై ధర్మం ప్రకారం తగిన చర్య తీసుకొనబడును". కానీ మీ భిక్షువులు ఇలా అంటారు: "జాతి జరా వ్యాధి మరణం అధిగమింపజేయడం కోసం భగవానుడు శ్రావకులకు అనేక ఉదాహరణలతో ధర్మదేశనాన్ని చేశాడు. జాతి జరా వ్యాధి మరణాన్ని అతిక్రమించిన

వారిని మిక్కిలి ప్రశంసించినాడు.” ఇక్కడ నా సంశయం ఏమిటంటే ఆత్మహత్యకు ప్రయత్నించరాదని భగవానుడు చెప్పియుంటే మీ భిక్షువులు చెప్పిన రెండవవాక్యం మిథ్య అవుతుంది. మీ భిక్షువులు చెప్పిన వాక్యమే నిజమయితే భగవానుని వాక్యం మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. దీనికి సమాధానం చెప్పుము.

**నా**: నీవు ఉదాహరించిన రెండు వాక్యాలూ సరైన వాక్యాలే. దేహాన్ని స్వయంగా అంతం చేసుకోవద్దు అనే ఆత్మహత్యా నిషేధవాక్యానికీ కారణం ఉన్నది. మళ్ళీ దేహం సంపాయించకండి అనే హెచ్చరిక వాక్యానికీ కారణం ఉన్నది. మహారాజా, శీలవంతుడు శీలసంపన్నుడు ఎలాంటివాడంటే సత్త్వుల (beings) క్లేశవిషాన్ని నాశనం చేసే విరుగుడు మందులాంటివాడు; సత్త్వుల క్లేశవ్యాధిని ఉపశమింపజేసే ఔషధంలాంటివాడు; సత్త్వుల క్లేశరజస్సును కడిగివేసే ఉదకంలాంటివాడు; సత్త్వులకు సకల సంపత్తులను కలిగించే మణిరత్నంలాంటివాడు; సత్త్వులను నాలుగు ఓఘములు (ప్రవాహములు) దాటించే నావలాంటివాడు; జన్మ అనెడి ఎడారిని దాటించే సార్థవాహుడు; రాగద్వేషమోహములనెడి మూడగ్నులచే తపించే జనులకు చల్లని వాయువులాంటివాడు; మానససరోవరాన్ని మంచితనం అనే జలంతో నింపే మహామేఘుడు; కుశలములందు శిక్షణ ఇచ్చే ఆచార్యుడు; క్షేమపథాన్ని చూపించే సుదేశికుడు (good guide). ఈ విధంగా బహుగుణుడు, అనేకగుణుడు, అప్రమాణగుణుడు, గుణరాశి, గుణపుంజం అయిన శీలవంతుడు జనుల అభివృద్ధికి కారకుడు కనుక అటువంటివాడు వినాశం కారాదని భగవానుడు సత్త్వుల మీద అనుకంపతో భిక్షువుల ఆత్మహత్యా ప్రయత్నాన్ని నిషేధించాడు.

ఈ కారణాన్ని కుమారకాశ్యపుడు కూడా భాషించియున్నాడు. విచిత్ర కథికుడైన (versatile speaker) కుమారకాశ్యపుడు పాయాసి అనే రాజుకు పరలోక విషయం వివరిస్తూ ఇలా అన్నాడు: “రాజన్యా, శీలవంతులు, కల్యాణధర్ములు అయిన శ్రమణ బ్రాహ్మణులు ఎంత కాలం జీవిస్తారో అంత కాలమూ వారు బహుజనహితం కోసం, బహుజనసుఖం కోసం శ్రమిస్తారు.”

మహారాజా, “మళ్ళీ దేహం సంపాయించకండి” అనే వాక్యానికీ కారణం విను. జన్మ అనేది దుఃఖం, జరా అనేది దుఃఖం, వ్యాధి అనేది దుఃఖం, మరణమూ దుఃఖమే. శోకమూ (sorrow) దుఃఖమే. పరిదేవమూ (lamentation) దుఃఖమే, దౌర్మనస్యమూ (grief), ఉపాయాసమూ (despair) దుఃఖమే. అప్రియులతో (unpleasant persons) సంయోగమూ, ప్రియులతో వియోగమూ దుఃఖమే. తండ్రిమరణం, తల్లిమరణం, సోదరుని మరణం, సోదరిమరణం, పుత్రమరణం, భార్యామరణం, సేవలందించే సహాయకుని

మరణం, బంధువు మరణం, రోగాలు, ధననష్టం, శీలనష్టం, ఆయా వ్యక్తులను నమ్మి మోసపోవడం, రాజభయం, చోరభయం, శత్రుభయం, కరువుకాటకాల భయం, అగ్నిభయం, ఉదకభయం, అలల భయం, మొసలి భయం, సుడిగుండాల భయం- ఇదంతా దుఃఖమే. తన్ను తాను తిట్టుకోవడం, ఇతరుల చేత తిట్లు తినడం, దండనభయం, దుర్గతిభయం, పరిషత్తుభయం, ఆజీవికాభయం, మరణభయం- ఇదంతానూ దుఃఖమే. నానా రకములయిన చిత్రహింసలు, చిత్రవధలూ దుఃఖమే. మహారాజా, సంసారచక్రంలో తిరిగేవారు అనుభవించే దుఃఖాలు బహువిధములు. సంక్షిప్తంగా చెప్పాలంటే జన్మ అనేది దుఃఖం. జన్మరాహిత్యం (నిర్వాణం) అనేది సుఖం. కనుక భగవానుడు నిర్వాణగుణాన్ని, సంసారభయాన్ని వివరించి భిక్షువులను నిర్వాణాన్ని సాక్షాత్కరించు కోవలసినదిగా ప్రేరణ ఇస్తూ "మళ్ళీ దేహం సంపాయించకండి" అని చెప్పాడు.

**మి**: సాధు సాధు నాగసేనా, కారణాలను చక్కగా చెప్పావు. కనుక నేను సమ్మతిస్తున్నాను.

***అనువాదకుని మాట:*** *ఈ ప్రశ్నలో "న భిక్ఖవే, అత్తానం పాతేతబ్బం..." యథాతథంగా తెలుగులో చెప్పాలంటే "భిక్షువులారా, దేహాన్ని జారవిడువరాదు." కొండకొనకు వెళ్ళి అక్కడ్నుంచి ప్రపాతంలో (precipice) దేహాన్ని జారవిడువడం తగదని బుద్ధుడు చెప్పాడు. ఆత్మహత్యా పద్ధతులు పెక్కింటిలో ఇది ఒకటి. ఇది తగని పని అని చెప్పడం ద్వారా ఆత్మహత్య చేసుకోరాదని చెప్పినట్లవుతుంది. ఆత్మహత్య అనేది జీవధర్మానికి అత్యంత విరుద్ధమైన చర్య. "ఇది తగదు". అని చెప్పవలసిన అవసరమే లేదు. కానీ మానవులు కష్టనష్టాలు, అవమానాలు భరించలేక తొందరపడి ఆత్మహత్యకు పాల్పడడం సాధారణంగా జరుగుతూనే ఉంది. వీళ్ళను తలచుకొని "అయ్యో అభాగ్యులారా" అని షోపెన్‌హావర్ చాలా జాలి చెందాడు. ముక్తిమార్గంలో ప్రవేశించే ఒక చక్కని అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకొన్నారని వాపోయాడు. బాధలు, దుఃఖాలు, కష్టనష్టాలు, అవమానాలు, అపజయాలు అపురూపమేమీ కాదు. ఈ భవం (existence) లక్షణమే అది. కనుక అవి దాపురించినపుడు వైరాగ్యాన్ని (denial of the will) కలిగించుకొని ముక్తిమార్గంలోకి అడుగు వేసి నిర్వాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని జీవనయాత్ర సాగించాలి.*

## మార్గం

**మి**: భంతే నాగసేనా, భగవానుడు ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, అర్హతుడు, సమ్యక్ సంబుద్ధుడు అయిన తథాగతుడు అంతకుముందు ఉత్పన్నం కానట్టి మార్గాన్ని

ఉత్పాదించాడు." భగవానుని మరో భాషితం ఇలా ఉన్నది: "భిక్షువులారా, పూర్వకాలీన సమ్యక్ సంబుద్ధులు నడచిన పురాణమార్గాన్ని (ancient way / path) నేను దర్శించాను." ఇక్కడ సంశయం ఏమిటంటే మొదటి వాక్యం సత్యమయితే రెండవ వాక్యం మిథ్య అవుతుంది. రెండవ వాక్యమే సత్యమంటే మొదటిది మిథ్య అవుతుంది. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. నీముందుకు వచ్చింది. సమాధానం చెప్పుము.

**నా:** మహారాజా, నీవు ఎత్తి చూపిన రెండు వాక్యాలూ భగవానుని భాషితాలే. రెండూ సరియైనవే. పూర్వకాలీన బుద్ధులు అంతర్ధానం అయ్యాక అనుశాసకులు లేకపోవడంతో మార్గం అంతరించింది. అలా అంతరించిపోయిన, విచ్ఛిన్నమై పోయిన, మూసుకుపోయిన, సంచరణం ఆగిపోయిన, కనిపించకుండాపోయిన, తెలియకుండాపోయిన ఆ మార్గాన్ని తథాగతుడు ప్రజ్ఞాచక్షువుతో మళ్ళీ కనుక్కొన్నాడు. అంతరించిపోయిన మార్గం మళ్ళీ కనుక్కోవడం జరిగింది అనే విషయాన్నే మొదటి వాక్యం తెలియజేస్తుంది.

మహారాజా, గర్భంలో ఉన్నట్టి శిశువును ప్రసవించిన స్త్రీ జనని అనబడినట్లు తథాగతుడు కూడా మార్గఉత్పాదకుడు అనబడినాడు.

ఒకానొక పురుషుడు అటవీప్రాంతంలో కొంత భూమిని శుభ్రం చేసి చదును చేసినాడనుకొనుము. "అతని భూమి అది" అని లోకులు వ్యవహరిస్తారు కదా! ఆ భూమిని అతడు ఉత్పత్తి చేయలేదు. సాగు చేయడానికి అనువుగా దాన్ని తీర్చిదిద్దుకొన్న కారణంగా అతనికి భూస్వామి అని పేరు కలిగింది. అలానే తథాగతునికి కూడా మార్గఉత్పాదకుడు అనే పేరు వచ్చింది.

**మి:** సాధు సాధు నాగసేనా. నీ సమాధానం నాకు నచ్చింది.

## బ్రాహ్మణుడు మరియూ రాజు

**మి:** భంతే నాగసేనా, తథాగతుడు ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, నేను బ్రాహ్మణుడను. యాచయోగుడను (one to ask a favour of)." భగవానుడు మళ్ళీ ఇలా ప్రకటించియున్నాడు: "శైలా, నేను రాజును." ఈ రెండు భిన్నవాక్యాల్లో మొదటిది సత్యమైనచో రెండవది మిథ్య అవుతుంది. రెండవది సత్యమైనచో మొదటిది మిథ్య అవుతుంది. క్షత్రియుడైనా అయ్యుండాలి లేదా బ్రాహ్మణుడయినా అయ్యుండాలి. ఒక జన్మలో ఒక వ్యక్తి రెండు జాతులు కలిగియుండడం వీలు కాదు. కనుక ఇది కూడా ఉభయకోటికప్రశ్న. సమాధానం చెప్పవలసినది నీవు.

**నా**: మహారాజా, నీవు ఎత్తిచూపిన రెండు వాక్యాలూ భగవానుని పలుకులే. రెండూ సత్యవచనాలే. తథాగతుడు బ్రాహ్మణుడుగానూ రాజుగానూ కావడానికి కారణం ఉన్నది.

**మి**: ఏమిటి ఆ కారణం?

**నా**: పాపరూపములైన అకుశలధర్మాలు అన్నీ తథాగతునిచే గెంటివేయబడినాయి, వదిలించుకోబడినాయి, తొలగింపబడినాయి, చెదరగొట్టబడినాయి, తెగనరక బడినాయి, నాశనం చేయబడినాయి, రూపుమాపబడినాయి, ఆర్పివేయబడినాయి. కనుక తథాగతుణ్ణి బ్రాహ్మణుడు అనడం జరిగింది.

బ్రాహ్మణుడనగా సంశయాలు, డోలాయమానాలు, విచికిత్సలు అధిగమించిన వాడని అర్థం. తథాగతుడూ వాటిని అధిగమించాడు కనుక బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడనగా అన్నివిధములైన భవములనుండి (becomings) తప్పించుకొన్న వాడు. పాపరూపకల్మషంనుండి క్లేశరూపరజస్సునుండి విముక్తు డయినవాడు. భగవానుడు కూడా అలాంటివాడే కనుక బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడంటే శ్రేష్ఠమైన ఉన్నతమైన ఉదారమైన భావాల్లో మనస్సును విహరింపజేసేవాడు. భగవానుడు కూడా అలాంటివాడే కనుక బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడంటే అధ్యయనం, అధ్యాపనం, దానప్రతిగ్రహణం (accepting of gifts), దమము, సంయమము, నియమము కలిగినవాడు. భగవానుడు కూడా అలాంటివాడే కనుక బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడంటే బ్రహ్మసుఖవిహారం* అనబడు ధ్యానములు చేసేవాడు. తథాగతుడు కూడా ఆ ధ్యానములు చేస్తాడు కనుక బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడంటే గతించిన జన్మలలో ఏమేమి జరిగిందో తెలిసినవాడు. తథాగతునికి కూడా గతజన్మల జ్ఞానాలు ఉన్నది కనుక బ్రాహ్మణుడు.

మహారాజా, భగవానునికి బ్రాహ్మణుడని పేరు తల్లి పెట్టలేదు. తండ్రి పెట్టలేదు, సోదరులు పెట్టలేదు, మిత్రులు పెట్టలేదు, బంధువులు పెట్టలేదు, శ్రమణ బ్రాహ్మణులు పెట్టలేదు, దేవతలు పెట్టలేదు. బ్రాహ్మణపదం విముక్తికి మరో పేరు. భగవానుడు బోధివృక్షం క్రింద సర్వజ్ఞజ్ఞానం పొందడంతో బాటు మారసైన్యాన్ని చిత్తుచేసినందువల్ల కలిగిన సార్థకనామధేయమిది. కనుక తథాగతుడు బ్రాహ్మణుడనబడినాడు.

---

* *పది కసిణధ్యానాలకు దివ్యవిహారం అని, మైత్రి కరుణ ముదిత ఉపేక్ష ధ్యానాలకు బ్రహ్మవిహారమని, నాలుగవ ఆర్యసత్యమైన మార్గానికి సంబంధించిన ధ్యానాలకు ఆర్యవిహారమని పేర్లు.*

**మి:** భంతే నాగసేనా, ఏ కారణం చేత తథాగతుడు రాజు అనబడినాడు?

**నా:** మహారాజా, రాజు అంటే ఒక రాజ్యంలోని ప్రజలను పాలించేవాడు. భగవానుని ధర్మసామ్రాజ్యం పదివేల లోకధాతువులు. ఈ లోకధాతువులలోని మనుష్యులు, దేవతలు, శ్రమణ బ్రాహ్మణులు వీరందరికి ధర్మస్వామిగా ఉన్నందువల్ల తథాగతుడు రాజు అనబడినాడు.

మహారాజా, రాజు అనబడేవాడు తన రాజ్యంలోని సర్వజనుల్లో అధికుడుగా ఉంటూ తన బంధుమిత్రులకు ఆనందాన్ని కలిగిస్తూ, శత్రువులకు శోకాన్ని కలిగిస్తూ ఉంటాడు. నూరు శలాకలచే అలంకృతమైనట్టి స్థిరసారమైన దండము కలిగినట్టి శ్వేతచ్ఛత్రం అతనికి ఉంటుంది. భగవానుడు కూడా మంచి మార్గంలో నడిచే దేవమనుష్యులకు ఆనందాన్ని ఇస్తూ వక్రమార్గంలో నడిచే మారసైన్యానికి శోకాన్ని కలిగిస్తూ ఉంటాడు. క్షాంతి అనే దండము, జ్ఞానములు అనెడి శలాకలు కలిగినట్టి విముక్తి అనే శ్వేతచ్ఛత్రాన్ని భగవానుడు కలిగియున్నాడు.

మహారాజా, రాజసన్నిధికి చాలామంది వచ్చి దర్శనం చేసుకొని నమస్కరించి వెళ్తారు. అలాగే తథాగతుని సన్నిధికి కూడా చాలామంది వచ్చి దర్శనం చేసుకొని నమస్కరించి వెళతారు. ఆ కారణంగానూ తథాగతుడు రాజు అనబడతాడు.

మహారాజా, తాను ఆదేశించిన పనిని చక్కగా చేసినవానిపట్ల రాజు చాలా ప్రీతి చెంది ఏది కావాలో కోరుకోమని వరం ఇచ్చి ఆనందపరచినట్లుగా భగవానుడు కూడా జినశాసనాన్ని కాయేన వాచా మనసా తలదాల్చినవానిపట్ల ప్రీతి చెంది సర్వదుఃఖపరిముక్తి అనే సాటిలేని వరాన్ని ఇస్తాడు. ఆ కారణంగానూ తథాగతుడు రాజు అనబడతాడు.

మహారాజా, రాజాజ్ఞను ఉల్లంఘించినవానిని రాజు కఠినంగా శిక్షించినట్లే భగవానుడు కూడా జినశాసనాన్ని ఉల్లంఘించినవారిని వర్జిస్తాడు. ఆ కారణం గానూ తథాగతుడు రాజు అనబడుతాడు.

మహారాజా, పూర్వకాలీన ధార్మికరాజులు ప్రవేశపెట్టిన ప్రజాపాలనా పద్ధతులు పాటిస్తూ ధర్మబద్ధంగా రాజ్యాన్ని పాలిస్తూ ప్రజలకు ఇష్టుడుగా ఉంటూ ధర్మగుణబలంతో తన వంశానికి సుస్థిరతను కలిగించిన రాజువలె భగవానుడు కూడా పూర్వకాలీన సమ్మాసంబుద్ధుల ధార్మికశాసనాన్ని మళ్ళీ వెలుగులోకి తెచ్చి మనుష్యులకు దేవతలకు ఇష్టుడైనాడు. ఆ కారణంగానూ తథాగతుడు రాజు అనబడినాడు.

మహారాజా, బ్రాహ్మణుడుగానూ రాజుగానూ తథాగతుడు ఎలా అయ్యాడు అని కారణాలను చెప్పడానికి నిపుణుడయిన భిక్షువుకు కూడా ఒక కల్పకాలం పడ్తుంది.

కనుక ఇంకా ఎక్కువ చెప్పడం దేనికి? సంక్షిప్తంగా చెప్పినదాన్ని సమాధానంగా తీసుకోవాలి.

**మి**: సాధు సాధు భంతే.

## నిరుత్సాహం

**మి**: భంతే నాగసేనా, మీ భిక్షువులు అంటారు: "మహాజనకాయాన్ని సంసార సాగరంనుండి ఉద్ధరించడానికి అవసరమైనట్టి సర్వజ్ఞత్వం (బుద్ధత్వం) కోసం నాలుగు అసంఖ్యేయకల్పాలు మరియూ ఒక లక్ష కల్పాలు బోధిసత్త్వుడు ప్రయత్నపరుడుగా ఉండినాడు." మళ్ళీ మీ భిక్షువులు ఇలా అంటారు: "సర్వజ్ఞత్వం ప్రాప్తించాక ధర్మదేశనం పట్ల సమ్మాసంబుద్ధుని చిత్తం ఉత్సాహం చూపలేదు."

భంతే నాగసేనా, ఒక ధానుష్కుడుగానీ (archer) ధానుష్కుని అంతేవాసి గానీ సంగ్రామంలో పాల్గొనేందుకు చాలా కాలం ధనుర్విద్యను అభ్యసించినాడు. ఎన్నాళ్ళుగానో ఎదురు చూసిన యుద్ధం వచ్చినపుడు అందులో పాల్గొనే ఉత్సాహం అతడు కోల్పోవడం ఎంత అసంబద్ధమో అలాగే మహాజనకాయసముద్ధరణమే లక్ష్యంగా పెట్టుకొని అసంఖ్యేయకల్పాలుగా సర్వజ్ఞత్వం కోసం ప్రయత్నిస్తూ చివరికి సర్వజ్ఞత్వం పొందాక ధర్మదేశనం పట్ల ఉత్సాహం క్షీణించడమనేది చాలా అసంబద్ధంగా ఉన్నది. ఉత్సాహం తగ్గిపోవడానికి కారణం భయమా? అస్పష్టతయా? దౌర్బల్యమా? సర్వజ్ఞజ్ఞానం కలగనందువల్లనా?

సర్వజ్ఞత్వం కలిగినట్లు చెప్పిన మొదటి వాక్యం సత్యమయితే రెండవ వాక్యం మిథ్య. రెండవ వాక్యం సత్యమైతే మొదటిది మిథ్య. ఇది కూడా ఉభయకోటిక ప్రశ్న. గంభీరమైన (deep) ప్రశ్న. దుర్నివేధప్రశ్న (difficult to penetrate). ఇది నీముందుకు వచ్చింది. సమాధానం చెప్పుము.

**నా**: మహారాజా, నీవు ఎత్తిచూపిన రెండు వాక్యాలూ సత్యములే. ధర్మదేశనం విషయమై భగవానుడు నిరుత్సాహం చెందడానికి కారణం ఉన్నది. ధర్మం యొక్క గంభీరతను, సూక్ష్మతను (subtle), దుర్దర్శతను(difficult to see) దురనుబోధతను (difficult to understand) తలచి ప్రాయశః జనులు కామాసక్తులుగానూ సత్కాయదృష్టి కలిగినవారుగానూ ఉండడం తలచి వీరి చిత్తాన్ని ధర్మంలో లగ్నం చేయడం ఎంత కష్టమో తలచి "ఎవరికి చెప్పడం? ఏమి చెప్పడం?" అని ధర్మదేశనం పట్ల భగవానునికి నిరుత్సాహం కలిగింది. కానీ ఈ వాక్యం తాత్పర్యం ఏమిటంటే చిత్తాన్ని ధర్మంలో లగ్నం చేయవలెను" అని.

మహారాజా, అనేక వ్యాధులతో పీడితుడైన రోగిని చూసి వైద్యుడు "ఇతనికి వైద్యం చేయడం ఎలా? చికిత్స ఎలా మొదలు పెట్టాలి? ఏ ఔషధం ఇవ్వాలి?" అని అనుకొన్నట్లే తథాగతుడు కూడా క్లేశరోగాలతో అమితంగా బాధపడుచున్న జనులను చూసి "ఎవరికి ఏ వైద్యం ఎలా చేయాలి?" అని కొంత నిరుత్సాహం చెందాడు.

మహారాజా, ధర్మదేశనం చేయమని తథాగతులను బ్రహ్మ యాచించడం అనేది ధర్మత (nature of things). ఎందుకంటే మనుష్యులు, తాపసులు, శ్రమణబ్రాహ్మణులు బ్రహ్మను సృష్టికర్తగా భావించి పూజించేవాళ్ళు, బ్రహ్మయే పరాయణంగా భావించేవారు. అటువంటి బ్రహ్మయే వచ్చి ధర్మదేశనం కోసం యాచించడం చూసి జనులకు ధర్మం పట్ల శ్రద్ధ, గౌరవం, పూజ్యభావం కలుగుతుంది. మహారాజా, రాజుగానీ మహామంత్రిగానీ ఎవరిని గౌరవించి నమస్కరిస్తున్నారో వాళ్ళను తక్కిన జనులు కూడా గౌరవించి పూజించడం జరుగుతుందికదా! ప్రజలు సాధారణంగా పూజితపూజకులు. కనుక ధర్మ మాహాత్మ్యాన్ని లోకం గుర్తించడం కోసం బ్రహ్మయాచన తరువాతనే ధర్మదేశనం చేయడం తథాగతుల ధర్మత.

**మి**: సాధు సాధు నాగసేనా! నా ప్రశ్నకు చక్కని వివరణాత్మక సమాధానం చెప్పావు. నేను అంగీకరిస్తున్నాను.

## ఒక బుద్ధుడు

**మి**: భంతే నాగసేనా, భగవానుడు ఇలా భాషించినాడు: "భిక్షువులారా, ఒక లోకధాతువులో సమకాలీనులుగా సమ్మాసంబుద్ధులు ఇద్దరు ఆవిర్భవించుట అసంభవం, అనవకాశము." భంతే నాగసేనా, తథాగతులు అందరూ ముప్పైఏడు బోధిపక్షీయధర్మాలనే బోధిస్తారు, నాలుగు ఆర్యసత్యాల గురించే మాట్లాడుతారు. శిష్యులకు శిక్షణగా మూడు శిక్షాపదాలనే (అధిశీలం, అధిచిత్తం, అధిప్రజ్ఞ) నేర్పుతారు; అప్రమాదప్రతిపత్తినే అనుశాసిస్తారు. ఇలా దేశనమూ (teaching), భాషణమూ (talk). శిక్షణమూ (training), అనుశాసనమూ (instruction) తథాగతులందరూ ఏకరీతిగా కలిగియున్నప్పుడు ఇద్దరు సమ్మాసంబుద్ధులు సమకాలంలో ఎందుకు ఉద్భవించరాదు? ఒక బుద్ధుని వల్ల ఈ లోకధాతువు వెలిగింపబడినపుడు ఇద్దరి వల్ల మరింత అధ్యాత్మికవెలుగు కలుగుతుందికదా! ఇద్దరు సమ్మాసంబుద్ధులు సమకాలంలో ఉంటే బోధనలు, అవవాదాలు*, అనుశాసనాలు చేయడం ఎక్కువ శ్రమ లేకుండా సుఖంగా

** సహృదయులు, పెద్దలు దిద్దుబాటును ఉద్దేశించి పలికే మాటలకు అవవాదములు (admonitions) అని పేరు.*

జరుగుతుందికదా! ఈ ప్రశ్నకు సమాధానం చెప్పి నా సంశయాన్ని తొలగించుము.

**నా**: మహారాజా, ఈ లోకధాతువు ఒక బుద్ధుణ్ణి మాత్రమే భరించగలదు. ఒక బుద్ధుని గుణాలను మాత్రమే భరించగలదు. ఒక వేళ రెండవ బుద్ధుడు కూడా సమకాలంలో ఆవిర్భవిస్తే ఈ లోకధాతువు తట్టుకోజాలదు. చలిస్తుంది, కంపిస్తుంది, ఇటు అటూ ఒంగిపోతుంది, చెదిరిపోతుంది, తునాతునకలవుతుంది, ధ్వంసమవుతుంది, నిలకడను కోల్పోతుంది.

మహారాజా, ఒక పురుషుణ్ణి మాత్రమే భరించే పడవ ఉందనుకో. ఒక పురుషుడు ఆ పడవ ఎక్కినప్పుడు నీళ్ళలో సమంగా కదులుతూ ముందుకు పోతుంది. మొదటి పురుషునితో సమాన వయస్కుడు, సమాన శరీరుడు అయిన రెండవ పురుషుడు కూడా ఆ పడవ ఎక్కితే అది భరించగలదా?

**మి**: భరించజాలదు భంతే. అది చలిస్తుంది, కంపిస్తుంది, అటు ఇటు ఊగుతుంది, చివరికి మునిగిపోతుంది.

**నా**: మరియూ మహారాజా, ఒక లోకధాతువులో ఒక బుద్ధుడు మాత్రమే ఆవిర్భవించడం అనేది భగవానుల స్వాభావికత. ఎందుకంటే సర్వజ్ఞ బుద్ధగుణాల మహాంతత (greatness) వల్ల. లోకంలో మహాంతం అయినది ఒకటియే ఉంటుంది. పృథివి మహాంతం. ఉన్నది ఒకటే. సాగరం మహాంతం. ఉన్నది ఒక్కటే. శక్రుడు మహాంతుడు. ఉన్నది ఒక శక్రుడే. మారుడు మహాంతుడు. ఉన్నది ఒక్క మారుడే. మహాబ్రహ్మ మహాంతుడు. ఉన్నది ఒక బ్రహ్మయే. అలాగే తథాగతుడు మహాంతుడు కనుక లోకధాతువుకు ఒకడే ఉంటాడు. కనుక ఒక కాలంలో ఒక లోకధాతువులో ఒక బుద్ధుని ఆవిర్భావమే జరుగుతుంది.

**మి**: భంతే నాగసేనా, సమాధానం చాలా చక్కగా చెప్పావు. మందబుద్ధి కూడా ఈ సమాధానం విని అర్థం చేసుకుని తృప్తి చెందగలడు. ఇక నా విషయం చెప్పడం ఎందుకు? సాధు సాధు నాగసేనా! నేను సమ్మతిస్తున్నాను.

## గృహస్థుడు, పరివ్రాజకుడు

**మి**: భంతే నాగసేనా, భగవానుడు ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, గృహస్థుల సమ్యక్ ప్రతిపత్తిని (right practice), ప్రవ్రజితుల సమ్యక్ ప్రతిపత్తిని నేను ప్రశంసిస్తాను. గృహస్థులుగానీ ప్రవ్రజితులుగానీ సమ్యక్ ప్రతిపత్తి ద్వారా జ్ఞానాన్ని, పుణ్యాన్ని ఆర్జించగలరు." భంతే నాగసేనా, తెల్లగుడ్డలవాడు, కామభోగి (enjoying

sense pleasures), భార్యాబిడ్డలతో సందడిగా ఉన్న ఇంటికి యజమాని, కాశీచందనానికి అలవాటు పడినవాడు, సుగంధవస్తువులైన మాలలు, గంధవిలేపనాలు ఉపయోగించేవాడు, వెండి బంగారులను లెక్కించుకొనేవాడు, మణికుండలాలు పెట్టుకొన్నవాడు అయిన గృహస్థుడు సమ్యక్‌ప్రతిపత్తిద్వారా జ్ఞానాన్ని, పుణ్యాన్ని ఆర్జించగలడన్నమాట!

ముండనం చేసుకొన్నవాడు, కాషాయం ధరించినవాడు, భిక్షాటనం చేసేవాడు, నాలుగు శీలస్కంధములను* చక్కగా పాటిస్తున్నవాడు, రెండువందల యాభై శిక్షాపదాలను (rules of training) తలదాల్చుచున్నవాడు, పదమూడు ధుతాంగములను (thirteen modes of ascetic practices) పాటిస్తున్నవాడు అయిన భిక్షువు సమ్యక్ ప్రతిపత్తి ద్వారా జ్ఞానాన్ని పుణ్యాన్ని ఆర్జించగలడు.

భంతే నాగసేనా, ఇక్కడ నా సంశయం ఏమిటంటే గృహస్థులు, పరివ్రాజకుల మధ్య వ్యత్యాసం ఏమిటి? భిక్షువుల తపస్సు వృథా, ప్రవ్రజ్య నిరర్థకం, శిక్షాపదాలు దండగ, ధుతాంగములు వ్యర్థం. ఈ వివిధ పద్ధతుల్లో దుఃఖాన్ని పెంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? సుఖం ద్వారా సుఖాన్ని పొందడం వీలుపడదా?

**నా:** మహారాజా, భగవానుడు భాషించిన వాక్యాన్ని నీవు సరిగ్గానే ఎత్తి చూపావు. సమ్యక్ ప్రతిపత్తి కలిగినవాడు శ్రేష్ఠుడు. ప్రవ్రజించినవాడు “నేను ప్రవ్రజితుడను” అనుకొంటే సరిపోదు. సమ్యక్ ప్రతిపత్తి లేకపోతే అతడు శ్రామణ్యానికి బ్రాహ్మణ్యానికి దూరం అవుతాడు. ఇక గృహస్థుల సంగతి చెప్పాలా?

సమ్యక్ ప్రతిపత్తి కలిగిన గృహస్థులూ, పరివ్రాజకులూ జ్ఞానార్జనలో పుణ్యార్జనలో సమానులయినప్పటికీ ప్రవ్రజ్యలో విశేషం ఉన్నది. ప్రవ్రజించినవాడే శ్రామణ్యంలో ఈశ్వరుడు, అధిపతి కాగలడు. మహారాజా, ప్రవ్రజ్య (going forth) అనేది బహుగుణములు కలది, అనేక గుణములు కలది, అప్రమాణ గుణములు కలది. ప్రవ్రజ్యగుణాలను లెక్కించడం సాధ్యం కాదు. మహాసముద్రంలో అలలను లెక్కించడం సాధ్యమా? అలాగే ప్రవ్రజ్య బహుగుణాలను అనేక గుణాలను, అప్రమాణ గుణాలను లెక్కించడం సాధ్యం కాదు.

---

* *శ్రద్ధవల్ల ప్రాతిమోక్షసంవరశీలాన్ని, సతిసంప్రజన్యముల ద్వారా ఇంద్రియసంవర శీలాన్ని, వీరభావంవల్ల ఆజీవపరిశుద్ధిశీలాన్ని, ప్రజ్ఞ ద్వారా ప్రత్యయసన్నిశ్రితశీలాన్ని కాపాడుకొంటున్న వాడు.*

ప్రవ్రజితుడు తాను చేయవలసిన పనిని శీఘ్రంగా చేయగలడు. ఆలస్యం జరుగదు. కారణం ఏమిటి? ప్రవ్రజితుడు అల్పేచ్ఛుడుగా (few wishes) ఉంటాడు. సంతుష్టుడుగా (contented) ఉంటాడు. వీరియవంతుడుగా (energetic) ఉంటాడు. అనికేతుడుగా (homeless) ఉంటాడు. పరిపూర్ణశీలుడుగా ఉంటాడు. కల్లాకపటం లేనివాడుగా ఉంటాడు. కనుక తాను చేయవలసినదానిని శీఘ్రమే చేయగలుగుతాడు.

**మి:** సాధు సాధు నాగసేనా. నేను సమ్మతిస్తున్నాను.

## వెనక్కిపోయేవాళ్ళు

**మి:** భంతే నాగసేనా, తథాగతుని శాసనం మహాంతం, సారం, వరం, శ్రేష్ఠం, ప్రవరం, అనుపం, పరిశుద్ధం, విమలం, స్వచ్ఛం మరియూ అనవద్యం (faultless). ఇటువంటి శాసనంలో మామూలు గృహస్థునికి ప్రవ్రజ్య ఇచ్చి ప్రవేశపెట్టడం యుక్తం కాదు. ఎందుకంటే, మామూలువాళ్ళు శాసనంలో ప్రవ్రజించి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతే ప్రజలు ఇలా అనుకొంటారు: "శ్రమణ గౌతముని శాసనం తుచ్ఛకం (నిరుపయోగం) కనుకనే చేరినవాళ్లు మళ్ళీ వెనక్కి వచ్చేస్తున్నారు." దీని మీద నీ అభిప్రాయం ఏమిటి?

**నా:** మహారాజా, ఒక తటాకం ఉన్నది. శుభ్రమైన చల్లని నీటితో నిండుగా ఉన్నది. దుమ్ము, దూళీ, బురద అంటియున్న ఒక మురికి మనిషి ఆ తటాకం వద్దకు వెళ్ళి అందులో స్నానం చేయకనే తిరిగివస్తాడనుకో. పూర్వంలాగే మురికిగా ఉన్న ఆ మనిషిని చూసి ప్రజలు ఎవరిని తప్పుబట్టారు? తటాకాన్నా? ఆ మురికి మనిషినా?

**మి:** స్నానం చేయకుండా తిరిగి వెళ్ళిపోయిన ఆ మురికి మనిషినే తప్పుబట్టారు. స్నానం చేయడానికి ఇష్టపడనివాణ్ణి తటాకం ఎలా స్నానం చేయిస్తుందని ప్రజలు భావిస్తారు.

**నా:** అలాగే మహారాజా, తథాగతుడు విముక్తిజలంతో సంపూర్ణంగా ఉన్న సద్ధర్మతటాకాన్ని సిద్ధం చేసి ఇలా అనుకొన్నాడు: "వివేకవంతులైన జనులు ఇందులో స్నానం చేసి తమకు అంటియున్న క్లేశమలాన్ని మొత్తం కడిగివేసు కొందురుగాక!" ఎవరైనా సద్ధర్మతటాకం వద్దకు వెళ్ళి అందులో స్నానం చేయకనే క్లేశమలం అట్లే ఉంచుకొని తిరిగివచ్చేస్తే ప్రజలు అతణ్ణే నిందిస్తారు. "జినశాసనంలో ప్రవ్రజించి అక్కడ నిలద్రొక్కుకొనకుండా తిరిగి వచ్చేశాడు. ప్రతిపత్తి (practice / application) లేని ఇట్టి మనిషిని జినశాసనం స్వయంగా ఎలా శుద్ధి చేయగలదు?" అని.

మహారాజా, ఒకానొక పురుషుడు వ్యాధిపీడితుడై ఒక వైద్యుని వద్దకు వెళ్తాడు. ఆ వైద్యుడు రోగాన్ని, రోగకారణాన్ని చక్కగా కనిపెట్టగలడు. ఆరోగ్యం చేకూర్చే

తిరుగులేని వైద్యం చేయగలవాడు కానీ ఆ వ్యాధిపీడితుడు వైద్యం చేసుకోకుండా మరలి వచ్చేస్తే ప్రజలు ఎవరిని నిందిస్తారు?

**మి**: రోగినే నిందిస్తారు. "అమోఘవైద్యుణ్ణి సమీపించి కూడా చికిత్స చేసుకోకుండా వెనుదిరిగిన ఆ రోగిని వైద్యుడు స్వయంగా ఎలా బాగు చేయగలడు?" అని రోగిని నిందిస్తారు.

**నా**: అలాగే మహారాజా, తథాగతుడు అన్ని రకాల క్లేశరోగాలను ఉపశమింపజేసే అమృతం అనే దివ్యౌషధాన్ని ఒక మంజూషలో (త్రిపిటకములు) సిద్ధం చేసి ఉంచి "వివేకులయినవారు ఈ ఔషధాన్ని సేవించి తమ తమ క్లేశరోగాలను ఉపశమింప జేసికొందురుగాక!" అనుకొన్నాడు. మహారాజా, ఎవడైనా క్లేశవ్యాధిపీడితుడు ఆ మంజూష వద్దకు వెళ్ళి ఔషధాన్ని సేవించకుండానే తిరిగి వచ్చేస్తే ప్రజలు అతణ్ణే తప్పుబట్టారు. "జినశాసనంలో ప్రవ్రజించినప్పటికీ అక్కడ నిలద్రొక్కుకోలేక తిరిగి వచ్చేశాడు. ప్రతిపత్తి (practice / application) లేని ఈ మనిషిని జినశాసనం తానే స్వయంగా ఎలా బాగు చేయగలదు?" అని.

మహారాజా, అన్నం లేక బక్కచిక్కిన మనిషి ఒక గొప్ప అన్నసత్రానికి వెళ్ళి భోజనం చేయకుండానే తిరిగి వచ్చేస్తే ప్రజలు ఎవర్ని నిందిస్తారు? ఆ బక్కచిక్కిన వాడినా? అన్నసత్రాన్నా?

**మి**: బక్కచిక్కినవాణ్ణే నిందిస్తారు. "ఆకలితో అలమటిస్తూ అన్నసత్రం వెళ్ళినవాడు అక్కడ తినకనే తిరిగివచ్చాడు. భోంచేయనివాని నోట్లో అన్నసత్రం స్వయంగా ముద్దలు పెడ్తుందా?" అని నిందిస్తారు.

**నా**: అలాగే మహారాజా, తథాగతుడు ప్రవరం (most precious), శాంతం (peaceful), శివం(auspicious), ప్రణీతం(excellent), అమృతం (undying), మధురం అయిన కాయగతాసతి అనే భోజనాన్ని సిద్ధం చేసి శాసనమంజూషలో (casket of teaching) ఉంచి ఇలా అనుకొన్నాడు: "క్లేశాలచే అంతర్గతంగా చిక్కిపోయినట్టి, తృష్ణావశమైన చిత్తం కలిగినట్టి జనులు ఈ భోజనం ఆరగించి కామతృష్ణ (craving for sense sphere), రూపతృష్ణ(craving for fine material sphere), అరూపతృష్ణ (craving for immaterial sphere)నుండి విముక్తు లగుదురుగాక!" క్లేశాలచే అంతర్గతంగా బక్కచిక్కినవాడు ఎవడైనా ఆ మంజూష వద్దకు వెళ్ళి సిద్ధం చేసి ఉంచిన ఆ భోజనాన్ని (కాయానుపశ్యన) తీసుకోకుండా తిరిగివచ్చి ఎప్పటిలాగా తృష్ణావశుడుగా ఉంటే ప్రజలు అతణ్ణి ఇలా నిందిస్తారు: "జినశాసనంలో ప్రవ్రజించిన ఈ మనిషి

అక్కడ నిలద్రొక్కుకోలేక తిరిగి వచ్చేశాడు. ప్రతిపత్తిశూన్యుడైన ఈ మనిషిని స్వయంగా జినశాసనం ఎలా ఉద్ధరిస్తుంది?" అని.

మహారాజా, స్రోతాపత్తిఫలం సాధించిన గృహస్థుణ్ణే తథాగతుడు ప్రవ్రజ్య ఇచ్చి ప్రవేశపెట్టితే ఆ ప్రవ్రజ్య క్లేశాల తొలగింపుకుగానీ విశుద్ధికిగానీ ఉద్దేశించి నట్టిది కాకుండా పోతుంది. మహారాజా, ఒకానొకడు కొన్ని వందలమంది పనివాళ్ళను తీసుకొని ఒక చెరువును త్రవ్వించి ఆపైన ప్రజలకు ఇలా ప్రకటించాడనుకొనుము: "దుమ్ము, దూళి, మురికి అంటియున్న జనులు ఇందులో దిగరాదు. మురికి లేకుండా పరిశుభ్రంగా ఉన్న జనులే ఇందులో దిగాలి." మహారాజా నీవేమనుకొంటున్నావు? మురికి లేకుండా పరిశుభ్రంగా ఉన్న జనులకు ఆ చెరువు వల్ల కలిగే ఉపయోగం ఏమైనా ఉన్నదా?

**మి:** లేదు భంతే. ఆ చెరువు వల్ల పొందవలసిన ఉపయోగాన్ని వాళ్ళు ఈవరకే పొందియున్నారు.

**నా:** అలాగే మహారాజా, స్రోతాపత్తిఫలం సాధించినవాణ్ణే ప్రవ్రజ్య ఇచ్చి ప్రవేశపెట్టితే ఆ ప్రవ్రజ్య వల్ల సాధించే కొత్త ప్రయోజనం ఏముంటుంది?

మహారాజా, వెనక్కి తిరిగి మళ్ళీ మామూలు లౌకిక జీవితంలోకి ప్రవేశించినవారివల్ల జినశాసనం యొక్క ఐదు ప్రత్యేక గుణములు ప్రకటమవుతాయి. 1. భూమిమహాంతభావం (mighty character as a plane) 2. పరిశుద్ధవిమలభావం 3. పాపముతో కలిసి ఉండలేనితనం 4.దుష్ప్రతి వేధభావం (it's character as one that is hard to pierce) 5. బహుసంవర రక్షణీయభావం(its character as one to be preserved by many restraints).

భూమిమహాంతభావం ఎట్లు తెలియబడుతుంది? మహారాజా, ఒకానొక పురుషుడు దరిద్రుడు, హీనుడు, ఏ విశేషమూ లేనివాడు, బుద్ధి లేనివాడు ఉన్నాడనుకొనుము. గొప్పసామ్రాజ్యానికి అతణ్ణి రాజును చేస్తే అచిరకాలంలోనే అతడు దానిని కోల్పోతాడు. అపకీర్తి పాలవుతాడు. ఐశ్వర్యాన్ని (authority) నిలుపుకోలేడు. కారణం ఏమిటి? అతడు నిర్వహించలేనంతటి గొప్పఐశ్వర్యం అయినందువల్ల. అలాగే మహారాజా, పుణ్యసంపద లేని బుద్ధిహీనుడు జినశాసనంలో ప్రవ్రజించినప్పటికీ అచిరకాలంలోనే పతనం చెంది వెనుదిరుగుతాడు. జినశాసనంలో నిలదొక్కుకోలేడు. జినశాసనం యొక్క భూమిమహాంతభావం ఇది.

పరిశుద్ధవిమలభావం ఎట్లు తెలియబడుతుంది? మహారాజా, తామరాకు మీద పడిన నీరు చెదిరిపోతుంది, స్థానాన్ని పొందదు, అంటదు. కారణం ఏమిటి? పద్మపత్రం

యొక్క పరిశుద్ధవిమలత వల్ల. అలాగే మహారాజా, శఠులు (treacherous), కూటులు (deceitful), వంకులు (shifty), కుటిలురు(crooked), విషమదృష్టులు (men of discrepent views) అయినట్టివారు జినశాసనంలో ప్రవ్రజించినా అక్కడ్నుంచి శీఘ్రంగానే చెదిరిపోతారు, జారిపోతారు, నిలకడ పొందలేరు. ఇదే జినశాసనం యొక్క పరిశుద్ధవిమలభావం.

అసంవాసభావం ఎట్లు తెలియబడుతుంది? మహారాజా, మృతదేహాన్ని మహాసముద్రం తనలో ఉంచుకోదు. శీఘ్రంగా దాన్ని తీరానికి నెట్టివేస్తుంది. ఎందుకంటే మహాసముద్రం మహాభూతములకు (great beings) నిలయం. అలాగే మహారాజా, పాపులు, సోమరులు, బలహీనులు, దుర్జనులు జినశాసనంలో ఇమడలేక వెనుదిరుగుతారు. ఇదియే జినశాసనం యొక్క అసంవాసభావం.

దుష్ప్రతివేధభావం ఎట్లు? మహారాజా, ధనుర్విద్యలో నైపుణ్యం లేనివారు, సరియైన శిక్షణ లేనివారు, ఏకాగ్రచిత్తం లేనివారు ధనుర్విద్య పరీక్షలో లక్ష్యంగా ఉంచిన వెంట్రుకను బాణంతో చీల్చలేక మరలుతారు. కారణం ఏమిటి? లక్ష్యంగా ఉంచిన వెంట్రుక సూక్ష్మంగా ఉన్నందువల్ల. అలాగే మహారాజా, దుష్ప్రజ్ఞులు, జడులు, మోహచిత్తులు (confused), మందబుద్ధులు అయినట్టివారు జినశాసనంలో ప్రవ్రజించినప్పటికీ చాలా సూక్ష్మమైన నాలుగు ఆర్యసత్యాలలో మనస్సును చొప్పించలేక శీఘ్రంగానే లౌకికజీవితానికి మళ్ళీ మరలుతారు. జినశాసనం యొక్క దుష్ప్రతివేధభావం ఇదియే.

బహుసంవరరక్షణీయభావం ఎట్లు? మహారాజా, ఒకానొకడు యుద్ధభూమికి వెళ్ళి అక్కడ నలుదిక్కులనుండి ఖడ్గపాణులై కమ్ముకొని వస్తున్న పరసైన్యాన్ని చూసి భయపడి వెనుకను మరలుతాడు. కారణం ఏమిటి? తన జీవితానికి అక్కడ రక్షణ లేదనే భయమే. అలానే మహారాజా, పాపులు, సోమరులు, సిగ్గులేనివారు, చపలురు అయిన బాలజనులు (foolish people) జినశాసనంలో ప్రవ్రజించినప్పటికీ అక్కడ విధింపబడిన బహువిధ శిక్షాపదాలను (many rules of training) పాటించలేక వెనుకకు మరలుతారు. ఇదియే జినశాసనం యొక్క బహుసంవర రక్షణీయభావం.

మహారాజా, వస్సికాగుల్మం (double jasmin shrub) మొగ్గలు కొన్ని చీడపురుగుల తాకిడికి లోనయి పుష్పించకనే నేల రాలిపోతాయి. దానివల్ల వస్సికాగుల్మం హీనమనిపించుకోదు. అందులో పుష్పించిన తక్కిన పుష్పాల పరిమళం దశదిశలు వ్యాపిస్తుంది. అలాగే మహారాజా, జినశాసనంలో నిలువలేక మరలినవారివల్ల జినశాసనం

హీనమైపోదు. అక్కడ నిలిచియున్న భిక్షువుల శీలపరిమళం దేవలోక, మనుష్యలోకాల్లో వ్యాపిస్తుంది.

**మి:** సాధు సాధు నాగసేనా! ఒక ఉపమ వెంబడి మరొక ఉపమ, ఒక హేతువు వెంబడి మరొక హేతువు చూపుతూ నీవు జినశాసనం శ్రేష్ఠభావాన్ని నాకు బాగా వివరించి చెప్పావు.

## అర్హంతుని వేదనలు

**మి:** భంతే నాగసేనా, నీవు ఇలా అన్నావు: "అర్హతునికి ఒక వేదన – కాయిక వేదన ఉంటుంది, చేతసిక వేదన ఉండదు." ఇక్కడ నా సంశయం ఏమిటంటే అర్హతుని చిత్తం కూడా కాయాన్ని ఆశ్రయించియే ప్రవర్తిస్తున్నది. కాయం మీద దానికి ఈశ్వరత్వం, స్వామిత్వం, వశిత్వం(mastery) లేకుండా పోయిందికదా!

**నా:** అవును మహారాజా.

**మి:** ఇది యుక్తంగా లేదు. గూటిలో ఒదిగియున్న పక్షి కూడా తన గూడు పట్ల ఈశ్వరత్వాన్ని స్వామిత్వాన్ని వశిత్వాన్ని కలిగియుండగా అర్హతుడికి కాయం మీద ఈశ్వరత్వం, స్వామిత్వం, వశిత్వం లేదనడం యుక్తంగా లేదు.

**నా:** మహారాజా, ప్రతి భవంలోనూ (existence) కాయంతో పది ధర్మాలు ముడివడియుంటాయి. 1. శీతం, 2. ఉష్ణం, 3. ఆకలి, 4. దప్పిక, 5–6. మలమూత్ర విసర్జనలు, 7. స్త్యానమిద్ధం (fatigue and sleepiness) 8. జరా, 9. వ్యాధి, 10. మరణం. కనుక కాయానుగతధర్మాల విషయంలో అర్హతునికి ఈశ్వరత్వం, స్వామిత్వం, వశిత్వం లేదు.

**మి:** అర్హతుని ఆజ్ఞగానీ, ఈశ్వరత్వంగానీ కాయం విషయంలో చెల్లుబాటు కాకుండా పోవడానికి కారణం ఏమిటి?

**నా:** మహారాజా, పృథివిని ఆశ్రయించియున్న సత్త్వులన్నీ (beings) పృథివిని ఆశ్రయించియే చరిస్తాయి, విహరిస్తాయి, వర్తిస్తాయి. ఆ సత్త్వుల ఆజ్ఞగానీ ఈశ్వరత్వంగానీ పృథివికి వర్తిస్తుందా?

**మి:** లేదు భంతే.

**నా:** అలాగే మహారాజా, కాయాన్ని ఆశ్రయించియే అర్హతుని చిత్తం ప్రవర్తిస్తుంది. కాయం పట్ల ఆజ్ఞగానీ ఈశ్వరీయంగానీ ఉండదు.

**మి:** భంతే నాగసేనా, ఏ కారణం చేత పృథక్జనుడు కాయిక వేదనలనూ, చేతసిక వేదనలనూ రెంటినీ కలిగియుంటాడు?

**నా:** మహారాజా, పృథక్‌జనుడు భావితచిత్తుడు* కానందువల్ల రెండు విధాలయిన వేదనలకు గురి అవుతాడు. మేత లేక కృశించియున్న ఎద్దును దుర్బలమైన తాడుతోగానీ, తీగతోగానీ కట్టియుంచడానికి వీలవుతుంది. కానీ ఆ ఎద్దు పరికుపితమై (excited) దుమికినపుడు భూమిలో పాతియున్న కట్టుకొయ్య కూడా పైకి లేచిపోతుంది. అలాగే మహారాజా, అభావితాత్ముని చిత్తంలో వేదన ఉత్పన్నం కాగానే అది చిత్తాన్ని పరికుపితం (excites) చేస్తుంది. పరికుపితచిత్తం కాయాన్ని వంచుతుంది, త్రిప్పుతుంది, పొర్లిస్తుంది. ఆపైన అభావితచిత్తుడు అరుస్తాడు, కేకలు పెట్టాడు, ఆర్తనాదాలు చేస్తాడు.

**మి:** ఏ కారణం చేత అర్హతుడు ఒక వేదనకు – కాయిక వేదనకు మాత్రమే లోనవుతాడు. చేతసిక వేదనకు లోనుగాడు?

**నా:** మహారాజా, అర్హతుని చిత్తం భావితచిత్తం సుభావితచిత్తం, దాంతచిత్తం (tamed), సుదాంతచిత్తం, వచనకరచిత్తం (obedient) కనుక అర్హతుడు దుఃఖవేదన తాకగానే తక్షణమే "ఇది అనిత్యం" అని దృఢంగా గ్రహిస్తాడు. సమాధిస్తంభంలో (post of concentration) చిత్తాన్ని కట్టివేస్తాడు. మహారాజా, సమాధిస్తంభానికి కట్టివేయబడిన చిత్తం కదలదు, చలించదు, విక్షేపం చెందదు. వేదనా వికార విజృంభణం వల్ల కాయం వంగినా తిరిగినా పొర్లినా చిత్తం మాత్రం స్థిరంగా ఉంటుంది.

**మి:** భంతే నాగసేనా, లోకంలో ఇది ఆశ్చర్యం– కాయం చలించినా చిత్తం చలించకపోవడం! కారణం తెలుపుము.

**నా:** ఒక మహావృక్షం కొమ్మలు రెమ్మలు ఆకులతో సుసంపన్నంగా ఉన్నది. బలంగా గాలి వీచినపుడు కొమ్మలు రెమ్మలు ఆకులు అన్నీ చలిస్తాయి. స్కంధం(trunk) కూడా చలిస్తుందా?

**మి:** చలించదు భంతే.

**నా:** మహారాజా, అలాగే అర్హతుని చిత్తమున్నూ. దుఃఖవేదనల తాకిడికి దేహం నానా విధాలుగా చలించిపోయినా చిత్తం మాత్రం మహావృక్షస్కంధంలాగా చలించదు, కంపించదు.

**మి:** ఆశ్చర్యం నాగసేనా! అద్భుతం నాగసేనా! నీవంటి సార్వకాలిక ధర్మదీపాన్ని నేను ఇంతకు పూర్వం చూడలేదు.

---

* *ధ్యానాలద్వారా విపశ్యనద్వారా వికసింపజేసుకొన్న చిత్తం భావితచిత్తం అవుతుంది.*

## ఇల్లు వదలక తప్పదు

**మి:** భంతే నాగసేనా, నీవు ఇలా అన్నావు: "గృహస్థుడుగా ఉన్నవాడు అర్హత్వం పొందితే రెండే రెండు ప్రత్యామ్నాయాలే (alternatives) అతనికున్నాయి. ప్రవ్రజించడం లేదా పరినిర్వాణం చెందడం. అర్హత్వం పొందిన దినమే ఈ రెండింటిలో ఏదో ఒకటి జరుగుతుంది". భంతే నాగసేనా, ఇక్కడ నా సంశయం ఏమిటంటే ఆ దినమే అతనికి ప్రవ్రజ్య, పాత్ర చీవరాలు ఇచ్చే ఆచార్యుడు లభించకపోతే తానే స్వయంగా ప్రవ్రజ్య తీసుకోవచ్చా? లేదా ఎవరైనా ఇద్ధి (psychic power) ఉన్న అర్హతుడు ఆ సమయానికి అక్కడికి వచ్చి ప్రవ్రజ్య ఇస్తాడా? లేదా ఆ దినమే అతనికి పరినిర్వాణం తప్పదా?

**నా:** మహారాజా, అర్హత్వం పొందిన గృహస్థు స్వయంగా ప్రవ్రజ్య తీసుకోరాదు. అది స్తేయలింగం (పరివ్రాజక చిహ్నాలు కాషాయం వగైరా పద్ధతి ప్రకారం కాకుండా స్వయంగా ధరిస్తే అది ఆ చిహ్నాలను దొంగిలించినట్లే అవుతుంది!) అనే దోషం క్రిందకు వస్తుంది. ఆ దినం అతిక్రమణం జరుగరాదు. ప్రవ్రజ్య ఆ దినం తప్పిపోతే ఆ పైన పరినిర్వాణమే. వేరే గతిలేదు.

**మి:** అర్హత్వం అనేది గృహస్థశరీరాన్ని హరించేది కావడం అనుచితంగా ఉన్నది.

**నా:** మహారాజా, గృహిలింగం (attributes of householder) అనేది అర్హత్వానికి సరితూగని లింగం కనుక ఆ లింగదౌర్బల్యం వల్ల అర్హత్వం పొందిన గృహస్థుడు ఆ దినమే ప్రవ్రజించడం లేదా పరినిర్వాణం చెందడం జరుగుతుంది. ఇది అర్హత్వంలోని దోషం కాదు. గృహిలింగ దౌర్బల్యదోషం.

మహారాజా, అన్ని సత్త్వుల ఆయుష్షును, జీవితాన్ని కాపాడేది భోజనం. అటువంటి భోజనం కూడా జీర్ణకోశదోషం వల్ల సరిగా జీర్ణం కాకుండా జీవితాన్ని హరించేదిగా మారిపోతుంది. ఇక్కడ దోషం భోజనానిది కాదు. జీర్ణకోశానిది.

మహారాజా, అబలుడు, దుర్బలుడు, స్వల్పపుణ్యుడు అయిన పురుషుడు మహాసామ్రాజ్యాన్ని పొందితే దాన్ని అతడు తట్టుకొని నిలబడలేడు. ఈశ్వరత్వాన్ని నెరపలేడు. అలాగే మహారాజా, అర్హత్వాన్ని పొందిన గృహస్థుడు గృహిలింగంతో అర్హత్వాన్ని కొనసాగించలేడు. ఆ కారణం చేతనే ఆ దినమే ప్రవ్రజ్య లేదా పరినిర్వాణం అనే రెండే రెండు ప్రత్యామ్నాయాలు (alternatives) అతనికున్నాయి.

**మి:** సాధు సాధు నాగసేనా! నేను సమ్మతిస్తున్నాను.

## తప్పులు రెండు రకాలు

**మి:** భంతే నాగసేనా, అర్హతునికి స్మృతిసమ్మోహం (విభ్రమం) ఉంటుందా?

**నా:** మహారాజా, అర్హతులకు స్మృతిసమ్మోహం ఉండదు.

**మి:** అర్హతులు ఆపత్తికి(faults) లోనుకావడం జరుగుతుందా?

**నా:** అవును, జరుగుతుంది.

**మి:** ఏఏ విషయాల్లో?

**నా:** కుటీరం నిర్మించుకొనే విషయంలో, భోజనవిషయంగా అకాలాన్ని సకాలం అనుకోవడం, భిక్షకు పిలుపు వచ్చినా రాలేదనుకోవడం ఇత్యాదులు.*

**మి:** ఆపత్తి (faults) అనేది రెండు కారణాల వల్ల అని నీవు అన్నావు. 1. అనాదరణ(disrespect), 2. అజ్ఞానం (lack of mindfulness). అనాదరణ వల్లనా అర్హతునిలో ఆపత్తి కలిగేది?

**నా:** కాదు మహారాజా.

**మి:** అర్హతునిలో అనాదరణ వల్ల ఆపత్తి జరుగని పక్షంలో స్మృతిసమ్మోహం వల్ల జరుగుతుంది అని అనవలసియుంటుంది.

**నా:** మహారాజా, అర్హతులకు స్మృతిసమ్మోహం ఉండదు. కానీ వాళ్ళు ఆపత్తికి పాల్పడడం అప్పుడప్పుడూ జరుగవచ్చు.

**మి:** దానికి కారణం ఏమిటో వివరించు.

**నా:** మహారాజా, దోషములు రెండు రకాలు: 1. లోకసావద్యం 2. ప్రజ్ఞప్తి సావద్యం. లోకసావద్యం అంటే పది అకుశల కర్మలు.** ప్రజ్ఞప్తిసావద్యం అనేది కేవలం భిక్షువులకు సంబంధించిన విషయం. అకాలభోజనం అనేది లోకంలో తప్పు కాదు.

---

* *విధించిన కొలతలను పాటించకుండా ఇష్టం వచ్చినట్లుగా కుటీరం నిర్మించుకోవడం ఒక తప్పు. స్త్రీ పురుషుల మధ్య రాయబారం నెరపడం ఒక తప్పు. ఇలా చిన్న చిన్న తప్పులు చాలా ఉన్నాయి.*

** ***కాయిక తప్పిదాలు:*** *ప్రాణాతిపాతం (killing), అదత్తాదానం (stealing / robbing, cheating etc.), కామమిథ్యాచారం (sexual misconduct).*

***వాచిక తప్పిదాలు:*** *మృషావాదం (lying), పైశున్యం (slandering), పారుష్యం (మనస్సును గాయపెట్టే వ్యంగమైన మాటలు), సంభిన్నప్రలాపం (senseless talk).*

***మానసిక తప్పిదాలు:*** *అభిధ్య (covetousness), వ్యాపాద (ill-will), మిథ్యాదృష్టి (false views). కాయిక వాచిక తప్పిదాలకు అసలు కారణం మానసిక తప్పిదాలే. దయాచిత్తం, కరుణాచిత్తం, అనుకంపాచిత్తం కలిగియుంటే ఏ తప్పిదాలూ జరుగవు.*

కానీ అది భిక్షువులకు నియమ ఉల్లంఘనం అవుతుంది. చెట్లుచేమలకు హాని కలిగించడం లోకంలో ఒక తప్పు కాదు. భిక్షువులకు అది నిషిద్ధం. జలక్రీడలు లోకంలో తప్పు కాదు కానీ భిక్షువులకు అది తప్పు అవుతుంది.

లోకసావద్యములకు అర్హతుడు పాల్పడడం అసంభవం. కానీ ప్రజ్ఞప్తి సావద్యములకు పాల్పడడం జరుగవచ్చు. తప్పు అని తెలియనందువల్ల జరిగే పొరపాట్లు ఇవి. అన్నీ తెలిసినవాడే అర్హతుడు అని ఎవరూ అనరు. లోకంలోని స్త్రీ పురుషుల నామధేయాలు, వాళ్ళ గోత్రాలు, ఆయా ప్రదేశాలకు వెళ్ళవలసిన ఆయా మార్గాలు–ఇటువంటివి చాలా అర్హతునికి తెలియకపోవచ్చు. క్లేశాలనుండి విముక్తి పొందియుంటే చాలు అర్హతుడు కావడానికి.

**మి:** సాధు సాధు భంతే! నేను అంగీకరిస్తున్నాను.

## లోకంలో లేనివి ఏవి?

**మి:** భంతే నాగసేనా, లోకంలో, సమ్మాసంబుద్ధులు కనబడతారు. ప్రత్యేకబుద్ధులూ* కనిపిస్తారు. శ్రావకులు, చక్రవర్తులూ, రాజులూ, సామంతరాజులూ, దేవతలు,

---

** ప్రత్యేకబుద్ధులు రెండు రకాలు 1. వర్గచారిణులు, 2. ఖడ్గవిషాణకల్పులు. వర్గచారిణులు గుంపులు గుంపులుగా కలసియుండగలరు. గుంపులుంటే కలహాలూ ఉంటాయి కానీ వీరు సాధారణ గుంపులు కారు. పూర్వజన్మల్లో స్రోతాపన్న సకృదాగామి స్థాయిలకు ఎదిగినవారు కనుక వారి నడుమ ఘర్షణలుండవు. వీరికంటే ఖడ్గవిషాణకల్పుల స్థాయి ఇంకా గొప్పది. కొమ్ములున్న ప్రాణులకు సాధారణంగా రెండు కొమ్ములుంటాయి. ఖడ్గమృగానికి మాత్రం ఒకే ఒక కొమ్ము ఉంటుంది. ఖడ్గవిషాణం లాంటివారు ఈ ప్రత్యేకబుద్ధులు. ఒంటరిగా ఏకాంతంగా అద్వితీయంగా అజ్ఞాతంగా ఉంటారు. గృహస్థులతోనూ సంబంధాలుండవు, సన్యాసులతోనూ సంబంధాలుండవు. సాటి ప్రత్యేకబుద్ధులతోనూ సంబంధాలుండవు, మరింకెవరితోనూ సంబంధాలుండవు.*

*ఇతరుల ఉపదేశ సహాయం ఏమీ లేకుండా తమకు తాముగానే తరించిన మహనీయులు ఈ ప్రత్యేకబుద్ధులు. వీరు ఇతరులను తరింపజేయరు. ఎందువల్ల? కరుణ లేనందువల్లనా? కాదు. కరుణ లేనివాడు అధ్యాత్మపథంలో ఒక అడుగు కూడా ముందుకు పోలేడు. మరి దారిలో పెట్టదగిన యోగ్యజనులు కనిపించనందువల్లనా? కానేకాదు. ఏ కాలంలోనైనా సరే యోగ్యజనులు ఉండనే ఉంటారు. తగినంత శక్తి సామర్థ్యం లేనందువల్లనా? శక్తి సామర్థ్యాలకు కొదువ ఏమీ లేదు. బోధిని పొందినపుడే వారికి*

* ⟶

మనుష్యులు, ధనికులు, పేదలు, పుణ్యాత్ములు, పాపాత్ములు, పురుషుడు స్త్రీగా మారడం, స్త్రీ పురుషుడుగా మారడం, సుకృతకర్మలు, దుష్కృతకర్మలు, కల్యాణకర్మవిపాకం అనుభవించేవాళ్ళు, పాపకర్మల విపాకం అనుభవించేవాళ్ళు లోకంలో కనిపిస్తారు. అండజాలు, జరాయుజాలు, సంస్వేదజాలు, ఉపపాదుకాలు అయిన సత్త్వులు లోకంలో ఉన్నాయి. అపదములు, ద్విపదములు, చతుష్పదములు, బహుపదములు అయిన సత్త్వులూ ఉన్నాయి. యక్షులు, రాక్షసులు, కుంభాండులు, అసురులు, దానవులు, గంధర్వులు, ప్రేతములు, పిశాచములు లోకంలో ఉన్నాయి. కిన్నరులు, మహోరగులు, నాగులు, సుపర్ణులు, సిద్ధులు, విద్యాధరులు ఉన్నారు. ఏనుగులు, గుర్రాలు, గోవులు, మహిషములు, ఒంటెలు, మేకలు, గొర్రెలు, జింకలు, పందులు, సింహాలు, పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, తోడేళ్ళు, నక్కలు, జాగిలాలు ఉన్నాయి. అనేకవిధాలైన పక్షులున్నాయి. బంగారం, వెండి, ముత్యములు, మణులు, శంఖములు, శిలలు, ప్రవాళములు, లోహితాంగములు, మరకతం, వైడూర్యం, వజ్రం, స్ఫటికం, ఇనుము, రాగి, వృత్తలోహం, కంచులోహం ఉన్నాయి. క్షౌమం(linen), పట్టు(silk), నూలు(cotton), శాణం(course hemp), భంగం (canvas), కంబళం ఉన్నాయి. శాలి. వ్రీహి, యవ, కోద్రవం, వరకం, గోధూమం, ముద్గ, మాష, తిల, కుల్మాషములున్నాయి. మూలగంధం (scent of roots), సారగంధం (scent of hard wood), ఫేగ్గుగంధం (scent of softwood), ఫలగంధం, సర్వగంధం (scent of everything) ఉన్నాయి. తృణములు, లతలు, గుల్మములు, వృక్షములు, ఓషధులు, వనస్పతులు ఉన్నాయి. నదులు, పర్వతాలు, సముద్రాలు, చేపలు, తాబేళ్ళు ఇవన్నీ ఉన్నాయి. భంతే నాగసేనా, లోకంలో కనిపించనిది, లేనిది ఏదియో దానిని తెలుపుము.

---

<—*

*ప్రతిసంవిత్తులూ (బోధకునికి అవశ్యం ఉండవలసిన నాలుగు వక్తృత్వ కౌశలాలు) సిద్ధించియేయున్నాయి.*

*ప్రవాహం ఎటు పోతుంటే అటు మనస్సును మళ్ళించివేసే జనులకు గంభీరమైన ధర్మాలను బోధించి మార్గంలో పెట్టడం అనేది చాలా శ్రమతో కూడిన పని. ప్రవాహానికి ఎదురీత చేయించడం లాంటిది. ఎంతో ఉత్సాహం (zeal) ఉంటేనే ఇది సాధ్యపడుతుంది. పూర్వం అభ్యాసకాలంలో ప్రత్యేకబుద్ధులు ఏకాంత జీవితానికి బాగా అలవాటు పడినవారు. అందులో రుచిని బాగా పెంచుకొనిన వారు. ఇతరమైన వ్యాపకాల్లో ఉత్సాహాన్ని పూర్తిగా ఇంకింపజేసుకొనినవారు. కనుక ఇతరులను తరింపజేసే పనిని మైత్రేయభగవానునికి (Future Buddha) వదలిపెట్టి తాము సమాధిసుఖంలో ఉండిపోతారు.*

**నా:** మహారాజా, ఈ మూడూ లోకంలో లేవు, కనిపించవు. అవి ఏవనగా 1. సచేతనంగానీ అచేతనంగానీ అజరామరంగా ఉండేది ఏదీ లేదు. 2. నిత్యత్వం (permanancy) కలిగిన సంఖారములు (formations) ఏదీ లేదు. 3. పరమార్థతః (in the ultimate sense) సత్త్వుడు (being) లేదు. ఈ మూడూ లోకంలో లేవు.

**మి:** సాధు సాధు నాగసేనా! నేను సమ్మతిస్తున్నాను.

## నిర్వాణం అనేది ఉన్నదా?

**మి:** భంతే నాగసేనా, కర్మ వల్ల కలిగిన వస్తుజాలం లోకంలో కనిపిస్తుంది. హేతువుల వల్ల ఏర్పడినవి లోకంలో కనిపిస్తాయి. రుతువుల వల్ల కలిగినవీ కనిపిస్తాయి. కర్మవల్ల, హేతువుల వల్ల, రుతువుల వల్ల లోకంలో ఏర్పడనట్టివి ఏమైనా ఉన్నాయా?

**నా:** మహారాజా, ఉన్నాయి. అవి రెండు: 1. ఆకాశం, 2. నిర్వాణం.

**మి:** జినవచనానికి తలవంపు కలిగించకు. ప్రశ్నకు సమాధానం ఏమిటో తెలియకుండానే తెలిసినట్లుగా సమాధానం చెప్పవద్దు.

**నా:** నేనేమన్నానని నీవు ఇలా ఆక్షేపిస్తున్నావు?

**మి:** ఆకాశం కర్మలవల్ల హేతువులవల్ల రుతువులవల్ల కలుగలేదు అనడం బాగానే ఉన్నది. కానీ భగవానుడు శ్రావకులకు నిర్వాణాన్ని స్వానుభవానికి తెచ్చుకొనేందుకు అనేక వందల విధాలుగా మార్గాన్ని బోధించియున్నాడు. నీవేమో నిర్వాణానికి హేతువులు లేవంటున్నావు.

**నా:** మహారాజా, నిజవే భగవానుడు అనేక వందల విధాలుగా మార్గాన్ని నిర్వాణసాక్షాత్కారం కోసం బోధించియున్నాడు. కానీ నిర్వాణఉత్పాదనకు హేతువు చెప్పలేదు.

**మి:** భంతే నాగసేనా, మనం ఇప్పుడు అంధకారంనుండి మరింత అంధకారంలోకి ప్రవేశిస్తున్నాము. అడవినుండి దట్టమైన మరో అడవిలోకి వెళ్తున్నాము. గహనంనుండి గహనతరంలోకి అడుగువేస్తున్నాము. "నిర్వాణసాక్షాత్కారానికి హేతువులున్నాయి కానీ నిర్వాణ ఉత్పాదనకు హేతువు లేదు" అనడం అర్థం కాని అయోమయంగా ఉన్నది. నిర్వాణసాక్షాత్కారానికి హేతువు ఉన్నట్లే నిర్వాణ ఉత్పాదనకూ హేతువు ఉండాలి. పుత్రునికి తండ్రి ఉన్నట్లే తండ్రికి తండ్రి కూడా ఉండాలి. శిష్యునికి ఆచార్యుడున్నట్లే ఆచార్యునికి ఆచార్యుడుండాలి. అంకురానికి కారణంగా బీజం ఉన్నట్లే బీజానికి కారణం మరో బీజం అయ్యుంటుంది.

**నా:** మహారాజా, నిర్వాణం అనుత్పాదనీయం (ఉత్పత్తి లేనట్టిది= unproduced). కనుక దానికి ఉత్పాదకహేతువు లేదు.

**మి:** నిర్వాణ సాక్షాత్కారానికి హేతువు ఉన్నది, ఉత్పాదనకు హేతువు లేదు అనే విషయం మీద నాకు తగిన కారణం తెలియజేయుము.

**నా:** మంచిది. సావధానంగా విను, చక్కగా విను. కారణం చెబుతాను. ఒక పురుషుడు తనకున్నట్టి సహజబలంతో ఇక్కడ్నుంచి పర్వతరాజం హిమాలయానికి వెళ్ళడం వీలవుతుందా?

**మి:** వీలవుతుంది.

**నా:** ఆ పురుషుడు తనకున్న సహజశక్తితో అక్కడ్నుంచి పర్వతరాజం హిమవంతుణ్ణి ఇక్కడికి తీసుకురాగలడా?

**మి:** అసాధ్యం.

**నా:** అలాగే మహారాజా, నిర్వాణసాక్షాత్కారానికి మార్గం చెప్పడం వీలవుతుంది. నిర్వాణాన్ని ఉత్పత్తి చేయుడానికి హేతువు చూపడం అసాధ్యం. నిర్వాణం అసంస్కృతధర్మం(unconditioned) కనుక.

**మి:** నిర్వాణం అసంస్కృతమా?

**నా:** అవును మహారాజా, నిర్వాణం అసంస్కృతం.* అది దేనివల్లా ఏర్పడినట్టిది కాదు. మహారాజా, నిర్వాణాన్ని ఉత్పన్నం అనీ చెప్పరాదు. అనుత్పన్నం అనీ చెప్పరాదు. ఉత్పాదనీయం అనీ చెప్పరాదు. అతీతం (past) అనీ చెప్పరాదు, అనాగతం (future) అనీ చెప్పరాదు. ప్రత్యుత్పన్నం (present) అనీ చెప్పరాదు. కంటితో తెలియదగింది, ముక్కుతో తెలియదగింది, కాయంతో (స్పర్శేంద్రియం) తెలియదగిందీ అనరాదు.

**మి:** ఇన్ని మాటల ద్వారా నీవు చెప్పేది నిర్వాణం అనేది లేదనేగా?

**నా:** మహారాజా, నిర్వాణం ఉన్నది. మనోవిజ్ఞానం ద్వారా నిర్వాణం తెలియదగియున్నది. విశుద్ధమైన మనస్సుతో, ప్రణీతమైన (lofty) మనస్సుతో, రుజువుగా (straight) ఉన్న మనసుతో, అనావరణమైన (without obstructions) మనస్సుతో,

---

* *హేతుప్రత్యయములచే (causes and conditions) ఉనికిని పొందినవాటికి సంస్కృతములు (products) అని పేరు. పూర్వం లేనిదిగాను తరువాత "ఉన్నదిగాను" అనిపించుకొన్నదాన్ని "ఉత్పన్నం" అంటారు. నిర్వాణం అలాంటిది కాదు కనుక అసంస్కృతం.*

నిరామిషమైన (without worldly desires) మనస్సుతో సమ్యక్ ప్రతిపత్తి కలిగియున్నట్టి ఆర్యశ్రావకుడు (noble disciple) నిర్వాణాన్ని దర్శించగలడు.

**మి:** నిర్వాణం అనేది ఏమిటి? నిర్వాణం ఉన్నది అనే విషయాన్ని ఉపమ ద్వారా తెలియజేయుము.

**నా:** మహారాజా, వాయువు ఉన్నదా?

**మి:** అవును, ఉన్నది.

**నా:** మహారాజా, వాయువును నాకు చూపెట్టు. దాని రంగును, ఆకారాన్ని (shape) చూపించు. లేదా దాని సన్నదనాన్నో, లావునో, పొడవునో, పొట్టినో నాకు చూపించు.

**మి:** అసాధ్యం నాగసేనా. అలా వాయువును చూపించడం వీలు కాదు. కానీ వాయువు ఉన్నది.

**నా:** వాయువును చూపించడానికి వీలుకాని పక్షంలో అది లేదని చెప్పినట్లేకదా!

**మి:** వాయువు ఉన్నదని నాకు తెలుసు కానీ నీవు అడిగిన విధంగా నేను దాన్ని చూపలేను.

**నా:** అలాగే మహారాజా, నిర్వాణం అనేది ఉన్నది-రంగు ఇదీ, ఆకారం ఇదీ అని చూపించి చెప్పలేకపోయినా.

**మి:** సాధు సాధు నాగసేనా! నీవు చూపిన కారణాలు, ఉపమలు చాలా బాగున్నాయి. నేను అంగీకరిస్తున్నాను.

## విశ్వంతరప్రశ్న *

**మి:** భంతే నాగసేనా, బోధిసత్త్వ విశ్వంతరుడు ఒక్కడే భార్యాబిడ్డలను దానం చేశాడా? బోధిసత్త్వులందరూ కూడా ఇలానే చేశారా?

**నా:** మహారాజా, ఒక్క విశ్వంతరబోధిసత్త్వుడే కాదు, అందరు బోధిసత్త్వులూ భార్యాబిడ్డలను దానం చేశారు.

**మి:** భార్యాబిడ్డల అనుమతి తీసుకొని దానం చేశారా?

**నా:** భార్య అనుమతి తీసుకొన్నారు. చిన్నవారు కనుక బిడ్డలు ఏడ్చారు. ఆ దానక్రియలోని పరమార్థం తెలిసియున్నవారైతే వాళ్ళు ఏడ్చియుండరు.

---

** విశ్వంతరజాతకం ఇప్పటివరకు తెలియని పాఠకుల కోసం ఈ ప్రశ్న చివర ఆర్యశూరకవి విరచిత జాతకమాలలోని విశ్వంతరజాతకాన్ని చేర్చడం జరిగింది. గమనించగలరు.*

**మి:** భంతే నాగసేనా, విశ్వంతరుడు ప్రియమైన తన బిడ్డలను బ్రాహ్మణునికి దానం చేయడం అనేది దుష్కరమైన (difficult to do) పని. ఆ బ్రాహ్మణుడు పసిపిల్లలను తీగలతో బంధించి కొట్టి లాక్కుపోవడం చూస్తూ కూడా ఉదాసీనంగా ఉండిపోవడం అనేది విశ్వంతరుని రెండవ దుష్కరతరమైన పని. పసిపిల్లవాడు జాలి బంధనాన్ని తెంపుకొని తన వద్దకు పరుగెత్తుకొని వచ్చేస్తే విశ్వంతరుడు ఆ పిల్లవాణ్ణి మళ్ళీ తీగెలతో కట్టి బ్రాహ్మణుడికి అప్పగించడం అనేది విశ్వంతరుడు చేసిన మూడవ కష్టమైన పని. చిన్నపిల్లలు ఏడుస్తూ "నాన్నా, ఈ యక్షుడు మమ్మల్ని తినడానికి లాక్కెళ్ళిపోతున్నాడు" అని మొరపెట్టుకొన్నా "భయపడకండి" అని ఒక ఓదార్పుమాట కూడా పలక్కుండా ఉండిపోవడం విశ్వంతరుడు చేసిన నాలుగవ అతికష్టమైన పని. కుమారుడు జాలి కాళ్ళమీద పడి ఏడుస్తూ "నాన్నా, కృష్ణాజినిని వదలివేసి నన్ను మాత్రం తీసుకెళ్ళమని చెప్పు" అని ప్రాధేయపడినపుడు అంగీకరించకపోవడం అనేది విశ్వంతరుడు చేసిన ఐదవ అతి కష్టతరమైన పని. "రాతిగుండె మనిషివి నీవు. యక్షుడు మమ్మల్ని లాక్కుపోతుంటే వచ్చి అడ్డగించకుండా ఊరక నిలబడి చూస్తున్నావు" అని కుమారుడు జాలి ఏడుపు స్వరంతో ఆక్షేపించినపుడు కరుణ చూపకపోవడం అనేది విశ్వంతరుడు చేసిన ఆరవ అతికష్టాతికష్టమైన పని. బిడ్డలు అలా లాక్కొనిపోబడి కనుమరుగయ్యాక తీవ్ర పుత్రశోకంతో తపించినప్పటికీ హృదయం వంద లేదా వేయి ముక్కలు కాకుండా గట్టిగా ఉంచుకోవడం అనేది విశ్వంతరుడు చేసిన ఏడవ అతికష్టాతికష్టమైన పని. భంతే నాగసేనా, పరులకు దుఃఖాన్ని కలిగించే పుణ్యకర్మలు చేయడం దేనికి? దానంగా తనను తానే ఇచ్చుకోవచ్చుకదా!

**నా:** మహారాజా, దుష్కరమైనదాన్ని చేయడం వల్ల విశ్వంతరుని కీర్తి పదివేల లోకధాతువులు విస్తరించింది. దేవలోకాల్లో దేవతలు, అసురలోకాల్లో అసురులు, గరుడలోకాల్లో గరుడులు, నాగలోకాల్లో నాగులు, యక్షలోకాల్లో యక్షులు విశ్వంతరుణ్ణి కీర్తిస్తున్నారు. విశ్వంతరుని కీర్తిశబ్దాలు పరంపరాగతంగా వినబడుతూ ఇప్పుడు మన ఇరువురి మధ్య కూడా చర్చకు విషయంగా వచ్చింది– "అది సరియైన పనియా కాదా?"అని. మహారాజా, మహాసత్త్వుడైన ఆ బోధిసత్త్వ విశ్వంతరుని దుష్కరచర్య, అనేక గుణాలను (special qualities) ప్రకాశపరచింది.

**మి:** భంతే నాగసేనా, పరులకు దుఃఖాన్ని కలిగించే దానం సుఖవిపాకం కలదవుతుందా? స్వర్గప్రాప్తికి అనుకూలమవుతుందా?

**నా:** అవుతుంది. ఇక ఏమి చెప్పవలెను?

**మి:** కారణం చూపించు.

**నా:** మహారాజా, ఒకానొక శ్రమణుడు లేదా బ్రాహ్మణుడు శీలవంతుడుగా కల్యాణధర్ముడుగా ఉన్నాడనుకొనుము. కుంటితనం వల్ల దారిలో నడవలేక నడుస్తున్నాడు. గూడుబండిలో ఆ దారిన వెళ్తున్న ఒక పుణ్యకాముడు అతనిని తన బండిలో ఎక్కించుకొని అతను చేరవలసిన స్థానానికి చేర్చాడు. మహారాజా, దానివల్ల ఆ పుణ్యపురుషుడికి భవిష్యత్తులో సుఖం కలుగుతుందా? కలుగదా?

**మి:** చెప్పవలసిన పని ఏముంది? ఆ పుణ్యం వల్ల అతడు భవిష్యత్తులో స్థలం మీద హస్తియానంగానీ అశ్వయానంగానీ రథయానంగానీ జలంలో జలయానం, దేవలోకంలో దేవయానం పొంది సుఖపడుతాడు. ఇంకా చెప్పాలంటే ఇద్ధియానం (vehicle of psychic power) కూడా పొంది నిర్వాణనగరం చేరగలడు.

**నా:** మహారాజా, పరులకు దుఃఖాన్ని కలిగించే పుణ్యకర్మ వల్ల సుఖవిపాకం ఉందని నీవు కూడా అంగీకరిస్తున్నావు. ఆ పుణ్యపురుషుడు గూడుబండిని లాగిన ఎద్దుకు దుఃఖం కలిగించేకదా ఆ సుఖవిపాకం పొందగలిగాడు. మహారాజా, ఒక రాజు తన రాజ్యంలోని ప్రజల మీద ధార్మికంగానే పన్ను విధించి ఆ వచ్చిన రాబడితో దానధర్మాలు చేస్తాడనుకో. అతనికి సుఖవిపాకం కలుగుతుందా? కలుగదా?

**మి:** చెప్పవలసిన పని ఏమున్నది? అతడు భవిష్యత్తులో రాజులలో అతిరాజవుతాడు, దేవతలలో అతిదేవతవుతాడు, బ్రహ్మలలో అతిబ్రహ్మ అవుతాడు, శ్రమణులలో అతిశ్రమణుడవుతాడు, బ్రాహ్మణులలో అతిబ్రాహ్మణుడవుతాడు. అర్హంతులలో అతిఅర్హంతుడవుతాడు.

**నా:** మహారాజా, పరులకు దుఃఖాన్ని ఇచ్చే దానం వల్ల కూడా సుఖవిపాకం ఉందని నీవే ఒప్పుకొన్నట్లయ్యింది. పన్ను విధించడం ద్వారా ప్రజలకు ఆ రాజు దుఃఖాన్ని కలిగించాడుకదా!.

**మి:** అతిదానం నాగసేనా, విశ్వంతరుడు చేసింది! తన భార్యను పరునికి భార్యగా ఇచ్చివేయడం, తన పసిపిల్లలను బ్రాహ్మణునికి దాసులుగా ఇచ్చివేయడం మెచ్చదగినదిగా కనిపించుట లేదు. అతిదానాన్ని విజ్ఞులు నిందిస్తారు, గర్హిస్తారు. అతిభారం వల్ల శకటం ఇరుసు విరిగిపోతుంది. అతిభారం వల్ల నావ మునిగిపోతుంది. అతిభుక్తం వల్ల భోజనం అజీర్ణం అవుతుంది. అతివర్షం వల్ల పంటలు నశిస్తాయి. అతిదానం వల్ల భోగక్షయం జరుగుతుంది. అతిరాగం వల్ల ఉన్మత్తత కలుగుతుంది. అతిద్వేషం వల్ల చంపబడడం జరుగుతుంది. అతిమోహం వల్ల అనయం (calamity) కలుగుతుంది. అతిలోభం వల్ల (greed) చోరుల ముప్పు కలుగుతుంది. అతిభయం వల్ల మరణం కలుగుతుంది.

అతిపూరణంవల్ల నది పొంగుతుంది. అతివాతం వల్ల పిడుగు పడుతుంది. అతి అగ్నివల్ల అన్నం చిమిడిపోతుంది. అతిసంచరణం వల్ల చిరకాలం జీవించడు. భంతే నాగసేనా, అతిదానం నిందనీయంగానూ గర్హనీయంగానూ విజ్ఞులు భావిస్తారు. విశ్వంతరుడు చేసింది అతిదానం. కనుక దానివల్ల సుఖవిపాకం కలుగుతుందని చెప్పరాదు.

**నా:** మహారాజా, అతిదానం* లోకంలో విజ్ఞులచే కీర్తింపబడుతుంది. ప్రశంసింపబడుతుంది. ఇంతో అంతో దానం ఇచ్చేవాళ్ళు లోకంలో చాలా మంది ఉన్నారు. అతిదానం చేసినవాడే లోకంలో కీర్తి పొందుతాడు. దివ్యవనమూలిక యొక్క అతిప్రభావం వల్ల దానిని పట్టుకొనియున్న వ్యక్తి మూరడు దూరంలో ఉన్నా ఇతరులకు కనిపించడు. అగదం (antidote) తన అతిశక్తి వల్ల బాధను, రోగాన్ని అంతమొందిస్తుంది. అతిజ్యోతి వల్ల అగ్ని దహించగలుగుతుంది. అతిశీతలం వల్ల నీళ్ళు దప్పికను పోగొట్టుంది. అతిపరిశుద్ధత వల్ల పద్మం నీళ్ళను బురదను అంటుకోనీయదు. అతిగుణం వల్ల మణిరత్నం కామదదంగా (granter of desires) ఉంటున్నది. వజ్రం అతితీక్ష్ణంగా ఉన్నందువల్ల మణులను ముత్యాలను స్ఫటికములను తొలిచివేయ గలుగుతుంది. అతిమహాంతత వల్ల పృథివి నర, ఉరగ, మృగ, పక్షి, జల, శిల, పర్వత, వృక్షాలను భరిస్తున్నది. అతిమహాంతత వల్ల సముద్రం పూరింప వీలుకానిదిగా ఉంటున్నది. అతిభారం వల్ల సుమేరువు అచలంగా ఉంటున్నది. అతివిస్తారత వల్ల ఆకాశం అనంతంగా ఉంటున్నది. అతిప్రభ వల్ల సూర్యుడు చీకటిని పారద్రోలుచున్నాడు. అతిజాతి వల్ల సింహం భయం లేనిదిగా ఉంటున్నది. మల్లుడు అతిబలం వల్ల ప్రతిమల్లుణ్ణి క్షణంలో మట్టి కరిపిస్తాడు. అతిశీలం వల్ల భిక్షువు నాగ యక్ష నర అమరులచే నమస్కరణీయుడుగా ఉంటున్నాడు. అతిఅగ్రత (foremost) వల్ల బుద్ధుడు అనుపముడుగా (unrivalled) ఉన్నాడు. ఇలాగే అతిదానం కూడా లోకంలో విజ్ఞులచే స్తుతింపబడుతుంది. ప్రశంసింపబడుతుంది. అతిదానం వల్ల విశ్వంతరుడు పదివేల లోకధాతువులలో స్తుతింపబడుచున్నాడు. ఆ అతిదానం వల్లనే విశ్వంతరుడు తరువాతి జన్మలో మన బుద్ధుడుగా అవతరించాడు. మహారాజా, యోగ్యుడైన యాచకుడు ప్రాప్తించినప్పటికీ ఇవ్వకూడనిదానం ఏదైనా లోకంలో ఉన్నదా?

**మి:** భంతే నాగసేనా, అదాన వస్తువులుగా పది ఉన్నాయి. వీటిని దానం చేసేవాడు అధోగతి చెందుతాడు. అవి ఏవనగా 1. మద్యపానదానం, 2. వినోదాలకు దానం,

---

* *అతిదానం పదంలో 'అతి'కి మిలిందుడు అతిగా (excessive, too much) అనే అర్థం ఇచ్చుకొంటే, నాగసేనుడు 'అతి'కి గొప్ప (great) అనే అర్థం ఇచ్చుకొన్నట్లు తెలుస్తున్నది.*

3.స్త్రీదానం, 4.వృషభదానం, 5.చిత్రకర్మ (paintings) దానం, 6.శస్త్ర (weapons) దానం, 7. విషదానం, 8. సంకెలదానం, 9. కోడి, పంది దానం 10.తప్పు తూనికలు, కొలతల దానం.

**నా:** నేనడిగింది అదానములు ఏమిటి? అని కాదు. నేనడిగింది దాన యోగ్యుడయిన దాత ప్రాప్తించినపుడు ఇవ్వకూడనిది ఏదైనా ఉన్నదా? అని.

**మి:** లేదు భంతే. చిత్తప్రసాదం కలిగినపుడు దక్షిణీయులైనవారికి (దానస్వీకార యోగ్యులకు) కొందరు భోజనం పెడతారు, కొందరు వస్త్రాలు ఇస్తారు. కొందరు శయనోపయోగ వస్తువులు ఇస్తారు. కొందరు ఆవాసములు (dwellings) ఇస్తారు. కొందరు శాలువలు, దుప్పట్లు ఇస్తారు, కొందరు దాసీదాసులను ఇస్తారు. కొందరు క్షేత్రములను (fields and sites), కొందరు ద్విపద చతుష్పదములను (bipeds and quadrupeds), కొందరు శతకార్షాపణములు, కొందరు వేయి, కొందరు లక్ష ఇస్తారు. కొందరు రాజ్యమే ఇచ్చేస్తారు. కొందరు జీవితమే ఇచ్చేస్తారు.

**నా:** కొందరు జీవితమే ఇచ్చేస్తారని చెప్పావు! మరి దానపతి విశ్వంతరుణ్ణి నీవెందుకు తీవ్రంగా విమర్శిస్తున్నావు? మహారాజా, ఋణగ్రస్తుడయిన తండ్రి లేదా ఆజీవిక (live-lihood) కోల్పోయిన తండ్రి తన కుమారుణ్ణి ఆవాపణంగా (pledge) అప్పగించడమో లేదా విక్రయించడమో లోకంలో ఆచారంగా ఉన్నదా?

**మి:** అవును, ఆ ఆచారం ఉన్నది.

**నా:** విశ్వంతరుడు కూడా సర్వజ్ఞత్వం పొందలేకపోవడం వల్ల కుమిలిపోయినవాడై దుఃఖించినవాడై ఆ ధర్మధనం పొందడం కోసం భార్యాబిడ్డలను ఆవాపణంగా సమర్పించాడు. లోకంలో ఇతరులు చేసినట్లే చేశాడు. దానపతి విశ్వంతరుణ్ణి మాత్రం నీవెందుకు తీవ్రంగా విమర్శిస్తున్నావు?

**మి:** దానపతి విశ్వంతరుడు చేసిన దానాన్ని నేను గర్హించడం లేదు. భార్యాబిడ్డ లను ఇతరులు యాచించినపుడు తనను తానే ఇచ్చుకొనియుండవలసింది అంటాను.

**నా:** మహారాజా, అడిగింది ఇవ్వడమనేది సత్పురుషులు పాటిస్తారు. భార్యాబిడ్డలను అడిగినపుడు తనను ఇచ్చుకుంటాననడం అనుచితమైనట్టిది. నీళ్ళు కావాలని అడిగితే భోజనం ఇవ్వడం చేయదగిన పనియేనా?

**మి:** కాదు అడిగినది ఇస్తేనే కృత్యకారి (doing a service) అవుతాడు.

**నా:** మహారాజా, అలాగే బ్రాహ్మణుడు అడిగినది విశ్వంతరుడు ఇచ్చాడు. అతడు శరీరాన్ని అడిగియుంటే విశ్వంతరుడు తప్పించుకొనియుండడు, వణికిపోయి యుండడు,

దిగులు చెందియుండడు. తనను తాను నిశ్చయంగా ఇచ్చుకొని యుండేవాడు. "నా దాసుడవు కమ్ము" అని ఎవరైనా విశ్వంతరుణ్ణి కోరియుంటే ఏ చీకూచింతా లేకుండా దానపతి విశ్వంతరుడు తనను తాను దాసుడుగా సమర్పించుకొనియుండేవాడు. మహారాజా, విశ్వంతరుడు తన కాయాన్ని బహుసాధారణంగా (common property of all beings) భావించిన మహోన్నతుడు. ఫలించిన వృక్షం నానా పక్షులకు ఎలా సాధారణం అవుతుందో అలానే మహారాజా, విశ్వంతరుని కాయం బహుసాధారణం. "బహుసాధారణుడను కాగలిగినప్పుడే సమ్యక్ సంబోధికి అర్హుడనవుతాను" అని ఆ మహాత్ముని దృష్టి.

మహారాజా, ఒక దరిద్రుడు ధనార్జన కోసం తిరుగాడుతూ అజపథం, శంకుపథం, వేత్రపథం* వెళ్తాడు. జల స్థల వాణిజ్యం (trade on land and water ways) చేస్తాడు. కాయేన వాచా మనసా ధనతత్పరుడై యుంటాడు. ధనం కోసం ఎంతో శ్రమకు సిద్ధపడతాడు. మహారాజా, అలానే దానపతి విశ్వంతరుడు బుద్ధధనం లేకపోవడం అనే అధనత్వాన్నుండి (దారిద్ర్యం) బయటపడదలచి సర్వజ్ఞజ్ఞానరత్నాన్వేషణకు దిగి దాన్ని సంపాయించే ప్రయత్నంలో భాగంగా అడిగినవారికి, ధనధాన్యాలు, యానవాహనాలు, ఇంకా ఇతర ఆస్తిపాస్తులు, భార్యాబిడ్డలు సర్వం ఇచ్చివేశాడు.

మహారాజా, భార్యాబిడ్డల మీద ద్వేషంతో (repulsion) దానపతి విశ్వంతరుడు వాళ్ళను ఇచ్చివేయలేదు. వాళ్ళను చూడడమే కంటగింపుగా తలచి ఇచ్చివేయలేదు. "ఇందర్ని పోషించే శక్తి నాకు లేదు" అని ఇచ్చివేయలేదు. "ఈ అప్రియులను వదిలించుకొంటే హాయి" అని భావించి దానం చేసివేయలేదు. సర్వజ్ఞతాజ్ఞానరత్నం మీద ప్రేమతో ఆ రత్నసంపాదనకోసం ప్రాణసమానులు ప్రియులు ఇష్టులు ఆహ్లాదకరులు అయిన భార్యాబిడ్డలను దానంగా ఇచ్చివేశాడు. ఈ విషయాన్నే దేవాతిదేవుడైన భగవానుడు చర్యాపిటకంలో ఇలా చెప్పాడు:

**న మే దేస్సా ఉభో పుత్తా మద్దీ దేవీ న దేస్సియా**
**సబ్బఞ్ఞుతం పియం మయ్హం తస్మా పియే అదాసహం**

మహారాజా, పుత్రదానం ఇచ్చాక విశ్వంతరుడు పర్ణశాల ప్రవేశించి శోకభారంతో కూలబడినాడు. బిడ్డల ఎడల అతిప్రేమ కలిగియున్న అతని హృదయం తీవ్ర శోకతాపంతో తపించిపోయింది. వేడి నిట్టూర్పులను నాసిక భరించలేకపోవడంతో

---

* *అజపథం, శంకుపథం, వేత్రపథం అనేవి మనుష్యులకు చాలా కష్టాన్ని ఆయాసాన్ని అపాయాన్ని కలిగించే దారులు.*

ఆశ్వాస ప్రశ్వాసలు నోటి ద్వారా జరిగాయి. కన్నులనుండి రక్తకన్నీరు కారింది. ఎంతో దుఃఖానికి లోనయినప్పటికీ "నా దానపథానికి లోపం రాకూడదు" అనుకొని విశ్వంతరుడు పుత్రదానం చేశాడు. మరియూ మహారాజా, విశ్వంతరుని పుత్రదానం వెనుక రెండు ఆశయాలు ఉన్నాయి. అవి ఏవనగా 1. "నా దానపథానికి లోపం కలుగకుండుగాక", 2. "బిడ్డలను వాళ్ళ తాత విడిపించుకొంటాడు". మహారాజా, విశ్వంతరునికి తెలుసు, తన బిడ్డలను దాసభావంలో చిరకాలం ఉంచడం ఎవరికీ సాధ్యం కాదని. "తాత విడిపించు కొంటాడు, మళ్లీ తనకు బిడ్డలతో సమాగమం జరుగుతుంది" అని విశ్వంతరుడు* భవిష్యత్తును సరిగ్గా ఊహించాడు.

**మి:** భంతే నాగసేనా, నా ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పావు. దృష్టిజాలం (net of false views) ఛిన్నాభిన్నం అయ్యింది. పరప్రవాదములు తుత్తునియలు అయ్యాయి. స్వీయపక్షాన్ని చక్కగా ప్రకాశపరచావు. వ్యంజనములను (details) చక్కగా చెప్పావు. అర్థవిభజనం(analysis of meaning) చక్కగా చేశావు. కనుక నేను సమ్మతిస్తున్నాను.

* * * *

## *విశ్వంతరజాతకమ్*

*సంజయుడు శిబిగణతంత్రానికి రాజు. గణతంత్రాన్ని పాలించడం చాలా కష్టం. రాజుకు సర్వాధికారాలుండవు. అవసరమనిపిస్తే గణతంత్రంలోని పెద్దలకు అతణ్ణి నిలదీసి శాసించే అధికారం ఉంది. సంజయుని కుమారుడు విశ్వంతరుడు ఆ గణతంత్రానికి యువరాజు.*

*అతడు యువకుడైనా ఉపశమనశోభితుడు. బలశాలియైనా క్షాంత స్వభావుడు. విద్వాంసుడైనా జ్ఞానమదశూన్యుడు. ధనవంతుడైనా నిగర్వి. ఒక విషయంలో మాత్రం అసహనశీలుడు. సాటి మానవుల కష్టాలను, బాధలను, దైన్యాన్ని చూసి సహించలేడు. కరుణ అనే మహావింటిని ఎక్కుబెట్టి దానమనే బాణాలను సంధించేవాడు. ప్రతిదినం పట్టపుటేనుగు మీద నగర సంచారం చేస్తూ తాను కట్టించిన సత్రాలు, చేసిన ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షణ చేసేవాడు. అతని పట్టపుటేనుగు గంధహస్తి అసాధారణమైన లక్షణాలను కలిగినట్టిది. అట్టిది జంబూద్వీపంలో మరొకటి లేదు.*

---

* *విశ్వంతరుడు అనే పేరులోనే గొప్ప అర్థం ఇమిడియున్నది. అందరిని తరింపజేయు వాడు అని అర్థం. భగవానుని పూర్వజన్మల గాథల్లో విశ్వంతరుని కథయే తరతరాలుగా అగ్రస్థానంలో కొనసాగుచున్నది. మిలిందపఞ్హాలో విశ్వంతరుని విషయమై మరో సుదీర్ఘమైన చర్చ కూడా యున్నది.*

పొరుగున ఉన్న ఒక రాజు చపలుడు. ఆ గంధహస్తిని తనదిగా చేసుకోవాలను కొన్నాడు. అతనికొక ఉపాయం తట్టింది. తన పురోహితులకు ఇద్దరికి ఆ ఉపాయం చెప్పి శిబిదేశ రాజధానికి పంపాడు. విశ్వంతరుడు గంధహస్తి మీద నగర సంచారం చేస్తున్న సమయంలో వీరిద్దరూ దారికి అడ్డంగా నిలబడి ఎత్తి సాచిపెట్టిన దక్షిణ హస్తాలతో జయాశీర్వాద వచనాలు పలికారు. "మీరేమి అభ్యర్థనతో వచ్చారో సెలవివ్వండి" అన్నాడు విశ్వంతరుడు. "రాజా, నీ దానశూరత్వం, కైలాసశిఖరంలాంటి ఈ గంధహస్తి – రెండూ ఆకర్షించగా వచ్చాము. లోకం ఆశ్చర్యపోయేవిధంగా నీ దానశూరతను ప్రకటించి ఈ గంధహస్తిని మాకివ్వండి" అన్నారు పురోహితులు. "ఆహా! ఇన్నాళ్ళకు ఇంత గొప్ప దానాన్ని కోరేవాళ్ళు వచ్చారు" అనుకొని పరమప్రీతితో అతడు గంధహస్తినుండి క్రిందకు దిగి దాన్ని వారికి ధారాదత్తం చేశాడు.

ఈ వార్త దావానలంలా నగరమంతా వ్యాపించింది. నగరంలోని బ్రాహ్మణవృద్ధులు, మంత్రులు, సేనాపతులు, పురప్రముఖులు కోపోద్రిక్తు లయ్యారు. హుటాహుటి సంజయుని సభకు వెళ్ళారు. "రాజా ఈ రాజ్యానికి, ముంచుకొస్తున్న అపాయాన్ని గుర్తించకుండా ఎందుకు ఉపేక్షిస్తూ కూర్చున్నావు? మన దేశంలోని అమూల్యమైన, అపురూపమైన, అజేయమైన గజరాజును దానం చేయడానికా మీ కొడుకును యువరాజుగా కట్టబెట్టింది? బ్రాహ్మణులడిగితే గోవులివ్వండి, బంగారం ఇవ్వండి, బట్టలివ్వండి, భోజనం పెట్టండి; మేము కాదంటామా? మన రాజ్యలక్ష్మి, మన జయలక్ష్మి ఏ గజరాజును ఆశ్రయించియున్నదో దానిని ధారాదత్తం చేయడం మేము క్షమించము" అని ఏకకంఠంతో చాలా కటువుగా చెప్పారు. సంజయుడు వాళ్ళను శాంతపరచే ప్రయత్నంగా ఇలా అన్నాడు: "సభాసదులారా, విశ్వంతరుని ధోరణి నాకు కూడా సమ్మతం కాదు. రాజనీతిని అతిక్రమించిన ధార్మికత పనికిరాదు. కానీ ఇచ్చివేసిన గజరాజు ఇక మనకు కక్కిన అన్నంతో సమానం. దాన్ని మళ్ళీ ఎలా వెనక్కి తీసుకొందాము చెప్పండి. నేను విశ్వంతరుణ్ణి మందలిస్తాను. మీరు శాంతించండి. మళ్లీ ఇలాంటి పొరబాట్లు జరుగరాదని అతణ్ణి గట్టిగా హెచ్చరిస్తాను."

ఈ సానునయ వచనాలు సభ్యుల కోపాన్ని చల్లార్చలేదు. "రాజా, విశ్వంతరుడు మీ హెచ్చరికలు పాటిస్తాడనే నమ్మకం మాకు లేదు. అతడు కరుణామృదుస్వభావుడు. యువరాజుగా తగడు. తపోభూమియే అతనికి తగిన చోటు. వెంటనే అతణ్ణి దేశబహిష్కృతుణ్ణి చేయండి. వంకపర్వతానికి వెళ్ళి తపస్సు చేసుకోమని ఆదేశించండి. రాజనీతికి బద్ధుడైన మరో వీరకుమారుణ్ణి యువరాజుగా నియమించండి." రాజు వాళ్ళ శాసనానికి తల ఒగ్గక తప్పలేదు.

*దేశబహిష్కరణ శాసనం విశ్వంతరునికి వెంటనే అందింది. అతడు విచారపడలేదు. "బాహ్యద్రవ్యత్యాగమేమిటి అర్థిజనులు నా నయనాలు కోరినా ఇస్తాను, శిరస్సును అడిగినా ఇస్తాను" అనుకొన్నాడు. అతని భార్య మద్రికి విషయం తెలిసి భర్తతో ఇలా అన్నది: "క్షత్రియా, నేనూ నీతో వస్తాను. నీ సమీపంలో మృత్యువు కూడా నాకు ఉత్సవమే. నీవు దూరమైతే మృత్యువుకన్నా ఎక్కువ బాధాకరమౌతుంది నా జీవితం."*

*జాలి అనే చిన్ని కుమారుణ్ణి, పసిపాప కృష్ణాజినిని, మద్రిని రథం మీద ఎక్కించుకొని విశ్వంతరుడు తపోభూమికి బయలుదేరాడు. దేశం ఎల్లలు దాటాక దారిలో ఒక బాటసారి ఎదురుపడి "శిబి రాజధాని ఇంకా ఎంతదూరం? అక్కడ యువరాజు విశ్వంతరుడు అడిగినవాళ్ళకు లేదనకుండా ఇస్తాడట. ఆయన దగ్గరకు వెళ్తున్నాను. కుటుంబభారం ఈడ్వలేక సతమతమౌతున్నాను" అన్నాడు. "విశ్వంతరుడను నేనే. ఈ రథం, గుర్రాలే ఇప్పుడు నా దగ్గరున్న ఆస్తి. తీసుకోండి" అని అతణ్ణి ఒప్పించి తాను కాలినడకన ప్రయాణం సాగించాడు.*

*వంకపర్వతం చేరాక అక్కడ సెలయేటి ఒడ్డున ఒక కుటీరాన్ని స్వహస్తాలతో నిర్మించుకొని ఆ అడవిలో లభించే ఆకులు, దుంపలు, కాయలు, పండ్లతో సంతృప్తజీవనం సాగిస్తుండగా అర్ధసంవత్సరం కాలం గడిచింది.*

*ఒకనాటి మధ్యాహ్నం విశ్వంతరుడు ఒంటరిగా కుటీరంలో ఉన్నాడు. మద్రి శాకములు ఫలముల సేకరణ కోసం అడవికి వెళ్ళింది. పిల్లలు ఆడుకొంటున్నారు. ఆ సమయంలో ఒక వృద్ధబ్రాహ్మణుడు అక్కడికి వచ్చాడు. అతిథిని చూడగానే విశ్వంతరుడు పరమానందభరితుడై అతణ్ణి సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసి, రాకకు కారణం అడిగాడు. ఆ బ్రాహ్మణుణ్ణి అక్కడికి అతని భార్య పురమాయించి పంపింది. వారికి సంతానం లేదు. సేవలు చేసే పరిజనులు లేరు. "అడిగిందేదైనా సరే ఇచ్చే విశ్వంతరుణ్ణి అల్లంత దూరంలో పెట్టుకొని గోళ్ళు గిల్లుకు కూర్చుంటావేమి, పోయి అడగరాదూ ఆ పిల్లల్ని? మనం బ్రతికినన్నాళ్ళు సేవకు పనికివస్తారు. మనం చచ్చాక శవసంస్కారం చేయడానికీ పనికివస్తారు." అని ఆమె తన భర్తను పురమాయించి పంపించింది.*

*"విశ్వంతరా! వెలుగు, సమమైన దారి ఉంటే నడిచే జనానికి కష్టం ఉండదు. కానీ ఈ లోకం మాత్సర్యం (పిసినారితనం) అనే చీకటితో నిండియున్నది. నా కోరికను తీర్చే నాథుడు కనబడలేదు. నీ దానశౌర్యకీర్తి విని ఈ యాచనా శ్రమకు పాల్పడి*

వచ్చాను. నిన్ను అర్థిస్తున్నాను. పరిచారకులుగా నీ పిల్లల్ని ఇవ్వు" అన్నాడు నిర్లజ్జగా. "ఇవ్వను" అనే మాట నోటరాని మహాసత్త్వుడైన బోధిసత్త్వుడు పిల్లలు తనకు చాలా ఇష్టులైనప్పటికీ సాహసంతో "ఇస్తాను" అన్నాడు. ఆ వాగ్దానం విన్నంతనే బ్రాహ్మణుడు మిక్కిలి తొందర చూపించుతూ "స్వస్తి అస్తు, మరి ఇక ఆలస్యం దేనికి? దానక్రియ పూర్తి కానిచ్చి పంపించు" అన్నాడు. అతని ఆత్రాన్ని తొందరను గమనించిన విశ్వంతరుడు "మీ ఇష్టం ప్రకారమే ఇప్పుడు..." అని అసంపూర్ణ వాక్యం పలికి పరిగ్రహం కోసం ఆత్రంగా చేతులు సాచిపట్టుకొనియున్న సిగ్గులేని అతని చేతుల మీద కమండలాన్ని వంచినాడు.

**తస్య యత్నానురోధేన పపాతాంబు కమండలోః**
**పద్మపత్రాభితామ్రాభ్యాం నేత్రాభ్యాం స్వయమేవ తు**

విశ్వంతరుని ప్రయత్నాన్ని అనుసరించి కమండలంనుండి నీళ్ళు పడినాయి. పద్మపత్రాల్లాంటి అతని అభితామ్ర నేత్రాలనుంచి కన్నీళ్ళు స్వయంగానే జలజల రాలిపడినాయి.

"బ్రాహ్మణోత్తమా, పిల్లలు ఇక మీవారే. కానీ నా మనవి ఆలకించండి. అడవికి పోయిన వీరి తల్లి సాయంకాలానికి వచ్చేస్తుంది. ఆమె వచ్చి బిడ్డలను చివరిసారిగా తనకిష్టమైన విధంగా అలంకరించి ముద్దాడి ఆనందించే అవకాశం ఇవ్వండి. ఈ రాత్రికి మీరిక్కడే ఉండి రేపు ప్రొద్దున పిల్లల్ని తీసుకెళ్ళండి" అని ప్రాధేయపడ్డాడు. "తల్లి ఈ దానానికి సమ్మతించదు. ఇతను కూడా పుత్రవాత్సల్యంతో మనస్సు మార్చుకోవచ్చు" అనే భయంతో ఆ బ్రాహ్మణుడు అటు ఇటు వెదకి కొన్ని తీగలు సంపాయించి, బిగ్గరగా ఏడుస్తున్న ఆ పసిపిల్లల మృదుహస్తాలను చేర్చి కట్టి లాక్కొనిపోవడం చేశాడు. విశ్వంతరునికి హృదయాన్ని గట్టిగా పిండివేసినంత బాధ కలిగింది. గద్గదస్వరంతో "బ్రాహ్మణోత్తమా, ఈ పసికూనలు తల్లిచాటు బిడ్డలు. మీకేమి సేవలు చేయగలరు? మీకేమి సుఖం కలుగుతుంది? నా మాట వినండి. వీళ్ళను శిబిరాజు దగ్గరకు తీసుకెళ్ళండి. మీకు కావలసినంత ధనం బదులుగా ఇచ్చి పిల్లలను ఆయన తీసుకొంటాడు" అన్నాడు. "శిబిరాజు కోపంతో నన్ను శిక్షిస్తే దిక్కెవ్వరు? నేను ఆ సాహసం చేయను" అని అతడు పిల్లలను బరబరా లాక్కెళ్ళాడు. చిన్నపిల్ల కృష్ణాజిని "నాన్నా నాన్నా" అని బిగ్గరగా కేకలు పెట్టూ ఏడ్చింది. జాలి కూడా బిగ్గరగా ఏడుస్తూ "నాన్నా మేము లేకుంటే అమ్మ ఏడుస్తుంది. నా జ్ఞాపకంగా నా మట్టిబొమ్మలు సగం అమ్మకు ఇవ్వు. సగం నీవుంచుకో" అని వెక్కిళ్ళు పెట్టూ గద్గదస్వరంతో పలికినాడు.

తన వైపు తలలు త్రిప్పి చూస్తు పిల్లలు పలికిన ఆ ఏడ్పు మాటలు బోధిసత్త్వుని హృదయాన్ని తీవ్రంగా కంపింపజేశాయి. "ఇచ్చిన పిమ్మట ఇక విచారించి ఏమి ప్రయోజనం?" అనుకొన్నాడు. కాని విరుగుడు లేని ఆ శోకాగ్ని అతని హృదయాన్ని కాల్చడం మానలేదు. విషం, దేహం అంతా వ్యాపించి చైతన్యాన్ని పోగొట్టిన విధంగా ఆ తీవ్రదుఃఖం అతని చైతన్యాన్ని పోగొట్టి మూర్ఛిల్లజేసింది. కొంతసేపటికి చల్లని గాలుల స్పర్శకు మెల్లగా అతనికి స్పృహ వచ్చి పుత్రశూన్యమై నిశ్శబ్దంగా ఉన్న కుటీరంలోకి వెళ్ళి కూలబడ్డాడు.

అడవికి పోయిన మద్రికి ఏవో అపశకునాలు తోచాయి. ఆదుర్దాగా కుటీరానికి బయలుదేరింది. దారిలో భీకర మృగాలు కనబడితే వేరే చుట్టు దారినబడి వేగంగా అడుగులు వేసుకొంటూ వచ్చింది. కుటీర పరిసరాలు నిశ్శబ్దంగా ఉండడంతో ఆమె గుండె గుబేలుమంది. చాలా దూరానికి కూడా వినిపించే పిల్లల గోల వినపడలేదు. తను వస్తున్న అలికిడి విన్నంతనే ఆనందంగా ఎదురువచ్చే పిల్లలు ఎదురు రావడం లేదు. "నిదురబోతున్నారా? ఇప్పుడేమి నిద్ర? ఆలస్యమైందని నా మీద అలిగినారా? లేక నన్నాట పట్టించడానికి ఏ పొదమాటునైనా దాక్కున్నారా?" అని పరిపరి విధాల ఆందోళనపాలై గట్టిగా ఒక్కొక్కరి పేరు పెట్టి పిలిచింది. బదులు లేదు. ప్రక్కనే ఉరకలు వేస్తూ వేగంగా ప్రవహిస్తున్న సెలయేరును చూచి ఆమె మనస్సు కీడును శంకించింది. "భగవంతుడా! అపశకునాలు నా దేహానికే తగలనీ. నా బిడ్డల్ని క్షేమంగా చూడు దేవుడా" అని ప్రార్థిస్తూ కుటీరంలోకి ప్రవేశించింది. కన్నీటి చారలతో వేదనావదనంతో మౌనంగా ఉన్న భర్తను చూడగానే తన శంక నిజమే అనిపించి పుత్రశోకం భరించలేక స్పృహ కోల్పోయి నేలకు వాలింది. ఆమెను పడనీయకుండా విశ్వంతరుడు పట్టుకొని చాపపై పరుండబెట్టి మళ్ళీ స్పృహ వచ్చేవిధంగా శైత్యోపచారాలు చేశాడు. ఆమె మూర్ఛనుండి తేరుకొన్నాక జరిగిన విషయం చెప్పాడు. పుత్రవినాశాన్ని శంకించిన ఆమెకు ఒక విధంగా అది సంతోషవార్తే అయ్యింది. భర్త ఔన్నత్యానికి, దానపారమితకు ఆమె చకితురాలై కన్నీళ్ళు తుడుచుకొని విస్మయంగా అతణ్ణి చూస్తూ "ఆశ్చర్యం, ఆశ్చర్యం" అన్నది.

విశ్వంతరుని దానపారమితకు భూదేవి హర్షం పట్టలేక కంపించింది. దేవతల నివాసమైన సుమేరు పర్వతం కూడా కంపించింది. కంపన కారణాన్ని దిక్పాలకులు తెలుపగా ఇంద్రుడు విని పరమాశ్చర్యపరవశుడై మరునాడు బ్రాహ్మణరూపంలో విశ్వంతరుని ముందు ప్రత్యక్షమై "మహా సరస్సులలో నీరు ఎప్పటికీ ఇంకిపోనివిధంగా సత్పురుషుల్లో దానశీలత ఎప్పటికీ ఇంకిపోకుండా ఉంటుంది. దేవకాంతలాగా ఉన్న

*నీ భార్యను దానంగా అడుగుతున్నాను” అన్నాడు. దేహంలో సగం కోసి ఇమ్మని అడిగినట్లనిపించినా మహాసత్త్వుడైన బోధిసత్త్వుడు చలించలేదు. ఎడమచేతితో భార్యను, కుడిచేతితో కమండలాన్ని పట్టుకొని అర్థిచేతిలో ధారగా నీళ్ళు వదలి దానక్రియను పూర్తి చేశాడు. భర్త అత్యుదార స్వభావం తెలిసిన మద్రి కోపించలేదు. కనీవినీ ఎరుగని ఈ దుఃఖం ఆమెను మ్రాన్పడజేయగా భర్తను తదేకంగా చూస్తూ శిలాప్రతిమలా ఉండిపోయింది.*

*శక్రుని హృదయం పరమవిస్మయంతో నిండిపోయింది. మహాసత్త్వుడైన బోధిసత్త్వుణ్ణి స్తుతిస్తూ “దుష్కరమైన నీ బోధిచర్య ఇతరులు చేయగలగడం మాట అటుండనీ. అసలు జరిగిందనైనా నమ్మగలరా? హృదయశుద్ధి లేనివాళ్ళకు ఆ నమ్మకం కూడా కష్టమే. భార్యాబిడ్డల మీద ప్రేమానురాగాలు మిక్కుటంగా కలిగియున్నప్పటికీ నిస్సంగానికి నిలయుడవుగానూ ఉన్నావు. ఊహకు అందని మహోన్నత వ్యక్తిత్వం నీది” అని నిజరూపంలో ప్రత్యక్షమై “మద్రిని నీకే అప్పగిస్తున్నాను. చంద్రిక చంద్రుణ్ణి వదలియుండజాలదు. నీ పుత్రవియోగం, రాజ్యవియోగం కూడా తొలగుతుంది” అని దీవించి అదృశ్యమైనాడు.*

*ఇంద్రుని సంకల్ప ప్రభావం వల్ల ఆ బ్రాహ్మణుడు పిల్లలను శిబి రాజధానికి తీసుకొనిపోవడం, సంజయుడు వారిద్దరిని తన స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది. విశ్వంతరుని విషాదభరితగాథను విన్న వారందరూ జలజల కన్నీరు కార్చారు. రాజసభ సభ్యులందరూ పశ్చాత్తాపంతో తపించిపోయి విశ్వంతరుణ్ణి మళ్ళీ వెనక్కు పిలిపించి రాజ్యాధికారంలో నిలబెట్టారు.*

## శ్రాద్ధకర్మలు

**మి:** భంతే నాగసేనా, దాయకులు దానాలు చేసి ఆ దానపుణ్యాన్ని గతించిన తమ బంధువులకు పరిణామనం (transfer) చేస్తుంటారు– “ఈ దానక్రియ వల్ల నేను పొందిన పుణ్యఫలం పలానా పలానా వ్యక్తికి సంక్రమించుగాక!” అని. గతించినవాళ్ళు ఎవరైనా దీనివల్ల ఏమైనా ప్రయోజనం పొందుతారా?

**నా:** కొందరు పొందుతారు, కొందరు పొందరు.

**మి:** ఎవరు పొందుతారు? ఎవరు పొందరు?

**నా:** నిరయానికి వెళ్ళినవాళ్ళు పొందలేరు, స్వర్గానికి వెళ్ళినవాళ్ళూ పొందరు. తిర్యక్‌యోనులను చేరినవాళ్ళూ పొందరు. నాలుగు రకాలైన ప్రేతాల్లో మూడు రకాల

ప్రేతాలు ప్రయోజనం పొందవు. వాంతాశనులు (those who feed on vomit), క్షుత్పిపాసినులు, నిజ్ఝామతండికులు (those who are are consumed by craving) అనే మూడు రకాల ప్రేతాలు ప్రయోజనం పొందవు. పరదత్తోపజీవినులు అనే నాలుగవ రకం ప్రేతాలు ప్రయోజనం పొందుతాయి,

**మి:** గతించినవారినుద్దేశించి దాయకులు చేసే దానం నిరర్థకం, నిష్ఫలం అనిపిస్తుంది. ఎందుకంటే ఎవరిని ఉద్దేశించి దానం చేస్తున్నారో ఆ పుణ్యఫల ప్రయోజనం ఉద్దేశించినవారికి చేరడం లేదు.

**నా:** మహారాజా, దానం నిష్ఫలం కాదు, నిరర్థకం కాదు. దాయకులు ఆ దాన ఫలాన్ని పొందుతారు.

**మి:** కారణం చెప్పి నన్ను ఒప్పించు.

**నా:** కొందరు మనుష్యులు చేపలు, మాంసం, సురాపానం మొదలగునవి వండి బంధువుల ఇంటికి తీసుకెళ్ళారు. ఆ పదార్థాలను బంధువులు ఏదో కారణం వల్ల తీసుకొనకపోతే అవి వ్యర్థం అవుతాయా?

**మి:** లేదు. తీసుకెళ్ళిన ఆ మనుష్యులు ఆ పదార్థాలను ఆరగిస్తారు. వ్యర్థం కావు.

**నా:** అలాగే దానఫలాన్ని కూడా దాతలే పొందుతారు.

**మి:** సరే నాగసేనా, నేను సమ్మతిస్తున్నాను. దీని విషయంగా వాదంలోకి దిగను. దాయకులు ఇచ్చే దానం వల్ల గతించినవాళ్ళలో కొందరికి ప్రయోజనం కలుగుతుందన్నావు. హంతకుడు, క్రూరుడు, దుష్టచిత్తుడు, నెత్తుటి మరకల చేతివాడు హత్యనో మరో దురాగతాన్నో చేసి ఆ పాపకర్మఫలాన్ని గతించిన తనవాళ్ళకు పరిణామనం చేయవచ్చుకదా– "నా ఈ కర్మఫలం పలానా పలానా వ్యక్తికి సంక్రమించుగాక" అని. ఇలా పాపకర్మఫలం కూడా పరిణామనం అవుతుందా?

**నా:** అవదు.

**మి:** పుణ్యకర్మఫలమే పరిణామనం (transfer) అవుతుంది, పాపకర్మఫలం కాదని ఎలా చెప్పగలవు?

**నా:** ఇది ఒక ప్రశ్నయే కాదు. దీనికి నేను సమాధానం ఇవ్వవలసిన అవసరమూ లేదు. ఆకాశం ఎందుకు నిరాలంబంగా ఉన్నది? గంగానది ఎందుకు ఎగువకు ప్రవహించడం లేదు? మనుష్యులకు, పక్షులకు రెండు కాళ్ళెందుకున్నాయి? పశువులకు నాలుగు కాళ్ళెందుకున్నాయి?– ఇలాంటి ప్రశ్నలు కూడా వేస్తావేమో!

**మి:** పరిహాసం చేయడానికి ప్రశ్న అడగడం లేదు. సంశయం తొలగించు కొనేందుకే అడుగుచున్నాను. లోకంలో చాలా మంది జనులు తప్పుదారి పట్టారు. అధ్యాత్మికంగా గ్రుడ్డివాళ్ళయ్యారు. ఇటువంటివాళ్ళు తప్పు పనులు చేసే వెసులుబాటు ఉండరాదనే తలంపుతో ప్రశ్న వేశాను.

**నా:** మహారాజా, తన పాపకర్మఫలాన్ని ఇతరులకు భాగం పెట్టడానికి వీలుపడదు. చమురుతో దీపం వెలిగించడం వీలవుతుంది. నీటితో వీలవుతుందా?

**మి:** వీలు కాదు.

**నా:** అలాగే పుణ్యకర్మఫలాన్ని పరిణామనం చేయడానికి వీలున్నది. పాపకర్మ ఫలాన్ని పరిణామనం చేయడానికి వీలు లేదు.

**మి:** భంతే నాగసేనా, కుశలాన్ని పరిణామనం చేయడానికి వీలున్నది కానీ అకుశలాన్ని పరిణామనం చేయడానికి వీలు లేదు అనడానికి కారణం ఏమిటి? నేను అంధుడనుగాను, చీకటిలో లేను. నీ సమాధానం విని తెలుసుకోగలను.

**నా:** మహారాజా, అకుశలం అనేది అల్పం. కుశలం అనేది బహుళం. అల్పం కనుక అకుశలం కర్త వరకే పరిమితం అవుతుంది. కుశలం బహుళం కనుక దేవలోక మనుష్యలోకాలకూ విస్తరిస్తుంది.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, ఒక చిన్న నీటిబిందువు పృథివిమీద పడింది. అది పదియోజనాలు లేదా పన్నెండు యోజనాలు విస్తరించగలదా?

**మి:** లేదు భంతే. ఎక్కడ పడిందో అక్కడికే అది పరిమితం అవుతుంది.

**నా:** కారణం ఏమిటి?

**మి:** ఉదకబిందువు అల్పం కనుక.

**నా:** అలాగే మహారాజా, అకుశలం అల్పం కనుక కర్త వరకే అది పరిమితం అవుతుంది. ఇతరులకు పంచిఇవ్వడం వీలుకాదు. మహారాజా, ధరణీతలం తనివి చెందేవిధంగా మహామేఘుడు వర్షించినపుడు ఆ నీళ్ళు అంతటా వ్యాపిస్తుందా?

**మి:** తప్పకుండా. బావులు, చెరువులు, సరస్సులు, నదులు అన్నీ నిండిపోతాయి. మహామేఘుడు వర్షించిన నీరు పదియోజనాలు లేదా పన్నెండు యోజనాలు విస్తరిస్తుంది.

**నా:** కారణం ఏమిటి?

**మి:** మహామేఘుని మహనీయత (greatness) వల్ల.

**నా:** అలాగే మహారాజా, కుశలం అనేది బహుళం కనుక దేవతలకు మనుష్యులకు అందరికీ పంచిపెట్టడం వీలవుతుంది.

**మి:** ఏ కారణం చేత అకుశలం అనేది అల్పమూ, కుశలం అనేది బహుళమూ అయ్యింది?

**నా:** దానం, శీలం, ఉపోషధం* మొదలగు కుశలకర్మలు మనిషిని హృష్టునిగా, ప్రహృష్టునిగా, హసితునిగా, ప్రముదితునిగా, ప్రసన్నమానసునిగా చేస్తుంది. ప్రీతిని జనింపజేస్తూ ఉంటుంది. ప్రీతి కలిగియున్న చిత్తంలో కుశలం వృద్ధి చెందుతూనే ఉంటుంది. మహారాజా, నీటితో నిండియున్న ఒక బావిలోని నీళ్ళు ఒక వైపు నుండి బైటకు వెళ్ళిపోతూ ఉంటుంది అనుకో. మరో వైపునుండి నీరు వచ్చి బావిలో పడుతూ ఉంటుంది అనుకో. ఆ బావిలోని నీళ్ళు ఇంకిపోవడం జరుగదు కదా! అలాగే మహారాజా, పుణ్యకర్మఫలాన్ని పరిణామనం చేసినవాని పుణ్యానికి తరుగు ఉండదు. క్షణక్షణం వృద్ధి అవుతూనే ఉంటుంది. ఈ కారణం చేత కుశలం బహుళం అయ్యింది.

మహారాజా, అకుశలకర్మ చేసినవాడు ఆ తరువాత "ఎందుకు చేశాను ఇలా?" అని తపిస్తాడు. దాని వల్ల అతని చిత్తం కుంచించుకుపోతుంది. వికాసానికి దూరం అవుతుంది. శోకం వల్ల తాపం వల్ల క్షీణిస్తాడు. వృద్ధి చెందలేడు. ఎండిపోయిన నదీతీరంలోని ఇసుకదిబ్బ మీద పడిన నీటిబిందువు ఎలా క్షీణించిపోతుందో అలాగే అకుశల కర్మలు చేసేవాడున్నూ. ఈ కారణం వల్ల అకుశలం అనేది అల్పం అయ్యింది.

**మి:** సాధు సాధు నాగసేనా! నేను అంగీకరిస్తున్నాను.

## స్వప్నములు

**మి:** భంతే నాగసేనా, ఈ లోకంలో స్త్రీలూ పురుషులూ కలలు కంటారు. మంచికలలు, పీడకలలు కంటారు. పూర్వం చూసినవి, పూర్వం చూడనివి, పూర్వం చేసినవి, పూర్వం

---

* *నెలకు నాలుగు పర్యాయములు ఉపాసకులు విహారానికి వెళ్ళి ఒక దినమంతా అక్కడ ఉండి కొన్ని నియమాలు పాటిస్తూ అధ్యాత్మజీవితాన్ని కొంచం చవి చూడడాన్ని ఉపవాసం అనవచ్చు. పోషధం అనవచ్చు. ఉపవాసం అంటే ఆహారం తీసుకోకుండా ఉండడం అని కాదు అర్థం. అర్హతుల జీవితవిధానానికి సమీపం కావడం అని అర్థం. అహార విషయంలో ఇంకా ఇతర విషయాల్లో తగిన నియమాలు ఉండనే ఉంటాయి. పోషధం అంటే వృద్ధిపరచడం అని అర్థం. బక్కచిక్కిపోయిన మంచి గుణాలకు పోషణ (nourishment) ఇచ్చి బలం కలిగించుకోవడం వృద్ధిచేసుకోవడం అన్నమాట.*

చేయనివి కలల్లో కనిపిస్తాయి. క్షేమంకరమైన కలలూ భయంకరమైన కలలూ కలుగుతాయి. తనకు సంబంధం లేని అతిదూర విషయమూ, తనకు సంబంధం ఉన్న అతిదగ్గరి విషయమూ కలల్లో కనిపిస్తాయి. ఇంకా అనేక రూపాల్లో స్వప్నాలు కలుగుతాయి. స్వప్నం అనేది ఏమిటి? స్వప్నాలను చూసేది ఎవరు?

**నా:** మహారాజా, స్వప్నం అనేది నిదురలో గోచరించే దృశ్యాలు. ఆరు రకాల మనుషులకు స్వప్నాలు కలుగుతాయి. 1. వాతబాధితులు, 2. పిత్తబాధితులు 3. శ్లేష్మబాధితులు, 4. దేవతావిష్టులు 5. అభ్యాసప్రభావితులు, 6. భవిష్య సూచకమైన నిమిత్తాలను (portents) స్వప్నంలో దర్శించేవాళ్ళు. ఈ ఆరు విధాలుగా కలిగే స్వప్నాల్లో చివరిది సత్యము, తక్కినవి మిథ్యలు.

**మి:** భంతే నాగసేనా, నిమిత్తస్వప్నం ఎలా కలుగుతుంది? చిత్తం స్వయంగా వెళ్ళి అన్వేషించి ఆ నిమిత్తాన్ని తెలుసుకొంటుందా? లేదా నిమిత్తమే చిత్తపథంలోకి వస్తుందా?

**నా:** చిత్తం స్వయంగా వెళ్ళి నిమిత్తాన్ని తెలుసుకోవడం ఉండదు. నిమిత్తమే చిత్తవీథిలో దృశ్యంగా వచ్చి చేరుతుంది. మహారాజా, అద్దం స్వయంగా వెళ్ళి ప్రతిబింబాన్ని వెదకదు. ఏదేని బింబము అద్దం యొక్క పరిధిలోకి (focus) వచ్చినపుడు ప్రతిబింబం కలుగుతుంది.

**మి:** నిమిత్తస్వప్నం చూసిన చిత్తం ఆ నిమిత్తాన్ని తెలుసుకోగలదా? భవిష్యత్తులో క్షేమం కలుగుతుందనీ లేదా అపాయం కలుగుతుందనీ?

**నా:** చిత్తం తెలుసుకోదు. కానీ ఆ నిమిత్తాన్ని విని ఇతరులెవరైనా నిమిత్త జ్ఞానులు ఆ నిమిత్తం సూచించే అర్థాన్ని తెలియజేయగలరు.

**మి:** ఉపమ ద్వారా తెలుపుము.

**నా:** మహారాజా, దేహంలో తిలకములు (moles = పుట్టుమచ్చలు) మొదలగునవి ఆ వ్యక్తి లాభాన్నో అలాభాన్నో యశస్సునో అయశస్సునో సూచిస్తూ ఏర్పడతాయి. అవి ఉత్పన్నమైనపుడు "నేను ఈ పని కోసం ఉత్పన్నం అవుతాను" అనుకొంటాయా?

**మి:** అనుకోవు. కానీ అవి దేహంలో ఏ భాగంలో ఎలా ఉన్నాయో చూసి నైమిత్తికులు(sign-readers) అవి దేన్ని సూచిస్తున్నాయో తెలుపుతారు.

**నా:** అలాగే మహారాజా, నిమిత్తస్వప్నాన్ని చిత్తం చదువజాలదు. ఆ నిమిత్త స్వప్నాన్ని విన్నట్టి నిమిత్తజ్ఞులు ఆ నిమిత్తం దేన్ని సూచిస్తుందో చెబుతారు.

**మి:** స్వప్నాన్ని చూసేవాడు నిదురబోతున్నట్లా? మేలుకొన్నట్లా?

**నా:** నిదురిస్తున్నవాడూ స్వప్నాన్ని చూడడు. మేలుకొన్నవాడూ చూడడు. మిద్ధం (drowsiness) చిత్తాన్ని కమ్ముకోవడం మొదలయ్యింది కానీ చిత్తం ఇంకా భవాంగాన్ని (subconscious state) చెందలేదు. ఈ అంతరాళంలోనే స్వప్నాలు కలుగుతాయి. మిద్ధం ఆక్రమించాక చిత్తం భవాంగాన్ని చెందుతుంది. భవాంగాన్ని చెందిన చిత్తంలో ప్రవృత్తి ఉండదు. ప్రవర్తించని చిత్తం సుఖదుఃఖాలను తెలుసుకోజాలదు. ప్రవృత్తి లేని చిత్తానికి స్వప్నాలు కలుగవు. ప్రవర్తించే చిత్తానికే స్వప్నాలు కలుగుతాయి.

మహారాజా, వెలుగు లేని చోట అంధకారంలో పరిశుద్ధమైన అద్దం అయినా అందులో ప్రతిబింబం పడదు. అలాగే మిద్ధం ఆక్రమించిన తరువాత చిత్తం భవాంగంలో చేరిపోయినపుడు అది అప్రవృత్తచిత్తం (non-functioning) అవుతుంది. అప్రవృత్త చిత్తానికి స్వప్నాలు కలుగవు. ఉపమలో చెప్పిన అద్దం వంటిది శరీరం. అంధకారం వంటిది మిద్ధం. వెలుతురు వంటిది చిత్తం.

మహారాజా, శరీరంలో ఉన్నప్పటికీ చిత్తం రెండు సందర్భాల్లో అప్రవృత్తం (non-functioning) అవుతుంది. 1. నిరోధసమాపత్తిలో, 2. భవాంగంలో చేరిపోయినపుడు. జాగరితావస్థలో చిత్తం చంచలంగా ఉంటుంది, వివృతంగా (open) ఉంటుంది, ప్రాకృతంగా (natural) ఉంటుంది, అనిబద్ధంగా (untramelled) ఉంటుంది. ఇటువంటి చిత్తంలో నిమిత్తాలు పొడసూపవు. లోకంలో రహస్యకాములు రహస్యాలు దాచుకోలేని వ్యక్తిని దూరంగా ఉంచినట్లు దివ్యమైన నిమిత్తాలు జాగరితచిత్తాన్ని సమీపించవు. సమ్యక్‌జీవితం లేనట్టి అనాచారుడైనట్టి పాపచిత్తుడైనట్టి దుశ్శీలుడైనట్టి సోమరియైనట్టి శక్తిహీనుడైనట్టి భిక్షువుకు బోధిపక్షీయధర్మాలు అనుభవంలోకి రానివిధంగానే జాగరితచిత్తం నిమిత్తస్వప్నాలు చూడజాలదు.

**మి:** భంతే నాగసేనా, మిద్ధానికి (sleep) ఆది మధ్య అవసానములు ఉన్నవా?

**నా:** ఉన్నాయి.

**మి:** ఆది ఏది? మధ్యం ఏది? పర్యవసానం (end) ఏది?

**నా:** కప్పివేయబడినట్లుగా మనస్సు అయిపోవడం, దౌర్బల్యం, మందత, అకర్మణ్యత (unwieldiness) ఇది మిద్ధం యొక్క ఆది. మెలకువ మరియూ నిద్ర కలగలుపుగా ఉన్నట్టి మర్కటనిద్ర మిద్ధం యొక్క మధ్యం. చిత్తం భవాంగంలో చేరడం మిద్ధం యొక్క పర్యవసానం (end). మర్కటనిద్రలాంటి మిద్ధం యొక్క మధ్యావస్థలోనే స్వప్నాలు కలుగుతాయి. మహారాజా, యతాచారి (self restrained person), సమాహితచిత్తుడు, ధ్యేయం మీద మనస్సును నిలిపినవాడు, అచలచిత్తుడు అయిన వ్యక్తి సూక్ష్మమైన విషయాలను చింతన చేయడం కోసం కోలాహల ధ్వనులు ఏవీ వినబడని వనప్రదేశానికి

వెళ్తాడుకదా! స్వప్నాలు కలిగే మర్కటనిద్ర కూడా ఇటువంటిదే. కోలాహల ధ్వనులవంటిది జాగరావస్థ. నిర్జన వనప్రదేశం కపినిద్ర లాంటిది. అటు జాగరమూ కానట్టి ఇటు మిద్ధమూ కానట్టి కపినిద్ర వంటి మధ్యమ మిద్ధావస్థలో స్వప్నాలు చూడడం జరుగుతుంది.

**మి:** సాధు సాధు నాగసేనా!

*Note: ఈ ప్రశ్నలో ప్రధానంగా నిమిత్తస్వప్నం ప్రస్తావనకు వచ్చింది కనుక కృకి మహారాజుకు కలిగిన నిమిత్తస్వప్నాన్ని ఇక్కడ చూపించడం బాగుంటుంది.*

*కాశ్యపతథాగతుని శాసనకాలంలో కృకిమహారాజుకు కలలో పది నిమిత్తాలు కనిపించాయి.*

1. *ఏనుగు కిటికీ సందులోనుంచి బయటకు వచ్చేసింది కానీ దాని తోకమాత్రం ఆ సందులోనే తగుల్కొనింది.*
2. *దప్పికవేసినవాణ్ణి వెదకుతూ చేదబావి వెళ్తున్నది.*
3. *కుంచెడు పేలపిండికి, వస్తుమార్పిడిగా కుంచెడు ముత్యాలు లభిస్తున్నాయి.*
4. *చందనంకట్టెలు చాలా చౌకగా వంటకట్టెల ధరకే విక్రయించబడుచున్నది.*
5. *ఆరామాలు పుష్పఫలసంపన్నంగా ఉన్నాయి. కానీ అవి దొంగల పాలవుతున్నాయి.*
6. *గున్నఏనుగులచే గంధహస్తిసమూహం బెదిరింపబడుచున్నది.*
7. *దేహం అంతా బురద పూసుకొన్న ఒక కోతి ఇతరులకు ఆ బురదను అంటిస్తున్నది.*
8. *మర్కటానికి పట్టాభిషేకం జరుగుచున్నది.*
9. *ఒక వస్త్రం పద్దెనిమిదిమందిచే ఇటు అటు లాగబడుచున్నది.*
10. *చాలామంది ఒకచోట చేరి కలహం, వివాదం, విరోధం, జగడం పెట్టుకొని ఒకరికొకరు హాని కలిగించుకొంటున్నారు.*

*ఈ పది నిమిత్తముల పరమార్థమేమిటో తెలియజేయమని కృకిమహారాజు కాశ్యపతథాగతుణ్ణి ప్రార్థించినాడు. కాశ్యపభగవానుడు ఆ నిమిత్తములను ఇలా వివరించినాడు:*

*భవిష్యత్తులో శాక్యముని అనే తథాగతుని శాసనం ఐదువందల ఏండ్లు చక్కగా నడుస్తుంది. ఆపైన క్షీణదశ మొదలవుతుంది. ఆ క్షీణదశ ఎలా ఉంటుందో ఈ పది స్వప్నదృశ్యాలు సూచనగా తెలియజేస్తున్నాయి.*

1. *ఇల్లూ వాకిలి వదలిపెట్టి చాలామంది భిక్షువులవుతారు. కానీ వాళ్ళు విహారాల పట్ల స్వంత ఇండ్లకన్నా ఎక్కువ ఆసక్తి పెంచుకొని వాటిల్లో తగుల్కొంటారు.*
2. *ధమ్మశ్రవణం కోసం గృహస్థులు భిక్షువుల వద్దకు రావడం ఆగిపోతుంది. భిక్షువులే "వినండి వినండి" అని గృహస్థుల వెంటబడతారు.*
3. *పేలపిండిలాంటి స్వల్పలాభాలు గడించేందుకోసం అమూల్యమైన బోధిపక్షీయ ధర్మాలను ప్రసంగించే కార్యక్రమాలు భిక్షువులు పెట్టుకొంటారు.*
4. *తీర్థికమతాలతో ధమ్మమును పోల్చుతూ రెండూ సమానమని అంచనాకు వచ్చి తీర్థికమతాలను స్వీకరించే ప్రజ్ఞాహీనభిక్షువులు తలెత్తుతారు.*
5. *"సంఘమునకు చెందినది, తమ స్వంతం కాదు" అనే అవగాహన లోపించి ఆరామాల్లోని వృక్షసంపదను అమ్ముకొంటూ ఆ వచ్చినదాన్ని యథేచ్ఛగా అనుభవించే బూటకపు భిక్షవుల వశం అవుతాయి ఆరామ విహారాలన్నీ.*
6. *విహారాలు ఆరామాల మీద దుశ్శీలురు పాపధర్ములు అయినవారు పెత్తనం చెలాయిస్తూ పాతకాలంనాటి విలువలు ఇంకా పట్టుకొని వేళ్ళాడుతున్న శీలవంతులను బెదిరించి బయటకు గెంటివేస్తుంటారు.*
7. *దుశ్శీలురు పాపధర్ములు అయిన భిక్షువులు, కల్యాణధర్ములు శీలవంతులు అయిన భిక్షువులను అపనిందలపాలు చేస్తారు.*
8. *పాపధర్ములు దుశ్శీలురు అయిన భిక్షువులు, తమ పరపతి పెంచుకొనేందు కోసం సామంతరాజులకు విహారాల్లో పట్టాభిషేకాలు చేస్తారు.*
9. *తథాగతశాసనం పద్దెనిమిది శాఖలుగా చీలిపోయినా విముక్తివస్త్రం మాత్రం చిరిగిపోకుండా అలాగే ఉంటుంది.*
10. *శాఖాభిమానాలు పెంచుకొని భిక్షువులు ఒకరితో ఒకరు కలహించుకొంటారు.*

## ఏకాంతసుఖం

**మి:** భంతే నాగసేనా, నిర్వాణం అనేది ఏకాంతసుఖమా (entirely blissful)? లేక దుఃఖసమ్మిశ్రితమా?

**నా:** ఏకాంతసుఖం మహారాజా నిర్వాణం. దుఃఖసమ్మిశ్రితం కాదు.

**మి:** నాకు ఈ వాక్యం మీద శ్రద్ధ కలుగడం లేదు. నిర్వాణం దుఃఖసమ్మి శ్రితంగానే కనిపిస్తుంది. దీనికి కారణం కూడా కనిపిస్తుంది. నిర్వాణం కావాలనుకొనేవాళ్ళు దేహాన్ని మనస్సును తపింపజేస్తుంటారు. నిలబడడం, నడవడం, కూర్చోవడం, పడుకోవడం,

భోంచేయడం అన్నిట్లోనూ నియమ నిబంధనలు పాటిస్తూ దుఃఖజీవితాన్ని గడుపుతుంటారు. నిద్రను కూడా నియమించుకొంటూ నిద్రాసుఖానికి దూరం అవుతుంటారు. ఆయతనాలను (sense fields) అణచివేస్తుంటారు. ధనధాన్యాలను, ప్రియబాంధవులను, మిత్రులను అందర్నీ దూరం చేసుకొని నిస్సారంగా జీవిస్తుంటారు. లోకంలో సుఖితులుగా కనిపించేవాళ్ళందరూ పంచేంద్రియాలతో ఆయా మనోరంజక ఇంద్రియవిషయాలను గ్రహిస్తూ ఆనందిస్తుంటారు. మనోహరరూపాలను కన్నులతో చూస్తూ, శ్రావ్యమైన శబ్దాలను చెవులతో వింటూ, నానావిధ ఆహ్లాదకరమైన పరిమళాలను ముక్కుతో ఆఘ్రాణిస్తూ, రుచికరములైన నానావిధ ఆహార పదార్థాలను పానీయాలను నాలుకతో ఆస్వాదిస్తూ, సుఖ మృదు స్పర్శలను కలిగించే భోగ్యవస్తువులతో స్పర్శేంద్రియాన్ని తృప్తిపరుస్తూ, ఆసక్తికరంగా ఉండే అనేక వితర్కాలతో (thoughts) మనస్సును రంజింపజేస్తూ సుఖంగా జీవిస్తుంటారు. ఇన్నివిధాలుగా లభించే ఆనందాలకు దేహాన్ని మనస్సును దూరం చేసి మీరు వాటిని తపింపజేస్తారు. కాయాన్ని తపింపజేయడం వల్ల కాయిక దుఃఖవేదన కలిగించుకొంటారు. చిత్తాన్ని తపింపజేయడం వల్ల చేతసిక దుఃఖ వేదనను (దౌర్మనస్యం) కలిగించుకొంటారు. కనుకనే మాగంధియ పరివ్రాజకుడు భగవానుణ్ణి ఇలా నిందించాడు: "ఈ శ్రమణ గౌతముడు ఒక హంతకుడు!" కావున నిర్వాణం అనేది దుఃఖసమ్మిశ్రితమని నేను అంటాను.

**నా:** మహారాజా, నిర్వాణం దుఃఖసమ్మిశ్రితం కాదు. ఏకాంతసుఖం నిర్వాణం. నిర్వాణం దుఃఖం అంటున్నావు నీవు. నీవు చెప్పే దుఃఖం నిర్వాణానికి తగలదు. నిర్వాణసాక్షాత్కారం కోసం తత్పూర్వం జరిగే అన్వేషణభాగంలో అది చేరుతుంది. ఏకాంతసుఖం నిర్వాణం. దుఃఖసమ్మిశ్రితం కాదు. దీనికి కారణం చెబుతాను. మహారాజా, రాజులకు రాజ్యసుఖం అనేది ఉన్నదా?

**మి:** ఉన్నది భంతే.

**నా :** ఆ రాజ్యసుఖం దుఃఖసమ్మిశ్రితమా?

**మి:** కాదు భంతే.

**నా:** సరిహద్దులోని సామంతరాజ్యం తిరుగుబాటు చేస్తే ఈ రాజులు ఆ తిరుగుబాటును అణచడానికి అమాత్యులను, సేనానాయకులను, భటులను వెంటబెట్టుకొని మిక్కిలి శ్రమకరమైన దీర్ఘప్రయాణం చేస్తూ దోమల బాధ, ఈగల బాధ, ఈదురుగాలి బాధ, మండుటెండల బాధ– ఇన్ని బాధలచే పరిపీడితు లగుచూ ఎత్తుపల్లాల్లో పడుతూ లేస్తూ ప్రాణానికి ముప్పు కలిగించే మహా యుద్ధానికి కూడా తలపడతారు. రాజులకు రాజ్యసుఖం ఉందన్నావు! ఇదేనా ఆ సుఖం?

**మి:** రాజ్యసుఖం అంటే ఇది కాదు. రాజ్యసుఖాన్వేషణ అనే పూర్వభాగానికి చెందుతుంది నీవు చెప్పినవన్నీ. రాజ్యసుఖం వేరు. దుఃఖం వేరు.

**నా:** అలాగే మహారాజా, నిర్వాణం ఏకాంతసుఖం. దుఃఖసమ్మిశ్రితం కాదు. రాజులు రాజ్యసుఖం అనుభవించడం కోసం తొలుత ఎన్నో దుఃఖవేదనలను సహించి ఆపైన రాజ్యసుఖం పొంది సుఖిస్తారు. నిర్వాణాభిలాషి కూడా తన అన్వేషణలో కాయాన్ని చిత్తాన్ని అనేక తాపాలకు లోను చేస్తాడు. నిర్వాణం పొంది ఏకాంతసుఖం అనుభవిస్తాడు. నిర్వాణం వేరు. దుఃఖం వేరు.

**నా:** సాధు సాధు భంతే!

## నిర్వాణం నిర్వాణం

**మి:** భంతే నాగసేనా, నిర్వాణం నిర్వాణం అంటావు. నిర్వాణం యొక్క రూపం, సంస్థానం (shape), వయస్సు, ప్రమాణం (size) ఏమిటో ఉపమ ద్వారాగానీ హేతువు ద్వారాగానీ నయం ద్వారాగానీ (method) తెలుపగలవా?

**నా:** తెలుపలేను మహారాజా.

**మి:** భంతే, నేను అంగీకరించలేకున్నాను. నిర్వాణం ఉన్నదని చెబుతూ దాని నిరూపణకు ఉపమగానీ, హేతువుగానీ, నయంగానీ లేదనడం సముచితంగా లేదు.

**నా:** మహారాజా, తెలియజేయలేకపోవడం ఎందువల్లో నిన్ను ఒప్పిస్తాను. మహాసముద్రం ఉన్నదా?

**మి:** ఉన్నది.

**నా:** ఒకడు నిన్ను ఇలా ప్రశ్నించాడనుకో : "మహారాజా, సముద్రం ఉందన్నావు. అందులో ఎంత నీరుంది? అందులో ఎన్ని రకాల జీవాలు (beings) ఉన్నాయి? ఒక్కొక్క రకం జీవాల సంఖ్య ఎంత?" ఇలా అడిగితే నీవు ఏమి సమాధానం చెబుతావు?

**మి:** "అడగదగని ప్రశ్నను అడిగావు. సముద్రాన్ని ఈ విధంగా ఇంతవరకు ఎవరూ వివేచించలేదు. నీ ప్రశ్న స్థాపనీయప్రశ్న (set aside question). సమాధానం చెప్పవలసిన అవసరం నాకు లేదు" అని ఆ తిక్కలోడికి బదులు చెబుతాను.

**నా:** సముద్రం ఉందన్నవాడివి ఎంత నీరు ఎన్ని జీవాలు కూడా చెప్పాలికదా!

**మి:** శక్యం కాదు భంతే. సమాధానం ఇవ్వదగిన ప్రశ్నలు కావు అవి.

**నా:** అలాగే మహారాజా, నిర్వాణం అనేది ఉన్నప్పటికీ దాని రూపాన్ని, సంస్థానాన్ని, వయస్సును, ప్రమాణాన్ని తెలియజేయడానికి ఉపమలు లేవు. కారణాలు లేవు. హేతువులు లేవు. నయం (method) లేదు. చేతోవశిత్వం (mastery over mind) కలిగినట్టి ఇద్ధిమంతుడు (one who is in possession of super knowledge) సముద్రంలో ఎంత నీళ్ళున్నాయి ఎన్ని జీవాలున్నాయి చెబితేనూ చెప్పవచ్చు. కానీ అట్టివాడు కూడా నిర్వాణం యొక్క రూపం ఇది అని, సంస్థానం ఇది అని, ప్రమాణం ఇది అని చెప్పలేడు.

**మి:** పోనీ, నిర్వాణగుణాలు (special qualities) కలిగినట్టివి ఏవైనా లోకంలో ఉన్నాయా?

**నా:** నిర్వాణగుణాలను యథాతథంగా సూచించేవి లోకంలో ఏవీ లేవు. కానీ గౌణంగా (metaphorically) చెప్పడానికి వీలు కల్పించేవి, ఉపమలుగా పనికి వచ్చేవి ఉన్నాయి.

**మి:** గౌణంగానైనా సరే నిర్వాణం గురించి త్వరగా చెప్పుము. నీ వినయ శీతల మధుర వచనములచే నా హృదయపరిదాహాన్ని చల్లార్చుము.

**నా:** మహారాజా, పద్మం (lotus) ఒక గుణం నిర్వాణంలో ఉన్నది. పద్మానికి నీరు అంటుకోదు. క్లేశముల (defilements / afflictions) అంటు లేనిది నిర్వాణం.

మహారాజా, ఉదకం గుణాలు రెండు నిర్వాణంలో ఉన్నాయి. శీతల ఉదకం తాపాన్ని (వేడిమిని) చల్లార్చుతుంది. అలాగే నిర్వాణం కూడా శీతలం. క్లేశతాపాన్ని చల్లార్చుతుంది. మనుష్యులు పశువులు మొదలగు జీవుల దప్పికను ఉదకం పోగొట్టుంది. అలాగే నిర్వాణం కూడా సత్త్వుల తృష్ణను పోగొట్టుంది.

మహారాజా, అగదం (విరుగుడు మందు) గుణాలు మూడు నిర్వాణంలో ఉన్నాయి. విషపీడితులకు అగదం శరణ్యం అయినట్లు నిర్వాణం కూడా క్లేశవిషపీడితులకు శరణ్యంగా ఉన్నది. అగదం రోగాలను అంతం చేస్తుంది. నిర్వాణం కూడా దుఃఖరోగాన్ని అంతం చేస్తుంది. అగదం అనేది అమృతం నిర్వాణం కూడా అమృతం.

మహారాజా, సముద్రగుణాలు, నాలుగు నిర్వాణంలో ఉన్నాయి. పీనుగులను ఉంచుకోనిది సముద్రం, నిర్వాణం కూడా క్లేశపీనుగులు లేనిది. సముద్రం మహాంతం, అపారం, అన్ని నదుల నీళ్ళు వచ్చి పడుతున్నా పూరింపబడనిది. నిర్వాణం కూడా మహాంతం, అపారం, సర్వసత్త్వులు వచ్చి చేరినా పూరింపబడదు. సముద్రం మహాభూతములకు (great beings) ఆవాసం. నిర్వాణం కూడా విమలురు, క్షీణాస్రవులు,

అర్హతులు అయిన మహాసత్త్వులకు ఆవాసం. సముద్రం లెక్కించడానికి వీలుకాని వివిధమైన విపులమైన అలలచే అలరారునది. నిర్వాణం కూడా అపరిమితమైన వివిధమైన విపులమైన పరిశుద్ధమైన విద్యావిముక్తి (knowledge and emancipation) పుష్పాలతో అలరారునది.

మహారాజా, భోజనగుణాలు ఐదు నిర్వాణంలో ఉన్నాయి. సకల సత్త్వుల ఆయుష్షను భోజనం నిలబెట్టుంది. నిర్వాణసాక్షాత్కారం జరామరణాలను లేకుండా చేసి ఆయువును నిలుపుతుంది. సకలసత్త్వులకు భోజనం బలాన్నిస్తుంది. నిర్వాణ సాక్షాత్కారం ఇద్ధిబలాన్ని (psychic powers) కలిగిస్తుంది. సకలసత్త్వులకు భోజనం వర్ణమును (beauty) ఇస్తుంది. నిర్వాణసాక్షాత్కారం సకలసత్త్వులకు గుణసౌందర్యాన్నిస్తుంది. సకలసత్త్వుల దరథమును (distress) భోజనం ఉపశమింపజేస్తుంది. నిర్వాణసాక్షాత్కారం సకలసత్త్వుల క్లేశదరథమును ఉపశమింపజేస్తుంది. సకలజీవుల ఆకలిని, దౌర్బల్యాన్ని భోజనం పోగొట్టుంది. నిర్వాణ సాక్షాత్కారం సకలసత్త్వుల దుఃఖదౌర్బల్యాన్ని తొలగిస్తుంది.

మహారాజా, ఆకాశగుణాలు కొన్ని నిర్వాణంలో ఉన్నాయి. ఆకాశానికి జననం లేదు. జరా లేదు, మరణం లేదు. ఒకచోట అంతరించడం లేదు. మరో చోట ఉద్భవించడం లేదు. అనిశ్రితం (not dependent), విహగగమనం (sphere of birds), నిరావరణం (wihout obstruction), అనంతం (unending). నిర్వాణంలోనూ ఈ గుణాలున్నాయి.

మహారాజా, మణిరత్నం (precious gem) గుణాలు మూడు నిర్వాణంలో ఉన్నాయి. మణిరత్నం కోరికలు తీర్చుతుంది (కామదదం). నిర్వాణం కూడా కామదదమే. మణిరత్నం ఆనందం ఇస్తుంది (హాసకరం). నిర్వాణమూ హాసకరమే. మణిరత్నం ప్రకాశం కలిగినది (ఉద్యోతకరం). నిర్వాణమూ ఉద్యోతకరమే.

మహారాజా, లోహితచందనం (red sandal-wood) గుణాలు మూడు నిర్వాణంలో ఉన్నాయి. లోహితచందనం దుర్లభం. నిర్వాణమూ దుర్లభం. లోహితచందనం సాటిలేని పరిమళం కలిగినది. నిర్వాణం కూడా సాటిలేని శీలపరిమళం కలది. లోహితచందనాన్ని సజ్జనులు ప్రశంసిస్తారు. నిర్వాణాన్ని ఆర్యజనులు (noble people) ప్రశంసిస్తారు.

మహారాజా, సర్పిమండం (నెయ్యి) గుణాలు మూడు నిర్వాణంలో ఉన్నాయి. సర్పిమండం వర్ణం కలిగియుంటుంది. నిర్వాణం కూడా గుణవర్ణ సంపన్నంగా ఉంటుంది. సర్పిమండం గంధసంపన్నంగా ఉంటుంది. నిర్వాణం కూడా

శీలగంధసంపన్నంగా ఉంటుంది. సర్పిమండం రససంపన్నంగా ఉంటుంది. నిర్వాణం కూడా అమృతరససంపన్నంగా ఉంటుంది.

మహారాజా, గిరిశిఖరం గుణాలు ఐదు నిర్వాణంలో ఉన్నాయి. గిరిశిఖరం అత్యున్నతంగా ఉంటుంది. నిర్వాణం కూడా అత్యున్నతమే. గిరిశిఖరం అచలంగా ఉంటుంది. నిర్వాణం కూడా అచలం. గిరిశిఖరం అధిరోహించడం కష్టం. నిర్వాణం కూడా క్లేశాలున్నవాళ్ళు అధిరోహించడం కష్టం. గిరిశిఖరంలో విత్తనాలు ఏవీ మొలకెత్తవు. నిర్వాణంలో క్లేశబీజాలు ఏవీ మొలకెత్తవు. గిరిశిఖరం అనునయం (attraction), ప్రతిఘ (repulsion) లేనిది. నిర్వాణమూ అనునయ ప్రతిఘులు లేనిది.

**మి:** సాధు సాధు నాగసేనా, నేను సమ్మతిస్తున్నాను.

## నిర్వాణసాక్షాత్కారం

**మి:** భంతే నాగసేనా, నీవు అంటావు: “నిర్వాణం అతీతం (past) కాదు. అనాగతం (future) కాదు. ప్రత్యుత్పన్నం (present) కాదు. ఉత్పన్నం (arisen) కాదు. అనుత్పన్నం కాదు. ఉత్పాదనీయం (not arisable) కాదు.” ఇక్కడ నా సంశయం ఏమిటంటే సమ్యక్ ప్రతిపత్తి ద్వారా ఒకానొకడు నిర్వాణాన్ని సాక్షాత్కరించుకొన్నప్పుడు ఉత్పన్నం అయ్యున్నదాన్ని సాక్షాత్కరించుకొంటాడా? కొత్తగా ఉత్పాదించి సాక్షాత్కరించుకొంటాడా?

**నా:** మహారాజా, సమ్యక్ ప్రతిపత్తి ద్వారా నిర్వాణాన్ని సాక్షాత్కరించుకొన్నవాడు ఉత్పన్నం అయ్యున్నదాన్ని సాక్షాత్కరించుకోడు. కొత్తగా ఉత్పాదించి సాక్షాత్కరించుకోడు. నిర్వాణధాతువు ఉన్నది. దాన్ని అతడు సాక్షాత్కరించు కొంటాడు.

**మి:** దాచిపెట్టూ సమాధానం ఇవ్వకు. అర్థమయ్యే విధంగా, విడమర్చి సమాధానం చెప్పాలి. మక్కువతో ఉత్సాహంతో సమాధానం చెప్పాలి. నీవు నేర్చినదంతా సమాధానరూపంగా వెదచల్లు. జనులు సమ్మోహితులు, సంశయచిత్తులుగా ఉన్నారు. వాళ్ళ హృదయంలో ఉన్న దోషశల్యాన్ని పెకలించివేయి.

**నా:** మహారాజా! శాంతము, సుఖము, ప్రణీతము (excellent) అయినట్టి నిర్వాణ ధాతువు ఉన్నది. సమ్యక్ ప్రతిపత్తి కలిగినవాడు జినశాసనం (instructions of Buddha) సహాయంతో సంఖారముల (formations) అనిత్యతను, దుఃఖతను, అనాత్మతను ప్రజ్ఞ ద్వారా తెలుసుకొని నిర్వాణాన్ని సాక్షాత్కరించుకొంటాడు.

మహారాజా, అగ్నిజ్వాలల్లో చిక్కుకుపోయిన మనిషి అతిప్రయత్నంతో అక్కడ్నుంచి బయటపడ్డాక పరమసుఖం పొందినట్లుగా అనుభూతి పొందుతాడు. అలాగే సమ్యక్

ప్రతిపత్తి కలిగినవాడు యోనిశ మనసికారంతో (proper attention) మూడగ్నుల (రాగం, ద్వేషం, మోహం) సంతాపంనుండి బయటపడి పరమ సుఖమైన నిర్వాణాన్ని సాక్షాత్కరించుకొంటాడు.

మహారాజా, పాముల కుక్కల మనుష్యుల కుణపాలు(corpses) ఉన్నట్టి బురదనీటిపల్లంలో పడిపోయిన ఒక పురుషుడు అతిప్రయత్నంతో ఆ అసహ్యమైన చోటునుండి బయటపడి పరమసుఖం పొందినట్లనుకొంటాడు. అలాగే సమ్యక్ ప్రతిపన్నుడు యోనిశ మనసికారం వల్ల పంచకామగుణాలు (five strands of sense pleasures) అనెడి కుణపరాశినుండి బయటపడి పరమసుఖం అనుభవిస్తాడు. అదియే నిర్వాణసాక్షాత్కారం.

మహారాజా, ఒక భయంకర సన్నివేశంలో చిక్కుకొని భయంతో వణికిపోతున్నవాడు ప్రయత్నంతో అక్కడ్నుంచి తప్పించుకొని అభయస్థానం పొంది పరమసుఖం పొందినట్లుగా అనుభూతి చెందుతాడు. అలాగే సమ్యక్ ప్రతిపత్తి కలిగినవాడు యోనిశ మనసికారం వల్ల జాతి జరా వ్యాధి మరణం అనే భయం నుండి బయటపడి పరమసుఖం చెందుతాడు. అదియే నిర్వాణసాక్షాత్కారం.

మహారాజా, పరమ దుస్సహమైన మలమూత్రాల బురదలో పడిపోయిన ఒక పురుషుడు అతిప్రయత్నంతో అక్కడ్నుంచి బయటపడి శుచిప్రదేశం చేరి పరమసుఖానుభూతి పొందుతాడు. అలాగే సమ్యక్ ప్రతిపత్తి కలిగినవాడు యోనిశ మనసికారం వల్ల లాభ (gain), సత్కార (honour) శ్లోకం (praise) అనెడి మలకూపంనుండి బయటపడి పరమసుఖం అనుభవిస్తాడు. అదియే నిర్వాణ సాక్షాత్కారం.

మహారాజా, సమ్యక్ ప్రతిపత్తి కలిగినవాడు నిర్వాణాన్ని ఎలా సాక్షాత్కరించుకొంటాడో ఇంకా వినుము. సమ్యక్ ప్రతిపత్తి కలిగినవాడు సంఖారముల (mental formations) ప్రవృత్తిని బాగుగా గమనిస్తూ విచారం చేస్తాడు. అవి బుడగల్లా ఉద్భవించడం మరుక్షణం అంతరించడం గమనిస్తాడు. అక్కడ సుఖంగానీ ఆనందంగానీ లేకపోవడం తెలుసుకొంటాడు. జాతి జరా వ్యాధి మరణచక్రంలో పట్టుకోదగింది ఏదీ ఆదిలోగానీ మధ్యలోగానీ పర్యవసానంలోగానీ లేదని తెలుసుకొంటాడు. ఎర్రగా కాలుచున్న ఇనుపగోళం ఏ భాగమూ మట్టుకోవడానికి యోగ్యం కాని విధంగానే ఈ సంసారం (జననమరణప్రవాహం) ఏ అంశమూ ముట్టుకొనేందుకు యోగ్యం కాదని తెలుసుకొంటాడు. ఈ తెలియడం వల్ల చిత్తంలో అరతి (discontent) కలుగుతుంది. ఇక్కడ ఏమీ రక్షణ లేదని భవం(existence / becoming) పట్ల నిర్వేదం కలుగుతుంది.

మహారాజా, సంఖారముల ప్రవృత్తిలో (functioning of karmic formations) భయాన్ని (danger) చూడగలిగిన అతను ఇలా చింతిస్తాడు: "సంఖారాల ఈ ప్రవృత్తి తాపాన్ని కలిగిస్తూ ఉన్నది. ఇది బహుదుఃఖం, బహుఆయాసం! సంఖారాల అప్రవృత్తిని (non-functioning), శాంతిని, శమథాన్ని (tranquility), అనాసక్తిని (non-clinging), తృష్ణాక్షయాన్ని, విరాగాన్ని, నిరోధాన్ని (cessation), నిర్వాణాన్ని ఎప్పుడు పొందగలను?" అని ఆరాటం చెందిన అతని చిత్తం అప్రవృత్తికి (నివృత్తికి) ఉరుకుతుంది (leaps forward). "బయటపడే మార్గం కనిపించింది" అని ఆనందం చెందుతాడు.

**మి:** సాధు సాధు నాగసేనా!

## నిర్వాణం ఎక్కడుంది?

**మి:** భంతే నాగసేనా, ఏ ప్రదేశంలో నిర్వాణం సన్నిహితమై (stored) యున్నది? పూర్వదిశలోనా? పశ్చిమదిశలోనా? దక్షిణదిశలోనా? ఊర్ధ్వదిశలోనా? అధోదిశలోనా? విదిశల్లోనా?

**నా:** మహారాజా, నిర్వాణం సన్నిహితమైయున్న ప్రదేశం ఏదీ లేదు.

**మి:** అలా అయితే నిర్వాణం లేదు. నిర్వాణసాక్షాత్కారం లేదు. కారణం చెబుతాను. పృథివిలో ధాన్యానికి స్థానంగా క్షేత్రాలున్నాయి. గంధస్థానములుగా పుష్పాలున్నాయి. ఫలస్థానములుగా వృక్షాలున్నాయి. రత్నస్థానములుగా ఆకరములు (mines) ఉన్నాయి. ఎవడికి ఏది కావాలో దాన్ని ఆయా స్థలం వెళ్ళి పొందుతాడు. అలాగే నిర్వాణం అనేది ఉంటే దాని ఉత్పాదకస్థానం ఏదో ఉండాలి. ఉత్పాదకస్థానం లేదంటే నిర్వాణమూ లేనిదవుతుంది. నిర్వాణసాక్షాత్కారం అనేది ఒక మిథ్య అవుతుంది.

**నా:** నిర్వాణం సన్నిహితమైయున్న ప్రదేశం లేదు. నిర్వాణం ఉన్నది. సమ్మక్ ప్రతిపత్తి కలిగినవాడు యోనిశమనసికారం ద్వారా నిర్వాణాన్ని సాక్షాత్కరించు కొంటాడు. అగ్ని అనేది ఉన్నది కానీ అది ఎక్కడా సన్నిహితమై (stored) లేదు. రెండు కాష్ఠములను మథించడం ద్వారా అగ్నిని పొందుతాడు.

**మి:** నిర్వాణం సన్నిహితమైన ప్రదేశం లేదన్నావు, సరే. ఏ స్థానంలో నిలబడి సమ్యక్ ప్రతిపన్నుడు నిర్వాణాన్ని సాక్షాత్కరించుకొంటాడు?

**నా:** శీలం అనే స్థానంలో ప్రతిష్ఠతుడై యోనిశ మనసికారం ద్వారా సమ్యక్ ప్రతిపన్నుడు– అతడు శకదేశంలో ఉండనీ, యవనదేశంలో ఉండనీ, విలాయతదేశంలో ఉండనీ, అలసందదేశంలో ఉండనీ, నికుంబదేశంలో ఉండనీ, కాశీకోసలదేశంలో

ఉండనీ, కాశ్మీరంలో ఉండనీ, గాంధారంలో ఉండనీ, నగముద్ధనిదేశంలో ఉండనీ, ఏ దేశంలోనైనా ఉండనీ– నిర్వాణాన్ని సాక్షాత్కరించు కొంటాడు.

**మి:** సాధు సాధు నాగసేనా! నిర్వాణాన్ని బోధించావు. నిర్వాణ సాక్షాత్కారాన్ని బోధించావు. శీలగుణాలను బోధించావు. సమ్యక్ ప్రతిపత్తిని తెలిపావు. ధర్మధ్వజాన్ని నిలబెట్టావు. ధర్మనేత్రిని (Dhamma as a guide) నెలకొల్పావు. సహృదయులు చేసే ప్రయత్నాలు వృథా కావు. గణాచార్యులలో అగ్రేసరుడా! నేను అంగీకరిస్తున్నాను.

## ధర్మనగరం*

రాజా మిలిందుడు నాగసేనుణ్ణి సమీపించి అభివాదనం చేసి ఒక వైపున వినయంగా ఆసీనుడయ్యాడు. తెలుసుకోవాలని, వినాలని, జ్ఞాపకం చేసుకోవాలని, వెలుగు చూడాలని, అజ్ఞానాన్ని ఛేదించాలని మిలిందుడు ధృతిని (steadfastness), ఉత్సాహాన్ని (zeal), స్మృతిని (mindfulness), సంప్రజన్యాన్ని(awareness) ఎక్కువ కలిగించుకొనియున్నాడు. భదంత నాగసేనుణ్ణి ఇలా ప్రశ్నించాడు:

**మి:** భంతే నాగసేనా, బుద్ధుణ్ణి నీవు చూశావా?

**నా:** లేదు మహారాజా.

**మి:** మీ ఆచార్యులు చూశారా?

**నా:** లేదు

**మి:** బుద్ధుణ్ణి నీవు చూడలేదు. నీకు శిక్షణ ఇచ్చిన ఆచార్యులు చూడలేదు. కనుక బుద్ధుడు లేడు.

**నా:** మహారాజా, మీ వంశమూలపురుషులైన క్షత్రియులుండినారా?

**మి:** ఇందులో సంశయం ఏమున్నది? మా వంశపూర్వీకులుండినారు.

**నా:** మీ వంశమూలపురుషులను నీవు చూశావా?

**మి:** లేదు.

**నా:** నీకు శిక్షణ ఇచ్చిన పురోహితులు, సేనాపతులు, అధ్యక్షులు (judges), మహామాత్యులు చూశారా?

**మి:** లేదు.

---

* *మూలంలో తరువాతి మూడధ్యాయాలు (ధర్మనగరం, ధర్మనగరవాసులు, ధుతాంగప్రశ్న) అనుమానవర్గానికి చెందినవి.*

**నా:** నీవూ చూడలేదు. నీ అనుశాసకులూ (instructors) చూడలేదు. కనుక మీ వంశమూలపురుషులు లేరు.

**మి:** మా పూర్వీకులు అనుభవించిన పరిభోగవస్తువులు ఇప్పటికీ చూడవచ్చు. శ్వేతచ్ఛత్రం, ఉష్ణీసం (turban), పాదుకలు, వాలవ్యజనం, ఖడ్గరత్నం, మహార్ఘశయనాలు (couches of great price) ఇవన్నీ ఉన్నాయి. కనుక మా పూర్వీక క్షత్రియులుండినారని తెలుసుకోవచ్చు, నమ్మవచ్చు.

**నా:** మహారాజా, అలాగే మేము కూడా భగవానుణ్ణి తెలుసుకొంటున్నాము, నమ్ముచున్నాము. కారణం చెబుతాను. అర్హతుడు, సమ్యక్సంబుద్ధుడు అయిన భగవానుడు అనుభవించిన పరిభోగవస్తువులు ఇప్పటికీ ఉన్నాయి. అవి ఏమనగా, నాలుగు సతిపట్ఠానములు, నాలుగు సమ్యక్ప్రధానములు, నాలుగు ఇద్ధిపాదములు, ఐదు ఇంద్రియములు, ఐదు బలములు, సప్తబోధ్యంగములు, ఆర్యఅష్టాంగికమార్గం – ఇవన్నీ ఉన్నందువల్ల దేవతలు, మనుష్యులు భగవానుడు ఉండినాడని తెలుసుకొంటున్నారు, విశ్వసిస్తున్నారు. ఈ కారణం వల్ల, ఈ హేతువు వల్ల, ఈ నయం (method) వల్ల, ఈ అనుమానం (inference) వల్ల భగవానుడు ఉండినాడని తెలియవలెను.*

**బహూ జనే తారయిత్వా నిబ్బుతో ఉపధిక్ఖయే**
**అనుమానేన ఞాతబ్బం “అత్థి సో దిపదుత్తమో” తి**

సంసారసాగరంలో పడిపోయి మునగానాం తేలానాంగా సతమతమవుతున్న అసంఖ్యాక జనులకు “సద్ధర్మదేశనం” అనే చేయూతను ఇచ్చి వాళ్ళను నిర్వాణ తీరానికి గుంజుతూ తుదిశ్వాస వరకు శ్రమించిన ఆ నరోత్తముడు ఆయుష్షు తీరిపోగానే నిరుపధిశేషనిర్వాణంధాతువులో కలిసిపోయినాడు. ఐదువందల ఏండ్ల క్రితం జరిగినది ఇప్పుడు కంటికి ఎలా తెలుస్తుంది? (కన్ను మరియూ ఇతర జ్ఞానేంద్రియాలు తెలుసుకొనే పనిని ఎప్పుడూ వర్తమానంలోనే చేయగలవు. గతాన్ని (past) అనాగతాన్ని (future) తెలుసుకోలేవు). కనుక భగవానుడుండినాడనే విషయాన్ని మనస్సు అనుమానప్రమాణం ద్వారా (inference) తెలుసుకోవలసి యున్నది.

**మి:** ఉపమను చెప్పుము.

**నా:** మహారాజా, నగరవడ్డకి (city-architect) ఒకడు ఒక నగరాన్ని నిర్మించదలచి ఎత్తుపల్లాలు లేనట్టి, రాళ్ళురప్పలు లేనట్టి, దోషరహితమైనట్టి, భద్రమైనట్టి,

---

* *ఈ పేరాలోని కొన్ని పారిభాషికపదాలకు వివరణం చూడుడు అనుబంధం–2*

రమణీయమైనట్టి సమతల భూమిప్రదేశాన్ని ఎంపిక చేసుకొంటాడు. ఆ తరువాత మొక్కలూ ముళ్ళూ తీసివేసి ఆ భూభాగాన్ని శుభ్రం చేసి చదును చేస్తాడు. ఆ తరువాత శోభనమైన సువిభక్తమైన నగరాన్ని నిర్మిస్తాడు. పరిఖను (moat), ప్రాకారాన్ని, ద్వారాలను, గోపురాన్ని, చచ్చరములను (cross-roads), చతుష్కములను (squares), సంధి (junctions) సింగాటకములను (the place where three or four roads meet), సమము, శుభ్రమూ అయిన రాజమార్గాలను (main-roads), సువిభక్తమైన అంతరాపణమును (bazar / market), ఆరామాలు, ఉద్యానాలు, తటాకాలు, పుష్కరిణిలు (lotus pools), బావులు, వివిధ దేవస్థానములు (shrines) మొదలగు వాటితో కూడిన దోషరహిత నగరాన్ని నిర్మిస్తాడు. నగరనిర్మాణం పని ముగించి ఆ నగరవడ్డకి (city-architect) మరో ప్రాంతానికి వెళ్ళిపోతాడు. కాలాంతరంలో నానా దేశీయులతోనూ నానా వృత్తులవారితోనూ నిండిపోయి ఆ నగరం ఒక సంపన్ననగరంగా సమృద్ధ నగరంగా సుఖమైన నగరంగా భద్రమైన నగరంగా వృద్ధి చెందింది. దోషరహితమూ రమణీయమూ అయిన ఆ నగరాన్ని చూసిన జనులు ఆ నగర నిర్మాతను చూడకపోయినా "అహోబత! ఎంత గొప్పవాడు ఈ నగరాన్ని నిర్మించినవాడు!" అని అతణ్ణి మెచ్చుకొంటారు. నగరాన్ని చూసి నగరనిర్మాతను వాళ్ళు అనుమానం ద్వారా (inference) తెలుసుకొన్నారు.

మహారాజా, ఆలాగే అసముడు(without an equal), అసమసముడు (equal to the unequalled), అప్రతిసముడు (equal to the matchless ones), అసదృశుడు (unique), అతులుడు (incomparable), అసంఖ్యేయుడు (boundless), అప్రమేయుడు (immeasurable), అపరిమేయుడు, అమితగుణుడు, గుణపారమిప్రాప్తుడు, అనంతధృతి – అనంత తేజస్సు–అనంత వీర్యం– అనంతబలం కలిగినవాడు, బుద్ధబలపారమిప్రాప్తుడు అయిన భగవానుడు మారుణ్ణి మారసైన్యాన్ని పరాజయం పాలు చేసి, దృష్టిజాలాన్ని (net of false views) ఛిన్నాభిన్నం చేసి, అవిద్యను పారద్రోలి, విద్యను ఉత్పాదించి, ధర్మఉల్కాన్ని (torch of Dhamma) చేబూని, సర్వజ్ఞత్వాన్ని పొంది, సంగ్రామవిజయి అయి ధర్మనగరాన్ని నిర్మించాడు.

***Note:*** *ఈ అధ్యాయాన్ని ఇక్కడికి ముగించడం మంచిదనిపించింది. ధర్మశబ్దానికి బౌద్ధంలో అనేక అర్థాలున్నాయి. సందర్భాన్ని బట్టి అర్థనిర్ణయం తేలికయే. ఇక్కడ ధర్మం అంటే ఆగమధర్మం (భగవానుని ఉపదేశముల రాశి = త్రిపిటకములు) అని అర్థం. విస్తారమైన ఈ గ్రంథరాశిని ఒక మహానగరంతో పోల్చడం జరిగింది. గ్రంథరాశిలో అనేక అధ్యాత్మిక అంశాలున్నాయికదా! నగరమూ అనేక అంశాలలో కూడియే*

ఉంటుంది. ప్రాకారాలు, గోపురాలు, ప్రవేశద్వారాలు, వీధులు కూడళ్ళు, విపణివీధులు, ఆ విపణివీధుల్లో నానా రకాల అంగళ్ళు, – ఇలా  నగరమూ అనేక అంశాలతో శోభిస్తూ ఉంటుంది. మొత్తం అధ్యాయం ఈ రెండింటి మధ్య పోలికలను గుదికూర్చిన ఒక పెద్ద పోలికల మాల (garland).

దీని తరువాతి అధ్యాయం ధర్మనగరవాసులు. ధర్మనగరవాసులు ఎవరంటే ధర్మాన్ని అభ్యసించేవారు (ప్రతిపత్తారులు). ఇదీ పోలికల మాలయే. మొదటి ముద్రణలో చోటుచేసుకొన్న ఈ రెండు అధ్యాయాలను ఇందులో చేర్చలేదు (పాఠకులు చదువకుండా పేజీలు త్రిప్పివేస్తారనే అభిప్రాయం వల్ల). మొదటి ముద్రణలోని ధుతాంగప్రశ్నను కూడా ఈ ముద్రణలో చేర్చలేదు. శరీరానికి  సంబంధించిన తపస్సులు అవి. ఆహారం, వస్త్రాలు, నివాసం, ఈర్యాపథం– వీటికి సంబంధించినవి. చివరిది చాలా కష్టం. దేహాన్ని అన్ని వేళలా ఒకే భంగిమలోనే ఉంచడం అనేది గొప్ప తపస్సే, సుఖాలను అపేక్షించడం సుఖాలకు తగుల్కొనిపోవడం అనేది అధ్యాత్మికంగా సరి కాదు. శరీరానికి సంబంధించిన తపస్సులు అవసరమే. కొన్ని అలవాట్లు– మద్యపానం, ధూమపానంలాంటివి కూడా శరీరానికి సంబంధించినవియే. ఇటువంటివాటిని దూరంగా ఉంచడం కూడా తపస్సులో చేర్చవచ్చు. ధుతాంగముల మీద సంక్షిప్త వివరణం:

“దేహాన్ని లాలించనూ వద్దు, కష్టపెట్టనూ వద్దు. మధ్యేమార్గాన్ని అవలంబించుము” అని బుద్ధసందేశం. రుచిభేదాన్ని బట్టి కొందరు భిక్షువులు జీవితం ఒక తపస్సుగా ఉండాలనుకొన్నారు. అటువంటివారిని భగవానుడు వారించలేదు. వారి తపోవిధానాలకు ధుతాంగములు (ascetic practices)  అని పేరు. ఇవి పదమూడు నియమాలు. ఎవరికి ఏది ఇష్టమో దాన్ని ఆచరించేవాళ్ళు. కొందరు రెండు మూడు నియమాలు కూడా పెట్టుకొనియుంటారు. ఈ పదమూడింటిలో రెండు వస్త్రాలకు సంబంధించిన నియమాలు. ఐదు ఆహారానికి సంబంధించినవి. నివాసానికి (అరణ్యం, వృక్షమూలం, ఆరుబయలు, శ్మశానం ఇత్యాదులు) సంబంధించినవి ఐదు. ఒకటి వీరియానికి, పట్టుదలకు సంబంధించి నది. (నేసజ్జికాంగం = నడుం వాల్చరాదనే నియమం. నిదురపోవడం కూడా కూర్చొన్న భంగిమలోనే). ఈ పదమూడింటిలో పన్నెండు, ప్రత్యయముల (జీవితావసరాలు = requisites) విషయమైన తపోవిధానం. ఒకటి వీరియానికి సంబంధించిన తపోవిధానం. ఈ తపస్సుల వల్ల ధ్యానంలో పురోగతి సాధిస్తే మంచిదే. ధ్యానానికి నష్టం కలిగే పక్షంలో ఇవి తక్షణమే వదలివేయవచ్చు. ప్రజల మీద పరిసరాల మీద వినియోగవస్తువుల మీద ఆధారపడడాన్ని తపస్సు బాగా తగ్గించివేసి స్వాతంత్ర్యాన్ని ఇస్తుంది.

*ధుతాంగములకు సంబంధించి నాలుగు రకాల వ్యక్తులున్నారు. 1. భిక్కులస్థవిరుడులాంటివారు స్వయంగా ధుతాంగాలను పాటిస్తారు కానీ ఈ విషయమై ఎవరికీ ప్రసంగాలు చేయరు. 2. చక్కగా ఉపన్యాసాలు ధుతాంగముల మీద చేస్తారు. కానీ స్వయంగా ఏ ఒక అంగమూ పాటించరు–ఉపనందుడులాగా. 3. లాళుదాయి భిక్షువు ధుతాంగములను పాటించడు. వాటిగురించి ప్రసంగమూ చేయడు. 4. ధమ్మ సేనాపతి సారిపుత్రుడు ధుతాంగములను చక్కగా పాటిస్తాడు. ఈ విషయమై ఇతరులను ప్రోత్సహిస్తూ చక్కగా ప్రసంగాలూ చేస్తాడు.*

*ధుతం అంటే విదిలించివేయుట అని అర్థం. క్లేశములను విదిలించివేసే తపస్సులకు ధుతములని పేరు. అంగమనగా సాధన (practice). ధుతాంగములను పాటించగలిగితే చేతిలో భిక్షాపాత్ర, దేహం మీద వస్త్రం తప్పించి ఇంకేమీ అవసరం ఉండదు. ఇటువంటి భిక్షువులను భగవానుడు పక్షితో పోల్చినాడు. పక్షి ఎక్కడికి ఎగిరిపోవాలన్నా రెండు రెక్కలతో ఎగిరిపోతుంది. అలాగే భిక్షువు కూడా ఎక్కడికి పోవాలన్నా భిక్షాపాత్ర, చీవరంతో వెళతాడు. ఇంకేమీ అవసరం ఉండదు.*

*పదమూడు ధుతాంగములలో వృక్షమూలికాంగం ఆకట్టుకొనేదిగా కనిపిస్తున్నది. వృక్షమూలంలో నివాసం అంటే వేర్లు దిగినచోట అని కాదు అర్థం. మధ్యాహ్న సమయంలో వృక్షం క్రింద నీడ ఎంతమేరకు పడుతుందో అంతవరకు వృక్షమూలంగా భావించాలి. లేదా వృక్షంనుండి రాలిపడిన ఆకులు ఎంతమేరకు పడియున్నాయో అంతవరకు వృక్షమూలంగా తీసుకొనవచ్చు. మొత్తానికి చెట్టు క్రింద అని అర్థం. వృక్షాన్ని ఎంపిక చేసుకోవడంలోనూ కొన్ని నియమాలు పాటించాలి. చైత్యవృక్షం– అంటే ప్రజలచేత ప్రదక్షిణం మొదలగు పూజలు అందుకొనే వృక్షంగా అది ఉండరాదు. అక్కడ పడక వేస్తే ప్రజలు తన్ని తరుముతారు. మధురఫలవృక్షంగానూ అది ఉండరాదు. ముళ్ళచెట్టుగానూ ఉండరాదు. తొర్రలు ఏర్పడినదిగానూ ఉండరాదు. జిగురు స్రవించే వృక్షంగా ఉండరాదు. గబ్బిలాల వృక్షంగానూ ఉండరాదు.*

వృక్షమూలికాంగం వలన కలిగే లాభాలు చాలా ఉన్నాయి. వృక్షదేవతలతో (వనదేవతలతో) సహజీవనభాగ్యం కలుగుతుంది. చెట్లఆకులు ప్రారంభ వయస్సులో రక్తవర్ణంగాను మధ్యమ వయస్సులో నీలవర్ణంగాను వార్ధక్యదశలో పసుపురంగుగాను మారి చివరకు రాలిపోతాయి. దినమూ కంటి ముందు కనిపించే ఈ దృశ్యం వల్ల అనిత్యచింతన సులభం అవుతుంది. భగవానుడు వారసత్వంగా ఇచ్చినదాన్ని అందిపుచ్చుకొన్నట్లుగానూ ఉంటుంది. (భగవానుని జననం, బోధిప్రాప్తి, ధర్మచక్రప్రవర్తనం, పరినిర్వాణం – చెట్లనీడలోనే).

## తొలి బుద్ధవచనం

**అనేకజాతి సంసారం సంధావిస్సం అనిబ్బిసం**
**గహకారకం గవేసంతో దుక్ఖా జాతి పునప్పునం**
**గహకారక దిట్ఠోసి పున గేహం న కాహసి**
**సబ్బా తే ఫాసుకా భగ్గా గహకూటం విసంఖతం**
**విసంఖారగతం చిత్తం తణ్హానం ఖయమజ్ఝగా**

ఈ దేహమనే గేహాన్ని నిర్మిస్తున్న నిర్మాత ఎవరో తెలుసుకోవాలని అన్వేషణ సాగించాను. ఆ నిర్మాత ఎవరో పట్టి ఇవ్వగల జ్ఞానం కలుగనందువల్ల లెక్కలేనన్ని జన్మలెత్తుతూ ఈ సంసారచక్రంలో ఇన్నాళ్ళు పరిభ్రమించినాను. మళ్ళీ మళ్ళీ జన్మలెత్తుతూ ఉండడం అబ్బా ఎంత దుర్భరమైన దుఃఖం!

ఓయీ గృహనిర్మాతా (తృష్ణ), నిన్ను కనుక్కొన్నాను. ఇక నీవు నాకు ఇల్లును ఎన్నటికీ కట్టలేవు. నీ వాసాలన్నీ (క్లేశములు) విరిగినాయి. వాసాలకు ఆధారంగా నిలిచిన మూలస్తంభం (అవిద్య) ధ్వంసమయ్యింది. నా చిత్తం నిర్వాణం పొందింది. తృష్ణాక్షయం అనబడే అర్హత్వమును పొందినాను.

# ఉపమలు

## 1. గర్దభం (గాడిద)

**మి:** భంతే నాగసేనా, గర్దభం నుండి ఒక గుణాన్ని గ్రహించవలెను అని మీరు చెబుతుంటారు. గ్రహించదగిన ఆ ఒక గుణం ఏమిటి?

**నా:** మహారాజా, గర్దభం దిబ్బమీదగానీ గ్రామం మధ్య ఉన్న రచ్చబండ వద్దగానీ కూడలి వద్దగానీ గ్రామద్వారం వద్దగానీ ఉమకరాశిమీదగానీ ఎక్కడో ఒక చోట కాసేపు పరుంటుంది. ప్రొద్దస్తమానం అక్కడే పరుండదు. అలాగే యోగాభ్యాసకుడు ఎక్కడో ఒక చోట తుంగచాప మీదనో తాటియాకు చాపమీదనో చెక్కమంచం మీదనో ఇవేవీ లభించనిచో కటికనేల మీద చర్మఖండాన్ని (meditation seat) పరచుకొని ధ్యానం చేసి ఆ పైన కాసేపు నడుం వాల్చి శయనించవలెను. ఎక్కువసేపు నిదురించేవాడుగా ఉండరాదు. శయన విషయంలో గర్దభం పాటించే ఈ ఒక గుణవిశేషం గ్రహించదగినదిగా ఉన్నది.

మహారాజా, దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా చెప్పియున్నాడు: "నా శ్రావకులు (disciples) బహుజాగరూకులు, సాధన పట్ల బహు తీవ్రత కలిగినవారు. ఏ దిమ్మనైనా దిండుగా ఉపయోగించుకుని ఎక్కడైనా శయనించగల సుఖనిరపేక్షులు". మహారాజా, ధమ్మసేనాపతియైన సారిపుత్ర స్థవిరుడు కూడ ఇలా చెప్పియున్నాడు:

**పల్లంకేన నిసిన్నస్స జణ్ణుకేనాభివస్సతి**<br>
**అలం ఫాసువిహారాయ పహితత్తస్స భిక్ఖునో** *థేరగాథ - 985*

సాధనతత్పరుడైన భిక్షువు కాళ్ళు మడచి కూర్చొని ధ్యానం చేస్తున్నప్పుడు వర్షం వస్తే వానజల్లు అతని మోకాళ్ళమీద పడనంతమేరకు పైన కప్పు ఉంటే చాలు దానిని సుఖనివాసంగా అతను భావిస్తాడు.

## 2. కోడిపుంజు

**మి:** భంతే నాగసేనా, కోడిపుంజులోని ఐదు గుణాలను గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ గ్రహించదగు ఐదు గుణాలు?

**నా:** మహారాజా, విశ్రమించవలసిన సమయం ఆసన్నమైనపుడు కుక్కుటం బాహ్య ప్రపంచంతో సంబంధాలను విరమింపజేసుకొని ఏకాంతంగా ఒంటరిగా తనలో తాను

ఉండిపోతుంది. అలాగే యోగాభ్యాసి అయినవాడు తాను చేయవలసిన దైనందిన కర్తవ్యాలను – చైత్యఅంకణాన్ని ఊడ్చి శుభ్రం చేయడం, త్రాగునీటిని, పాదప్రక్షాళననీటిని కుండల్లో సిద్ధం చేయడం, స్వీయశరీరానికి చేసుకొనవలసిన స్నానాదులు చేయడం, చైత్యానికి వందనం చేయడం, వృద్ధభిక్షువుల వద్దకు వెళ్ళి వాళ్ళకు సేవలు చేయడం, ధమ్మవిషయాల మీద ప్రశ్నలు వేసి వారు చెప్పేది శ్రద్ధగా వినడం, ఆపైన బాహ్యసంబంధాలను నిలుపుచేసి విశ్రమించవలసిన సమయం ఆసన్నమైనపుడు ఏకాంతవాసంలో ప్రవేశించి ధ్యానంలో నిమగ్నం కావడం చేయాలి. ఇదియే మహారాజా, కుక్కుటంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, బాహ్యప్రపంచంతో మళ్ళీ సంబంధాలు పెట్టుకొన వలసిన సమయం ఆసన్నమవగానే కుక్కుటం మేల్కొంటుంది. అలాగే యోగాభ్యాసం చేసేవాడున్నూ బ్రహ్మముహూర్తంలో నిదురనుండి లేచి ఇక ఆ దినం క్రమంగా చేయవలసిన పనుల్లోకి దిగడం చేయాలి. ఇదియే మహారాజా, కుక్కుటంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, కుక్కుటం భూమిని కెలికి కెలికి పరిశీలన చేస్తూ ఆహారాన్ని తీసుకొంటుంది. అలాగే యోగాభ్యాసకుడు భుజించేటప్పుడు ముద్దముద్దకు ప్రత్యవేక్షణ (reflecting) చేస్తూ భుజించవలెను. “భుజించడం వినోదం కోసం కాదు, మదాన్ని పెంచుకొనేందుకోసం కాదు, శరీరాన్ని ఆకర్షణీయంగా ఉంచుకొనేందుకోసం కాదు. ఈ దేహయాత్ర కొనసాగేందుకు, ఆకలిబాధ పోగొట్టుకొనేందుకు, సాధనజీవితం కొనసాగించేందుకు” అని భావించవలెను. “ఆహారం తీసుకొనడం ద్వారా ఆకలిబాధను ఉపశమింపజేస్తాను కానీ అతిగా భుజించి తద్వారా కలిగే కొత్త వేదనను కలిగించుకొనను. శరీరయాపనం కోసమే భోజనం తీసుకొంటూ నిందనీయం కానివిధంగా సుఖజీవితం కలిగియుంటాను” అని భోజనసమయంలో మాటిమాటికి ప్రత్యవేక్షణ చేసుకొనవలెను. ఇదియే మహారాజా, కుక్కుటంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. మహారాజా, దేవాతిదేవుడైన భగవానుడు ఈ విషయమై ఇలా చెప్పియున్నాడు:

**కంతారే పుత్తమంసంవ అక్ఖస్సబ్భంజనం యథా**
**ఏవం ఆహరి ఆహారం యాపనత్థమముచ్ఛితో**

“సముద్రం అంత విస్తీర్ణం కలిగిన ఒక ఎడారిలో తల్లిదండ్రులు తమ ఏకైకపుత్రునితో బాటు ప్రయాణించవలసిన అగత్యానికి లోనయ్యారు. ప్రయాణంలో చాలా

దినాలపాటు ఆహారం లేకుండా క్షీణించిపోయినారు. ఆ క్షీణతకు తట్టుకోలేక చిన్నవాడు మృతిచెందినాడు. ఆ మృతశరీరాన్ని తలిదండ్రులు ఆహారంగా వినియోగించుకొని ఎడారి ప్రయాణం కొనసాగించారు. ఎడారిని దాటి క్షేమస్థానం చేరడమే వారి ఏకైకలక్ష్యం. ఆ లక్ష్యసాధనకోసమే వారు మృతిచెందిన పుత్రమాంసాన్ని ఆహారంగా వినియోగించారు. ఆ ఆహారాన్ని ఆరగించేటప్పుడు వారి చిత్తస్థితి ఎలా నిర్వేదంగా ఉండినదో అటువంటి చిత్తస్థితినే (శరీరాన్ని నిలిపియుంచడం కోసమే ఈ ఆహారం అనే ఏకైక చిత్తస్థితి) నీవు భుజించేటప్పుడు కలిగియుండవలెను. ఈ ఉపమ నీకు నచ్చకపోతే బండిఇరుసుకు కందెనవలె శరీరానికి ఆహారం అని భావించి భుజించుము. భోజన సమయంలో ప్రత్యవేక్షణను ఏ క్షణంలోనూ మరచిపోవద్దు."

మరియూ మహారాజా, కుక్కుటం నేత్రములు కలదైనప్పటికీ రాత్రివేళలో అంధత్వం చెందియుంటుంది. అలాగే యోగాభ్యాసం చేసేవాడు అరణ్యంలో సంచరిస్తున్నా గ్రామాల్లో భిక్షాటన చేస్తున్నా మనోహరమైన రూపములు, శబ్దములు, గంధములు, రసములు, స్ప్రష్టవ్యములు, ధమ్మములు (mental objects)– ఈ విషయాల్లో గ్రుడ్డివానిలాగా చెవిటివానిలాగా మూగవానిలాగా ప్రవర్తించవలెను. ఆకర్షణీయమైన లక్షణాల పట్ల ఉపలక్షణాల పట్ల చిత్తాన్ని పోనీయరాదు. మహారాజా, ఇదియే కుక్కుటంనుండి గ్రహించవలసిన నాలుగవ గుణం. ఈ విషయమై మహాకాత్యాయన స్థవిరుడు ఇలా పలికియున్నాడు:

**చక్ఖుమాస్స యథా అంధో సోతవా బధిరో యథా**
**పఞ్ఞవాస్స యథా మూగో బలవా దుబ్బలోరివ**
**అత్తఅత్థే సముప్పన్నే సయేథ మతసాయికం** థేరగాథ–501

చూపు ఉన్నప్పటికీ అంధునివలె, వినికిడి యున్నప్పటికీ చెవిటివానివలె, ప్రజ్ఞ ఉన్నప్పటికీ మూఢునివలె, బలం ఉన్నప్పటికీ దుర్బలునివలె పైకి కనిపిస్తూ సాధకుడు గోప్యంగా లక్ష్యసాధనలో పురోగమిస్తూ ఉండవలెను. లక్ష్యం సిద్ధించినపుడు ఎగిరి గంతులు వేయకుండా మరణశయ్యపై పడియున్నట్లుగా కనపడవలెను.

మహారాజా, కుక్కుటాన్ని మట్టిపెళ్లతో కఱ్ఱతో కొరడాతో బెదరించి తరిమినా పారిపోయినట్లే పారిపోయి మళ్ళీ మళ్ళీ తన పరిసరాలకే వస్తుంది. తన పరిసరాలను వదలిపోదు. అలాగే యోగాభ్యాసం చేసేవాడు చీవరాన్ని కుట్టున్నా కుటీరం నిర్మిస్తున్నా దైనందిన వివిధ కర్తవ్యాలను నిర్వహిస్తున్నా బుద్ధ వాక్యాలను పఠిస్తున్నా

పఠింపజేస్తున్నా ఆయా పనులు చేస్తున్నప్పుడు యోనిశ మనసికారాన్ని* (proper attention) జారిపోనీయరాదు. యోగులకు స్వీయనివాసం వంటిది యోనిశ మనసికారం. ఇదియే మహారాజా, కుక్కుటం నుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడ ఈ విషయంగా ఇలా చెప్పియున్నాడు: “భిక్షువులారా, భిక్షువుకు పైతృకంగా (వారసత్వంగా) సంక్రమించిన గోచరం (field / domain) ఏది? నాలుగు సతిపట్ఠానములే** భిక్షువుకు వారసత్వంగా సంక్రమించిన గోచరం. ధమ్మసేనాపతి సారిపుత్రుడు కూడా ఇలా చెప్పియున్నాడు:

**యథా సుదంతో మాతంగో సకం సోండం న మద్దతి**
**భక్ఖాభక్ఖం విజానాతి అత్తనో వుత్తికప్పనం**
**తథేవ బుద్ధపుత్తేన అప్పమత్తేన వా పన**
**జినవచనం న మద్దితబ్బం మనసికారవరుత్తమం**

చక్కని శిక్షణ పొందిన ఏనుగు ఎట్టి పరిస్థితుల్లోనూ తన తొండాన్ని తానే త్రొక్కుకొనదు (యుద్ధభూమిలో తన దేహం మీద ఎన్ని వేట్లు పడినా సహిస్తుంది. తొండాన్ని మాత్రం దెబ్బ పడనీయకుండా నోటిలో చొప్పించి పెట్టుకొంటుంది). తనకు ఆహారంగా ఉంచిన దానిలో ఏది తినదగిందో ఏది తినదగదో చక్కగా కనిపెట్టియే తినదగింది మాత్రమే తింటుంది. అలాగే బుద్ధపుత్రుడు కూడా బహుజాగరూకుడై యుండవలెను. బుద్ధశాసనమే ఉత్తమోత్తమ మనసికారం కనుక బుద్ధశాసనాన్ని ఉల్లంఘించకుండా బుద్ధపుత్రుడు బహుజాగరూకుడుగా ఉండవలెను.

## 3. ఉడత

**మి:** భంతే నాగసేనా, ఉడత గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏది ఆ ఒక గుణం?

---

** మనసికారం (attention) అంటే మనస్సు పెట్టడం అని అర్థం. మనస్సు పెట్టడం ఎవరూ నేర్పనవసరం లేదు. సహజంగానే జరిగే ప్రక్రియ. మనస్సు పెట్టాక ఆలోచనా తరంగాలు ఏ తీరుగా ఉండాలనేది ముఖ్యం. రాగం ద్వేషం మొదలగు క్లేశాలతో కలుషితంగా ఉన్నట్టి చిత్తంలో తలెత్తే ఆలోచనా తరంగాలు మనసికారంతో జతకట్టితే దానికి అయోనిశ మనసికారం (improper attention) అని పేరు. శ్రద్ధ, మైత్రి, కరుణ, ప్రజ్ఞ మొదలగు కుశల ఆలోచనా తరంగాలు మనసికారంతో జతకూడితే దానికి యోనిశ మనసికారం (proper attention) అని పేరు.*

*** చూడుడు 216 వ పుట.*

**నా:** మహారాజా, తన మీదికి శత్రువు దాడి చేసినపుడు ఉడత తన తోకను విప్పారించి కొరడా ఝుళిపించినట్లు ఝుళిపించి శత్రువును బెదిరింపజేసి నిలువరిస్తుంది. అలాగే యోగాన్ని అభ్యసించేవాడు తనలో క్లేశశత్రువులు విజృంభించినపుడు సతిపట్ఠానకొరడాను వృద్ధి చేసుకొని బలపరచుకొని దాన్ని ఝుళిపించడం ద్వారా క్లేశశత్రువుల విజృంభణను అరికట్టవలెను. ఇదియే మహారాజా, ఉడతనుండి గ్రహించదగు ఒక గుణవిశేషం. మహారాజా, ఈ విషయంగా చుల్లపంథక స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**యదా కిలేసా ఓపతంతి సామఞ్ఞగుణధంసినా**
**సతిపట్ఠానలగుళేన హంతబ్బా తే పునప్పునం**

శ్రామణ్య గుణాలను (అధ్యాత్మ గుణసంపత్తిని) ధ్వంసం చేసే క్లేశాలు తలెత్తగానే వాటిని అప్పటికప్పుడే సతిపట్ఠాన కొరడాతో తుదముట్టించవలెను.

## 4. ఆడచిరుతపులి

**మి:** భంతే నాగసేనా, ఆడచిరతపులి గుణాన్ని ఒకదాన్ని యోగాభ్యాసకుడు గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, ఆడచిరుతపులి ఒకసారి మాత్రమే గర్భం ధరిస్తుంది. మళ్ళీ మళ్ళీ అది మగపొందును కోరదు. అలాగే యోగాభ్యాసకుడు కూడా "ఈ ఒక జన్మ చాలు. మళ్ళీ మళ్ళీ ప్రతిసంధి, ఉత్పత్తి, గర్భశయనం, చ్యుతి, మరణం, క్షయం, వినాశం, సంసారభయం, దుర్గతి, విషమం (unevenness), సంపీడనం వద్దనే వద్దు. పునర్భవానికి అడ్డుకట్ట వేసేస్తాను" అని యోనిశ మనసికారం కలిగియుండవలెను. ఇదియే మహారాజా, ఆడచిరుతనుండి గ్రహింపదగు ఒక గుణవిశేషం. మహారాజా, దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఈ విషయంగా సుత్తనిపాతం ధనియగోపాలకసుత్తంలో ఇలా చెప్పియున్నాడు:

**ఉసభోరివ ఛేత్వ బంధనాని నాగో పూతిలతంవ దాలయిత్వా**
**నాహం పునుపేస్సం గబ్భసేయ్యం అథ చే పత్థయసీ పవస్స దేవ**

వృషభం బంధనాలను త్రెంచుకొని పోవునట్లుగా, ఏనుగు కట్టుత్రాళ్ళను ఛిన్నాభిన్నం చేసుకొని పోవునట్లుగా నేను క్లేశబంధనాలను త్రెంచివేసినాను. మళ్ళీ గర్భశయనం నాకు లేదు. పర్జన్యుడా, వర్షించదలచినచో నీవు వర్షము కురిపించుము.

## 5. మగచిరుతపులి

**మి:** భంతే నాగసేనా, మగచిరుత గుణాలు రెండు గ్రహించవలసియున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** తృణగహనంలోగానీ వనగహనంలోగానీ పర్వతగహనంలోగానీ పొంచియుండి మగచిరుత వన్యమృగాలను వేటాడి పట్టుకొంటుంది. అలాగే యోగాభ్యాసకుడు ఏకాంతవాసం చేయవలెను. అరణ్యం, వృక్షమూలం, పర్వతం, కందరం, గుహ, శ్మశానం, పొద, నిర్జనబయలు ప్రదేశం, గడ్డివామి మొదలగు నిశ్శబ్ద ప్రదేశాల్లో నిర్జనప్రదేశాల్లో జనుల కంటపడని ప్రదేశాల్లో ధ్యానానికి అనుకూలమైన ఏకాంత ప్రదేశాల్లో యోగాభ్యాసకుడు సాధన చేస్తుంటే త్వరలోనే ఆరు అభిజ్ఞలు* (super knowledges) స్వంతం చేసుకొనగలుగుతాడు. ఇదియే మగచిరుతనుండి గ్రహించదగు మొదటి గుణం. మహారాజా, ఈ విషయంగానే ధమ్మసంగీతికారులైన స్థవిరులు ఇలా చెప్పియున్నారు:

**యథాపి దీపికో నామ నిలీయత్వా గణ్హతే మిగే**
**తథేవాయం బుద్ధపుత్తో యుత్తయోగో విపస్సకో**
**అరఞ్ఞం పవిసిత్వాన గణ్హాతి ఫలముత్తమం**

మగచిరుత ఎలా పొంచియుండి వన్యమృగాలను వెంటాడి పట్టుకొంటుందో అలాగే సాధనతత్పరుడూ విపశ్యకుడూ అయిన బుద్ధపుత్రుడు అరణ్యం ప్రవేశించి ధ్యానం ద్వారా ఉత్తమ ఫలములైన శ్రామణ్య ఫలాలను పొందుతాడు.

మరియూ మహారాజా, మగచిరుత ఏదేని జంతువును వేటాడి చంపినపుడు అది మగచిరుతకు ఎడమ వైపుగా పడితే దానిని అది భక్షించదు. అలాగే యోగాభ్యాసకుడైన భిక్షువు బుద్ధభగవానుడు నిందనీయములుగా పేర్కొనిన క్రింది మిథ్యాజీవికలను విడిచిపెట్టవలెను. వెదురుకర్రదానం, పత్రదానం, పుష్పదానం, ఫలదానం, స్నానదానం, మృత్తికాదానం, చూర్ణదానం, పల్ముదోముపుల్లల దానం, ముఖప్రక్షాళనకు నీటిదానం, ముఖస్తుతి మాటలు, ముగ్గసూప్యతా పలుకులు (bean-soupery), బిడ్డలను ఎత్తుకొని లాలించే మాటలు, వార్తలు చేరవేసేందుకు చేసే కాలినడక ప్రయాణం, వైద్యకర్మ, దూతకర్మ, రాయబారం, భిక్షాభోజనదానం, చిన్నదానం ఇచ్చి బదులుకు పెద్దదానం రాబట్టుకోవడం, వాస్తువిద్య, నక్షత్రవిద్య (జ్యోతిష్యం), శరీర లక్షణాల విద్య – ఇలాంటి కిటుకుల ద్వారా సంపాయించే జీవిక నిందనీయమైన జీవిక. ఇటువంటి మిథ్యాజీవికలను భిక్షువు విడిచిపెట్ట వలెను. ఇదియే మహారాజా, మగచిరుతనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

---

* *చూడుడు 217 వ పుట.*

మహారాజా, ఈ విషయంగా* ధమ్మసేనాపతి సారిపుత్రుడు కూడా ఇలా పలికియున్నాడు:

**వచీవిఞ్ఞత్తివిప్ఫారా ఉప్పన్నం మధుపాయసం**
**సచే భుత్తో భవేయ్యాహం సాజీవో గరహితో మమ**
**యది పి మే అంతగుణం నిక్ఖమిత్వా బహీ చరే**
**నేవ భిందేయ్యమాజీవం చజమానోపి జీవితం**

వచీవిజ్ఞప్తి (verbal hinting) ద్వారా లభించిన ఈ మధుపాయసాన్ని నేను భుజించినచో నా జీవిక నిందనీయం అవుతుంది. నా ప్రేగులు వెలుపలికి వచ్చి వేలాడడానికైనా సమ్మతిస్తానుగానీ ప్రాణం పోయినా సరే సమ్యక్ఆజీవ నియమాన్ని నేను ఉల్లంఘించను.

## 6. కూర్మము

**మి:** భంతే నాగసేనా, తాబేలు గుణాలు ఐదింటిని యోగాభ్యాసకుడు గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణాలు?

**నా:** మహారాజా, కూర్మం జలాన్ని తన వాసస్థానంగా చేసుకొనియుంటుంది. పై దిక్కులో క్రింది దిక్కులో తూర్పు పడమర దక్షిణం ఉత్తర దిక్కుల్లో ఈశాన్యం నైరుతి వాయువ్యం ఆగ్నేయం దిశల్లో మొత్తం దశదిశల్లో అది జలం చేత పరివేష్టింపబడియుంటుంది. అలాగే యోగాభ్యాసకుడు కూడా దశదిశలకు సదా మైత్రీభావనను** ప్రసరింపజేస్తూ ఉండవలెను. సర్వప్రాణుల ఎడల హితాశయాన్ని దయను మైత్రిని ప్రసరింపజేయవలెను. విపులమైన ఉదాత్తమైన అపరిమితమైన మైత్రీభావనను సర్వలోకం దశదిశలకు ప్రసరింపజేస్తూ ఉండవలెను. ఎవరి పట్ల కూడా ద్వేషబుద్ధి వైరబుద్ధి లేని నిర్మలచిత్తంతో మైత్రీభావనను ప్రసరింపజేస్తూ ఉండవలెను. మహారాజా, కూర్మమునుండి యోగాభ్యాసకుడు గ్రహించవలసిన మొదటి గుణం ఇదియే.

మరియూ మహారాజా, కూర్మము నీటిలో ఈదుతూ శిరస్సును పైకి సాచి ఎవరినైననూ చూసిన క్షణంలోనే "ఇతడు నన్ను మళ్ళీ చూడరాదు" అనుకొని తటాలున మునకవేసి నీటి లోతులకు వెళ్ళిపోతుంది. అలాగే యోగావచరుడు కూడా తన చిత్తంలో

---

* *ఈ వృత్తాంతం శీలం పుస్తకంలో చూడగలరు.*

** *చూడుడు శీలం పుస్తకం.*

క్లేశములు తలెత్తడం గమనించిన క్షణంలోనే “ఈ క్లేశాలను అణగద్రొక్కాలి. మళ్ళీ ఇవి తలెత్తకుండా జాగ్రత్త పడాలి” అనుకొని ఆరమ్మణం (ధ్యానానికి ఆలంబనంగా దేనిని గైకొనడం జరిగిందో దానికి ఆరమ్మణం అని పేరు. ఇంగ్లీషులో meditation subject) మీదికి చిత్తాన్ని మళ్ళించి ఆరమ్మణంలో చిత్తాన్ని మునకవేయించుకోవాలి. మహారాజా, ఇదియే కూర్మంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, కూర్మం చలికాచుకొనేందుకు నీటినుండి బయటకు వచ్చి సూర్యతాపంలో చలికాచుకొంటుంది. అలాగే యోగావచరుడు కూడా తన శరీరం ఏ భంగిమలో ఉన్నప్పటికీ – నిలుచున్నా కూర్చొన్నా నడుస్తున్నా పరున్నా కూడా మనస్సును బాహ్యవిషయచింతనలనుండి మరలించి సమ్యక్ వ్యాయామం (right effort) అనే వేడిని సదా రగిలించుకొనుచుండవలెను. ఇదియే మహారాజా, కూర్మంనుండి గైకొనవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, కూర్మం భూమి మీద నివసించదలచినపుడు భూమిని త్రవ్వుకొని నివాసం ఏర్పాటు చేసుకొని అందులో ఏకాంతంగా నివసిస్తుంది.

అలాగే యోగావచరుడు కూడా లాభ సత్కార యశస్సుల మీద అపేక్షను వదలించుకొని జనశూన్యమైన నిశ్శబ్దమైన ఏకాంతమైన అటవీ ప్రదేశంలోగానీ పర్వతప్రదేశంలోగానీ కొండగుహలోగానీ ఏకాంతవాసాన్ని ఏర్పాటు చేసుకొని సాధననిమగ్నుడు కావలెను. ఇదియే మహారాజా, కూర్మమునుండి గ్రహించవలసిన నాలుగవ గుణం. ఈ విషయమై వంగంతపుత్ర ఉపసేనస్థవిరుడు ఇలా చెప్పియున్నాడు:

**వివిత్తం అప్పనిగ్ఘోసం వాళమిగనిసేవితం**
**సేవే సేనాసనం భిక్ఖు పటిసల్లానకారణా**

నిశ్శబ్దమైన నిర్జనమైన అరణ్యప్రదేశములో వన్యమృగములు నడయాడు ప్రదేశములో ధ్యానము కొరకు భిక్షువు వాసము చేయవలెను.

మరియూ మహారాజా, కూర్మం భూమి మీద సంచారం చేస్తున్నప్పుడు దేన్నైనా చూసినా వినినా తక్షణమే శిరస్సుతో బాటు నాలుగు పాదాలను చిప్పలోనికి చొప్పించుకొని దేహాన్ని రక్షించుకొంటూ నిర్వ్యాపారంగా మౌనంగా ఉండిపోతుంది. అలాగే యోగావచరుడు కూడా రూపములు, శబ్దములు, గంధములు, రసములు, స్ప్రష్టవ్యములు, ధమ్మములు (metal objects) – వీటి తాకిడి కలిగిన సందర్భములలో

ఆరు ద్వారములయందు సంవర కవాటములు* తెరచుకోనీయకుండా మనస్సును జాగరూకం చేసుకొని సతి సంప్రజన్యములతో (mindfulness and awareness) శ్రమణధర్మాన్ని కాపాడుకొంటుండవలెను. ఇదియే మహారాజా, కూర్మంనుండి గైకొనవలసిన ఐదవ గుణం. ఈ విషయమై దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్తనికాయంలోని కుమ్మూపమసుత్తంలో ఇలా పలికియున్నాడు:

**కుమ్మోవ అంగాని సకే కపాలే సమోదహం భిక్ఖు మనోవితక్కే**
**అనిస్సితో అఞ్ఞమహేఠయానో పరినిబ్బుతోనూపవదేయ్య కంచి**

కూర్మం ఎలా తన అంగములను చిప్పలోనికి చొప్పించుకొంటుందో అలాగే భిక్షువు కూడా బహిర్ముఖంగా ఉన్నట్టి మనస్సును మరియూ వితర్కాలను (thoughts) అంతర్ముఖం చేసుకొని ఇతరుల మీద ఆధారపడకుండా ఇతరులను నొప్పించకుండా ఇతరులను నిందించకుండా ఉంటూ తనలోని క్లేశజ్వాలలను చల్లార్చివేసుకొనువాడుగా ఉండవలెను.

## 7. వెదురు (bamboo)

**మి:** భంతే నాగసేనా, వెదురునుండి ఒక గుణాన్ని యోగావచరుడు గ్రహించవలసి యున్నదని మీరు చెబుతుంటారు? ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, గాలి ఏ దిశగా వీస్తున్నదో ఆ దిశగా వెదురు మొగ్గడం చేస్తుంది. గాలికి అనుగుణంగానే నడుచుకొంటుంది. వేరేవిధంగా నడుచుకొనదు. అలాగే యోగావచరుడు కూడా బుద్ధభగవానుడు భాషించిన నవాంగశాసనానికి** అనుగుణంగా

---

** సంవరం అంటే ప్రవేశద్వారానికి తలుపు వేసి మూసివేయడం అని అర్థం. మరో విధంగా చెప్పాలంటే సంవరం ఒక కంచె (fencing) లాంటిది. చేనిలో ఎదుగుచున్న మొక్కలను ఆవులు మేకలు దూరి తినివేయకుండా కాపాడేందుకు రైతు కంచె వేసుకొంటాడు. అడవికి కంచె అవసరం ఉండదు! సాధారణజనులకు సంవరం (restraint) అవసరమే. ధ్యానాల్లో ప్రవేశం పొందిన ధ్యానులకు వారి ధ్యానాలే స్వరసమైన (spontaneous) సంవరాన్నీ సాధించిపెట్తాయి. దీనికి ధ్యానసంవరం అని పేరు. అలాగే సత్యసాక్షాత్కారం పొందిన జ్ఞానులకు ఆ సాక్షాత్కారమే స్వరసమైన సంవరాన్ని సాధించిపెట్తుంది. దీనికి అనాస్రవ (pure) సంవరం అని పేరు. పై రెండు సంవరాలు లేని సాధారణజనులు యత్నపూర్వకంగా (effort) మనోవాక్కాయ కర్మలను సరియైన మార్గంలో నడిపించుకోవడం నియంత్రించుకోవడం అదుపు చేసుకోవడం అనేది శీలసంవరం అనబడుతుంది.*

*** 1. సుత్త, 2.గేయ్య, 3.వేయ్యాకరణ, 4. గాథ, 5. ఉదాన, 6. ఇతివుత్తక, 7.జాతక, 8. అబ్భుతధమ్మ, 9 వేదల్ల. చూడుడు 96 వ పుట.*

నడతను మలచుకొని మర్యాద (limits) మీరనివాడుగా, ఇతరులు వేలెత్తిచూపనివాడుగా ఉంటూ శ్రమణధర్మాన్ని (నిర్వాణాన్ని) అన్వేషించువాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, వెదురునుండి గ్రహించవలసిన గుణం. ఈ విషయంగా రాహులస్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**నవంగం బుద్ధవచనం అనులోమేత్వాన సబ్బదా**
**కప్పియే అనవజ్జస్మిం ఠత్వాపాయం సముత్తరి**

నవాంగ సమన్వితమైన బుద్ధవచనాన్ని సదా అనుసరిస్తూ యోగ్యమైన నిర్దోషమైన ఆచరణ కలిగినవారు దుఃఖాన్ని అధిగమిస్తారు.

## 8. విల్లు

**మి:** భంతే నాగసేనా, విల్లు గుణాన్ని ఒక దాన్ని యోగావచరుడు గ్రహించవలసి యున్నదని మీరు చెబుతుంటారు? ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, చక్కగా నిర్మితమైన విల్లు బాణప్రయోగసమయంలో పై భాగమూ క్రిందిభాగమూ సమంగా వంగుతుంది. బిర్రబిగుసుకొనియుండదు. అలాగే యోగావచరుడు కూడా పెద్దల ఎడల పిన్నల ఎడల సమవయస్కుల ఎడల సమానమైన ఒదుగుదల (నమ్రత) చూపవలెను. ఎవరి ఎడలనూ ధిక్కారధోరణి ప్రదర్శించరాదు. ఇదియే విల్లునుండి గ్రహించవలసిన ఒక గుణం. మహారాజా, ఈ విషయాన్ని దేవాతిదేవుడైన భగవానుడు కూడా విధుజాతకంలో ఇలా చెప్పియున్నాడు:

**చాపోవూనుదరో ధీరో వంసోవాపి పకంపయే**
**పటిలోమం న వత్తేయ్య స రాజవసతిం వసే**

విల్లు వంగినవిధంగా వెదురు వంగినవిధంగా నమ్రత కలిగి ఎవరినీ విరోధం చేసుకొనని బుద్ధిమంతుడు రాజరికం నెరపువాడుగా ఎదుగుతాడు.

## 9. వాయసం (కాకి)

**మి:** భంతే నాగసేనా, వాయసం గుణాలను రెండింటిని గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణాలు?

**నా:** మహారాజా, ముప్పు ఏ క్షణంలోనైనా ఏ దిక్కునుండైనా కలుగుతుందేమో అనే శంకతో అనుమానంతో వాయసం బహుజాగరూకంగా సంచరిస్తుంది. అలాగే యోగాభ్యాసం చేసేవాడు కూడా పతనానికి దారితీసే పరిస్థితులు ఎక్కడ ఏ మూల పొంచియున్నాయో అనే శంకతో అనుమానంతో బహుజాగరూకంగా ఉంటూ సతిని

(mindfulness) సర్వసన్నద్ధంగా ఉంచుకొంటూ ఇంద్రియ ద్వారాలను అదుపులో ఉంచుకొంటూ మెలగవలెను. ఇదియే మహారాజా, వాయసంనుండి గైకొనదగిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ఏ కొంచెం భోజనం లభించినా వాయసం తానే తినివేయదు. తన వాళ్ళను "కా కా" అని పేరు పేరున పిలిచి ఆహ్వానించి వారితో బాటుగా దాన్ని పంచుకొని తింటుంది. అలాగే యోగావచరుడు కూడా ధార్మికంగా తనకు లభించినదానిని భిక్షాపాత్రలో ఇమిడిపోయేంత స్వల్పలాభంగా అది ఉండినప్పటికీ శీలవంతులైన సహ బ్రహ్మచారులతో దానిని పంచుకొన వలెను. ఇదియే మహారాజా, వాయసంనుండి గ్రహించవలసిన రెండవ గుణం. ఈ విషయాన్ని ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా చెప్పియున్నాడు:

**సచే మే ఉపనామేంతి యథాలద్ధం తపస్సినో**
**సబ్బే సంవిభజిత్వాన* తతో భుంజామి భోజనం**

భిక్షగా నాకు లభించినదాన్ని మొత్తాన్ని విభజించి ఇతరులతో పంచుకొని భుజిస్తాను.

## 10. మర్కటం(కోతి)

**మి:** భంతే నాగసేనా, కోతి గుణాలను రెండింటిని గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణాలు?

**నా:** మహారాజా, మర్కటం తన వాసస్థానంగా మహావృక్షంలో శాఖోపశాఖలతో ఆచ్ఛాదితమైన చోటును ఏ భయమూ లేని భద్రమైన చోటును చూసుకొంటుంది. అలాగే

---

* సంవిభాగం (sharing) అనే దొడ్డగుణం కాకుల్లో కనిపిస్తుంది. సంవిభాగానికి ఒప్పుకొనని సమ్మతించని అంగీకరించని ఆమోదించని సంకుచిత మనస్తత్వానికి మాత్సర్యం అని పేరు. ఇది అనేక రకాలు. ఆవాసమాత్సర్యం, కులమాత్సర్యం, లాభమాత్సర్యం, వర్ణమాత్సర్యం, ధర్మమాత్సర్యం– ఇలా అనేక విధాలు. మాత్సర్యానికి ప్రతిపక్షమైన చిత్తవిశేషానికి దానం అని పేరు. దీని ప్రేరణతో జరిగే ఆయా సంతర్పణలకు కూడా దానం అనే పేరే వాడుకలో ఉన్నది. అన్నదానం, రక్తదానం, శ్రమదానం, గోదానం, భూదానం, విద్యాదానం– ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు. కానీ విద్యాదానం, శ్రమదానం అనేవి దానాలుగా పరిగణించడానికి వీలుపడదేమో! ఇవ్వబడేది వస్తువుగా ఉండాలి అంటే వర్ణ గంధ రస స్పర్శలతో కూడిన వస్తువైయుండాలి (some thing గా ఉండాలి). కనుక విద్యాదానం, శ్రమదానం పదాలు అవిచారితంగా వాడుకలోకి వచ్చిన పదాలు కావచ్చు. సహాయపడడం, సహకరించడం, తోడ్పడడం అనే అర్థాన్ని కలిగిన పదాలుగా వీటిని తీసుకొనవచ్చు.

యోగావచరుడు కూడా లజ్జావంతుడైన, శీలవంతుడైన, కల్యాణధర్ముడైన, బహుశ్రుతుడైన, ధమ్మధరుడైన, వినయధరుడైన, జనప్రియుడైన, గౌరవనీయుడైన, మంచివక్తయైన, మందలింపు మాటలను కూడా సున్నితంగా మృదువుగా పలుకువాడైన, జటిల విషయాలను కూడా తేటతెల్లం చేసి చెప్పగలవాడైన, అధ్యాత్మమార్గాన్ని చక్కగా చూపగలవాడైన, సాధనపట్ల ఉత్సాహాన్ని ప్రేరేపణను ఇవ్వగలవాడైన కల్యాణమిత్రుణ్ణి (spiritual guide) ఆచార్యుడుగా ఆశ్రయించి యుండవలెను. మహారాజా, ఇదియే మర్కటంనుండి గ్రహించదగిన మొదటి గుణం.

మరియూ మహారాజా, మర్కటం వృక్షమునందే నడయాడుతుంది, వృక్షమునందే నిలుచుంటుంది, కూర్చొంటుంది. నిద్రకు వశమైతే అక్కడే నిద్రిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా అరణ్యంలోనే చరించవలెను. నిలుచోవడం, నడవడం, కూర్చోవడం, పరుండడం కూడా అరణ్యంలోనే చేయవలెను. అక్కడే సతిపట్ఠానమును అనుభవానికి తెచ్చుకొనవలెను. ఇదియే మర్కటంనుండి గ్రహించదగు రెండవ గుణం. మహారాజా, ఈ విషయంగా ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా చెప్పియున్నాడు:

**చంకమంతోపి తిట్ఠంతో నిసజ్జసయనేన వా**
**పవనే సోభతే భిక్ఖు పవనంతంవ వణ్ణితం**

నడవడం నిలువడం కూర్చోవడం పరుండడం అనే ఈర్యాపథములు (bodily postures) ఏ భిక్షువు అడవిలోనే* ప్రవర్తింపజేస్తాడో అతడు వనశోభవలె శోభిస్తాడు.

## 11. లాబులత (సొరతీగె)

**మి:** భంతే నాగసేనా, సొరతీగె గుణం ఒకటి గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

---

** పదమూడు ధుతాంగములలో (ascetic practices) అరణ్యావాసం ఒకటి. ఇక్కడ అరణ్యం అంటే పులులు, సింహాలు తిరుగాడే కీకారణ్యం కాదు. ఆ దినాల్లో ఊరిఎల్లకు ఆవలి ప్రదేశాన్ని అడవి అనేవాళ్ళు. ఊరిఎల్లను ఎలా నిర్ణయించాలి? ఊరి చివరి ఇంటినుండి ఐదువందల ధనుస్సుల దూరం వరకు గ్రామం ఎల్ల, ఆవలది అడవి అని ఒక నిర్ణయం. లేదా ఊరి చివరి ఇంటి వద్ద నిలబడి బలమైన వ్యక్తి చిన్న గులకరాయిని విసిరివేస్తే అది ఎక్కడ పడుతుందో అక్కడివరకు గ్రామ పరిధిగానూ ఆ పరిధివద్ద నిలబడి మళ్లీ రాయి విసిరితే అది ఎక్కడ పడుతుందో అది గ్రామఎల్ల అని, ఆ ఎల్లకు అవతలది అరణ్యం అని మరొక నిర్ణయం. సారాంశం ఏమిటంటే సాధకుడు జనావాసాల్లో కాకుండా కాస్త దూరంగా విడిగా ఏకాంతంగా నివసిస్తూ సాధనపథంలో పురోగమించవలెను అని.*

**నా:** మహారాజా, సొరతీగె గడ్డినిగానీ కర్రనుగానీ మరో లతనుగానీ తన కాడలతో పట్టుకొని వాటి మీద ఎదుగుతుంది. అలాగే అర్హత్వస్థాయికి ఎదగదలచిన యోగాభ్యాసకుడు చిత్తాన్ని ఆరమ్మణం మీద (meditation subject) లగ్నం చేసి అర్హత్వస్థాయికి ఎదిగే యత్నం చేయవలెను. ఇదియే మహారాజా, లాబులతనుండి గ్రహించవలసిన ఒక గుణం. ఈ విషయంగా ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**యథా లాబులతా నామ తిణే కట్ఠే లతాయ వా**
**ఆలంబిత్వా సోండికాహి తతో వడ్డతి ఉప్పరి**
**తథేవ బుద్ధపుత్తేన అరహత్తఫలకామినా**
**ఆరమ్మణం ఆలంబిత్వా వడ్డితబ్బం అసేక్ఖఫలే**

గడ్డిని లేదా కర్రను లేదా మరో లతను కాడలతో పట్టుకొని తనకు ఆధారంగా చేసుకొని వాటి మీద లాబులత ఎదుగుతుంది. అలాగే అర్హత్వఫలాన్ని కాంక్షించే బుద్ధపుత్రుడు కూడా ఆరమ్మణాన్ని ఆసరాగా చేసుకొని అర్హత్వఫలాన్ని అందుకొనేవిధంగా చిత్తాన్ని వృద్ధి చేసుకొనవలెను.

## 12. పద్మం

**మి:** భంతే నాగసేనా, తామరపుష్పం గుణాలను మూడింటిని గ్రహించవలసి యున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణాలు?

**నా:** మహారాజా, తామరపుష్పం నీటిలో ఉద్భవిస్తుంది, నీటితో ముడివడి యుంటుంది అయినప్పటికీ నీటి అంటు తనకు అంటుకోనీయదు. అలాగే యోగాభ్యాసకుడు కూడా కులానికి, శిష్యవర్గానికి, లాభాలకు, కీర్తికి, సత్కారాలకు, గౌరవాలకు, భోగ్యవస్తువులకు ఏ విధంగానూ అంటుకొనిపోరాదు. ఇదియే మహారాజా, పద్మంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, పద్మం నీటి ఉపరితలం చీల్చుకొని బయటకు వచ్చి పైననే ఉంటుంది. అలాగే యోగాభ్యాసకుడు కూడా సర్వలోకాలపట్ల (కామధాతు, రూపధాతు, అరూపధాతు లోకాలు) అపేక్షలను అణచివేసి లోకోత్తరధర్మమైన నిర్వాణమునందే మనస్సును నిలుపవలెను. ఇదియే మహారాజా, పద్మంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, మెలమెల్లగా వీచే గాలికి కూడా పద్మం చలించిపోతుంది. అలాగే యోగాభ్యాసకుడు కూడా స్వల్పస్వల్పంగా చిత్తంలో తలెత్తిన క్లేశాల పట్ల కూడా భయంతో చలించిపోయి తక్షణమే సంయమం (restraint) దిశగా యత్నపరుడు కావలెను. ఇదియే మహారాజా, పద్మంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. ఈ విషయంగానే దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా చెప్పియున్నాడు: "చిన్న చిన్న తప్పిదాల పట్ల కూడా భయాన్ని చూసెడువాడుగా ఉంటూ శిక్షాపదములను (rules of training) ఏమరక పాటించువాడుగా ఉంటాడు."

## 13. విత్తనం

**మి:** భంతే నాగసేనా, విత్తనం గుణాలను రెండింటిని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. అవి ఏవి?

**నా:** మహారాజా, విత్తనం చిన్నదైనా సారవంతమైన క్షేత్రంలో చల్లినపుడు ఆపైన మేఘుడు బాగుగా వర్షించినపుడు అది గొప్పగా దిగుబడిని ఇస్తుంది. అలాగే యోగావచరుడు శీలం అనే చిన్నపెట్టుబడితో అప్రమేయమైన (immeasurable) శ్రామణ్యఫలాన్ని (spiritual fruit) పొందుతాడు. ఇదియే మహారాజా, విత్తనంనుండి గ్రైకొనవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, చక్కగా తీర్చిన పొలంలో విత్తనం చల్లితే అది త్వరితంగా మొలకెత్తి వృద్ధి చెందుతుంది. అలాగే యోగావచరుడు కూడా మనస్సును చక్కదిద్దుకొని ఏకాంతప్రదేశంలో ధ్యానాభ్యాసం ద్వారా పరిశుద్ధం కావించుకొని దానిని సతిపట్ఠానక్షేత్రంలో చొప్పించగలిగితే అది మహద్గత (exalted) చిత్తంగా వికాసం చెందుతుంది. ఇదియే మహారాజా, విత్తనంనుండి గ్రహించవలసిన రెండవ గుణం. అనురుద్ధ స్థవిరుడు కూడా ఇదే విషయాన్ని ఇలా చెప్పియున్నాడు:

**యథాపి ఖేత్తే పరిసుద్ధం బీజంచస్స పతిట్ఠితం**
**విపులం తస్స ఫలం హోతి అపి తోసేతి కస్సకం**
**తథేవ యోగినో చిత్తం సుఞ్ఞాగారే విసోధితం**
**సతిపట్ఠానఖేత్తమ్హి ఖిప్పమేవ విరూహతి**

చక్కగా తీర్చిదిద్దిన పొలంలో చల్లిన విత్తనం ఎక్కువ దిగుబడిని ఇచ్చి రైతుకు సంతుష్టిని ఎలా కలిగిస్తుందో అలానే ఏకాంత ప్రదేశంలో శుద్ధి పొందిన యోగి చిత్తాన్ని సతిపట్ఠాన* క్షేత్రంలో చొప్పించితే అది త్వరితంగా వికసిస్తుంది.

## 14. సాలకల్యాణిక (beautiful sal- tree)

**మి:** భంతే నాగసేనా, సాలకల్యాణికనుండి ఒక గుణాన్ని గ్రహించవలసి యున్నదిగా మీరు చెబుతారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, సాలవృక్షం ఇతరుల కంటపడనివిధంగా భూమి లోపల నూరు మూరల లోతు ఇంకా ఎక్కువ లోతుకు వృద్ధి చెందుతుంది. అలాగే యోగాభ్యాసకుడు కూడా ఇతరుల దృష్టిలో పడకుండా నిర్జనమైన ఏకాంత ప్రదేశంలో సాధన చేస్తూ నాలుగు శ్రామణ్యఫలాలను, నాలుగు ప్రతిసంవిత్తులను, ఆరు అభిజ్ఞలను** – ఈ

---

** సతిపట్ఠానాన్ని ఈ పుస్తకం అనేకసార్లు ప్రస్తావించియున్నది. ఇది ఒక విశిష్టమైన అధ్యాత్మిక అభ్యాసానికి పెట్టిన పేరు. అనిత్యమును నిత్యంగా, దుఃఖాన్ని సుఖంగా, అశుచిని శుచిగా, అనాత్మను ఆత్మగా భ్రమించడాన్ని విపర్యాసలు(mis-perceptions) అంటారు. ఈ విపర్యాసల రుగ్మతకు విరుగుడు సతిపట్ఠాన అభ్యాసం. సతిపట్ఠాన అభ్యాసానికి ఆలంబనములు స్వీయ స్కంధములే (body-mind complex). ఈ ఆలంబనములను అనుసరించి సతిపట్ఠాన అభ్యాసం కూడా నాలుగు విధాలుగా ఉంటుంది. 1. కాయానుపశ్యన (శుచివిపర్యాసకు ప్రతిపక్షం), 2. వేదానానుపశ్యన (సుఖవిపర్యాసకు ప్రతిపక్షం), 3. చిత్తానుపశ్యన (నిత్యవిపర్యాసకు ప్రతిపక్షం), 4. ధర్మానుపశ్యన (ఆత్మవిపర్యాసకు ప్రతిపక్షం). సతిపట్ఠాన అభ్యాసంలో పురోగతి సాధిస్తే అది విపశ్యన (insight = ప్రజ్ఞ) అవుతుంది. సతిపట్ఠానానికి కుశలమూలములు (roots of good) అని కూడా పేరు.*

*** శ్రామణ్యఫలాలు, ప్రతిసంవిత్తులు, అభిజ్ఞలు– ఈ మూడు పదాల సారాంశం ఇక్కడ ఏమిటంటే అధ్యాత్మిక అనుభవాలను గడించమని చెప్పడమే. స్రోతాపత్తిఫలం, సకృదాగామిఫలం, అనాగామిఫలం, అర్హత్వఫలం అని నాలుగు శ్రామణ్యఫలాలు. ఈ ఫలాలు అనేవి బంధనాలను త్రెంచుకొనేరూపంగా బరువును దించుకొనే రూపంగా ఉంటాయి. విస్తర వివరణకు ఇది సమయం కాదు. అధ్యాత్మిక విషయాలను ఇతరులకు తెలియజెప్పేందుకు అవసరమైన వక్తృత్వ కౌశలాలకు ప్రతిసంవిత్తులు అని పేరు. అనుభవం గడించినవానికి ఆ అనుభవమే ఈ కౌశలాలను సిద్ధింపజేస్తాయి. అనుభవం గడించనివాళ్ళు త్రిపిటకాలను పాళీభాషలో అధ్యయనం చేస్తే పరోక్షరూపమైన ప్రతిసంవిత్తులు పొందవచ్చు. అతీంద్రియజ్ఞానాలకు అభిజ్ఞలు అని పేరు. ఇవి ఆరు. 1. ఇద్ధివిధములు (అద్భుతశక్తులు), 2. దివ్యశ్రోతం, 3. పరచిత్తజ్ఞానం, 4. పూర్వనివాసానుస్మృతిజ్ఞానం, 5. చ్యుత్యుపపత్తిజ్ఞానం (దివ్యదృష్టి), 6. ఆస్రవక్షయజ్ఞానం. "నాలో ఆసవాలు క్షయించిపోయాయి. అవి ఇక ఎన్నటికీ నాలో తలెత్తవు" అనే అనుభవరూపం చివరిది. ఇదియే కావలసింది.*

మొత్తం శ్రమణధర్మాన్ని సాధించుకొనవలెను. మహారాజా, ఈ విషయాన్ని రాహుల స్థవిరుడు కూడా ఇలా చెప్పియున్నాడు:

**సాలకల్యాణికా నామ పాదపో ధరణీరుహో**
**అంతో పథవియం యేవ సతహత్థోపి వడ్డతి**
**యథా కాలమ్హి సంపత్తే పరిపాకేన సో దుమో**
**ఉగ్గంఛిత్వాన ఏకాహం సతహత్థోపి వడ్డతి**
**ఏవమేవాహం మహావీర సాలకల్యాణికా వియ**
**అబ్భంతరే సుఞ్ఞాగారే ధమ్మతో అభివడ్డయి**

సాలకల్యాణిక ఇతరుల దృష్టిగోచరం కాకుండా భూమి లోపలే వంద మూరల లోతుకు వృద్ధి చెంది కాలం ఆసన్నమైనపుడు భూమిని చీల్చుకొని బయటకు వచ్చి ఇతరుల దృష్టిగోచరంగా వంద మూరల ఎత్తుకు వృద్ధి చెందుతుంది. అలాగే మహావీరా, నేను నిర్జన ఏకాంత ప్రదేశంలో ఎవరి కంటపడకుండా సాధన చేసి ధమ్మశరీరాన్ని వృద్ధి చేసుకొన్నాను.

## 15. నావ

**మి:** భంతే నాగసేనా, నావ గుణాలను మూడింటిని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, బహువిధ దారువుల (చెక్కల) కూర్పు అయినట్టి నావ జనులను ఈ తీరంనుండి ఆవలి తీరానికి దాటిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా సదాచారం, శీలం, గుణసంపత్తి, వ్రతం, నియమం మొదలగు ధమ్మముల కూర్పు సహాయంతో భగసాగరాన్ని దాటవలెను. ఇదియే నావనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, గర్జిస్తూ ఉవ్వెత్తున ఎగసిపడే అలలను మరియూ దేన్నైనా లోనికి లాక్కొనివేసే పెద్ద పెద్ద సుడిగుండాల వేగాన్ని కూడా నావ తట్టుకొన గలుగుతుంది. అలాగే యోగావచరుడు కూడా క్లేశఅలలవేగాన్ని, లాభం, సత్కారం, కీర్తి, ప్రశంస, పూజ, వందనం, నింద, పొగడ్త, సుఖం, దుఃఖం, గౌరవం, అవమానం మొదలగు నానా రకాల అలల వేగాన్ని తట్టుకొని నిలబడవలెను. ఇదియే మహారాజా, నావనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, అపరిమితమూ అనంతమూ అపారమూ అక్షోభ్యమూ గంభీరమూ మహాఘోషమూ తిమితిమింగల మకర మత్స్య గణాలచే ఆకులితమూ

అయిన మహాసముద్రంలో నావ చరిస్తుంటుంది. అలాగే యోగావచరుడు నాలుగు ఆర్యసత్యములయందే* మనస్సును త్రిప్పవలెను. ఇదియే మహారాజా, నావనుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మహారాజా, దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్తనికాయంలోని సచ్చసంయుత్తసుత్తంలో ఇలా చెప్పియున్నాడు: "భిక్షువులారా, మీరు తర్కించాలనుకుంటే (thinking) తర్కాన్ని మీ దేహం మీదికే మళ్ళించి 'ఇది దుఃఖం' అని తర్కించుకొనండి. తృష్ణ మొదలగు మీలోని క్లేశరాశి మీదికి మీ తర్కాన్ని మళ్ళించి 'ఇది దుఃఖసముదయం" అని తర్కించుకొనండి. క్లేశములు అంతరించిపోయిన చిత్తస్థితి ఎలా ఉంటుందో ఊహించుకొని "ఇది దుఃఖ నిరోధం" అని తర్కించుకొనండి. క్లేశనిర్మూలనకు మార్గం ఏమిటి? అని జిజ్ఞాస చేసి అష్టాంగమార్గమే దుఃఖనిరోధగామినీ ప్రతిపత్' అని తర్కించుకొనండి."

## 16. నావాలగ్నకం (anchor = లంగరు)

**మి:** భంతే నాగసేనా, నావాలగ్నకం గుణాలను రెండింటిని గ్రహించ వలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, పెనుగాలుల వేగానికి ఉవ్వెత్తున లేచిన తరంగాలతో అల్లకల్లోలంగా మారిన మహాసముద్రజలంలో నావను లగ్నకం పట్టి ఉంచుతుంది. నిలిపియుంచుతుంది. దిశకాని దిశకు నెట్టివేయబడనీయకుండా నిలిపియుంచుతుంది. అలాగే యోగావచరుడు కూడా రాగవితర్కాలు, ద్వేషవితర్కాలు, మోహవితర్కాలు అనే అలల తాకిడికి ఇటు అటు కొట్టుకపోనీయ కుండా చిత్తాన్ని నిలిపియుంచవలెను. ఇదియే మహారాజా, లగ్నకంనుండి గ్రహించవలసినట్టి మొదటి గుణం.

మరియూ మహారాజా, నావాలగ్నకం నీటి మీదికి తేలిపోదు. నీటిలోనే మునిగియుండి నూరు మూరల లోతు నీటిలోనైనా సరే నావను పట్టియుంచు తుంది,

---

** విపశ్యనా ధ్యానంలో బాగా పురోగతి సాధించినప్పుడు ఎప్పుడో తటాలున దర్శనమార్గంలో ప్రవేశించడం జరిగిపోతుంది. దర్శనమార్గం అనేది ఒక flash (మెరుపు) లాంటిది. ఈ మెరుపులో పదిహేను సోపానాలున్నాయి. మొదటి సోపానం "దుఃఖే ధర్మజ్ఞానక్షాంతి". ఈ సోపానం అధిరోహించిన క్షణంలో ఆ వ్యక్తి పృథక్‌జనావస్థను వదిలించుకొని ఆర్యుడు అవుతాడు. ఇట్టివారికి గోచరించే సత్యాలకు ఆర్యసత్యాలు అని పేరు. వీరు దుఃఖాన్ని సుఖంగా భ్రమించరు, అనిత్యాన్ని నిత్యంగా భ్రమించరు. అనాత్మను ఆత్మగా భ్రమించరు. హీనాన్ని ప్రణీతంగా (excellent) భ్రమించరు.*

నిలిపియుంచుతుంది. అలాగే యోగావచరుడు కూడా లాభ సత్కార కీర్తి గౌరవ వందన పూజన ఆరాధనలకు తేలిపోకూడదు. లాభపరాకాష్ఠలకు కీర్తి పరాకాష్ఠలకు కూడా తేలిపోరాదు. "ఈ బారెడు దేహం నిలిచియుండేందుకు ఏది అవసరము? ఎంత అవసరము?" అనే తెలివిని కలిగియుండాలి. ఇదియే మహారాజా, నావాలగ్నకంనుండి గ్రహించవలసిన రెండవ గుణం. ఈ విషయంగా ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**యథా సముద్దే లగ్గనకం న ప్లవతి విసీదతి**
**తథేవ లాభసక్కారే మా ప్లవథ విసీదథ**

లగ్నకం సముద్రంనీటిలో తేలియాడదు. మునిగియే యుంటుంది. అలాగే నీవున్నూ లాభ సత్కారాలకు* తేలిపోవద్దు. నిరాసక్తతలో మునిగియుండుము.

## 17. కూపము (mast)

**మి:** భంతే నాగసేనా, కూపం (mast) గుణం ఒకదాన్ని గ్రహించవలసి యున్నదని మీరు చెబుతుంటారు? ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, కూపం రజ్జువును, వరత్తమును, లంకారమును (ropes, braces and sails) మోస్తూ ఉంటుంది. అలాగే యోగాభ్యాసకుడు పోవుచున్నపుడు, వస్తున్నప్పుడు, సూటిగా చూస్తున్నప్పుడు, ప్రక్కలకు చూస్తున్నప్పుడు, చేతులు కాళ్లు వంచినపుడు, సాగదీసినపుడు, సంగాటిని (cloak) కప్పుకొన్నప్పుడు, భిక్షాపాత్రను చేతబట్టుకొన్నప్పుడు, చీవరాన్ని ధరించినపుడు, తింటున్నప్పుడు, కూర్చొన్నప్పుడు, పడుకొన్నప్పుడు- ఇలా దేహం ద్వారా ఆయా పనులు జరిపించేటప్పుడు- వాటి పట్ల అప్పటికప్పుడే సతి సంప్రజన్యములు (mindfulness and awareness) కలిగియుంటూ ఎరుక పూర్వకముగా కృత్యములను చేయవలెను. ఇదియే మహారాజా, కూపంనుండి

---

* *లాభం అంటే ద్రవ్యసంపత్తు. అది ధనం కావచ్చు, భూములు కావచ్చు, భవనాలు కావచ్చు, వాహనాలు కావచ్చు, ఇంకా ఇతర నానా విధములైన భోగ్యవస్తువులు కావచ్చు. సత్కారం అంటే ప్రత్యుత్థానం (తనను చూడగానే ఎదుటివాడు గౌరవం చూపిస్తూ లేచి నిలబడడం), వందనం, సాదరఆహ్వానం, పాదపూజ- ఇలా నానా రకాలైన గౌరవ మర్యాదలు. శ్లోకం అంటే పొగడ్తలతో ప్రశంసలతో ముంచివేయడం, ఈ లాభ సత్కార శ్లోకముల కారణంగా కళ్ళు నెత్తికెక్కి లేదా కళ్ళు మూసుకుపోయి గోతుల్లో పడి భ్రష్టులైన కాపురుషులెందరో!*

***ఫలం వే కదలిం హంతి, ఫలం వేళుం ఫలం నళం***
***సక్కారో కాపురిసం హంతి గబ్భో అస్సతరిం యథా***

గ్రహించవలసిన ఒక గుణం. మహారాజా, ఈ విషయాన్ని దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా చెప్పియున్నాడు: "భిక్షువులారా, సతి సంప్రజన్యములను సదా కలిగినవారుగా మీరు మెలగవలెను. ఇదియే నేను మిమ్మల్ని ఆదేశించునది".

## 18. నియామకుడు (navigator = కర్ణధారుడు)

**మి:** నియామకుని మూడు గుణాలు గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, నియామకుడు అది రాత్రిగానీ పగలుగానీ అనుక్షణమూ జాగరూకుడుగా తత్పరుడుగానూ ఉంటూ నావను నడిపిస్తాడు. అలాగే యోగావచరుడు కూడా రాత్రింబవళ్ళు సదా అప్రమత్తుడుగానూ యోనిశ మనసికారం కలిగినవాడుగానూ ఉంటూ చిత్తాన్ని నియమించవలెను. ఇదియే మహారాజా, నియామకునినుండి గ్రహించవలసిన మొదటి గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ధమ్మపదంలో ఇలా భాషించియున్నాడు:

**అప్పమాదరతా హోథ సచిత్తమనురక్ఖథ**
**దుగ్గా ఉద్ధరథత్తానం పంకే సన్నోవ కుంజరో**

అప్రమాదంగా* ఉండడమే ఒక ఇష్టమైన వ్యాపకంగా పెట్టుకొని స్వీయచిత్తములను రక్షించుకొనుడు. బురదలో కూరుకుపోయిన పాదాలను ఏనుగు ఎలా సర్వప్రయత్నంతో బయటకు లాక్కొంటుందో అలానే పాపపంకిలంనుండి మిమ్మల్ని మీరే ఉద్ధరించుకొనుడు.

మరియూ మహారాజా, సముద్రంలోనివి ఏవేవి కల్యాణములో ఏవేవి పాపకములో నియామకుడు చక్కగా తెలిసియుంటాడు. అలాగే యోగావచరుడు కూడా ఏది కుశలం? ఏది అకుశలం? సావద్యం ఏది? నిరవద్యం ఏది? హీనం ఏది? ప్రణీతం ఏది? కృష్ణం ఏది? శుక్లం** ఏది? చక్కగా తెలిసియుండవలెను. ఇదియే మహారాజా, నియామకునినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

---

** చూడుడు 233 వ పుట.*

*** సజ్జనులు ఆమోదించేవి ప్రశంసించేవి సమ్మతించేవి అయిన చిత్తవిశేషములకు కుశలం (wholesome), నిరవద్యం (blameless), శుక్లం (bright), ప్రణీతం (excellent), అని పేర్లు. ఇవన్నీ పర్యాయపదాలుగానే తీసుకొనవచ్చు. సజ్జనులు గర్హించేవి నిందించేవి త్యజించేవి అయినట్టి చిత్తవిశేషములకు అకుశలం, సావద్యం(blameworthy), హీనం(low), కృష్ణం (dark) అని పేర్లు. ఇవి కూడా పర్యాయపదాలే. మొదటివర్గం వల్ల చిత్తం ప్రకాశవంతమవుతుంది. రెండవ వర్గం వల్ల చిత్తం చీకటిగా ఉంటుంది.*

మరియూ మహారాజా, నియామకుడు యంత్రం మీద ముద్ర వేసియుంచుతాడు– మరింకెవరినీ యంత్రాన్ని తాకనీయకుండా ఉంచేందుకు. అలాగే యోగావచరుడు కూడా చిత్తం మీద సంవరం (restraint) అనే ముద్ర వేసియుంచాలి– పాపకమైన అకుశల వితర్కాలు (bad thoughts) తలెత్తనీయ రాదని. ఇదియే మహారాజా, నియామకునినుండి గ్రహించవలసిన మూడవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్తనికాయంలో ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, కామవితర్కాలు (lustful thoughts), వ్యాపాద వితర్కాలు (ద్వేషపూరితమైన ఆలోచనలు), విహింసావితర్కాలు (హింసా సంకల్పాలు)– ఈ అకుశల వితర్కాలను చిత్తంలో తలెత్తనీయకండి."

## 19. కర్మకారుడు (worker)

**మి:** భంతే నాగసేనా, నావాకార్మికుని ఒక గుణం గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, కర్మకారుడు ఇలా చింతన చేస్తాడు: "నావలో పనికి చేరినవాణ్ణి. నావలో పనిచేస్తూ జీతం పొందుచున్నవాణ్ణి. కనుక నేను నా బాధ్యతలో ఏమరుపాటుకు అశ్రద్ధకు ఉదాసీనతకు లోను కారాదు. బాధ్యతగా జాగ్రత్తగా ఒళ్ళు దాచుకోకుండా కష్టపడి పనిచేయవలెను" అని. అలాగే యోగావచరుడు కూడా ఇలా చింతన చేయవలెను: "నా యీ దేహం నాలుగు మహాభూతముల సమ్మేళనంచే ఏర్పడినట్టిది కనుక సదా అప్రమత్తతతోనూ సతిసంప్రజన్యముల తోనూ ఏకాగ్రచిత్తంతోనూ దుఃఖవిముక్తి కోసం ఉద్యమిస్తాను. జాతి జరా వ్యాధి మరణ శోక పరిదేవ దుఃఖ దౌర్మనస్య ఉపాయాసములనుండి విముక్తుడ నవుతాను" అని అప్రమాదవర్తనుడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, కర్మకారుడినుండి గ్రహింపవలసిన ఒక గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**కాయం ఇమం సమ్మసథ పరిజానాథ పునప్పునం**
**కాయే సభావం దిస్వాన దుక్ఖస్సంతం కరిస్సథ**

నీ కాయాన్ని బాగా అర్థం చేసుకొనుము. దీని వాస్తవం ఏమిటో మళ్ళీ మళ్ళీ బాగా తెలుసుకొనుము. కాయం యొక్క స్వభావం* తెలుసుకొన్నావంటే దుఃఖానికి ముగింపు పెట్టినవాడవవుతావు.

---

* *అనిత్యత, దుఃఖత, అనాత్మత, శూన్యత – ఇదియే కాయస్వభావం.*

## 20. సముద్రం

**మి:** భంతే నాగసేనా, సముద్రం గుణాలను ఐదింటిని గ్రహించవలసియున్నవిగా మీరు చెబుతారు. ఏవి ఆ ఐదు గుణాలు?

**నా:** మహారాజా, సముద్రం తనలో మృతశరీరం ఉండడాన్ని సహించదు. తీరానికి నెట్టివేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా రాగం, ద్వేషం మోహం, మానం, దిట్ఠి (false views), మ్రక్షం (hypocrisy), ప్రదాశం (మాటల ద్వారా హింసించే నైజం), ఈర్ష్య, మాత్సర్యం (పిసినారితనం), మాయ, శాఠ్యం*, కుటిలత, రూక్షత, దుశ్చరితం ఇత్యాది క్లేశమలములను చిత్తంలో ఉంచుకొనరాదు. ఇదియే మహారాజా, సముద్రంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ముత్యాలు, మణులు, వైడూర్యములు, శంఖశిలలు, ప్రవాళములు, స్ఫటికములు ఇత్యాది నానావిధ రత్నసమూహం తనలో ఉన్నప్పటికీ సముద్రం వాటిని ప్రదర్శించుకొనదు. మరుగుపరచియుంచుతుంది. అలాగే యోగావచరుడు కూడా తను సాధించిన మార్గఫలములు, ధ్యానములు, విమోక్షములు, సమాధులు, సమాపత్తులు, విపశ్యనలు, అభిజ్ఞలు ఇత్యాది అధ్యాత్మ సంపదను బయటకు ప్రదర్శించుకోరాదు. ఇదియే మహారాజా, సముద్రంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, బృహత్ కాయములు కలిగిన మహాజీవులతో సముద్రం సహజీవనం కలిగియుంటుంది. అలాగే యోగావచరుడు కూడా అల్పేచ్ఛ, సంతుష్టి, తపస్సు, సల్లేఖము (లగేజి చాలా తక్కువగా కలిగియుండడం), సదాచారం, లజ్జ, సిగ్గు, కోమలత– మొదలగు గొప్పగుణాలతో శోభించునట్టి గౌరవనీయ కల్యాణమిత్రుని సాంగత్యం కలిగియుండవలెను. ఇదియే మహారాజా, సముద్రంనుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, గంగా యమున అచిరావతి సరయూ మహీ మొదలగు వందల వేల నదుల నీళ్ళు మరియూ ఆకసంనుండి వర్షించే వర్షధారల నీళ్ళు వచ్చిపడుతున్నా మహాసముద్రం చెలియలికట్టను అతిక్రమించదు. అలాగే యోగావచరుడు కూడా ప్రజలనుండి వచ్చిపడే లాభాలు, సత్కారాలు, ప్రశంసలు, వందనములు, పూజనములు వీటివల్ల ఉబ్బితబ్బిబ్బయిపోయి ఆ మత్తులో శిక్షాపదముల ఉల్లంఘనకు పాల్పడరాదు. ఇదియే మహారాజా, సముద్రం నుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

---

* *చూడుడు 295 వ పుట పాదపీఠిక*

దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా భాషించియున్నాడు: "మహారాజా, స్థిరస్వభావం కలిగిన మహాసముద్రం ఎలా చెలియలికట్టను అతిక్రమించదో అలానే నా శ్రావకులు (disciples) నేను విధించిన శిక్షాపదములను (rules of training) ప్రాణం పోయినా సరే ఉల్లంఘించడానికి సమ్మతించరు."

మరియూ మహారాజా, మహాసముద్రం గంగా యమునా అచిరావతి సరయూ మహీ నదీజలాలతో మరియూ అంతరిక్షంనుండి వర్షించే జలాలతో పూరింపబడదు. అలాగే యోగావచరుడు కూడా బుద్ధవచనం విస్తారంగా విన్నా చదివినా తృప్తి పడిపోరాదు. పఠనం, పరిపృచ్ఛ, శ్రవణం, ధారణం, విచారం చేస్తూ అభిధర్మపిటకాన్ని వినయపిటకాన్ని సుత్తపిటకాన్ని మథించవలెను. ఇదియే మహారాజా, సముద్రంనుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు సుతసోమజాతకంలో ఇలా భాషించియున్నాడు:

**అగ్గి యథా తిణకట్ఠం దహంతో న తప్పతి సాగరో వా నదీహి**
**ఏవంపి చే పండితా రాజసేట్ఠ సుత్వా న తప్పంతి సుభాసితేన**

తృణ కాష్ఠములచేత అగ్ని తృప్తిచెందనిరీతిలో, నదీజలాలతో సముద్రం తృప్తిపడనివిధంగా ఓ రాజశ్రేష్ఠా, పండితులు కూడా సుభాషితములు* విన్నప్పుడు "ఇక చాలు" అని వాటిపట్ల తృప్తిచెందరు. ఇంకా ఇంకా వినాలనే ఆరాటం కలిగియుంటారు.

## 21. పృథివి

**మి:** భంతే నాగసేనా, పృథివి గుణాలను ఐదింటిని గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణాలు?

**నా:** మహారాజా, పృథివికి ఇష్టములు అనిష్టములు అనే ద్వంద్వవైఖరి ఉండదు. కర్పూరం, అగరు, తగరం (ఒక పరిమళద్రవ్యం), చందనం, కుంకుమం మొదలగువాటిని తన మీద చల్లినా; పిత్తం, శ్లేష్మం, చీము, రక్తం, స్వేదం, క్రొవ్వు, ఎంగిలి, చీమిడి, రసి, మూత్రం, పురీషం మొదలగువాటిని మీద వేసినా ఒకేవిధంగానే గైకొంటుంది. ఇష్టానిష్టములకు లోను కాదు. అలాగే యోగావచరుడు కూడా లాభం–అలాభం, యశస్సు–అయశస్సు, నింద–ప్రశంస, సుఖం–దుఃఖం–ఈ ద్వంద్వములపట్ల ఇష్టానిష్టరూపమైన వికారం చెందకుండా ఏకవిధంగానే ఉండాలి. ఇదియే మహారాజా, పృథివినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

---

* *బుద్ధభాషితములకు సుభాషితములు (*well spoken*) అని సార్థకనామధేయం. (స్వాక్ఖాతో భగవతా ధమ్మో).*

మరియూ మహారాజా, పృథివికి, ఆభరణాలు అలంకారాలు లేకపోయినా తనదైన పుణ్యగంధంతో పరిమళించియుంటుంది. అలాగే యోగావచరుడు కూడా సొగసులకు పాల్పడకుండా తనదైన శీలపరిమళంతో గుబాళించవలెను. ఇదియే మహారాజా, పృథివినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, పృథివి నిరంతరంగా, అఖండంగా, అచ్ఛిద్రంగా, అసుషిరంగా (not hollow), బహుళంగా (thick), ఘనంగా, విస్తీర్ణంగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా నిరంతరమైన అఖండమైన అచ్ఛిద్రమైన అసుషిరమైన బహుళమైన ఘనమైన విస్తీర్ణమైన శీలమును కలిగియుండ వలెను. ఇదియే మహారాజా, పృథివినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, పృథివి గ్రామాలను నిగమాలను నగరాలను జనపదాలను వృక్షములను పర్వతములను నదులను తటాకములను కొలనులను మృగములను పక్షులను మనుజులను మోస్తున్నప్పటికీ ఆయాసం చెందదు. అలాగే యోగావచరుడు కూడా ధమ్మమును ప్రజలకు బోధించునపుడు, నేర్పించునపుడు, తెలియజెప్పునపుడు, ప్రసంగించునపుడు, ఉపదేశించునపుడు, శిక్షణ ఇచ్చునపుడు ఆయాసం చెందరాదు. ఇదియే మహారాజా, పృథివినుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, పృథివికి అనునయం (సుముఖత), ప్రతిఘ (విముఖత) ఉండవు. అలాగే మహారాజా, యోగావచరుడు కూడా అనునయ ప్రతిఘలు లేనివాడై పృథివీసమానుడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, పృథివినుండి గ్రహించవలసిన ఐదవ గుణం. ఈ విషయాన్నే ఉపాసిక చూళసుభద్ర కూడా ఇలా చెప్పింది:

**ఏకంచే బాహం వాసియా తచ్ఛే కుపితమానసా**
**ఏకంచే బాహం గంధేన ఆలింపేయ్య పమోదితా**
**అముస్మిం పటిఘో నత్థి రాగో అస్మిం న విజ్జతి**
**పథవీసమచిత్తా తే తాదిసా సమణా మమ**

క్రుద్ధుడై ఒక చేయిని ఉలితో గాయపరిచినవాడొకడు; ప్రమోదంతో ఒక చేయిని గంధంతో అలదినవాడొకడు–ఈ ఇరువురి పట్ల కూడా మా భిక్షువులు పృథివీ సమచిత్తులుగా* ఉందురు. ఒకరిని ద్వేషించడం మరొకరిని ప్రేమించడం అనే వ్యత్యాసం చూపరు.

## 22. జలం

**మి:** భంతే నాగసేనా, జలం గుణాలను ఐదింటిని గ్రహించవలెనని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణములు?

**నా:** మహారాజా, స్వభావతః జలం సుసంస్థితంగానూ (well- poised), అకంపితంగానూ, అలుళితంగాను (untroubled), పరిశుద్ధంగానూ ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా కుహనం, లపనం, నైమిత్తికత, నిష్పేషికత మొదలగు మిథ్యాజీవిక విధానాలకు** తావివ్వకుండా సుసంస్థితమైన అకంపితమైన అలుళితమైన పరిశుద్ధజీవికను కలిగియుండవలెను. ఇదియే మహారాజా, జలంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, జలం శీతలస్వభావం కలిగియుంటుంది. అలాగే యోగావచరుడు కూడా సర్వసత్త్వుల ఎడల క్షాంతి, మైత్రి, కరుణ కలిగియుంటూ వారి హితాన్ని ఆకాంక్షించేవాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, జలంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

---

* అనునయం (attraction), ప్రతిఘ (repulsion)– ఈ రెండు, త్రాసులోని పళ్ళాల వంటివి. ఏ పళ్ళెంలో బరువు ఉందో అటుగా త్రాసు వంగుతుంది. సుఖాలు, లాభాలు, ప్రశంసలు, యశస్సులు – ఈ బరువుతో అనునయపళ్ళెం మనస్సును ఒక వైపునకు గుంజుతుంది. దుఃఖాలు, నష్టాలు, నిందలు, అయశస్సులు– ఈ బరువుతో ప్రతిఘ పళ్ళెం మనస్సును మరో వైపునకు గుంజుతుంది. ఈ గుంజలాటలు మనస్సును అల్లకల్లోలంగా అలజడిగా ఆటుపోటుల సంద్రంగా మార్చి వేస్తుంటుంది. సమతూకం కలిగిన త్రాసులోని ముల్లు వంటిది ఉపేక్ష. అనునయం బరువుకూ చలించదు. ప్రతిఘ బరువుకూ చలించదు. ఇది చాలా గొప్ప చిత్తస్థితి. సుఖానికి పొంగిపోవడం, దుఃఖానికి క్రుంగిపోవడం జరుగదు. తటస్థంగా మధ్యస్థంగా ప్రశాంతంగా నిశ్చలంగా ఉండడం జరుగుతుంది. అలాగే లాభం × అలాభం, నింద× ప్రశంస, యశస్సు × అయశస్సు – ఇవి సంప్రాప్తించినపుడు పొంగిపోవడం జరుగదు, కృంగిపోవడం జరుగదు. తటస్థంగా మధ్యస్థంగా ప్రశాంతంగా నిశ్చలంగా ఉండడం జరుగుతుంది. సత్త్వుల (beings) విషయంలోనూ సమభావమే ఉంటుంది. హెచ్చు తగ్గ కొలతలు ఏవీ ఉండవు. సత్త్వులు, సత్త్వులు, సత్త్వులు, సత్త్వులు అని సమభావమే ఉంటుంది.

** *ఈ మిథ్యాజీవిక కిటుకులను శీలం పుస్తకంలో వివరించియుండడం చూడగలరు.*

మరియూ మహారాజా, జలం అశుచిని శుచిగా మార్చుతుంది. అలాగే యోగావచరుడు కూడా గ్రామంలో ఉన్నా అరణ్యంలో ఉన్నా తన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ సమానులు, ఆచార్యుడు, ఆచార్య సమానులు తనను మందలించే అవకాశం బొత్తిగా ఇవ్వని శుద్ధవర్తనుడుగా ఉండవలెను. తన నడత వివాదాంశం కానీయకుండా శుద్ధంగా ఉంచుకొనవలెను. ఇదియే మహారాజా, జలంనుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, జలం బహుజన ప్రార్థనీయంగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా అల్పేచ్ఛ, సంతుష్టి, ఏకాంతవాసరుచి, ధ్యానతత్పరత అనే అధ్యాత్మగుణాలతో సర్వజనులకు ప్రార్థనీయుడుగా వెలుగొందవలెను. ఇదియే మహారాజా, జలంనుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, జలం ఎవ్వరికీ అహితం కలిగించదు. అలాగే యోగావచరుడు కూడా శారీరకంగానూ మానసికంగానూ వాచికంగానూ ఎవరితోనూ జగడములు, కలహములు, వివాదములు, తగవులు, విరోధములు పెట్టుకొనరాదు. ఎవరినీ తుచ్ఛంగా భావించరాదు. ఎవరికీ అప్రియములు ఆచరించరాదు. ఇదియే మహారాజా, జలంనుండి గ్రహించవలసిన ఐదవ గుణం. మహారాజా, దేవాతిదేవుడైన భగవానుడు కూడా కణ్హజాతకంలో ఇలా భాషించియున్నాడు:

**వరంచే మే అదో సక్క సబ్బభూతానమిస్సర**
**న మనో వా సరీరం వా మం కతే సక్క కస్సచి**
**కదాచి ఉపహఞ్ఞేథ ఏతం సక్క వరం వరే**

సకలభూతపాలకా ఓ శక్రా, నీవు నాకు వరం ఇవ్వదలచినచో నేను కోరే వరం ఏమిటంటే నా వలన ఎవరి శరీరానికిగానీ మనస్సుకుగానీ ఎప్పుడూ గాయం కలుగకుండుగాక!

## 23. తేజస్సు

**మి:** భంతే నాగసేనా, తేజస్సు గుణాలు ఐదింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణములు?

**నా:** మహారాజా, తేజస్సు ఎలాగైతే గడ్డిని, పుల్లలను, కొమ్మలను, ఆకులను దహించి బూడిద చేస్తుందో అలాగే యోగావచరుడు కూడా ఇష్టములు (pleasant), అనిష్టములు (unplesant) కారణంగా చిత్తంలో ఉత్పన్నమయ్యే ఆయా క్లేశములను

జ్ఞానాగ్నిచే దహించివేయవలెను. ఇదియే మహారాజా, అగ్నినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, దహించే కృత్యంలో అగ్నికి దయ ఉండదు. కరుణ ఉండదు. అలాగే యోగావచరుడు కూడా క్లేశముల దహన విషయంలో దయ, కరుణ చూపరాదు. ఇదియే మహారాజా, అగ్నినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, అగ్ని చలిని దూరంగా ఉంచినట్లు యోగావచరుడు కూడా వీర్యసంతాపతేజాన్ని ఉద్భవింపజేసి క్లేశములను దూరంగా ఉంచవలెను. ఇదియే మహారాజా అగ్నినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, అగ్నిలో అనునయమూ ఉండదు, ప్రతిఘయియూ ఉండదు. అలాగే యోగావచరుడు కూడా అగ్నిసమానంగా అనునయ ప్రతిఘలు లేనివాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, అగ్నినుండి గ్రహంచవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, తేజస్సు అంధకారాన్ని పారద్రోలుతుంది. వెలుతురును ప్రసరింపజేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా అవిద్యాంధ కారాన్ని పారద్రోలి జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేయవలెను. ఇదియే మహారాజా, అగ్నినుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు తన కుమారుడైన రాహులునకు బోధిస్తూ ఇలా భాషించియున్నాడు: "రాహులా, నీ చిత్తాన్ని తేజోసమంగా వృద్ధి గావించుకొనుము. నీ చిత్తం తేజోసమం అయినప్పుడే అనుత్పన్నములైన అకుశలధర్మాలు అనుత్పన్నంగానే* ఉండిపోతాయి. ఈవరకే ఉత్పన్నములైన అకుశలధర్మాలు చిత్తంనుండి వైదొలగుతాయి."

## 24. వాయువు

**మి:** భంతే నాగసేనా, వాయువు గుణాలను ఐదింటిని గ్రహించవలసియున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణాలు?

---

** దేవదత్తుడిలో మధుమేహం (చక్కెరవ్యాధి) లేదు– అంటే అది ఇప్పటిదాక అతనిలో అనుత్పన్నంగా ఉంది. "అనుత్పన్నం కదా" అని దేవదత్తుడు దాని పట్ల నిర్లక్ష్యంగా ఉండలేదు. మధుమేహంతో పడరాని పాట్లు పడుచున్న యజ్ఞదత్తుణ్ణి చూసి తను ఆ లిస్టులో చేరిపోరాదనుకొని దేవదత్తుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం చేశాడు. క్లేశాల విషయమూ ఇంతే. వ్యక్తుల మధ్య తగవులు, కొట్లాటలు, వాదవివాదాలు ఇవన్నీ వారిలో విజృంభించిన క్లేశాల వల్లనే అని గమనించి ఆ క్లేశాలను తనలో అనుత్పన్నంగా ఉంచుతూ జాగ్రత్తపడడం.*

**నా:** మహారాజా, సుపుష్పిత వనవృక్షముల మధ్య వాయువు వీచునట్లుగా యోగావచరుడు కూడా విముక్తి పుష్పాలతో పుష్పించిన ఆరమ్మణములయందే (meditation subjects) రమించవలెను. ఇదియే మహారాజా, వాయువునుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ధరణీరుహములు, పాదపములు అనబడే వృక్షసమూహాన్ని వాయువు ఊపివేస్తుంటుంది. అలాగే యోగావచరుడు కూడా జనావాసాలకు దూరంగా ఉన్నట్టి వనప్రదేశంలో సర్వసంఖారములు (all formations) అనిత్యములని చింతన చేస్తూ క్లేశములకు అలజడిని కలిగిస్తూ ఉండవలెను. ఇదియే మహారాజా, వాయువునుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, వాయువు ఆకాశంలో సంచరిస్తూ ఉంటుంది. అలాగే యోగావచరుడు లోకోత్తరధర్మములందు (నిర్వాణం, నిర్వాణదిశగా నడిపించే ఆర్యఅష్టాంగమార్గం) చిత్తాన్ని త్రిప్పుతూ ఉండవలెను. ఇదియే మహారాజా, వాయువునుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, వాయువు గంధాన్ని ఆస్వాదిస్తుంది. అలాగే యోగావచరుడు శీలపరిమళాన్ని ఆస్వాదించువాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, వాయువునుండి గ్రహింపవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, వాయువు తనకంటూ ఒక ఇల్లూ వాకిలి లేనిది. అలాగే యోగావచరుడు కూడా స్వంతంగా ఇల్లూవాకిలీ లేనివాడుగా సర్వత్ర ఒక అపరిచితుడుగా ఉంటూ సంబంధ బాంధవ్యాల బంధం లేని స్వతంత్రుడుగా చరించవలెను. ఇదియే మహారాజా; వాయువునుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సుత్తనిపాతంలో ఇలా భాషించి యున్నాడు:

**సంథవతో భయం జాతం నికేతా జాయతీ రజో**
**అనికేతమసంథవం ఏతం వే మునిదస్సనం**

పరిచయాల వల్ల భయం తొలగిపోజాలదు. స్వంతంగా చిన్న గుడిసె వేసుకొన్నా దానియందూ మమకారం ఏర్పడనే ఏర్పడుతుంది. కనుక స్వంతనివాసం లేకపోవడం, పరిచయాలు లేకపోవడం– ఇదియే మునిదర్శనం.

## 25. పర్వతం

**మి:** భంతే నాగసేనా, పర్వతం గుణాలను ఐదింటిని గ్రహించవలసియున్నవని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణాలు?

**నా:** మహారాజా, పర్వతం ఎలా అచలంగా అకంపితంగా సుస్థిరంగా ఉంటుందో అలాగే యోగావచరుడు కూడా సన్మానం-అవమానం, సత్కారం-తిరస్కారం, గౌరవం-అగౌరవం, యశస్సు- అయశస్సు, నింద- ప్రశంస, సుఖం- దుఃఖం- ఈ ద్వంద్వములు ప్రాప్తించినపుడు ఒక దానికి పొంగిపోవడం మరో దానికి కృంగిపోవడం చేయరాదు. పర్వతంలాగా అచలంగా ఉండవలెను. మనోహరములైన రూప శబ్ద గంధ రస స్ప్రష్టవ్యములు ప్రాప్తించినపుడు సమతను (balance) కోల్పోకూడదు. హర్షాతిరేకంతో వివశం కారాదు. ఇదియే మహారాజా, పర్వతంనుండి గ్రహించవలసిన మొదటి గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ధమ్మపదంలో ఇలా భాషించియున్నాడు:

**సేలో యథా ఏకఘనో వాతేన న సమీరతి**
**ఏవం నిందాపసంసాసు న సమింజంతి పండితా**

ఏకశిలా సాంద్రమైన పర్వతం పెనుగాలి వీచినా ఎలా కంపం చెందదో అలానే పండితులు నిందా ప్రశంసలకు చలించరు.

మరియూ మహారాజా, పర్వతం చాలా ఠీవిగా విడిగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ఆత్మగౌరవం వల్ల ఒనగూడిన ఠీవితో ఏకాకిగా ఉండవలెను. ఇతరుల సాన్నిహిత్యం అపేక్షించరాదు. ఇదియే మహారాజా, పర్వతం నుండి గ్రహించవలసిన రెండవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సుత్తనిపాతంలో ఇలా పలికియున్నాడు:

**అసంసట్ఠం గహట్ఠేహి అనాగారేహి చూభయం**
**అనోకసారిమప్పిచ్ఛం తమహం బ్రూమి బ్రాహ్మణం**

గృహస్థులతోగానీ పరివ్రాజకులతోగానీ ఏ సంబంధం లేకుండా అల్పేచ్ఛుడుగా ఉన్నవాణ్ణి బ్రాహ్మణుడని నేను చెబుతాను.

మరియూ మహారాజా, పర్వత శిలాతలం మీద విత్తనం వేస్తే మొలవదు. అలాగే యోగావచరుడు కూడా తన చిత్తంలో క్లేశాలను మొలకెత్తించరాదు. ఇదియే మహారాజా, పర్వతంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. సుభూతి స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**రాగూపసంహితం చిత్తం యదా ఉప్పజ్జతే మమ**
**సయమేవ పచ్చవేక్ఖిత్వా ఏకగ్గో తం దమేమహం**
**రజ్జసే రజనీయేసు దుస్సనీయేసు దుస్ససే**
**ముయ్హసే మోహనీయేసు నిక్ఖమస్సు వనా తువం**

**విసుద్ధానం అయం వాసో నిమ్మలానం తపస్సినం**
**మా ఖో విసుద్ధం దూసేసి నిక్ఖమస్సు వనా తువం**

నాలో రాగసంబంధమైన ఆలోచన తలెత్తగానే నాకు నేనుగా ఇలా ప్రత్యవేక్షణ (reflecting) చేసుకొని ఆ ఆలోచనలను అదుపు చేస్తాను: "కోరదగినవాటిని కోరుతూ ద్వేషించదగినవాటిని ద్వేషిస్తూ అయోమయంగా ఉన్నవాటిపట్ల గందరగోళం చెందుతూ నీవు ఇక్కడ ఉంటున్న పక్షంలో ఈ వనంనుండి తక్షణమే బయటకు నడు. ఇది నిర్మలచిత్తులైన విశుద్ధచిత్తులైన తపస్వినుల నివాసభూమి. ఈ విశుద్ధ పరిసరాలను నీ చిత్తకాలుష్యంతో మలినపరచకు. త్వరత్వరగా ఇక్కడ్నుంచి వెళ్ళిపో."

మరియూ మహారాజా, పర్వతం అత్యున్నతంగా (lofty) ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా జ్ఞానం వల్ల ఉన్నతుడు కావాలి. ఇదియే మహారాజా, పర్వతంనుండి గ్రహించవలసిన నాలుగవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ధమ్మపదంలో ఇలా భాషించియున్నాడు:

**పమాదం అప్పమాదేన యదా నుదతి పండితో**
**పఞ్ఞాపాసాదమారుయ్హ అసోకో సోకినిం పజం**
**పబ్బతట్ఠోవ భూమట్ఠే ధీరో బాలే అవేక్ఖతి**

అప్రమాదం చేత ప్రమాదమును* దూరం చేసి పండితుడు ప్రజ్ఞాప్రాసాదాన్ని అధిరోహిస్తాడు. పర్వతం మీద ఉన్నవాడు భూమి మీదున్న ప్రజలను చూసినట్లుగా శోకంనుండి బయటపడిన విజ్ఞుడు శోకిస్తున్న ప్రజలను జాలితో చూస్తాడు.

---

** వాహనాలు ఒకదాన్ని ఒకటి గుద్దుకోవడం లేదా అదుపు తప్పి ఎక్కడో తలక్రిందులుగా పడిపోవడం లాంటి దుర్ఘటనలకు ప్రమాదం అనే పేరు వాడుకలోకి వచ్చినందువల్ల "ప్రమాదం" పదాన్ని ఇక్కడ వివరించవలసిన అవసరం ఏర్పడింది. ప్రమాదానికి వ్యతిరేకపదం అప్రమాదం (watchfulness). అలోభం(non-greed), అద్వేషం (non-hatred), అమోహం(non-confusion) మొదలగు కుశల ధర్మాలు (wholesome mental states) చిత్తంలో రాజ్యం చేస్తుంటే అది అప్రమాదం. లోభం, ద్వేషం, మోహం మొదలగు అకుశల ధర్మాలు చిత్తంలో పెత్తనం చేస్తుంటే అది ప్రమాదం. చిత్తంలో అప్రమాదం పైచేయిగా ఉండాలంటే సతి సంప్రజన్యముల తోడ్పాటు అవసరం. ఇవి ప్రమాదం యొక్క కదలికలపై కన్నేసియుంచి ముందస్తు హెచ్చరికలు చేస్తుంటాయి. ప్రమాదం, అప్రమాదం అనే పదాలు చిత్తవిశేషాలకు పెట్టిన పేర్లు అనే విషయం జ్ఞప్తి చేసుకొనవలెను.*

మరియూ మహారాజా, పర్వతాన్ని పైకి లేపడం సాధ్యం కాదు. క్రిందికి అణగద్రొక్కడం సాధ్యం కాదు. అలాగే యోగావచరుడు కూడా పొంగిపోవడం క్రుంగిపోవడం చేయరాదు. ఇదియే మహారాజా, పర్వతంనుండి గ్రహించవలసిన ఐదవ గుణం. ఉపాసిక చూళసుభద్ర ఇలా భిక్షువులను కీర్తించింది:

**లాభేన ఉన్నతో లోకో అలాభేన చ ఓనతో**
**లాభాలాభేన ఏకట్ఠా తాదిసా సమణా మమ**

లోకులు లాభానికి పొంగిపోతారు. నష్టానికి క్రుంగిపోతారు. లాభనష్టాల పట్ల మా భిక్షువుల తీరు వేరు. వాళ్ళలో సమదృష్టియే ఉంటుంది.

## 26. ఆకాశము

**మి:** భంతే నాగసేనా, ఆకాశం గుణాలను ఐదింటిని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. అవి ఏవి?

**నా:** మహారాజా, ఆకాశాన్ని ఎక్కడగానీ పట్టుకొని బరబర ఈడ్చుకెళ్ళడం సాధ్యం కాదు. అలాగే యోగావచరుడు కూడా క్లేశములు తనను పట్టుకొని బరబర లాక్కెళ్ళడానికి వీలు కల్పించరాదు. ఇదియే మహారాజా, ఆకాశంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ఆకాశం రుషులకు తాపసులకు దేవతలకు పక్షులకు సంచరణంగా ఉంటుంది. అలాగే యోగావచరుని చిత్తాకాశం కూడా అనిత్యం, దుః ఖం, అనాత్మ అనే విపశ్యనభావాలచే సంచరింపబడుతూ ఉండవలెను. ఇదియే మహారాజా, ఆకాశంనుండి గ్రహింపవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, ఆకాశం భయం గొల్పేదిగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా పునర్భవం పట్ల భీతి చెందవలెను. భవములు (existences) దేనియందునూ బావుకొనేది ఏమీ లేదని విరక్తిని పెంచుకొనవలెను. ఇదియే మహారాజా, ఆకాశంనుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మహారాజా, అనంతం (unending), అప్రమాణం (boundless) మరియూ అప్రమేయం (immeasurable) అయినట్టిది ఆకాశం. అలాగే యోగావచరుడు కూడా అనంతశీలం అపరిమితజ్ఞానం కలిగినవాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, ఆకాశంనుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, ఆకాశం దేనినీ పట్టుకొని వ్రేలాడదు, దేనియందునూ అతుక్కొనిపోదు, దేనియందునూ ఆధారపడదు, దేనిచేతనూ అటకాయింపబడదు. అలాగే

యోగావచరుడు కూడా కులంలో, గణంలో (శిష్యగణంలో), లాభాల్లో, నివాసాల్లో, ప్రత్యయాల్లో (requisites), క్లేశాల్లో తగుల్కొనిపోరాదు. అతుక్కొనిపోరాదు, ఆధారపడరాదు, ఆటంకంగా చేసుకోరాదు. ఇదియే మహారాజా, ఆకాశంనుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా తన కుమారుడు రాహులునికి బోధ చేస్తూ ఇలా పలికినాడు: "రాహులా, ఆకాశం ఎలా దేనియందునూ ఆధారపడియుండలేదో అలాగే నీవున్నూ దేనియందునూ ఆధారపడనివిధంగా చిత్తాన్ని మలచుకొనుము. ఆకాశసమంగా చిత్తాన్ని వికసింపజేసుకొంటున్నవానికి ఇష్టానిష్టముల తాకిడి తగలదు.

## 27. చంద్రుడు

**మి:** భంతే నాగసేనా, చంద్రుని ఐదు గుణాలు గ్రహించవలసియున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణాలు?

**నా:** మహారాజా, చంద్రుడు శుక్లపక్షంలో దినదినమూ వృద్ధి చెందుతుంటాడు. అలాగే యోగావచరుడు కూడా సదాచారం, శీలం, సద్గుణం, కర్తవ్యనిష్ఠ, సుత్తపఠనం, ధ్యానం, సతిపట్ఠానం, ఇంద్రియసంవరం, మితభోజనం, జాగరూకత ఇత్యాది సాధనల ద్వారా ఆధ్యాత్మికంగా దినదినమూ వృద్ధి చెందవలెను. ఇదియే మహారాజా, చంద్రునినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, చంద్రుడు గొప్ప ఆధిపత్యం (ప్రభుత్వం) కలిగినవాడు. అలాగే యోగావచరుడు కూడా తన ఇచ్ఛల మీద (wishes/ desires) ఆధిపత్యం కలిగియుండవలెను. ఇదియే మహారాజా, చంద్రునినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, చంద్రుడు రాత్రియందు చరించును. అలాగే యోగావచరుడు కూడా ఏకాంతముగా చరించవలెను. ఇదియే మహారాజా, చంద్రునినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, ఎవరూ ఆహ్వానించకపోయినా కోరకపోయినా చంద్రుడు ధమ్మత ప్రకారంగా ఉదయిస్తుంటాడు. అలాగే యోగావచరుడు కూడా భిక్షకై ఆహ్వానాలు స్వాగత సత్కారాలు లభించే పరిచితగృహాలనే ఎంపిక చేసుకోరాదు. భిక్షునియమం పాటిస్తూ భిక్షాటన చేయవలెను. ఇదియే మహారాజా, చంద్రునినుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్తనికాయంలో ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, గృహస్థుల ఇండ్లకు పోవలసిన సందర్భాల్లో మీరు

చంద్రునిలా* మెలగవలెను. దీర్ఘకాలంగా తెలిసినవారి ఇండ్లకు వెళ్ళినా సరే ఒక అపరిచితునివలె కొత్తవానివలె జంకుగా బిడియంగా నడుచుకొనవలెను.

## 28. సూర్యుడు

**మి:** భంతే నాగసేనా, సూర్యుని ఏడు గుణాలు గ్రహించవలసియున్నవని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఏడు గుణాలు?

**నా:** మహారాజా, సూర్యుడు జలమును బొట్టు కూడా మిగల్చకుండా శోషింప జేస్తాడు. అలాగే యోగావచరుడు కూడా క్లేశములను నిశ్శేషంగా శోషింపజేయ వలెను. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, సూర్యుడు చీకటిని పారద్రోలివేయును. అలాగే యోగావచరుడు కూడా రాగాంధకారాన్ని ద్వేషాంధకారాన్ని మోహాంధకారాన్ని మానఅంధకారాన్ని దృష్టిఅంధకారాన్ని (false views) క్లేశాంధకారాన్ని దుశ్చరిత అంధకారాన్ని తన చిత్తంనుండి పారద్రోలవలెను. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, సూర్యుడు సదా చరించుచునేయుండును. అలాగే యోగావచరుడు కూడా సదా యోనిశ మనసికారమును** కలిగియుండవలెను. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, సూర్యుడు కిరణములు ఎడబాయనివాడు. అలాగే యోగావచరుడు కూడా ఆరమ్మణమును (meditation subject) చిత్తమునుండి ఎడబాయనివాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

---

* *సూర్యవంశీయుడైన బుద్ధభగవానునికి చంద్రునితోనూ ఒక విధంగా సన్నిహిత సంబంధం ఉన్నది. మాయాదేవి సుతుడుగా లుంబినివనంలో జన్మించినది పున్నమినాడే. రాజప్రసాదంనుండి వెలువడింది (మహాభినిష్క్రమణం) పున్నమినాడే. గయాక్షేత్రంలో బోధివృక్షం క్రింద సమ్యక్సంబోధి పొందినదీ పున్నమినాడే. ప్రప్రథమంగా ధర్మచక్రప్రవర్తనం ప్రారంభించినదీ పున్నమినాడే. పార్థివశరీరాన్ని త్యజించినదీ (మహాపరినిర్వాణం) పున్నమినాడే. చెట్లుచేమలతోనూ సన్నిహిత సంబంధమే. జనించింది లుంబినీవనంలో. సంబోధిని పొందినది రావిమానినీడలో. ప్రప్రథమంగా ధర్మచక్రప్రవర్తనం గావించినది లేళ్ళవనంలో. చివరగా మహాపరినిర్వాణం సాలవనంలో.*

** *చూడుడు 203 మరియూ 255 వ పుటలు.*

మరియూ మహారాజా, సూర్యుడు తన తాపం ద్వారా సమస్త జీవరాశులకు వెచ్చదనాన్ని కలిగిస్తూ మహోపకారకుడుగా ఉంటున్నాడు. అలాగే యోగావచరుడు కూడా సదాచారం, శీలం, సద్గుణం, కర్తవ్యనిష్ఠ, ఇంద్రియములు, బలములు, బోధ్యంగములు, సతిపట్ఠానములు, సమ్యక్ ప్రధానములు, ఇద్ధిపాదములు కలిగినవాడై దేవతాసహిత లోకులకు అధ్యాత్మిక వెచ్చదనాన్ని కలిగిస్తూ మహోపకారకుడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన ఐదవ గుణం.

మరియూ మహారాజా, సూర్యుడు కేతువును చూసి భయపడును. అలాగే యోగావచరుడు కూడా దుర్గతికి, పతనానికి కారణంగా ఉన్నట్టి క్లేశజాల జటితమైన మార్గంలో– దృష్టులు (false views) అనే అగాధాలతో భయంకరంగా ఉన్న మార్గంలో– పయనిస్తున్న జనులను చూసి మిక్కిలి సంవేగం చెందవలెను. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన ఆరవ గుణం.

మరియూ మహారాజా, సూర్యుడు కల్యాణములను, పాపకమును రెంటినీ కనిపింపజేయును. అలాగే యోగావచరుడు కూడా ఇంద్రియ*–బల– బోధ్యంగ– సతిపట్టాన– సమ్మప్పధాన– ఇద్ధిపాద– లోకియ – లోకోత్తర ధర్మములు అనెడి అధ్యాత్మిక తేజస్సు కలిగియుండవలెను. ఈ తేజస్సు వల్ల ఏది మంచి? ఏది చెడు? అనే విషయం ఇట్టే అవగతమవుతుంది. ఇదియే మహారాజా, సూర్యునినుండి గ్రహించవలసిన ఏడవ గుణం. వంగసేన స్థవిరుడు కూడా ఇలా చెప్పియున్నాడు:

**యథాపి సురియో ఉదయంతో రూపం దస్సేతి పాణినం**
**సుచిం చ అసుచించాపి కల్యాణం చాపి పాపకం**
**తథా భిక్ఖు ధమ్మధరో అవిజ్జాపిహితం జనం**
**పథం దస్సేతి వివిధం ఆదిచ్చోవుదయం యథా**

సూర్యుడు ఉదయించగానే ప్రాణులకు దృశ్యాలను– అవి శుచి కావచ్చు అశుచి కావచ్చు, మంచివి కావచ్చు, చెడ్డవి కావచ్చు– గోచరింపజేస్తాడు. అలాగే

** ఆధిపత్యం కలిగియుండేవాటికి ఇంద్రియములు అని పేరు. చిత్తాన్ని శుద్ధి గావించడంలో శ్రద్ధ, వీర్యం, స్మృతి (mindfulness), సమాధి, ప్రజ్ఞ అనేవి ఆధిపత్యం కలిగియుంటాయి. ఇవి క్లేశాలను అణగద్రొక్కి మార్గప్రవేశాన్ని సుగమం చేస్తాయి. ప్రతిపక్షమైన సాంక్లేశిక ధర్మాలచే (అశ్రద్ధ, కౌసీద్యం, ప్రమాదం, విక్షేపం, మోహం) కదిలించడానికి వీలుపడని అచలత్వస్థాయికి ఇవి చేరినపుడు వీటికి బలములని పేరు. ఇంకా పై స్థాయిలో ఇవి బోధ్యంగములుగా గుర్తింపు పొందుతాయి. వివరించవలసిన పదాలు ఇంకా కొన్ని ఇక్కడ మిగిలియున్నాయి. ఇవన్నీ అష్టాంగమార్గంలో ఒదిగిపోతాయి. చూడుడు అనుబంధం –2*

ధమ్మధరుడైన భిక్షువు అవిద్యాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న జనులకు నానా విధములైన అధ్యాత్మ పథములను దర్శింపజేయును.

## 29. ఇంద్రుడు

**మి:** భంతే నాగసేనా, ఇంద్రుని గుణాలు మూడింటిని గ్రహించవలసియున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణాలు?

**నా:** మహారాజా, శక్రుడు మిక్కిలి సుఖాన్ని అనుభవిస్తుంటాడు. అలాగే యోగావచరుడు కూడా ఏకాంతవాసం వల్ల లభించే సుఖాన్ని అనుభవించేవాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, ఇంద్రునినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, శక్రుడు దేవతలను చూసినపుడు ప్రసన్నంగా స్నేహంగా వీక్షించడం చేసి వారిలో మందహాసాన్ని కలిగిస్తాడు. అలాగే యోగావచరుడు కూడా కుశలధర్మాల విషయంలో మనస్సును క్రియాశీలంగానూ ఉత్సాహవంతంగానూ చేసుకొనవలెను. కుశలధర్మాల అనుష్ఠానంలో శ్రమ ఆయాసం కలిగినప్పటికీ చిత్తంలో హాసాన్ని (cheerfulness) జనింప జేసుకొంటూ యత్నపరుడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, శక్రునినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, శక్రునికి అనభిరతి (discontent/ boredom) అనేది కలుగనే కలుగదు. అలాగే యోగావచరుడు కూడా నిర్జనప్రదేశంలో వాసం చేస్తున్నా అనభిరతికి అవకాశమే ఇవ్వరాదు. ఇదియే మహారాజా, శక్రునినుండి గ్రహించవలసిన మూడవ గుణం. సుభూతి*స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**సాసనే తే మహావీర యతో పబ్బజితో అహం**
**నాభిజానామి ఉప్పన్నం మానసం కామసంహితం**

---

* సుభూతిస్థవిరుడు ఎనభైమంది మహాశ్రావకులలో ఒకడు. అరణావిహారులలో అగ్రేసరుడుగా భగవానునిచే ప్రశంసింపబడిన మహానీయుడు. రణం అంటే యుద్ధం. ఏ యుద్ధంలో అయినా గాయాలు ఏకపక్షంగా ఉండవు. ఇరుపక్షాలకూ గాయాలు తగులుతాయి. క్లేశములకు కూడా రణములని పేరు. క్లేశముల వల్లనే ఒకరినొకరు నొప్పించుకోవడం, బాధించుకోవడం జరుగుతుంది. కనుక క్లేశములకు రణములని బిరుదు. మైత్రీభావన ద్వారా (loving kindness) సుభూతి తన చిత్తంలోని క్లేశాల మీద విజయం సాధించి అర్హతుడయినాడు. అరణావిహారిగా కీర్తికెక్కినాడు. తన కారణంగా ఎవరి చిత్తంలోనూ క్లేశములు తలెత్తే అవకాశం ఇవ్వకూడదు అనే ఆశయం పెట్టుకొని చక్కని జీవితాన్ని జీవించినాడు.

మహావీరా, నీ శాసనంలో ప్రవ్రజించినప్పటినుండి నా మానసంలో కామసంబంధమైన ఆలోచన ఒకటి కూడా తలెత్తలేదు.

## 30. చక్రవర్తి

**మి:** భంతే నాగసేనా, చక్రవర్తి గుణాలను నాలుగింటిని గ్రహించవలసి యున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ నాలుగు గుణాలు?

**నా:** మహారాజా, చక్రవర్తి జనులకు అనేక విధాలుగా సహాయపడుతూ వారిని తన మాట వినేవారుగా చేసుకొంటాడు. అలాగే యోగావచరుడు కూడా నాలుగు పరిషత్తుల* మనస్సులను ఆకట్టుకొనవలెను. సహాయపడవలెను. ఇదియే మహారాజా, చక్రవర్తినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, చక్రవర్తి పాలనలోని రాజ్యంలో చౌర్యం చేసేందుకు చోరులెవరూ సాహసించరు. అలాగే యోగావచరుడు కూడా కామవితర్కాలు ద్వేషవితర్కాలు హింసావితర్కాలు తన చిత్తంలో తలెత్తే సాహసం చేయనీయకుండా కనిపెట్టియుండవలెను. ఇదియే మహారాజా, చక్రవర్తినుండి గ్రహించవలసిన రెండవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ధమ్మపదంలో ఇలా భాషించియున్నాడు:

**వితక్కూపసమే చ యో రతో అసుభం భావయతే సదా సతో**
**ఏస ఖో బ్యంతికాహితి ఏస ఛేచ్ఛతి మారబంధనం**

వితర్కాలను (useless thoughts) ఉపశమింపజేయడంలో ఎవడు అక్కర కలిగియుంటాడో సర్వదా గమనికతో అశుభభావన** చేస్తుంటాడో అతడు మారబంధనాలను వదలించుకొంటాడు, ఛిన్నాభిన్నం చేస్తాడు.

మరియూ మహారాజా, సముద్రం వరకు విస్తరించిన మహాపృథివియందు చక్రవర్తి దినదినము పర్యటిస్తుంటాడు– రాజ్యంలో ఏది కల్యాణం (good), ఏది పాపకం కనిపెట్టేందుకై. అలాగే యోగావచరుడు కూడా తన కాయికకర్మ వచీకర్మ మానసకర్మ నిర్దోషంగా ఉందా లేదా దినదినమూ ఇలా ప్రత్యవేక్షణ (self introspection) చేసుకొనవలెను: 'ఈ దినం జరిగిన కాయిక వాచిక చేతసిక కర్మలు నిర్దోషంగా ఉన్నవా లేదా?' అని. మహారాజా, ఇదియే చక్రవర్తినుండి గ్రహించవలసిన మూడవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా అంగుత్తరనికాయంలో ఇలా భాషించియున్నాడు:

---

* *భిక్షువులు, భిక్షుణిలు, ఉపాసకులు, ఉపాసికలు*

** *అశుభభావనలు ధ్యానం పుస్తకంలో వివరంగా చెప్పడం జరిగింది.*

"పగలూ రేయి ఎలాంటి వ్యక్తిగా నేను గడిపితిని అని ప్రవ్రజితుడు సదా ప్రత్యవేక్షణ చేసి చూసుకొనవలెను."

మరియూ మహారాజా, చక్రవర్తికి ఇంటా బయటా చక్కని రక్షణ వ్యవస్థ ఏర్పాటు ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా క్లేశశత్రువుల ప్రవేశాన్ని అటకాయించేందుకు సతి (mindfulness) అనబడే ద్వారపాలకుణ్ణి సదా సిద్ధంగా ఉంచుకొనవలెను. మహారాజా, ఇదియే చక్రవర్తినుండి గ్రహించవలసిన నాలుగవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా పలికియున్నాడు: "భిక్షువులారా, ఆర్యశ్రావకుడు సతిని ద్వారపాలకుడుగా కలిగియుంటూ అకుశలాన్ని దూరంగా ఉంచుతాడు, కుశలాన్ని పెంపుజేస్తాడు. నిందనీయములను దూరంగా ఉంచుతాడు, ప్రశంసనీయములను వృద్ధి చేస్తాడు - ఇలా తనను తాను శుద్ధంగా ఉంచుకొంటాడు".

## 31. ఉపచిక (white ant = తెల్ల చీమ)

**మి:** భంతే నాగసేనా, తెల్లచీమ గుణం ఒకదాన్ని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, తెల్లచీమ తనను, తను సంచరించే ప్రదేశాన్ని ఇతరుల కంటబడనీయనివిధంగా అద్భుతమైన నిర్మాణచాతురితో చెదలు అనబడే ఆచ్ఛాదనమును నిర్మించుకొని దానిలో తన పని తాను చేసుకొంటూ ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా శీలసంవరం అనబడే ఆచ్ఛాదనంలోనే మనస్సును ఉంచి దాన్ని దాటి అది బయటకు పోనీయకుండా జాగ్రత్తపడతూ గ్రామాల్లో భిక్షాటన చేయవలెను. శీలసంవరం అనబడే ఆచ్ఛాదనం ఉంటేనే సకల భయాలను యోగావచరుడు ఎదుర్కొనగలడు. ఇదియే మహారాజా, తెల్లచీమనుండి గ్రహించవలసిన గుణం. వంగంతపుత్ర ఉపసేనస్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**సీలసంవరచ్ఛదనం యోగీ కత్వాన మానసం**
**అనుపలిత్తో లోకేన భయా చ పరిముచ్చతి**

శీలసంవరాన్ని మనస్సుకు ఆచ్ఛాదనంగా చేసుకొని లోకంలో దేని యందునూ తగులం లేనివాడై యోగి, భయంనుండి విముక్తుడగును.

## 32. బిడాలం (పిల్లి)

**మి:** భంతే నాగసేనా, పిల్లి గుణాలను రెండింటిని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, పిల్లి గుహలోకి పోయినా బిలంలోకి పోయినా భవనంలో ఉన్నా దాని అన్వేషణ మాత్రం ఎలుకలే. అలాగే యోగావచరుడు కూడా గ్రామంలో ఉన్నా అరణ్యంలో ఉన్నా చెట్టుక్రింద ఉన్నా నిర్జనప్రదేశంలో ఉన్నా ఎల్లవేళల విడువక కాయగతాసతిభోజనాన్నే అన్వేషించవలెను. ఇదియే మహారాజా, బిడాలం నుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, బిడాలం తనకు దగ్గరగా ఉన్న ప్రదేశంలోనే అన్వేషణ చేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా తనకు అత్యంత సమీపంగా ఉన్న ఉపాదానస్కంధములను (five aggregates of clinging= body-mind complex) విపశ్యనధ్యానానికి విషయంగా చేసుకొనవలెను. ''ఇది రూపం, ఇది రూపసముదయం(arising), ఇది రూపఅస్తంగమం; ఇది వేదన, ఇది వేదనా సముదయం, ఇది వేదనా అస్తంగమం; ఇది సంజ్ఞ, ఇది సంజ్ఞాసముదయం, ఇది సంజ్ఞా అస్తంగమం, ఇది సంఖారములు (habitual tendencies), ఇది సంఖార సముదయం, ఇది సంఖారఅస్తంగమం; ఇది విజ్ఞానం, ఇది విజ్ఞాన సముదయం, ఇది విజ్ఞానఅస్తంగమం– ఈ విధంగా స్వీయదేహమునే ఉదయ వ్యయానుపశ్యనకు (contemplation of rise and fall) విషయంగా చేసుకొనవలెను. ఇదియే మహారాజా, బిడాలంనుండి గ్రహించవలసిన రెండవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**న ఇతో దూరే భవితబ్బం భవగ్గం కిం కరిస్సతి**
**పచ్చుప్పన్నమ్హి వోహారే సకే కాయమ్హి విందథ**

ఇక్కడ్నుంచి దూరంగా* పోవలసిన పని లేదు. సుదూరం లోని భవాగ్రం గురించి చింతిస్తూ ఏమి సాధించబోతున్నావు? నీ దేహాన్ని విపశ్యనకు విషయంగా తీసుకొని విపశ్యనాధ్యానం ద్వారా నీ చిత్తాన్ని వర్తమానంలోనే నిలిపియుంచి పొందవలసింది పొందుము.

---

* *ఈ బారెడు దేహం దాటి అవతలికి నువ్వుగింజంత దూరం కూడా జరక్కుండా మొత్తం అధ్యాత్మవిద్యను బోధించడం అనేది బుద్ధశాసనంలోనే కనిపిస్తుంది. త్వరలోనే అనువదించబోయే "ప్రజ్ఞ"లో ఈ విషయం తేటతెల్లమవుతుంది. దేహాన్ని మనస్సును బౌద్ధశైలిలో అధ్యయనం చేసినపుడే ప్రజ్ఞ ఆవిర్భవిస్తుంది. నామరూపాన్ని (mind-body complex) బౌద్ధశైలిలో అధ్యయనం చేయడమంటే స్కంధాలు, ఆయతనాలు, ధాతువులు, 22ఇంద్రియములు, నాలుగు ఆర్యసత్యములు, ప్రతీత్యసముత్పాదం ఇత్యాదుల విచారమే. సస్యవృద్ధికి క్షేత్రంలాగా ప్రజ్ఞావృద్ధికి ఇవి దోహదపడుతాయి కనుక ఈ విచారాలకు ప్రజ్ఞాభూములు అని పేరు.*

## 33. ఉందురం (ఎలుక)

**మి:** భంతే నాగసేనా, ఎలుక గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ ఒక గుణం?

**నా:** మహారాజా, ఎలుక ఈ మూలకు ఆ మూలకు పైకి క్రిందకి అదే పనిగా పరుగులు పెట్టున్నా దాని మనస్సంతా ఆహారం మీదనే ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ఇటు అటు తిరుగాడుచున్నప్పుడు యోనిశ మనసికారాన్నే* లక్ష్యంగా కలిగియుండవలెను. ఇదియే మహారాజా, ఎలుకనుండి గ్రహించవలసిన గుణం. వంగంతపుత్ర ఉపసేనస్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**ధమ్మాసీసం కరిత్వాన విహరంతో విపస్సకో**
**అనోలీనో విహరతి ఉపసంతో సదా సతో**

ధమ్మాన్ని లక్ష్యంగా పెట్టుకొని జీవిస్తున్న విపశ్యకుడు (insight meditator) ఉత్సాహంగానూ శాంతంగానూ సదా స్మృతిమంతుడుగానూ జీవించగలడు.

## 34. వృశ్చికం (తేలు)

**మి:** భంతే నాగసేనా, వృశ్చికం గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ ఒక గుణం?

**నా:** మహారాజా, వృశ్చికం కొండెమును ఆయుధంగా కలిగియుండి దానిని ఎత్తిపెట్టుకొనియే తిరుగాడుచుండును. అలాగే యోగావచరుడు కూడా జ్ఞానమును ఆయుధముగా కలిగియుండవలెను. జ్ఞానశస్త్రాన్ని ఎత్తిపట్టుకొనియే చరించవలెను. ఇదియే మహారాజా, వృశ్చికంనుండి గ్రహించవలసిన గుణం. వంగంతపుత్ర ఉపసేనస్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**ఞాణఖగ్గం గహేత్వాన విహరంతో విపస్సకో**
**పరిముచ్చతి సబ్బభయా దుప్పసహో చ సో భవే**

జ్ఞానఖడ్గాన్ని చేతబూని సాధనపథంలో పయనించే విపశ్యకుడు సకల భయాలనుండి విముక్తి పొందినవాడగును. జగత్తులో ఎవరూ అతణ్ణి లొంగదీయలేరు.

## 35. నకులం (ముంగిస)

**మి:** భంతే నాగసేనా, ముంగిస గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

---

* *చూడుడు 203 మరియూ 255వ పుటలు.*

**నా:** మహారాజా, ముంగిస పాముతో పోరుకు తలపడేముందుగానే విషానికి విరుగుడు అయినట్టి భైషజ్యాన్ని సేవించియే పాముతో తలపడుతుంది. అలాగే యోగావచరుడు కూడా కోపతాపాలు కలహ వివాద విరోధాలతో సతమతమయ్యే జనాలలోకి వెళ్తున్నప్పుడు ముందుగానే మైత్రీభైషజ్యంతో మనస్సును రంగరించుకొని వెళ్ళవలెను. ఇదియే మహారాజా, ముంగిసనుండి గ్రహించవలసిన గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**తస్మా సకం పరేసంపి కాతబ్బా మేత్తభావనా**
**మేత్తచిత్తేన ఫరితబ్బం ఏతం బుద్ధానుసాసనం**

తనపట్ల ఇతరుల పట్ల మైత్రీభావన కలిగియుండవలెను. దశదిశలకు మైత్రీచిత్తాన్ని ప్రసరింపజేస్తూ ఉండవలెను. ఇదియే సమ్మాసంబుద్ధులందరి ఉపదేశం.

## 36. జరసింగాలో (ముసలినక్క)

**మి:** భంతే నాగసేనా, ముసలినక్క గుణాలను రెండింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, ఆహారం విషయంగా జరశృగాలం ఏవగింపు చెందదు. లభించిన ఆహారాన్ని ఎంత అవసరమో అంతమేరకే తింటుంది. అలాగే యోగావచరుడు కూడా ఆహారంగా లభించినది అది ఎలా ఉన్నప్పటికీ ఏవగింపు చెందకుండా దేహయాపనకు ఎంత అవసరమో అంతమేరకే భుజించవలెను. ఇదియే మహారాజా, ముసలినక్కనుండి గ్రహించవలసిన మొదటి గుణం. మహాకాశ్యప స్థవిరుడు కూడా థేరగాథలో ఇలా భాషించియున్నాడు:

**సేనాసనమ్హా ఓరుయ్హ గామం పిండాయ పావిసి**
**భుంజంతం పురిసం కుట్ఠిం సక్కచ్చ నం ఉపట్ఠహిం**
**సో మే పక్కేన హత్థేన ఆలోపం ఉపనామయి**
**ఆలోపం పక్ఖిపంతస్స అంగులిపేత్థ ఛిజ్జథ**
**కుట్టమూలం చ నిస్సాయ ఆలోపం తం అభుఞ్జిసం**
**భుంజమానే వా భుత్తే వా జేగుచ్ఛం మే న విజ్జతి**

కొండగుహనుండి క్రిందకు దిగి భిక్షాటనకై గ్రామంలో ప్రవేశించితిని. భోంచేస్తున్న కుష్ఠపురుషుని ఎదుట భిక్షకై వినయంగా నిలుచుంటిని. కుష్ఠహస్తంతో అతడు తన భోజనపాత్రనుండి కొంత తీసి నా భిక్షాపాత్రలో వేసినాడు. అలా వేస్తున్నప్పుడు

అతని చేతివేళ్ళలో ఒక వేలు ఊడి నా భిక్షాపాత్రలో పడింది. అక్కడే గోడకు ఆనుకొని ఆ భిక్షాభోజనాన్ని ఆరగించితిని. దాన్ని తింటున్నపుడు గానీ తినిన తరువాతగానీ నేను జుగుప్స చెందలేదు.

మరియూ మహారాజా, ఆహారం లభించినపుడు ముసలినక్క "ఇది పరమ దరిద్రం" అని గానీ "ఇది సింహభోజనం" అని గానీ అంచనా వేయదు. అలాగే యోగావచరుడు కూడా "ఇది అధమరకం, ఇది ఉన్నతం, ఇది సగౌరవంగా ఇవ్వబడింది, ఇది తిరస్కారపూర్వకంగా ఇవ్వబడింది–" ఇలాంటి తీర్మానాలు ఏవీ చేయకుండా లభించినదానితో తృప్తి చెందవలెను. ఇదియే మహారాజా, ముసలినక్కనుండి గ్రహించవలసిన రెండవ గుణం. వంగంతపుత్ర ఉపసేనస్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**లూఖేనపి చ సంతుస్సే నాఞ్ఞం పత్థే రసం బహుం**
**రసేసు అనుగిద్ధస్స ఝానే న రమతే మనో**
**ఇతరీతరేన సంతుట్ఠో సామఞ్ఞం పరిపూరతి**

తక్కువరకం భోజనం లభించినా దాని పట్ల కూడా సంతుష్టి చెందవలెను. వేరే ఉత్తమరకం ఆహారం నానా రుచుల సమ్మేళనంతో కూడినదాన్ని కోరుకోరాదు. రుచుల పట్ల లోలుపత ఉన్న చిత్తం ధ్యానం చేయడానికి ఇష్టపడదు. లభించినదానితో తృప్తి చెందేవాడు భిక్షుజీవితానికి న్యాయం చేసేవాడుగా ఉంటాడు.

## 37. మృగం (జింక)

**మి:** భంతే నాగసేనా, జింక గుణాలను మూడింటిని అలవరచుకొనవలసి యున్నదని మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, జింక పగటివేళ అరణ్యంలో సంచరించును. రాత్రివేళ ఆరుబయట గడిపివేయును. అలాగే యోగావచరుడు కూడా పగటివేళ అరణ్యంలోనూ రాత్రివేళ బయలుప్రదేశంలోనూ వసించవలెను. ఇదియే మహారాజా, జింకనుండి గ్రహించవలసిన మొదటి గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా లోమహంసనసుత్తంలో (hair raising disquisition) ఇలా పలికియున్నాడు: "సారిపుత్రా, కఠోర తపస్సు చేసిన ఆ దినాల్లో నేను మంచు కురిసే చలికాలం రాత్రివేళల్లో ఆరుబయటనే ఉండేవాడిని. పగటివేళ దట్టమైన అడవిలో సంచరించేవాడిని. వేసవికాలం చివరిమాసం పగటివేళల్లో ఆరుబయటే తిరిగేవాడిని. రాత్రివేళల్లో అడవిలో ఉండేవాడిని." ఇదియే మహారాజా, జింకనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ఎవరైనా తన మీదికి కత్తిని విసిరినా బాణం వేసినా జింక నేర్పుగా* తప్పించుకొని పారిపోతుంది. వాటికి తన దేహాన్ని తేలిగ్గా అప్పగించివేయదు. అలాగే యోగావచరుడు కూడా క్లేశముల దాడినుండి నేర్పుగా తప్పించుకొనవలెను. తన చిత్తాన్ని వాటికి అప్పగించివేయరాదు. ఇదియే మహారాజా, జింకనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, మనిషిని చూడగానే "వీడి కంట పడరాదు" అనుకొని జింక బెదిరి ఏదో ఒక దిక్కుకు పారిపోతుంది. అలాగే యోగావచరుడు కూడా తగవులు కలహాలు వివాదాలతో సతమతమవుచున్న జనులను మరియూ దుశ్శీలురను, సోమరిపోతులను, గుంపులను ఇష్టపడేవాళ్ళను చూసి "వీళ్ళ గాలి సోకడం మంచిది కాదు" అనుకొని దూరంగా జరిగి వెళ్ళిపోవాలి. ఇదియే మహారాజా, జింకనుండి గ్రహించవలసిన మూడవ గుణం. ధమ్మసేనావతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**మా మే కదాచి పాపిచ్ఛో కుసీతో హీనవీరియో**
**అప్పస్సుతో అనాచారో సమ్మతో అహు కత్థచీ**

పాపాత్ముడు సోమరి ఉత్సాహహీనుడు మూర్ఖుడు దురాచారుడు అయినట్టివానితో నాకు సావాసం ఎన్నటికీ కలుగరాదు.

## 38. గోరూపం (ఎద్దు)

**మి:** భంతే నాగసేనా, ఎద్దు గుణాలను నాలుగింటిని అలవరచుకొనవలెనని మీరు చెబుతుంటారు. ఏవి ఆ నాలుగు గుణములు?

**నా:** మహారాజా, ఎద్దు తన నివాసాన్ని (కొట్టాం) గుర్తుపెట్టుకొనియే యుంటుంది. దాన్ని వదలిపెట్టదు. అలాగే యోగావచరుడు స్వీయదేహం చింతనను వదలిపెట్టరాదు. "ఈ దేహం ఎప్పుడో ఒకప్పుడు అంతరించిపోయేదియే, అరుగుదల చెంది నశించేదియే, ఎక్కడో నలిగి నామరూపాలు లేకుండా పోయేదియే, ఎక్కడో పడి లేదా ఏదో మీద

---

* *వేటాడే జంతువుకు జింక అంత తేలిగ్గా చిక్కదు. ప్రాణభీతితో ఉత్తరం దిశగా పరుగుపెట్టూ వెనక తరుముకొనివచ్చేది మీదబడబోతున్న క్షణంలోనే గిరుక్కున తూర్పుదిశగా పరుగు, తటాలున దక్షిణంగా ఇలా వేటాడే జంతువును జింక ఏమార్చుతూ చమటలు కక్కిస్తూ ఆఖరికి దొరికిపోతుంది. ఆ వేటాడే జంతువు మనిషిలాగా మాట్లాడితే అప్పుడు దాని మాటలు ఇలా ఉండవచ్చు: "ఛీ ఏమి బ్రతుకిది! పట్టెడన్నం కోసం పదిమైళ్ళ పరుగు!*

పడి విరిగిపోయేదియే, తుత్తునియులుగా చెల్లాచెదరుగా చిందరవందరగా అయిపోయేదియే" అని సదా చింతన చేస్తుండవలెను. ఇదియే మహారాజా, ఎద్దునుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, కాడికి మెడను ఇచ్చాక ఎద్దు సుఖదుఃఖాలను లెక్కించకుండా లాగడమే చేస్తుంటుంది. అలాగే యోగావచరుడు కూడా బ్రహ్మచర్యజీవితం (spiritual life ) గడుపుతానని దీక్ష బూనిన క్షణంనుండి జీవితపర్యంతం దుఃఖాలను అవమానాలను తిరస్కారాలను లెక్కబెట్టకుండా బ్రహ్మచర్యజీవితమును కొనసాగించవలెను. ఇదియే మహారాజా, ఎద్దునుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, ఎద్దు దప్పిక వల్ల ఇష్టంతో నీటిని త్రాగుతుంది. అలాగే యోగావచరుడు కూడా అధ్యాత్మికతపన అనే దప్పికతో దహించుకపోతూ ఆచార్యుల ఉపాధ్యాయుల బోధనలను ఇష్టంతో ప్రేమతో శ్రద్ధతో శ్రవణం చేయవలెను. ఇదియే మహారాజా, ఎద్దునుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, ఎవరు నాగలిపిడిని పట్టుకొన్నా ఎవరు బండి మీద కూర్చొని పగ్గాలు పట్టుకొన్నా ఎద్దు ఎదురు తిరగదు. తన పని తాను చేస్తూ ఎట్లా నడిపిస్తే అట్లా పోతుంది. అదేవిధంగానే యోగావచరుడు కూడా తనను సరిదిద్దేందుకు హితవును పెద్దభిక్షువు చెప్పినా చిన్నభిక్షువు చెప్పినా మధ్యవయస్కుడు చెప్పినా గృహస్థుడు చెప్పినా ఉపాసకుడు చెప్పినా శిరసా వహించవలెను. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**తదహూ పబ్బజితో సంతో జాతియా సత్తవస్సికో**
**సోపి మం అనుసాస్సేయ్య సంపటిచ్ఛామి మత్థకే**
**తిబ్బం ఛందం చ పేమం చ తస్మిం దిస్వా ఉపట్ఠపే**
**ఠపేయ్యాచరియట్ఠానే సక్కచ్చ నం పునప్పునం**

ఈ దినమే ప్రవ్రజ్య తీసుకొన్న ఏడేండ్ల పిల్లవాడైనాసరే నాకు హితవు చెప్పడం జరిగినచో శిరస్సు వంచి ఆలకింతును. మిక్కిలి ఇష్టంతో ప్రేమతో వీక్షించుచు ఆచార్యస్థానంలో ఉన్నవానిగా అతణ్ణి గౌరవింతును.

## 39. వరాహం (boar)

**మి:** భంతే నాగసేనా, వరాహం గుణాలను రెండింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, దుస్సహమైన వేసవి ఎండలప్పుడు వరాహం ఉపశమనం కోసం నీటిని ఆశ్రయిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా ద్వేషపూరితమైన ఆలోచనలతో చిత్తం సంక్షోభించినపుడు, దారి తప్పినపుడు, విభ్రమం చెందినపుడు, కుతకుత ఉడికిపోతున్నప్పుడు శీతలమైన అమృతమైన ప్రణీతమైన (lofty) మైత్రీభావనను ఆశ్రయించవలెను. ఇదియే మహారాజా, వరాహంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, వరాహం బురదగుంటను చేరి అక్కడి బురదను తవ్వి పడుకొనేందుకు వీలుగా తొట్టిలాంటి పల్లం చేసుకొని అందులో పడుకొంటుంది. అలాగే యోగావచరుడు కూడా మనస్సులో కాయగతాసతి అనబడే జాగాను చేసుకొని అందులో పడియుండవలెను అంటే కాయగతాసతి ధ్యానంలో నిమగ్నుడైయుండవలెను. ఇదియే మహారాజా, వరాహంనుండి గ్రహించవలసిన రెండవ గుణం. పిండోలభారధ్వాజ స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**కాయే సభావం దిస్వాన విచినిత్వా విపస్సకో**
**ఏకాకియో అదుతియో సేతి ఆరమ్మణంతరే**

"ఇది అనిత్యం, దుఃఖం, అనాత్మ, శూన్యం (empty)" అని కాయ స్వభావాన్ని* పరిశీలించి తెలుసుకొన్న విపశ్యకుడు ఏకాకిగా అద్వితీయుడుగా (companionless) ఉంటూ చిత్తాన్ని ధ్యానంలో నిమగ్నం చేస్తాడు.

---

* *దేహంలోని రూపస్కంధం (material aggregate) నురుగు వంటిది. ఆకారపుష్టితో రమణీయంగా ప్రకాశంగా పైకి కనిపించినా చిన్న ఒత్తిడి కూడా తట్టుకొని నిలబడలేని నిస్సార దౌర్బల్య ఆకారమే. వేదనాస్కంధం (feeling aggregate) నీటిబుడగ వంటిది. మనోహరంగా ఉందని అనుకొంటుండగానే భగ్నమై అంతరించిపోయేదియే. సంజ్ఞాస్కంధం (perception aggregate) ఎండమావివలె వంచకి. నీళ్ళులేని చోట నీళ్ళున్నట్లుగా తోపింపజేసి వంచిస్తుంది, ఏమార్చుతుంది, మోసగిస్తుంది. అలాగే సంజ్ఞాస్కంధం కూడా సుఖం కాని దాన్ని సుఖంగా, అందం కాని దాన్ని అందంగా, శుచి కాని దాన్ని శుచిగా తోపింపజేసి మోసగిస్తుంది. సంస్కారస్కంధం (mental formations aggregate) అరటిబోదె వంటిది. చూసేందుకు దృఢంగా నున్నగా ఘనంగా పొడవుగా ఉన్నప్పటికీ సారం లేనిది. విజ్ఞానస్కంధం (consciousness aggregate) మాయాదృశ్యం (magic show) వంటిది. అందులో వాస్తవం ఏమీ ఉండదు. అంతా భ్రాంతియే.*

## 40. ఏనుగు

**మి:** భంతే నాగసేనా, ఏనుగు గుణాలు ఐదింటిని అలవరచుకొనవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణములు?

**నా:** మహారాజా, ఏనుగు నడయాడునపుడు అది పాదాలు మోపిన చోట భూమి పగుళ్ళుబారిపోవును. అలాగే యోగావచరుడు కూడా స్వీయదేహాన్ని విపశ్యనా ధ్యానానికి (సమ్మసనం) విషయం చేసుకొని చిత్తంలోని క్లేశాలను చీల్చి చెండాడవలెను. ఇదియే మహారాజా, ఏనుగునుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ఏనుగు వెనక్కి చూడదలస్తే మొత్తం శరీరంతో తిరిగి చూస్తుంది. నేరుగా (straight) చూస్తుంది. ప్రక్కలకు చూడదు. అలాగే యోగావచరుడు కూడా వెనక్కి చూడవలసినపుడు మొత్తం దేహాన్ని వెనక్కి మరలించి చూపులు సారించవలెను. అనవసరంగా ఇటు అటు చూడడం పైకి క్రిందికి చూడడం చేయరాదు. కాడి(yoke)యంత మేరకే భూమి మీద చూపులను ప్రసరింపజేస్తూ నడవవలెను. ఇదియే మహారాజా, ఏనుగునుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, ఏనుగు తన శయనస్థానంగా ఏ ఒక స్థానానికి బద్ధమైయుండదు. మేతకై నడయాడు వనప్రదేశముల్లో ఏ ఒక ప్రదేశానికీ బద్ధమైయుండదు. అలాగే యోగావచరుడు కూడా నివాసానికి బద్ధుడైపోరాదు. భిక్షాటన విషయంలోనూ ఏదో ఒక ఊరికో వీధికో కులానికో ఇంటికో బద్ధమైపోరాదు. మనోజ్ఞమూ అనుకూలమూ రమ్యమూ అయిన మండపంగానీ వృక్షఛాయగానీ గృహంగానీ  గుహగానీ కనిపించినచో నివాసంగా వినియోగించు కొనవచ్చు కానీ దానిని స్థిరనివాసంగా చేసుకొనే ఆలోచనను తలెత్తనీయరాదు. ఇదియే మహారాజా, ఏనుగునుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, కుముదం, ఉత్పలం, పద్మం, పుండరీకం పుష్పాలతో శోభాయమానంగా ఉన్న తామరకొలనులో ఏనుగు దిగి గజవరక్రీడ అనబడే జలక్రీడతో వినోదం చెందుతుంది. అలాగే యోగావచరుడు కూడా శుచి, విమలం, ప్రసన్నం అకలుషితం అయిన ధమ్మజలంతో నిండిన, విముక్తి పుష్పాలతో శోభించుచున్న మహాసతిపట్ఠానం అనబడే పుష్కరిణిలో దిగి యోగావచరక్రీడచే వినోదించవలెను. ఇదియే మహారాజా, ఏనుగునుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, ఏనుగు పాదాన్ని సతిపూర్వకంగా (preceded by mindfulness) పైకి తీస్తుంది. సతిపూర్వకంగా పాదాన్ని మోపుతుంది. అలాగే

యోగావచరుడు కూడా నడిచేటప్పుడు సతిసంప్రజ్యన్యములతో పాదాన్ని పైకి తీయవలెను, సతిసంప్రజన్యములతో (mindfulness and awareness) పాదాన్ని మోపవలెను. భిక్షాటనకై పోవునపుడు మరలివచ్చునపుడు కాళ్ళుచేతులను మడచినపుడు సాచినపుడు – ఇలా అన్ని సందర్భములలోనూ సతి సంప్రజన్యములను కలిగియుండవలెను. ఇదియే మహారాజా, ఏనుగునుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్త నికాయంలో ఇలా భాషించియున్నాడు:

**కాయేన సంవరో* సాధు సాధు వాచాయ సంవరో**
**మనసా సంవరో సాధు సాధు సబ్బత్థ సంవరో**
**సబ్బత్థ సంవుతో లజ్జీ రక్ఖితోతి పవుచ్చతి**

దేహాన్ని అదుపులో ఉంచుకోవడం మంచిదే. మాటలను అదుపులో ఉంచుకోవడం మంచిదే. మనస్సును అదుపులో ఉంచుకోవడమూ మంచిదే. అన్ని విషయాల్లోనూ అదుపు కలిగియుండడం మంచిది. ఇలా అన్నిటియందు సంయమం సాధించిన లజ్జావంతుణ్ణి రక్షితుడు (guarded) అని పేర్కొనవచ్చు.

## 41. సింహం

**మి:** భంతే నాగసేనా, సింహం గుణాలను ఏడింటిని కలిగియుండాలని మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఏడు గుణములు?

**నా:** మహారాజా, సింహం యొక్క దేహఛాయ లేతగా(light), విమలంగా, పరిశుద్ధంగా ఉన్నట్టి పాండరఛాయ. అలాగే యోగావచరుడు కూడా విమలమైన పరిశుద్ధమైన చిత్తం కలిగియుండవలెను. కౌకృత్యం మొదలగు క్లేశములు తొలగిపోయిన చిత్తంగా చేసుకొనవలెను. ఇదియే మహారాజా, సింహంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

---

** సంవరం అంటే ఏమిటో ఈ వరకే 16వ పుటలో తెలియజేయడం జరిగింది. పంచశీలదీక్ష తాత్పర్యం ఏమిటంటే "నేను సంవరాన్ని కలిగియుంటానని ప్రతిజ్ఞ చేయుచున్నాను" అని. ప్రతిజ్ఞ ఒకసారి చేస్తే చాలు కదా! ఆపైన చేయవలసింది చేతల్లో చూపించడం. చేతల్లో చూపకపోతే అవి ఉత్తరకుమారప్రతిజ్ఞలుగానే ఉండిపోతాయి. పంచశీలను పాటించడం ఎంత కష్టమో* ***"ముసావాదా వేరమణీ సిక్ఖాపదం సమాదియామి"*** *అనే ప్రతిజ్ఞ ఇట్టే బట్టబయలు చేస్తుంది. పదార్థ స్వరూప స్వభావాలను ఉన్నదున్నట్లుగా (యథాతథంగా) చూసే చూపు (ప్రజ్ఞ) కలుగనంతవరకు మృషావాదంనుండి ఎవడూ తప్పించుకోలేడు. కనుక పంచశీలలో ఈ నాలుగవ ప్రతిజ్ఞకు న్యాయం చేయాలంటే మౌనంగా ఉండడం తప్పించి వేరే మార్గం లేదు.*

మరియూ మహారాజా, సింహం నాలుగు కాళ్ళతో నడయాడే తీరు చాలా ఠీవిగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా నాలుగు ఇద్ధిపాదములు* కలిగినవాడుగా ఉంటూ హుందాగా (majestic) కనపడాలి. ఇదియే మహారాజా, సింహంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, సింహానికి అందమైన సుందరమైన కేసరము లుండును. అలాగే యోగావచరుడు కూడా అందమైన సుందరమైన శీలకేసర ములు కలిగినవాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, సింహంనుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, ప్రాణం పోయినా సరే సింహం దేనికీ ఎవరికీ తలవంచదు. అలాగే యోగావచరుడు కూడా దైనందిన అవసరాలైన దుస్తులు ఆహారం నివాసం ఔషధాలు ఇత్యాదులు లభించని సంకటస్థితిలోనూ ఎవరిముందూ దీనముఖాన్ని ప్రదర్శించరాదు. ఇదియే మహారాజా, సింహం నుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, వేటాడి చంపిన జంతుశరీరాన్ని సింహం భక్షించేటప్పుడు క్రమాన్ని పాటిస్తుంది. భక్షణం తొలుతగా ఎక్కడ మొదలుపెట్టిందో అక్కడ్నుంచి క్రమంగా తింటుంది. ''ఇక చాలు'' అనిపిస్తే వదలివేసి వెళ్ళిపోతుంది. ఈ భాగంలోది చెత్తమాంసం, ఆ భాగంలోది మేలిమాంసం అని ఎంపిక చేయదు. అలాగే యోగావచరుడు కూడా "పలానా ఇంటికి వెళ్తే చక్కని భోజనం లభిస్తుంది" అని భిక్షాటన సమయంలో ఎంపిక చేసుకోరాదు. క్రమాన్ని పాటించియే భిక్ష గైకొనవలెను. మధ్యలో ఈ ఇంటిని ఆ యింటిని వదలివేయకూడదు. భిక్షగా లభించిన దానిమీద "ఇది నాసిరకం ఇది మేలిరకం" అనే అంచనాలకు పాల్పడరాదు. "శరీరధారణ కోసం ఏదో ఒకటి లభించింది తినాలి" అనే తటస్థవైఖరి కలిగియుండవలెను. ఇదియే మహారాజా, సింహం నుండి గ్రహించవలసిన ఐదవ గుణం.

మరియూ మహారాజా, తినగా మిగిలినదాన్ని సింహం కూడబెట్టదు. కడుపు నిండాక మిగిలినదాన్ని "ఏమి చేయాలి? ఎక్కడ భద్రపరచాలి?" అని ఆలోచించదు. అలాగే యోగావచరుడు కూడా చాలినంతవరకే తీసుకోవాలి. కూడబెట్టే మనస్తత్వం ఉండకూడదు. ఇదియే మహారాజా, సింహంనుండి గ్రహించవలసిన ఆరవ గుణం.

---

* *అధ్యాత్మిక గుణసంపత్తి (ఇద్ధి =* success*) పొందడానికి గడించడానికి ఆధారంగా సమాధి (*concentration of mind*) ఉంటుంది. సమాధిని సిద్ధింపజేసే నాలుగింటికి ఇద్ధిపాదములని పేరు. 1. ఛందం, (సాధించాలనే తీవ్ర అభిలాష), వీరియం, చిత్తం (శుద్ధమనస్సు), మీమాంస (విచారం).*

మరియూ మహారాజా, సింహం భోజనం లభించకపోతే ఆందోళన చెందదు. లభించినపుడు ఆవురావురుమని అధికంగా తినివేయదు. అలాగే యోగావచరుడు కూడా భోజనం లభించనిచో ఆందోళన చెందరాదు. లభించినపుడు ఆవురావురుమని అమితంగా తినివేయరాదు. ఆహారంలో దోషదర్శనం చేస్తూ (ఆహారే పటిక్కూలసంజ్ఞా* = contemplating the repulsive nature of nutritive process) భుజించవలెను. దేహంతో ముడిపడియున్న అనేక పరిమితులను అధిగమింపజేయగల ప్రజ్ఞయందే మనస్సు పెట్టి భుజించవలెను. ఇదియే మహారాజా, సింహంనుండి గ్రహించవలసిన ఏడవ గుణం. మహాకాశ్యపస్థవిరుణ్ణి ప్రశంసిస్తూ దేవాతిదేవుడైన భగవానుడు సంయుత్తనికాయంలో ఇలా పలికియున్నాడు: “భిక్షువులారా, ఈ కాశ్యపుడు సంతుష్టిని సాధించినాడు. భిక్షగా ఏ కొంచెం నంచమో లభించినా పరమాన్నం లభించినంతగా తృప్తిపడిపోతాడు. తృప్తిపడే గుణాన్ని ఇతరుల్లోనూ చూసినపుడు వారిని మనస్ఫూర్తిగా మెచ్చుకొంటాడు. భిక్ష పొందేందుకోసం మిథ్యాజీవిక ఉపాయాలకు** పాల్పడడు. ఏమీ లభించని వేళ పరితపించడు. లభించినపుడు తన్మయంతో తృష్ణతో మోహంతో అధికంగా తినివేయడు. ఆహారసేవనంలోని దోషాలను స్మరించుకొంటూ ప్రజ్ఞాభావన చేసుకొంటూ భుజిస్తాడు.”

## 42. చక్రవాకం (ruddy goose)

**మి:** భంతే నాగసేనా, చక్రవాకం గుణాలను మూడింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, చక్రవాకం తనతో జతకట్టిన చక్రవాకాన్ని (mate) జీవిత పర్యంతం ఎడబాయనీయదు. అలాగే యోగావచరుడు కూడా జీవిత పర్యంతం యోనిశ మనసికారాన్ని*** ఎడబాయనీయరాదు. ఇదియే మహారాజా, చక్రవాకం నుండి గ్రహించవలసిన మొదటి గుణం.

---

** చూడుడు శీలం పుస్తకం*

*** చూడుడు అనుబంధం – 2*

**** మనసికారం అంటే ఏమిటో 203 వ పుటలోనూ కొంచం చెప్పడం జరిగింది. గమనించగలరు. మనసికారం (doing in the mind) అంటే మనస్సులో చేయడం అని అర్థం. యోనిశ అంటే యోగ్యమైన సమంజసమైన యుక్తియుక్తమైన అని అర్థం. ఆయా సందర్భాల్లో ఆయా సన్నివేశాల్లో చిత్తం తగినవిధంగా ప్రతిస్పందించడాన్ని యోనిశ మనసికారంగా చెప్పవచ్చు. (proper attention / orderly attention / reasoned attention). అధ్యాత్మపదాలకు అర్థాలు కాగితం మీద వ్రాయడం లేదా నోటితో చెప్పడం లేదా*

⟶

మరియూ మహారాజా, చక్రవాకం నీటిలో లభించే నాచును తిని దానితో తృప్తిపడుతుంది. ఆ తృప్తి వల్ల దాని బలమూ అందమూ క్షీణించకుండా నిలచియుంటాయి. అలాగే యోగావచరుడు కూడా లభించినదానితో తృప్తిచెందే నైజము కలవాడుగా ఉండవలెను. అట్టి తృప్తి వల్ల అతని శీలానికి, సమాధికి, ప్రజ్ఞకు, విముక్తికి, విముక్తిజ్ఞానదర్శనానికి ఇంకా ఇతర కుశలధర్మాలకు క్షీణత ఉండదు. ఇదియే మహారాజా, చక్రవాకంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, చక్రవాకం ఇతర జీవులను హింస పెట్టదు. అలాగే యోగావచరుడు కూడా హింసను విడిచిపెట్టినవాడుగా ఉండవలెను. హింస అనేది మిక్కిలి సిగ్గుపడదగిన విషయంగా భావించవలెను. సకల జీవుల ఎడల ప్రాణుల ఎడల దయాచిత్తం హితాశయచిత్తం కలిగియుండవలెను. ఇదియే మహారాజా, చక్రవాకంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా చక్రవాకజాతకంలో ఇలా భాషించియున్నాడు:

**యో న హంతి న ఘాతేతి న జినాతి న జాపయే**
**మేత్తంసో సబ్బభూతేసు వేరం తస్స న కేనచి**

ఎవడు చంపడో చంపించడో హరించడో హరింపజేయడో సకల జీవరాశుల పట్ల మైత్రిని ప్రసరించునో అట్టివానికి ఎవరితోనూ వైరం ఉండదు.

## 43. పేణాహిక

**మి:** భంతే నాగసేనా, పేణాహిక గుణాలను రెండింటిని గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు? అవి ఏవి?

**నా:** మహారాజా, ఆడపేణాహికపక్షి తన జతగాడైన మగపేణాహిక మీద కినుక వహిస్తే తను జన్మనిచ్చిన పసికూనలను పోషించదు. చెట్టుతొర్రలో పడవేసి ఊరుకొంటుంది. అలాగే యోగావచరుడు కూడా తన మనస్సులో ఉద్భవించిన క్లేశముల పట్ల కినుక వహించవలెను. సమ్మాసంవరం అనే తొర్రలో ఆ క్లేశములను సతిపట్ఠానం సహాయంతో పడవేసి అవి మళ్ళీ తన చిత్తంలోనికి ప్రవేశం పొందనీయకుండా మనోద్వారం వద్ద

---

*పుస్తకాల్లో చూడడం తేలికయే. దైనందినజీవితంలోకి తేవడమే కష్టం. ఎక్కువమందికి జీవితం అయోనిశ మనసికారంగానే గడిచిపోతుంది. "చేతులు కాలాక ఆకులు పట్టుకొన్నట్లు" అనే విధంగానే నడుస్తుంది. మొత్తం బుద్ధవచనానికి "యోనిశ మనసికారం" అని ప్రశంస. బుద్ధవచన అధ్యయనం వల్ల సమ్యక్‌దృష్టి (right views), సమ్యక్ సంకల్పం (right thoughts) కలుగుతాయి. ఇవి మనసికారాన్ని యోనిశ మనసికారంగా మార్చగలవు.*

కాయగతాసతిని కాపలాగా నిలుపవలెను. ఇదియే మహారాజా, పేణాహికనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, పేణాహిక పగటివేళ తన పరిసరాల్లో ఒంటరిగా సంచారం చేసి సాయంకాలం రక్షణ కోసం భద్రత కోసం తన జాతి పక్షిగుంపులోకి వచ్చి చేరుతుంది. అలాగే యోగావచరుడు కూడా ఏకాకిగా ఒంటిరిగా జనసంపర్కం లేకుండా సాధన చేసుకొనవలెను. ఒంటరి జీవితం విసుగ్గానూ భయంగానూ ఆందోళనగానూ ఉంటే భిక్షుసంఘం చేరి రక్షణ పొందవలెను. ఇదియే మహారాజా, పేణాహికనుండి గ్రహించవలసిన రెండవ గుణం. ఒకానొక సందర్భంలో బ్రహ్మాసహాంపతి భగవానుని సన్నిధిలో ఇలా పలికినాడు:

**సేవేథ పంతాని సేనాసనాని చరేయ్య సంయోజనవిప్పమోక్ఖా**
**సచే రతిం నాధిగచ్ఛేయ్య తత్థ సంఘే వసే రక్ఖితత్తో సతీమా**

జనావాసాలకు దూరంగా ఉన్న ప్రదేశాల్లో స్మృతిమంతుడు సాధన చేయాలి. సంయోజనాలను* త్రెంపుకొనేవాడుగా ఉండాలి. అక్కడ ఏకాంత వాసంలో ఆధ్యాత్మిక ఆనందం పొందలేనిచో భిక్షుసంఘం చేరి రక్షణ పొందవలెను.

## 44. గృహకపోతం (పావురం)

**మి:** భంతే నాగసేనా, గృహకపోతం గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసియున్నదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

---

* *కామధాతుస్థాయిని (desire realm) దాటనీయకుండా చిత్తాన్ని కట్టిపడవేసే సంకెళ్ళు రెండున్నాయి. 1.కామరాగం (sensual desires), 2. వ్యాపాదం (hatred). మరోవిధంగా చెప్పాలంటే కామధాతుకారాగారంలోని ఖైదీలను బయటకు పారిపోనీయకుండా కాపలా కాసే రక్షకభటులు కామరాగం, వ్యాపాదం. ఈ రక్షకభటులను కూడా కన్నుగప్పి ఎలాగో బయటపడి పారిపోతున్నవాణ్ణి అడ్డగించి పట్టుకొని మళ్ళీ కారాగారంలోకి నెట్టివేసే కారాగార సహాయక సిబ్బందివంటివి సత్కాయదృష్టి, శీలవ్రతపరామర్శ మొదలగు దృష్టిబంధనాలు (fetters of false views). చాలా ప్రయాసపడి చిత్తాన్ని కామధాతుస్థాయినుండి రూపధాతుస్థాయికి (fine material realm = దేవలోకాల స్థాయికి) చేర్పించగలిగినా సమస్య తీరదు. ఆ స్థాయికి చెందిన బంధనాలు ఉండనే ఉంటాయి. వీటిని ఛేదించుకొని చిత్తాన్ని అరూపధాతుస్థాయికి– సుషుప్తిలాంటి ఆనందఘనస్థాయికి చేర్పించినా ఆ స్థాయి లోనూ బంధనాలు అనుశయరూపంగా (in seed form) ఉంటాయి. ఈ బంధనా లను అన్నింటిని ఛేదించుకొని ముక్తిని పొందాలనే లక్ష్యం మీదనే సాధకుడు శక్తియుక్తులను వినియోగించవలెను.*

**నా:** మహారాజా, గృహకపోతం తను ఏ ఇంటిలో వసిస్తున్నదో ఆ యింటిలో తటస్థంగా మధ్యస్థంగా వసిస్తుంది. ఆ ఇంటిలో ఏమేమి వస్తువులు ఏఏ తీరుగా ఉన్నాయో పట్టించుకొనదు. అలాగే యోగావచరుడు కూడా భిక్షకై గృహస్థుల ఇంటికి వెళ్ళినపుడు ఆ ఇంటిలో పురుషులెందరు? ఎలా ఉన్నారు? స్త్రీలు ఎందరు? ఎలా ఉన్నారు? అక్కడి మంచాలు పీటలు వస్త్రాలు అలంకారాలు ఇంకా ఇతర భోగసామగ్రి ఏమేమి ఏఏ తీరుగా ఉన్నవో గమనించరాదు. అవి తనకు సంబంధించిన విషయాలు కావు. ఏ ఇంటికి వెళ్ళినా తాను శ్రమణుడు అనే విషయాన్ని జ్ఞప్తిలో ఉంచుకొనవలెను. ఇదియే మహారాజా, గృహకపోతం నుండి గ్రహించవలసిన గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా చుల్లనారద జాతకంలో ఇలా భాషించియున్నాడు.

**పవిసిత్వా పరకులం పానేసు భోజనేసు వా**
**మితం ఖాదే మితం భుంజే న చ రూపే మనం కరే**

భిక్షకై ఎవరి ఇంటికైనా వెళ్ళినపుడు మితంగా తిని మితంగా ఆరగించి వచ్చేయాలి. అన్యవిషయాలకు మనస్సును పోనీయరాదు.

## 45. ఉలూకం (గుడ్లగూబ)

**మి:** భంతే నాగసేనా, గుడ్లగూబ గుణాలను రెండింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, గుడ్లగూబ కాకులతో వైరం పెట్టుకొని రాత్రివేళలో కాకులు విశ్రమించిన వృక్షం వద్దకు చేరి చాలా కాకులను హతం చేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా అజ్ఞానంతో వైరం పెట్టుకొని రాత్రిసమయంలో ఒంటరిగా ధ్యానం చేస్తూ అజ్ఞానశత్రువును నలగగొట్టాలి. సమూలంగా పెకలించివేయాలి. ఇదియే మహారాజా, గుడ్లగూబనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, గుడ్లగూబ ఏకాకిగానే ఒంటరిగానే ఏకాంతంగానే ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ఏకాకిత్వాన్ని ఒంటరితనాన్ని ఏకాంతాన్ని ఇష్టపడేవాడుగా అభిలషించేవాడుగా ఉండాలి. ఇదియే మహారాజా, గుడ్లగూబనుండి గ్రహించవలసిన రెండవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్త నికాయంలో ఇలా భాషించియున్నాడు: "భిక్షువులారా, బుద్ధశాసనాన్ని తలదాల్చే భిక్షువు ఏకాంతాన్ని ఇష్టపడేవాడుగా ఉంటూ 'ఇది దుఃఖం' అని ఉన్నదున్నట్లుగా తెలుసుకొంటాడు. 'ఇది దుఃఖసముదయం' అని ఉన్నదున్నట్లుగా తెలుసుకొంటాడు, 'ఇది

దుఃఖనిరోధం' అని ఉన్నదున్నట్లుగా తెలుసుకొంటాడు, 'ఇది దుఃఖనిరోధగామినీమార్గం' అని ఉన్నదున్నట్లుగా తెలుసుకొంటాడు.

## 46. శతపత్రపక్షి (wood pecker)

**మి:** భంతే నాగసేనా, శతపత్రపక్షి గుణం ఒకదాన్ని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, శతపత్రపక్షి కూతపెట్టడం ద్వారా ఇతరులకు కలుగబోయే ముప్పును లేదా కలుగబోయే క్షేమాన్ని ముందుగానే తెలుపుతుంది. అలాగే యోగావచరుడు కూడా ఇతరులకు ధమ్మబోధ చేస్తూ పతనం అనేది ఎంత భయావహమో నిర్వాణం అనేది ఎంత క్షేమదాయకమో తెలియజేస్తుండవలెను. ఇదియే మహారాజా, శతపత్రంనుండి గ్రహించవలసిన ఒక గుణం. పిండోలభారద్వాజ స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**నిరయే భయసంతాసం నిబ్బానే విపులం సుఖం**
**ఉభయానేతానత్థాని దస్సేతబ్బాని యోగినా**

అధోగతి ఎంత భయానకమో భీతావహమో, నిర్వాణం ఎంత గొప్ప సుఖమో – ఈ రెండు విషయాలనే ధమ్మబోధకుడు ప్రజలకు కన్నులకు కట్టినట్లు తెలుపవలెను.

## 47. వగ్గులి (గబ్బిలం)

మి: భంతే నాగసేనా, గబ్బిలం గుణాలను రెండింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, గబ్బిలం ఏదేని ఒక ఇంటిలో ప్రవేశించి కాసేపు చక్కర్లు కొట్టి మళ్ళీ బయటకు వెళ్ళిపోతుంది. అక్కడే తచ్చాడుతూ ఉండదు. అలాగే యోగావచరుడు కూడా భిక్షాటనకై గ్రామంలో ప్రవేశించి వరుసగా ఏడు ఇండ్లల్లో– మధ్యలో మధ్యలో ఆ యింటిని ఈ ఇంటిని వదలివేయడం చేయకుండా–భిక్షాటన చేసి లభించినది తీసుకొని వెంటనే అక్కడ్నుంచి నిష్క్రమించవలెను. అక్కడే తచ్చాడుతూ పిచ్చాపాటి మాట్లాడుతూ కాలయాపనకు దిగరాదు. ఇదియే మహారాజా, గబ్బిలంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ఇతరుల నివాసాల్లో చక్కర్లు కొట్టేటప్పుడు గబ్బిలం అక్కడివారికెవరికీ హాని కలిగించదు. అలాగే యోగావచరుడు కూడా గృహస్థుల వద్దకు వెళ్ళినపుడు అతియాచన చేయరాదు, డొంకతిరుగుడుగా యాచించరాదు, కాయిక

దురాచారానికి పాల్పడరాదు, అతిగా వాగరాదు, వాళ్ళ సుఖదుఃఖాల్లో తాదాత్మ్యం కలిగించుకోరాదు, ఎవరి ఎడలా పక్షపాతబుద్ధి కలిగియుండరాదు, వాళ్ళ మూలకర్మలకు (జీవికకు =livelihood సంబంధించిన పనులకు) అంతరాయం* కలిగించరాదు. సదా వాళ్ళ అభివృద్ధిని కాంక్షించు వాడుగానే ఉండవలెను. దేవాతిదేవుడైన భగవానుడు కూడా దీఘనికాయంలోని లక్షణసుత్తంలో ఇలా భాషించియున్నాడు:

**సద్ధాయ సీలేన బుద్ధియా చాగేన ధమ్మేన బహూహి సాధుహి**
**ధనేన ధఞ్ఞేన ఖేత్తవత్థునా పుత్తేహి దారేహి చతుప్పదేహి చ**
**ఞాతీహి మిత్తేహి చ బంధవేహి బలేన వణ్ణేన సుఖేన చూభయం**
**కథం న హాయేయ్యుం పరేతి ఇచ్ఛతి అత్థస్సమిద్ధిం చ పనాభికంఖతి**

శ్రద్ధ, శీలం బుద్ధి, త్యాగం, ధమ్మం, సద్గుణాలు, ధనం, ధ్యానం, వ్యవసాయ భూములు, నివాసభూములు, పుత్రులు, భార్య, పశుసంపద, దాయాదివర్గం, మిత్రవర్గం, బంధువర్గం, బలం, అందం, సుఖం–ఇవి జనులకు క్షీణించిపోకుండా ఎడబాయకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ఉంటాడు. జనుల ప్రయోజనాలు సిద్ధించాలని ఆకాంక్షిస్తుంటాడు.

## 48. జలూక (జలగ)

**మి:** భంతే నాగసేనా, జలగ గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, జలగ ఎక్కడ శరీరాన్ని కరచుకొంటుందో అక్కడే దృఢంగా అతుక్కుపోయి రక్తాన్ని పీలుస్తుంది. అలాగే యోగావచరుడు కూడా ఏ ఆరమ్మణాన్ని (meditation subject) ఎంపిక చేసుకొంటాడో ఆ ఆరమ్మణం మీదనే చిత్తాన్ని లగ్నం చేయాలి. వర్ణం(colour), సంస్థానం (shape), దిశ, ఆకాశం (స్థలం = location), పరిచ్ఛేదం (delimitation), లింగం (mark), నిమిత్తం (sign)– ఇన్ని కోణాల్లో** ఆరమ్మణాన్ని చింతన చేస్తూ దాన్ని మనోనేత్రం ఎదుట బొమ్మ కట్టించాలి. ఆ ఆరమ్మణం ద్వారా పరమాస్వాదకరమైన విముక్తిరసాన్ని గ్రోలవలెను. ఇదియే మహారాజా, జలగనుండి గ్రహించవలసిన గుణం. అనురుద్ధ స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

---

* *భిక్షువులు ఏదైనా పని చేసిపెట్టమని ఉపాసకులను అడిగితే వాళ్ళు తమ స్వంతపనులను కూడా ప్రక్కనబెట్టి భిక్షువులు అడిగినది చేసిపెడతారు. చేసి పెట్టమనడం తప్పులేదు కానీ అది ఉపాసకుల సమయాన్ని శ్రమను ఎక్కువగా మ్రింగివేసేదిగా ఉండరాదు.*

** *ధ్యానం పుస్తకంలోని కాయగతాసతి అధ్యాయంలో వీటిని వివరంగా చెప్పడం జరిగింది.*

**పరిసుద్ధేన చిత్తేన ఆరమ్మణే పతిట్ఠాయ**
**తేన చిత్తేన పాతబ్బం విముత్తిరసమసేచనం**

పరిశుద్ధమైన చిత్తాన్ని ఆరమ్మణంలో నెలకొల్పి పరమాస్వాదకరమైన విముక్తిరసాన్ని గ్రోలవలెను.

## 49. సర్పం

**మి:** భంతే నాగసేనా, సర్పం గుణాలను మూడింటిని గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు. అవి ఏవి?

**నా:** మహారాజా, సర్పం మొత్తం శరీరాన్ని భూమిమీద ప్రాకింపజేస్తూ నలుదిశలనుండి ఉత్పన్నమయ్యే సూక్ష్మమైన ప్రకంపనలను కూడా పసిగట్టూ తదనుగుణంగా కదులుతూ ఆత్మరక్షణ చేసుకొంటూ పోతుంది. అలాగే యోగావచరుడు కూడా ఈ దౌర్భాగ్యలోకంలో జీవితాన్ని నెట్టున్నప్పుడు ప్రజ్ఞానేత్రంతోనే కదలవలెను. ప్రజ్ఞానేత్రంతో ఏది అనుకూలం ఏది ప్రతికూలమో సరిగ్గా గుర్తిస్తూ సరియైన మార్గంలో పయనించవలెను. ఇదియే మహారాజా, సర్పంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, సర్పం చరించేటప్పుడు తనకు హానికరమైన ఔషధంమొక్కలనుండి దూరంగా జరిగిపోతూ చరిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా తనకు హానికరమైన దుశ్చరితమునకు (చెడునడతకు) దూరంగా జరుగవలెను. ఇదియే మహారాజా, సర్పంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, సర్పం మనిషిని చూడగానే తపిస్తుంది, శోకిస్తుంది, చింతిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా చెడు ఆలోచనలు చేసినపుడు, సాధనలో అరుచి ఏర్పడి సమయం వృథాగా గడిచిపోయినపుడు "అయ్యో, ప్రమాదంలో పడిపోయి ఈ దినాన్ని వృథాగా గడిపివేశాను. ఈ గడిచిన దినాన్ని మళ్ళీ నేను పొందగలనా?" అని తపించవలెను, శోకించవలెను, చింతించవలెను. భల్లాటియజాతకంలో కూడా ఇలా చెప్పబడింది:

**మయేకరత్తం విప్పవసిమ్హ లుద్ద అకామకా అఞ్ఞమఞ్ఞం సరంతా**
**తమేకరత్తం అనుతప్పమానా సోచామ సా రత్తి పున నహేస్సతి**

ఓయీ వేటగాడా, ఒక రాత్రి మేమిరువురము మా ప్రమేయం లేకుండానే ఒకరినొకరు ఎడబాయవలసివచ్చింది. ఒకరినొకరు స్మరించుకొంటూ ఆ దుర్భరమైన

రాత్రిని ఒక యుగంగా గడిపితిమి. ఎడబాటు చెందిన ఆ రాత్రి మేము పడిన వేదన తలచుకొన్నప్పుడు శోకము చెంది "అటువంటి కాళరాత్రి మా శేషజీవితంలో మళ్లీ కలుగకుండుగాక" అని ఆకాంక్షించుచుందుము.

## 50. అజగరం (కొండచిలువ)

**మి:** భంతే నాగసేనా, అజగరం గుణాన్ని ఒకదాన్ని అలవరచుకొనవలెనని మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, అజగరం భారీగా దీర్ఘంగా ఉన్నట్టి మహాశరీరం. కానీ ఆ మహాకాయానికి తగినట్లుగా ఆహారం లభించడం దుర్లభం. ఎన్నో దినాలు చాలీచాలని ఆహారంతో ఆకలిబాధను భరిస్తూ కాలం వెళ్ళబుచ్చుతుంది. అలాగే భిక్షాటనయే జీవికగా కలిగిన యోగావచరుడు– ఇతరులనుండి ఏమైనా లభిస్తుందా అని ఎదురు చూస్తుండడం తప్ప తనకు తానుగా సంపాయించుకోవడం నిషేధింపబడిన యోగావచరునికి – కడుపు నిండా ఆహారం లభించడం దుర్లభమే. కానీ నిర్వాణమే జీవితలక్ష్యంగా పెట్టుకొన్న యోగావచరుడు నాలుగైదు ముద్దలు తక్కువ ఆహారం లభించినా పరమ సంతోషంగా భుజించి శేషించిన ఖాళీఉదరాన్ని జలపానం చేసి పూరించుకొనవలెను. ఇదియే మహారాజా, అజగరంనుండి గ్రహించవలసిన గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**అల్లం సుక్ఖం చ భుంజంతో న బాళ్హం సుహితో సియా**
**ఊనూదరో మితాహారో సతో భిక్ఖు పరిబ్బజే**
**చత్తారో పంచ ఆలోపే అభుత్వా ఉదకం పిబే**
**అలం ఫాసు విహారాయ పహితత్తస్స భిక్ఖునో**

సరసమో శుష్కమో భోజనం లభించగానే కడుపును పూర్తిగా నింపుకోరాదు. మితంగా తిని కడుపును కొంచెం ఖాళీగా ఉంచుకొని స్మృతిమంతుడుగా సంచరించవలెను. నాలుగైదు ముద్దలు తక్కువగానే ఆహారం భుజించి అలా ఖాళీగా ఉంచుకొన్న కడుపును నీళ్ళు త్రాగి పూరించుకొనవలెను. ఆత్మసంయమశీలుడైన భిక్షువుకు దేహయాత్ర సుఖంగా జరిగేందుకు ఇంతమాత్రం చాలు.

## 51. సాలెపురుగు

**మి:** భంతే నాగసేనా, సాలెపురుగు గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, సాలెపురుగు మహాద్భుతంగా సాలెగూడును అల్లుతుంది. దోమ ఈగలాంటి చిన్న చిన్న కీటకాలు ఇటు అటు దూసుకపోతూ ఆయుష్షు తీరినవి సాలెగూడును ఢీకొని అక్కడే తగుల్కొనిపోయి విలవిలలాడుతాయి. సాలెపురుగు వాటిని ఆహారంగా భక్షిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా ఆరు ఇంద్రియద్వారాల్లో సతిపట్ఠానఅల్లికగూడును నిర్మించుకొని సావధానంగా వేచిచూస్తుంటే క్లేశకీటకాలు అందులో తగల్కొనియుండడం కనిపించినపుడు అక్కడికక్కడే వాటిని చంపివేయవలెను. ఇదియే మహారాజా, సాలెపురుగునుండి గ్రహించవలసిన గుణం. అనురుద్ధ స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**చిత్తం నియమే ఛసు ద్వారేసు సతిపట్ఠానవరుత్తమే**
**కిలేసా తత్థ లగ్గా చే హంతబ్బా తే విపస్సినా**

ఆరు ఇంద్రియ ద్వారముల వద్ద సతిపట్ఠానఅల్లికను నిర్మించుకొని మనస్సును నియమించుకొనవలెను. అక్కడ క్లేశకీటకములు తగుల్గొనియుండడం జరిగితే చూసిన క్షణమే విపశ్యనాబాణం ప్రయోగించి విపశ్యకుడు వాటిని కూల్చివేయవలెను.

## 52. పసిబిడ్డ

**మి:** భంతే నాగసేనా, పసిబిడ్డ గుణాన్ని ఒకదాన్ని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, పసికందుకు స్తన్యపాన విషయంలో ఎవ్వరి ప్రోద్బలం, ప్రేరణ, శిక్షణ అవసరం ఉండదు. తనకేది హితమో అది ఎక్కడ లభిస్తుందో సహజంగానే(inborn) బాగా తెలుసు. అక్కడ ముఖాన్ని అర్పిస్తాడు. ఆకలి వేసినపుడు స్తన్యం కోసం బిగ్గరగా ఏడుస్తాడు. అలాగే యోగావచరుడు కూడా ఆత్మహితం ఏదియో తెలిసియుండవలెను. ధమ్మజ్ఞానం కలిగియుండవలెను. బుద్ధవచనం పఠించడం, ప్రశ్నలు వేసి సంశయాలు తొలగించుకోవడం, సరియైన పంథాలో శక్తివినియోగం, ఏకాంతవాసంలో రుచి, గురువులతో కల్యాణమిత్రులతో సాంగత్యం కలవాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, పసిబిడ్డనుండి గ్రహించవలసిన గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా దీఘనికాయంలోని పరినిర్వాణసుత్తంలో ఇలా భాషించియున్నాడు: "ఆనందా, ఆత్మహితానికై యత్నించుము, ఆత్మహితం మీద దృష్టియుంచుము. ఆత్మహితం విషయంలో ఏమరుపాటు వలదు, ఆత్మహితంపట్ల సంవేగం, పట్టుదల కలిగియుండుము"

## 53. చిత్రకధరకూర్మం*

**మి:** భంతే నాగసేనా, చిత్రకధరకూర్మం గుణం ఒకదాన్ని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, చిత్రకధరకూర్మానికి నీళ్ళంటే భయం. నీళ్ళను చూడగానే దూరంగా జరిగి వెళ్ళిపోతుంది. జలానికి అలా దూరంగా ఉండడం వల్ల దాని ఆయుష్షుకు క్షీణత సంభవించదు. అలాగే యోగావచరుడు కూడా ప్రమాదం అంటేనే భయం చెందాలి. అప్రమాదంలో** గుణవిశేషాన్ని చూసేవాడుగా ఉండాలి. ప్రమాదం పట్ల భీతి చెందేవానిలో శ్రామణ్యధర్మాలకు క్షీణత ఏర్పడదు. నిర్వాణానికి చేరువవుతుంటాడు. ఇదియే మహారాజా, చిత్రకధర కూర్మంనుండి గ్రహించవలసిన గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ధమ్మపదంలో ఇలా భాషించియున్నాడు:

**అప్పమాదరతో భిక్ఖు పమాదే భయదస్సి వా**

**అభబ్బో పరిహానాయ నిబ్బానస్సేవ సంతికే**

అప్రమాదవర్తనం పట్ల మక్కువ, ప్రమాదవర్తనం పట్ల భయం ఉన్నవానికి అధ్యాత్మికంగా తిరోగమనం అనేది అసంభవం. అతడు నిర్వాణ సమీపవర్తిగానే ఉంటాడు.

## 54. పవనం (అడవి)

**మి:** భంతే నాగసేనా, అడవి గుణాలను ఐదింటిని గ్రహించవలసినదిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణములు?

**నా:** మహారాజా, అశుచి చేస్తున్న జనులను అడవి బహిరంగపరచదు. అలాగే యోగావచరుడు కూడా ఇతరుల అపరాధములను వైఫల్యాలను బహిరంగపరచరాదు. ఇదియే మహారాజా, అడవినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, అడవి జనసమ్మర్దం లేనిదిగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా రాగం, ద్వేషం, మోహం, మానం (pride), దిట్ఠి (false views) మొదలగు క్లేశముల సందడి లేని చిత్తం కలిగినవాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, అడవినుండి గ్రహించవలసిన రెండవ గుణం..

---

* *రంగురంగుల బిందువులతో అలరారే చిప్ప కలిగిన స్థలచరమైన తాబేలు.*

** *చూడుడు 233 వ పుట.*

మరియూ మహారాజా, అడవి ఏకాంతంగా జనుల కోలాహల ధ్వనులు లేనిదిగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా పాపకములు, అనార్యములు (ignoble), అకుశలములు అయిన ధమ్మములు (mental states) లేనివాడుగా ఉండవలెను. ఇదియే మహారాజా, అడవినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, అడవి ప్రశాంతంగా పరిశుద్ధంగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ప్రశాంతచిత్తుడుగా పరిశుద్ధచిత్తుడుగా ఉండవలెను. క్లేశజ్వాలలు చల్లార్చుకొని శీతీభూతుడయినవాడుగానూ అధికుడను అనే భావం లేనివాడుగానూ దాపరికం లేనివాడుగానూ ఉండవలెను. ఇదియే మహారాజా, అడవినుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, ఆర్యజనులు (noble persons = మునులు) నడయాడే చోటుగా, నివసించేచోటుగా అడవి ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ఆర్యజనుల సంపర్కం కలిగియుండవలెను. ఇదియే మహారాజా, అడవినుండి గ్రహించవలసిన ఐదవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సంయుత్తనికాయంలో ఇలా భాషించియున్నాడు:

**పవివిత్తేహి అరియేహి పహితత్తేహి ఝాయిభి**
**నిచ్చం ఆరద్ధవీరియేహి పండితేహి సహావసే**

ఏకాంతవాసులు, సంయమవంతులు, ధ్యానులు, ఉత్సాహవంతులు పండితులు అయినట్టి ఆర్యజనులతో (noble persons) సదా సాంగత్యం కలిగియుండవలెను.

## 55. వృక్షం

**మి:** భంతే నాగసేనా, వృక్షం గుణాలను మూడింటిని గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, వృక్షంలో పుష్పాలు పుష్పిస్తాయి. ఫలాలు పండుతాయి. అలాగే యోగావచరునిలోనూ విముక్తిపుష్పాలు పుష్పించాలి, శ్రామణ్యఫలాలు పండాలి. ఇదియే మహారాజా, వృక్షంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, వృక్షం తన వద్దకు చేరినవారికి నీడనిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా తనవద్దకు వచ్చినవారికి ఆమిషదానం (material gifts) ద్వారా గానీ ధమ్మదేశనాదానం (gift of teaching Dhamma) ద్వారా గానీ సత్కరించవలెను. ఇదియే మహారాజా, వృక్షంనుండి గ్రహించ వలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, వృక్షం నీడనిచ్చే విషయంలో భేదభావం చూపదు, పక్షపాతం వహించదు. సమంగానే నీడనిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా చోరులు, వధకులు, శత్రువులు అనే భేదభావం కలిగియుండరాదు. అందరిని తనతో సమానంగా భావించగలిగేవిధంగా మైత్రీభావనను పెంపొందించు కొనవలెను. "ఈ జీవులు పరస్పరం వైరం లేకుండా హింస లేకుండా బాధలు పెట్టుకోకుండా సుఖితులగుదురుగాక" అని సదా ఆశించుచుండవలెను. ఇదియే మహారాజా, వృక్షంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**వధకే దేవదత్తమ్హి చోరే అంగులిమాలకే**
**ధనపాలే రాహులే చ సబ్బత్థ సమకో ముని**

తనను హత్య చేయదలచిన దేవదత్తుని ఎడల, చోరుడైన అంగులిమాలుని ఎడల, ధనపాలకుంజరం ఎడల, కుమారుడు రాహులుని ఎడల– అందరి ఎడల శాక్యమునికి (భగవానునికి) సమభావమే ఉండినది.

## 56. మేఘం

**మి:** భంతే నాగసేనా, మేఘం గుణాలను ఐదింటిని గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ ఐదు గుణములు?

**నా:** మహారాజా, మేఘం వర్షించినపుడు దుమ్ము అణగిపోతుంది. మురికి కొట్టుకొనిపోతుంది. అలాగే యోగావచరుడు కూడా మనస్సులో ఉత్పన్నమయ్యే క్లేశములనెడి దుమ్ముదూసిని అణచివేయువలెను, కడిగివేయువలెను. ఇదియే మహారాజా, మేఘంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, మేఘం వర్షించేటప్పుడు భూతాపాన్ని చల్లార్చి వేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా మైత్రీభావన ద్వారా దేవగణాలనుండి నిరయవాసుల వరకు విస్తరించియున్న ఈ మొత్తం సంసారమండలానికి చల్లదనం కలిగించాలి. ఇదియే మహారాజా, మేఘంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, మేఘం వర్షించినపుడు భూమి మీద పడియున్న విత్తనాలను మొలకెత్తింపజేసి వృద్ధి చెందిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా సకలసత్త్వుల్లోని శ్రద్ధాబీజాలను మొలకెత్తింపజేసి వృద్ధిగావింపజేసి తద్వారా వారికి మూడు విధములైన సంపత్తులను–మానుషీసంపత్తు, దైవీసంపత్తు, నిర్వాణసుఖ సంపత్తు– పొందింపజేయవలెను. ఇదియే మహారాజా, మేఘంనుండి గ్రహింపవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, మేఘం రుతువును అనుసరించి వర్షించుచు వృక్షములను తృణములను లతలను గుల్మములను ఓషధులను శుష్కించి నశించిపోనీయక కాపాడుతూ ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ఆయా సందర్భాల్లో యోనిశ మనసికారమును* చిత్తంలో జనింపజేసుకొంటూ శ్రమణధర్మమును కాపాడుకొనుచుండవలెను. సకల కుశలధర్మములకు మూలకారణంగా ఉన్నట్టిది యోనిశ మనిసికారమే. ఇదియే మహారాజా, మేఘం నుండి గ్రహించవలసిన నాలుగవ గుణం.

మరియూ మహారాజా, మేఘం వర్షించినపుడు నదులను తటాకములను కొలనులను సరస్సులను బిలములను బావులను పూరింపజేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా ఆధ్యాత్మిక అనుభూతుల పట్ల అభిలాష ఉన్నవారి మానసములను ఆగమధర్మమేఘాన్ని** వర్షించడం ద్వారా తృప్తిపరచవలెను. ఇదియే మహారాజా, మేఘంనుండి గ్రహించవలసిన ఐదవ గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**బోధనేయ్యం జనం దిస్వా సతసహస్సేపి యోజనే**
**ఖణేన ఉపగంత్వాన బోధేతి తం మహాముని**

బోధనలు వినుటకు యోగ్యులైన జనములు, లక్షయోజనాల అవతల కొందరున్నారని తెలిసినా ఒక్క క్షణంలోనే వారి చెంతకు చేరి మహాముని (భగవానుడు) బోధించును.

## 57. మణిరత్నం

**మి:** భంతే నాగసేనా, మణిరత్నం గుణాలను మూడింటిని గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, మణిరత్నం అత్యంతపరిశుద్ధంగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా పరిశుద్ధమైన జీవిక కలవాడుగా ఉండాలి. ఇదియే మహారాజా, మణిరత్నంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, మణిరత్నం అన్యమైనవాటితో మిశ్రితం కాదు. అలాగే యోగావచరుడు కూడా పాపాత్ములతో పాపాత్ముల సహాయకులతో (friends) సావాసం చేయరాదు. ఇదియే మహారాజా, మణిరత్నంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

---

* *చూడుడు 203, 255 వ పుటలు.*

** *సుత్తపిటకం, వినయపిటకం, అభిధమ్మపిటకం.*

మరియూ మహారాజా, మణిరత్నం ఇతర జాతిరత్నాల సరసన పొదిగించడానికి తగినదిగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా ఉత్తములు శ్రేష్ఠులు వరేణ్యులు అయిన మహాజనులతో సాంగత్యం కలిగియుండవలెను. స్రోతాపన్నులు సకృదాగాములు, అనాగాములు, అర్హతులు, త్రైవిద్యులు, షడభిజ్ఞులు అయిన శ్రమణరత్నాల సాంగత్యం కలిగియుండవలెను. ఇదియే మహారాజా, మణిరత్నంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సుత్తనిపాతంలో ఇలా భాషించియున్నాడు:

**సుద్ధా సుద్ధేహి సంవాసం కప్పయవ్హో పతిస్సతా**
**తతో సమగ్గా నిపకా దుక్ఖస్సంతం కరిస్సథ**

శుద్ధజనులుగా ఉంటూ శుద్ధజనులతో సహవాసం చేస్తూ పరస్పరం గౌరవంతో ఐకమత్యంతో దాక్షిణ్యంతో ఉంటూ దుఃఖాన్ని తుదముట్టించండి.

## 58. వేటగాడు

**మి:** భంతే నాగసేనా, వేటగాని గుణములు నాలుగు గ్రహించవలసినవిగా ఉన్నవని మీరు చెబుతుంటారు. ఏవి ఆ నాలుగు గుణములు?

**నా:** మహారాజా, వేటగాడు వేటాడేటప్పుడు చాలా చురుగ్గా ఉంటాడు. కునికిపాట్లుపడే రకంగా ఉండడు. అలాగే యోగావచరుడుకూడా జాగరూకుడుగా ఉండవలెను. నిద్రాశీలిగా ఉండరాదు. ఇదియే మహారాజా, వేటగాడినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, వేటగాడు వేటాడదలచిన వన్యప్రాణుల మీదనే తన చిత్తాన్ని లగ్నం చేసియుంటాడు. అలాగే యోగావచరుడు కూడా తను ఎంపిక చేసుకొన్న ఆరమ్మణం (meditation subject) మీదనే చిత్తాన్ని లగ్నం చేసియుంచవలెను. ఇదియే మహారాజా, వేటగాడినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, వేటగాడు ఏ సమయంలో వేటకు పోవాలో చక్కగా తెలిసి ఆ ప్రకారమే వేటకు వెళ్తుంటాడు. అలాగే యోగావచరుడు కూడా ఏ సమయంలో ధ్యానానికి కూర్చోవాలో తెలిసియుంటాడు. "ఇది ధ్యానసమయం. ఇది ధ్యానంనుండి లేచి తక్కిన పనులు చేయవలసిన సమయం" అని తెలిసియుంటాడు. ఇదియే మహారాజా, వేటగాడినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, వన్యమృగాన్ని చూడగానే వేటగాని హృదయం ఆనందంతో తబ్బిబ్బవుతుంది. అలాగే యోగావచరుడు కూడా తను ఎంపిక చేసుకొన్న ఆరమ్మణం పట్ల మోదముతో ప్రమోదముతో హృదయాన్ని ఉల్లాస పరచవలెను. "ఈ ఆరమ్మణాన్ని ఆసరాగా చేసుకొని నేను అధ్యాత్మికంగా ఉన్నతి చెందబోవుచున్నాను" అని హర్షించుచుండవలెను. ఇదియే మహారాజా, వేటగాడినుండి గ్రహించవలసిన నాలుగవ గుణం. మోఘరాజ స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**ఆరమ్మణే లభిత్వాన పహితత్తేన భిక్ఖునా**
**భియ్యో హాసో జనేతబ్బో అధిగచ్ఛిస్సామి ఉత్తరిం**

ఆరమ్మణంలో* చిత్తాన్ని నిలిపియుంచగలిగినంతస్థాయికి ధ్యానంలో పురోగతి సాధించిన భిక్షువు "అలౌకికాన్ని (నిర్వాణసాక్షాత్కారం) నిశ్చయంగా పొందబోవుచున్నాను" అని ఆనందించవలెను.

## 59. బాడిసికుడు (బెస్తవాడు)

**మి:** భంతే నాగసేనా, బెస్తవాని గుణాలు రెండు గ్రహించవలసినవిగా ఉన్నవని మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, బెస్తవాడు గాలం వేసి చేపలు పట్టుకొంటాడు. అలాగే యోగావచరుడు కూడా జ్ఞానగాలంతో శ్రామణ్యఫలాలను (spiritual attainments) అందుకోవాలి. ఇదియే మహారాజా, బెస్తవానినుండి గ్రహించవలసిన మొదటిగుణం.

మరియూ మహారాజా, బెస్తవాడు చిన్నతునకను ఎరగా ఉంచి దాని ద్వారా పెద్దలాభాన్ని పొందుతాడు. అలాగే యోగావచరుడు కూడా స్వల్పమైన అల్పమైన తుచ్ఛమైన లోకామిషాన్ని (material things of the world) పరిత్యజించి విపులమైన మహత్తరమైన మహాసంపదయైన శ్రామణ్యఫలాలను పొందవలెను. ఇదియే మహారాజా, బెస్తవానినుండి గ్రహించవలసిన రెండవ గుణం. రాహులస్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

---

* ధ్యేయవిషయానికి (meditation subject) ఆరమ్మణం అని పేరు. ఉదా॥ ఆనాపానసతి ధ్యానంలో శ్వాసప్రశ్వాసలు ఆరమ్మణంగా ఉంటుంది. శ్వాసప్రశ్వాసల్లో రంగు, రుచి, వాసన – ఇవేవీ ఉండవు. ఇట్టి దాన్ని మనస్సు ఎలా ఆరమ్మణంగా చేసుకోగలదు? అని ప్రశ్నించరాదు. ఆశ్వాస ప్రశ్వాసలు వాయోధాతువుకు చెందుతాయి. వాయోధాతువును స్పర్శజ్ఞానం ద్వారానే సాక్షాత్తుగా తెలియడం సాధ్యమవుతుంది. కనుక ఆశ్వాస ప్రశ్వాసలు ముక్కుకొనవద్ద కలిగించే మృదుస్పర్శలే ఆరమ్మణం అవుతుంది.

**సుఞ్ఞతంచానిమిత్తం చ విమోక్ఖంచాప్పణిహితం**
**చతురో ఫలే ఛళభిఞ్ఞా చజిత్వా లోకామిసం లభే**

విమోక్షముఖములయిన* శూన్యత, అనిమిత్తత, అప్రణిహితములను మరియూ నాలుగు శ్రామణ్యఫలాలను, షడభిజ్ఞలను** పొందవలెనంటే లోకామిషాన్ని త్యజించడం తప్పనిసరి అవుతుంది.

## 60. తచ్ఛకుడు (వడ్రంగి)

**మి:** భంతే నాగసేనా, వడ్రంగి గుణాలను రెండింటిని గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, వడ్రంగి కొయ్యచెక్కలను రంపంతో కోసేటప్పుడు కోయవలసిన చోట నల్లదారం చుట్టి గుర్తుగా పెట్టుకొని ఆ గుర్తుననుసరించి కోస్తాడు. అలాగే యోగావచరుడు కూడా జినశాసనం (teachings of Buddha) నిర్దేశించినవిధంగా శీలం అనే భూమి మీద పాదాలు మోపి, శ్రద్ధ అనే హస్తంతో, ప్రజ్ఞ అనెడి కరవాలాన్ని పట్టుకొని క్లేశములను తెగనరుకవలెను. ఇదియే మహారాజా, వడ్రంగి నుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, వడ్రంగి చేవలేని చెక్కలను ప్రక్కనబెట్టి సారమైన చెక్కలనే తీసుకొంటాడు. అలాగే యోగావచరుడు అధ్యాత్మవిషయాల్లో ఏది పొట్టు, ఏది సారమో చక్కగా గుర్తించి పొట్టును వదలివేసి సారమునే గైకొనవలెను. ఇదియే మహారాజా, వడ్రంగినుండి గ్రహించవలసిన రెండవ గుణం***. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సుత్తనిపాతంలో ఇలా భాషించియున్నాడు:

---

* *మార్గప్రవేశానికి మూడు ద్వారాలున్నాయి. అనిత్యచింతన ద్వారా ప్రవేశిస్తే ఆ ప్రవేశానికి అనిమిత్తతావిమోక్షముఖం అని పేరు. దుఃఖాకారచింతన ద్వారా మార్గప్రవేశం పొందితే ఆ ప్రవేశానికి అప్రణిహితావిమోక్షముఖం అని పేరు. అనాత్మచింతన ద్వారా ప్రవేశం పొందితే ఆ ప్రవేశానికి శూన్యతావిమోక్షముఖం అని పేరు.*

** *చూడుడు 217 వ పుటలోని పాదపీఠిక*

*** *ఇక్కడ మూలాన్ని కుదించడం జరిగింది. మూలంలో నానావిధములైన దృష్టివాదముల (speculative views) పట్టిక ఉన్నది. గార్దభశృంగముల వర్ణకాంతులు ఎలా ఉంటాయి? అనే తీరులో చర్చను లేవదీసుకొనిన ఈ దృష్టివాదములు వాక్కలహరూపంగానే ఉండిపోతాయి. నీలవర్ణమని ఒకరు, రక్తవర్ణమని మరొకరు, అవదాతవర్ణమని మరొకరు లేనిదాని గురించి వ్యర్థంగా చర్చిస్తారు. ఇవి వాదోపవాదాల గోలను పెంచుతాయి. కావలసింది గోల ఏదియూ లేని చిత్తస్థితి (మౌనం)!*

**కారండవం నిద్ధమథ కసంబుం చాపకస్సథ**
**తతో పలాపే వాహేథ అస్సమణే సమణమానినే**
**నిద్ధమిత్వాన పాపిచ్ఛే పాపఆచారగోచరే**
**సుద్ధా సుద్ధేహి సంవాసం కప్పయవ్హో పతిస్సతా**
**తతో సమగ్గా నిపకా దుక్ఖస్సంతం కరిస్సథ**

కలుపుమొక్కలను, చెత్తాచెదారాన్ని, పొట్టును తొలగించే విధంగా మీరు మీ భిక్షుసమూహంనుండి బూటకపు భిక్షువులను* పాపాత్ములను దురాచారులను గెంటివేయుడు. పరిశుద్ధులుగా ఉంటూ పరిశుద్ధులతో సాంగత్యం కలిగి పరస్పరం గౌరవించుకొంటూ ఐకమత్యంగా మెలగుతూ సంసారదుఃఖానికి ముగింపు పలుకగల సాధనల్లో తత్పరులైయుండుడు.

## 61. కుంభం (కుండ)

**మి:** భంతే నాగసేనా, కుంభం గుణం ఒకదాన్ని గ్రహించదగినదిగా మీరు చెబుతుంటారు. ఏమిటి ఆ గుణం?

**నా:** మహారాజా, నిండుకుండ తొణకదు. అలాగే యోగావచరుడు కూడా ఆగమంలో అధిగమంలో శ్రామణ్యంలో చక్కని పరిపూర్ణమైన అవగహన కలిగియుండవలెను. అదేసమయం మానంతో (Pride), దర్పంతో (arrogance) తొణికిసలాడరాదు. వినయశీలిగానూ నిగర్విగానూ కల్లాకపటం లేనివాడుగానూ మితభాషిగానూ ఉండవలెను. ఇదియే మహారాజా, కుంభంనుండి గ్రహించ వలసిన గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా సుత్తనిపాతంలో ఇలా భాషించియున్నాడు:

**యదూనకం తం సణతి యం పూరం సంతమేవ తం**
**అడ్డకుంభూపమో బాలో రహదో పూరోవ పండితో**

---

* *భిక్షువులు ఐదు రకాలు 1. సంజ్ఞాభిక్షువు, 2. ప్రతిజ్ఞాభిక్షువు, 3. భిక్షణశీలో భిక్షువు, 4. జ్ఞప్తిచతుర్థకర్మణోపసంపన్నో భిక్షువు, 5. భిన్నక్లేశో భిక్షువు. చివరి రకం భిక్షువే అసలుసిసలైన భిక్షువు. చిత్తంలో క్లేశములను సమూలంగా పెకలించివేసినవాడు. నాలుగవ రకం భిక్షువు కూడా మెచ్చదగినవాడే. క్లేశనిర్మూలనం విషయంలో సదా యత్నపరుడుగా ఉన్నవాడు. ఇక మొదటి మూడు రకాలు బూటకపు భిక్షువులు. గుండు గీయించుకొని కాషాయం కట్టుకొని పైకి భిక్షువులుగా కనిపిస్తారు.* ***ధాన్యంలాగా కనిపించే పొట్టులాంటివారు వీరు. ధాన్యంమొక్కలాగా కనిపించే కలుపుమొక్కలాంటివారు వీరు.***

అరాకొరగా ఉన్నది తొణికిసలాడుతుంది. నిండుగా ఉన్నది శాంతంగా ఉంటుంది. అరాకొర కుండలాంటివాడు మూర్ఖుడు. నిండుకొలనులాంటివాడు పండితుడు.

***గమనిక :*** *61వ అంశంగా కాళాయసం (*black iron*) ఉన్నది. దీని గుణాలు రెండు గ్రహించదగినవిగా ఉన్నాయని ప్రస్తావించబడింది. కానీ ఆ గుణముల విషయం సరిగా అర్థం కావడం లేదు. ఇంగ్లీషులో మిలిందపఞ్హను అనువదించిన* I.B. Horner *కూడా ఈ అంశం అర్థం కావడం లేదని ఒప్పుకొన్నారు. కనుక కాళాయసం అంశాన్ని ఇక్కడ అనువదించలేదు.*

## 62. ఛత్రం (గొడుగు)

**మి:** భంతే నాగసేనా, గొడుగు గుణాలు మూడు గ్రహించవలసినవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, గొడుగును ఎవడు పట్టుకుంటాడో అది అతని తల మీద ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా క్లేశముల నెత్తిమీద ఉండాలి అంటే వాటి మీద ప్రభుత్వాన్ని కలిగియుండాలి. వాటికి దాసుడు కారాదు. ఇదియే మహారాజా, గొడుగునుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, గొడుగు శిరస్సు మీద ఎత్తిపట్టుకొన్నప్పుడు శిరస్సుకు అది ఆసరాగా ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా యోనిశ మనసికారాన్ని* ఆసరాగా కలిగియుండాలి. ఇదియే మహారాజా, గొడుగునుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, ఎండ, గాలి, వాన తాకిడిని గొడుగు అడ్డుకొంటుంది. అలాగే యోగావచరుడు కూడా పండితమ్మన్యులు(pseudo scholars) బోధించే నానావిధ దృష్టివాదముల (false views) గాలులను, రాగద్వేష మోహములనెడి మూడగ్నులను, క్లేశములనెడి వర్షధారలను అడ్డగించి వేస్తుండవలెను. ఇదియే మహారాజా, గొడుగునుండి గ్రహించవలసిన మూడవ గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు ఇలా భాషించియున్నాడు:

**యథాపి ఛత్తం విపులం అచ్ఛిద్దం థిరసంహితం**
**వాతాతపం నివారేతి మహతీ మేఘవుట్ఠియో**

---

* *చూడుడు 203 మరియూ 255వ పుటలు.*

**తథేవ బుద్ధపుత్తోపి సీలఛత్తధరో సుచి**
**కిలేసపుట్ఠిం వారేతి సంతాపతివిధగ్గయో**

చిల్లులు లేనట్టి దృఢమైన పెద్దగొడుగు గాలి ఎండ వాన తాకిడిని అడ్డుకొంటుంది. అలాగే నిర్మలుడైన బుద్ధపుత్రుడు (disciple of Buddha) కూడా శీలఛత్రం ద్వారా క్లేశవర్షపాతాన్ని మరియూ మూడగ్నుల (రాగం, ద్వేషం, మోహం) తాపాన్ని నివారించవలెను.

## 63. క్షేత్రం (పొలాలు)

**మి:** భంతే నాగసేనా, పొలాల గుణాలను మూడింటిని గ్రహించవలసియున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, పొలాలు కాలువలను కలిగియుంటాయి. అలాగే యోగావచరుడు కూడా సత్ప్రవర్తనకు సంబంధించిన వివిధ నియమాలను కలిగియుండవలెను. ఇదియే మహారాజా, పొలాలనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, పొలాలు గనిమలను (గట్లు) కలిగియుంటాయి. ఆ గనిమలు నీళ్ళను నిలిపియుంచి ధాన్యం మొక్కలను పుష్టినొందింపజేస్తాయి. అలాగే యోగావచరుడు కూడా శీలం లజ్జ అనే గనిమలచే అధ్యాత్మిక జీవన విధానాన్ని కాపాడుకొని శ్రామణ్యఫలాలను పొందవలెను. ఇదియే మహారాజా, పొలాలనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, పొలాల్లో పంటలు పండుతాయి. రైతుకు ఆనందాన్నిస్తుంది. చల్లిన గింజలు కొంచమే అయినా దిగుబడి ఎక్కువగానే ఉంటుంది. అలాగే యోగావచరుడు కూడా సాధనల్లో సాఫల్యం పొందువాడుగా ఉండాలి. దాయకులకు (donors) సంతోషాన్ని కలిగించాలి. "ఈ మహాత్ముడికి స్వల్పంగా సమర్పించినా చాలు తమకు పుణ్యముల పంట మెండుగా పండుతుంది" అని దాయకులు సంతోషం చెందాలి. ఇదియే మహారాజా, పొలంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. వినయపాలకుడు ఉపాలి స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**ఖేత్తూపమేన భవితబ్బం ఉట్ఠానవిపులదాయినా**
**ఏస ఖేత్తవరో నామ యో దదాతి విపులం ఫలం**

ఎక్కువ పంటను అందించే పొలం లాగా భిక్షువు కూడా దాయకులకు పుణ్యముల పంటను మెండుగా పండించేవాడుగా ఉండవలెను. కనుకనే సత్యదర్శనం చేసిన భిక్షువు అనుత్తరమైన (unsurpasssed) పుణ్యక్షేత్రంగా లెక్కింపబడుచున్నాడు.

## 64. అగదం (antidote = విరుగుడు మందు)

**మి:** భంతే నాగసేనా, అగదం గుణాలను రెండింటిని గ్రహించవలసియున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ రెండు గుణములు?

**నా:** మహారాజా, అగదంలో క్రిములు నిలిచియుండలేవు. అలాగే యోగావచరుని చిత్తంలో కూడా క్లేశక్రిములు నిలిచియుండరాదు. ఇదియే మహారాజా, అగదంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, పాముకాటు వలనగానీ ఏదేని స్పర్శ వలనగానీ దృష్టి వలనగానీ ఆహారపానీయాల ద్వారాగానీ దేహంలో ప్రవేశం పొందిన విషాన్ని అగదం నివారిస్తుంది. అలాగే యోగావచరుడు కూడా చిత్తంలో ప్రవేశం పొందిన రాగ ద్వేష మోహ మాన దిట్ఠి (false views) విషాలను నివారించవలెను. ఇదియే మహారాజా, అగదంనుండి గ్రహించవలసిన రెండవ గుణం. దేవాతిదేవుడైన భగవానుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**సంఖారానం సభావత్థం దట్ఠుకామేన యోగినా**
**అగదేనేవ హోతబ్బం కిలేసవిసనాసనే**

సంఖారముల నిజస్వరూపం ఏమిటి అని చూడదలచిన యోగి క్లేశవిషములను నాశనం చేసే ప్రభావం కలిగినవాడైయుండవలెను.

## 65. భోజనం

**మి:** భంతే నాగసేనా, భోజనం గుణాలను మూడింటిని గ్రహించవలసి యున్నవని మీరు చెబుతుంటారు. ఏవి ఆ మూడు గుణములు?

**నా:** మహారాజా, భోజనం సకల జీవుల మనుగడకు ఆధారంగా ఉన్నది. అలాగే యోగావచరుడు అధ్యాత్మికమార్గంలో పయనం చేస్తున్నవారికి సహాయంగా తోడుగా ఆధారంగా ఉండవలెను. ఇదియే మహారాజా, ఆహారంనుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, ఆహారం సకలజీవులకు బలాన్ని పెంపుచేస్తుంది. అలాగే యోగావచరుడు కూడా సకలజీవుల పుణ్యవృద్ధికి కృషి చేయవలెను. ఇదియే మహారాజా, ఆహారంనుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, ఆహారం సకలజీవులకు అభిలషణీయంగా ఉంటున్నది. అలాగే యోగావచరుడు కూడా సకలజనులకు ప్రీతిపాత్రుడు కావలెను. ఇదియే

మహారాజా, భోజనంనుండి గ్రహించవలసిన మూడవ గుణం. మొగ్గల్లాన స్థవిరుడు కూడా ఇలా పలికియున్నాడు:

**సంయమేన నియమేన సీలేన పటిపత్తియా**
**పత్థితేన భవితబ్బం సబ్బలోకస్స యోగినా**

సంయమం, నియమం, శీలం, ప్రతిపత్తి (Practice) కలిగియుండడం ద్వారా యోగి సకలజనులకు అభిలషణీయుడు కావలెను.

## 66. విలుకాడు

మి: భంతే నాగసేనా, విలుకాని గుణములు నాలుగింటిని గ్రహించవలసి యున్నవిగా మీరు చెబుతుంటారు. ఏవి ఆ నాలుగు గుణములు?

నా: మహారాజా, విలుకాడు లక్ష్యాన్ని ఛేదించుటకు బాణాన్ని ఎక్కుపెట్టదలచి రెండుపాదాలను భూమిమీద దృఢంగా మోపుతాడు. మోకాళ్ళను సాచియుంచుతాడు. బాణాల పొదిని నడుముకు కట్టుకొంటాడు (ఇక్కడ ధనుస్సు చాలా పెద్దదిగా ఎత్తుగా ఉన్నట్టిదని అర్థం చేసుకొనవలెను. బాణప్రయోగం చేసేటప్పుడు చేతులు శిరస్సుకు కాస్త పైభాగంలోనే ఉంటాయి) పిడికిళ్ళు బిగించి వ్రేళ్ళమధ్య సందు (gaps) లేకుండా చేస్తాడు. మెడను ఎత్తిపెట్టుకొంటాడు. నోటిని మూసి ఉంచుతాడు. కళ్ళను కాస్త కుంచించి లక్ష్యం మీదనే తిన్నగా (straight) దృష్టిని పెట్తాడు. "కొట్టగలను" అనే ఆత్మవిశ్వాసంతో మందహాసం చేస్తాడు. అలాగే మహారాజా, యోగావచరుడు కూడా శీలం అనబడే భూమి మీద, వీరియం (mental energy) అనబడే పాదాలు మోపి, క్షాంతి సౌజన్యములు అనెడి మోకాళ్ళను సాచియుంచుకొని, సంవరంలో (restraint) మనస్సును ఉంచి, ఇచ్ఛను, ఉత్కంఠను (excitement) త్రొక్కిపెట్టి, ఆరు ఇంద్రియ ద్వారములకు సతి (mindfulness) అనే కాపును ఉంచి "నా చిత్తంలోని సర్వక్లేశాలను గురి చూసి చావుదెబ్బ కొట్టుగలను" అనే ఆత్మవిశ్వాసంతో మందహాసం చేయవలెను. ఇదియే మహారాజా, విలుకానినుండి గ్రహించవలసిన మొదటి గుణం.

మరియూ మహారాజా, విలుకాడు ఎల్లప్పుడూ తనవద్దనే ఆళకం అనే పరికరాన్ని సిద్ధంగా ఉంచుకొంటాడు. ఈ పరికరం ద్వారా వంకరటింకరగా ఉన్న బాణాలను మళ్ళీ సరి చేసుకొంటాడు. అలాగే యోగావచరుడు కూడా సతిపట్ఠానం అనబడే ఆళకాన్ని అన్ని వేళలా సిద్ధంగా ఉంచుకొని చిత్తం వంకటిటింకర అయినప్పుడల్లా వెంటనే మళ్ళీ సతిపట్ఠానభావన అనెడి ఆళకంలో సరి చేసుకొనవలెను. ఇదియే మహారాజా, విలుకానినుండి గ్రహించవలసిన రెండవ గుణం.

మరియూ మహారాజా, విలుకాడు ఎంత ప్రవీణుడైనా లక్ష్యఛేదనఅభ్యాసం విడువక చేస్తూనే ఉంటాడు. అలాగే యోగావచరుడు కూడా స్వీయదేహాన్ని ఆరమ్మణంగా ఉంచుకొని అభ్యాసం విడువక చేస్తుండవలెను. ఈ దేహాన్ని లక్ష్యంగా చేసుకొని ఎలా చింతన అభ్యాసం చేయాలి? క్రింద తెలిపిన నలభై విధములుగా* దేహచింతన చేయవలెను.

1. అనిచ్చతో (as impermanent), 2.దుక్ఖతో, 3. రోగతో, 4. గండతో (as a boil), 5.సల్లతో (as a dart), 6. అఘతో (as a calamity), 7.ఆబాధతో (as an affliction), 8.పరతో(as an alien), 9. పలోకతో (as disintegrating), 10.ఈతితో (as a plague), 11. ఉపద్దవతో (as a disaster), 12. భయతో (as a terror), 13. ఉపసగ్గతో (a menace), 14.చలతో (as fickle), 15.పభంగుతో (as perishable), 16. అద్ధువతో (as unenduring), 17. అతాణతో (as no protection), 18. అలేణతో (as no shelter), 19. అసరణతో (as no refuge), 20.రిత్తతో (as empty), 21. తుచ్ఛతో (as vain), 22.సుఞ్ఞతో (as void), 23.అనత్తతో (not self), 24.ఆదీనవతో (as a danger), 25. విపరిణామధమ్మతో(as subject to change), 26. అసారకతో (as having no core), 27.అఘమూలతో (as the root of calamity), 28. వధకతో (as murderous), 29. విభవతో

---

** ఈ పట్టికలో అనిచ్చతో పలోకతో చలతో పభంగుతో అద్ధువతో విపరిణామ ధమ్మతో అసారకతో విభవతో సంఖతతో మరణధమ్మతో –ఈ పది అనుపశ్యనలు అనిత్యానుపశ్యనకు సంబంధించినవి. రూపం అనిత్యం, వేదన అనిత్యం, సంజ్ఞ అనిత్యం, సంఖారం అనిత్యం, విజ్ఞానం అనిత్యం– ఇలా ఒక్కొక్క స్కంధాన్ని ఆలంబనంగా చేసుకొని చింతన చేస్తే అనిత్యానుపశ్యనల సంఖ్య యాభై అవుతుంది.*

*పరతో రిత్తతో తుచ్ఛతో సుఞ్ఞతో అనత్తతో– ఈ ఐదు అనుపశ్యనలు అనాత్మచింతనకు సంబంధించినవి. వీటిని ఐదు స్కంధాలకు అన్వయించుకొంటే అనాత్మానుపశ్యనల సంఖ్య ఇరవై ఐదవుతుంది.*

*ఇక ఈ పట్టికలో తక్కిన 25 అనుపశ్యనలు దుఃఖానుపశ్యనకు చెందినవి. ఒక్కొక్క స్కంధానికి వీటిని అన్వయించుకొంటే దుఃఖానుపశ్యనల సంఖ్య నూట ఇరవై ఐదు అవుతుంది. మొత్తం కలిపితే 200 అనుపశ్యనలు అవుతాయి. "ఇన్ని అనుపశ్యనలా? నా వల్ల కాదు" అని వెనుకంజవేయరాదు. "ఈ ఒకటి చేయగలను" అని ఏ ఒకటి మీద మనస్సు పడిందో ఆ ఒక అనుపశ్యనను విడువక చేస్తుంటే ఎప్పుడో ఒకప్పుడు మార్గప్రవేశం జరిగి స్రోతాపన్నస్థాయిని చేరుకోవచ్చు. ఈ నలభై ఆకారాల అనుపశ్యనను వివరంగా తరువాతి పుస్తకం "ప్రజ్ఞ"లో చెప్పడం జరుగుతుంది.*

(as due to be annihilated), 30. సాసవతో (as subject to cankers), 31. సంఖతతో (as formed), 32. మారామిసతో (as mara's bait), 33.జాతిధమ్మతో (as subject to birth), 34.జరాధమ్మతో, 35. బ్యాధిధమ్మతో, 36. మరణధమ్మతో, 37.సోకధమ్మతో, 38. పరిదేవధమ్మతో, 39. ఉపాయాసధమ్మతో, 40. సంకిలేసధమ్మతో (subject to defilements).

ఇదియే మహారాజా, విలుకానినుండి గ్రహించవలసిన మూడవ గుణం.

మరియూ మహారాజా, విలుకాడు తన అభ్యాసాన్ని ప్రొద్దున సాయంకాలం చేస్తాడు. అలాగే యోగావచరుడు కూడా ప్రొద్దున సాయంత్రం చిత్తాన్ని ఆరమ్మణం మీదనే నిలిపియుంచే అభ్యాసం చేస్తుండవలెను. ఇదియే మహారాజా, విలుకానినుండి గ్రహించవలసిన నాలుగవ గుణం. ధమ్మసేనాపతి సారిపుత్ర స్థవిరుడు కూడా ఇలా భాషించియున్నాడు:

**యథా ఇస్సాసకో నామ సాయం పాతం ఉపాసతి**
**ఉపాసనం అరించంతో లభతే భత్తవేతనం**
**తథేవ బుద్ధపుత్తోపి కరోతి కాయుపాసనం**
**కాయుపాసనం అరించంతో అరహత్తమధిగచ్ఛతి**

విలుకాడు ప్రొద్దున సాయంత్రం విడువక విలువిద్యను అభ్యసిస్తుంటాడు. అభ్యాసాన్ని నిర్లక్ష్యం చేయనందువల్ల అతనికి జీతబత్తెములు అందుతూనే ఉంటాయి.

అలాగే బుద్ధపుత్రుడు కూడా స్వీయదేహాన్ని ఆరమ్మణంగా చేసుకొని ప్రొద్దున సాయంత్రం సతిపట్ఠానభావనను నిర్లక్ష్యం చేయకుండా అభ్యసిస్తూ ఉంటే అర్హత్వఫలాన్ని తప్పక పొందుతాడు.

## నిగమనం (conclusion)

మిలింద నాగసేనుల సంవాదం ముగియగానే మహాపృథివి ఆరుసార్లు కంపించింది. విద్యుల్లతలు (మెరుపుతీగలు) ధగధగ మెరిసాయి. దేవతలు దివ్యపుష్పవర్షం కురిపించారు. మహాబ్రహ్మ సాధుకారం (applauded) చేసాడు. మహాసముద్రగర్భంలో మేఘగర్జనవలె మహాఘోషం వినిపించింది. రాజా మిలిందుడు, అతని అంతఃపురగణం శిరస్సున అంజలి ఘటించి నాగసేనునికి నమస్కరించారు.

రాజా మిలిందుడు ఎంతగానో సంతోషించాడు. గర్వాన్ని పూర్తిగా తొలగించుకొన్నవాడయ్యాడు. బుద్ధశాసనంలోని సారం తెలిసినవాడయ్యాడు.

త్రిరత్నములయందు శ్రద్ధ కలవాడయ్యాడు. మోహము (confusion), స్తబ్ధత (obduracy=మొండితనం) తొలగినవాడయ్యాడు. నాగసేనుని ప్రవ్రజ్యాగుణాల పట్ల, ప్రవర్తన పట్ల మిక్కిలి ప్రసన్నుడయ్యాడు (pleased). మానదర్పాలు (pride and arrogance) నశించిన అతడు విషం లేని మహానాగం వలె కనిపిస్తూ ఇలా అన్నాడు: "భంతే నాగసేనా, బుద్ధవిషయం మీది ప్రశ్నలకు నీవు సమాధానం చెప్పిన తీరు ఆశ్చర్యం! బుద్ధశాసనంలో ధమ్మసేనాపతి సారిపుత్రుని తరువాత నీలాగా సమాధానాలు చెప్పగలిగినవాడు మరొకడు లేడు. భంతే, నా అత్యయాలను (transgressions) క్షమించవలసినదిగా ప్రార్థిసున్నాను. ఉపాసకునిగా నన్ను అంగీకరించుము. ఈ దినంనుండి జీవిత పర్యంతం త్రిరత్నములకు శరణగతుడుగా ఉంటాను".

తరువాత రాజా మిలిందుడు మిలిందం అనే పేరుతో ఒక విహారం నిర్మించి నాగసేనునికి అప్పగించాడు. నాలుగు ప్రత్యయములను (four requisites = ఆహారం, వస్త్రం, నివాసం, ఔషధం) అందిస్తూ నాగసేనుణ్ణి మరియూ అసంఖ్యాక భిక్షువులను సేవించాడు. కాలాంతరంలో రాజ్యాన్ని కుమారునికి అప్పగించి అనాగారుడు (homeless) అయ్యాడు. విపశ్యనధ్యానం (insight meditation) వృద్ధి చేసుకొని అర్హత్వపదం పొందాడు.

రెండు వందల అరవై రెండు* ప్రశ్నలున్న ఈ గ్రంథం సమాప్తం. ఈ గ్రంథంలోని ప్రశ్నలను ఇరవై రెండు వర్గాలుగా విభజించడం జరిగింది. ఈ ఇరవై రెండు వర్గాలు (divisions) మళ్ళీ ఆరు కాండములుగా (parts) విభక్తమయ్యింది. ఒక తరంనుండి మరో తరానికి అందుతూ వచ్చిన ప్రశ్నలను ఇక్కడ గ్రంథస్థం చేయడం జరిగింది. అందకుండా లుప్తమైపోయిన ప్రశ్నలు నలభైరెండు. కనుక లభించినవి లభించనవి అన్నీ కలుపుకొంటే మొత్తం ప్రశ్నలు మూడువందల నాలుగు. ఈ ప్రశ్నలన్నిటికీ **మిలిందపఞ్హ** అని పేరు.

---

* *ఇప్పుడు లభ్యం అవుతున్న గ్రంథాల్లో 236 ప్రశ్నలే ఉన్నాయి.*

## మిలిందపఞ్హా ముగింపు గాథలు

**పఞ్హా పసత్థా లోకస్మిం కథా సద్ధమ్మట్ఠితియా**
**పఞ్ఞాయ విమతిం హంత్వా సంతిం పప్పోంతి పండితా**
**యస్మిం ఖంధే ఠితా పఞ్ఞా సతి తత్థ అనూనకా**
**పూజావిసేసస్సాధారో అగ్గో సేట్ఠో అనుత్తరో**
**తస్మా హి పండితో పోసో సంపస్సం హితమత్తనో**
**పఞ్ఞవంతం హి పూజేయ్య చేతియం వియ సాదరో**

ప్రజ్ఞ లోకంలో ప్రశస్తమైనది. సద్ధర్మాన్ని లోకంలో నిలిపియుంచే ధార్మికప్రసంగాలూ ప్రశంసనీయములే. ప్రజ్ఞ ద్వారా సంశయాలు తొలగించుకొని పండితులు (wisemen) చిత్తశాంతిని పొందుతారు. ఎవనియందు ప్రజ్ఞ నెలకొనియున్నదో, స్మృతి (mindfulness) కొరత లేకుండా ఉన్నదో అట్టి వ్యక్తి పూజనీయుడుగానూ అగ్రగణ్యుడుగానూ శ్రేష్ఠుడుగానూ అనుత్తరుడుగానూ (unexcelled) అవుతాడు. కనుక ఏది ఆత్మహితమో గుర్తించిన బుద్ధిమంతుడైన మానవుడు ప్రజ్ఞావంతుణ్ణి ఒక చైత్యంవలె భావించి సాదరంగా పూజించవలెను.

**మిలింద ప్రశ్నలు సంక్షిప్తానువాదం సమాప్తం**

# అనుబంధం - 1

## ఏకమా? భిన్నమా?

*క:** భదంతా, నేనొక ప్రశ్న అడగదలచాను కానీ మీ శ్రమణులు బహు బోల్లకులు (loquacious = chatterboxes = బహుప్రలాపులు= వాగుడుకాయలు) కనుక నేనేది అడుగుతానో దానివరకే మీ మాటలు పరిమితం చేసుకొని జవాబు చెప్పాలి.

*నా:* ప్రశ్నించుము మహారాజా.

*క:* భదంతా, జీవుడు దేహం ఒకటియా? భిన్నభిన్నమా?

*నా:* మహారాజా, నీవడిగిన ప్రశ్న అవ్యాకృతం** అవుతుంది (సమాధానం చెప్పకుండా మౌనం పాటించవలసిన ప్రశ్న).

---

* *క : కళింగుడు  నా : నాగసేనుడు*

** *ప్రశ్నలు నాలుగు రకాలు: 1.ఏకాంశవ్యాకరణీయం, 2. విభజ్యవ్యాకరణీయం, 3. పరిపృచ్ఛ్యవ్యాకరణీయం, 4. స్థాపనీయం. తడుముకోకుండా ఠకీమని జవాబు ఇవ్వడానికి వీలైన ప్రశ్న ఏకాంశవ్యాకరణీయం. ఉదా॥ మనుషులందరూ చచ్చేవాళ్ళేనా? అని అడిగితే అందరూ చచ్చేవాళ్ళే. ఎవ్వడూ ఇక్కడ గూటం కొట్టుకొని ఉండబోయేవాడు లేడు అని జవాబు. విభాగం చేసుకొని జవాబు ఇవ్వవలసిన ప్రశ్న విభజ్యవ్యాకరణీయ ప్రశ్న. ఉదా॥ చచ్చేవాళ్ళందరూ మళ్ళీ పుడతారా? అని అడిగితే క్లేశాల మూట ఉన్నవాళ్ళు పుడతారు. ఆ మూట లేనివాళ్ళు పుట్టరు అని జవాబు. ప్రశ్నకు ప్రతిప్రశ్న వేసి జవాబు ఇవ్వవలసినవి పరిపృచ్ఛ్య వ్యాకరణీయములు. ఉదా॥ ఇందుమతి తెలివైనదా? మూర్ఖురాలా? అని అడిగితే ఎవరితో పోల్చి అడుగుతున్నావు? రంగవల్లితో పోల్చి అడుగుతున్నావా? సత్యవతితో పోల్చి అడుగుతున్నావా? అని ప్రతిప్రశ్న వేయాలి. రంగవల్లితో అని చెబితే తెలివైనదే అని బదులు; సత్యవతితో అని చెబితే మూర్ఖురాలు అని బదులు. బదులు ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండవలసిన ప్రశ్న స్థాపనీయం లేదా అవ్యాకరణీయం. ఉదా॥ గాడిదకొమ్ములు ఊదారంగులో ఉంటాయా తెలుపురంగులో ఉంటాయా అని అడిగితే మౌనమే జవాబు.*

*భగవానుడు బదులు పలుకకుండా మౌనం పాటించిన పద్నాలుగు ప్రశ్నలకు అవ్యాకృతములు (*unanswered questions*) అని పేరు. దీనికి మరో పేరు స్థాపనీయములు (*set aside questions*). ఈ పదునాలుగు ప్రశ్నలు ఒక పృచ్ఛకుడు ఒక్కసారిగా అడిగినవి*

⟶

**క:** భదంతా, నేను ముందే చెప్పానుకదా కప్పదాటుగా మీరు బదులు చెప్పరాదు, అడిగినదాని విషయంగానే బదులు చెప్పాలని. కానీ మీరు అవ్యాకృతం అని కప్పదాటు పద్ధతిగానే సమాధానం చెప్పినారు.

***నా:*** మహారాజా, నేను కూడా మిమ్మల్ని ఒక ప్రశ్న అడగదలచాను. కానీ రాజులు బహుబోల్లకులు కనుక నేనేమి అడుగుతానో దానివరకే పరిమితమై సమాధానం చెప్పాలి.

**క:** భదంతా, ప్రశ్న అడగవచ్చు.

**నా:** మహారాజా, మీ అంతఃపుర ప్రాంగణంలోని మామిడిచెట్టుకు కాసిన పండ్లు పుల్లగా ఉంటాయా? తీపుగా ఉంటాయా?

---

<—*

*కావు. మాలుంక్యపుత్రుడు అడిగినవి కొన్ని. మరో సందర్భంలో వత్సగోత్ర పరివ్రాజకుడు అడిగినవి కొన్ని. మరొక సమయంలో ముక్తిక పరివ్రాజకుడు అడిగినవి కొన్ని. వీరి ప్రశ్నలకు భగవానుడు మౌనం వహించాడు. ఈ ప్రశ్నలన్నీ ఆత్మ విషయంగా అడిగిన ప్రశ్నలు. శరీరం లోపల ఇటు అటు చక్కర్లు కొడుతూ ఆత్మ అనే పదార్థం ఒకటి ఉందనీ అది జీర్ణమై పనికిరాకుండాపోయిన పాతశరీరాన్ని వదలి మరో కొత్తశరీరంలోకి దూరుతుందని వాళ్ళ నమ్మిక. లేనిదాని మీద వేసిన ప్రశ్నలు అవి. తాబేలు చిప్పమీది వెంట్రుకలు మృదువుగా ఉంటాయా? బిరుసుగా ఉంటాయా? లాంటి ప్రశ్నలు. మరి అలాంటప్పుడు ఆ ప్రశ్నలకు "లేదు" అని బల్లగుద్ది బదులు ఇచ్చియుండవచ్చుకదా! మౌనం పాటించడం దేనికి? అని ఎవరైనా ఇక్కడ ప్రశ్నించవచ్చు. పృచ్ఛకుడు ఏ అభిప్రాయాన్ని మనస్సులో పెట్టుకొని ప్రశ్న వేశాడో ఆ అభిప్రాయాన్ని భగవానుడు కనిపెట్టేవాడు. ప్రశ్నలు అడిగినవారు కర్మ, కర్మఫలం – ఈ హేతు ఫలవ్యవస్థను అంగీకరించినవారు. కర్మ, కర్మఫలం – ఈ రెండింటి మధ్య సంబంధం ఉండాలంటే ఆత్మను అంగీకరించకతప్పదు అనే అభిప్రాయం కలిగినవారు. హేతు ఫలవ్యవస్థను అంగీకరించినవారు కనుక వాళ్ళు సమ్యక్‌దృష్టి కలిగినవాళ్ళుగానే పరిగణించాలి. అటువంటివాళ్ళకు "ఆత్మ లేదు" అని భగవానుడు చెప్పియుంటే వాళ్ళ చిత్తాలు గందరగోళం చెందియుండేవి. "మరణించాక మిగిలేది ఏమీ లేదు బూడిద తప్ప" అనే మిథ్యాదృష్టి కలిగించుకొని అగాధంలో పడిపోయేవాళ్ళు. భగవానుడు మహాకరుణా మయుడు కనుక "లేదు" అని బదులు పలుకలేదు. అప్పటికి మౌనం వహించాడు. తరువాత వాళ్ళకు ప్రతీత్యసముత్పాదాన్ని బోధించినాడు. ఆ బోధనలు విన్నాక వాళ్ళకు వాళ్ళుగా "లేదు" అనే అవగాహనకు వచ్చినారు. "కర్మ ఉన్నది. కర్మ ఫలం ఉన్నది. జీవాత్ముడు కానరాడు" అనే అవగాహన కలిగించుకొన్నారు. ఆ పద్నాలుగు ప్రశ్నల పట్టిక ఇచ్చి పాఠకులను ఇప్పుడు చీకాకు పెట్టదలచుకోలేదు.*

**క:** భదంతా, నా అంతఃపుర ప్రాంగణంలో మామిడిచెట్టు లేనే లేదు.

**నా:** మహారాజా, నేను ముందే చెప్పానుకదా అడిగినదాని విషయంగానే బదులు చెప్పాలని. అడిగిన ప్రశ్నకు బదులు చెప్పకుండా "మామిడిచెట్టు లేనే లేదు" అని అన్యవిషయం చెబుతున్నావు.

**క:** భదంతా, మామిడిచెట్టే లేనప్పుడు ఇక దాని పండ్లు పులుపా తీపా నేనెలా చెప్పగలను?

**నా:** మహారాజా, అలాగే జీవుడు (soul = ఆత్మ అనబడే ప్రత్యేకపదార్థం) లేనప్పుడు ఇక శరీరంతో దాని సంబంధం గురించి ఏకమా భిన్నమా (identical or different?) ఎలా చెప్పగలను?

# అనుబంధం - 2

## మహాపురుషలక్షణాలు

భగవానుని విగ్రహాలు ఎన్నో దేశాల్లో ఎన్నో విధాలుగా ఉండినప్పటికీ చూసిన వెంటనే "బుద్ధుడు" అని గుర్తించగలుగుచున్నాము. విగ్రహాల్లో కనిపించే కొన్ని ప్రత్యేకలక్షణాల వల్ల (marks) ఈ గుర్తింపు వెంటనే కలగుతుంది. లుంబినిలో జనించి కుశీనగరంలో అంతరించిన భౌతికరూపానికి ప్రతిరూపాలు కావు ఈ విగ్రహాలు. భగవానుని సమకాలీనుల్లో పుణ్యాత్ములకు భగవానుని దివ్యరూపం గోచరించేది. తరువాతి కాలంలోనూ ధ్యానులకు ధ్యానంలో భగవానుని దివ్యరూపం గోచరించేది. ఈ దివ్యరూపాన్ని పోలినవియే విగ్రహాలు. భక్తులు యోగులు సాక్షాత్కరించుకొన్న దివ్యరూపం ముప్పైరెండు మహాపురుష లక్షణాలతోనూ ఎనభై అనువ్యంజనాలతోనూ (minor marks) విరాజిల్లే  దేదీవ్యమానరూపం. ఈ రూపం ఎత్తు 18 అడుగులు. 32 మహాపురుషలక్షణా లను, 80 అనువ్యంజనాలను అష్టసాహస్రిక ప్రజ్ఞాపారమితను వ్యాఖ్యానించిన హరిభద్రుడు వివరిస్తూ ఒక్కొక్కదానికి కారణంగా ఒక్కొక్క పుణ్యక్రియను చెప్పినాడు. దీనినిబట్టి ఈ దివ్యరూపం పుణ్యరాశుల ఫలంగా చెప్పవచ్చు. విస్తరభీతిచేత ఇక్కడ లక్షణాలను అనువ్యంజనాలను వివరించడం లేదు. ఇక జ్ఞానస్వరూపములైన అష్టాదశ ఆవేణికధర్మాలు ఏవనగా దశబలములు, నాలుగు వైశారద్యములు, మూడు స్మృత్యుపస్థానములు, మహాకరుణ. ఇవి సమ్యక్ సంబోధి వల్ల సంక్రమించినట్టి అసాధారణ బుద్ధధర్మాలు.

## బోధిపక్ష్యధమ్మములు

బోధిప్రాప్తికి అనుకూలించేవి సహకరించేవి అయినట్టి చిత్తవిశేషాలకు బోధిపక్ష్యధర్మములు అని పేరు. ఇవి ఏడు వర్గాలుగా విభక్తమైన 37 ధర్మములు. అష్టాంగమార్గం కూడా ఇందులో చివరి వర్గంగా చేర్చబడింది. ఒకే విషయాన్ని విస్తరంగానూ సంక్షిప్తంగానూ చెప్పడం బౌద్ధంలో కనిపిస్తుంది. సుఖంగా అర్థం కావడానికి విస్తరపద్ధతిలో, మరచిపోకుండా జ్ఞప్తిలో నిలుపుకోడానికి వీలుగా సంక్షిప్తపద్ధతిలో బోధనలుంటాయి. మార్గస్వరూపం ఎలా ఉంటుందో విస్తరించి చెప్పడం కోసం బోధిపక్ష్యధర్మాలు, మార్గస్వరూపాన్ని మరచిపోకుండా జ్ఞప్తి చేసుకోవడానికి వీలుగా సంక్షిప్తంగా అష్టాంగమార్గం చెప్పబడినాయి. విస్తారంగా ఉన్నదాన్ని సంక్షిప్తం చేయవచ్చు.

సంక్షిప్తంగా ఉన్నదాన్ని విస్తారం చేయవచ్చు. 37 బోధిపక్ష్యధర్మాలనుండి అష్టాంగ మార్గాన్ని విడదీస్తే మిగిలియుండేవి 29. ఈ 29 ధర్మములు కూడా అష్టాంగమార్గంలో ఎలా ఇమిడిపోతాయో చూపవచ్చు. తొలుతగా బోధిపక్ష్యధర్మాల పట్టిక:

**నాలుగు సతిపట్ఠానములు:** 1. కాయానుపశ్యన, 2. వేదనానుపశ్యన, 3. చిత్తానుపశ్యన, 4. ధమ్మానుపశ్యన.

**నాలుగు ప్రధానములు:** వీరియం అనబడే చిత్తవిశేషానికి లభించిన గౌరవ బిరుదు ఇది. వీరియం అంటే కుశలోత్సాహం. కుశలం అంటే మంచి అని అర్థం. మంచిని సాధించడంలో చెడుని నిర్మూలించడంలో ఉత్సాహం కలిగినట్టి చిత్తవిశేషానికి వీరియం అని పేరు. ఈ వీరియం ప్రదర్శించే ఉత్సాహం నాలుగు రీతులుగా ఉండడం వల్ల కృత్యభేదములను అనుసరించి వీరియములు నాలుగు అని పట్టిక.

**నాలుగు ఇద్ధిపాదములు:** ఇద్ధి అంటే సిద్ధి (sucess) అని అర్థం. సిద్ధిహేతువులకు ఇద్ధిపాదములు అని పేరు 1. ఛందం (సాధించాలి అనే ఉత్కటమైన అభిలాష), 2. వీరియం, 3.చిత్తం (శీలం వల్ల, ధ్యానం వల్ల శుద్ధి పొందిన చిత్తం), మీమాంస (చింతామయి ప్రజ్ఞ మరియూ భావనామయ ప్రజ్ఞ). ఇవి ఇద్ధిపాదములుగా బిరుదు పొందినాయి.

**ఐదు ఇంద్రియములు:** 1. శ్రద్ధ, 2. వీరియం, 3. స్మృతి, 4. సమాధి, 5. ప్రజ్ఞ. ఇంద్రియములు అనే పదానికి ఆధిపత్యం కలిగినవి అని అర్థం. ఈ ఐదు కుశలచిత్తవిశేషాలు చిత్తాన్ని శుద్ధిచేయడంలో ఆధిపత్యాన్ని కలిగియుంటాయి. చిత్తకాలుష్యాలయిన అశ్రద్ధను, కౌసీద్యమును (సోమరితనం), ప్రమాదమును (అజాగ్రత్త), విక్షేపములను, సమ్మోహములను (delusions) ఇవి చిత్తంనుండి గెంటివేసి శుద్ధి చేస్తాయి. కనుక వీటికి ఇంద్రియములని పేరు.

**ఐదు బలములు:** పైన తెలిపిన ఇంద్రియాలు బాగా నిలదొక్కుకొని బలపడి స్థిరపడినపుడు బలములు అనే బిరుదు పొందుతాయి.

**ఏడు బోధ్యంగములు:** 1. స్మృతి, 2. ధర్మప్రవిచయం (ప్రజ్ఞ) 3. వీరియం, 4. ప్రీతి, 5. ప్రస్రబ్ధి (serenity = ప్రశాంతత), 6. సమాధి (ఏకాగ్రత) 7. ఉపేక్ష (ఉపేక్ష పదిరకాలు. ఇక్కడ బోధ్యంగఉపేక్షను తీసుకొనాలి. లయము, ఔద్ధత్యం అనబడే రెండు చిత్తవిశేషాలు సమాధిని దెబ్బతీస్తాయి. లయం అనేది సమాధి అవస్థను మెల్లగా సోమరితనంలోకి నెట్టివేస్తుంది. ఔద్ధత్యం అనేది చిత్తంలో వీరియం మోతాదు ఎక్కువైనపుడు ఏర్పడే ఒక అలజడి. ఇది కూడా సమాధిని దెబ్బతీస్తుంది. లయమూ

ఔద్ధత్యమూ లేకుండా మధ్యస్థంగా ఉన్న చిత్తస్థితికి బోధ్యంగఉపేక్ష అని పేరు. గాలితాకిడి లేని చోట వెలిగే దీపశిఖలాగా ధ్యానం నిశ్చలంగా కొనసాగుతుంది. ఈ నిశ్చలావస్థయే ఉపేక్ష). ఈ ఏడు ధర్మాలు పైన తెలిపిన ఇతర పట్టికల్లో ఉండినప్పటికీ మళ్ళీ ప్రస్తావించడం ఎందుకంటే సాధకుడు మార్గంలో పురోగమిస్తూ చివరగా బోధిని పొందబోయే క్షణంలో ఇవన్నీ అతని చిత్తంలో పరాకాష్ఠరూపంలో ఉంటాయి. కనుక ఈ ఏడింటికి బోధ్యంగములు అని బిరుదు ఇవ్వడం జరిగింది.

## అష్టాంగికమార్గం

1. *సమ్మాదిట్ఠి = right views*
2. *సమ్మాసంకప్పో = right thoughts / intentions*
3. *సమ్మావాచా = right speech*
4. *సమ్మాకమ్మంతో = right action*
5. *సమ్మాఆజీవో = right livelihood*
6. *సమ్మావాయామో = right effort*
7. *సమ్మాసతి = right mindfulness*
8. *సమ్మాసమాధి = right concentration*

గమనించి చూస్తే ఈ అష్టాంగికమార్గం నివృత్తిరూపంగా (stopping / ceasing) ఉన్నట్లు తెలుసుకోవచ్చు.

1. పంచవిధ దృష్టులకు (false views) చిత్తంలో చోటు లేకుండా చేస్తే అదియే **సమ్యక్‌దృష్టి.** సత్కాయదృష్టి, అంతగ్రాహదృష్టి, మిథ్యాదృష్టి, దృష్టిపరామర్శ, శీలవ్రతపరామర్శ అని దృష్టి ఐదు విధాలు. 1. పంచస్కంధాలను (body-mind) ఆత్మగా ఆత్మీయంగా భావించడం **సత్కాయదృష్టి.** ఇది మనిషిని అధ్యాత్మమార్గంలో కాలు మోపనివ్వదు. 2. ఈ ఆత్మవిషయంగానే "చచ్చాక ఏమీ లేదు, బూడిదతప్ప" అని భావించడం **ఉచ్ఛేదదృష్టి,** "గూడు మారింది చిలుక" అని భావించడం **శాశ్వతదృష్టి.** ఈ రెండున్నూ **అంతగ్రాహదృష్టి** అవుతుంది. అంతము (extreme) అంటే భయంకరమైన అగాధం. 3. కర్మ, కర్మఫలం, పూర్వజన్మలు, పునర్జన్మలు, ఆర్యసత్యాలు, నిర్వాణం– ఇదంతా వట్టిదే. ఏమీ లేదు అని భావించడం **మిథ్యాదృష్టి** (perverse view). 4. హీనమైనదాన్ని శ్రేష్ఠంగా, అగ్రంగా భావించడం **దృష్టిపరామర్శ** అవుతుంది. 5. హేతువు కాని దాన్ని హేతువుగా భావించడం **శీలవ్రతపరామర్శ.** జల, అగ్ని

ప్రవేశాల వల్ల స్వర్గం కలుగదు, మోక్షం కలుగదు. కలుగుతుందని నమ్మడం– ఇంకా ఇలాంటి అనేక గుడ్డినమ్మకాలన్నీ శీలవ్రతపరామర్శ క్రింద చేరుతాయి. బుద్ధవచనాన్ని పఠిస్తే, పఠించి చింతనచేస్తే **సమ్యక్‌దృష్టి** కలుగుతుంది.

2. కామసంబంధమైన ఆలోచనలు, ద్వేషపూరితమైన చింతనలు ఇలాంటి అనర్థకరమైన సంకల్పాలనుండి చిత్తం నివృత్తి చెందితే అదియే **సమ్మాసంకప్పో** అవుతుంది.

3. వాక్‌దోషాలకు విరామచిహ్నం (full stop) పెట్టగలిగితే అదియే **సమ్మావాచా** అవుతుంది. చూడనిది చూసినట్లుగా విననట్టిదాన్ని వినినట్లుగా తెలియనిదాన్ని తెలిసినట్లుగా మాట్లాడడం మృషావాదం– ముఖ్యంగా తప్పుడు సాక్ష్యాలు. ఇదొక వాక్‌దోషం. మనస్సును గాయపరచే విధంగా తిట్టడం, లేదా వ్యంగ్యంగా మాట్లాడడం ఇదొక వాక్‌దోషం. ఇతరుల మధ్య నెలకొన్న మైత్రిని వాత్సల్యాన్ని స్నేహాన్ని సుహృద్భావాన్ని నమ్మకాన్ని నాశనం చేసే కలహం మాటలు. ఇదొక దౌర్భాగ్యమైన వాక్‌దోషం. జ్ఞాతివితర్కాలు, జనపదవితర్కాలు, మొదలగు 32 రకాల వ్యర్థభాషణలు ఇదొక వాక్‌దోషం. దీనికి పేరు సంభిన్న ప్రలాపం (senseless talk, useless talk). తన మేలుకు, ఇతరుల మేలుకు ఏ విధంగానూ ఉపకరించని నిరర్థకభాషణం అని అర్థం. ఈ నాలుగు రకాల వాక్ దోషాలనుండి విరమిస్తే అదియే **సమ్మావాచా** అవుతుంది.

4. కాయికదోషాలయిన ప్రాణాతిపాతం (killing), కామమిథ్యాచారం, అదత్తాదానం (చౌర్యం)– వీటి జోలికి పోకుండా ఉంటే అదియే **సమ్మాకమ్మంతో.**

5. మిథ్యా ఆజీవికలనుండి (wrong methods of earning livelihood) వైదొలగడమే **సమ్మాఆజీవో** అవుతుంది. ఇది ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకొని తెలుసుకొనవలసిన అంశం. అశోకచక్రవర్తి కాలంలో ఒక వేశ్య సత్యక్రియను ఆచరించి గంగానదిని వెనక్కి ప్రవహించేలా చేసిందని ఒక కథ. సత్యవాక్కులు పలుకడం ద్వారా ఆమె ఈ అద్భుతాన్ని చేయగలిగింది. ఆమె పలికిన సత్యవాక్కులు: "పైకం ఇచ్చి నా దరికి చేరినవాడు వృద్ధుడా? యువకుడా? సుందరుడా? కురూపుడా? పైకులంవాడా? క్రింది కులంవాడా? ఇవేమీ నేను పట్టించుకోను. అందరి ఎడల సమదృష్టితో నా వృత్తిధర్మాన్ని నిర్వహిస్తాను."

6. **సమ్మావాయామో** అనేది మిథ్యావ్యాయామాన్ని నిలువరించేదిగా ఉంటుంది. ప్రవృత్తి (activity) అనేది వృథా ఆయాసంగా నష్టదాయకంగా మహావైఫల్యంగా

పరిణమిస్తే ఆ తప్పు వ్యాయామానిది (exertion) కాదు. ప్రవృత్తిని ఆ దిశగా నెట్టిన తప్పుజ్ఞానానిదే ఆ తప్పు. జ్ఞానం వల్ల ఇచ్ఛ, ఇచ్ఛ వల్ల యత్నం, యత్నం వల్ల కర్మ ఉద్భవిస్తాయి. ఏది హేయం (వదిలించుకో వలసింది), ఏది ఉపాదేయం (సాధించుకోవసింది) సమ్యక్జ్ఞానం ద్వారా నిర్ణయం జరిగితే తదనుగుణంగా జరిగే వ్యాయామం **సమ్మావాయామం** అవుతుంది. తప్పు జ్ఞానంతోనే జీవితం నడిచిందనే విషయం చాలామందికి ఎప్పుడో ఒకప్పుడు స్వానుభవానికి తప్పక వస్తుంది.

7. రాగద్వేషమోహములు చేతనను శాసింపజేయకుండా నిలువరిస్తూ ఉండగలిగితే అదియే సమ్మాసతి*.

8. చిత్తంలో విషయభారాన్ని (content) దశలవారిగా ధ్యానాలు తగ్గిస్తాయి. దీనివల్ల చిత్తం క్రమక్రమంగా సూక్ష్మం, శుద్ధం, ప్రభాస్వరం అవుతుంది. కామచ్ఛంద, వ్యాపాద, స్త్యానమిద్ధ, ఔద్ధత్య కౌకృత్య, విచికిత్స అనబడే నీవరణముల బరువు తొలగితే అదియే ఒకటవ ధ్యానం. వితర్క విచారాల బరువు తగ్గితే అదియే రెండవ ధ్యానం. ఇలా పురోగమిస్తూ నాలుగవ ధ్యానంలోకి చిత్తాన్ని తీసుకెళ్ళగలిగితే అదియే **సమ్మాసమాధి**. చిత్తంలో ఏ ఆటుపోటులు లేని నిశ్చలస్థితి.

ఈ 8 ధర్మాల్లో తక్కిన 29 బోధిపక్ష్యధర్మాలు ఇమిడిపోతాయి. నాలుగు సతిపట్ఠానములు సమ్మాసతిలో, నాలుగు ప్రధానములు సమ్మావాయామంలో, నాలుగు ఇద్ధిపాదములు సమ్మాసమాధిలో, ఇంద్రియములు బలముల్లో పేర్కొనబడిన శ్రద్ధ, ప్రజ్ఞలు సమ్మాదిట్ఠిలో, వీరియం సమ్మావాయామంలో, స్మృతి సమ్మాసతిలో, సమాధి సమ్మాసమాధిలో ఇముడుతాయి. బోధ్యంగములలో పేర్కొనబడిన ప్రీతి, ప్రస్రబ్ధి, ఉపేక్ష సమ్మాసమాధిలో ఇముడుతాయి. తక్కిన నాలుగు ఎక్కడెక్కడ ఇముడుతాయో పేర్లను బట్టి తేలికగా చెప్పవచ్చు. బోధిపక్ష్యధర్మాలను ఇంకా కుదించి చెప్పాలంటే ఆ మాటకు వస్తే త్రిపిటకము లను కుదించి చెప్పాలంటే శీలం, సమాధి, ప్రజ్ఞ అని చెప్పవచ్చు.

## శ్రామణ్యఫలములు

రోగపీడితుడు ఆ రోగంనుండి విముక్తి పొందినపుడు హాయిని అనుభవిస్తాడుకదా! అలాగే అధ్యాత్మసాధకుడు కూడా చిత్తరోగాలనుండి విముక్తి పొందినపుడు హాయిని అనుభవిస్తాడు. ఈ హాయికే శ్రామణ్యఫలములని పేరు. ఇందులో స్థాయీభేదాలున్నాయి. స్రోతాపత్తిఫలం, సకృదాగామిఫలం, అనాగమి ఫలం, అర్హత్వఫలం.

---

* *చూడుడు 216 వ పుట పాదపీఠిక.*

ఆత్మ అణువా? శరీరపరిమాణమా? ఆకాశంలాగా అనంతమా? దీనికి పరమాత్మకు ఏమిటి సంబంధం? పరమాత్మ కంటే భిన్నమా? పరమాత్మలో ఒక అంశమా? పరమాత్మయేనా? ఇలాంటి మీమాంసలు చర్చలు వాదోపవాదాలు సత్కాయదృష్టిని* ఆశ్రయించుకొని చెలరేగుతుంటాయి. ఈ బరువును దించేసిన హాయిని స్రోతాపన్నుడు అనుభవిస్తాడు. మతం పేరిట, అధ్యాత్మిక పేరిట చెలామణి అవుతున్న నానా రకాల వ్యర్థ క్రియాకలాపాల బరువు దించివేసిన హాయిని కూడా స్రోతాపన్నుడు అనుభవిస్తాడు. ఆర్యసత్యాలు, త్రిరత్నములు, కర్మ, కర్మఫలం – ఈ విషయాల్లో డోలాయమానం (విచికిత్స) అనే బరువును కూడా స్రోతపన్నుడు దించివేసి హాయిని అనుభవిస్తాడు. దీనికి అవేత్యప్రసాదం అని పేరు. ఇంతే కాదు, రాగం ద్వేషం మానం (conceit) మొదలగు క్లేశాలు కూడా అధోగతికి నెట్టగల తీవ్రతను స్రోతాపన్నుడిలో కోల్పోతాయి. ఆ మేరకు కొంత హాయిగానూ ఉంటుంది. ఈ తొలిఫలం అందుకోవడం ఏమంత కష్టం కాదు. ఇది అందుకొన్నాక నిశ్చింతగా ఉండవచ్చు. తక్కిన ఫలాలు ఎప్పుడో ఒకప్పుడు అందుబాటులోకి రావడం తథ్యం.

## ఉపశమం (peace)

మిలిందప్రశ్నల్లో నిర్వాణం విషయంగా ఇరువురి మధ్య చాలా చర్చ జరిగియున్నది. ఆ చర్చకు అనుబంధంగా విసుద్ధిమగ్గలోని ఉపశమానుస్సతినుండి కొంత భాగం.

ఉపశమానుస్సతిని భావన చేయదలచిన సాధకుడు ఏకాంతస్థలంలో ఆశీనుడై చిత్తాన్ని అన్యవిషయాలనుండి మరలించి భగవానుడు పలికిన నిర్వాణ సంబంధిత వాక్యాలను స్మరణకు తెచ్చుకొని చింతన చేయవలెను. “భిక్షువులారా, అన్ని ధమ్మములలో (జ్ఞేయములు) నిర్వాణమే శ్రేష్ఠము. తృష్ణాక్షయం, విరాగం, నిరోధం, నిర్వాణం అనబడే దివ్యానుభవం పొందితే రకరకాల మానములు (vanities / self-images), మదములు (arrogances) నశిస్తాయి, అంతరిస్తాయి, జాడ తెలియకుండా పోతాయి. నానా రకాల కామతృష్ణలు చల్లారిపోతాయి. ఆలయం (relying, depending, leaning, clinging) అనబడే చిత్తదౌర్బల్యం వదలిపోతుంది. భవచక్రంలో (wheel of existence) తిరుగుళ్ళు ఆగిపోతుంది”.

---

* సద్ అంటే నశించేది అని అర్థం. కాయం అంటే సమూహం. రెండూ కలిస్తే సత్కాయం= నశించే సమూహం=ఈ దేహం. ఈ దేహాన్ని ఆశ్రయించుకొనియే నానా రకాల ఆత్మవాదాలు ప్రచారంలోకి వచ్చాయి.

భగవానుడు సంయుక్తనికాయంలోనూ ఇలా పలికియున్నాడు: "భిక్షువులారా, అసంఖతమును (unformed) మీకు బోధిస్తాను. అది సత్యం, పారం, సుదుర్దర్శం, అజరం, ధృవం, నిష్ప్రపంచం, అమృతం, శివం, క్షేమం, అద్భుతం, అనీతికం, అబ్యాపజ్ఝం, విశుద్ధి, దీపం, త్రాణం, లేణం అని తెలుసుకొనండి".

**అసంఖతం** = బహిర్ముఖుడుగా చూస్తే గోచరించేవి భౌతికములు (material things). అంతర్ముఖుడుగా చూస్తే తెలిసేవి చైతసికములు (mental states). ఇవన్నీ సంఖతములే అంటే హేతుప్రత్యయములచే (causes and conditions) ఉనికిని పొందినట్టివి. నిర్వాణం అట్టిది కాదు కనుక అసంఖతం.

**సత్యం** = ఏకమేవ సత్యం. న ద్వితీయమస్తి. సత్యం అని చెప్పదగింది ఒక్క నిర్వాణమే. తక్కినదంతా మృషా (false).

**పారం** = ఆవలితీరం.

**సుదుర్దర్శం** = పరిశుద్ధమైన చిత్తానికి మాత్రమే గోచరించేది.

**అజరం** = జరాజీర్ణత లేనిది అంటే కాలానికి లోబడనిది.

**ధృవం** = స్థిరమైనది. హిమాలయాలు, మేరువులు స్థిరములు కావు. ఎప్పుడో ఒకప్పుడు బూడిద కూడా మిగలకుండా పోయేటివే. ధృవనక్షత్రం అని బిరుదు పొందిన ఒక సుదూరనక్షత్రం కూడా ఎప్పుడో ఒకప్పుడు ఛిన్నాభిన్నం కాబోయేదియే. నిర్వాణం ఒక్కటే స్థిరమైనది అంటే కాలం తాకిడి లేనిది.

**నిష్ప్రపంచం** = అభిధానం-అభిధేయం, లక్షణం- లక్ష్యం, జ్ఞానం - జ్ఞేయం ఇలాంటి ద్వైతవ్యవహారాలకన్నిటికి చోటు లేనిది.

**అమృతం** = పుట్టడం కాలంలోనే. గిట్టడం కాలంలోనే. నిర్వాణం అమృతం అంటే కాలాతీతమైనట్టిది.

**శివం** = ఏ ఉపద్రవమూ లేనిది.

**క్షేమం** = ఏ బంధనాలూ లేనిది.

**అద్భుతం** = భవాగ్రంనుండి అవీచిదాక అంతా ఈవరకే చూసినది, అనుభవించినదే. ఇంతవరకు చూడని అనుభవించని అద్భుతాలేవీ ఈ భవంలో (phenomenal existence) లేనే లేవు. అద్భుతం అంటే నిర్వాణం ఒక్కటే.

**అనీతికం** = అనర్థములకు తావు లేనిది.

**అబ్యాపజ్ఝం** = దుఃఖరహితం.

**విశుద్ధి** = క్లేశకాలుష్యాలు లేనిది.

**దీపం** = (island). నాలుగు ఓఘములు (floods = కామ, భవ, దృష్టి, అవిద్య) చుట్టుముట్టినా మునిగిపోనిది.

**త్రాణం** = రక్షణ ఇచ్చేది.

**లేణం** = భయాన్ని పోగొట్టే భద్రమైన ఆశ్రయం. (లోకభాషలో లేణం అంటే తలుపు ద్వారబంధం ఉన్నట్టి గుహ అని అర్థం).

## యమకప్రాతిహార్యం

ప్రాతిహార్యములు (miracles) మూడు రకాలు 1. ఇద్ధిప్రాతిహార్యం, 2. ఆదేశనాప్రాతిహార్యం, 3. అనుశాసనప్రాతిహార్యం. ప్రజల మనస్సులను మిక్కిలి ఆకట్టుకొనేవాటికి ప్రాతిహార్యములని పేరు. భగవానుడు ఈ మూడు రకాల ప్రాతిహార్యములను కలిగియుండినాడు. రెండవ మూడవ ప్రాతిహార్యములే కొనియాడదగిన గొప్పఅద్భుతాలు. ఎదుటివాని చిత్తం ఏ తీరుగా ఉందో కనిపెట్టి ఆ చిత్తచరితానికి (temperament) సరిపోయే విధంగా బోధనలు చేసి దారిలో పెట్టడం అనేది ఆదేశనాప్రాతిహార్యం. దారిలో పడినవారికి సంసారసాగరంనుండి నిర్వాణతీరం చేరే ఉపాయాన్ని (మార్గం) తెలియజేయడం అనేది అనుశాసన ప్రాతిహార్యం. మొదటి ప్రాతిహార్యాన్ని కూడా ఆయా సందర్భాల్లో భగవానుడు ప్రదర్శించియున్నాడు. ప్రజల్లో ఎక్కువ ప్రచారం పొందేది ఈ మొదటిదే. భగవానుడంటే గిట్టని తీర్థికులు భగవానుణ్ణి కించపరచే ఉద్దేశంతో "ఇంద్రజాల మహేంద్రజాల విద్యలు చాలా నేర్చిన ఆ మాయావి (magician) తన మాయాబలంతో జనాలను వలలో వేసుకొంటున్నాడు" అని విమర్శించేవారు*.

ఇద్ధిప్రాతిహార్యముల్లో యమకప్రాతిహార్యానిదే అగ్రస్థానం. ఏ ఇతర ఇద్ధిమంతుడూ చూపలేని ఈ మహాద్భుతాన్ని భగవానుడు ఒకానొక సందర్భంలో శ్రావస్తీనగరంలో ప్రదర్శించినాడు. అగ్నిజ్వాలలను ఉదకధారలను జంటగా ఏకకాలంలో శరీరంలో తోపింపజేసినాడు. అగ్నిని తోపింపజేయాలంటే తేజో కసిణధ్యానంలో వశిత్వం (mastery) కలిగియుండాలి. ఉదకధారలను తోపింప జేయాలంటే ఆపోకసిణధ్యానంలో

* *"కల్పశతస్యాత్యయాదేవంవిధో మాయావీ లోకే ప్రాదుర్భూయ మాయయా లోకం భక్షయతి."*
*– ఒక తీర్థికవాక్యం.*

వశిత్వం కలిగియుండాలి. రెండింటినీ ఏకకాలంలో తోపింపజేయాలంటే ఒక కసిణధ్యానంనుండి మరో కసిణధ్యానానికి చిత్తాన్ని మహావేగంగా మళ్ళించవలసియుంటుంది. ఎంత వేగంగా మళ్ళించినా ఆరంభంలో రెండింటి మధ్య కొంచం వ్యవధి ఉండనే ఉంటుంది. (రెండు చిత్తక్షణాలు). ఈ స్వల్పాతిస్వల్ప వ్యవధిని ప్రేక్షకజనులు గుర్తించడం అసాధ్యం కనుక వారి దృష్టికి రెండూ ఏకకాలంలో తోచినట్లనిపించాయి. తొలుత నాభికి పైభాగమైన శరీరంనుండి అగ్నిజ్వాలలు, నాభికి క్రిందిభాగమైన శరీరంనుండి ఉదకధారలు; ఆపైన శరీరం వెనుకవైపున అగ్నిజ్వాలలు, ముందువైపున ఉదకధారలు; కుడికన్నునుండి అగ్నిజ్వాలలు, ఎడమకన్నునుండి ఉదకధారలు, ఆపైన ఒక కర్ణరంధ్రంనుండి అగ్నిజ్వాలలు మరో కర్ణరంధ్రంనుండి ఉదకధారలు; ఆపైన నాసాపుటం రంధ్రాలనుండి, కుడి ఎడమ భుజాలనుండి, చేతివ్రేళ్ళ కణుపులనుండి.... ఇలా ప్రదర్శిస్తూ చివరికి శరీరంలోని వేలాది రోమకూపాల నుండి అగ్ని ఉదకములను ప్రక్క ప్రక్కనే ఏకకాలంలో తోపింప జేసినాడు. దీనికి యమకప్రాతిహార్యం (twin miracle = జంట అద్భుతం) అని పేరు.

## మిథ్యాజీవికలు

బూటకపు భిక్షువులు జీవికకోసం నానా ఉపాయాలకు పాల్పడుతారు. దొంగతనాలు, దోపిడీలు, బలవంతపు వసూళ్ళు- ఇలాంటివి చేయరు కానీ అనైతికతలో వీటికి ఏమాత్రం తీసిపోని ఉపాయాలను నిస్సంకోచంగా ఆచరిస్తూ మాయ, శాఠ్యం* అనబడే చిత్తదోషాలకు పాల్పడతారు. జనుల హృదయాల్లో మంచిముద్ర (good impression) వేయించుకొనేందుకు నటనలు చాలా చేస్తారు. జనులు ఇటు అటు నడయాడే దారిలో కపటభిక్షువు అర్ధనిమీలిత నేత్రాలతో ఒక కాడి దూరం మాత్రమే చూస్తూ నడుస్తున్నట్లుగా నటన చేస్తాడు. దారిని అడుగులతో కొలుస్తున్న విధంగా సమమైన నిదానమైన అంగలు వేస్తూ నడుస్తాడు. కొంతదూరం అలా నడిచాక తటాలున ఆగి శిలలా కదలక నిలుచుంటాడు. అలా కొన్ని క్షణాలు ఆగి గిరుక్కున వెనుదిరిగి నడుస్తూ ఒకచోట కాసేపు ఆగి మళ్ళీ అక్కడ్నుంచి ముందుకు అడుగులు వేస్తాడు. దారినబోయే దానయ్య ఎవరైనా "భంతే, ఎందుకు వెనక్కి వెళ్ళివచ్చారు? అక్కడ ఏమైనా

---

* *తనలోలేని సద్గుణాలు ఉన్నట్లుగా నటిస్తూ ఇతరులను బుట్టలో వేసుకోవడం మాయ అవుతుంది. తనలో ఉన్న దుర్గుణాలను నేర్పుగా కప్పిపుచ్చి ఇతరులను వంచించడం శాఠ్యం అవుతుంది.*

జారవిడిచారా? అన్ని ప్రశ్నిస్తే "ఉపాసకా, భిక్షువు అయినవాడికి జారవిడిచేందుకు చేతిలో వస్తువులు ఏముంటాయి? వేము అకించనులము (ఏమీ లేనివారము). జారవిడుచుకొనేందుకు మా వద్ద గడ్డిపోచ* కూడ ఉండదు. అనిత్యచింతన చేస్తూ నేను నడుస్తాను. భూమినుండి పైకి ఎత్తిన పాదం, ఆపైన ముందుకు సాచిన పాదం, ఆపైన క్రిందకు మోపిన పాదం ఒకటి కాదు. వేరు వేరు. వేడెక్కిన బాణలిలో నువ్వులను వేసి వేయించితే అవి తటతట పటపట టపటప శబ్దం చేస్తూ చిట్లిపోతాయికదా! అలానే పాదం ఎత్తుతుండగానే అందులోని లక్షలాది జీవకణాలు తటతటా పటపటా టపటపా భగ్నం అవుతుంటాయి. వాటి స్థానాన్ని ఆక్రమిస్తూ కొత్తవి ఉద్భవిస్తుంటాయి. ఇలా అడుగడుగునా అనిత్యచింతన చేస్తూ ఆ వేపచెట్టు వరకు వచ్చాను. ఆపైన ఈ ఈతచెట్టు వరకు రాగానే నాలోని సంప్రజన్యం (చిత్తకదలికల తీరుతెన్నులను సదా గమనిస్తూ ఉండే చైతసిక విశేషం) ఇలా హెచ్చరించింది: "ఓయీ విపశ్యకా, అనిత్యచింతనను వదలివేసి నీ చిత్తం పలుదోము వేపపుల్లల మీదికి వెళ్ళిపోయింది. దాన్ని మళ్ళీ అనిత్యం మీదికి మళ్ళించు". ఆ హెచ్చరికను తలదాల్చి అనిత్యచింతన ఏ చోట చెదరిందో ఆ చోటికి వెనక్కి వెళ్ళి అక్కడ్నుంచి మళ్ళీ చింతన కొనసాగిస్తూ ముందుకు అడుగులు వేస్తూ వస్తుండగా నీవు ఎదురుపడి మంచిప్రశ్ననే అడిగావు. ఉపాసకులు నీలాగా జిజ్ఞాసాపరులుగా ఉంటే సద్ధర్మం అనతికాలంలోనే దశదిశలూ వ్యాప్తి చెందుతుంది" అని పలికి ఆ ఉపాసకుణ్ణి **"సుఖీభవ, దుఃఖ నిర్ముక్తో భవ"** అని దీవించి ముందుకు సాగిపోతాడు. ఆ దానయ్య బోర్లా పడకుండా ఎలా ఉండగలడు? అంతే కాదు, "అబ్బా ఆయన ఎంత ధ్యాని! ఎంత జ్ఞాని! చెప్పడం నాతరం కాదు" అని ఊరిలో కనబడినవాళ్ళందరికీ చెబుతాడు. ఆ కపటికి మహర్దశ మొదలవుతుంది! జీవికకోసం కుహనాన్ని (కాయికనటన), లపనాన్ని (వాచికనటన) రెండింటిని నేర్పుగా మేళవించి ప్రయోగించిన ఉపాయం ఇది. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయి. ఇవన్నీ నిందనీయములైన మిథ్యాజీవికలే.

మిథ్యాజీవికలకు పాల్పడేవాళ్ళందరూ జానెడు పొట్టకోసమే అనుకొంటే చాలా పొరబాటు. లాభ సత్కార శ్లోకముల కోసం తహతహలాడేవాళ్ళే ఎక్కువగా నటనలకు దిగేది. లాభం అంటే ద్రవ్యసంపత్తు. అది ధనం కావచ్చు, భూములు కావచ్చు, భవనాలు కావచ్చు, వాహనాలు కావచ్చు, ఇంకా ఇతర నానా విధములైన భోగ్యవస్తువులు కావచ్చు. సత్కారం అంటే ప్రత్యుత్థానం (తనను చూడగానే ఎదుటివాడు

---

* *గడ్డిపోచ అనగానే ఆషాడభూతి జ్ఞాపకానికి వస్తాడు.*

గౌరవం చూపిస్తూ లేచి నిలబడడం), వందనం, సాదరఆహ్వానం, పాదపూజ- ఇలా నానా రకాలైన గౌరవ మర్యాదలు. శ్లోకం అంటే పొగడ్తలతో ప్రశంసలతో ముంచివేయడం, ఈ లాభ సత్కార శ్లోకముల కారణంగా కళ్ళు నెత్తికెక్కి లేదా కళ్ళు మూసుకుపోయి గోతుల్లో పడి భ్రష్టులైన కాపురుషులెందరో!

**ఫలం వే కదలిం హంతి, ఫలం వేళుం ఫలం నళం**
**సక్కారో కాపురిసం హంతి గబ్భో అస్సతరిం యథా**

పాలి బౌద్ధ సాహిత్యంలో మిలిందపఞ్హది ప్రత్యేకస్థానం. జనరంజకత, ప్రామాణికత రెండూ కలిగిన గ్రంథంగా ఇది కీర్తింపబడింది. ఆచార్య బుద్ధఘోషుడు (క్రీ.శ. 5వ శతాబ్ది) తానురచించిన త్రిపిటక వ్యాఖ్యానాల్లోనూ, విసుద్ధిమగ్గ లోనూ తరుచుగా మిలిందపఞ్హ వాక్యాలను ప్రమాణంగా చూపించారు. బర్మాబౌద్ధులకు ఈ గ్రంథం అంటే అమిత గౌరవం.

ఇద్దరి మధ్య జరిగిన సంభాషణే ఈ గ్రంథం. మిలిందుడు అనే రాజు, నాగసేనుడనే భిక్షువు మధ్య జరిగిన సంవాదరూపం. ఇద్దరూ చారిత్రక పురుషులనడంలో సంశయం ఎవరికీ లేదు. మౌర్యసామ్రాజ్య పతనం ప్రారంభం కాగానే (చక్రవర్తి అశోక మరణం క్రీ.పూ. 227 తరువాత) భారత ఉపఖండం వాయువ్య భాగాలు గ్రీకురాజుల ఏలుబడిలోకి చేరి పోయాయి. ఆ రాజుల్లో ఒకడు మినందర్. ఈ మినందర్ రాజ్యం ఇప్పటి పంజాబు, ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతాలుగా చారిత్రికులు నిర్ణయించారు. మినందరే ఈ గ్రంథంలో మిలిందుడు.

ధర్మ దీపం

ధర్మదీపం బౌద్ధ సంప్రదాయ సంస్కృతుల పునరుద్ధరణ, పరిరక్షణ, విస్తరణకు అంకితమైన ధర్మసంస్థ.